

World Classics Series - 8

# Faust

by

Johann Wolfgang Goethe

(The Classic Tale of a Man, Who sold his soul to Devil)

# ఆత్మను అమ్మిన మానవుడు



డాక్టర్ లంకా శివరామప్రసాద్

ప్రపంచ సాహిత్యం-8

గేథే రచన

# ఆత్మను అమ్మిన మానవుడు - ఫాస్ట్

# FAUST

**by**

**Johann Wolfgang Goethe**

డాక్టర్ లంకా శివరామప్రసాద్

# Atmanu Ammina Manavudu - Faust

**Johann Wolfgang Goethe**

Translated by

**Dr. Lanka Siva Rama Prasad**

---

February 2014

All rights reserved

Copyright @ 2014
by **Dr. Lanka Siva Rama Prasad**
Head of the Department
Cardiothoracic & Vascular Surgery
**Prathima Institute of Medical Sciences**
Nagunur Road, Karimnagar - 505 417, Telangana.

Published by:
**Dr. Lanka Siva Rama Prasad**
**Srijana Lokam / Writer's Corner**
Prasanthi Hospital
Sivanagar, WARANGAL-506 002.
Telangana, INDIA
Mobile : 8897849442
Email: lankasrprasad@gmail.com

Price : ₹ **350** **$ 6**

Cover Design & Post Script
**Prakash Pula**

Printed at :
**Vasavi Printers**
J.P.N. Road, Warangal.
Ph : 0870-2426364

*This book is presented to...*





# ప్రస్తావన

జర్మన్ సాహిత్యంలో ఆణిముత్యంగా ప్రసిద్ధికెక్కిన గొప్ప నాటకం ఫాస్ట్. కవిత్వపరంగా, నాటకరూపంగా అనితరసాధ్యంగా, భావించబడి, Storm and Stress Period గా ప్రసిద్ధికెక్కిన పద్ధెనిమిదవ శతాబ్దంలో యూరోపియన్ సాహిత్యంలో సంచలనం సృష్టించిన Faust (The Classic Tale of a Man, Who sold his soul to Devil) - The first Part of Tragedy) జోహాన్ వొల్ఫ్‌గాంగ్ గేథే – రచన.

డెవిల్‌కు ఆత్మను అమ్ముకుని అంతిమ ఆత్మానంద అన్వేషణ, మంత్రశక్తుల వశీకరణకై ప్రయత్నించి తనను ప్రేమించిన, తాను ప్రేమించిన వ్యక్తుల నాశనానికి, అంతిమంగా స్వనాశనానికి గురైన ఒక విద్యావంతుడైన మేధావి విషాదాంత గాథ ఇది.

దైవానికి, సాతానుకు మధ్య జరిగిన పందెంలో మానవుని అగచాట్లు, దైవశక్తులకు దుష్టశక్తులకు మధ్య ఘర్షణను ఈ నాటకంలో చూస్తాము.

తెలుగు సాహిత్యలోకానికి హోమర్ రచనలు **'ఇలియాడ్', 'ఒడెస్సీ', 'ఎపిక్‌సైకిల్'; వర్జిల్– 'ఈనీడ్'; జాన్‌మిల్టన్– 'పారడైజ్‌లాస్ట్', 'పారడైజ్ రిగైన్డ్'; జాన్‌బున్యన్– 'పిల్‌గ్రిమ్స్ ప్రొగ్రెస్'; డాంటే– 'డివైన్ కామెడీ'**లను అందించిన సృజనలోకం జర్మనీ భాషలోని ప్రముఖ నాటకం – గేథే రచన 'ఫాస్ట్' రెండు భాగాల్ని సవినయంగా సమర్పిస్తున్నది.

ప్రపంచ సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు సమర్పించే క్రమంలో వెలువడిన ఈ ఎనిమిదవ గ్రంథం అందరి ఆదరాభిమానాల్ని పొందుతుందని సృజనలోకం మనసారా ఆశిస్తున్నది.

**– డాక్టర్ లంకా శివరామప్రసాద్**

# గేథే - Goethe
# (1749-1832)

**జోహాన్ వొల్ఫ్‌గాంగ్ గేథే (Johanne Wolfgang Goethe)** 1749లో ఒక సంపన్న కుటుంబంలో జన్మించాడు. న్యాయశాస్త్రం అభ్యసించి కొన్నాళ్లు లాయర్‌గా ప్రాక్టీస్ చేసినా సాహిత్యంపైన ఎక్కువ మక్కువ చూపినవాడు గేథే. 1770 ప్రాంతాల్లో జర్మనీ సాహిత్య పునరుజ్జీవనం (Germany literary revival)లో గేథే ప్రధాన పాత్ర పోషించాడు. The Sorrows of Werther విషాదాంత నవల అతడికి గొప్ప పేరును తెచ్చింది.

1775లో వీమర్ (Weimer) ప్రాంతానికి మంత్రిగా, 'డైరెక్టర్ ఆఫ్ ద కోర్ట్ థియేటర్'గా నియమించబడినాడు. 1782లో 'ప్రభువు' బిరుదంతో Von Goethe గా గౌరవించబడ్డాడు. 1786-88లో ఇటలీ ప్రయాణం అతడి రచనల్లో పరిపక్వతకు తోడ్పడింది. 1790 ప్రాంతాల్లో స్కిల్లర్‌తో కలిసి 'వీమర్ క్లాసిజమ్' ద్వారా జర్మనీ సాహిత్య నాగరికతలో కేంద్ర పాత్ర వహించాడు.

సాహిత్యమే కాక అనేక శాస్త్రాల్లో అమితమైన కృషి చేసిన గేథే 1806లో క్రిస్టియాన్ వల్పియస్‌ను వివాహం చేసుకున్నాడు. వారిద్దరి సంతానం ఆగస్టస్. 1832లో గేథే అస్తమించాడు.

## (ఫాస్ట్ - Faust - Favoured or Fortunate - అదృష్ట జాతకుడు)

**ఫాస్ట్-కథా వృత్తాంతం :** క్రీస్తుశకం 1480-1540 ప్రాంతంలో నివసించిన జోహాన్ ఫాస్ట్ అనే సంచార మేధావికి జ్ఞానం, మంత్రశక్తుల అన్వేషణలో డెవిల్ కుక్క రూపంలో కనబడి అతడిని అనుసరిస్తాడు. ఇద్దరికి మధ్య ఒప్పందం జరిగి ఇరవై నాలుగేళ్లపాటు ఫాస్ట్ అడిగింది డెవిల్ ఇచ్చేట్లు, ఒప్పందకాలం పూర్తయ్యాక ఫాస్ట్‌ను తనతో తీసుకెళ్లేట్లూ ఖరారవుతుంది. డెవిల్ సాయంతో ఫాస్ట్ తన విద్యార్థుల ముందు మహాకవి హోమర్ రచనలలోని పాత్రలు ప్రత్యక్షమయ్యేలా చేసేవాడు. పోప్ పైనా, చక్రవర్తి, ఇతర ప్రభువులపై తమాషా పనులు చేసి ఆనందించేవాడు. గడువుకాలం ముగియగానే దయ్యాలు ఫాస్ట్‌ను ముక్కలు ముక్కలుగా చేసి నరకానికి తీసుకుపోయాయని ప్రజలు చెప్పుకునేవారు.

ఈ కథ చిన్న చిన్న పుస్తకాలుగా బహుళ ప్రచారంలోకి వచ్చి 1587లోనే Faust chapbook గా విడుదలయ్యింది. 1592లో క్రిస్టోఫర్ మార్లో Tragical History of Doctor Faustus రచించాడు. ఆ ఇంగ్లీషు రచన "Was that the

face that launched thousand ships?" అని హెలెన్ గురించి చేసిన వర్ణన మార్లో రచనను చిరస్థాయిగా ఉంచడమే కాక దాని ప్రభావం నాటకరంగం, కీలుబొమ్మల ప్రదర్శనల (Puppetry) పైనా పడింది. అయితే 1818 వరకు మార్లో రచనని గేథే చూడలేదు.

1770 నాటికి యూరప్‌లో Storm and Stress (తుపాను ఒత్తిడి), Change and Ferments (మార్పు, జ్వలనం), మానవతావాదం (Humanisation), తిరుగుబాటు ధోరణులు ఉధృతంగా ఉన్న ఈ సమయంలోనే ఫాస్ట్ 'Knight with Iron hand – ఇనుప పిడికిలి ప్రభువు' అనే నాటకం వ్రాసాడు. రాజవంశీకుడైన యువకుడు క్రూరులైన అప్పటి ప్రభువులను ఎదిరించి పేదలను కాపాడడం దీనిలోని ఇతివృత్తం. తనలాంటి యువకులు ఆదర్శవీరులుగా, ఫ్రెంచి రాజవంశస్థులను ఎదిరించి పేద ప్రజల పక్షాన నిలబడడాన్ని అతడు హర్షించాడు.

పద్దెనిమిదవ శతాబ్దపు చివరికాలంలో మంత్రగత్తెల్ని, హేతువాదుల్ని, దేవుడున్నాడా లేదా అని సంశయించేవారిని మంటల్లో తగలబెట్టడం ఫాషన్‌గా, నిత్యకృత్యంగా మారింది. ఈ సమయంలోనే Storm and Stress and Enlightenment -కల్లోలం, ఒత్తిడి, వికాసం వీటి ప్రాధాన్యత హెచ్చి గేథే కేంద్ర బిందువుగా Goethezeit – గేథే మార్గం బలపడింది. తప్పు చేసినవాడు, దైవాన్ని తిరస్కరించినవాడు దేవుని కృపకు, క్షమకు అర్హులే అన్న విషయాన్ని గేథే తన రచనల్లో నొక్కి చెప్పాడు.

భూమిఆత్మను (Earth Spirit) ప్రధాన పాత్రగా మానవుని ప్రలోభాలకు గురిచేసే దుష్టశక్తిగా తొలి వెర్షన్ 'Urfaust' లో ప్రతిపాదించి, తరువాత ఆ భూ ఆత్మస్థానే మెఫిస్టాఫిలిస్‌ను విలన్‌గా (ప్రతినాయకుడు) ప్రవేశపెట్టినాడు. సాతాన్‌కు ప్రతిరూపమైన మెఫిస్టొపిలిస్ మోసపూరిత కుట్రలు, మాటలు, రీతులు ఫాస్ట్ నాటకంలో అద్భుత ప్రజాదరణ పొందాయి.

**గ్రెఛెన్ :** గ్రెఛెన్ పాత్ర దాదాపు సజీవమైన పాత్ర. సుసన్నా మార్గరెటా బ్రాండ్‌ట్ అనే యువతిని, సంచార నగల వ్యాపారి లేదా కంసాలి (Wandering Goldsmith) డెవిల్ ప్రోద్బలంతో మోసం చేసి గర్భవతిని చేయగా ఆమె తనకు జన్మించిన పసికందును చంపివేస్తుంది. గేథే న్యాయవాదిగా ఫ్రాంక్‌ఫర్ట్‌లో ఉన్న కాలమది. గేథే ఇంటికి ఆమెను ఉంచిన జైలు కేవలం 200 గజాల దూరంలో ఉండడం, ఆ రోజుల్లో ఆ కేసు వివరాలు అన్నిచోట్లా ప్రముఖంగా చర్చించబడడం (ఆమె సోదరుడు కూడా సైనికుడే) ఆమె చేసిన నేరం ఋజువుకాగా ఆమెకు శిరచ్ఛేదం చేయబడడం –ఈ సంఘటనలను, ఈ నాటకంలో కళ్లకు కట్టేట్లు గేథే వర్ణించాడు.

**దెయ్యంతో ఒప్పందం – (The Pact with Devil or devil's bargain - Teufelspakt)** – అనేది అనాదిగా యూరోపియన్ కథల్లో ప్రధానాంశం, ఈ నాటకంలో మరో ముఖ్య ఘట్టమైన Witch's Kitchen (మంత్రగత్తె వంటగది)లో ప్రొఫెసర్ ఫాస్ట్, మంత్రగత్తె ఇచ్చిన కషాయాన్ని తాగి వయసు పదిహేనేళ్లు తగ్గి 'హీన్‌రిచ్' (Heinrich)గా రూపాంతరం చెందుతాడు. ఇటువంటి అద్భుత ఘట్టాలతో 'ఫాస్ట్' నాటకం జర్మనీ సాహిత్య చరిత్రలో ప్రముఖ స్థానాన్ని పొందింది.

## ఫాస్ట్ – విషాదాంత నాటకం

దాదాపు ముప్పై ఏళ్లపాటు మార్పులు చేర్పులకు లోనై 'ఫాస్ట్' విషాదాంత నాటకం – తొలిభాగంగా ప్రచురించిబడినది. కవిత్వరీతుల్లో, నాటక ప్రక్రియలలో కొత్తపుంతలు తొక్కిన ఈ రచన జర్మన్, యూరోపియన్ సాహిత్యంలో అత్యంత శక్తివంతమైన రచనగా ప్రసిద్ధికెక్కింది. 1772–1775 వరకు తొలిదశ Urfaust గా, 1788–90 రెండవదశ Faust-a Fragment గా, 1797–1801 మూడవ దశగా, ఈ నాటకం – 1808లో Faust - The First Part of Tragedy గా ప్రచురింపబడింది. ఈ గ్రంథాన్ని ప్రముఖ ఆంగ్లకవి డేవిడ్ ల్యూక్ (David Luke) ఆంగ్లంలోకి అనువదించగా 1989లో The Europeon Poetry Translation Prize ఇవ్వబడింది. ఈ తెలుగు రచనకు డేవిడ్ ల్యూక్ అనువాదం ముఖ్య ఆధారం మరియు రిఫరెన్స్ గ్రంథం.

ఇరవై ఎనిమిది అంకాలుగా ఉన్న ఈ నాటకంలో తొలి అంకం (అంకితం) 1797లో గేథే 48వ ఏట వ్రాయబడిందంటారు. రెండవ అంకం ప్రస్తావనలోని విదూషకుడి పాత్రను రంగస్థలంపై సాధారణంగా మెఫిస్టొఫిలిస్ వేషం వేసే నటుడే వేయడం ఆనవాయితీ. అదేవిధంగా కవి, దర్శకుడి పాత్రలు ఫాస్ట్‌కు, జగత్ప్రభువుకు ప్రతిరూపాలుగా విమర్శకులు భావిస్తారు.

మెఫిస్టొఫిలిస్ – (మెఫిట్జ్=విధ్వంసకుడు – హీబ్రూ), Tophel=liar - అబద్ధాలకోరు – సాతానుకు ప్రతినిధిగా చెడు కార్యాలు చేసినవారి ఆత్మలను నరకానికి తీసుకుపోయేవాడు. Falsehood Plasterer, Not light loving, Creature అనేవి ఇతర అర్థాలు.

# విషయ సూచిక

## ఫాస్ట్-1


1. అంకితం ........ 1
2. రంగస్థలం - ప్రస్తావన ........ 3
3. స్వర్గంలో సంభాషణ ........ 11
4. నాటక తొలిభాగం - రాత్రి ........ 16
5. పట్టణ గోడల కావల ........ 32
6. ఫాస్ట్ - చదువుకునే గది-1 ........ 44
7. ఫాస్ట్ - చదువుకునే గది-2 ........ 54
8. ఆయుర్‌బాక్ మధుశాల ........ 72
9. మంత్రగత్తె వంటగది ........ 82
10. వీధి ........ 92
11. సాయంకాలం ........ 95
12. ప్రేమగీతం ........ 100
13. పొరుగిల్లు ........ 103
14. వీధి ........ 109
15. తోట ........ 111
16. విశ్రాంతిగృహం ........ 116
17. అడవిలో చిన్న గుహ ........ 117
18. గ్రెచెన్ గది ........ 122
19. మార్తా తోట ........ 124
20. బావి దగ్గర ........ 129
21. నగర మందిరంలో చిన్న గుడి దగ్గర ........ 131
22. రాత్రి- గ్రెచెన్ ఇంటి తలుపు పక్క వీధి ........ 132
23. ప్రార్థనా మందిరం ........ 138
24. వాల్ పర్గిస్ రాత్రి ........ 140
25. వాల్ పర్గిస్ రాత్రి కల ........ 153
26. మైదానంలో విచార దినం ........ 159
27. రాత్రి మైదానంలో ........ 162
28. ఖైదు ........ 163





# 1. అంకితం

అస్పష్ట రూపాలు, గతకాలపు స్వరూప నిదర్శనాలు
చానాళ్ళ క్రితం మిమ్మల్ని గాఢంగా పరిశీలించాను
నా హృదయపు ఉన్మత్త చంచల దర్శనాలు మీరు–
మిమ్మల్ని కౌగిలించుకోనా, మిమ్మల్ని వెళ్లనివ్వవలసిందేనా?

మరల నన్ను వెంటాడుతున్నారు: రండి, నన్ను నిలువరించండి!
ఆ మురికి పొగమంచులోంచి బయల్వెడలే మీరు
నన్ను బందీని చేసి, మంత్ర నిశ్వాసాలతో జీవింపచేసి
నా ఆత్మను కదిలించి, నా యవ్వనాన్ని మరల నాకివ్వండి.

ఆనాటి మధుర జ్ఞాపకాలను చిగురింపజేస్తున్నారు.
నేను ఎంతగానో ప్రేమించిన వారి ఛాయారూపాలు మీరు
సగం మాసిపోయిన పురాతన కథారూపం
మన చెవుల దగ్గర విషాద ధ్వనుల్ని మరల వినిపిస్తున్నది.

జీవనపు అతి క్లిష్టదారుల మాళిగలలో నా ప్రయాణం;
పాత దుఃఖాలు, స్నేహాలు, ప్రేమలు మేల్కొంటున్నాయి.
దయలేని విధి వారి జీవదారాన్ని తెంపగా నన్నిక్కడ
ఒంటరిగా వదిలి వెళ్లిన సహచరులు నాకు తారసపడ్తున్నారు.

నా ప్రస్తుత గానాన్ని వారు వినలేరు
నా తొలి పాటను విన్న కొద్ది ఆత్మలు
నాకెంతో దగ్గరివాళ్లు, ఇప్పుడు సుదూరంగా ఉంటున్నారు.
వారి తొలి సమాధానపు ప్రతిధ్వని నిశ్శబ్దాన్ని పాటిస్తున్నది.

నా గొంతు వినిపిస్తున్నది. ఎవరివల్లనో ఎవరికి తెలుసు?
నామరహిత ధ్వని దానిని అభినందిస్తుంటే నేను వణికిపోతాను.
అది కదిలించి ప్రపంచపు నలుదిక్కులకు తరిమిన
నా పాత స్నేహితులు ఇంకా బతికి ఉన్నారో, లేదో?

ఒకప్పటి నా ప్రశాంత పవిత్రాత్మ సామ్రాజ్యం కోసం
అవసరం లేని దీర్ఘ విరహం నన్ను ఖైదు చేసింది.
ఇవోలస్ సితార నుంచి వెలువడే
విషాద ధ్వనుల్లా దీర్ఘ నిశ్వాసాలు అల్లల్లాడుతున్నవి.

తొలిసారి వాటిని నేను గానం చేసినపుడు వణికిపోయాను.
జ్వలిస్తున్న అశ్రువులు ప్రవహించగా, నా కఠిన హృదయం ప్రేమకై
కరిగి, ఇప్పుడు నా దగ్గరున్నవన్నీ దూరంగా తొలిగినట్లున్నది
అదృశ్యమైన ప్రపంచాలన్నీ, ఈనాడు నాకు వాస్తవమై కనిపిస్తున్నాయి.



# 2. రంగస్థలం - ప్రస్తావన

## (దర్శకుడు, కవి, విదూషకుడు)

**దర్శకుడు :** చాలా సంతోషం, మనమిప్పుడు జర్మన్ నేలమీద ఉన్నాం.
స్నేహితులారా! కష్టసుఖాల్లో నన్నంటిపెట్టుకున్న మిత్రులు
మీరిద్దరూ: సలహా యివ్వండి.
మనమెలా వృద్ధిలోకి వస్తామో!
నా శ్రమ – ఫరవాలేదు, కష్టం నాకిష్టమే – నా ధర్మం,
నా ప్రయత్నం జనాల్ని మెప్పించడమే!
వాళ్లూ ఓపిక గలవారే! నేను ఒప్పుకుంటాను.
ఊరంతా టాంటాం జరిగింది. ప్రచారం ఉవ్వెత్తున సాగింది.
ఇప్పుడు వాళ్లు ఆనందించేలా చూడాల్సిన బాధ్యత మనది.
వాళ్ళు తమ సీట్లలో కూర్చుని, ఉత్కంఠతతో కళ్లు పెద్దవి
చేసుకుని మరీ రంగస్థలం వేపు చూస్తున్నారు. మన ప్రదర్శనతో వాళ్లు
మంత్రముగ్ధులు కావాలని, దానిలో లీనం కావాలని ఆశిస్తున్నారు.
జనాన్ని బుట్టలో వేయడం నాకు తెలిసిన విద్యే;
కాని ఇక్కడో సమస్య ఉంది. చెప్పక తప్పదు.
వాళ్ళింతకుముందు చూసినవేమంత గొప్పవి కావు–
అంతేకాక వాళ్ళు కాస్తో కూస్తో విద్యావంతులే.
ఎలా వాళ్లకు మనం ఓ కొత్తదనం రంగరించుకుని,
తాజాగా ఉండి, వినోదాన్ని, ఆనందాన్ని పంచే ప్రదర్శనను ఇవ్వగలుగుతాం?
ఎలా ఆ జనమంతా మళ్ళీ మళ్ళీ గుంపులు గుంపులుగా
మన దారునిర్మిత స్వర్గంలోకి వచ్చేందుకు కుతూహలపడేలా చేయగలం?
వాళ్ళందరూ ఒకరినొకరు తోసుకుంటూ
ఆ ఇరుకైన తిన్నని దారిగుండా వస్తూ
పొదగబడుతున్న గుడ్లలా కనిపిస్తుంటే చూడాలన్నది నా ఆశ.
మన ఖజానా కళకళలాడాలి. ఎడ్వాన్స్ బుకింగులతో
మన డబ్బుపెట్టె గలగలలాడాలి.
సాయంకాలం నాలుగు కాకమునుపే జనం టిక్కెట్లకై ఎగబడాలి.
ఆకలితో నకనకలాడుతున్నవాళ్ళు బేకరీ తలుపు దగ్గర

కోట్లాడుకుంటున్నట్లు జనం కొట్టుకోవాలి.
అంత స్పందన రావాలంటే అది కవి ద్వారానే సాధ్యం
వారిని కనీవిని ఎరుగని ఇంద్రజాల, మహేంద్రజాల, టక్కుటమారాలతో
ముంచెత్తాలి! మిత్రమా! ఇది నీ వల్లనే ఈరోజే కావాలి!

**కవి** : స్నేహితుడా! నీవు నాకా గోల గుంపును గుర్తుచేయకు!
ఆ దృశ్యం నుంచి నన్ను విడుదల చేయి!
ఆ ప్రవాహంలో పడ్డామా మన ఆత్మలు దాంట్లోనే కొట్టుకుపోతాయి.
ఆ అరాచకపు గుంపును ఎవ్వరాపగలరు?
నేను నేనుగా ఉండే నిశ్శబ్దాన్ని నాకివ్వు.
కవి తిరుగాడే కమనీయ ప్రదేశంలో నిశ్శబ్దం విసుగు పుట్టించదు.
హృదయం పెంచి పెద్దజేయడిన ప్రేమ, స్నేహంలోనే
మన కళ, అభినివేశం రసపట్టును చేరుకుంటాయి.
అగాధంలో ఉన్న ఆత్మలో ఏదో అద్భుత ప్రచోదనం కలగాలి.
ఓ అస్పష్టమై, అపురూపమైన తొలిపాట ఉద్భవించాలి.
ఆ రూపం సంపూర్ణమైనా కాకున్నా దాని క్షణకాలం దర్శనం
కాల ప్రవాహపు వడిలో కనుమరుగైపోతుంది.
కనిపించీ కనిపించకుండా అది చీకటిలో పెరిగి
అనేక సంవత్సరాల తర్వాత ఫలిస్తుంది.
క్షణకాలం మెరిసేది తొందరగా అదృశ్యమవుతుంది.
అచ్చమైన స్వర్ణం తరువాత తరాలకూ అందుతుంది.

**విదూషకుడు:** రేపటి తరాలనూ పరిగణనలోకి తీసుకోవాలి!
భవిష్యత్ తరాలే ముఖ్యమైతే
ఈనాటి జనాలకు కాలక్షేప సాధనమేమిటి?
వాళ్లకూ వినోదించే హక్కున్నది కదా!
మనం తీర్చుకోవాల్సిన ఋణమదే!
నేను నటిస్తుంటాను, వాళ్ళు ఆనందిస్తుంటారు.
వాళ్లను కవ్వించు, నవ్వించు!
అప్పుడు నీవు నిశ్శబ్దంలోకి నిష్క్రమించనక్కర్లేదు.
జనాల చంచల ప్రవృత్తికి చలించనక్కరలేదు.
వెనక కూర్చునేవాళ్ళు తొందరగా ఉత్తేజితులౌతారు.

వాళ్లకేది కావాలో అది వ్రాయి, ఒక ఆదర్శ కవిగా మారు!
అందరూ పాడగలిగిన చరణాలను అల్లి
కారణం, అర్థం, అనుభూతి, ఉద్వేగం – వీటి మధ్యలో
సన్నటి నరంగా సాగే తెలివి తక్కువ తనాన్ని నిక్షేపించు!

**దర్శకుడు :** వీటితో పాటు కాస్త ఏక్షన్, కాస్త ఉద్విగ్నత; నరాలు తెగే
ఉత్కంఠత జోడించు. అంతేకాదు! వాళ్ళు వచ్చింది
ఓ అద్భుత ప్రదర్శనను చూడడానికి.
వాళ్ల కళ్లముందు అనేక దృశ్యాలు సాక్షాత్కరించనీ
ఆశ్చర్యంతో వాళ్లు అచేతనులవ్వాలి! అప్పుడు
నీవు వాళ్ల హృదయాల్ని గెలుచుకుంటావు;
బహుమతిని గెలుచుకుని, ప్రముఖుల జాబితాలో చేరతావు.
జనాల్ని ఆకర్షించేది జనరూపమే.
జనానికి నచ్చిందా అది ప్రభంజనమే!
ప్రతి ఒక్కడికీ ఏదో ఒక విషయం నచ్చాలి.
అది నా పాత్రే అనుకుని లీనం కావాలి!
తన హృదయంలో మోసుకుపోయే ఓ అనుభూతి నివ్వాలి.
నీవివ్వగలవు! ఇది నీకు కొట్టిన పిండే! విందు భోజనాన్నివ్వు
ప్రతి ప్రేక్షకుడూ సంతృప్తిగా ఇంటికి వెళ్లాలి.
ఒకే చిత్రంలో వివిధ చిత్రాలు, ఒకే ముక్కలో అనేక ముక్కలు
మంచి పులుసును వండు, రకరకాల ముక్కలు వేయి!
అది తేలిక, పొరపాటుకు ఆస్కారం లేనిది!
మనం మొత్తంగా వడ్డించినా వాళ్లు
ముక్కలు ముక్కలుగా, ముద్దలు ముద్దలుగానే ఆస్వాదిస్తారు.
అది వాళ్ల నైజం! ఇది ఖచ్చితమైన నిజం!

**కవి :** మీకు అటువంటి వంటపై మక్కువ ఉన్నట్లున్నది.
అది నిజమైన కళారూపమెలా అవుతుందో అర్థంకావడం లేదు.
మీరు చెప్పినట్లే నేను చేస్తే
ఔత్సాహికుల మందలో జేరి కాలుజారి పడతాను.

**దర్శకుడు :** నీ తిరస్కారం నన్ను బాధించడం లేదు.
నా లక్ష్యమంతా విజయాన్ని అందుకోవడమే

దానికోసం ఓ పద్ధతీ, ప్రణాళిక అవలంబిస్తాను.
మెత్తటి కలప నరకడానికి ఏ పనిముట్టు వాడాలో నిర్ణయిస్తాను.
మిత్రమా! వివరించు! నీ వెవరికొరకు వ్రాస్తున్నావో!
ప్రేక్షకులలో కొందరు కాలక్షేపానికి వస్తారు,
కొందరు హాయిగా భోంచేసి విశ్రాంతి కోసం అడుగుబెడ్తారు.
మరికొందరు పత్రికలలో మన గురించి చదివి ఆసక్తితో వస్తారు.
దేవుడు మనల్ని రక్షించుగాక!
కొందరు ఏ ఆలోచనలు లేకుండా, ఏ ఉద్వేగమూ
కనిపించని ముసుగులలో వస్తారు.
కొద్దిపాటి కుతూహలం వాళ్లనిక్కడికి రప్పిస్తుంది.
కొందరు తమ నగల్ని, ఖరీదైన దుస్తుల్ని ప్రదర్శించడానికి–
వారికి ఈ ప్రదర్శనలోని విషయాలపై మక్కువ ఎక్కడుంటుంది?
వాళ్ళ మధ్యలో వెళ్లిపోతే నన్ను నీ పారితోషికం అడగకూడదు సుమా!
ఎందుకు అద్భుత కళారూపాల సృష్టి గురించి కలలు కంటావు?
నీవు చెప్పేదే నిజమైతే ప్రదర్శన శాలలెందుకు ప్రజలతో నిండడం లేదు?
మన పోషకుల్ని చూడు. సగం మందికి సరైన అభిరుచి లేదు.
మిగతా సగం మందికి హృదయం లేదు.
ఒకాయన ప్రదర్శన ముగిసాక మూడు ముక్కలాట ఉత్సాహంలో ఉన్నాడు.
మరొకడు అందమైన అమ్మాయి కౌగిలికి ఆరాటపడ్తున్నాడు.
అమాయకుడా! ఎందుకు లలితకళామతల్లిని ఈ రొచ్చులోకి
ఆహ్వానిస్తావు? ప్రజలకేం కావాలో దానిని అమితంగా ఇవ్వు!
వాళ్లని ఆనందపరచడం చాలా కష్టమైన పని!
మంచి పద్ధతేమిటంటే వాళ్లని తికమకపెట్టడం!
ఆ పని చేయి! నీకు విజయం తథ్యం–
నీకేం కావాలి! అంతులేని బాధా? తాదాత్మ్యమైన ఆనందమా?

**కవి** : నన్ను వదిలేయండి! మీకు దణ్ణం పెడతాను! మీకు నచ్చే ఇంకెవరైనా బానిసను ఎన్నుకోండి! కవికి ప్రకృతి ప్రసాదించిన జన్మహక్కు – సృజనను వదులుకోమంటారా? ఆ అద్భుత బహుమతిని అమ్ముకోమంటారా? అటువంటివాడు జనహృదయాలను ఎలా కదిలించగలడు? ప్రకృతిలోని మూలకాలపై, పంచభూతాలపై

పట్టునెలా సాధించగలడు?
పాటలు పల్లవించి, వాక్యాలు ప్రవాహమై, ప్రపంచాన్ని
రసమయ జగత్తులో ఓలలాడిస్తూ, తన ఆత్మలోకి
ప్రవేశపెట్టుకోగలిగిన దైవిక విద్యను వదులుకోమంటున్నారా?
ప్రకృతి తన సూత్రాన్ని దీర్ఘంగా, అనంతంగా పేనుతుంది.
ఒక్కోసారి అజాగ్రత్త గాయం చేయవచ్చు.
ప్రతి వ్యక్తీ గందరగోళం గుంపులోనే నివసిస్తాడు.
ఎవడి గొంతు వాడిది. కొన్ని కఠోర షడ్జమాలుండవచ్చు.
ఈ వైవిధ్యరహిత నిరీరవ ప్రవాహాన్ని సజీవ స్వరలయ
తరంగంగా మార్చేదెవరు? ఎవరీ వివిధ రూపధ్వనుల్ని
ప్రశస్త సంగీత నవరస రూపకంగా రూపొందించగలరు?
ఉద్వేగాలు ఉధృతమైనపుడు తుఫానుతో పాట పాడించగలదెవ్వరు?
పవిత్ర భావం పెల్లుబికినప్పుడు సూర్యాస్తమయాన్ని
ప్రజ్వలించేదెవరు?
ప్రేమికులు నడిచే దారిలో వసంత పుష్పగుచ్ఛాల్ని విరజిమ్మేదెవరు?
అత్యున్నత పురస్కారానికై, ఆకుపచ్చని తమాల పత్రాల్ని కిరీటంగా
ధరించేదెవరు?
ఒలింపస్ శిఖరాన్ని తన కాంతులతో నింపి, దేవతలతో
కలిసి నడయాడేదెవరు?
అదే మానవశక్తి! కవిత్వ రూపాన
వివరించబడిన మహోజ్వల శక్తి!

**విదూషకుడు:** అవే! వాటినే వినియోగించు! ఆ అద్భుత శక్తుల్ని
నీ కవిత్వ రచనలో నిక్షేపించు.
కాముకులు, ప్రేమికుల ప్రవృత్తులను వివరించు.
ఒకరిది అదృష్టం, ఒకరిది నిరంతర నిరీక్షణ, ఒకరిది మధుర భావన
ఒకరిది నెమ్మదిగా పెరిగే ప్రేమవృక్షం.
ఒకరిది ఆనందం అందిన మరుక్షణమే ఆశాభంగం.
సంతోషం దుఖాశ్రువులుగా మారే దురదృష్ట జాతకం.
అది ఒక కథారూపమై, గ్రంథమై లిఖించబడనీ!
ఆ అద్భుత రూపకాన్నే మనం వాళ్ళకిద్దాం! అదే ప్రదర్శిద్దాం!

సహజ జీవితానికే, రంగురంగుల సొబగులద్ది చూపిద్దాం!
వారు గడిపే జీవితాల్లోని వివిధ కోణాల్ని బహిర్గత పరుద్దాం!
వాళ్లకు తెలీని వాళ్ల జీవితపు పుటల్ని చదివి వినిపిద్దాం!
మనోహరమైన వర్ణనలు, వర్ణనలను ప్రతిబింబించే దృశ్యాలు,
దృశ్య ప్రధానమై, అంతర్గత భావరహితమైన సన్నివేశాలు,
ఎక్కువ తప్పులు, కాని ఆవగింజంత సత్యం...
అటువంటి మధువును తయారుచేయి.
వాళ్లు హాయిగా తాగి సంతృప్తి చెందుతారు.
యువకులు ఉత్తేజితులై, నీ పదాల్ని, పద్యపాదాల్ని
స్మరిస్తూ, నీవిచ్చే సందేశంతో మమేకమౌతారు.
నీ నాటకంలోని ప్రతి పాత్రా వాళ్ల హృదయంలో
విషాదభరిత తుపానుని సృష్టించాలి. ఒక నిరాధార
భయపు విషణ్ణతను కలిగించాలి.
ప్రతి మాటా, ప్రతి పాటా, ప్రతి దృశ్యం ప్రేక్షకుడిలో
ఏదో ఒక నరాన్ని మీటాలి, అతడిని ఉత్తేజింపచేయాలి.
ఎందుకంటే ఆ భావన అతడిలో ఉన్నదే కదా!
వాళ్ళింకా చిన్నవాళ్లే! నవ్వడానికి, దుఃఖించడానికి
సిద్ధంగా ఉన్నవాళ్ళే! భ్రాంతి వాళ్లను కవ్విస్తుంది.
వాక్చాతుర్యం వాళ్లను ఆకాశానికెత్తుతుంది.
వృద్ధులయితే ముదిరి, కొత్త భావనలను తిరస్కరిస్తారు.
పెరిగే మనసున్నవారు కృతజ్ఞతను చూపిస్తారు.

**కవి** : ఆ పాత రోజుల్ని, అపాత మధురమైన ఆ గతించిన కాలాన్ని
నేను నేనుగా రూపొందిన ఆ అద్భుత క్షణాల్ని నాకివ్వు!
జలధార నుంచి స్వచ్ఛంగా, వేగంగా పెల్లుబికిన
ఎడతెగని పాటల్ని మరలా ప్రవహించనివ్వు.
నా ప్రపంచాన్నప్పుడు ఓ మార్మికమైన తెర కప్పి ఉండి,
ఎన్నో అద్భుతాలు మొగ్గలుగా ప్రకటించబడినాయి.
లోయల్లో అసంఖ్యాకంగా విరిసిన పూలను ఏరుకుంటూ
పేదరికం కానరాని జీవితమది.
భ్రాంతులను ప్రేమిస్తూ సత్యాన్ని శోధించాను.

అడ్డూ అదుపు లేని ఉద్వేగాల్ని నాకిచ్చేయి!
ఆనాడు నేననుభవించిన క్షణాల్ని తిరిగి తీసుకురా!
ప్రేమ యొక్క శక్తి, ద్వేషపు చురుకుదనం–
అన్నీ కలిసిన నా యవ్వనాన్ని నాకు ప్రసాదించు–

**విదూషకుడు:** స్నేహితుడా! యవ్వనం కావాల్సిందే!
శత్రువుతో యుద్ధానికి తలబడ్డప్పుడు,
అందమైన యువతిని అభిలషిస్తున్నపుడు,
విజయం ఇంకా దూరంగానే ఉన్నపుడు,
వేగంగా నృత్యం చేసి రాత్రిని రమ్యంగా ఉంచాలనుకున్నప్పుడు.
యవ్వనం కావాల్సిందే!
కాని, నెమ్మదిగా, మంద్రంగా, వీణాతంత్రుల్ని మీటుతూ
ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్నెన్నుకుని, ఒక అద్భుత రససృష్టి చేసి,
ఆత్మను అందులో ప్రవేశపెట్టాలంటే–
అనుభవమున్న కవికే అది సాధ్యమవుతుంది.
అందుకే నీవంటే మాకెంతో గౌరవం!
వయసుకు రెండో బాల్యం లేదన్న సామెత నిజం కాదు.
వయసుతో పెరిగిన జ్ఞానం మనల్ని పసిపాపల్ని చేస్తుంది.
మనం పిల్లలమే! నిజమైన పిల్లలుగానే మిగిలిపోతాం!

**దర్శకుడు :** మాటలిక చాలు! ఇప్పుడు కావాల్సింది కార్యాచరణ.
స్నేహితులారా! మనం ఇలా మాట్లాడుకుంటూ కూర్చుంటే
ప్రశస్తమైన కాలం కాస్తా గడచిపోతుంది.
మంచి మానసిక స్థితి కోసమెందుకింత గడబిడ!
సణుగుడు, గొణుగుడుతో సంగీతం రాదు.
మ్యూజ్ దేవతలను అర్థించు, ఆజ్ఞాపించు!
నీవు సరైన వాడివైతే, వారే నీతో సరిగమలు పలికిస్తారు.
నీకు తెలుసు మేము నీ నుంచి ఏమి ఆశిస్తున్నామో!
ఒక శక్తివంతమైన ఔషధం, మధువుకోసం మా నిరీక్షణ
తయారుచేయి! ఈరోజు మొదలెట్టకపోతే
రేపటికీ అది అసంపూర్తిగా ఉండిపోతుంది.

ఒక్కక్షణం, ఒక్కరోజును కూడా వృధా కానివ్వద్దు!
ధైర్యంగా, పట్టుదలతో అదృష్టదేవత
ముంగురుల నందుకుని నీ ముంగిట నిలుపుకో
అవకాశాన్ని జారిపోనివ్వకు!
ప్రారంభించిన పని పూర్తి చెయ్యాల్సిన భారం మనదే.

జర్మన్ రంగస్థలంపై, నీకు తెలుసు!
నాటక నిర్మాతలు అనేక కొత్త ధోరణులను ప్రవేశపెట్టారు.
అందుకే, యంత్రసామాగ్రిని, శాస్త్ర పరిజ్ఞానాన్ని వినియోగించు.
అపురూపమైన దృశ్యాల్ని సృజించు.
ఎండనీ, వెన్నెలనీ, నక్షత్రకాంతినీ,
సెలయేళ్లనీ, జలపాతాల్నీ, అగ్ని పర్వతాల్ని,
శిలల సమూహాల్ని, పర్వతాల్నీ, లోయల్నీ
పక్షుల్నీ, రకరకాల జంతువుల్నీ అసంఖ్యాకంగా
రంగస్థలంపై అలరారేట్లు చేయి.
ఈ అట్టపెట్టెలపై, కొయ్య చెక్కలపై
యావత్ సృష్టి నిర్మాణాన్ని సాక్షాత్కరింపజేయి!
వేగవంతమైన అడుగులతో,
జ్ఞానాన్ని, నమ్రతను మేళవించి
ఈ భూప్రపంచం ద్వారా
స్వర్గం నుండి నరకానికి ప్రయాణించు!
ఓ అద్భుత ప్రయాణానికి సృష్టికర్తవుకా!

# 3. స్వర్గంలో సంభాషణ

## (జగత్ప్రభువు, ముగ్గురు ప్రధాన దేవదూతలు, మెఫిస్టోఫిలిస్)

**రాఫెల్ :** సూర్యుడు భక్తిప్రపత్తులతో తన విశ్వాసాన్ని ప్రకటిస్తున్నాడు.
సోదర గ్రహాలతో గ్రహసంగీతాన్ని గానం చేస్తున్నాడు.
ఉరుములతో కూడిన నడకతో, నిర్ణయించబడిన
సంవత్సరాల కాలాన్ని నిర్విఘ్నంగా సంపూర్తి చేస్తున్నాడు.

దేవదూతల శక్తులు హెచ్చుతగ్గులు లేకుండా
దివ్యకాంతిని గ్రహించి బలపడుతున్నవి.
అనంతమై, అగణితమైన తమ సృష్టి
తొలిదినపు వర్ఛస్సుతో తొణికిసలాడుతున్నది.

**గాబ్రియెల్:** కీర్తి వహించిన భూమి, మనస్సును విస్మయపరిచే
వేగంతో ప్రదక్షిణాలు చేస్తున్నది.
రాత్రి చీకటి భయంకర రూపం ప్రతిరోజూ
పగటి కాంతి వెలుగుతో స్థానాలు మార్చుకుంటున్నది.
సాగర ప్రాంతపు అడుగున శిఖరాలు శిరసు వంచగా
మహోత్తుంగ తరంగాలు ముందుకూ వెనక్కు మసల్తున్నవి.
భూగోళపు నిరంతర భ్రమణంలో
కొండలు, సముద్రాలు కొట్టుకుంటున్నవి.

**మైఖేల్ :** విడతల వారీగా తుపానులు నేల నుండి సముద్రానికి
సముద్రం నుండి నేలపైకి విజృంభించి దూకుతున్నాయి.
ఆపుదల లేని ఉగ్వేదాల ఆసరాతో
ప్రచండ శక్తిని పెంచుకుని పెల్లుబుకుతున్నాయి.
ఉరుములు ఉరిమి, మెరుపులు మెరిసి, పిడుగులు పడ్తున్నాయి.
దారి నిండా దాచలేని విధ్వంసమే!
ఓ ప్రభూ! మేము నీ వార్తాహరులం!
నీ ప్రశాంత దినాన్ని నిరవధిక భక్తితో కీర్తిస్తాము.

**ముగ్గురూ :** మేము ఒక్కొక్కరం దివ్యకాంతిని వీక్షించి

మా శక్తియుక్తుల్ని మరింత గట్టి పరచుకున్నాం!
తమ అద్భుత అగణిత అనంత సృష్టి
తొలి దినపు వర్చస్సుతో తొణికిసలాడ్తున్నది.

**మెఫిస్టొఫెలిస్:** కరుణామయుడా! తమరు మమ్మల్ని మరలా పిలిచి
విశ్వపు విశేషాలను వివరించమని ఆజ్ఞాపించారు.
నన్ను అప్పుడప్పుడు కలవడం తమకు సంతోషాన్ని కలిగిస్తున్నందున
నేను కూడా తమరి బృందంలో చేరాలని అనుకున్నాను.
ముందుగా నన్ను క్షమించండి! ఎందుకంటే పెద్దపెద్ద మాటలు నాకు రావు.
ఆ బలహీనత గురించి నాకు తెలుసు.
నవ్వడం మీరు మరచిపోయుండకపోతే
ఇప్పుడు నా మాటలకు ఖచ్చితంగా నవ్వుతారు.
ఈ సూర్య మండలాన్ని స్తుతించేకన్నా
మానవుడి కష్టాల్ని మనవి చేస్తాను తమకు!
భూలోకపు బుల్లి దేవుడి ప్రవర్తనలో మార్పు రాలేదు.
తొలిరోజుల్లోని మూర్ఖత్వమింకా తొలగలేదు.
స్వర్గలోకపు కాంతి తళుకును ఆ కాస్త కూడా
ఇవ్వకుండా ఉండి ఉంటే కాస్తైనా బాగుపడేవాడు.
ఈ మానవుడు తన తెలివి తక్కువకు యుక్తాయుక్త విచక్షణ అని పేరిడి
మృగంకన్నా మరింత ఎక్కువ మృగంగా మారినాడు.
నేనొక్కమాట చెప్పనా ప్రభూ!
అతగాడిప్పుడొక పొడుగాటి కాళ్ల 'మిడత'
గంతులేస్తూ, ఎగుర్తూ, చిల్లర పాటలు పాడుతూ
ఎగిరెగిరి మరలా ఆ గడ్డిలోనే కూలబడ్తున్నాడు.
ఆ గడ్డిలోనే ఉన్నా బాగుండును – కాని
తన ముక్కును ప్రతి చెత్తలోనూ పెడ్తున్నాడు.

**ప్రభువు :** ఇదేనా నీవు చెప్పదలుచుకున్నది?
ఎప్పుడొచ్చినా ఇదే పాట పాడతావేమి?
ఆ భూమి మీద సరైన విషయమొక్కటీ నీకు కనపడదా?

**మెఫిస్టొఫెలిస్:** లేదు ప్రభూ! భూమి ఏనాడూ మంచిగా ఉండింది లేదు!

మానవజాతిని చూస్తే నాకు జాలివేస్తున్నది.
వాళ్లను చిత్రహింస పెట్టడంలో నాకే ఆనందమూ కలుగకున్నది.

**ప్రభువు** : నీకు ఫాస్ట్ తెలుసా!

**మెఫిస్టాఫిలిస్:** డాక్టర్ ఫాస్ట్! అతగాడు.....

**ప్రభువు** : నా సేవకుడు-

**మెఫిస్టాఫిలిస్:** మిమ్మల్నంత విశ్వాసంగా సేవిస్తున్నాడా?
అతడు భూ సంపదలను వర్జించి, దివ్యమధువును సేవిస్తున్నాడు.
పిచ్చివాడు! ఆ మధువే వాడి అంతానికి మూలమవుతుంది.
వాడి ఉన్మత్తత గురించి వాడికి సగం మాత్రమే తెలుసు.
నేను చెబుతున్నాను, స్వర్గపు అందాల తార కొరకు
స్వర్గాన్నే పెల్లగిస్తాడు, భూమిని తలక్రిందులు చేస్తాడు-
తన సంతోషం కొరకు;
అటువంటి బుద్ధిసూక్ష్మత గలవాడు, నిలకడలేనివాడికి
ఏదీ దగ్గర కాదు, ఏదీ దూరం కాదు.
ఏదీ వాడిని సంతృప్తి పరచలేదు.

**ప్రభువు** : అతడు నన్ను సేవిస్తున్నాడు. కాని ఏదో వ్యాకులత!
త్వరలో అతడికి స్పష్టమైన జ్ఞానాన్నిస్తాను.
తోటమాలికి తెలుసు, ఆకుపచ్చని మొక్క
ఎప్పుడు వృక్షమయ్యేది, పూలు పూసి ఫలించేదీ!

**మెఫిస్టాఫిలిస్:** నేనాతడికి గురువునయ్యానా, అతడు దారితప్పేది ఖాయం!
మీరు అనుమతిస్తే అతడిని నా దారిలోకి మళ్లిస్తాను,
పందెం కాస్తారా, అతడు మిమ్మల్ని వదిలేయబోడని!

**ప్రభువు** : అతడు భూమిపై జీవించి ఉన్నంత వరకు
నీ ప్రయత్నం నీవు చేయవచ్చు
బతికున్నంత కాలం మానవుడు తప్పులు చేస్తూనే ఉంటాడు!

**మెఫిస్టాఫిలిస్:** మీ కరుణకు కృతజ్ఞుడిని. చచ్చిన వాళ్లపై నాకు శ్రద్ధలేదు.
అయినా ఈ పోటీ రసవత్తరంగా ఉండబోతున్నట్లున్నది.

పాలిపోయిన శవం కన్నా పరుగులెత్తే మనిషంటేనే నాకిష్టం.
పిల్లి–ఎలుక ఆట అంటేనే నాకు పిచ్చ ఆనందం.

**ప్రభువు** : మంచిది. పోయి నీ ప్రయత్నాలు నీవు చేసుకో.
అతడిని మూలాల్నుంచీ విడిపోయేలా ఆకర్షించు,
నీకు తోకలా నడిపించుకో!
నీవు జారిపోయిన అధఃపాతాళానికి అతడినీ నడిపించు.
ఓడిపోతే నిజాయితీగా తప్పు ఒప్పుకో!
కటిక చీకటిలోనూ, భయపెట్టే ఒత్తిడిలోనూ
మంచివాడు తను పోవాల్సిన దారిని విడిచిపెట్టడు!

**మెఫిస్టొఫెలిస్:** సందేహం లేదు. దారి అతి దగ్గరే!
పెద్ద ఆలస్యం లేకుండానే ఈ పందెం నేను గెలుస్తాను.
గెలిచాక వచ్చి నా విజయాన్ని శ్లాఘిస్తాను.
నా పేరుగాంచిన పూర్వీకురాలు సర్పంలా
ఆ మానవుడు దుమ్ముకు కూడ ఆశపడేట్లు చేస్తాను.

**ప్రభువు** : సంతోషం. ఆరోజు నీవు నిరభ్యంతరంగా రావచ్చు.
నేను ద్వేషించడం కుదరనివాళ్లలో నీవూ ఒకడివి.
You are a type I never learnt to hate!
వ్యతిరేకించే ఆత్మల
వ్యంగ్యార్థం నన్ను అతి తక్కువ బాధిస్తుంది.
మానవుడు తృప్తితోనే ఆగిపోడు
పూర్తి తాటస్థ్యం నిలుపుదల, అతడి దృఢమైన కోరిక.
అందుచేత నీ సాహచర్యం అతనిలో తామసత్వాన్ని
మేలుకొలిపి కార్యరంగంలోకి దూకిస్తుంది.
కాని నీవు, దైవకుమారుడివి,
విశ్వపు అందాలను నీలో
ఇముడ్చుకున్నవాడివి, శాశ్వత సత్యమూ, అనంత
సౌభాగ్యమూ అయిన ప్రేమను కలిగినవాడివి.
నీలోని ప్రేమ, దాని అదృశ్యమవుతున్న సుగుణాలు
నీ సహజ ప్రకృతి అయిన దేవదూతల ఆలోచన

గా వేగవంతమై, స్థిరమై మరల ప్రేమను నెలకొల్పును గాక!

**(స్వర్గం, దేవదూతలు అదృశ్యమవుతారు)**

**మెఫిస్టొఫిలిస్:** అతడితో ఇలా ముచ్చట్లాడడం ఇష్టమే నాకు
కాని అతడి పంథాన నేను పయనించలేను.
అంత వైభవమున్న పెద్దాయన మర్యాదగా
ఇలా డెవిల్‌తో మనిషిలా ముఖాముఖీ మాట్లాడడం అభినందనీయమే.

It is civil of the old fellow,
such a grand seigneur
to have these man to man talks with the Devil.,

# ఈ విషాదాంత నాటకంలో తొలిభాగం

## 4. రాత్రి

### (ఎత్తైన కప్పుతో ఉన్న ఇరుకైన గది)

ఫాస్ట్ : (తన గదిలో టేబుల్ వద్ద కూర్చుని నెమ్మదిలేని మనస్సుతో)–
Well, that's philosophy I have read
and law and medicine, theology from A to Z.
న్యాయ, వైద్య, తర్క శాస్త్రాలు నాకిప్పుడు
కరతలామలకాలు! దేవతల తీరుతెన్నులు, ఇతర
నిగూఢ శాస్త్రాలు నాకు కంఠతా వచ్చిన విద్యలు.
ఇవి నేర్చుకోడానికి నా సర్వసంపదలు వెచ్చించి
ఇప్పుడిలా నిరుపేదగా మిగిలాను.
ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు
అన్ని శాస్త్రాలు చదివాక అర్ధమయ్యిందేమిటంటే
ప్రారంభించిన రోజున ఎంత జ్ఞానమున్నదో
అంతకు మించి ఆవగింజంత పెరగలేదు.
ఆచార్యుడు, ప్రొఫెసర్, డాక్టర్ అనే వ్యర్ధ కిరీటాలు
అనేక మంది యువకుల్ని ఆకర్షించి వారి యవ్వనాన్ని వృధా చేస్తాయి.
గత పదేళ్ళుగా, ఈ శోధన యువకుల ముక్కుకు తాడు
కట్టి ముందుకూ వెనకకూ ఊపుతున్నది.
జ్ఞాన సముపార్జనకు మేం చేసిన కృషి అంతా నిష్ఫలం కాగా
నా హృదయం కాలిపోయి బాధగా మూల్గుతున్నది.
చదువుకున్న మూర్ఖులకన్నా నాక్కాస్త లోకజ్ఞానం ఎక్కువనుకుంటాను.
ఉపాధ్యాయులు, మత ప్రచారకులు, లేఖకులు వాళ్ళంతే!
సందేహాలు నన్ను బాధించవు,
నైతిక సంకోచాలు లేవు. నరకాగ్ని, డెవిల్ నన్ను భయపెట్టలేవు.
నాకిప్పుడు దేనివల్లా ఆనందం కలగడం లేదు.
ఎందుకంటే నాకు తెలిసిందేమీ లేదని తెలిసింది గనుక!
నాకేమీ తెలియనప్పుడు నాకంతా తెలిసినట్లుగా
విద్యార్థులకెలా బోధించగలను? ఎలా నటించగలను?
వృధా భాషణాలతో మానవజాతినెలా మెరుగుపరచగలను?

పోనీ, నేను సాధించిన అద్భుత విజయాలేమున్నాయి?
కీర్తి, ప్రతిష్ఠ లేవి? సంపదలు సౌఖ్యాలెక్కడ?
కుక్క కూడా ఇటువంటి బతుకును ఇష్టపడదు.
అందుకనే, నేనిప్పుడు మంత్రశక్తిని ఆశ్రయిస్తాను.
భూతాలను, ఆత్మలను ఆహ్వానించి వాటి శక్తులతో
మార్మిక దృశ్యాలను కనుగొంటాను.
నాకిష్టం లేని ఈ పనికిమాలిన ఆచార్య విధిని
వదిలి మరల శిష్యుడిగా ప్రశ్నలడగడం ప్రారంభిస్తాను.
ప్రకృతి శక్తుల వైభవాన్ని ప్రత్యక్షంగా దర్శిస్తాను.
ఈ ప్రపంచాన్ని బంధించి ఉంచే శక్తుల్ని, ప్రపంచపు మూలాల్ని,
బీజాల్ని, పాదును, అంతర్గత నిబీడ శక్తుల్ని వీక్షించే
అవకాశాన్నివ్వమని ప్రార్థిస్తాను. నాకు కొరగాని
అర్థంలేని పదాలతో, భావజాలంతో కుస్తీ పడడం మానేస్తాను.

ఓ దుఃఖిస్తున్న పూర్ణచంద్రుడా! స్నేహితుడా!
నా బాధను నీవెందుకు చూస్తున్నావు?
ఈ బల్లవద్దనే కూర్చుని అనేక రాత్రులు
నీ వెన్నెల కోసం నిరీక్షించాను, పరిశోధించాను.
నన్ను మరల మరల కరుణిస్తావని
ఈ కాగితాల ప్రపంచంపై కాంతిని వెదజల్లుతావని.
ఓ హితుడా! నన్ను వెండికొండల శిఖరాలపైకి కొనిపో!
మధురమైన వెన్నెల గాల్పుల్లో తిరుగాడనీ!
కొండ గుహల వద్ద, పచ్చని మైదానాల్లో పరుగులిడనీ!
సంజె వెలుగుల్లో సంచరించే ఆత్మలతో సంభాషించి
వృథా పుస్తక పరిజ్ఞానాన్ని ఈ మస్తకాన్నుంచి తొలగించి
ఆ పొగను, చెత్తను నీ వెన్నెల కాంతితో శుభ్రించనీ!

దైవమా! ఈ అడ్డుగోడలు నా ఆత్మను నిలిపివేస్తున్నాయి.
ఈ శాపోపహత బందిఖానాలో నాకూపిరాడడం లేదు.
స్వర్గలోకపు కాంతి కూడా రంగులద్దిన అద్దంలోగుండా
వస్తున్న ఈ ఇరుకు గదిలో నాకు మనశ్శాంతి లేదు.
కుడి ఎడమల కుప్పలు కుప్పలుగా ఉన్న పుస్తకాలు,

పురుగులు తిని, దుమ్ముపేరుకుని, నేల నుంచి పైకప్పుదాకా
ధూళి పొగల మధ్య, కొవ్వొత్తి పొగకు కమిలిన కాగితాలు
అద్దాలూ, మందసాలూ, పరికరాలూ, అన్నీ
చెల్లా చెదరుగా, గుట్టలుగా, అనాది జ్ఞాన సంపుటాలు–
చూడు ప్రభూ! నీ ప్రపంచం– నీ మెదడు సృజించిన ప్రపంచం!

నీవడగవచ్చు, ఎందుకు నీ హృదయమింకా
బాధతో గగ్గోలు పెడ్తున్నదని!
ఎందుకు నీవిలా వ్యాకులపడుతూ
శక్తి, ఉత్సాహం కొరవడిన వాడిలా కుములుతున్నావనీ!
ఎందుకంటే నీవు కూర్చుంటున్నది జీవజాలాల్నిచ్చే ప్రకృతిమధ్య కాదు
దేవుడు సృష్టించిన విధంగా కాదు
ఈ చెత్తాచెదారం, కుళ్లూ కశ్మలం మధ్య
కమిలిపోతున్న మృగాల, మనుషుల ఎముకల మధ్య–
రా! పచ్చని మైదానాల్లోకి పారిపోదాం!
నొస్ట్రడామస్ వ్రాసిన మంత్రశాస్త్ర గ్రంథాన్ని చేతబుచ్చుకుని
నాకు తోడుగా అదొక్కటి చాలు, ఇంకేదీ అవసరం లేదు.
నేనక్కడ నక్షత్ర గమనాల్ని పరిశీలిస్తాను.
మహాద్భుతమైన ప్రకృతి నా మనస్సును నియంత్రిస్తుండగా
అంతర్గత మానసిక శక్తిని కనుగొంటాను.
నా ఆత్మ తన తోటివారితో సంభాషించేలా చేస్తాను.
ఈ ఊహాగానాలకు తెరదించుతాను.
పవిత్ర చిత్రాలు స్పష్టంగా వున్నాయి.
ఆత్మలారా! నాకు అందుబాటులో ఉండి
నా ప్రశ్నలకు స్పష్టంగా సమాధానమివ్వండి!

**(అతడు పుస్తకాన్ని తెరచి అనంతవిశ్వపు చిహ్నాన్ని అవలోకిస్తాడు)**

ఆహా! ఎంతటి అనిర్వచనీయమైన ఆనందం
నా ఇంద్రియాలలో వరదలా ప్రవహిస్తున్నది!
ప్రతి రక్తనాళం, ప్రతి నరంలో
జీవితపు ఆనందం, యవ్వన శోభ మిరుమిట్లు గొలుపుతున్నది.

ఎవరో దేవుడు ఈ మార్మిక గుర్తులను లిఖించి ఉంటాడు.
అతడి కృపచే నా ఆత్మ శాంతినొందునుగాక!
నా హృదయ పరితాపం ఉపశమించునుగాక!
ఎవరి రహస్య ప్రచోదనంతో నాలోని
ప్రకృతి శక్తుల ప్రభావం తెలియజెప్పబడుతుందో
ఆ దేవుడు నన్ను అనుగ్రహించును గాక!
నేనే దేవుడినైనానా? కాంతి నా మనస్సును నింపుతున్నది.
ఈ స్పష్టమైన రేఖలు, చిత్రాలలో
ప్రకృతి పనితనం నా అంతరింద్రియాలకు బోధపడ్తున్నది.
ఆ మహాఋషి మాటలను నేనర్థం చేసుకున్నాను-

"The spirit - world is open wide
only Your heart is closed and died
Come earth - disciple, boldly have
your bosom in the dawn's red wave" -

“ఆత్మల లోకపు తలుపులు తెరచియే ఉన్నాయి.
నీ హృదయం మూతబడి మరణించింది.
రా! నేలపైని శిష్యుడా! నీ హృదయాన్ని
సంధ్యాకాంతి అరుణతరంగాలపై విప్పార్చు!”

**(అతడు ఆ చిహ్నాన్ని పరీక్షగా చూసాడు)**

ఎంత అద్భుతమీ నిర్మాణం! జీవిస్తూ, చలిస్తూ, ఒక
సంపూర్ణ స్థితిలోకి ఎలా నేయబడ్తున్నదో!
ప్రతిభాగం దైవశక్తులను ఇచ్చి పుచ్చుకుంటూ
ఉత్థాన ప్రత్థానాలతో బంగారు నాళాల్లో తిరుగాడుతున్నదో!
దైవపు ఆశీస్సుల పరిమళాలతో, దివి నుండి భువి గుండా
అన్ని వస్తువుల గుండా రెక్కలపై పయనిస్తూ
ఆ చలనం దూకుతుంది, సామరస్యంగా గానం చేస్తుంది.
ఎంత మనోహరమీ దృశ్యం!
ఓ అనంత ప్రకృతి రూపమా! నిన్నెక్కడ కౌగలించుకోను?
ఎక్కడ నీ వక్షోజాలు జీవపు పూర్తి జీవంతో తొణికిసలాడ్తాయి?

భూమి, స్వర్గం నీపై వేలాడుతున్నాయి,
అవి నీ హృదయ దాహపు కేకలను చల్లారుస్తాయి.
అయినా, నేనిలా శోధిస్తూ ఉండాల్సిందేనా?

**(అసహనంతో అతడు పుస్తకంలోని రెండవ పేజీ తెరచి భువి ఆత్మ చిహ్నాన్ని ఆసక్తిగా తిలకిస్తాడు)**

ఎందుకు నన్నీ చిహ్నం ఇంత వేరుగా కలవరపెడ్తున్నది?
ఓ భూలోకపు ఆత్మా! నీవు నా దగ్గరి దానవు.
నూతన శక్తి నాలో అప్పుడే ప్రవహిస్తున్నది.
ఈ కొత్త మధువు నాలో వెలుగును ప్రసరిస్తున్నది.
ఇప్పుడు, ఈ ప్రపంచంలోకి వెళ్లి, భూలోకపు
ఆనందం, బాధలనన్నిటినీ అనుభవిస్తాను.
తుపానులతో తలపడ్తాను,
నౌకలు ధ్వంసమైనా నిరాశలో కృంగిపోను.
మబ్బులు నన్ను చుట్టుముట్టనీ!
పూర్ణ చంద్రబింబం తన వదనాన్ని దాచుకుంటున్నది.
నా ప్రాణదీపం మినుకు మినుకు మంటున్నది.
పొగమంచు పైకిలేచి, ఎర్రటి మంటలు నా శిరస్సు చుట్టూ ప్రజ్వలిస్తున్నాయి.
ఈ పైకప్పు నుంచీ శీతల వాయువు దూసుకువచ్చి
నాలో వణుకును కలిగిస్తున్నది.
ఓ ఆత్మా! నిన్ను నేను ఆహ్వానించాను!
నీ ఉనికి నాకు తెలుస్తున్నది! నా ముందు ప్రత్యక్షం కా!
హా! ఈ బాధ నా హృదయాన్ని చీల్చివేస్తున్నది.
ఓ కొత్త స్పర్శ నా ఇంద్రియాలను గందరగోళపరుస్తున్నది.
నేను నిశ్చయంగా ఉన్నాను. నీవు రావచ్చు! ప్రత్యక్షం కా!
నన్ను దుమ్ము, ధూళిగా ప్రహరించినా సరే!

**(పుస్తకాన్ని చేతిలోకి తీసుకుని, రహస్య మంత్రాన్ని మననం చేసాడు. ఎర్రటి అగ్నిజ్వాల మెరిసి, ఆ మంటలలో ఆత్మ ప్రత్యక్షమవుతుంది.)**

**ఆత్మ** : ఎవరు నన్ను పిలుస్తున్నది?

**ఫాస్ట్** : (పక్కకు తిరుగుతూ)– అహ్! ఎంత భయంకర రూపివి నీవు?

**ఆత్మ** : నీవు అనంత శక్తితో నన్నిక్కడికి రప్పించావు.
అనేక ఘడియల పాటు నా రాజ్యవలయాన్ని ఆకర్షించి, ఇప్పుడిలా...

**ఫాస్ట్** : అయ్యో! ఈ దృశ్యం భరించరానిది!

**ఆత్మ** : మూలుగుతూ, ముక్కుతూ నేను వచ్చేంతవరకూ ప్రయాసడ్డావు.
నా గొంతు వినేందుకు, నా రూపు చూసేందుకు!
నీ ఆత్మయొక్క దృఢమైన అభ్యర్ధన నన్నిక్కడికి పిలిచింది.
నేను వచ్చాను! ఇప్పుడు నిన్ను జాలిగొలిపే భయం చుట్టుముట్టింది.
ఓ ఫాస్ట్! – Faust the superman !
సృజనాత్మకమైన నీ హృదయపు పిలుపుకేమయ్యింది?
ఈ ప్రపంచాన్ని మోసుకుని, జన్మనిచ్చి, పరమానందంతో పొంగి
ఉబ్బితబ్బిబ్బై ఉప్పొంగి మా ఆత్మలు తిరుగాడే ఎత్తులకు
నిన్ను చేర్చిన ఆ నినాదం ఇప్పుడేం చేస్తున్నది?
నీవిప్పుడెక్కడున్నావు? ఎలుగెత్తి బిగ్గరగా పాడి
నన్ను పిలిచిన పాట ఎవరిది? నీదేనా?
ఇప్పుడు నా శ్వాస నీ చుట్టూ పరిభ్రమిస్తున్నది.
భయంలోతుల్లో నిన్ను నేను కనుగొన్నాను–
మెలికలు తిరుగుతూ, సన్నబడిన నులిపురుగులా నీవు!

**ఫాస్ట్** : నీ ముందు సాగిలపడవలెనా! ఓ జ్వాలాగ్ని రూపమా!
నేను, ఫాస్ట్‌ను! నీవూ నేనూ సమానులమే!

**ఆత్మ** : జీవితంలో వరదలా, ప్రకృతిలో తుఫానులా
నేను ముందుకూ వెనకకూ, పైకీ కిందకూ ప్రవహిస్తాను.
ఒక శాశ్వత తరంగంలా పడిలేస్తుండే
ఎప్పుడూ జ్వలించే జీవితం ఇది.
కాలపు చరఖా వద్ద నేను ఆడుతూ పాడుతుంటాను.
దేవుని సజీవ వస్త్రాన్ని నేసి ప్రదర్శిస్తుంటాను.

**ఫాస్ట్** : ఓ తీరికలేని ఆత్మా! ఆ చివరి నుంచి ఈ చివరి వరకూ
ప్రపంచాన్ని చుట్టివస్తావు. నాకెంతో దగ్గరవాడివి నీవు!

**ఆత్మ** : నీవు అభిలషించిన ఆత్మకు నీవు సరిజోడీవే!
నేను అతడిని కాను. **(ఆత్మ అదృశ్యమవుతుంది)**

**ఫాస్ట్** : (నేలపై కూలబడిపోతూ) నీవు కావా?
మరి అతడెవరు?
నేను, దేవుడి ప్రతిరూపాన్ని
నీలా ఉండని వాడిని!

**(తలుపు దగ్గర చప్పుడు)**

ఓహ్! వీడిని దయ్యం తీసుకుపోనూ! దుమ్ముకొట్టుకొన్న
ఎండు మండూకం వీడూనూ! నా సేవకుడు!
ఇంత అద్భుతమైన దార్శనిక లోకంలో నేనుంటే
మధ్యలో తగలడి మార్మికత్వాన్ని ధ్వంసం చేస్తాడు.

**(వాగనర్ రాత్రి దుస్తులలో, దీపాన్ని పట్టుకుని లోనికి వస్తాడు.
ఫాస్ట్ అతడివేపు అసహనంగా చూస్తాడు)**

**వాగనర్** : క్షమించండి! తమరి గొంతును నేను విన్నాను!
సందేహం లేదు, తమరేదో గ్రీకు ట్రాజెడీ చదువుతున్నారు!
అది ఈరోజుల్లో చాలా శక్తివంతమైన అస్త్రం, ఇతరుల్ని మెప్పించ
డానికి, ఒప్పించడానికి – వీలైతే నాకూ నేర్పించండి!
మంచి నటుడు మతబోధకుడికి కూడా పాఠాలు చెప్పగలడట!

**ఫాస్ట్** : నీవు చెప్పేది నిజమే! మతబోధకుడు కూడా నటుడయితే
ఖచ్చితంగా నీవన్నట్లే జరుగుతుంది.

**వాగనర్** : ఓ దేవుడా! రోజల్లా పుస్తకాల మధ్య కూర్చుని నేర్చుకునేదేమున్నది?
ఇంత విశాలమైన ప్రపంచాన్ని దుర్భిణీతో కూడా
ఎవరూ చూడడం లేదు! మరయితే ఎలా వీళ్లు
మానవ ప్రగతికి తమ హస్తాన్నందిస్తారు?

**ఫాస్ట్** : నీ మనసులో మాటే చెబుతున్నావా,
లేకుంటే ఈ వాక్ప్రవాహానికి వేసేయి అడ్డుకట్ట.
అనాది శక్తితో నిండినదై నీ హృదయం నుంచి
పెల్లుబుకుతుంటే అది శ్రోతలను మాటలకన్నా
మరింత తీవ్రంగా ప్రేరేపిస్తుంది.
ఇతరుల వాక్ చిగుళ్లను కత్తిరించి, కలబోసి దానిని
రసాయనంగా నీ అంగిక

అంగారాల ద్వారా ప్రసంగిస్తే ఏవో కొన్ని నిప్పురవ్వలు
వెలువడువచ్చును గాక కాని ఎవ్వడూ వాటిని పట్టించుకోడు.
చిన్నపిల్లలు ఆశ్చర్యచకితులౌతారు, అమాయకులు అభినందిస్తారు.
అటువంటి ప్రేక్షకులనే నీవు ఆశిస్తే అది నీ ఇష్టం.
కాని, అన్ని హృదయాలను ఒక్కటిగా కలిపేది ఏది?
అదే ఆత్మభాష.

**వాగనర్** : విమర్శల వాన, తిట్ల వర్షం కురిపించడం కూడా తెలిసుండాలి కదా!
నా శిక్షణా కాలం ఇంకా ఒక కొలిక్కి రాలేదనుకుంటున్నాను.

**ఫాస్ట్** : ఎందుకు నీవు ఒక నిజాయితీ గల వ్యాపారాన్ని ఎన్నుకోవు?
ఎందుకు నీకీ శ్రద్ధ ఈ మార్మికమైన చిరుగంటల శబ్దాలపై?
సరైన ఆలోచన, మంచి పరిజ్ఞానం దాని కథ అదే చెబుతుంది.
వాటికే కృత్రిమ భేషజాలక్కరలేదు.
నీవు నిజంగా ఏదైనా గంభీరమైన విషయాన్వేషణలో ఉన్నపుడు
మాటల ముసుగును తొలగించు!
శబ్దాడంబరత, విద్వత్ప్రదర్శన, కాగితాల అలంకారం
వీటితో ఈ లోకానికిచ్చేదేముంది–
శరదృతువులో సుడిగాలికి కొట్టుకుపోయే ఎండుటాకులు
ఈ మాటలకన్నా ఎక్కువ ప్రేరణను కలిగిస్తాయి.

**వాగనర్** : అయ్యో! మన జీవితం ఎంతో చిన్నది.
కళ ఎంతో పెద్దది –అంటారు విజ్ఞులు.
విద్యకోసం నేను వెదుకుతున్న మార్గాలు
అవి నా ఎదపై, మనసుపై ఎంతో భారాన్ని మోపుతున్నాయి.
మూలాలకు వెళ్లే దారుల అన్వేషణ
నా శక్తిసామర్థ్యాలను ఉడిగించి వేస్తున్నది.
సగం దూరం వెళ్లకమునుపే
మనం మరణించడం తథ్యమనిపిస్తున్నది.

**ఫాస్ట్** : వ్రాత ప్రతి అనేది పవిత్ర జలధార
అది నీ దాహాన్ని ఇంకా పెంచుతున్నదా?
నీ ఆత్మ నీలో ఉప్పొంగి పెల్లుబికితేనే
నీకు దాహం తీరిన తృప్తి కలుగుతుంది కాదా!

**వాగనర్** : నన్ను మన్నించండి! వర్తమానాన్ని అధ్యయనం చేయడం కన్నా
గడచిన యుగాల్ని విశ్లేషించడంలో ఆనందం దొరుకుతుంది.
ఆత్మలలోకి చేరి వారు చెబుతున్నది గ్రహించి
వారి కంటే మనమెంత జ్ఞానాధికులమైనామో తెలుసుకోగలం!

**ఫాస్ట్** : నిజం! మహనీయమైన అద్భుత జ్ఞానమిది.
మిత్రుడా! భూతకాలపు ఆత్మ సప్తముద్రికా వలయ రహస్యం.
చదువుకున్నవారు దానిని ఆత్మగా పిలుస్తారు.
దాని రూపాన్ని మీ పుస్తక జ్ఞానాన్ని బట్టి ఊహిస్తారు.
కాని దాని నిజరూపం ఎటువంటిదో ఎవరికి తెలుసు?
ఒక్కసారి చూస్తే భయంతో మైళ్లదూరం పరిగెడ్తారు!
అనాదికాలపు చెత్తకుప్ప, భూతకాలపు అటక
రాచకుటుంబీకుల విషాదాంత రూపం, ఏవగించుకునే
వస్తువులు, పాత రంపాలు, కీలుబొమ్మల నాటకంలోని
కిర్రు కిర్రు చప్పుళ్లతో కూడిన ధ్వనుల భాషణాలు-

**వాగనర్** : ఈ ప్రపంచం, మానవుని మనసు, హృదయం
దీనిలో మనకెంత జ్ఞానకాంతి కావాలో అంత గైకొంటాం.

**ఫాస్ట్** : జ్ఞానకాంతి! అవును! అదే మనం అనేది!
ఎవరు ఆ పేరు పెట్టిన మహనీయులు?
సత్యజ్ఞానమున్న ఎవరో కొద్దిమంది,
ఆ విషయాల్ని మందికి చెప్పబోతే ఏమైంది?
జనాల మూర్ఖత్వం, ఉద్వేగాల ముందు
వాళ్లు ఖిన్నులై శిలువలెక్కారు. మంటలకు ఆహుతైనారు.
నన్ను క్షమించు మిత్రుడా! అర్ధరాత్రి దాటింది.
ఇంకోసారి ఎప్పుడైనా ఈ చర్చను కొనసాగిద్దాం!

**వాగనర్** : ఇటువంటి అద్భుత చర్చలలో పాల్గొనడానికి
రాత్రంతా సంతోషంగా మేలుకుని ఉండగలను.
రేపు ఉదయం - ఈస్టర్ దినం.
మీరనుమతిస్తే మరిన్ని ప్రశ్నలు లేవనెత్తుతాను.
అనేక సంవత్సరాలు శ్రద్ధతో, ఆసక్తితో అభ్యసించాను.

చాలా తెలుసుకున్నాను, మిగతాదీ తెలుసుకుంటాను.
**(నిష్క్రమిస్తాడు)**

**ఫాస్ట్** : ఎందుకతనికి నిరాశ కలగదు? శూన్యమై, మినుకుమినుకుమంటున్న
మనసుండి, నేలపైన కాళ్లుంచి నిశ్చింతగా ఉన్నాడే అతడు!
స్వర్ణంపై ఆశతో నేలను గోకుతాడు.
చిన్ని పురుగులు కనిపించినా ఆనందంతో చిందులు వేస్తాడు!

అదిసరే, ఆ ఆత్మల స్వరాలు ఈ గాలిని నింపి ప్రకంపిస్తున్నపుడు
అటువంటి వ్యక్తి భాషణాలు మధ్యలో అడ్డం ఎందుకు రావాలి?
ఓ మానవుడా! ఒకందుకు నేను నీకు కృతజ్ఞత తెలపాల్సి ఉంది.
నిరాశ నన్ను సమీపించి, ఉన్మత్తత నా మనస్సుపై దాడిచేసినప్పుడు
ఒక మరుగుజ్జులా నేనా బృహద్దర్శనం ముందు కృంగిపోయినపుడు,
క్రమేపీ తగ్గుతూ శూన్యస్థితికి చేరుకునే లోపే నన్ను ప్రమాదపు అంచు
నుంచి బయటపడవేశావు.

దేవుని ప్రతిరూపాన్నైన నాకు ఎంత దగ్గరగా కనిపించినదీ
శాశ్వతపు సత్యమనే అద్దం! ఆ కాంతితో స్వచ్ఛతతో నన్ను నేను
పునరుజ్జీవింప చేసుకొని ఈ మర్త్య పరిధులను దాటినాను.
ఊహాతీతమైనది, దేవతా శక్తిరూపమైనది, దివ్య సృజన జీవనశక్తి
ప్రకృతి నరనరాల్లో ప్రవహిస్తున్న దానిని నేను స్పృశిస్తున్నపుడే
ఉరుములాంటి స్వరం నన్ను ఆ స్వప్నం నుంచి నెట్టివేసింది.
ఎంత లజ్జాకరమైన పరిస్థితి ఇది!

నీకు నేను దగ్గర కాను, నీలా నేను లేను
ఇప్పుడా మాట ధైర్యంగా చెప్పలేను.
నిన్ను నేను రమ్మని ఆహ్వానించగలను.
కాని నిన్నక్కడ నిలువరించలేను.

ఆ పరమానంద స్థితిలో నాకు నేనే
అత్యల్పంగా, అత్యున్నతంగా, కనిపించాను.
ఆ క్షణంలోనే నీవు నన్ను క్రూరంగా
మరల మర్త్యలోకంలోకి విసిరికొట్టావు.

ఇప్పుడు నేనేం చేయాలి? ఎవరి సలహా తీసుకోవాలి?
నా విధేయత ఎవరికి చెందబోతున్నది?
అయ్యో! బాధే కాదు, ఒక్కోసారి చలనశీలత కూడా
జీవన పురోగమనాన్ని ఆపివేస్తున్నది!

ఆత్మయొక్క అత్యున్నతమై అరుదైన క్షణాలను
ద్రవ్యం తన భారంతో ఊపిరాడనివ్వదు
ప్రాపంచిక సుఖాల ప్రాభవంతో మనం
గొప్ప విషయాలను భ్రాంతులుగా కొట్టిపారేస్తాం.
భూమ్మీద దొరికే చెత్త పదార్థాలతో
ప్రాణాలను పోసే అత్యున్నత ఊహలను అణచివేస్తాం.

కాలపు సుడిగుండాలను దాటి ఆశతో పైకెగసింది ఊహ ఒకప్పుడు,
ప్రతి ఆనందం మన అల్పత్వంలో కుంచించుకుపోగా ఏమున్నదిప్పుడు?
హృదయపు లోతైన రంధ్రంలో గూడుకట్టుకున్న రక్షణ
ఆత్మను రహస్యంగా చిత్రహింస పెడ్తుంది.
దాని విశ్రాంతిలేని కదలిక మనసులోని వివరాల్ని మాడ్చేస్తుంది.
ఎప్పటికప్పుడు ముసుగులు మారుస్తూ
ఇల్లులా, ఇల్లాలులా, పిల్లల్లా కనిపించి
గాయాల్ని, విషాల్ని, అగ్నినీ, వరదల్నీ ఆహ్వానిస్తుంది.
అవి మనల్ని తాకకముందే మనం నెప్పితో గిలగిలలాడ్తాం.
ఊహల్లోని నష్టాలకు ఊరకే కన్నీళ్లు వర్షిస్తాం.

నేను దేవుడి లాంటివాడిని కాను! నాకీ సత్యం ఇప్పుడే తెలుస్తున్నది.
దుమ్ములో ఇరుక్కున్న పురుగును నేను. వానపామును నేను.
రంధ్రాలు తవ్వుకుని, తిని, తిరిగి, చివరకు ఎవరి కాలికిందో
నలిగి దుమ్ములో లోతుగా పాతిపెట్టబడతాను.

ఇదంతా దుమ్ము కాదా! ఈ వందలాది అరల్నిండా పోగుపడి
ఈ ఎత్తైన గోడల మధ్య నన్ను నిర్బంధించలేదా!
ఈ పనికిరాని ఆట వస్తువులు నన్ను తమలోకి
లాక్కుని ఇన్నాళ్లూ ఈ చిమ్మెటలు తిరిగే చెత్తలో నిలపలేదా?
ఈ నిర్బంధ బందిఖానాలో నా కోరిక నెరవేరుతుందా?

వేలాది ఏళ్లుగా పునరావృతమవుతున్న మానవుడి
దుఃఖం, కన్నీళ్ల కష్టాల్ని, అప్పుడప్పుడూ దొరికే ఆనందాన్ని
ఎన్నాళ్లని పదేపదే చదువుతూ కూర్చోను?
ఓ బోలు కపాలమా! నీ చిరునవ్వు ఏమంటున్నది ఎగతాళిగా?
యవ్వనపు గజిబిజిలో నా మస్తిష్కంలానే
అదీ సత్యాన్వేషణలో సతమతమయ్యిందా?
ఆ సంధ్యాసమయం కాస్తా కాసేపటిలో కటిక చీకటిలో కలిసిందా?
నీ పాత పరికరాలు నీలానే నన్ను వెక్కిరిస్తున్నాయి
నీ చక్రాలు, పళ్లచక్రాలు, గిలకలు నాపై పడ్తున్నాయి.
నేను ద్వారం వద్దకు వచ్చాను. తాళంచెవి నీవే!
నీ వంపులు తిరిగిన గడ్డం తాళంలో పట్టదు.
ప్రకృతి ముసుగును తొలిగించాలని మేం ప్రయత్నించినా
పట్టపగలు వెలుగులో ఆమె ప్రాచీన రహస్యమై కనబడుతున్నది.
ఏ పట్టకారులూ, తులాదండాలూ ఆమె మానుండి దాచిన
రహస్యాల పెట్టె మూతను తెరవలేకున్నవి.
ఈ పనికిరాని యంత్ర జంత్రాలను
మా తండ్రి వినియోగించాడనే వాటిని నేనిక్కడ ఇంకా ఉంచాను.
పొగచూరిన వ్రాతప్రతులు, పార్చ్‌మెంటు కాగితాలు
నా రాత్రి దీపం అర్ధరాత్రి వెలగడం మొదలైనప్పటి నుంచి ఆరిపోలేదు.
ఈ నా వారసత్వ సంపదలను హారతికర్పూరం చేసినా
బాగుండేది, ఇవి నాకు తలకు మించిన భారమైనాయి.
మనం వేటితో జన్మించామో వాటినే మన స్వంతంగా భావించాలి.
ఇహలోక సంపదలన్నీ చిల్లర సరంజామాలే!!
వినియోగించని వస్తువులు మనవి కావు.
క్షణాల రెక్కలపై పెంచబడతాయి కాని అసలు క్షణాన అక్కరకు రావు.

ఏమిటిది? ఆశ్చర్యంగా, నా నేత్రాలు ఈ ప్రదేశంపైననే
మంత్రించినట్లు ఆకర్షింపబడుతున్నాయి! ఆ చిన్ని కలశం
ఉన్న చోటున, ఆ ప్రకాశవంతమైన వెలుగెక్కడిది?
చిక్కటి అరణ్యంలో చల్లని వెన్నెల కిరణంలా!

ఓ ప్రత్యేకమైన గాజుకుప్పె! అలెంబిక్ కలశమా!
నిన్ను క్రిందికి దించి సాదరంగా ఆహ్వానిస్తాను.

మానవుని ప్రజ్ఞాపాటవాలతో తయారై
అనేక రకాల రసాయన ద్రవాల్ని ఆవిరి చేసి, వడపోసి
అత్యంత శక్తివంతమైన విషపూరితమైన ద్రావకాలను
చేసిన దానా! రా! నీ యజమానిని సేవించు!
నిన్ను చూస్తుంటేనే నా బాధ ఉపశమిస్తున్నది;
నిన్ను పట్టుకుంటే నా ఆత్మ శాంతపడ్తున్నది;
ఆటుపోటులకు గురైన నా ఆత్మ అలలా
ఇప్పుడు కొద్దికొద్దిగా సముద్రం వేపు తిరోగమిస్తున్నది.
నేనా కాంతివంతమైన అద్దంపై నడుస్తాను.
నూతన ఉదయసంధ్యలో కొత్త తీరాలు నన్ను పిలుస్తున్నవి.

ఓ జ్వాలా వలయిత రథం కాంతి రెక్కలతో దిగివస్తున్నది.
నాపై గిరికీలు కొడ్తున్న రథాన్నెక్కి స్వర్గపు అంచులకు పయనిస్తాను.
కొత్తలోకంలో స్వచ్ఛమైన కార్యాల్ని ఉద్యమిస్తాను.
ఓ ఉన్మత్తమైన జీవనమా! దైవసమానమైన ఆనందమా!
క్రిమికీటకం లాంటి నేను దీనికి తగినవాడినేనా!
నేను నిశ్చయిస్తే ఇప్పుడు భువిపైని మంచిరోజుల నుంచి
శాశ్వతంగా వైదొలగిపోగలను.
భయపెట్టే ద్వారాల్లారా! నిన్ను చూసి మిగతా మానవులు
వణుకుతూ నిక్కినిక్కి వేగంగా దూరిపోతారు.
నేను నిన్ను ఎదుర్కొని వివృతం చేసి విశాలంగా తెరుస్తాను!
గొప్ప కార్యాల వలన మానవుడు దేవుడు కాగలడని
నిరూపించే మంచి తరుణం, అవకాశం నాకు లభించింది.
మన ఊహాశక్తి తనకు తాను ఏర్పరుచుకున్న చీకటి కొట్లో
స్వఘాతాలకు కృంగి కృశించి నశించే సమయం కాదిది.
నరకపు నిరాశాగ్నులు శాశ్వతంగా చుట్టుముట్టి ఉండే
ఇరుకు ద్వారం వేపు నడక సాగించాలి.
సంతోషంగా ఈ అస్పష్టపు అంచుపై నడిచి
ఆవల శూన్యముంటే శూన్యంలోకే మునిగిపోవాలి!

ఓ స్ఫటిక నిర్మిత కలశమా! Old goblet of pure Crystal !
నిన్ను నీవున్న అర నుంచి తీసి శుభ్రం చేయనీ!
నిన్ను తలచి ఎన్నో ఏళ్లయ్యింది.

గతకాలపు విందుల్లో అతిధుల్ని అలరించిన దానివి.
ఎందరో వక్తలకు చేయెత్తి జేకొట్టినదానివి.
నీపై చెక్కబడిన అందమైన చిత్ర లతలను
మధుపాన మత్తులు కవితా పదచిత్రాలతో వర్ణిస్తూ
ఒక్క గుక్కలో నీలోని మధువును పుక్కిట పట్టేవారు.
గుటక వేసేవారు. ఇవన్నీ గడిచి చానాళ్లయ్యింది.
నా వాక్చాతుర్య ప్రదర్శనకు నిన్ను పొగిడేవాడినప్పుడు.
ఇప్పుడలా కాదు. ఇక్కడో కషాయమున్నది.
దానితో నిన్ను నింపుతాను.
చిక్కగా, గోధుమ వర్ణంతో ఆ కషాయం నీలో నిండుతుంది.
బాగా కలిపి దానిని సిద్ధం చేస్తాను.
నా హృదయం సాక్షిగా చేతిని లేపుతున్నాను,
ఈ ఆఖరి ఉత్సవ సంరంభ మధువును స్వీకరిస్తూ
ఉదయ సూర్యుడికి స్వాగతం పలుకుతున్నాను.

**(మధుపాత్రను పెదాల వద్ద ఉంచుకుంటాడు.**
**చిరుగంటల ధ్వని. బృందగానం)**

**దేవదూతల బృందగానం:-**

మృతుల నుంచి క్రీస్తు లేచెను; మర్త్యులకు విజయమగు గాక!
పాపపు మోసపు విషం నుంచి,
వంశపారంపర్యపు వెట్టిచాకిరి నుంచి విముక్తి లభించెను.

**ఫాస్ట్** : ఏమి మధుర స్వరాలివి! నాలోకి లోతుగా దూసుకుపోతున్నవి.
ఆ ఆనందలాహిరిలో ఓలలాడనా? వద్దువద్దు!
వాటికంత శక్తి ఉన్నదా? ఆ చిరుగంటల సవ్వడి
ఈస్టర్ దినపు తొలిఘడియను ప్రకటిస్తున్నవి కాబోలు!
బహుశా ఇది దేవదూతల ఉపశమన గీతం నాకోసం!
కొత్త ఒప్పందం, ఖరారు చేసుకున్న రాత్రి సమాధిపై వినవస్తున్నదా!

**స్త్రీల గానం:** సుగంధ ద్రవ్యాల్ని, గుగ్గిలాన్ని తెచ్చినాము.
అతడితో స్నేహం చేసినవారు
అతడినిక్కడ ఉంచినారు.

ప్రేమతో సపర్యలు చేసినారు.
శుభ వస్త్రాలను, మెత్తని బొంతలను
మా చేతుల్తో మేము చుట్టినాము.
మా ప్రభువును తీసుకుని వెళ్లేందుకు
ఎవరు వస్తున్నారు ఈరోజు?

**దేవదూతల గానం :-**

క్రీస్తు ఊర్ధ్వగామి అయినాడు,
క్రీస్తు ఆశీర్వదింపబడినాడు!
మానవుల కష్టాలను తానే భరించి,
వారి ఆనందాలను స్పృశించి,
నయమయ్యే దెబ్బలను అనుభవించి,
అతడు పరీక్షలో ఉత్తీర్ణుడయినాడు!

**ఫాస్ట్** : స్వర్గలోకపు మృదువైన అతిమధుర బృందగానమా!
నన్నెందుకు వెదుక్కుంటూ వచ్చినావు?
ఈ దుమ్ముధూళి శక్తివంతమైనవి!
వెళ్లండి! మరింత సున్నితమైన ఆత్మల దగ్గర గానం చేయండి!
నేను మీ సందేశాన్ని వింటున్నాను, కాని ఇక నమ్మబోను.
విశ్వాసానికి ఇష్టం అద్భుతాలు. దానివల్లనే అవి నిలబడతాయి.
ఆ సుదూర వలయాల్లోకి నేనిక చొరబడబోను.
వాటి మధుర హితోక్తులు నా చెవులకు కర్ణపేయాలు కావు.
అయినా, వాటి మాధుర్యం, ఎన్నో నాళ్ల పరిచయం
నన్ను మరల జీవింపచేయ ప్రయత్నిస్తున్నవి.
ఒకప్పుడు పవిత్ర విశ్రాంతి దినాల్లో స్వర్గ చుంబనం
నాలో దివ్య ప్రేమను ప్రవేశపెట్టేది.
చర్చి గంటల చప్పుడు ఒక మార్మిక సంగీతమై ప్రవహించేది.
ప్రార్థించడమనేది పరమానంద దివ్యానుభూతిగా ఉండేది.
నన్నిప్పుడు నాకర్థం కాని ఏదో నిగూఢమైన వాంఛ పరుగులెత్తిస్తున్నది.
నన్ను దుర్గమారణ్యాల గుండా, మైదానాల మీదుగా!
అక్కడ నేను వేల కన్నీటి బాష్పాలుగా దుఃఖించి
నూతన ప్రపంచావిష్కరణను, నా జనన స్పర్శానుభూతిని పొందుతాను.

ఆ కీర్తనలు బాల్యంలో వసంత కాలాన
మేమాడుకున్న ఆటపాటలను జ్ఞప్తికి తెస్తున్నాయి.
ఆ చిన్ననాటి జ్ఞాపకాలు నన్ను ఇక్కడే కట్టిపడేస్తున్నాయి.
ఈ ఆఖరి నిర్ణయాన్ని నేను తీసుకోలేను.
ఈ ఘోరమైన చీకటి మెట్టుపై అడుగిడబోను.
ఓ స్వర్గలోకపు మధురమైన స్వరాల్లారా!
మునుపటి వలెనే నా కళ్లు వర్షిస్తున్నాయి;
నేనీ నేలను స్వచ్ఛమైన మమకారంతో– ప్రేమిస్తున్నాను!

**శిష్యుల బృందగానం:–**

సమాధి నుండి క్రీస్తు పైకెగసినాడు.
సజీవుడై, మృత్యుస్పర్శ లేనివాడై
అఖండ కీర్తి కాంతులతో ఆ రాజాధిరాజు
మరింత సృష్టినిర్మాణ కుశలుడై
స్వర్గంలోకి ఆతడు ఉద్గమించినాడు.
మన నేల తల్లి ఎదపై మనం దుఃఖించవలసిందే!
ఒంటరిగా ఈ ప్రవాసాన్ని మేమనుభవిస్తూ
ప్రభూ! నీవు మా కొసగిన ఆనందంలో జీవిస్తాము.

**దేవతల గానం:–**

సమాధి నుంచి క్రీస్తు లేచెను.
అవినీతి గర్భగుడి నుంచి లాగబడెను.
భూలోక బంధాలను ఆశపడేవాళ్లంతా
ఉవ్వెత్తున సంతోషపడండి!
ఆశీర్వదింపబడిన సోదరులు కొద్దిమంది
ప్రేమను పంచుకుని సేవించేవారు
ఆతని కార్యాలను ప్రస్తుతించండి!
మానవుని ఆశాకాంతిని ప్రకటించే
తీర్థయాత్రికుల పదాలను పలవరించండి!
మీ ప్రభువు దగ్గర్లోనే ఉన్నాడని తెలుసుకోండి,
చూడండి! అతడిక్కడే ఉన్నాడు! ఇక్కడనే వేచి ఉన్నాడు.

# 5. పట్టణ గోడల కావల

## (రకరకాల ప్రజలు వస్తూపోతున్నారు)

**కొందరు విద్యార్థులు:**
మీ గుంపు ఆ దారిన ఎందుకు పోతున్నారు?

**మిగతావాళ్ళు** : మేము వేట విడిదికి పోతున్నాం! మీకేమన్నా అభ్యంతరమా?

**విద్యార్థులు** : మేము 'మిల్లు' వేపు వెళ్తున్నాం. అంతే!

**ఓ విద్యార్థి** : నది పక్కన ఉన్న సత్రం చూడదగ్గది.

**ఇంకొకతడు** : పెద్ద దూరమేమీ లేదు కదా!

**మిగతావాళ్ళు** : నీ సంగతేమిటి?

**మూడవ విద్యార్థి** : నేను వాళ్లతో వెళతాను.

**నాల్గవవాడు** : కొండపైకి ఎక్కండి బర్గ్‌డార్ఫ్ చూడండి!
అందమైన ఆడపిల్లలు అక్కడే నడయాడుతున్నారు.
మంచి బీరు, సరసమైన పోట్లాటలకు స్థానమదే!

**అయిదవవాడు** : భలేవాడివయ్యా! మిత్రమా!
చెప్పుదెబ్బలు తినడానికి చెబుతున్నావొక మార్గాన్ని!
నేనటు రాను, నాకా గొడవలంటే పడదు, నిజం!

**ఓ పని పిల్ల** : నేనూ రానటు. మా యింటికి పోతాను.

**ఇంకొకతడు** : అతడు ఆ బూరుగుచెట్ల దగ్గర ఉంటానని చెప్పినాడు కదా!

**మొదటివాడు** : ఓహ్! నాకూ ఇష్టమే అటు రావడం.
నేనంటాను, అతడు నీతో నడుస్తున్నాడని
అతడు నర్తనశాలలో నీతో నృత్యం చేస్తాడు.
నీ సంతోషమిక నా ఆనందం కాబోదు.

**ఇంకొకడు** : అతడు ఒంటరిగా ఉండి ఉండడు.
వంకీల జుట్టున్న పిల్లగాడు అతడికి తోడు.

**ఓ విద్యార్థి** : వారి వంక చూడండి, మిత్రులారా! నరకలోకపు గంటలు!
నవ జవ్వనులతో నడుద్దాం కాసేపు

మంచి చురుకైన బీరు, కాస్త గంజాయి దమ్ము
ఓ సొగసుకత్తె తోడుంటే చాలు నాకు!

**ఓ యువతి** : ఆ కుర్రాళ్ల చురుకుదనం చూడు!
అవి పుకార్లను పురికొల్పుతాయి.
మనకి తోడుండటం మానేసి వాళ్లు ఎందుకు
ఆ వగలాళ్ల పొందుకు ఎగబడ్తున్నారు?

**రెండో విద్యార్థి** (మొదటి విద్యార్థితో) : మరీ అంత తొందరేల మనవెనకున్నారు మరో ఇద్దరు దోస్తులు.
అందమైన దుస్తులున్నవాళ్లు నాకు పరిచయస్తులు
వాళ్లలో ఒక పిల్లంటే నాకిష్టం, ఆమె ఏమన్నా అంటే నాకు కష్టం.
మౌనంగా, ప్రశాంతంగా వాళ్లటూయిటూ నడుస్తున్నారు.
మనల్ని వాళ్లకూడా తీసుకెళ్లడంలో కృతకృత్యులౌతారు.

**మొదటి విద్యార్థి** : వినయంగా ఉండేవాళ్లతో వినోదముండదు.
కాలయాపన వద్దు. గాలం వేద్దాం ముందు
శనివారం చీపురు పట్టిన చేయి
వారాంతపు శృంగారంలో పైచేయి.

**ఓ పౌరుడు** : నాకీ నగరాధ్యక్షుడంటే మండుతుంది వళ్లు,
మూర్ఖుడు! వాడు పట్టిన కుందేలుకు మూడేకాళ్లు!
వాడు పదవిలోకి వచ్చిందగ్గర్నుంచీ చూడూ
పరిస్థితులు దిగజారుడే దిగజారుడు.
కొత్తకొత్త నియమ నిబంధనలు, చట్టాలు.
పైగా కట్టాలి పన్నుపై పన్నులు వేలకు వేలు.

**అడుక్కునేవాడు** (పాడుతూ) : దయగల ప్రభువులు, ఎర్రగా బుర్రగా ఉన్న దేవతాస్త్రీలు
అందమైన దుస్తులు, ఏడు వారాల నగలూ ధరించినారు.
కనీసం రొట్టెకు నోచుకోని నన్ను కనికరించండి
కాసిని చిల్లర డబ్బుల్ని నాకు ధర్మం చేయండి.

రండి! నా తంబూర తంత్రుల శోకాన్ని వినండి!
ఆపదలో ఉన్న దురదృష్టవంతుడిని ఆదుకోండి!
అందరూ ఆనందించే ఈ మంచిరోజున
నాకూ నా గానం ఇవ్వదా కొంత సంపాదన!

**ఒక పౌరుడు** : సెలవు రోజున కాలక్షేపం చేయడానికి
యుద్ధవార్తలను మించిన దింకోటి లేనేలేదు.
ఎక్కడో 'టర్కీ'లో యుద్ధ బాకాల సవ్వడి
వాళ్లు కుత్తుకలు కోసుకుంటుంటే ఇక్కడ హడావుడి.

చక్కగా కిటికీ దగ్గర కూర్చుని, మధువు చప్పరిస్తూ
నదిలో సాగుతున్న ఓడల్ని చూస్తుంటే ఎంతో హాయి
సాయంకాలం అందరం ఒకరినొకరు అభినందించుకోవాలి
మనమున్న ప్రశాంత సంతోష పరిస్థితులకు ప్రతిరేయీ!

**మూడో పౌరుడు** : అవును, మిత్రమా, నీవన్నది మేలు! మేలు!
వాళ్లు వాళ్ల తలల్ని బద్దలు కొట్టుకోనీ,
ఈ ప్రపంచమంతా తలకిందులైపోనీ,
మన ఇళ్ల దగ్గర ఎప్పుడు ఇలా శాంతిగా ఉంటే చాలు!

**వృద్ధవనిత** : (జవ్వనులతో) కళ్లు చెదిరే అందాలున్న కన్యామణులారా!
మీ హొయలు చూసి ఏ యువకుడు ప్రేమ నర్థించడు?
కోప్పడవద్దు, నేనేమైనా తప్పుగా అంటే,
మీరు కోరితే, మీ కాంక్షా రథాన్ని నేను నడిపంచగలను.

**మొదటి యువతి** : అగాధా! యిటురా! మందిలో ఆమెకు కాస్త దూరంగా ఉండు!
అది ముసలి మంత్రగత్తె! దానికిప్పుడు రెండో చూపు!
అయితే ఒకటి నిజం, సెయింట్ ఆంద్రూ రాత్రప్పుడు
నాక్కాబోయే హృదయేశ్వరుడిని, రప్పించింది నా ఎదుటకు!

**రెండవ యువతి** : నాకూ చూపించింది అంజనం వేసి అద్దంలో
యువ సైనికుడిని, అతడి మిత్రబృందాన్ని!
ఇక్కడ అన్ని దిక్కులా, అతడి కోసమే వెదుకుతున్నాను.
కనుచూపు మేరలో కనుపించాడతడు –అడుగో! అతగాడు.

**సైనికులు** : కోటను చూపించండి, గట్టి కాపలా కాస్తాం!
మంచి భామ నివ్వండి, మనసారా ఆనందిస్తాం!
మేం మహావీరులం, రణరంగ ధీరులం!
యుద్ధంలో ప్రేమలో, గెలిచినవన్నీ మా స్వంతం!
కొమ్ముబూరలు, యుద్ధగీతాలు మా రాకను చెబుతాయి.
మమ్మల్ని హుషారుగా విధ్వంసానికి పురికొల్పుతాయి.

ఇదే మా ఆరాటం! ఇదే మా పోరాటం!
కోటలైనా, కోమలులైనా వాటి రక్షణ చిదిమేస్తాం;
యుద్ధంలో, ప్రేమలో గెలిచినవన్నీ మా స్వంతం!
సైనికులారా కదలండి! విజయం మనదే పదండి!

**(ఫాస్ట్, వాగనర్‌ల ప్రవేశం)**

**ఫాస్ట్** : నదిపై మంచు కరుగుతున్నది, మంచు ఏటిలో కలుస్తున్నది.
వసంత కాలపు సూర్యకిరణాలు దానికి స్వేచ్ఛనిస్తున్నవి.
కొత్త జీవంతో, కొంగొత్త ఆశలతో లోయలు తొణికిసలాడుతున్నవి.
శీతాకాలం ఓడిపోయి – చూడు ఎలా అది శీఘ్రంగా
పర్వతసానువుల వేపు పారిపోతున్నదో!
మైదానాలు ఆకుపచ్చగా మారగానే వర్షం
దొంగచాటుగా వచ్చి వడగళ్ల దెబ్బకొట్టి మాయమవుతుంది.
ఎక్కడ చూసినా తెల్లదనాన్ని సూర్యుడిహ సహించడు–
భూమి తేరుకోగానే అన్ని రంగుల్ని ఆహ్వానిస్తాడు;
అన్నీ తుళ్లుతూ పెరుగుతూ ఉండేటప్పుడు
పల్లెల్లో ఇంకా పూలు పూయని లోటు కనిపిస్తుంటుంది.
అందుకని ప్రజలందరూ చక్కగా అలంకరించుకుని
సుతి వెచ్చని ఎండలోకి సున్నితంగా అడుగుబెడతారు.
మనం నిలబడిన చోటు నుంచి నగరం వేపు చూడు!
ఆ నల్లటి, ఏడ్పుగొట్టు నగర ద్వారాలను చూడు
జనాలు వాటిని దాటుకుని గుంపులుగా ఎలా వస్తున్నారో
వాళ్లు ఏదో పండుగ జరుపుకుంటున్నారు కాబోలు,
దేవుని పునరుత్థానం గురించే అనుకుంటున్నాను నేను.
మళ్లీ రోజున లేచి స్వేచ్ఛగా ఆనందిస్తున్నారు.
ప్రతిరోజూ తిరిగే చీకటి కొట్టాలనే వాళ్ల ఇళ్లను వదిలి
వాళ్ల పనుల్ని, వృత్తుల్ని, వెట్టిచాకిరిని వదిలి,
ఆనందాన్ని అణిచే చీకటి కొంపల్ని వదిలి,
క్రిక్కిరిసిన జనంతో ఉక్కిరిబిక్కిరి చేసే వీధుల్ని వదిలి
చర్చి దేవాలయాల పవిత్ర భక్తిరాత్రుళ్లను వదిలి
వాళ్లందరూ ఇప్పుడు వెలుగులోకి వచ్చారు.
వాళ్లు ధరించిన రంగురంగు వస్త్రాలలో ఆనందం వెల్లివిరుస్తోంది.

మనం గ్రామాన్ని సమీపిస్తున్నాం!
ఆ అమాయక గ్రామీణుల ఆనందపు ధ్వనులను నేను వింటున్నాను.
వాళ్లు సంతోషంతో కేకలు వేస్తున్నారు. చిందులు తొక్కుతున్నారు.
ఇక్కడ నేను మామూలు మనిషిని!
నేనూ ఆనందిస్తాను ఈ సందడిని!

**వాగనర్** : మీతో రావడం ఓ గొప్ప అనుభూతి.
జ్ఞానితో సంభాషణ ఎంతో మనఃప్రీతి.
నేను ఒక్కడినే వస్తే వేరే విధంగా తలపోసేవాడిని.
ఇదంతా మోటుగా, సంస్కారహీనంగా ముద్ర వేసేవాడిని.
వాళ్ల కేకలు, ఆర్భాటాలు, పెడబొబ్బలు
నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి, కాని ఎందుకో అవి నచ్చవు.
ఏదో పూనినట్లు వాళ్లు ప్రవర్తిస్తున్నారు.
అదేం సంతోషమో, గానమో వాళ్లకే తెలియాలి!

**గ్రామీణుల పాట:–** (నిమ్మచెట్టు క్రింద ఆడుతూ పాడుతూ)
గొర్రెలు కాసే పిల్లగాడు రంగు గుడ్డలేసుకుని
రాత్రిపూట వచ్చాడు రయ్‌రయ్‌మన్నాడు.
ఊరంతా ఉరికింది ఆడిపాడి మురిసింది.
నిమ్మచెట్టు చుట్టూరా నిలవకుండా ఆడింది.

హే–హో, హే–హో
హే–హొప్పి, హొప్పి–హో
వాయిస్తూనే వున్నాడు ఆ ఫిడేలు వాద్యగాడు– ఓహో!

అందరూ ఆనందంగా గిరికీలు కొడుతుంటే
పిల్లగాడి మోచేయి ఓ పిల్లదాన్ని పొడిచింది.
అయినా ఆ పిల్లగాడి దారికి అడ్డమెందుకొచ్చింది? ఓహో!
కన్నెపిల్ల వెనక్కు తిరిగి కసిరింది వాడిని.
'కళ్లు కనబడడం లేదా, చూసుకో' –పొమ్మంది
హే–హో, హే–హో
హే–హొప్పి – హొప్పి–హో
'ఒళ్లు కాస్త జాగ్రత్తగ ఉంచుకో' – పొమ్మంది – ఓహో!

అయినా ఇద్దరూ కలిసి అన్యోన్యంగా ఆడారు
కుడివేపు, ఎడంవేపు, గుండ్రాలు తిరిగారు.
వాళ్ల దుస్తులన్నీ వయ్యారంగా ఊగాయి, ఓహో!
చక్కగా వళ్లంతా చెమటలు కమ్మేవరకు
అలిసి సొలిసి కౌగిలిలో ఒరిగిపోను ఆడారు
    హే-హో, హే-హో
    హే-హొప్పి-హొప్పి-హో
ఇప్పుడామె నడుము కాతడి మోచేయి తగల్లేదా, ఓహో!

'నాతో ఇట్లా మళ్లీ నాటకాలెయ్యమాక!'
మీ మగాళ్లంతా ఇంతే, మగువల్నేమారుస్తారు.
పని పూర్తయ్యేంత వరకూ పాదాలంటుకుంటారు, ఓహో!
అన్నది కాని, ఆ పిల్ల అతడితోటె తిరిగింది.
నిమ్మచెట్టు కింద వాళ్లు బిగ్గరగా అరిచారు-
    హే-హో, హే-హో
    హే-హొప్పి-హొప్పి-హో
అందరూ కేకలేస్తూ హాయిగా ఆడారు-ఓహో!

**వృద్ధ గ్రామీణుడు:**

అయ్యా డాక్టరు గారూ! మాతో ఈస్టర్ నడకకు
వచ్చేందుకు అంగీకరించి మమ్మల్ని ధన్యుల్ని చేసినారు.
మా పేద ప్రజలపై మీవంటి జ్ఞానుల
చూపు పడడం మా అదృష్టం.
అయ్యా! అందుకోండి ఈ మధుపాత్రను
మీకోసమే మేం దానిని నింపి ఉంచినాము.
ఇది మీ దాహాన్ని తీరుస్తుందని మా నమ్మకం.
ఈ మధుపాత్రను పైకెత్తి పలుకుతున్నాను.
ఈ మధు బిందువులు మీ ఆయుస్సును పెంచును గాక!

**ఫాస్ట్** : కృతజ్ఞుడిని. ఈ మధువు నన్ను స్వస్థపరచినది.
నేను నా కృతజ్ఞతను మీకు తెలుపుకుంటున్నాను.

**(ప్రజలు చుట్టూ మూగినారు)**

**గ్రామీణుడు :** సంతోషం! ఈ శుభసమయాన తమరిక్కడికి
విచ్చేయడం మాకు చాలా ఆనందాన్నిస్తున్నది.
చానాళ్ల క్రితం మా పరిస్థితులు దారుణంగా ఉన్నపుడు
మమ్మల్ని ఆశీర్వదించి స్వస్థపరచినారు.
మీ తండ్రిగారు ప్లేగు వ్యాప్తిని అరికట్టి ఉండకబోతే
ఇప్పుడు జీవించివున్న మా బోంట్లలో చాలామంది
ఎప్పుడో మరణించి ఉండేవాళ్లు.
ఆనాడు బాలుడిగా ఉన్న తమరు ప్రతి
వైద్యశాలను సందర్శించినారు.
ఎన్ని శవాలు బయటకు వెళ్లినా
తమరు ఆ మహమ్మారి బారిన పడక బట్టగట్టినారు.
ఎన్ని కష్టాలలో తమరున్నా
మాకు సాయం చేసినారు, దేవుడు తమను అనుగ్రహించినాడు.

**అందరూ :** దీర్ఘాయుష్షు మన డాక్టరు గారికి!
అతడు మనలను చిరకాలము రక్షించును గాక!

**ఫాస్ట్ :** నాకీ నేర్పును అనుగ్రహించిన ఆ ప్రభువుకు
మానవతను మంచిదారిన నడిపే ఆతడికి కృతజ్ఞతలు తెలపండి!
**(వాగనర్‌తో కలిసి వెళతాడు)**

**వాగనర్ :** ఈ ప్రజలందరూ మిమ్మల్ని గౌరవిస్తుంటే
నా హృదయం ఎంత గొప్పగానో ఉప్పొంగుతున్నది.
తనకున్న శక్తులతో శ్లాఘింపబడేవాడు
అందరికన్నా హాయిగా, న్యాయంగా ఆనందిస్తాడు కదా!
మీరు వెళ్తుంటే తండ్రులు తమ కుమారులకు సంజ్ఞలు చేస్తారు.
అందరూ మీవేపు మెచ్చుకోలుగా చూస్తారు.
తంబూర ఆగిపోతుంది. నాట్యాన్ని చూస్తున్న ప్రేక్షకులు
మిమ్మల్ని దర్శించ ఉవ్విళ్లూరతారు.
ఆకాశం హర్షధ్వానాలతో ప్రతిధ్వనించి, టోపీలు గాలిలో ఎగుర్తాయి.
మోకాళ్లపై కూలబడి వాళ్లు అభివాదం చేస్తారు,
పవిత్రాత్మను తీసుకువెళ్తున్న పల్లకిని చూస్తున్నట్లు!

ఫాస్ట్ : కాసింత దూరం నడిచి, ఆ కనబడే రాయి దగ్గర
కాసేపు విశ్రాంతి తీసుకుందాం. ఇక్కడే నేను
కూర్చుని ధ్యాన నిమగ్నుడనయ్యేవాడిని.
ఉపవాస దీక్షలో, ఉప్పొంగే ప్రార్థనలతో
పూర్తి ఆశతో గాఢ విశ్వాసంతో
స్వర్గలోకపు నిర్ణయాన్ని మార్చగలననుకున్నాను.
మూలిగాను, దుఃఖంతో చేతులు నలుపుకున్నాను.
మహమ్మారి ప్లేగు మానవ ధ్వంసం కానిస్తూనే ఉన్నది.
కాని, ఇప్పుడు ఈ ప్రజల మెచ్చుకోలు నన్ను ఎగతాళి చేస్తున్నది.
నీవు నా మనసును చదవగలిగితే,
మేం చేసింది ఎంత అల్పమో నీకు తెలిస్తే
నేనూ, నా తండ్రీ ఇటువంటి పొగడ్తలకు అర్హులం కాదు!
మా తండ్రి ఎంతో గౌరవంగా, అయినా అనామకంగా
నిజాయితీగా, విశ్రాంతి లేకుండా శ్రమించాడు.
తన తిక్క విధానాలు తనకున్నాయి.
ప్రకృతి పవిత్ర ధర్మాలను, నిరంతర పరిభ్రమణాలను
తనచే ఆశీర్వదింపబడిన కొద్దిమందితో
చీకటి ప్రయోగశాలలో పరిశోధనలు చేసినాడు.
దీన్నీ దాన్ని కలిపి కొత్త రసాయనం సృష్టించి
పదార్థాలు తెలియని ద్రావకాలను తయారుచేసి
లిల్లీపూవుకు సింహానికి జతకట్టేవాడు.
వాటిని గాజు గదులో తిప్పుతూ
ఆ రెండు మూలకాల సంయోగంలో పుట్టిన
కొత్తరాణికి నూతన నామకరణం చేసేవాడు.
సప్తవర్ణాల మిశ్రమాన్ని మందుగా వాడేవాడు.
చచ్చేవాళ్లు చచ్చేవారు. బతికినవాళ్లు ఏమని అడగరు!
అందరికీ ఈ మందెందుకు పనిచేయదని ఎవ్వరూ మందలించరు.
ఈ లోయల్లో, గ్రామాల్లో మా మందుల్ని
పీడకు విరుగుడుగా విరజిమ్ముతూ
ప్లేగు కన్నా విస్తారంగా వ్యాపించి దూరతీరాలకు చేరిపోయాం.
నా మట్టుకు నేను వేలాదిమందికి ఆ విషం ఇచ్చాను.
వాళ్లు ఎండిపోయి నాశనమవడం కళ్లారా గమనించాను.
ఆ సామూహిక హత్యలు చేసిన హంతకుల్ని వీళ్లు పొగుడుతున్నారు.

**వాగనర్** : ఆ విషయం మిమ్మల్ని కలవరపరచనీయకండి!
సంక్రమించిన నేర్పరితనాన్ని ధర్మాధర్మ వివేకంతో
మంచి మనస్సుతో ఇతరులకు సాయం చేయడమే
నిజాయితీ గల మానవుడి విద్యుక్త ధర్మం.
యువకుడిగా ఉన్నపుడు తండ్రిని గౌరవించినవాడు
అతడి నుంచి ఆనందంగా నేర్చుకోగలడు.
మనిషిగా సత్యాన్ని పాదుకొల్పినవాడు అతడు–
అతడి కుమారుడు మరింతగా శోధించగలడు.

**ఫాస్ట్** : నీవన్నది నిజమనేవాళ్లు నిజంగా సంతోషిస్తారు.
అజ్ఞానం మనచుట్టూ సముద్రంలా కమ్ముకున్నది.
నిజంగా కావాల్సింది ఎవరికీ తెలియదు.
అందరికీ తెలిసింది ఎందుకూ పనికి రానిది.
ఈ నిరాశాపూరితమైన ఆలోచన్లను పారద్రోలి
విలువైన సమయాన్ని తెలివిగా వినియోగిద్దాం!
ఆ చిన్ని గుడిసెలు, చుట్టూరా ఆకుపచ్చదనంతో
పగటి వెలుగు ఆఖరి కిరణాలు తాకి ఎలా ప్రకాశిస్తున్నాయో!
సాయంకాలం పూర్తికాగా సూర్యుడు పడమట కేగుతున్నాడు.
కాని మరొక చోట నూతన కాంతులను వెదజల్లుతాడు.
నాకే రెక్కలు ఉంటే, ఆతడి ననుసరించనా!
నేనలా పోతున్నకొద్దీ నా వెనుక ఎల్లప్పుడూ
నిశ్శబ్ద సంధ్యాసమయం ప్రపంచమై విలసిల్లదా!
కొండలు ప్రకాశిస్తూ, లోయలు స్వప్నాల్లో నిష్క్రమిస్తూ
వెండి సెలయేళ్లు స్వర్ణకాంతిలో పరవళ్లు తొక్కుతుంటే
ఏ పర్వత సముదాయాలు నన్ను నిలువరించగలవు?
ఏ అగాధపు లోతులు నన్ను తమవద్ద ఆపగలవు?
అచ్చెరువందుతున్న నా నేత్రాలను విశాల సముద్రం పిలుస్తున్నది.
సూర్యకిరణాలు మెరుస్తున్న తన అఖాతాల చేతులు సాచి!
దేవుడు అస్తమించ నిశ్చయించుకున్నాడు, కాని
నాలో ఏదో నూతన స్పందన ప్రారంభమయ్యింది.
ఆ అనంతకాంతిని సేవించ నేను వేగిరపడ్తున్నాను.
పగలు ముందు, నా వెనుక రాత్రి,

పైన ఆకాశం, కింద అలల సముద్రం...
అద్భుతమైన కల సూర్యునితోపాటు అదృశ్యమవుతుంది.
ఆత్మకు రెక్కలు మొలిచినా, ఈ శరీరం నేలకు అతుక్కుని ఉంటుంది.
సహజ ప్రవృత్తులు మన హృదయాలను ఉత్తేజపరచి పైకెగుస్తాయి.
అప్పుడు మనకు భరతపక్షి పాట వినీలాకాశంలో మిళితమవుతూ కనిపిస్తుంది.
రెక్కలు విప్పార్చుకు ఎగుర్తున్న గరుడపక్షి పైన్ వృక్షాలు
పరచుకున్న కొండ శిఖరాలపై ఎగుర్తుంటే మనం చూస్తాము.
చిత్తడి నేలలున్న సరస్సులపై తెల్లటి కొంగ ఎగుర్తూ
ఇంటిముఖం పడ్తున్న దృశ్యం మనల్ని మరలా వెంటాడడం గమనిస్తాము.

**వాగనర్** : నాకూ మనసు చేసే మాయలు తెలుసు, కాని
మీరు వివరించినట్టి దృశ్యాలు నేనెన్నడూ అనుభవించలేదు.
అరణ్యాలు, కొండలు, మైదానాలు విసుగు పుట్టిస్తాయి.
రెక్కల్తో ఎగుర్తున్న ఏ పక్షీ నా దృష్టినంతగా ఆకట్టుకోలేదు.
కాని జ్ఞాన సంబంధకమైన విషయాలు గ్రంథాల్లో ఉన్నవి
మొదటి నుంచి చివరి వరకూ చదివేప్పుడు కలిగే సంతృప్తి వేరు!
శీతాకాలపు రాత్రుళ్లు ఎంత వెచ్చగా పలకరిస్తాయి,
మన నరాల్లో ఎంత మంచి జీవితం ఉరకలెత్తుతుంది!
పాత గ్రంథ ప్రతి, స్వర్గానికి ప్రతిరూపమే,
మన శ్రమకు తగిన పారితోషికం పార్చ్‌మెంట్ కాగితమే!

**ఫాస్ట్** : మన అవసరాల్లో ఒకదానిని నీవు అర్థం చేసుకున్నావు.
రెండవ దానిని తెలుసుకోవద్దు! జాగ్రత్త!
నాలో రెండు ఆత్మలున్నాయి. అయ్యో!
వాటి విభజన నా జీవితాన్ని రెండుగా చీల్చివేస్తున్నది.
ఒకటి ఈ ప్రపంచాన్ని ప్రేమించి, దానిని పట్టుకుని వేలాడుతూ,
తనను దానికి భయంకరమైన కామంతో బంధించుకున్నది.
రెండవది ఈ దుమ్ముకన్నా పైకెగసి
పూర్వీకుల మనోలోకాల్లో తిరుగాడుతున్నది.
భూమ్యాకాశాల మధ్యలో ఉన్న గాలిలో
తిరుగాడే ఆత్మలే లేవా? ఉంటే,
ఆ స్వర్ణ పొగమంచు నుంచి బయల్పడి
నావేపుకు తరలిరండి!
అనేక రంగులున్న ఆ ప్రపంచంలోకి నన్ను కొనిపొండి!

నాపై ఓ మంత్రపు అంగీని తొడిగి
పేరు తెలియని సుదూర ప్రాంతానికి తీసుకొనిపొండి!
పట్టువస్త్రాలకో, స్వర్ణాభరణాలకో,
రాజకిరీటానికో నేను ఆ అవకాశాన్ని వదులుకోబోను.

**వాగనర్** : వాతావరణాన్నంతా కలుషితం చేసే ఆ భయంకర
దురాత్మ నిక్కడకు ఆహ్వానించవద్దు!
భూమి అంచుల నుంచి అవి పెల్లుబుకి వచ్చి
వేయి రూపాలలో మానవుడిని వేధిస్తాయి.
ఉత్తరాన్నుంచి ఎగిరివచ్చే కోరదంతాల దెయ్యాలు
తమ బాణపు ములికి నాలుకలతో దాడి చేస్తాయి.
తూర్పుగాలికి వచ్చే భూతాలు, మన గాలిని పీల్చుకుని
ఊపిరితిత్తుల్ని ఎండబెట్టి వాటి ఆకలి తీర్చుకుంటాయి.
దక్షిణపు ఎడారి దయ్యాలు మన తలలపై
జ్వాలా కిరణాలను పంపి మాడ్చివేస్తాయి.
పడమటిగాలులు మనకు ప్రశాంతతనిచ్చినట్లే ఇచ్చి
ఉరుములు, మెరుపులు, పిడుగుల వానా వరదల్తో ముంచేస్తాయి.
మనమేమంటున్నామో చెవులు నిక్కబొడుచుకుని వింటాయి.
సందు దొరికితే చాలు మనల్ని సర్వనాశనం చేస్తాయి.
స్వర్గాన్నుంచి దిగివచ్చిన దేవదూతల్లా కనిపిస్తాయి.
మధురమైన గొంతుతో అబద్ధాల్ని వల్లిస్తాయి.
పదండి పోదాం! శీతల గాలులు వీస్తున్నాయి.
చీకటి తెరలు పడ్తున్నాయి! ఇప్పుడు
ఇంటిలో నాలుగు గోడల మధ్య ఉండటమే హాయి.
ఎందుకలా ఆశ్చర్యంగా ఎటో చూస్తున్నారు?
ఏ సంధ్యాసమయపు విషయం మీ ఆసక్తిని ఆకట్టుకున్నది?

**ఫాస్ట్** : దూరంగా అక్కడ – మొక్కజొన్న మోడుల మధ్య
ఒంటరిగా ఉన్న నల్లకుక్క! కనబడుతోందా!

**వాగనర్** : కనిపిస్తోంది! దానిలో ఏమిటి విశేషం?

**ఫాస్ట్** : నీవేమనుకుంటున్నావు? నీ కళ్లకు పనిచెప్పు!

**వాగనర్** : మామూలు ఊరకుక్క. బహుశా
యజమాని కనపడక తిరుగుతోందనుకుంటాను!

**ఫాస్ట్** : మనకు దగ్గరగా వస్తోంది, వలయాలుగా తిరుగుతోంది.
చిన్న చిన్న వలయాలుగా, నా ఊహలో పొరపాటు లేదు
అదిగో చూడు, కనిపిస్తుందా మిత్రమా నీకు!
దాని వెనుక ప్రకాశిస్తున్న జ్వాలా వలయపు జాడ!

**వాగనర్** : నాక్కనిపిస్తుందల్లా ఓ నల్లకుక్క రావడం!
ఏ కాంతి తంత్రమో మీ కళ్లను మోసం చేస్తోందని నా నమ్మకం!

**ఫాస్ట్** : ఏదో మాయను అది పేనుతున్నది.
మన కాళ్లకేదో బంధాన్ని వేయనున్నది.

**వాగనర్** : అందుకే మన చుట్టూరా తిరుగుతున్నదా!
యజమాని కాని యజమానులుగా భావిస్తున్నదా!

**ఫాస్ట్** : వలయం గతించినది. అదిప్పుడు మన నేలపై ఉన్నది.

**వాగనర్** : చూడండి! ఇదేం మాయాజీవం కాదు! మామూలు శునకం!
ఇంకా అనుమానం తీరక నేలమీద పొర్లుతూ మొరుగుతున్నది
తోకూపుతూ పడుకుంటున్నది, అన్ని పెంపుడు కుక్కల్లానే!

**ఫాస్ట్** : మా దగ్గరకురా! ఇటురా! ఇటు!

**వాగనర్** : ఇది మామూలు కుక్కపిల్ల
మనం నిలబడితే మన చుట్టూరా వేస్తుంది గంతులు.
పలకరిస్తే, మనపై పెడ్తుంది తన ముందు కాళ్ల పాదాలు
ఏదైనా పడేస్తే, చటుక్కున పట్టుకుని మనకిస్తుంది
నీళ్లలోనైనా దూకి మనం విసిరిన కర్రను తెస్తుంది.

**ఫాస్ట్** : నీవన్నది నిజమే! దీనిలో ఏ ఆత్మా దూరలేదు.
శిక్షణ ఇవ్వబడిన చిన్ని కుక్క ఇది అంతే!

**వాగనర్** : బాగా శిక్షణ పొందిన శునకం
చదువుకున్నవాళ్ల ప్రాపకాన్ని త్వరగా గెలుపొందును.
మన విద్యార్థులు దీనికి విధేయత నేర్పుతారు.
ఆనక అది తన గురువులకే నేర్పుతుంది గుణపాఠాలు.

**(వాళ్లు ద్వారం దాటి నగరంలోకి ప్రవేశిస్తారు)**

# 6. ఫాస్ట్ - చదువుకునే గది-1

ఫాస్ట్ : (కుక్కపిల్లతో ప్రత్యక్షం)
కొండగుట్టల్ని పొలాల్ని వదలి ఇటువచ్చాను.
రాత్రి నల్లటి ముసుగు వాటిని కప్పివేసింది.
మనలోని మంచిభాగాన్ని మేల్కొల్పిన రాత్రి
ఆత్మను పవిత్ర భయంతో నింపివేస్తుంది.

చురుకైన సంఘర్షణ నా మనస్సును వీడింది.
విశృంఖల ఉద్వేగాలు నిద్రించి నిలిచిపోయాయి.
నేనిప్పుడు మానవజాతిని ప్రేమిస్తున్నాను.
దేవునిపై ప్రేమతో మనశ్శాంతిగా ఉన్నాను.

పరుగెత్తడం ఆపు అల్లరి కుక్కా!
ఎందుకు తలుపు దగ్గర తారట్లాడ్తావు?
పొయ్యి దగ్గరకు పోయి కదలకుండా పడుకో!
మెత్తటి దిండు నీకోసం, అంతకంటే ఇంకేమీ నేనివ్వలేను.
నీవా కొండమీద నుంచి దిగివస్తున్నపుడు
ఆ తీరు నాకెంతో వినోదాన్ని కలిగించింది.
కావాలంటే నీకిప్పుడు చూపిస్తాను తమాషా!
నా అతిధివికా, కాకపోతే నిశ్శబ్దం పాటించు హమేషా!

మన ఈ చిన్ని ఇరుకు గదిలో
తెల్లటి ప్రకాశవంతమైన దీపపు వెలుగులానే
మన హృదయం, మనసులో ఆత్మజ్ఞానం
తన కరుణాకాంతులను వెదజల్లుతున్నది.
వివేచన మరోసారి విడమరుస్తున్నది.
ఆశ మరలా పుష్పిస్తున్నది.
మనం జీవితమూలాల్ని, జీవితపు జలధారను
కనుగొని జీవజలాన్ని రుచి చూసేందుకు నిరీక్షిస్తున్నాం.
శునకమా! మొరగడం ఆపు!
అది నా స్వరధునితో సమానంగా లేదు.
నా ఆత్మానందస్థితి నీ జంతుధ్వనితో అస్థిరమవుతున్నది.

మానవుడు తాను అంతకుముందు కనీవిననివాటిపై
ఎంతటి తృణీకారాన్ని, ఎగతాళిని కలిగి ఉంటాడో మనకు తెలుసును.
మంచిది, అందమైనది, సత్యమైనది
దానిని చూసి కూడా కుక్కలు మొరగవలసిందేనా?

కాని, ఇప్పుడు నా హృదయంలోని ప్రగాఢ సంతృప్తి
అయ్యో! ఎందుకో పెల్లుబుకడం లేదు.
నా ప్రయత్నాలన్నీ వ్యర్థమై, ఏరు ఎండిపోతున్నది.
మరల దాహంతో నాలుక పిడచకడ్తున్నది!

ఇలా ఎన్నిసార్లు జరిగినా, నా దగ్గర దీనికో విరుగుడుంది.
మనం ఒక ఉన్నత ప్రేరణను పొందుదాం
ఓ అధిమానవ దివ్యజ్ఞానాన్ని–
సంపూర్ణకాంతితో ప్రకాశించే ఈ దీపం ఉండేదెక్కడ?
పాత నిబంధన దైవవాక్కు కథలో కాదా!
ఇదిగో గ్రీకు ప్రతి. వాటి బీజాక్షరాలనుచ్ఛరిస్తాను.
వాటిని స్పష్టంగా, సత్యంగా అనువదిస్తాను.
నా ప్రియమైన జర్మనీ భాషలో పొందుపరుస్తాను.

**(ఒక గ్రంథాన్ని తెరచి రాయడం మొదలెడ్తాడు)**

"ప్రారంభమందు 'వాక్కు' ఉండెను"––
ఏమిటీ వింత. మొదటి వాక్యంలోనే ఏదో అడ్డంకి!
ఎలా మార్చాలి? 'వాక్కు' అంత గొప్పదా?
మరో రకపు తర్జుమా ఉండి ఉంటుంది.
దివ్యాత్మ ప్రేరణతో దానిని నేను మారుస్తాను.
ప్రారంభమందు 'మనసు' ఉండెను––
ఇలా వ్రాసేముందు మరొొక్కసారి ఆలోచించు.
త్వరపడే కలానికి మంచి ఆలోచన అందదు.
ప్రపంచాలను సృష్టించే క్రమంలో 'మనసు'కు చోటెక్కడ?
'ప్రారంభమందు 'శక్తి' ఉండెను"....
ఇది సరైన పదం కావచ్చు– కాదు కాదు.
వ్రాద్దామంటే ఏదో అంతఃప్రేరణ నన్ను ఆపేస్తున్నది.
ఆత్మ పలుకుతోంది! నేనెలా రాయాలో చూస్తున్నాను–

'ప్రారంభమందు 'పని' ఉన్నది.
అది 'ఆచరణ', ఉద్దేశపూర్వక కార్యమది.
మనం మనశ్శాంతిగా ఇక్కడ కూర్చోవాలంటే
శునకమా! నీ సణుగుడు తగ్గించు!
ఈ మొరుగుడు, గొణుగుడు ఆగిపోవాల్సిందే!
నా ఆహ్వానం నీలాంటి వాగుడుకాయకు కాదు.
చదువుకునే గదిలో సందడికి వీలు లేదు.
నీవో, నేనో బయటకు వెళ్లిపోవాలి.
మనం విడిపోవాల్సివస్తున్నందుకు నాకు బాధగానే ఉన్నది.
తలుపు తెరిచే ఉన్నది, నీవు వెళ్లవచ్చు!
మరిదేమిటి నేను చూస్తున్నది?
ఇలా సహజంగా జరుగుతుందా?
ఇది నిజమా లేక స్వప్నమా?
చిన్ని కుక్క ఎంత పెద్దగా మారుతున్నది!
నిలబడుతూ ప్రవర్ధమానమవుతున్నది.
ఇది కుక్కకాదు. నా దృష్టి చెదరలేదు.
ఎటువంటి పిశాచ శునకాన్ని తెచ్చాను నేను!
హిప్పొపొటామస్‌లా ఉందిప్పుడు
భయంకరమైన దవడలు, జ్వలిస్తున్న కళ్లు
ఆహా! ఆశ్చర్య భయాల్ని కలిగించే వళ్లు.
నరకలోకపు జాగిలం లాంటి దీనితో– ఈ మంత్రం–
సొలమన్ ప్రభువు బీగం – పనిచేస్తుంది బాగా!

**ఆత్మలు** : (బయట కాలిబాటలో)
అతడు పట్టుబడ్డాడు! నాకు తెలుసు అతడు పట్టుబడ్డాడని!
అతడి ననుసరించకు! ఆ చీకటిలోకి వెళ్లకు!
ఉచ్చులో పడ్డ నక్కలా
నరకలోకపు జంగుబిల్లి వలలో పడింది! జాగ్రత్త!
కాస్త ఆగు! ఆగి చూడు
పైకీ కిందకు పల్టీలు కొట్టీ కొట్టి
మొత్తానికది తప్పించుకుంటుంది.

అతడికి మన చేయినందిద్దాం!
అతడికి మనం తోడుందాం!
అతడు మనతో మంచిగా ఉన్నాడు,
అతడు మంచి కార్యాలే చేసినాడు!

**ఫాస్ట్** : ఈ మృగాన్ని జయించడానికి, Spell of the four -
చతుర్జీవ బంధనం గావిస్తాను.
సాలమాండర్, కాలిపో!
జలకన్యా! మెలికలు తిరుగు!
సిల్ఫ్ దయ్యమా! గాలిలో కలిసిపో!
గోబ్లిన్ భూతమా! గోతిలో మునిగిపో!
మూలకాలు తెలిస్తే, వాటి ప్రవృత్తులు అర్థమైతే
వాటన్నిటిపై ఆధిపత్యం మన స్వంతమే!
ఈ జ్ఞానం, వాక్ శక్తితో నేనాజ్ఞాపిస్తాను–
జ్వాలల్లోని సాలమాండర్! వచ్చిన దారిలో అదృశ్యమైపో!
వలయాల్లోని జలకన్యా! కళవళపడుతూ కలిసిపో!
సిల్ఫ్ జీవరూపమా! ఉల్కాపాతమై మెరిసిపో!
ఇంకుబస్, ఇంకుబస్! మా ఇంటి సేవకుడివైపో!
అతడిని వదిలిరా! నీ నిజస్వరూపాన్ని చూపించు!
ఏమిటీ మాయ! నేను పిలిచిన నలుగురూ
నా గుమ్మం దాటలేదు! ఆ మృగం నన్ను చూసి నవ్వుతున్నది!
దానిని నేనింకా బాధించలేదు, అయినా నేను పాడగలను!
మరింత శక్తివంతమైన మంత్రగానం!
నరకం నుంచి వచ్చావా నరలోకంలోకి నీవు?
చీకటి దేవతలు సైతం, భయపడే గుర్తుల్ని చూడు!
ఆ మృగపు వెన్ను ఇప్పుడు వెదజల్లుతున్నది అగ్నిజ్వాల!
కరుడు గట్టిన పాపీ!
ఈ పేరు చదవగలవా!
నామరహితుడు, సృష్టించబడనివాడు,
కాలరహితుడు, అన్ని లోకాలలో ఒక్కడై ఉన్నవాడు
అధార్మికమైన ద్వేషంతో బాధింపబడినవాడు?
నా మంత్రోచ్ఛారణకది పొయ్యివెనుక దాగుచున్నది.

ఏనుగులా ఉబ్బుతూ ఈ గదిని ఆక్రమించుకున్నది.
పొగమంచులా కరిగిపోవాలనుకుంటున్నది.
నేను నిషేధిస్తున్నాను– పైకప్పును తాకవద్దు!
నీ యజమాని పాదాల వద్ద పడుకో! నేనాజ్ఞాపిస్తున్నాను!
నేను వృధా హెచ్చరికలను చేయడం లేదు, తెలుసుకో!
పవిత్రాగ్నితో నిన్ను భస్మం చేయగలను!
మూడు వెలుగుల కాంతిశక్తిని
మూర్ఖపు అంచనా వేయవద్దు!
శక్తివంతమైన నా మంత్ర ప్రభావాన్ని
సవాల్ చేసే సాహసం చేయవద్దు!

**మెఫిస్టాఫిలిస్:** **(అదృశ్యమవుతున్న పొగమంచులోంచి, పొయ్యి వెనక నుండి మధ్యయుగపు సంచార విద్యార్థిలా ప్రవేశం)**
'ఏమిటీ గొడవ? తమకు నేనెలా సాయపడగలను?'–

**ఫాస్ట్** : ఇదన్నమాట శునకపు నిజస్వరూపం!
ఓ కుర్ర విద్యార్థి కుక్కరూపం! ఎంత వినోదం!

**మెఫిస్టాఫిలిస్ :** అయ్యా! మీ జ్ఞానానికి, హాస్యప్రియత్వానికి శిరఃప్రణామాలు!
నాకు చెమట పుట్టించారు, ఇది నా ఒప్పుకోలు!

**ఫాస్ట్** : నీ పేరు?

**మెఫిస్టాఫిలిస్ :** ఈ ప్రశ్న అసంగతమైనది. ముఖ్యంగా
తమవంటి జ్ఞాని అడగదగ్గది కాదేమో!
బాహ్య స్వరూపం కన్నా అంతస్సారం ముఖ్యం
అందుకే ఆ ప్రశ్నంటే నాకంత అయిష్టం!

**ఫాస్ట్** : నీలాంటి పెద్దమనిషికి పేరుండాలి
అంతస్సారాన్నీ, అర్థాన్నీ తెలియజేస్తుందది
మరి నిన్నేమని పిలిచేది– ఈగల ఈశ్వరుడనా
విధ్వంసకుడు, అబద్ధాలకోరు (Lord of the Flies
Destroyer, Liar) - ఏదైనా నీకు తగినదే!
కాకుంటే చెప్పు, మరి నీవెవరివో!

**మెఫిస్టొఫిలిస్ :** శాశ్వత అసత్తకు ప్రతిరూపమైన ఆత్మను నేను!
ఉన్న ప్రతి వస్తువూ నశించి తీరవలసిందే కనుక,
దేనినీ వస్తురూపంగా రానివ్వకపోవడం మంచిదంటాను.
దాన్ని మీ మనుషులు విధ్వంసం, పాపం, చెడు అని పిలుస్తారు.
అదంతా నా వలయం, నాకిష్టమైనది లయం!

**ఫాస్ట్ :** నీవు నా కంటికి కనిపిస్తున్నావు సంపూర్ణుడిలా!
మరి ప్రచండ శక్తిలోని భాగమని ప్రవచిస్తున్నావెలా?

**మెఫిస్టొఫిలిస్ :** నేను సత్యాన్ని పలుకుతాను! కళను ఉపయోగించను.
మూర్ఖమానవులు తామే సంపూర్ణమని భావించనీ!
ఆదిలో ఉన్న అనంతంలో నేనొక భాగాన్ని
మనిషికన్నా ముందుండిన చీకటిలో నేను భాగాన్ని
వెలుగు పుట్టి అది తన మాతృస్థానమైన చీకటితో యుద్ధం చేస్తున్నది.
ఈ ప్రపంచమంతా చీకటి సామ్రాజ్యమే కదా అనాదిగా!
వెలుగు ఉనికికి సాకారలోకాలు అవసరం!
ద్రవ్యం కాంతిని బయటకు పంపుతూ తన వద్ద నీడను ఏర్పరుచుకుంటుంది.
పరావర్తనం చెందిన కాంతిని అందంగా మారుస్తుంది.
అందుకనే కాంతి ఎల్లకాలం నిలవదు!
ద్రవ్యం నాశనం కాకతప్పదు. కాంతి అదృశ్యం కాకతప్పదు.

**ఫాస్ట్ :** నాకర్థమయ్యింది నీ ఉద్యోగం ఏమిటో!
సర్వనాశన ప్రయత్నం విఫలమయ్యాక
ఈ చిన్న విధ్వంసాలు మొదలెట్టావు!

**మెఫిస్టొఫిలిస్ :** నిజం చెప్పాలంటే ఇక్కడా నేను విఫలమయ్యాను.
అసత్తుకు వెళ్లే దారిలో ఈ వ్యర్థ ప్రపంచం అడ్డువస్తున్నది.
నేనెన్ని ప్రయత్నాలు చేసినా ఈ మట్టిగోళం కదలకున్నది.
తుఫానులు, భూకంపాలు, అగ్నులు, వరదలు ఈ భూ సముద్రాలను
అల్లకల్లోలం చేసినా ఈ నేల మునుపటిలానే నిలిచి ఉన్నది.
అంతేకాదు ఈ భూప్రపంచపు జీవజాలం, మనుషులూ
అవీ సర్వనాశనం కాకుండా మిగులుతున్నవి.
కోట్లాది జీవాలను నేల సమాధుల్లోకి నెట్టినా

కొత్తతరాలు పాత స్థానాల్ని, కొత్తరక్తం పాత నాళాల్ని నింపుతున్నవి.
ఈ చక్రం అలా కదుల్తూ, నన్ను సవాలు చేస్తూ, పిచ్చెక్కిస్తున్నది.
ఈ నేల, ఈ గాలి, ఈ నీరు అన్నీ జన్మనివ్వగలవు.
వేయిరెట్లు పునరుత్పత్తి చేయగలవు, పొడిలో తడిలో ఎండలో వానలో!
అగ్ని ఇంకానా చేతిలోనే ఉన్నది.
అది లేకుంటే నాకు ఉనికి లేదు.

**ఫాస్ట్** : నిత్య ప్రచోదిత సంపూర్ణ జీవశక్తి నీ శత్రువన్నమాట!
దురాగ్రహంతో నీ సాతాను పిడికిలి బిగించినా వృధా అవుతున్నది.
ఎందుకని? గందరగోళపు వింత పుత్రుడా? ఎందుకంటావు?
ఆలోచించు! ఇంకేదన్నా పని చేయడానికి ప్రయత్నించు!

**మెఫిస్టాఫిలిస్** : అటువంటి విషయాల గురించి చెప్పాల్సింది చాలా ఉంది!
మరింకొక రోజు దాన్ని ముచ్చటించుకుందాం!
నాకు సెలవిప్పిస్తే, నేను నిష్క్రమిస్తాను.

**ఫాస్ట్** : తప్పకుండా! మనమిప్పుడు పరిచయస్థులం!
నీవెప్పుడైనా ఇక్కడకు రావచ్చు.
ఎలాగోలా నన్ను కలవవచ్చు.
ఇదిగో కిటికి, అది తలుపు
ఆ దారి పొగగొట్టం వేపు

**మెఫిస్టాఫిలిస్** : నేలమీద, గుమ్మం దగ్గర, నీవుంచావే హద్దు.
ఆ మంత్రగత్తెపాదం (Witch's foot) అదే నాకు అడ్డు!

**ఫాస్ట్** : ఏదీ నేను గీసిన ఆ పంచకోణమా!
నరకలోకపు పెద్దమనిషినది నిలువరించడమా!
మరి లోపలికెలా రాగలిగావు మిత్రమా!
నీలాంటి మహాభూతాన్ని నేను మోసం చేయగలగడమా!

**మెఫిస్టాఫిలిస్** : జాగ్రత్తగా పరిశీలించండి. దానిని సరిగా గీయలేదు.
బయటి కోణాల్లో ఒకదాని రేఖలు కలిసి ఉండలేదు.

**ఫాస్ట్** : ఎంత విచిత్రం! ఎంత విడ్డూరం!
నీవు నా ఖైదీవా? నాదెంత అదృష్టం!

**మెఫిస్టొఫిలిస్ :** కుక్క చూసుకోకుండా ఎగిరి గంతేసింది!
ఇప్పుడది డెవిల్, పోయే దారెక్కడుంది?

**ఫాస్ట్ :** కిటికీ గుండా పోవచ్చును గదా!

**మెఫిస్టొఫిలిస్ :** భూతాలకు, దయ్యాలకు భువిలో కొన్ని నియమాలున్నాయి;
వచ్చిన దారినే పోవాలి గాని వేరే మార్గం వెదకరాదు!
వచ్చేప్పుడు మా ఇష్టప్రకారం రావచ్చు, వెళ్లేప్పుడది వీల్లేదు.

**ఫాస్ట్ :** నరకంలోనూ న్యాయసూత్రాలున్నాయా?
అలా అయితే మన మధ్య ఓ ఒప్పందం ఖరారు చేసుకోవచ్చు!

**మెఫిస్టొఫిలిస్ :** ఏ వాగ్దానం చేసినా నీ పాత్ర నీకుంటుంది.
సణుగుడులు, వెనక్కి తిరగడాలుండవు.
దానికి కాస్త పరిపక్వత ఉండాలి.
మనం ఈ విషయాన్ని మరల చర్చిద్దాం!
ఈలోగా నన్ను విడుదల చేయమని
నా అభ్యర్థనను విన్నవిస్తున్నాను.

**ఫాస్ట్ :** ఇంకొద్దిసేపుండి నీ సంభాషణతో
నన్ను కృతార్థుడిని చేయవచ్చును కదా!

**మెఫిస్టొఫిలిస్ :** నన్ను మన్నించండి! ఈసారి వచ్చినపుడు,
మీరు వినదలిచింది ఏదైనా విశదపరుస్తాను.

**ఫాస్ట్ :** నేను నీవెంటబడలేదు, అది నీకు తెలుసు;
కావాలనే నీ తలను ఈ ఉచ్చులో ఇరికించావు;
'డెవిల్‌ను పట్టుకోకు; పట్టుకుంటే వదలకు'
అంటారు పెద్దలు. 'స్వేచ్ఛాభావాన్ని పట్టుకోవడం కష్టం'–

**మెఫిస్టొఫిలిస్ :** మంచిది, నీ యిష్టం, నేనిక్కడే ఉండి
మీకు కావాల్సినంత కాలక్షేపాన్నిస్తాను.
నా కళాకౌశల్యాన్ని మీ ముందు
ప్రవేశపెట్టేందుకు మీ అనుమతి కావాలి!

**ఫాస్ట్** : తప్పకుండా! ప్రారంభించండి మీ చాతుర్య ప్రదర్శన!
కనులకింపుగా, వీనులకు సొంపుగా ఉండాలన్నదే ఆలోచన!

**మెఫిస్టోఫిలిస్ :** మిత్రమా! ఈ రాత్రి, ఈ గంటలో నీవు చూస్తావు, ఏడాదిలో
నీవనుభవించగల ఇంద్రజాల మహేంద్రజాల ప్రదర్శన!
మృదువైన ఆత్మలు నీ కనుల ముందు దర్శనాలను సృజించి
వీనులకు మధురమైన గానాన్ని అందజేస్తాయి.
ఖాళీ మాయలు కాబోవివి.
నీ ఆకలి తీరుతుంది, ఘ్రాణేంద్రియాలు సంతృప్తి నొందుతాయి.
స్పర్శ ఉత్తేజితమవుతుంది.
మేము సిద్ధంగా ఉన్నామందరం! రండి! ప్రారంభించండి!

**ఆత్మలు** : చీకటి పైకప్పులారా! చెదరిపొండి!
నీలిరంగు నింగి, తొంగి చూసి మనవేపు
మధుర ప్రేమతో మనలను మన్నించును గాక!
నల్ల మబ్బులదృశ్యమై తారలు మెరుస్తున్నవి,
చక్కని కాంతితో వెలుగు నిస్తూ ఉన్నవి.
కాంతి కిరణ కిశోరాలు కలిసి ఆడుతున్నవి
ఊగుతూ, ఒరుగుతూ, తేలుతూ, తూలుతూ
మెరుస్తూ, ఒగరుస్తూ, జ్వలిస్తూ సాగుతున్నవి.
వాటి పొడుగాటి వస్త్రాలు రెపరెపలాడుతూ
పూలవనాన్ని, మైదానాన్ని పులకరింపజేస్తున్నవి.
ప్రేమికులు ఒకరితో ఒకరు లీనమయ్యే ప్రదేశమది
పొదలూ, పూలచెట్లు, ఫలపుష్పాల కాటపట్లు
ద్రాక్షతీగెలు ఫలభారాన్ని మధువుకొరకు వదిలాయి.
ద్రాక్షారసపు నురుగు కలిసి సెలయేళ్లు తూగుతున్నవి.
కొండల్నీ గుట్టల్నీ చుట్టుకొని సరస్సును చేరుతున్నవి.
పక్షులా నీరు తాగి నింగిని పలకరిస్తున్నవి.
మెరిసే ద్వీపాలవేపు, ఉప్పొంగిన అలలపైన ఎగిరిపోతున్నవి.
ప్రతిధ్వనించు పర్వతాలు, ఆనంద బృందగానాలు
మనముందు నడయాడే నర్తకీమణులు
ఆకుపచ్చని పొలాలు, హరిత వనాలు

కొండలెక్కేవారు, సరసులో ఈతకొట్టేవారు
ఎగుర్తూ ఆడుతూ పాడుతూ ఎందరో, మరెందరో!
జీవితాన్ని కోరుకుంటూ, సుదూర తారనన్వేషిస్తూ సాగుతున్నారు.
మాటలకన్నా విలువైన, ప్రేమ, ఆనందాల తీరాల వేపు!

**మెఫిస్టొఫిలిస్ :** అతడు నిద్రిస్తున్నాడు! ఆత్మలారా! అద్భుతంగా చేసారు!
మీ జోలపాటలతడిని మంత్రముగ్ధుణ్ణి చేసాయి.
ఈ విభావరి నన్ను మీ ఋణంలోకి నెట్టింది.
ఫాస్ట్! డెవిల్‌ను ఆపగలిగిన శక్తి నీకింకా రాలేదు!
అతడి కళ్లముందు స్వప్నరూపాల్ని నిలపండి,
యదార్థం కానరాని సముద్రంలో ముంచండి,
గుమ్మం దగ్గర ముగ్గును గుమ్మరించడం నాకు తెలుసు
నాక్కావాల్సిందల్లా ఎలుక దంతమొకటి!
ఈ మంత్ర ప్రభావాన్ని చిటికెలో చిదుముతాను.
ఇక్కడింకా నా మాయను విస్తరింపనక్కర్లేదు.
అవిగో ఎలుకల చప్పుడు, వినిపిస్తాను నా పాట నిప్పుడు
ఎలుకలకు, చుంచులకు, ఈగలకు, కప్పలకు
పురుగులకు, నల్లులకు, పేలకు యజమాని
మిమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నాడు మీ ముట్టె తెరచి
కోసుదంతాలతో ఆ ముగ్గును చెరిపేయండి.
ఓ ఎలుకా ఇటురా! ఆ ముగ్గుపై కొంచెం
తైలాన్ని నేను పోస్తాను, నీ దంతాలకు పనిచెప్పు!
త్వరగా అక్కడ, ఇక్కడ, ఇంకాస్త, ఇంకాస్త,
శభాష్! ఫాస్ట్! నీ మంత్రం ముగిసింది!
నాకు స్వేచ్ఛ దొరికింది! మనం మరల
కలిసేంత వరకు కలలో నిదురించు! శెలవు!

**ఫాస్ట్ :** (మేల్కొని) ఏమిటీ చిత్రం! ఒక్కరోజులో రెండుసార్లు మోసపోయానా?
ఆత్మల నృత్యం అదృశ్యమయ్యింది.
నా కలలో డెవిల్‌ను కనుగొన్నాను కాబోలు
ఆ కుక్క తన దారిన తాను పారిపోయినట్లుంది.

# 7. ఫాస్ట్ చదువుకునే గది-2

**ఫాస్ట్** : ఎవరు తలుపు తడుతున్నది?
నా ప్రశాంతతను భంగపరుస్తున్నదెవరు? లోపలికిరా!

**మెఫిస్టాఫిలిస్** : నేనే! వచ్చాను మరలా!

**ఫాస్ట్** : లోపలికి రా!

**మెఫిస్టాఫిలిస్** : మూడు సార్లు పిలవాలి, మిత్రమా!

**ఫాస్ట్** : సరే, లోపలికిరా!

**మెఫిస్టాఫిలిస్** : బాగుంది! నేననుకుంటాను మనిద్దరం
మంచిజోడు అవుతామని, నీవూ నేనూ!
నీకు హుషారు కల్గుతుందని ఈసారి అశ్వికుడిగా వచ్చాను.
రక్తవర్ణం దుస్తులు, బంగారు అంచులు
ప్రశస్తమైన సిల్కు అంగీ, టోపీపై కోడి ఈక
పొడుగాటి ఈటె చేతబూనితే వీరాధివీరుడి రూపమే!
కాబట్టి, ఆర్యా! నా అధికారాన్ని అంగీకరించండి!
నాలాగా దుస్తులు ధరించి స్వేచ్ఛగా తిరుగుతూ
మంచి సుఖమైన జీవితమేమిటో తెలుసుకోండి!

**ఫాస్ట్** : ఈ భూమి తప్పించుకోలేని ఖైదు వంటిది.
ఏ రకం దుస్తులు వేసుకున్నా ప్రయోజనం నాస్తి.
ఆటలాడుకునేంత మరీ చిన్ని వయసు కాదుకాని
కోరికలు కోల్పోని కుర్రతనమే నాది.
జీవితం ఆపగలిగే సంతృప్తి ఏమిటి?
Do without, do without - నిష్కామకర్మ
అనే ఆజ్ఞ ఆగకుండా మన చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నది–
అదే పాట మనల్ని జీవితాంతం మధనపెడ్తుంది.
ప్రతిరోజూ ఉదయం హతాశుడినై లేస్తాను,
కళ్లనిండా అశ్రువులు నల్లమబ్బుల్లా కమ్ముతాయి,
ఈ రోజు గడిచే సరికి ఒక్క కోరికా నెరవేరలేదనుకుంటే!

నా ఆనందపు అనుభూతులన్నీ, చిల్లరబాధల్తో అదృశ్యమవుతాయి.
చిన్నిచిన్ని అడ్డంకులు ఆత్మయొక్క సృజనాత్మకతను అణచివేస్తాయి.
చీకటి పడేసరికి ఏవో భయాలు, నిట్టూర్పులు–
శాంతిలేని మనసుతో నేను శయనిస్తాను.
భయంకర దర్శనాలు, పీడకలలు నన్ను చిత్రహింస పెడ్తాయి.
దైవం నా హృదయంలో నివసిస్తున్నా,
అతని వాక్కుతో నా శక్తులు మేలుకున్నా,
నా అంతర్గత భాగాల్ని ఆతడు కదిలిస్తున్నా,–
బాహ్య ప్రపంచంలో ఏదీ చలించదు, వ్యాకులపడదు.
ఉనికి అణచబడి, చిత్రహింసలు పాలుకాగా
నేను మృత్యువును అభిలషిస్తాను, విశ్రాంతికై తపిస్తాను.

**మెఫిస్టొఫిలిస్ :** కాని, మృత్యువు ఒకరు కోరుకునే అతిథి కాదు.

**ఫాస్ట్ :** మృత్యువు చేత కిరీటధారణ చేయించబడినవాడు ధన్యుడు.
విజేత రక్తంతో తడిసిన తమాల పత్రాల తీగె అది.
విశృంఖల నృత్యం తరువాత, యువతి ఒడిలో విరామం పొందినవాడు ధన్యుడు.
ప్రేమతో తడిచి వెచ్చనైన హృదయభావన అది.
నేను, ఆ మహా ఆత్మశక్తిని చూసినాక కూడా
ఆనందంతో ఆ క్షణాన మరణించకుండా ఎలా బతికున్నాను?

**మెఫిస్టొఫిలిస్ :** అదే రాత్రి, గోధుమ వన్నె రసాయనం
చేసినవాడు దానినెందుకో తాగకున్నాడు.

**ఫాస్ట్ :** నీవేదో దొంగతనంగా చూస్తున్నట్లున్నావు!

**మెఫిస్టొఫిలిస్ :** నేను సర్వవ్యాప్తుడిని కానుకాని, నాకు చాలా తెలుసును–

**ఫాస్ట్ :** అంతటి అల్లకల్లోలం, నిరాశలో
బాగా తెలిసిన మంద్ర సంగీతం
నా చెవులను మోసం చేసింది.
బాల్యపు ఆనందాలు నా ఎదను ఓదార్చాయి.
మన ఆత్మలను ఉత్తేజపరచే అన్నిరకాల
మంత్రాలను ఇప్పుడు నేను ద్వేషిస్తాను.

భూమిపైని కఠిన పరీక్షల్ని ఓర్చుకొమ్మనే
మాయమాటలను ఇక నమ్మబోను!
మన స్వంత తెలివితేటలపై మనకుండే
గర్వాన్ని, నమ్మకాన్ని మొదట తిట్టుకుంటాను.
జీవితపు ఉపరితలాన్ని అందంగా చూపించే
ఇంద్రియ జ్ఞానాన్ని మరీ శపిస్తాను.
శాశ్వతకీర్తి ప్రతిష్ఠలకై, పేరుకై–
పడే తపనను, కనే స్వప్నాలను గర్హిస్తాను.
భార్యా, పిల్లలను, గృహస్థ జీవితాన్ని
వృథా సంపదలను తిట్టిపోస్తాను.
మామ్మన్ స్వర్ణ నిధులను సంపాదించడానికి
చేసే వీరోచిత ప్రయత్నాల్ని విసిరికొడ్తాను.
మన కోర్కెలనన్నిటినీ తీరుస్తూ, మనల్ని లాలిస్తూ
ఉండే అతని మృదువైన చేతుల్ని మందలిస్తాను.
ప్రశస్త ద్రాక్షరసాన్ని మధురమైన ప్రేమ పిలుపును
విశ్వాసాన్ని, ఆశను తిట్టితిట్టి వదుల్తాను.
అన్నిటికన్నా ముఖ్యంగా సహనాన్ని, అడ్డూ ఆపూ లేకుండా శపిస్తాను.

**కనిపించని ఆత్మల గానం :–**

అయ్యో! అయ్యో!
ఒక సుందరం ప్రపంచాన్ని
నీవు చిందర వందర చేసావు!
బిగించిన పిడికిలి దెబ్బతో
దాన్ని కిందకు పడవేసావు.
దేవతల దెబ్బకు అదిరి ముక్కలై
అది కాస్తా అదృశ్యమయ్యింది శూన్యంలోకి.
దాని ముక్కలను కన్నీళ్లతో మోస్తూ
మనం సంతాపం ప్రకటిస్తున్నాం.
నశించిన దాని అందాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటున్నాం!
వీరాధివీరులైన భూమి పుత్రులారా!
దానిని మరల మరింత సుందరంగా నిర్మిద్దాం రండి!

అది మీలోనే పుట్టేందుకు అనుజ్ఞనిద్దాం!
కొత్త జీవన విధానాలతో, స్వచ్ఛమైన మనస్సుతో
నూతన కాంతిని స్వాగతిద్దాం!
కొత్త సంగీతాన్ని ఆలకిద్దాం!

**మెఫిస్టొఫిలిస్ :** నా చిన్నారి భూతాలు
వాటి పనులనవి చేస్తున్నాయి.
నిండైన నీతిబోధనలు
అనువైన ఆహ్వానాలతో
పేరు తెలియని ప్రపంచాలకు
దారి చూపుతున్నాయి.
ఇక్కడ ఒంటరిగా కూర్చోడమెందుకు?
ఉడుకుతూ, కుములుతూ అని అంటున్నవి.

రాబందులు పీక్కుతిన్నట్లు నిన్ను తినే,
దురదృష్టంతో ఆడుకోవడం మానేయ్!
ఎక్కడ నిన్ను నీవు మానవుడిగా భావిస్తావో
అది ఎంత చెడ్డ ప్రదేశమైనా అక్కడే ఉండిపో!
అట్లా అని నేను, మామూలు జనంతో మనం కలిసుండాలని చెప్పను.
నేనేమంత గొప్పవాడిని కాను. కాని
నీవు నాతో జీవన వాటాదారుడిగా ఉండదలిస్తే
పెద్ద ఆర్భాటం లేకుండానే దానిని నేనంగీకరిస్తాను.
నేను పూర్తిగా నీకు దాసోహమవుతాను.
నా తోడు నీకుంటుంది. నీకు అంగీకారమైతే
నేను నీకు సేవకుడినై, ఎప్పటికీ నీ పక్కనే ఉంటాను.

**ఫాస్ట్ :** అలా ఉన్నందుకు నీకు ఒరిగేదేమిటి?

**మెఫిస్టొఫిలిస్ :** దాని గురించి ఆలోచించడానికి చానా సంవత్సరాల వ్యవధి ఉంది.

**ఫాస్ట్ :** లేదు! లేదు! డెవిల్ ఆలోచన ఎప్పుడూ
కుక్క కాటుకు చెప్పుదెబ్బ తరహానే!
అతడు అహంకారి! నాకు ఉచితంగా పనిచేయడు!

మానవజాతికి ఉపకారినంటాడు, కాని నేను నమ్మను.
నీ నిబంధనలు చెప్పు! స్పష్టంగా, విశదంగా!
నీ లాంటి సేవకులు చాలా ఖరీదైన వాళ్లు.

**మెఫిస్టొఫిలిస్ :** ఈ ప్రపంచంలో నీక్కావలసినవన్నీ నేను నీకు
లభ్యమయ్యేట్లు చేస్తాను. ఏదైనా సరే కోరుకో!
మరో లోకంలో కొద్దికాలం తరువాత మనిద్దరం
కలిసినప్పుడు నేను ఇక్కడ నీకిచ్చినవే అక్కడ నాకివ్వాలి!

**ఫాస్ట్ :** తరువాతి ప్రపంచమా! అది పెద్ద లెక్కకు రాదు!
ఈ ప్రపంచాన్నే కదా నీవు వ్రయ్యలు చేయదలుచుకున్నది!
దీన్ని ధ్వంసం చేయి! నూతనలోకం ప్రభవించనీ!
ఈ లోకం నుంచే నాలో సంతృప్తి పొంగినది.
నా కష్టాల చీకటిపై సూర్యకాంతి ప్రసరించినది.
తొలుత నన్ను మానవ విషయాల నుంచి దూరంగా జరుపు!
తరువాత జరిగే దానిగురించి నాకు నిమిత్తం లేదు.
దాన్ని గురించి వినేటంత ఇష్టమూలేదు.
ఆ సుదూర అతిలోక గ్రహంలో
ద్వేషమున్నదో! ప్రేమ ఉన్నదో!
క్రింద ఎవరున్నారో! పైన ఎవరున్నారో!

**మెఫిస్టొఫిలిస్ :** అలా అయితే ఆలస్యమెందుకు? ధైర్యంగా
వచ్చి నాతో ఒప్పందాన్ని కుదుర్చుకో
నూతన జీవితాన్ని ప్రారంభించు! నేనేం చేయగలనో
ప్రత్యక్షంగా గమనించు! ఏ మానవుడూ చూడని అద్భుతాన్ని తిలకించు!

**ఫాస్ట్ :** ప్చ్! డెవిల్! నీవు నాకేం ఇవ్వగలవు?
మానవుని ఆత్మకుండే చురుకుదనం
నీ చిన్ని మనసు ఎలా గ్రహించగలుగుతుంది?
ఒకరిని అసంతృప్తిగా మిగిల్చే ఆహారం నీ దగ్గరున్నదా?
నీ చేతుల్లోనే పగిలిపోయే పాదరసం నీ దగ్గరున్నదా?
నేనెప్పటికీ గెలవలేని ఆటను నీవు నా కివ్వగలవా?
ఆమె కౌగిలిలో నేనున్నా పక్క వ్యక్తిని కవ్వించే పడతిని నీవివ్వగలవా?

ఉల్కాపాతంలా వచ్చినంత వేగంగా కరిగిపోయే కీర్తిని ప్రసాదించగలవా!
కోయకముందే కుళ్లిపోయే పండును చూపించు!
ప్రతిరోజూ ఆకులు రాల్చి, కొత్త ఆకులు తొడిగే వృక్షాన్ని చూపించు!

**మెఫిస్టొఫిలిస్ :** నీ ఆదేశాలను శిరసావహిస్తాను.
ఈ ఆనందాలన్నిటినీ నెరవేరుస్తాను.
కాని, స్నేహితుడా! జీవితంలో పలుమార్లు
మానవుడు ఆత్మసంతృప్తిని ఆనందిస్తాడు.

**ఫాస్ట్ :** నేనే నాడు సోమరినై స్తబ్దుడనవుతానో
ఆ క్షణమే నాకది అంతిమం కావాలి!
నీ టక్కుటమారాలతో నన్ను సర్వ స్వతంత్రుడిగా చేసినా
నీవు నాకిస్తున్న ఆనందాలు నాకందనట్లయితే ఆరోజే నేనంతం కావాలి!
ఇదే నా పందెం! మనిద్దరి మధ్య ఒప్పందం!

**మెఫిస్టొఫిలిస్ :** Done, అలాగే!

**ఫాస్ట్ :** Done, నా వేపు నుంచీ కూడా!
నేనే క్షణంలోనైనా 'మధుర క్షణమా, ఆగిపో, వెళ్లకు'
అన్న మరుక్షణమే నన్ను నీ సంకెళ్లతో బంధించు!
అప్పుడు నేను నా జీవితాన్ని నా వెనుక వదిలివేస్తాను.
మృత్యు ఘంటలు మోగుతుండగా వాళ్లు వింటారు.
నీవు నీ శ్రమ నుంచి విముక్తుడవవుతావు. నా మట్టుకు నాకు
గడియారం ఆగి, ముళ్లు స్తంభించి, కాలం ఆగిపోతుంది.

**మెఫిస్టొఫిలిస్ :** మనం దీన్ని గుర్తుపెట్టుకోవాలి,
నీవేం చేస్తున్నావో బాగా ఆలోచించు!

**ఫాస్ట్ :** అది నీ హక్కు! ఈ పందెం నేను ఓడిపోయినా
అదేం గొప్ప వీరోచిత కార్యం కాబోదు.
అది నా లక్ష్యసాధనకు ఒక మార్గం మాత్రమే!
ఆగిపోయానా, ఆనక నేనెవరికి బానిసను అనేదానితో నాకు నిమిత్తం లేదు.

**మెఫిస్టొఫిలిస్ :** ఈనాటి ఉత్సవపు విందులో నేను
నా శక్తియుక్తుల్ని ఓ సేవకుడిలా ప్రదర్శిస్తాను.

చిన్న విన్నపం! నీవు అర్థం చేసుకోగలవు!
అభ్యంతరం లేకపోతే ఒకటి రెండు వాక్యాలు లిఖితపూర్వకంగా!

**ఫాస్ట్** : ఛాందసుడా! వ్రాతపూర్వక ఒప్పందం కావాలా?
మానవుడి శపథం గురించి నీకు తెలియదా?
నా వాక్కు నా జీవిత గమనాన్ని నిర్ణయిస్తుందే,
అది చాలదా? ఈ ప్రపంచం తలకిందులుగా పోతుంది,
వాగ్దానం నన్ను నిలిపివేస్తుంది,
ఎటువంటి వింత స్వప్నాలు మనల్ని కలుపుతున్నాయి?
మన మనస్సులో నాటుకున్న విషయం ప్రతిజ్ఞగా మారింది.
దానిని మనం అంగీకరిస్తున్నాం.
స్వచ్ఛమైన, స్థిరమైన హృదయం కలవాడు ధన్యుడు.
అతడు అవకాశాలకై చింతించడు. నష్టమని భావించడు.
కాని, కాగితాలపై, దస్తావేజులపై సంతకాలూ, ముద్రలూ
దయ్యాల్లా మనల్ని వేటాడి వెంటాడుతాయి.
మాట మరణిస్తుంది మనం పట్టుకున్న కలం సాక్షిగా!
మైనం, చర్మపు సంచి మన జీవితాన్ని శాసిస్తాయి.
Well, devil, మంచిది. దేనిపై వ్రాయను?
కంచుపైనా, చలువరాతిపైనా, పార్చ్‌మెంట్ (చర్మం)పైనా
లేక కాగితంపైనా? నీ ఇష్టం!
కలంతోనా, ఉలితోనా, ఏ పనిముట్టును వాడమంటావు?
ఏ మాధ్యమమో నీవే నిర్ణయించు!

**మెఫిస్టొఫిలిస్** : Come, come sir,
ఈ మాటల వరద,
ఈ వాగ్ధాటి ఇప్పుడంత అవసరమా?
ఓ కాగితమ్ముక్క చాలు పని గడవడానికి,
ఓ రక్తం చుక్క తమ సంతకానికి!

**ఫాస్ట్** : ఇంతేనా నీకు కావల్సింది! సరే,
నీ ఆనందం కోసం నేనా ప్రక్రియ పూర్తికానిస్తాను.

**మెఫిస్టొఫిలిస్** : రక్తం అనే రసానికి గమ్మత్తైన లక్షణాలున్నాయి.

ఫాస్ట్ : వాగ్దాన భంగానికి నీవు వెరవనక్కరలేదు.
మాట తప్పను, అన్నమాట మీద నిలబడ్తాను.
ఆత్మవిశ్వాసంతో కూడిన గర్వం నా స్వంతం.
నేనిప్పుడు నీ లాంటివాళ్లకు సమాన స్థాయిలో ఉన్నాను.
దివ్యాత్మ నన్నిప్పుడు తిరస్కరిస్తున్నది.
ప్రకృతి తలుపు మూసుకున్నది.
ఆలోచనా సూత్రం తెగిపోయినది.
పుస్తకాలంటే అయిష్టం, నేర్చుకోవడం బహుకష్టం.
ఇప్పుడు మనం ఇంద్రియ ప్రలోభాల లోతుల్ని అన్వేషించి
జ్వలిస్తున్న ఉద్వేగాలనక్కడ నాటుదాం!
నీ మాయా మంత్ర తంత్రాలను నాకు ప్రదర్శించు-
వాటి బాహ్య రూపాలతో నాకు నిమిత్తం లేదు.
విషయవాంఛల ఉధృతిలో తలమునకలై
కాలరహస్యాన్ని కనుగొని, సంఘటనలలో సంచరిద్దాం!
ఆనందం, విషాదం; విజయం, పరాజయం
వాటిష్టం వచ్చినట్లు అవి తరుముకు రానీ!
నిశ్చలంగా నిలబడ్డ మనిషి ఏమీ చేయలేడు.

మెఫిస్టాఫిలిస్ : నీవు కోరుకుంటే ఏదీ నిన్నాపలేదు,
ప్రతి ఆనందాన్ని రుచిచూడు!
అంబరాన ఎగిరే సంబరాల్ని చవిచూడు!
నీకిష్టం వచ్చిన రీతిలో స్పృశించు, ఆక్రమించు, ఆనందించు!

ఫాస్ట్ : మామూలు ఆనందం నా లక్ష్యం కాదు.
కళ్లు తిరిగి, భయంకొలిపే సంతోషానికి నేనంకితం.
ద్వేషాన్ని ప్రేమిస్తూ, ఆశాభంగాన్ని ఆస్వాదిస్తూ కాలం గడపాలి!
నా ఆత్మ నుంచి జ్ఞానతృష్ణను తరిమేసాను.
అదిప్పుడు బాధల మొత్తాన్ని అనుభవించి తీరాలి.
మొత్తం మానవజాతికి నిర్ణయించబడిన అనుభవ సారమంతా
నా అంతరాత్మలో నిబిడీకృతం కావాలి.
నా మనస్సు ఆ శిఖరాలు, లోయలను స్పృశిస్తుంది.
నా హృదయం ఆ సుఖదుఃఖాల తీవ్రతను తెలుసుకుంటుంది.

అలా నేను ఇంతింతై వృద్ధిచెందుతూ, నేను నీవై
సమస్త మానవజాతిలా అంతిమంగా సమసిపోతాను.

**మెఫిస్టొఫిలిస్ :** నా మాట నమ్ము! అలాగే జరుగుతుంది!
ఇది శతాబ్దాల పాటు ఆ మృత్యు అన్నాన్ని నమిలిన నోటి మాట!
పుట్టుక నుండి చావు వరకు ఎన్ని గొప్ప పనులు చేసినా
ఈ ముక్కల ముద్ద మానవుడికి జీర్ణం కాదు.
మేము నీకు హామీ ఇస్తున్నాం! అటువంటి పరిపూర్ణత
దేవునికే సాధ్యం. శాశ్వత కాంతి దైవమొక్కడే!
నాలాంటి వాళ్లను అతడు చీకటిలోకి బహిష్కరించాడు.
మనుషులు వెలుగు చీకట్లలో జీవించాలని నీవు గ్రహిస్తావు.

**ఫాస్ట్ :** అయినా నేను సాధిస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను!

**మెఫిస్టొఫిలిస్ :** గొప్ప ధైర్యవచనం! కాని దీనిలో ఒక సమస్య ఉంది.
Time is short, and art is long
కాలం హ్రస్వమైనది. కళ దీర్ఘమైనది.
నీతోపాటు ఓ పేరున్న కవిని తీసుకువెళ్తావా?
అతడు నీకెన్నో విషయాలు వివరించగలడు.
అతడి ఆలోచనలు సుదూర తీరాలను చుట్టివస్తాయి.
అతని ప్రేరణతో అన్ని సుగుణాలు నీకు కిరీటకాంతులనిస్తాయి.
సింహబలం, దుప్పి వేగం, ఇటాలియన్ల మండే అభిలాష,
ఉత్తరదేశస్థుల పట్టుదల ఇవన్నీ నీకు చెందుతాయి.
వంచనను ఉదాత్తతతో కలపడం చూపిస్తాడు,
నీవింకా ఉడుకు రక్తపు యువకుడిగా ఉన్నపుడే!
ముందు వేసుకున్న పథకం ప్రకారమే ప్రేమలో పడడం,
దాని ఫలితం, నేననుకుంటాను, వేచి చూస్తేనే బాగుంటుందంటాను.
'ఓ సూక్ష్మ ప్రపంచమా! రా!' –అని నేను ఆహ్వానిస్తాను.

**ఫాస్ట్ :** అప్పుడు నేనేమిటి? నేనెన్నుకున్న మానవతా కిరీటం
గెలవడం అసంభవమయితే; నేనెవర్ని?
నా ఇంద్రియాలు బాధతో అన్వేషిస్తున్నదే దొరకకపోతే!

**మెఫిస్టొఫిలిస్ :** ఇంతకు ముందు నీవెవరివో అదే నీవు;
శిరోజాలు మార్చు, పొడుగాటి జడలు అల్లు,

శిఖరాలపై నిలబడు, నటుడిగా జీవించు;
కాని ఇంతకు ముందు నీవెవరివో అదే నీవు.

**ఫాస్ట్** : మానవ మనోవికాస ధనాగారాలను, ఆ పనికిరాని చెత్తను
పోగు చేయడానికి నేనెంత శ్రమించాను వ్యర్థంగా!
ఇప్పుడు తీరికగా కూర్చుని చింతిస్తున్నాను.
నాలో ఏ నూతన శక్తీ ప్రవహించడం లేదు.
కనీసం వెంద్రుక మందం నా ఎత్తు పెరగలేదు.
అనంత లక్ష్యాన్ని చేరుకోడానికి ఒక్క అడుగూ ముందుకు పడలేదు.

**మెఫిస్టొఫిలిస్** : ఆర్యా! మీ దృక్పథం మా రోజుల్లో సర్వసాధారణం!
పునరాలోచించండి! జీవన సుఖాలు మాయమయ్యేలోపునే
ఏం చెయ్యాలో నిర్ణయించండి.
కాళ్లూ చేతులూ, తలా మొండెమూ తనదే అయినప్పుడు
ఇవి ఇచ్చే సుఖాలు తనవి కావా?
నా దగ్గర ఆరు గుర్రాలున్నపుడు వాటి ఒక్కొక్క దాని శక్తి
నా సంపూర్ణశక్తిలో భాగమే కదా!
నాకప్పుడు ఇరవై నాలుగు కాళ్లుండవా!
అయ్యా! ఈ చింతన మాని నాతో కలిసి ప్రపంచాన్ని శోధించు!
వేదాంత దిమ్మరి దెయ్యం పట్టిన మృగం లాంటివాడు,
చుట్టూరా పచ్చిక ఉంటే ఎడారిలో తిరుగుతాడు!

**ఫాస్ట్** : ఎలా ప్రారంభిద్దాం?

**మెఫిస్టొఫిలిస్** : ముందు ఇక్కడి నుంచి బయటపడదాం!
ఎటువంటి జైలుగుంత ఇది?
జీవితంలో కాక నీడలో జీవిస్తూ
కనుపాపలకూ మనసుకూ విసుగు కలిగిస్తూనా బతుకు?
నీ లావుపాటి మిత్రులకు ఆ కష్టాన్ని వదిలేద్దాం!
ధాన్యం లేని గడ్డిని దంచడం మానేద్దాం!
నిజానికి, నీ శిష్యులకు బోధించేదేమన్నా ఉంటే
అదే నిషేధించబడింది కదా! -ఎవరో తలుపు తడ్తున్నారు.

**ఫాస్ట్** : నేనిప్పుడు విద్యార్థులను చూడబోను.

**మెఫిస్టోఫిలిస్ :** అమాయకుడు! చాలా సేపటి నుంచి వేచి వున్నాడు!
అతడికేదో మంచి మాటలు చెప్పి పంపేద్దాం!
నీ టోపీ, అంగీ, దయచేసి, నాకు ఇవ్వండి!
బాగుంది వేషం! బ్రహ్మాండంగా ఉన్నాన్నేను.
**(ఫాస్ట్ లాగా దుస్తులు ధరిస్తాడు).**
నా తెలివి తేటలు అక్కడ ఉపయోగిస్తాను.
ఒక్క పావుగంట చాలు, అతగాడిని ఆడుకుంటాను.
ఈలోగా, మన మహా పర్యటనకు సిద్ధం కండి!
**(ఫాస్ట్ వెళతాడు)**

**మెఫిస్టోఫిలిస్ :** **(ఫాస్ట్ పొడుగాటి అంగీ ధరించి)–**
వివేచనను తిరస్కరించు; జ్ఞానాన్ని ద్వేషించు,
అవే మానవుని శక్తులు, వైవిధ్య విభాగాలు.
నీ వృధా స్వప్నమైన మంత్ర విద్యావైభవం
దుష్టాత్మ పొగడ్తలతో కోటకట్టబడగా
ఇప్పుడు నీవు నావాడివి, నీ సంతకమున్నా, లేకున్నా!–
విధి నిరంతరం జ్వలించే మనసుకు
గుడ్డి అసహనాన్ని అంటగట్టింది.
తలకిందుల తొందర అతడిని తోలుకుపోతున్నది.
నేలను విడిచి, అక్కడి సుఖాలను త్యజిస్తున్నాడు.
అర్థం పర్థం లేని రసహీనపు
జీవితపు చెత్త గుండా అతడిని ఈడ్చి పారేస్తాను.
వలలో చిక్కిన పిట్టలా వాడు తన్నుకులాడాలి.
కాళ్లూ చేతులూ విరిచి కట్టి, ఆకలిదప్పులతో అలమటించేలా
నానా హింసలూ పెడతాను.
పక్కనే ఆహారాన్నుంచి అందుకోను వీల్లేకుండా చేస్తాను.
ఈ పిశాచ ఒప్పందం ఉన్నా లేకున్నా
వాడు నశించి తీరవలసిందే!
**(ఓ విద్యార్థి ప్రవేశం)**

**విద్యార్థి :** అయ్యా! నేనిక్కడకు కొత్తగా వచ్చాను.
తమ పేరు ప్రఖ్యాతులు నేను విన్నాను.

మిమ్మల్ని కలిసి వెడదామన్నది నా అభిమతం.
మీకు తెలుసు, నేను మిమ్మల్నిలా కలవడం –అమర్యాద కాదని!

**మెఫిస్టొఫిలిస్ :** నీవు అతి వినయవంతుడివి! నేనందరిలాంటివాడినే!
నేను చేయగలిగినంత మంచి చేస్తాను! ఇతర ఆచార్యులను కలిసావా!

**విద్యార్థి :** నేను మీ సలహాను అభిమానిస్తాను.
శ్రద్ధగా చదివి మీ పేరు నిలబెడ్తాను.
నా దగ్గర కొంత డబ్బుంది; నాకు మంచి పేరుంది.
నా తల్లి ఇంటిదగ్గరే ఉండమని పోరింది;
కాని జ్ఞానాన్వేషణలో తమ వద్దకు వచ్చాను.

**మెఫిస్టొఫిలిస్ :** బాగు, బాగు! మంచి చోటుకే వచ్చినావు!

**విద్యార్థి :** జ్ఞానదాహం మిక్కుటంగా ఉన్నా
నేనిక్కడ ఉండగలనో లేనో తెలీడం లేదు.
ఈ గోడలు, గదులు నన్ను భయపెడ్తున్నాయి.
ఇవన్నీ నన్ను ఇరుకున బెడ్తున్నట్లున్నాయి.
చెట్లు లేవు, పచ్చని మైదానాలు లేవు
ఇటువంటి విద్యాలయపు గదుల్లో
నేను సూటిగా ఆలోచించలేను, వినలేను, చూడలేను!

**మెఫిస్టొఫిలిస్ :** ఇదంతా మన అలవాటును బట్టి ఉంటుంది.
పసిపాపలు కూడ తల్లి రొమ్ముల క్షీరాన్ని
తొలుత తడబడుతూ తాగుతారు.
తరువాత వేగం, అభిరుచి పెరుగుతాయి.
జ్ఞానపు చనుమొనలను చప్పరించు
ప్రతిరోజూ అవి మరింత మధుర క్షీరాల్నిస్తాయి.

**విద్యార్థి :** సంతోషంగా ఆమెను కౌగలించుకుంటాను,
ఆమె ఉండేచోటు, దయచేసి, చూపగలరా!

**మెఫిస్టొఫిలిస్ :** పెద్ద హడావుడి పడకుండా చెప్పు!
ఏ విభాగంలో పనిచేస్తావో మనసు విప్పు!

**విద్యార్థి** : నేను జ్ఞానార్థినై వచ్చాను,
అన్నిటినీ తెలుసుకోవాలనుకుంటున్నాను.
ఈ విశ్వంలో ఉన్నదంతా,
ప్రకృతి రహస్యాలను, శాస్త్రజ్ఞానపు సమాధానాలనూ!

**మెఫిస్టోఫిలిస్ :** సరైన మార్గమిదే! ఖచ్చితంగా!
కాని ఇక్కడ నిన్నెందరో దారి తప్పిస్తారు.

**విద్యార్థి** : నేను కష్టపడతాను.
అప్పుడప్పుడు చిన్నిచిన్ని సరదాలు ఇష్టపడతాను.
కాసింత విరామం కోరుకుంటాను.
వేసవి శెలవుల్లో హాయిగా వినోదిస్తాను.

**మెఫిస్టోఫిలిస్ :** సమయాన్ని సద్వినియోగం చేసుకో, దానికి తొందరెక్కువ.
ఒక పద్ధతి, ప్రణాళిక దాన్ని సక్రమంగా వినియోగింపచేస్తాయి.
మిత్రుడా! నా సలహాను హృదయంలో దాచుకో,
ఇప్పుడు తర్కం గురించి కాసేపు మాట్లాడుకుందాం!
తర్కం నీ మనసుకు శిక్షణ నిస్తుంది.
న్యాయాధికారి పాదరక్షలు నొక్కినంత గట్టిగా
నీ ఆలోచనలు దాక్కుంటూ, పాకడం నేర్చుకుంటాయి.
ఇక దారి తప్పే ప్రశ్నేలేదు.
అడ్డదిడ్డపు నడక ఉండదు. ముందుకూ వెనకకూ
'విల్లో ద విస్ప్' – 'Willow-the-wisp – ఊగడం ఉండదు.
నీ ఆలోచనా సరళి ఎలా ఉండాలో నేర్పుతాం!
తినడం, తాగడంలా కాక స్వేచ్ఛగా, తక్షణం,
అప్రయత్నంగా ఒకటి, రెండు, మూడు అన్నట్లుండాలి!
మన ఆలోచనా యంత్రమున్నది చూసావూ.
అది ఒక నేర్పుగల నేతగాడి మగ్గం.
పాదంతో ఒక్క నొక్కు నొక్కితే పదివేల దారాలు
కనబడకుండానే అటూఇటూ కదుల్తాయి.
కండెలటూ ఇటూ కదిలి వేలదారాలు
ఒక దగ్గరికి వస్తాయి.

నీలోని వేదాంతి బయటకు వచ్చి
అది ఖచ్చితమైన లెక్క వల్ల జరిగిందంటాడు.
మొదటి ఇది, తరువాత అది
మూడోది నాలుగోది వాటి తరువాత కదిలేది.
ఒకటో, రెండో వదిలేసావా
మూడోది నాలుగోది కదిలే ముచ్చటేది?
విద్యార్థులు కరతాళ ధ్వనులు చేస్తారు– 'ఓహో!'
కాని ఎలా నేతగాళ్లుగా తయారవ్వాలో ఇంకా తెలీదు.
మేధావులు ఏదైనా జంతువును ఆమూలాగ్రం
అర్థం చేసుకోవాలనుకున్నప్పుడు ముందు దాన్ని చంపుతారు.
తరువాత దాని విడిభాగాల్ని పరిశోధిస్తారు.
అయితే ఒక సంపూర్ణ జీవి భాగాలుగా మారిందన్నది గమనించరు.
ఎందుకంటే ఆ భాగాలన్నిటినీ కలిపి ఉంచేది జీవాత్మ.
Enchiresis naturae – (ప్రకృతి హస్తం) అంటుంది.
జీవరసాయన శాస్త్రం – తనని తానే ఎత్తిపొడుచుకుంటూ ఉంటుంది.

**విద్యార్థి** : నాకర్థం అయ్యిందని ఖచ్చితంగా చెప్పలేను.

**మెఫిస్టోఫిలిస్ :** త్వరలో అర్థమవుతుందిలే! ప్రస్తుతానికి ముందుగా అనుకున్నట్లు చేయి!
తరువాత దృష్టాంత ప్రదర్శన, సక్రమ విభజన నేర్చుకుంటావు.

**విద్యార్థి** : మీరు చెప్పిందంతా ఏదో గజిబిజిగా ఉన్నది,
బుర్రలో ఏదో తిరగలి తిరుగుతున్నట్లున్నది!

**మెఫిస్టోఫిలిస్ :** నీ రెండవ విషయ ప్రాముఖ్యం– అమూర్త సూక్ష్మవిషయ వేదాంతవిద్య.
Metaphysical Philosophy - అది నీ లోతులేని మెదడులో
నిగూఢమైన ఆలోచనలనెలా నిక్షిప్తం చేసుకోవాలో చెబుతుంది.
ప్రతి విషయానికి ఎవరికి అర్థం కాని పేర్లు పెట్టి
వాగాడంబర పదకోశాలు నీకందజేయబడతాయి.
మొదటి దశలో పద్ధతి, ప్రణాళిక తయారు చేసుకో!
ప్రతిరోజూ అయిదు ఉపన్యాసాలు నీకివ్వబడతాయి.
గంట మోగేప్పటికే నీవక్కడ ఉండేట్లు చూసుకో!
వెళ్లేముందే, ఇంటిదగ్గర చేయాల్సింది పూర్తి చేసుకో,

నీవు తెలుసుకోవాలనుకున్న విషయాన్ని మననం చేసుకుని
మళ్లీ చూడకుండా జ్ఞప్తికి తెచ్చుకో!
పుస్తకంలో లేనిది అతడేం చెప్పకున్నా
సారాంశం రాసుకో, రాయడం ఆపకు,
పవిత్రాత్మ చెబుతున్నట్లు భ్రమించి మసలుకో!

**విద్యార్థి** : ఆర్యా! తమరు నూటికి నూరుశాతం సరిగా వచించారు,
సారాంశము ఎంతో ఉపయోగకరము, ఎందుకంటే
తమరి ఉపన్యాసాన్ని సంగ్రహంగా ఇంటికి కొనిపోవచ్చును,
నలుపు తెలుపుల్లో చిరకాలం భద్రపరచుకోవచ్చును.

**మెఫిస్టొఫిలిస్** : సరే! అలా అయితే ఎన్నిక చేసుకో ఓ ఆచార్యుడిని!

**విద్యార్థి** : న్యాయశాస్త్రం నాకిష్టమైన విషయం కాదు.

**మెఫిస్టొఫిలిస్** : బాగు, బాగు, నీమాట కొట్టివేయబోను.
నాకూ దాని గురించి కొద్దికొద్దిగా తెలుసును.
చట్టాలూ, న్యాయాలూ, పాతరోగంలా అంటుకుని
మృతుల ద్వారా సంక్రమిస్తాయి.
తరాలు గడిచినకొద్దీ, దేశం నుండి దేశానికి,
రాజ్యం నుండి రాజ్యానికి అందుతూనే ఉంటాయి.
సంవేదన అసందర్భ వాగుడై, మంచిపనులు
ప్రమాద జనకాలవుతాయి.
మన పూర్వీకులు మనకు బరువవుతారు!
అటువంటప్పుడు నూతన న్యాయం, నీలో నాలో పుట్టిందేమౌతుంది.
దాని సంగతెవడూ పట్టించుకోడు.

**విద్యార్థి** : ఈ ఒక్క ఉపన్యాసం చాలు, ఇక ఆ విషయం నేనెత్తను!
మీ ఉపాధ్యాయులెంత అదృష్టవంతులో చెప్పలేను!
దైవశాస్త్రం (Theology) చదువుదామనుకుంటున్నాను!

**మెఫిస్టొఫిలిస్** : నిన్ను దారి మళ్లించడం నాకిష్టం లేదు.
ఈ ఒక్క శాస్త్రంలో, జాగ్రత్త సుమా, దారి మళ్లకుండా ఉండడం కష్టం.
చాలా విషం ఉంది ఆ విషయంలో!

ఏది చంపుతుందో, ఏది నయం చేస్తుందో చెప్పలేం!
దీనిలో కూడా విద్యార్థి ఒక గురువును ఎన్నుకుని
ఆతడు చెప్పింది అక్షరాలా పాటించాలి.
మాట మీద నిలబడాలన్న మాట! అలా అయితే అవి
స్థిరమైన దారికి మళ్లించి
జ్ఞానద్వారాలను విశాలంగా తెరుస్తాయి.

**విద్యార్థి** : నన్ను మన్నించండి, ఇన్ని ప్రశ్నలడుగుతున్నందుకు.
వైద్యశాస్త్రం కూడా చదవాలనేది నా కోరిక.
ఆ విషయంపై మీ అభిప్రాయం చెబుతారా!
మీ దగ్గర ఖచ్చితంగా విలువైన సలహాలుంటాయి.

మా మూడేళ్ల విద్యా సమయం చాలా తక్కువ!
నేర్చుకోవాల్సిన విషయాలు బహు ఎక్కువ!
మొదలెట్టే ముందు కొన్ని చిట్కాలు అవసరం.
దగ్గర దారి దొరికితే పురోగతి శీఘ్రతరం!

**మెఫిస్టాఫిలిస్** : **(తనలో)**– ఈ పొడి పొడి వ్యాఖ్యానాలలో మజాలేదు.
కాస్త దయ్యాల ఆత్మజ్ఞానం మాయాజాలాన్ని వాడదాం!
**(ప్రకాశంగా)** వైద్యశాస్త్రమంటే బాగా చెప్పవచ్చు.
మొత్తం స్థూల, సూక్ష్మ ప్రపంచాల్ని దానిలో చదువుకోవచ్చు,
దేవుడి సృష్టి మార్పు చేయలేమని ఘంటాపథంగా చెప్పవచ్చు.
నీ పెద్దపెద్ద శాస్త్రపు ఊహలు వ్యర్థమని తెలుస్తాయి.
మనమేమి చేయగలమో అదే నేర్చుకుంటాం.
అవకాశాన్ని అందిబుచ్చుకున్నవాడిక్కడ అదృష్టవంతుడు!
నీవింకా కుర్రవాడివి; ఉడుకు రక్తం ఉరకలెత్తుతున్నవాడివి.
నేను చెప్పగలను ధైర్యం గలవాడివి అని కూడా!
ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకో,
అందరూ నిన్ను విశ్వసిస్తారు.
అన్నిటికన్నా ఆడవాళ్లను ఎలా పడేయాలో నేర్చుకో!
ఎలా అంటే, వాళ్లకుండే కష్టాలు వందలు వేలు.
మంచి వైద్యం వాళ్ల బాధలను దూరం చేసిందా అదే మేలు!

వినయంగా, సున్నితంగా, నేర్పుతో వ్యవహరించు,
ఆ తరువాత వాళ్లను నీ ఇష్టప్రకారం నడిపించవచ్చు.
మంచి పేరు, రకరకాల పట్టాలు, బిరుదులు
ఇవన్నీ నీ గది తలుపు మీద కనబడితే, వాళ్లనుకుంటారు
ఇతగాడెవరో 'అందరికంటే మొనగాడి'లా ఉన్నాడని.
నెమ్మదిగా ఆమెకు స్వాగతం చెబుతూనే
నీ చేతులతో మృదువుగా తాకుతూ కాలయాపన చేయి.
నాడిని పరీక్షిస్తూనే సున్నితంగా మణికట్టును నొక్కు.
నడుం వంపుల్ని తడుముతూనే పరీక్షకు శ్రీకారం చుట్టు.

**విద్యార్థి** : సలహా అంటే ఇలా ఉండాలి! మీరేం చెబుతున్నారో బాగా అర్థమైంది.

**మెఫిస్టాఫిలిస్ :** మిత్రుడా! సిద్ధాంతాలన్నీ నల్లగా చీకటి
జీవన స్వర్ణవృక్షం ఆకుపచ్చ కుంపటి.

**విద్యార్థి** : నేను కలగంటున్నానా ఏమిటి?
మీకభ్యంతరం లేకపోతే మరోసారి మీతో ముచ్చటించి ముగ్ధుడనైతాను.

**మెఫిస్టాఫిలిస్ :** నా చేతిలో ఉన్న సాయమంతా చేస్తాను.

**విద్యార్థి** : నేను వెళ్లేముందు తమరి నొక్క మేలు అడగవచ్చునా!
తమరి సంతకాన్ని –ఆశీస్సులతో కూడినది ఆశించవచ్చునా!

**మెఫిస్టాఫిలిస్ :** నిరభ్యంతరంగా!
**(విద్యార్థి పుస్తకంపై వ్రాసి ఇచ్చును)**

**విద్యార్థి** : **(చదువుతూ)**– Eritis sicut Deus
Scientes bonum et malum
మంచీ, చెడు తెలుసుకో, నీవు అవుతావు దేవుడిలా
(You shall be as God, Knowing good and evil)
**(పుస్తకాన్ని భక్తిశ్రద్ధలతో మూసి విద్యార్థి నిష్క్రమించాడు)**

**మెఫిస్టాఫిలిస్ :** నా పూర్వీకురాలు సర్పదేవత మాటలు జ్ఞానదాయకాలే!
దేవుడిలా ఉండమనేదేమీ వెలుగు లేని వ్యవహారం కాదు!
**(ఫాస్ట్ వస్తాడు)**

**ఫాస్ట్** : ఎక్కడకు మన ప్రయాణం?

**మెఫిస్టాఫిలిస్ :** నీవెక్కడకంటే అక్కడకే! ముందు bourgeoisie!
తరువాత beau monde! రుసుము చెల్లించకుండానే
ఎంత ఆనందం, లాభం పొందుతామో చూద్దాం!

**ఫాస్ట్** : మరి నా గడ్డం, వయసు సంగతి ఏమిటి?
జనం మధ్యలో నేనేమంత గొప్పగా వ్యవహరించలేను.
ఇది లాభం లేదు. నేనెన్నడూ మందిమధ్య మసల లేదు.
అల్పుడిగా భావించి ఘనీభవించిపోతాను.
స్వేచ్ఛగా చరించలేను.

**మెఫిస్టాఫిలిస్ :** ఇవన్నీ కొద్దిరోజుల్లో పూర్తిగా మారిపోతాయి.
విశ్వాసం రాగానే నీవు Savoir-Vivre నేర్చుకుంటావు.
నీలోని మార్పు నీకే ఆశ్చర్యం కలిగిస్తుంది.

**ఫాస్ట్** : అక్కడికి మనమెలా వెళ్తాం? ఏరి నీ సేవకులు?
ఏది నీ రథం? ఎక్కడ అశ్వాలు?

**మెఫిస్టాఫిలిస్ :** నీ అంగీని గాలిలో ఇలా పరచు! మనం గాలిలోకి తేల్తాం!
కాని, ఈ ధైర్యమైన ముందడుగులో ఎక్కువ సామానుకు అనుమతిలేదు.
అగ్ని వేడినిస్తుంది. వేడిగాలి వీస్తుంది, అంతే!
గాలిలో సునాయాస ప్రయాణం, అదుగో నేల అప్పుడే కడుదూరం.
అభినందనలు! ఇదే నూతన ప్రగతి పథం! భవిష్యత్ రథం.
కొత్త తరహా జీవితానికి స్వాగతం! సుస్వాగతం!

# 8. లీప్‌జిగ్‌లో ఆయుర్‌బాక్ టావరన్ (మధుశాల లాంటిది)

## (Auerbach's Tavern in Leipzig)

### (ఆనందాభిలాషులు కొందరు)

ఫ్రాస్చ్ : మీ మొహంలో నవ్వేది? పైన కళ్లద్దాలేవి?
ఓ మూల కూర్చుని ఈ మూతి ముడుపులేమి?
చిటపటలాడే తారాజువ్వలీ దినం,
తుస్సుమన్న చిచ్చుబుడ్లలా ఏమిటా వదనం?

బ్రాండర్ : అది నీ తప్పే! ఎక్కడ నీ విదూషకత్వం!
ఏదో ఒక గారడీ చేసి చూపించునీ ప్రయోజకత్వం!

ఫ్రాస్చ్ : (బ్రాండర్ తలమీద మధువు గుమ్మరించి)
సరిపోయిందా? ఇంకా కావాలా?

బ్రాండర్ : నువ్వో పందివెధవ్వి!

ఫ్రాస్చ్ : ఏదో గారడి చెయ్యమన్నావు, కాస్త ఆరడి చేసానంతే!

సైబెల్ : పోట్లాటకు దిగావా, బయటకు విసిరేస్తాం!
పాటలు పాడు, గోలచేయి, గొంతు తడుపు, సంతోషిస్తాం!
మిత్రులారా! రండి! వినోదాల విపంచి మీటుదాం!

ఆల్ట్‌మాయెర్ : బాబోయ్! నా చెవుల్లో దూదిపెట్టండి!
కర్ణభేరులు పగుల్తున్నాయి వీడి అరుపుల్తో చూడండి!

సైబెల్ : పైకప్పు అదిరిపోవాలి అరిస్తే గిరిస్తే!
అది అసలైన basso profound అన్నానా నమస్తే!

ఫ్రాస్చ్ : అదీ పద్ధతి! బాధపడ్డాననేవాడిని బయటపడేయండి. ట్రా!లాలా!లా!

ఆల్ట్‌మాయెర్ : ట్రా లాలాలాలాలా

ఫ్రాస్చ్ : బ్రహ్మాండమైన గొంతు; సవరించుకోండి ముందు;
పవిత్ర రోమన్ రాజ్యం, మేం నిన్నెంతో ప్రేమిస్తున్నాం!
ఇంకా కలిసెట్టా వున్నావో; అర్థంకాక చస్తున్నాం!

బ్రాండర్ : వెధవ కంపు పాట! సిగ్గుసిగ్గు! రాజకీయ గీతం! వద్దు వద్దు!

అరాజక గీతం! మిత్రులారా! మన దైనందిన ప్రార్థనలో
దేవుడికి కృతజ్ఞతలు తెలుపుదాం;
సామ్రాజ్య పాలన మన వ్యవహారం కానందుకు!
చక్రవర్తినో, విత్తమంత్రినో కాకపోవడం
నిజంగా అది నా అదృష్టం!
కాని మనకొక నాయకుడు ఉండటం ఆచారం,
అందుకే 'పోప్'ను ఎన్నుకుని మన నెత్తిపై పెట్టుకున్నాం!
మనందరకూ తెలుసు ఆ విధి విధానాలేమిటో
ఎటువంటివాడు ఆ పదవికి సరితూగుతాడో!

ఫ్రాస్చ్ : (పాట) ఎగిరిపో, నైటింగేల్, ఎగిరిపో గీతమై,
నా ప్రియురాలి ఎద నలరించే సంగీతమై;

సైబెల్ : సంగీతం లేదు, ఆహ్వానగీతమూ లేదు,
వృథా ప్రయాస, ప్రియురాళ్లతో ఘోష;

ఫ్రాస్చ్ : 'ముద్దులు మురిపాలు ముచ్చటగా తెచ్చాను
నన్ను లోనికి రానివ్వు, నా అందాల వెన్నెలా!
నీ దరికి చేరనివ్వు, ప్రియురాలా జవరాలా!
తెల్లవారకమునుపే, నేనెళ్లిపోతాను.

సైబెల్ : అలాగే, పాడు, ఆమె సొబగుల్ని పొగడు!
చివరకు నవ్వుతాడు నీ అవస్థ చూసి ప్రతి ఒక్కడూ!
నన్ను మోసం చేసింది నిన్ను చేయకుంటుందా!
ఎవడో పిశాచం, ఆ వగలాడి ప్రియుడంట.
నాలుగు వీధుల కూడలిలో, లాలించి మురియునంట!
మంత్రగత్తెల మఠం నుంచి ఆ సోగ్గాడు వచ్చునంట!
మేకపోతులా ఆమెను మెడ నిమిరి పోవునంట!
వెళ్లు! వెళ్లు! ఆమె ఎదుట పాడు ప్రేమగీత రాగం!
నెత్తురూ మాంసమున్న వాళ్లం మనమామెకు సరితూగం!
కామపిశాచి కౌగిలికి నీవవుతావు ఆహారం!
నేనైతే రాయిపెట్టి కొడతా, పాటకు పరిహారం!

బ్రాండర్ : (బల్లపై గట్టిగా కొడుతూ)– పెద్దమనుషులారా! శ్రద్ధగా వినండి!
మీకు తెలుసు, నాకు లౌక్యం తెలుసని!

మన మధ్యలో ఇక్కడ పిచ్చి ప్రేమికులున్నారు.
మర్యాద చెబుతోంది మంచిపాట పాడమని.
వాళ్ల కంకితం ఈ పాట, గొంతు కలపండి మీరంతా!
'కలుగులో ఉన్నదొక ఖంగాళీ ఎలుక'
చీకటితో వాసనతో నిండివున్నదా కలుగు
వెన్న, జున్ను తిని బలిసిందా పందికొక్కు
డాక్టర్ లూథర్ కడుపంత లావెక్కెనా ఎలుక!
వంటమనిషి దాన్ని చూసి వేసిందొక జున్నుముక్క
విషమున్నదని తెలవక తిన్నదా బండ ఎలుక
ముక్కువెంట నురుగు, గొంతులో గురక
దాని అరుపులు విన్నవాళ్లు అనుకున్నారనది ప్రేమకేక!

**అందరూ హుషారుగా–** నీవనుకుంటావు, అది పెడ్తున్నది ప్రేమకేక!

**బ్రాండర్** : చుట్టూరా పరుగులు, ఇంటా బయటా ఉరుకులు
ఎక్కడబడితే అక్కడ తెగ తాగింది నీళ్లు.
గోడల్ని గోకింది, నేలను కొరికింది
దాని కోపమంతా వృథా అయిపోయింది. ఓహో!
చావుభయంతో అది చాలా తల్లకిందులయ్యింది, ఓహో!
పాపం దానికప్పుడు, చావు మూడిందని తెలుసు గాని
నీవనుకుంటావు అది, పెడ్తున్నది ప్రేమకేక!

**బృందం** : నీవనుకుంటావు అది, పెడ్తున్నది ప్రేమకేక!

**బ్రాండర్** : పట్టపగలు, వంటగదిలోకి పాకుకుంటూ నడిచింది
భయంతో వణుకుతూ పొయ్యి పక్కన పడుకుంది
కండరాలు కదుపుతూ ముక్కుతూ మూలిగింది.
క్రూరమైన వంటమనిషి దాన్ని చూసి నవ్వింది.
'ఎలుక మందు తిన్నది, బెక్కుతుంది చచ్చేదాక!
కానీ, నీవనుకుంటావు అది, పెడ్తున్నది ప్రేమకేక!

**బృందం** : నీవనుకుంటావు అది, పెడ్తున్నది ప్రేమకేక!

**సైబెల్** : దీనిలో ఏముంది నవ్వడానికంతగా?
ఆ ఎలుకకు మందు పెట్టడం తేలిక కాదు తెలుసుగా!

**బ్రాండర్** : నీకు ఎలుకలంటే ఇష్టమా, ఏమిటి?

**ఆల్ట్‌మాయెర్ :** బానపొట్ట, బట్టతల ఇతగాడికి ఇచ్చాయి పిరికితనం కానుక
ఎలుకమీద జాలెందుకంటే ఇద్దరూ ఒకేలా ఉంటారు కనుక
**(ఫాస్ట్, మెపిస్టొఫిలిస్ ప్రవేశం)**

**మెఫిస్టొఫిలిస్ :** ఇప్పుడు నా తక్షణ కర్తవ్యం
నీకో మంచి తోడును వెదకడం;
జీవితాన్ని ఎంత సరదాగా గడపొచ్చో చూడు,
వీళ్లు దాన్ని పెద్ద విందుగా, హాస్యంతో పసందుగా మారుస్తున్నారు నేడు.
ఈ చిన్ని వలయంలో కాసింత నవ్వు, కాసింత హాయి
గడిపేస్తారు నృత్యగానాలతో పగలూ రేయి
పిల్లి పిల్లలు తమ తోకల్ని వెంటాడుతున్నట్లు వీళ్ల జోరు
తలనెప్పి రానంతవరకూ తాగి తందనాలాడడం, వీరి తీరు;
చీకూ చింతా లేని వీళ్లకు ఏరోజూ తగ్గదు హుషారు!

**బ్రాండర్** : అదుగో అటు చూడండి, ఎవరో ఇద్దరు ప్రయాణీకులు,
దూరదేశం వాళ్లనుకుంటా, గమ్మత్తుగా వాళ్ల వేషభాషలు,
ఇప్పుడే వచ్చినట్లున్నారు, ఇద్దామా స్వాగత సత్కారాలు?

**ఫ్రాస్చ్** : లెస్స పలికితివి మిత్రమా! మన లిప్‌జిగ్ నగరం
'పారిస్'కేం తీసిపోదని చెబుతాం! మన నగరం ఓ జ్ఞానసాగరం!

**సైబెల్** : ఈ మన నగర సందర్శకులు, ఎవరని నీ ఊహ?

**ఫ్రాస్చ్** : ఈ విషయం వదిలెయ్యండి నాకు! వాళ్లకిద్దాం కాస్త మన పానీయం
తరువాత వాళ్లు మాట్లాడ్తారు; అప్పుడే అడ్డంకీ రానీయం;
చిన్నపిల్లాడి పాలపళ్లు పీకినట్లు, నిజాన్ని నెమ్మదిగా రాబడతాను.
వాళ్ల నడకా, పొగరూ చూస్తుంటే, ఉన్నత కుటుంబ వ్యవహారమనుకుంటాను.

**బ్రాండర్** : వ్యాపారస్తుల్లా ఉన్నారు, బహుశా సంతకు వచ్చి ఉంటారు!

**ఆల్ట్‌మాయెర్ :** కావచ్చు!

**ఫ్రాస్చ్** : నేను కనుక్కుంటానుగా– ఎవరు? ఏమిటి? ఎక్కడనుంచి రాక!

**మెఫిస్టొఫిలిస్ :** (ఫాస్ట్‌తో)– సామాన్యులకు డెవిల్ గురించి అర్థం కాదు
వాళ్లు అతడిని బంధించి కూడా తెలుసుకోలేరు.

**ఫౌస్ట్** : పెద్దలారా! అభివాదములు!

**సైబెల్** : మా అభివాదములు మీ ఇద్దరికీ!
(మెఫిస్టోఫిలిస్ కుంటికాలు వేపు చూస్తూ–)
ఏమైంది ఇతగాడి పాదానికి? కుంటివాడా?

**మెఫిస్టోఫిలిస్ :** మేం ఇక్కడ కూర్చోవచ్చునా?
ఇక్కడి మధువు నాణ్యతకన్నా మీ పరిచయం విలువైనదని చెప్పనా!

**ఆల్‌మాయర్:** మీకు అద్భుత రసాస్వాదన ఉన్నదని నేను బల్లగుద్ది చెప్పగలను.

**ఫ్రాష్చ్** : రిప్పాక్ నుంచి బయల్దేరినట్లున్నారు ఆలస్యంగా,
అక్కడ హాన్స్ వెధవతో భోంచేసారా తీరికగా!

**మెఫిస్టోఫిలిస్ :** ఈరోజు కలవలేదు కాని క్రితం సారి మాట్లాడుకున్నాం.
లిప్‌జిగ్ మిత్రుల గురించి అతగాడు చెప్పాడు అనేకం!
(ఫ్రాష్చ్‌కు వినయంగా నమస్కరించాడు)

**ఆల్ట్‌మాయర్:** (ఫ్రాష్చ్ చెవిలో) బాగా తిప్పికొట్టాడు నీ మాటల్ని!

**సైబెల్** : చమత్కారి!

**ఆల్ట్‌మాయర్:** గట్టిపిండంలానే ఉన్నాడు.

**ఫ్రాష్చ్** : అప్పుడే ఏం చూసావ్! మరోదెబ్బ కొట్టనూ!

**మెఫిస్టోఫిలిస్ :** పొరబడలేదు కదా నేను, ఇందాక విన్నానో హుషారు గీతాన్ని
పైకప్పు అదిరిపడేలా పాడిన సమూహ గానాన్ని.

**ఫ్రాష్చ్** : మీలో కళాభినివేశం ఎక్కువే!

**మెఫిస్టోఫిలిస్ :** అబ్బెబ్బే– అంత ఎక్కువేం కాదు! కొంచెం ప్రవేశం! అంతే!

**ఆల్ట్‌మాయర్:** మీరూ పాడండి!

**మెఫిస్టోఫిలిస్ :** మీకు సంతోషం కలిగిస్తుందంటే సరే!

**సైబెల్** : పాత తుక్కు వద్దు! ఏదైనా కొత్తదైతే ముద్దు!

**మెఫిస్టోఫిలిస్ :** మేం ఇప్పుడే స్పెయిన్ దేశం నుంచి వస్తున్నాం
పాటకు మధువుకు సాటిలేనిదా దేశం.
అక్కడి రాజు పరిపాలిస్తాడు ప్రజల్ని బాగా
అతడు పెంచుకుంటున్నాడు పెద్ద మహా ఈగ!

**ఫ్రాస్చ్ :** శభాష్! ఈగ! వినాలి ఈ పాటను వివరంగా,
ఈగ కన్న మంచి అతిథి దొరికేనా సంబరంగా!

**మెఫిస్టోఫిలిస్ :** అక్కడి రాజు పరిపాలిస్తాడు ప్రజల్ని బాగా
అతడు పెంచుకుంటున్నాడు ఓ పెద్ద మహా ఈగ
కన్నకొడుకు మీద కన్నతండ్రి ప్రేమ
చూడవచ్చు మీరతనిలో స్పష్టంగా మిత్రమా!
దర్జీని పిలిచి దర్జాగా ఆదేశం!
రాకుమారుడికి కుట్టుము దుస్తుల్ని తక్షణం,
అంగీ, చొక్కాలు, లాగూలు అత్యంత ముఖ్యము,
అన్ని కాళ్లకు సరిపడేలా అందంగా కుట్టుము!

**బ్రాండర్ :** దర్జీకీ చెప్పుము, ముఖ్యంగా ఈ విషయం!
నీ కొలతలు తీసుకో ఇప్పుడే ఈ క్షణం.
సరిగా లాగూలు సరిపోవడం ముఖ్యం!
తేడా వచ్చిందా తలెగిరిపోవడం తథ్యం!

**మెఫిస్టోఫిలిస్ :** ఈగకిప్పుడు అమిరాయి విలాస వస్త్రాలు,
సిల్కుతో వెల్వెట్‌తో చీని చీనాంబరాలు,
తారలు, రేఖలు తళతళలాడగా,
తనతోటివారలు అచ్చెరువున చూచుచుండ!
రాజుగారు ఈగకు ఇచ్చినాడు మంత్రి పదవి
సోదర ఈగలు ఆనక మంత్రులైరి సొగసుగా
సోదర ఈగలు ఆనక మంత్రులైరి సొగసుగా
సభికులంతా అసూయగా తిట్టినారు గొణిగినారు
కోపంగా అందరిని కుట్టినాయి ఈగలు
కూర్చున్న రాణిని కుట్టికుట్టి వదిలినాయి.
పనిచేసే సేవకులను పనిగట్టుకు కుట్టినాయి.

రాజుగారి భయంతో వాటినెవడు చంపలేదు.
గొంతెత్తి గొడవ జేసే ధైర్యమే రాలేదు, కానీ,
మన జోలికొస్తే మాత్రం మనమూరుకుంటామా?
పట్టుకుని చితగ్గొట్టి పచ్చడి పచ్చడి చెయ్యమా?

**అందరూ :** (నవ్వుతూ) మన జోలికొస్తే మాత్రం మనమూరుకుంటామా?
పట్టుకుని చితగ్గొట్టి పచ్చడిపచ్చడి చెయ్యమా!

ఫ్రాస్చ్ : శభాష్! శభాష్! బ్రహ్మాండం!

సైబిల్ : ఈగల్లారా నశించండి!

బ్రాండర్ : ఇట్టా పట్టు! అట్టా తొక్కు!

**ఆల్టామాయర్:** స్వేచ్ఛకు అభివాదం! మధువుకు స్వాగతం!

**మెఫిస్టాఫిలిస్ :** మీ దగ్గర మంచి సారాయి ఉంటే,
నేనూ చెప్పేవాడిని బాగా బాగా ఇంతకంటే!

సైబెల్ : తప్పులెన్నేవాడా! ఇక చాలు తప్పుకో!

**మెఫిస్టాఫిలిస్ :** యజమానికి వస్తుందేమో కోపం, లేకుంటే
అతిథులందరకూ నేనివ్వగలను మహా మంచి సారాయం.

సైబెల్ : అతగాడి సంగతి నాకొదిలేయ్! నీ దగ్గరున్న సీసాల చిఠా చెప్పేయ్!

ఫ్రాస్చ్ : మంచి ద్రాక్షసారాయికి మించినదేమున్నది,
ముందు గొంతు తడుపు! రుచి చూసి చెబుతా!
నిజం చెప్పాలంటే మాకడుపు నింపి చూడు
పెద్దపెద్ద గుక్కలతో ప్రపంచపు గుట్టు విప్పేస్తా!

**ఆల్ట్మాయర్:** (స్వగతం)– వీళ్లు రైన్‌లాండ్ వాసులే, సందేహం లేదు!

**మెఫిస్టాఫిలిస్ :** పీపా మూత తీసే పనిముట్టున్నదా? బరమా!

బ్రాండర్ : అదెందుకిప్పుడు? మీ దగ్గర సారా సీసాలు లేవా?

**ఆల్ట్మాయర్:** అదిగో అక్కడుంది పనిముట్ల పెట్టె!

**మెఫిస్టాఫిలిస్ :** (బరమా తీసుకుని) ఏ ద్రాక్షసారా నీకిష్టం?

ఫ్రాస్చ్ : అన్నిరకాలున్నాయా మీ దగ్గర?

**మెఫిస్టాఫిలిస్ :** ఇష్టమైంది చెప్పుకో! నచ్చితేనే తీసుకో!

**ఆల్ట్మేయర్:** (ఫ్రాస్చ్‌తో)– అప్పుడే పెదాలు చప్పరిస్తున్నావే– హీహీ!

ఫ్రాస్చ్ : రైన్‌లో చేసే Hock అంటే నాకంగీకారం!
ఇంట్లో చేసే మధువే ఎంతో రుచికరం!

**మెఫిస్టాఫిలిస్ :** (బల్లకూ ఫ్రాస్చ్ ఉన్న పక్క 'బరమా'తో రంధ్రం చేస్తాడు.)
కావాలి కాస్త మైనపు పూత, ఆపేందుకు ఏదన్నా మూత!

**ఆల్ట్‌మాయర్:** ఇదేదో మాయరో దేవుడోయ్!

**మెఫిస్టోఫిలిస్ :** (బ్రాండర్‌తో) నీకేం కావాలి?

**బ్రాండర్ :** నాకు కావాలి ఛాంపేన్;
బుడగలతో నిండిన ఛాంపియన్!

**మెఫిస్టోఫిలిస్ :** (మెఫిస్టోఫిలిస్ రంధ్రాలు చేస్తుంటే మిగతావాళ్లు
మైనపు పూత పూసిన మూతలు రంధ్రాలపై బిగిస్తున్నారు)
విదేశీ వస్తువుల విలువ తక్కువేం కాదు,
ఇంటి సరుకు మంచిదే కాని ఇంత రుచిగా ఉండదు
జర్మనీవాడి ముక్కులో ఫ్రెంచివాడి వాసన
కాని కాస్త తాగి చూడు కాదనలేవు నాయనా?

**సైబెల్ :** (మెఫిస్టోఫిలిస్ సైబెల్ వైపు రాగానే)
పొడిపొడి మధువు నాకొద్దు! తీయనిదానికి లేదే హద్దు!

**మెఫిస్టోఫిలిస్ :** నీకిస్తానొక Tokay! అది నీకు O.K!

**ఆల్ట్‌మాయర్:** పరిహాసమాడ్తున్నారా పరదేశులారా?

**మెఫిస్టోఫిలిస్ :** ఘనత వహించిన తమ ముందు కుప్పిగంతులా!
తమకేం కావాలో చెబితే ఇస్తానీ క్షణంలో ఇలా

**ఆల్ట్‌మాయర్:** మీ ఇష్టమే మా యిష్టం; ఆలస్యం బహుకష్టం!
(రంధ్రాలు చేసి మూతలు బిగించబడినాయి)

**మెఫిస్టోఫిలిస్ :** (చేతుల్ని వింతగా ఊపుతూ)
తీగెల మీద ద్రాక్షగుత్తులు కాస్తున్నవి
మేక నెత్తిమీద కొమ్ములేమో నావి!
ద్రాక్ష కాడ చెక్కది; చెక్క నుంచి ద్రాక్షవనం
చెక్కబల్ల ఇస్తుంది చిక్కనైన ద్రాక్షరసం
ప్రకృతంతా మాయ! మాయలోనే మంత్రం
మూతల్ని లాగండి! చూసుకోండి తంత్రం!

**అందరూ :** (మూతలు తీయగానే వాళ్లవాళ్ల గ్లాసుల్లోకి ద్రాక్షరసం చిమ్మి నింపుతుంది)
హాయ్! హాయ్! కడుపునిండా తాగి హాయిగా తూగుదాం!

**మెఫిస్టోఫిలిస్ :** తాగండి మిత్రులారా! కాని గుర్తుంచుకోండి! మధువెంతో ప్రమోదం!
ఏ ఒక్కచుక్క ఒలికినా ఎంతో ప్రమాదం!
**(గ్లాసు తర్వాత గ్లాసు తాగుతూనే ఉన్నారు)**

**అందరూ** : (పాడుతూ) విందంటే ఇది! పసందుగా ఉన్నది
అయిదు వందల జీవాల్ని అలా తిన్నట్టుగా ఉన్నది.

**మెఫిస్టొఫిలిస్** : ఈ తాగుబోతు గుంపు, కనులకు బహు ఇంపు

**ఫాస్ట్** : నాకు వెళ్లిపోదామని ఉంది.

**మెఫిస్టొఫిలిస్** : ఇప్పుడు చూద్దువు గాని వీళ్లలోని జంతు ప్రకృతి!
సగమే చూసావు, ఇప్పుడు కనిపిస్తుంది వాళ్ల అసలు సంగతి!

**సైబెల్** : (అజాగ్రత్తగా తాగడంతో సారా నేలపైబడి మంట మండుతుంది)
రక్షించండి! రక్షించండి! నరకాగ్నిజ్వాల నన్ను కాలుస్తున్నది.

**మెఫిస్టొఫిలిస్** : (మంటలను ఆజ్ఞాపిస్తూ)– అగ్ని మూలకమా! ఆగిపో! చల్లారిపో!
చిన్ని నిప్పురవ్వ! చిటపటలాడుతుందంతే!

**సైబెల్** : ఏమిటి తమాషా చేస్తున్నావా? మాకిది గిట్టదు మహానుభావా!

**ఫ్రాస్చ్** : ఇంకోసారి మండిందా, నీకు చావు మూడిందే!

**ఆల్ట్‌మేయర్:** ఇతగాడిని బయటకు తీసుకువెళ్లి విలువైన పాఠం చెబుతాను.

**సైబెల్** : నీకు ఎంత ధైర్యం! మా మీద ప్రయోగిస్తావా నీ మంత్రతంత్రం!

**మెఫిస్టొఫిలిస్** : నీ నోటికి వేసుకో మూత! ఒరే పాతకాలం సారా పీపా!

**సైబెల్** : వెదురుబొంగులా నీవూ, నీ రూపమూ!
మమ్మల్ని ఎగతాళి చేస్తే రాదా కోపమూ!

**బ్రాండర్** : మాటలు చాలు! వీడి ముడ్డి మీద తంతే రాలాలి పళ్లు!

**ఆల్ట్‌మేయర్:** (బల్ల మీద మూత లాగగానే అగ్నిజ్వాల మీదకు దూకుతుంది)
మంట! మంట! కాలిపోతున్నానురా బాబోయ్!

**సైబెల్** : ఇదంతా కనికట్టు; ఆయుధాల్ని చేబట్టు!
మంత్రగాళ్లను చంపినా, శిక్ష లేదు ఒట్టు!
(కత్తులు దూసి వాళ్లు మెఫిస్టొఫిలిస్‌ను చుట్టుముట్టినారు)

**మెఫిస్టొఫిలిస్** : (సంజ్ఞలు చేస్తూ)
అబద్ధపు మాట సందేశం, పాడుమనసూ ప్రదేశం!
ఇక్కడా, అక్కడా, ఒకే రకపు దేశం!!
**(వచ్చే వాళ్లు ఆగిపోయి ఒకరి నొకరు చూసుకుంటారు)**

**ఆల్ట్‌మేయర్:** నేనెక్కడున్నాను? ఏమిటీ అద్భుత దేశం?

**ఫ్రాస్చ్** : ద్రాక్షవనాలు! ఇది కలయో! భ్రాంతియో! బ్రాందీయో!

**సైబెల్** : చేతికందుతున్నాయి ద్రాక్ష గుత్తులు.

**బ్రాండర్** : ఆకుపచ్చని తీగెల కింద, అసంఖ్యాకపు ద్రాక్షపళ్లు.
(అంటూ సైబెల్ ముక్కు పట్టుకుంటాడు. మిగతావాళ్లు
కూడా పక్కవాళ్ల ముక్కులు పట్టుకుని కత్తులు లేపుతారు)

**మెఫిస్టొఫిలిస్ :** (సంజ్ఞ చేస్తూ)– భ్రాంతీ! వదిలేయ్ వాళ్ల కళ్లను!
డెవిల్ హాస్యం వదిలిపెట్టదు వాళ్లను!
(ఫాస్ట్‌తో అదృశ్యమవుతాడు. తాగుబోతులు తేరుకుంటారు)

**సైబెల్** : ఏమిటిది? ఏం జరిగింది?

**ఆల్ట్‌మేయర్ :** ఏమిటిది?

**ఫ్రాస్చ్** : ఎందుకు నీ ముక్కు నేను పట్టుకున్నాను?

**బ్రాండర్** : (సైబెల్‌తో) నేను నీ ముక్కు పట్టుకున్నాను, ఎందుకలా?

**ఆల్ట్‌మేయర్ :** నాకు కళ్లు తిరుగుతున్నాయి, తూలిపడతానేమో!
ఓ కుర్చీ తీసుకురండి, నేను కూలబడేట్లున్నాను.

**ఫ్రాస్చ్** : ఓరి దేవుడో! ఏం జరుగుతోందిక్కడ?

**సైబెల్** : ఆ వెధవ ఏడీ! మళ్లీ నాకు దొరికితే ఎముకలు విరగొడ్తాను.

**ఆల్ట్‌మేయర్ :** వాడు నేలమాళిగ తలుపులు మూయడం చూసాను.
సారా పీపామీద కూర్చుని స్వారీ చేస్తున్నాడు.
నా కాళ్లకున్నాయేమేమో బరువులు,
కాస్త సారా పోయండిరా గురువులూ!

**సైబెల్** : ఇదంతా ఓ కుట్ర! మోసం! కనికట్టు!

**ఫ్రాస్చ్** : నేను ద్రాక్షసారా తాగడం మాత్రం నిజం!

**బ్రాండర్** : మరి ఆ ద్రాక్ష పళ్ల సంగతేమిటి? ఎందుకనలా?

**ఆల్ట్‌మేయర్ :** ఎవరు అనగలరు అద్భుతాలు లేవని?

# 9. మంత్రగత్తె వంటగది
## (A Witch's Kitchen)

**(భగభగమండుతున్న పొయ్యి, పైన గంగాళం. లోపల ఏవో ఉడుకుతూ ఆవిరిపొగలు వెలువడుతున్నాయి. ఓ ఆడ కొండముచ్చు గంగాళంలోని వాటిని కలియబెడ్తున్నది. మగ కొండముచ్చు, పిల్లలను పక్కనేసుకుని వెచ్చగా చలి కాగుతున్నది. గది గోడలకు మంత్రగత్తె సరంజామా అలంకరించబడి ఉన్నది. ఫాస్ట్, మెఫిస్టొఫిలిస్ ప్రవేశం.)**

**ఫాస్ట్** : పనికిరాని మంత్రతంత్రాలంటే నాకు చెప్పరాని అసహ్యం.
ఈ పిచ్చి, అసందర్భ రసాయనాలు తాగించి నన్ను పునీతుడిని చేస్తావా ఏం?
ముసలి మంత్రగత్తె సలహా, పునర్ యవ్వన ఔషధం
ఈ దుర్వాసనా భరిత వింత మందు నా గొంతు దిగేనా?
ఇదా నీవు నాకిచ్చే ఆశా పానీయం! ఇంతకంటే మంచి విరుగుడు లేదా!
ప్రకృతి ఖజానాలో ఇంతకుమించిన పైపూతలు దొరకలేదా!

**మెఫిస్టొఫిలిస్** : ఆర్యా! ఇప్పుడు తమరు సత్యాలు వల్లిస్తున్నారు.
పునర్ యవ్వనం పొందడానికి చెప్పగలను మరో పథకం.
కాని, అది ఇంకో తరహా వ్యవహారం.
మీకు నచ్చదని ముందే ఊహించగలుగుతున్నారు!

**ఫాస్ట్** : చెప్పండి! ఫరవాలేదు.

**మెఫిస్టొఫిలిస్** : డాక్టరూ, ఫీజూ, మంత్రాలు లేవు ఈ వ్యవహారంలో!
మైదానంలోకి అనాది మానవుడిలా వెళ్లడం,
మనసూ, శరీరాన్ని ప్రాచీనతలో మలచడం!
పశువుల్లో పశువుగా బతికి వాటి తిండి తింటూ
గడ్డిమేస్తూ పేడవేస్తూ, దానితో మళ్లా గడ్డి పండిస్తూ
అట్లా కొన్నేళ్లు చేస్తే తమకు ఎనభై ఏళ్లు
వచ్చే వరకూ, ఎప్పటిలానే యువకుడిగా ఉండవచ్చు.

**ఫాస్ట్** : నాకంత ఓపిక లేదు. అలవాటూ లేదు.
పారాతట్టా పట్టుకునే ఆలోచనే రాదు!

**మెఫిస్టొఫిలిస్** : మరయితే తప్పదిక మంత్రగత్తె జాదూ!

**ఫాస్ట్** : మధ్యలో ఎందుకీ ముసలి మంత్రగత్తె సాయం!
నీకు చేయడం రాదా ఓ మంచి శక్తిగల కషాయం?

**మెఫిస్టొఫిలిస్ :** డెవిల్ ఇప్పుడు బిజీగా ఉంది సర్! నిజం చెప్పాలంటే
గంగాళంలోది ఉడికేలోగా నేను కట్టేయగలను వంద వంతెనలు
నాకా మంత్ర తంత్రాలు ఆమూలాగ్రం కరతలామలకాలు
అపారమైన విద్య ఉంది కాని అత్యల్పమైన ఓపిక నాది.
ఏళ్ల తరబడి ఉడికితేనే తయారౌను ఓషధి
కాలమొక్కటే వండగలదు అధిక శక్తిగల రసాయనం
తంత్రంతో పాటు చేయాలి బహు తతంగం
అంత ఓపిగ్గా చేయడం నాకిప్పుడు వల్లకాని వ్యవహారం
డెవిల్ నేర్పాడు మంత్రగత్తెకు ఈ చిన్నిచిన్ని తంత్రాలు
అతడు కలపలేని పదార్థాలు ఆమెచేతి యంత్రాలు

**(అక్కడ ఉన్న జంతువుల్ని చూస్తాడు)**

చూడు! చూడు! మంత్రగత్తె సేవకుడూ, సేవికా!
అదంతా వాళ్ల కుటుంబం, ఎక్కడుంది ఏలిక?

**(కొండముచ్చులతో)**

మీ యజమానురాలు లేదా ఇంటిలో?

**కొండముచ్చులు:** బయటకు వెళ్లింది భోజనానికి,
పొగగొట్టం ద్వారా వేరే ప్రదేశానికి,
ఆలస్యం కావచ్చు ఇంటికి రావడానికి!

**మెఫిస్టొఫిలిస్ :** ఎంత ఆలస్యం అవుతుందో చెప్పగలవా సందేహ నివృత్తికి?

**కొండముచ్చులు:** మేం పొయ్యి వదిలి వెళ్లేంతవరకు
మా అరికాళ్లు, అరిచేతులు చల్లబడేంతవరకు.

**మెఫిస్టొఫిలిస్ :** (ఫాస్ట్‌తో) మంచి సరదాగల జంతువులు కదూ!

**ఫాస్ట్** : నా దృష్టిలో అవి కిరాతక, మొండి క్రూరజంతువులు.

**మెఫిస్టొఫిలిస్ :** అదేం లేదు! వాటి మాటలు నాకు నచ్చాయి.
కొండముచ్చుల్లారా! ఆ కుండలో ఏం వండుతున్నారు?

**కొండముచ్చులు:** ఇది దయగల కషాయం; తేలిగ్గా అరిగే రసాయనం!

**మెఫిస్టాఫిలిస్ :** జనానికి పంచిపెట్టు! జేజేలు మూటగట్టు!

**మగ కొండముచ్చు-** (మెఫిస్టాఫిలిస్ వేపు గంతువేసి...)
ఓ దయగల అయ్యా, విసురు పాచికలు!
నాకెంతో ఇష్టం, డబ్బుల గలగలలు!
గెలవడం ఎంతో ప్రమోదం
పేదతనం అంతా విషాద ప్రధానం.
నా దగ్గర డబ్బుండి ఉంటే
ఈ తల తిరగడం మాని హాయిగా ఉంటుంది జీవనం!

**మెఫిస్టాఫిలిస్ :** అసలే ఇది వానరం! లాటరీ కొట్టేదా ఈ వాలకం!
(పిల్లకోతులు తాము ఆడుతున్న గ్లోబును ముందుకు దొర్లించాయి)

**మగ కొండముచ్చు:** ఈ ప్రపంచమే ఒక పెద్ద గోళం
పైకీ కిందకూ పడుతుంది
గుండ్రంగా తిరుగుతూనే ఉంటుంది
గాజుతో చేయబడింది కనుక పగిలి తీరుతుంది.
ఇదొక ఖాళీ నకిలీ గోళం
వినండి లోపలి బోలు శబ్దం
ఇక్కడ కాస్త వెలుగు, ఇక్కడ కాస్త మెరుగు
తళతళలు మాత్రం తడిమితే కలుగు
'నేను బతికున్నానని' పాడుతుంది నిరతం
కానీ పుత్రుడా! జాగ్రత్త సుమా!
దూరంగా ఉండు దీనికి మాత్రం.
అన్నిటిలానే నీకు మరణం తప్పదు!
మట్టితో చేసిన పదార్థమిది
విరగడం మట్టి లక్షణం - అదే విజ్ఞుల అభిప్రాయం!

**మెఫిస్టాఫిలిస్ :** ఈ జల్లెడ ఉపయోగమేమిటి?

**మగ కొండముచ్చు:** (జల్లెడను పైకెత్తి...)
నీవు దొంగవైతే నేను చెప్పగలను ఖచ్చితంగా!
(ఆడ కొండముచ్చువేపు దూకుతుంది. ఇద్దరూ జల్లెడ గుండా చూస్తారు)
జల్లెడ గుండా చూడు! దొంగను పట్టుకో కాని చెప్పవద్దు!

**మెఫిస్టాఫిలిస్ :** (పొయ్యివేపు వస్తూ-) ఈ గంగాళం దేనికి?

**కొండముచ్చులు:** తెలివి తక్కువవాడా! ఈ గంగాళం దేనికో తెలవదా?

**మెఫిస్టోఫిలిస్ :** మొండి మృగాల్లారా! మీ తిక్క వదిలిస్తా చూడు!

**మగకొండముచ్చు:** అయితే నా ఒడుపు చూడు! ఈ కుర్చీలో కూలబడు!
(మెఫిస్టోఫిలిస్‌ను బలవంతంగా కూర్చోబెడ్తుంది)

**ఫాస్ట్ :** అద్దం ముందు నిలబడి ముందుకూ వెనక్కూ నడుస్తూ
అద్దంలోంచి చూస్తుంటాడు
ఈ మాయాదర్పణంలో కనిపించే అందాలరాశి ఎవరు?
ప్రేమా! నన్ను ఆమె సన్నిధికి చేర్చవా!
నీ వేగవంతమైన రెక్కలను నాకు తొడుగు!
ఇక్కడ్నుంచి ముందుకు కదలగానే స్వప్నంలోలా
అదృశ్యమవుతున్నదే ఆమె రూపం! ఏమిటీ విచిత్రం!
అంత మనోహర లావణ్యవతి ఈ భువిపై ఉన్నదా! లేక ఇది భ్రమా!
స్వర్గలోకపు సౌఖ్యాల్ని ఆమెలో గమనిస్తున్నాను.
సూర్యుని దృష్టి దిగువ ఇంత అందాల కన్య ఉన్నదని నమ్మలేకున్నాను.

**మెఫిస్టోఫిలిస్ :** ఆరురోజులు కష్టపడిన దేవుడు
ఏడవ రోజున తనను తాను పొగుడుకున్నాడు.
అతని సృష్టి అంత అందంగా ఉందనుకుంటే
నీ కళ్లతో ఆ అందాల్ని తాగేయి, మిత్రమా!
అటువంటి లావణ్యవతినే నీకు నేను చూపిస్తాను.
నీ అదృష్టాన్ని పరీక్షించుకో!
విజయుడవయ్యావా, నీకన్నా సంతోషపడే వాడింకొకడుండడు!
(ఫాస్ట్ అద్దంలోకి చూస్తుంటాడు, మెఫిస్టోఫిలిస్ కుర్చీలో ఊగుతూ,
ఓ చెర్నాకోలను అటూయిటూ తిప్పుతూ, మాట్లాడుతుంటాడు.)
ఇక్కడనే కూర్చున్నాను, ఇది నా సింహాసనం!
ఇదిగో నా రాజదండం, మరి ఏది నా కిరీటం?

**కొండముచ్చులు:** (అటూ, యిటూ గంతులేస్తూ కిరీటాన్ని తెచ్చి
మెఫిస్టోఫిలిస్‌కు ఇవ్వబోతాయి)
అయ్యో! ఇది చెమటతో, రక్తంతో తడిచిన కిరీటం!
తమరి తలపై ఉండతగిందే కాని జర భద్రం!
(అందించబోతూ జారవిడవగా కిరీటం నేలపైబడి రెండుముక్కలైంది.

ఆ ముక్కలపై ఎగిరి గంతులేసి పొడిపొడి చేస్తూ-)
అయ్యో! అయ్యో! ముక్కలయ్యిందా కిరీటం!
చూపు, వినికిడి, మాటతో మేమే ఇప్పుడు రాజులం!

**ఫాస్ట్** : (అద్దంలోకి చూస్తూ) నాకేమన్నా మతిభ్రమణమా? ఏమిటీ స్థితి?

**మెఫిస్టోఫిలిస్ :** (కొండముచ్చులను చూపిస్తూ)- నాకూ పిచ్చెక్కిస్తున్నాయీ మృగాలు!

**కొండముచ్చులు :** రాగాలు కలిస్తే రోగాలు పోతాయి.
ఆలోచన ఫలిస్తే అర్థాలవే వస్తాయి.

**ఫాస్ట్** : (బిగ్గరగా) నా హృదయం జ్వలిస్తున్నది, ఏం చేయాలో తోచకున్నది!
మనం వెళ్లిపోదాం ఇక్కడ్నుంచి, తక్షణం ఈ చోటు నుంచి!

**మెఫిస్టోఫిలిస్ :** (స్థిమితంగా కూర్చుని)
ఏమాట కామాట చెప్పుకోవాలి,
ఈ కొండముచ్చులు కవులన్నది ఒప్పుకోవాలి!
(ఆడ కొండముచ్చు చూడాల్సిన గంగాళం పొంగి, మంటల్లో ద్రవం పడగా మంట ఉవ్వెత్తున ప్రజ్వలిస్తూ పొగగొట్టంలోకి పాకుతుంది. ఆ మంటల్లోంచి దిగి వచ్చిన మంత్రగత్తె భీకరంగా అరుస్తుంది.)

**మంత్రగత్తె :** ఓ! ఓ! ఓ! ఓ!
మొండి జంతువా! తిక్క పందీ!
పొయ్యి దగ్గరేమయ్యింది నీ జాగ్రత్త!
నన్ను కాల్చేసావే ఆ మంటతో దొంగమొహమా!
(ఫాస్ట్‌ను మెఫిస్టోఫిలిస్‌ను చూసింది)
ఏమిటిది? ఎవరు వీళ్లు?
ఎవరు మిమ్మల్ని రానిచ్చారు?
ఏమిటీ ధైర్యం? నా నరకాగ్నిజ్వాలలు
మిమ్మల్ని ఎముకలదాకా కాల్చేయునుగాక!
(గంగాళంలోని తెడ్డును లాగి మంటలో ముంచి
జ్వాలల్ని మెఫిస్టోఫిలిస్, ఫాస్ట్‌ల మీదకి విసుర్తుంది.
కొండముచ్చులు భయంతో మూలుగుతాయి)

**మెఫిస్టోఫిలిస్ :** (తన దగ్గర చర్నాకోలను వెనక్కి తిప్పి అక్కడున్న కుండల్ని గ్లాసుల్ని తాకిస్తూ)

చీలిపో, చీలిపో రెండుగా!
నీ వంటను చీల్చేయి రెండుగా!
అది నీ వంటను చెడగొడ్తుంది.
నేను హాస్యానికంటున్నాను.
ఓ ముసలిదానా! నీ మాయల్ని మళ్లిస్తున్నాను!
(మంత్రగత్తె కోపంతో మండి పడబోగా-)
నేనెవరో తెలియలేదా బక్కచిక్కిన ఎముకలదానా?
నీ యజమాని, ప్రభువునే గుర్తించలేకున్నావా?
నిన్నెందుకు ముక్కలు ముక్కలు చేయకూడదో చెప్పగలవా?
నా ఎర్రటి అంగరఖాకు గౌరవమివ్వడం మళ్లీ నేర్పాలా?
ఈ కోడి ఈక ఏమిటి? నా ముఖాన్ని దాస్తున్నానా?
ఎక్కడుండాలో అక్కడుండు ఓ ముసలి వగ్గు!
నా పేరు చెప్పాలా నీకు? తగ్గు! తగ్గు!

**మంత్రగత్తె :** ప్రభూ! ఈ దీనురాలిని క్షమించు.
కాని ఏది నీ చీలిన పాదం?
ఎక్కడ నీ గుర్రపు కాలు? ఎక్కడ నీ కాకులు?
ఏవి నీ అవాకులు, చవాకులు?
మన్నించి నీ సేవకురాలి సందేహం తీర్చరూ!

**మెఫిస్టొఫిలిస్ :** నీ అభ్యర్థన తగిందే! నీ సందేహం సరైనదే!
మనం కలిసి ఇప్పటికి చాలా కాలమయ్యింది.
నాగరికత ఇప్పుడు మనకు నాజూకును నేర్పింది.
ఉత్తర దిక్కు దయ్యం శక్తి కాస్త ఉడిగింది.
అతడి కొమ్ములు, తోక, కోర దంతాలు
వాటితో బయటకెడితే జనాలకు సందేహాలు
యువకుల్లాగా నేనిప్పుడు తొడుక్కుంటున్నాను
చాలాకాలం నుంచి పొడుగాటి మేజోళ్లు.

**మంత్రగత్తె :** సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాను!
యువ ప్రభువు సాతాను వచ్చెనని తెలుసుకున్నాను!

**మెఫిస్టొఫిలిస్ :** ఆ పేరు వాడవద్దు!

**మంత్రగత్తె :** ఎందుకని? ఆ పేరులోని లోపమేమిటని?

**మెఫిస్టొఫిలిస్ :** ప్రజల నోటిలో నాని నాని పాతబడిపోయింది.
అంతేకాదు ఆ పేరంటేనే 'డెవిల్' అని స్థిరపడిపోయింది.

నన్ను 'బారన్'– చిన్నప్రభూ అని పిలువు, అదే చాలు!
నేను నాలాంటి వాళ్లలా ఓ పెద్దమనిషిని, అదే పదివేలు.
నా ఒంట్లో ఉన్నది ఉన్నత కుటుంబపు రక్తం.
కావాలంటే పరీక్షించుకో అంగరఖాలో చిహ్నం!
(అంటూ అసభ్యకరమైన సంజ్ఞ చేస్తాడు)

**మంత్రగత్తె** : (నవ్వులు, కేకల్తో)
హా! హా! హా! ఒక్కముక్క మారలేదు నీ తీరు,
మునుపటి కొంటె కుర్రాడివే, ఆగదు నీ జోరు!

**మెఫిస్టాఫిలిస్** : (ఫాస్ట్‌తో) గుర్తుంచుకో, మిత్రమా! ఈ విధానం!
మంత్రగత్తెలకివ్వాలి ఇలాగే సమాధానం!

**మంత్రగత్తె** : పెద్దమనుషులారా! మీకు నేను చేయగలిగిన సేవ ఆజ్ఞాపించండి!

**మెఫిస్టాఫిలిస్** : ఓ గ్లాసు నిండా మాంఛి రసాయనం
ఎంత పాతదైతే అంత మధురం
ఏళ్లు గడచినకొద్దీ రెట్టింపయ్యే తీపిద్రవం!

**మంత్రగత్తె** : తప్పకుండా! నేను అప్పుడప్పుడూ తాగుతాను ఓ గుక్క
ఈ అరలోని సీసాలో ఉంటుంది చుక్క
ప్రస్తుతం వాసన తగ్గింది కాని 'వాసి'లో పెరిగింది లెక్క
(చెవిలో) మామూలుగా తాగితే ప్రాణాంతకం!
సిద్ధంగా ఉన్నవాళ్లకిది సిద్ధామృతం!

**మెఫిస్టాఫిలిస్** : అతడికిది మంచే చేస్తుంది. మన స్నేహితుడితడు.
నీ వంటగది ఆతడికిస్తుంది రక్షణా కవచం.
వలయాన్ని గీసి, మంత్రాలు చదివి, ఇవ్వు ఓ కప్పునిండా రసాయనం.

**(మంత్రగత్తె రకరకాల విన్యాసాలతో, వలయాన్ని గీసి, అనేక వస్తువులు ఉంచగానే, అక్కడున్న కుండలు, గ్లాసులు, వస్తువులు కదుల్తూ గానం చేయసాగినాయి. చివరకు మంత్రగత్తె మంత్రోచ్చారణ చేస్తూ, కొండముచ్చుల్ని వలయంలోకి రప్పించి, అవి ఓ బల్లలా వంగుని ఉండగా వాటిపైన పెద్ద పురాతన గ్రంథాన్ని ఉంచి, కాగడా వెలుగులో పుటలు తిప్పుతూ 'ఫాస్ట్'ను లోనికి రమ్మని ఆహ్వానిస్తుంది)**

**ఫాస్ట్** : (మెఫిస్టాఫిలిస్‌తో)–
చూడు! దీనివల్ల నాకేమిటి ప్రయోజనం?

ఈ ఉన్మత్త విన్యాసాలు, ఈ పనికిరాని చెత్త,
మంత్రగత్తె మాయాజాలం, టక్కుటమారం,
ఇంతకుముందు విన్నవే, కన్నవే, ఏం లేదు కొత్త?

**మెఫిస్టొఫిలిస్ :** హాస్యాన్ని హాస్యంగా చూడు మిత్రమా!
అన్నిటికీ వేదాంత దృక్పథం అవసరమా?
వైద్యుడిగా ఆమె తన ఔషధం పనిచేయాలంటే
కాస్త మంచి చెడూ విమర్శన చేయడం, రోగి మంచికేగా!
(ఫాస్ట్‌ను వలయంలో నిలబెడ్తాడు)

**మంత్రగత్తె :** (గ్రంథంలోంచి చదువుతూ, వింత వింత ఉచ్చారణలు చేస్తూ)
ఇప్పుడి వినండి, చూడండి!
ఒకటి పదయితే
రెండు తీసుకో ఇప్పుడే
తరువాత మూడు,
ఇప్పుడు నీవు భాగ్యవంతుడివి.
నాలుగు లెక్కలోకి రాదు
కాని, మంత్రగత్తె మాట తిరుగులేని బాట!
అయిదు, ఆరు నుంచి
ఏడు, ఎనిమిది తయారు చేయ్!
అప్పుడు అంతా నిలకడ
తొమ్మిది ఒకటవుతుంది
పదంటే శూన్యం! పద! పద!
మంత్రగత్తె ఎక్కం లెక్క అయిపోయింది కదా!

**ఫాస్ట్ :** ఈమెకు ఖచ్చితంగా ఉన్మాదమే!

**మెఫిస్టొఫిలిస్ :** ఆమె ఇంకా చెప్పాల్సింది చాలా ఉంది!
ఆ పుస్తకమంతా ఇలాంటి రహస్య మంత్రాలే!
అది నాకు చాలా సమయాన్ని ఖర్చు చేసింది
అసంగత వాక్యమనుకోవద్దు సుమా!
తెలివి తక్కువ వాళ్లని, జ్ఞానుల్ని ఇద్దర్నీ మాయలో ముంచుతుంది.
పాతదైనా, కొత్తదైనా కళలో తప్పు దొర్లవచ్చు
కాని నిజం చెప్పి రాదు! మిత్రుడా!

మూడిటిలో ఒక్కటి, ఒకటిలో మూడు
ఈ లెక్కలన్నీ అలాగే చేయాలి.
గుండెనిండుగా పిడివాదం చేస్తే
ప్లేగు పరివారాన్ని తీసుకుపోతుంది.
మనుషులు కేవలం మాటలు వింటారు.
వాటిలో కాస్త జ్ఞానం ఉంటే మంచిదంటారు.

**మంత్రగత్తె :** (మంత్రోచ్చారణ చేస్తూ)–
జ్ఞానపు కాంతుల మహత్తర వెలుగులు
అల్లరి గుంపుకు ఆశపడవెన్నడూ!
ఖర్చులేని ఆలోచన,
ఉచిత విద్యాబోధన,
ఇన్నాళ్లూ మనకు తెలిసిందే మళ్లా వివరణ.

**ఫాస్ట్ :** ఏం చెత్త ఈమె మాట్లాడుతున్నది?
నా తల సగానికి పగిలిపోయింది.
యాభైవేల మంది మూర్ఖులు,
ఉచ్ఛైస్వరాలతో పాడుతున్నట్లున్నది!

**మెఫిస్టొఫిలిస్ :** చాలు! చాలు! ఓ మంత్రగత్తె! చాలించి ఇటురా!
ఆ రసాయనాన్ని నింపు ఈ కప్పులో నిండుగా!
అంచుల వరకు పోసి మిత్రుడికి అందించు
నిన్నేం చేయదు సుమా ఈ కషాయం.
ఆరంభంలోనే తాగావుగా ఇంకామంచి సారాయం!

**(మంత్రగత్తె, హడావుడి, ఆడంబరాలతో కప్పులో కషాయం పోసి ఫాస్ట్‌కిచ్చింది. అది అతడి పెదవులకు తగిలే లోపునే జ్వాలలా ఎగిసింది.)**

–'తాగు! ఆలస్యం చేయకు!
త్వరలో అది నీ హృదయపు భారాన్ని తగ్గిస్తుంది!
నీవు నిజంగా 'డెవిల్'కు స్నేహితుడివి!
అగ్ని నిన్ను ఆహ్వానిస్తున్నది, తాగిక త్వరగా అని!
(మంత్రగత్తె వలయాన్ని తెరవగానే ఫాస్ట్ బయటకు వెళ్తాడు.)
వెళదాం పద! ఇక ముందుకు నడవాలి!

**మంత్రగత్తె :** నా కషాయం నీ ఆకలిని పెంపొందించును గాక!

**మెఫిస్టాఫిలిస్ :** (మంత్రగత్తెతో)– నీకేదైనా సాయం కావాల్సి వస్తే
వాల్‌పర్గిస్ రాత్రి నాకా విషయం చెప్పు!

**మంత్రగత్తె :** ఈ పాట మీకు నచ్చవచ్చు!
దానిలో సుగుణాల్ని గుర్తించవచ్చు!

**మెఫిస్టాఫిలిస్ :** (ఫాస్ట్‌తో) నేను చెప్పినట్లు చేయి! రా!
ఈ క్షణాన వెళ్లిపోదాం ఇక్కడ నుంచి!
ఆలోచించు, జీర్ణం చేసుకో!
అప్పుడు నీ తీరిక సమయాన్ని ఎలా వాడుకోవాలో
అర్ధమవుతుంది బహు బాగా!
నిన్ను ఆనందపు అంచులకు తీసుకువెళ్లడానికి
మన్మధుడు–క్యుపిడ్ నీలో అగ్ని నృత్యం చేస్తాడు.

**ఫాస్ట్ :** మరొక్కసారి అద్దంలోకి చూస్తాను.
ఆమె అద్భుత లావణ్యం నన్ను పూర్తిగా ఆకట్టుకున్నది.

**మెఫిస్టాఫిలిస్ :** వద్దు, వద్దు! అద్దంలో బొమ్మతో ప్రేమెందుకు?
సజీవ అందాల రాశినే చూద్దువు పద ముందుకు!

(తనలో) ఆ రసాయనం ఒంట్లో చుక్కచుక్క దిగుతుంది.
ఏ స్త్రీ అయినా ఇప్పుడు హెలెన్ లానే కనిపిస్తుంది!
పదిహేనేళ్లు వయసు తగ్గిన యువకుడితడు,
హీన్‌రిచ్ అని పిలవబడడానికి ఎంతో అర్హుడు!

# 10. వీధి

**(ఫాస్ట్ – మార్గరెటా వెళ్తున్నది అటుగా)**

**ఫాస్ట్** : ఓ అందాల యువతీ! నీకభ్యంతరం లేకపోతే
నీ యింటి వరకు తోడుగా వచ్చి దింపనా!

**మార్గరెటా** : నేను యువతినీ కాను, అందగత్తెనూ కాను,
నాకు రెండు కాళ్లున్నాయి, చక్కగా నడవగలను!
(పక్కకు తప్పించుకుని వెళ్లిపోతుంది)

**ఫాస్ట్** : దేవుడి మీద ఆన! ఈ బాలిక నిజంగా నెరజాణ!
అందానికి అందం! గుణానికి గుణం! మేలిమి బంగారం!
కొంత పెంకితనం! మరింత సొగసు తనం!
దొండపండు లాంటి అధరాలు, సిగ్గులొలికే బుగ్గలు.
నా జీవితాంతం ఈ దృశ్యాన్ని మరవలేను. ఇది
నా ఎదను రగిల్చి నన్ను అల్లకల్లోలం చేస్తున్నది.
కళ్లను నేలపైకి మరల్చినట్లే
నన్ను నా స్థానంలోకి మరల్చినది.
ఎంత లావణ్యం! ఎంత హొయలు! ఎంత అందమైనదీ చిన్నది.
(మెఫిస్టాపిలిస్ ప్రవేశం)

**ఫాస్ట్** : చూడు! ఆ బాలిక నాకు కావాలి!

**మెఫిస్టాఫిలిస్** : ఏ బాలిక!

**ఫాస్ట్** : ఇప్పుడే ఇటుగా వెళ్లిన చిలక!

**మెఫిస్టాఫిలిస్** : ఆమె గురించా? ఇప్పుడే చర్చిలో దేవునికి నివేదించుకున్నది.
మతాధిపతి ఆమెకు ఇచ్చాడు పూర్తి సమ్మతి.
నేను దొంగచాటుగా విన్నాను. ఆమె అమాయక యువతి.
ఏ తప్పు చేయని నిష్కళంక మనసు;వాళ్ల మీద పారదు నా యుక్తి.

**ఫాస్ట్** : ఎందుకనో! పధ్నాలుగేళ్లు దాటిన పడుచే కదా ఆ చిన్నది.

**మెఫిస్టాఫిలిస్** : మస్తు శృంగార పురుషుడి వైపోతున్నావు!
ఏ పుష్పాన్నీ కాడ మీద ఉంచేట్లు లేవు.

నీ కంటిలో పడిన ఏ నదరైన దాన్నీ వదలవా!
కొన్నిటిని వర్జించడం మంచిదని ఎరగవా!

**ఫాస్ట్** : నా మాట విను! నీతి బోధకుడా!
ధర్మాలు వల్లించడం మాని దారిలోకి రా!
ఈ రాత్రికల్లా ఆ చిన్నది నా కౌగిలిలో నిండాలి!
లేకుంటే మనిద్దరిమధ్య కడుదూరమైనా ఉండాలి!

**మెఫిస్టొఫిలిస్** : నా మంచి దొరా! కనీసం రెండు వారాల వ్యవధి కావాలి!
ఏదో మార్గం దొరికితే నీకే గదా లాభమూ, స్వర్గమూ!

**ఫాస్ట్** : రెండు వారాలా! ఆ చిన్నదాన్ని వశం చేసుకునేందుకు,
సగం రోజైనా ఎక్కువే నాకు, దానికి 'డెవిల్' సాయమెందుకు?

**మెఫిస్టొఫిలిస్** : ఇప్పుడు సరైన భాష మాట్లాడుతున్నావు,
అయినా అంత తొందరెందుకు, ఆ ఇంతి పొందుకు;
నిరీక్షణలో ప్రేమ రెండింతలు పెరగదా!
మనసిచ్చిన యువతి పొందు మధురం కాదా!
ఇటాలియన్ ప్రేమకథ లెన్నడూ చదవలేదా!

**ఫాస్ట్** : అవన్నీ అవసరం లేనంత ఆకలుంది నాకిపుడు!

**మెఫిస్టొఫిలిస్** : అయినా నామాట వినండి, ఆర్యా!
మంచిపిల్ల మనసు గెలవడం ఓ దండయాత్రతో సమానం!
తుపానులా చుట్టుముట్టడం కన్నా,
కపటోపాయమే, నీ కామాన్ని తీర్చేందుకు, శరణ్యం.

**ఫాస్ట్** : నా మనోహరి ఉన్న దరికి నన్ను తక్షణం తీసుకువెళ్లు
లేదా, ఆమె గుర్తుగా ఏ ముద్రికో, బహుమతో
తీసుకురా, ఆమె ధరించినవస్త్రమో, వస్తువో
ఏదో ఒకటి నా ఎదను తేలికపరిచేందుకు!

**మెఫిస్టొఫిలిస్** : నీ కోరికలు తీర్చేందుకు నేనెప్పుడూ సిద్ధమే
అని ఋజువు చేసేందుకు ఇదిగో ఈ ప్రయత్నం.
ఇంకొక్క క్షణం చేసేది లేదు తాత్సారం.
ఈరోజే మనం ఆమె గదికి వెళ్తున్నాం.

**ఫాస్ట్** : ఆమె కనిపిస్తుందా! ఆ సుందరి పొందు లభిస్తుందా?

**మెఫిస్టొఫిలిస్ :** ఆమె తన పక్కింటి స్నేహితురాలి వద్దకు వెళ్తుంది.
మనం ఆ గదిలోకి వెళ్దాం! నీవు ఆమె వస్తువుల్ని తాకవచ్చు!
నీ పెల్లుబికే కోరికల్ని అలా చల్లార్చుకోవచ్చు!

**ఫాస్ట్** : పద, పోదాం!

**మెఫిస్టొఫిలిస్ :** అవకాశం కోసం ఎదురు చూడవద్దా!

**ఫాస్ట్** : ఆమెకివ్వాలి ఏదైనా బహుమతి; ముందు చూడు దాని సంగతి.
(వెళ్లిపోతాడు)

**మెఫిస్టొఫిలిస్ :** అప్పుడే బహుమతి! పోయింది వీడి మతి!
ఇతగాడి గెలుపు తథ్యం, పెట్టాలి కొంత పథ్యం!
ఇప్పుడు గుప్తనిధులకై శోధన, కాసేపు నిరీక్షణ!

# 11. సాయంకాలం

**(చిన్నదైనా అందంగా, శుభ్రంగా ఉన్న గది)**

**మార్గరెటా :** (జడ వేసుకుంటూ)
ఇందాకటి యువకుడెవరో తెలుసుకోవాలని తహతహ
అందగాడు అతగాడు, ఉన్నత కుటుంబీకుడే బహుశా
అతని కళ్లల్లో ఏదో మెరుపు ఛాయ, మాటల్లో ఏదో చిలిపి మాయ
(ఆమె వెళ్లిపోతుంది. మెఫిస్టాఫిలిస్, ఫాస్ట్ గదిలోకి వస్తారు)

**మెఫిస్టాఫిలిస్ :** వేగిరం రావేల? ఆలస్యమింకేల!

**ఫాస్ట్ :** (నెమ్మదిగా) నామానానికి నన్నిక్కడ వదిలి నిష్క్రమించరాదా నీవు!

**మెఫిస్టాఫిలిస్ :** (గది అంతా కలయచూసి) చాలా అందంగా, శుభ్రంగా సర్ది ఉందే!
(వెళ్లిపోతాడు)

**ఫాస్ట్ :** (పైనా, కిందా, అంతా చూస్తూ)
సంజె వెలుగుకు స్వాగతం! ఈ గదిని కాంతివంతం చేసినందుకు అభివాదం!
ఆశా మంచు బిందువులపై బతికే, ప్రేమ బాధ
నా ఎదను తియ్యగా కాల్చివేస్తున్నది.
ఈ ప్రదేశమెంత సొగసుగా, పద్ధతిలో, ప్రశాంతంగా కనిపిస్తున్నది!
పేదరికంలో ధన సౌందర్యం, ఇరుకు జైలులో
సంతృప్తి, సంతోషం, ఎలా సాధ్యం!
(మంచం పక్కనే ఉన్న కుర్చీలో కూలబడతాడు)
నన్నిక్కడ విశ్రాంతి తీసుకోను అనుజ్ఞ యివ్వు.
సుఖదుఃఖాల్లో అనేకమంది నీపై కూర్చుండి ఉండవచ్చు!
కౌగిలింతలతో ఆహ్వానించబడి ఉండవచ్చు!
ఈ సింహాసనంపై పిల్లలు గంతులేసి ఆడుకుని ఉంటారు!
ఇక్కడే, నా ప్రేమికురాలు కూడా, కుర్చీలో కూర్చున్న తండ్రి
క్రిస్టమస్ బహుమతి ఇవ్వగా తీసుకుని పాదాభివందనం చేసి ఉంటుంది.
తన గులాబిరంగు అధరాలతో ఆతడి ముడతలు పడ్డ చేతిని ముద్దాడి ఉంటుంది.
ఈ గదిని తిలకించడం నేనెన్నడో చేసుకున్న పుణ్యఫలం
ఎంతో జాగ్రత్తగా, శుభ్రంగా ఉన్న ఈ గది, సర్దిన మేజాబల్ల

నేలపై పరచిన తెల్లటి ఇసుక, ఈ చిన్ని గుడిసె
నీ అమృత హస్తాల లాఘవంతో స్వర్గమందిరాన్ని తలపిస్తున్నది!
మరి, ఇక్కడ!
**(మంచాన్ని దాచిన తెరసు పక్కకు లాగుతాడు)**
ఎటువంటి తీవ్రమైన ఆనందం నన్ను ముంచేస్తున్నది.
అనంతకాలం ఈ శయన మందిరంలో ఇలానే నిలబడి ఉండగలను.
ప్రకృతీ! ఈ అద్భుత బాలిక నీవల్లనే ఉద్భవించింది.
నీ ఒడిలోనే పెరిగి తియ్యటి కలల్లో యువతిగా మారింది.
ఇక్కడే ఆమె శయనిస్తుంది, ఎద నిండిన వెచ్చని జీవితం
భగవానుని సృజన శక్తుల ప్రేమ నిర్మించిన కళారూపం!

మరి నేను! ఏ బృహదాశయం నన్నిక్కడికి రప్పించింది?
ఏ నిగూఢ ఉద్వేగం నన్నింత తరచి చూస్తున్నది!
నేనెందుకు వచ్చానిక్కడకు? ఎందుకీ దీర్ఘ నిట్టూర్పు?
నేనెవరిని? మునుపటి ఫాస్ట్‌నా లేక అతని నీడనా?

ఏదైనా మంత్రం మాయ నన్ను కమ్ముకున్నదా?
కామం నన్ను కావలించుకున్నదని నిశ్చయంగా చెప్పగలను.
కాని ప్రేమ స్వప్నాల వేడిలో వడిలి, కరిగిపోతున్నాను.
ఏమిటిది? ఈ వాతావరణంలో మనం వట్టి ఆటబొమ్మలమా?

ఈ క్షణంలో ఆమె ఇక్కడకు వస్తే
నన్నెలా శిక్షిస్తుందో ఈ చొరబాటుకు!
డాన్ జువాన్ అంత ప్రేమికుడే చిన్నబోయి
ఆమె పాదాలను కడగడా క్షమను కోరే అశ్రువులతో...

**మెఫిస్టొఫిలిస్ :** (వస్తూనే) ఆమె వస్తున్నది! ఏ క్షణంలోనైనా ఇక్కడకు!

**ఫాస్ట్ :** నన్ను తీసుకుపో తక్షణం! నేనిక ఎన్నడూ రాబోనిక ఇక్కడకు!

**మెఫిస్టొఫిలిస్ :** ఈ బరువైన పెట్టెలో ఉన్నాయి అరుదైన వస్తువులు
ఎక్కడి నుంచో కష్టపడి తీసుకువచ్చానిక్కడకు
ఆ బీరువాలో ఉంచి మనం నిష్క్రమిద్దాం తక్షణం!

వాటిని చూస్తే చాలు ఝల్లుమంటుంది హృదయం!
మహారాణులు సైతం మైమరిచే ఏడువారాల నగల ముందు,
ఆడపిల్ల ఆడపిల్లే! ఆటవిడుపు ఆటవిడుపే! అదే మంచి మందు!

**ఫాస్ట్** : నేనట్లా చేయకూడదేమో–

**మెఫిస్టాఫిలిస్ :** మళ్లీ ఈ గొడవేమిటి?
నగలన్నీ నీ స్వంతం చేసుకుందామనుకుంటున్నావా?
మహానుభావా, పిసినారి దేవా! నా సలహా విను!
కాలం వృధా చేయడం ఆపు! నాకు శ్రమ తగ్గించు!
నా పొట్టగొట్టుకుని, గోళ్లు కొరుక్కుని, నానా లెక్కలేసి తెచ్చాను!

**(అంటూ ఆ నగలపెట్టెను బీరువాలో ఉంచి తాళం వేస్తాడు)**

త్వరగా, మనం వెళ్లిపోవాలి!
నీ మనోహారిణిని నీకు ప్రసన్నం చేయడానికి,
నిన్ను ప్రేమించి, మనసిచ్చేలా చేయడానికి నేను పడాలా తిప్పలు?
నీవేమో ఇప్పుడు ఘనత వహించిన ఆచార్యుడిలా
భౌతిక, అధిభౌతిక శాస్త్ర మీమాంసలో వెదికేవు గొప్పలు!
పద పోదాం! (నిష్క్రమిస్తారు)

**మార్గరిటా** : **(దీపం పట్టుకుని ప్రవేశం)**
ఎప్పుడూ లేనిది ఇప్పుడు ఇక్కడెందుకో వేడిగా, ఉక్కగా ఉన్నది.
**(కిటికీ తలుపు తెరుస్తూ)**

కాని, బయట చల్లగా ఉన్నదే!
ఎక్కడో ఏదో పొరబాటు జరిగి ఉండాలి!
అమ్మ త్వరగా వచ్చేస్తే బాగుండును.
నన్నేదో భయం చుట్టుముడ్తున్నది
(రోజురోజుకూ చిన్నపిల్లనై పోతున్నాను)

**(దుస్తులు మార్చుకుంటూ పాట పాడును)**

అనగనగా అనగా అనగా ఒకరాజు
ఉత్తర ధూలే దేశానికి మహరాజు

అతడెంతో ప్రేమించిన రాణి చిత్ర
చనిపోతూ ఇచ్చిందొక బంగారు పాత్ర

ఆ బంగారు పాత్ర అంటే అతడికెంతో యిష్టం
ఏడ్చినా, నవ్వినా, ఏ పని చేసినా
విందు భోజనాలలో మధువు సేవించినా
ఆ పాత్రలో తాగడమే అతడికెంతో యిష్టం.

అవసానకాలం వచ్చింది అతడికి
తన రాజ్యాన్ని అతడు తనయుడికి ఇచ్చెను
అన్నిటిని అతడు అందరికి పంచినా
ఆ బంగారు పాత్రను తనవద్దే ఉంచెను.

విందు వినోదాలు, నృత్యగానాలతో
ప్రభువు పరివారము పండుగ జరిపిరి.
సముద్రతీరపు ఎత్తైన కొండపై
ఆ పెద్ద కోటలో, ఆ రాచమేడలో!

జీవనజ్వాల ఆరేంతవరకు
మధువు తాగిన మహరాజు
జారవిడిచినాడు సాగరంలోకి
బంగరుపాత్రను ఆఖరి క్షణాన!

దూరపు తీరాన్ని తాకిన పాత్రను
నీటిలో మునిగిన బంగరు పాత్రను
చూసిన మహరాజు చుక్క ముట్టడా వెనుక
శాశ్వత నిద్రలో కనుమూసె కనుక!

**(మార్గరిటా బీరువా తలుపు తీసి దుస్తులను లోపల ఉంచి అక్కడ ఉన్న నగలపెట్టెను చూసి ఆశ్చర్యపడుతుంది)**

ఎక్కడ నుంచి వచ్చిందీ అందాల మందసం?
వేసిన తాళం వేసినట్లే ఉంది, ఏమిటీ విచిత్రం?
లోపల ఏముందో చూడనా? అమ్మ ఎవరికైనా
దబ్బు బదులిచ్చి ఈ నగలపెట్టెను తనఖాగా ఉంచెనా?

తాళం చెవి అక్కడే ఉంది మూతతీసి చూడనా!
వావ్! ఇంత విలువైన నగల్ని నా జన్మలో చూడలేదు.
యువరాణి కూడా గొప్పగొప్ప ఉత్సవాలలో
మాత్రమే ధరించే అత్యంత మేలైన సొమ్ములివి!
ఈ రవ్వల హారం మెడలో వేసుకు చూడనా!
ఇంత అద్భుతమైన నగలెవరి స్వంతమో తెలిసేనా!
(కొన్ని నగల్ని అలంకరించుకుని అద్దంలో చూసుకుంటుంది.
అన్నీ అక్కర్లేదు ఈ చెవిదుద్దులు నా స్వంతమైనా చాలు!
చూడు! చూడు! ఎంత చక్కగా అమరినాయో!
చిన్న పిల్లలం మేం నేర్చుకోవాలి
అందానికి తోడు నగలు వన్నె తెస్తాయని మరింత!
పేద యువతిని 'ఆమె అందంగా ఉంది' అని పొగడినా
ఆమెపై జాలితో అన్నారేమో అనిపిస్తుందెందుకో!
అందరూ కోరుకునేది, ఆశపడేది బంగారం కోసమే!
నాలాంటి పేదవాళ్లకి మిగిలేది నిట్టూర్పు నీరసమే!

# 12. ప్రేమగీతం (A Promonade)

**(ఫాస్ట్ ఏదో ఆలోచిస్తూ పచార్లు చేస్తుంటాడు. మెఫిస్టొఫిలిస్ ప్రవేశం)**

**మెఫిస్టొఫిలిస్ :** తిరస్కరించబడిన ప్రేమ ధ్వనులపై, నరకలోకపు జ్వాలలపై ఆన!
దీనికంటే అధమమైనది ఏదో తెలిస్తే బాగుండును, దానిని శపించనా!

**ఫాస్ట్ :** ఏమైంది నీకు? అదోరకంగా ఉన్నావు?
పొద్దున్నే పొద్దున్నే వెధవ ముఖమూ, నీవూ!

**మెఫిస్టొఫిలిస్ :** నన్ను డెవిల్ ఎత్తుకుపోతే బాగుండును అనేద్దును.
నేనే డెవిల్‌ని అయ్యుండకపోతే, ఆ మాటను!

**ఫాస్ట్ :** బుర్ర సరిగానే పనిచేస్తున్నది కదా! నేను నవ్వినట్లనిపిస్తే క్షమించు!
ఈ రకం విషాద రాగాలాపన నీ నైజం కాదు, నీ ముఖాన శోభించదు!

**మెఫిస్టొఫిలిస్ :** ఆ కన్య గ్రెఛెన్ (Gretchen)కు నేనిచ్చిన నగలు,
పోయిపోయి పడ్డాయి ప్రీస్టు చేతిలో ఈ పగలు!
ఆమె తల్లి చూసింది ఒకేసారి నగలను,
ముఖం నిండా భయంతో దాదాపుగా మూర్ఛిల్లెను!
పగలూ రేయి ప్రార్థనల పుస్తకం చదివీ చదివి
మంచీచెడుల మధ్య తేడా పసిగట్టేసిందా ముసిలిది.
దేన్నైనా ఇట్లా చూసీ చూడగానే
దేవుడికిష్టమో కాదో చెప్పెయ్యగలదామె!
నగల్ని చూడగానే నరనరాలు గుంజుకు పోయినట్లు
వాటిలో ఏదో అపవిత్రత పొరాడుతున్నట్లు,
'కూతురా! అక్రమ సంపాదన ఆత్మహత్యా సదృశం
తప్పుడు దారుల్లో సంపాదిస్తే తప్పదు దేవుని ఆగ్రహం-
అందుకని ఈ నగల పెట్టెను దైవమాతకు సమర్పిద్దాం
స్వర్గం నుంచి ఆమె ప్రసాదించే 'మన్నా'తో సంతృప్తి పడదాం!'
ఆ మాటలు వినగానే చూడాలి మార్గరెటా ముఖం!
ఒకవేళ ఎవరైనా తనకు తెస్తే అటువంటి బహుమతి గుర్రం,
అంతటి దయగల వరుడి మనసులో దైవస్వరూపం
కానిదెందుకుంటుందో ఆమెకు అర్థం కాని విషయం!

కాని, ఆమె తల్లి పిలిచిందో ప్రీస్టును,
వారి కథ వినగానే పూజారి కళ్లు మెరిసెను.
ఆనందంగా నగలనతడు ఆశగా పరికించెను-
అన్నాడు పైకి గంభీరంగా- ఎంత పరిశుద్ధాత్ములు మీరు!
ప్రలోభాలు పన్నేవాడిని జయించి ప్రభు కిరీటాన్ని గెలిచారు.
చర్చి దేవాలయం ఎటువంటి చెడునైనా అరిగించుకోగలదు,
ఎంత తిన్నా తరగని ఆకలి దానిది.
రాజ్యాలూ, సామ్రాజ్యాలూ, రాళ్లూ, రత్నాలు కరిగిపోయాయి దానిలో
కడుపు నెప్పి రాకుండా కఠిన కషాయాన్నైనా
అరిగించుకోగల శక్తి అద్భుతమైన చర్చికే ఉన్నది.

**ఫౌస్ట్** : యూదుడికీ, రాజుకూ అది సర్వసాధారణం;
అటువంటి పొట్ట, శక్తి ఉండడం లోక విదితం!

**మెఫిస్టాఫిలిస్ :** అట్లా ఉంగరాలు, హారాలు, కడియాల్ని, అతగాడు,
శుభ్రంగా తన చేతి సంచిలోకి జారవిడిచాడు;
ఒక్కటీ వదల్లేదు సుమా ఆ ఆశబోతు
కోడి గింజల్ని మేసినట్లు మొత్తం ఖాళీ చేసాడు-
స్వర్గం నుంచి వాళ్లకు సౌభాగ్యం లభిస్తుందని నమ్మించి
వచ్చినంత వేగంగా అతడు వెళ్లిపోయాడచట నుంచి!

**ఫ్రౌస్ట్** : మరి మార్గరెటా - నా గ్రెఛెన్ సంగతి?

**మెఫిస్టాఫిలిస్ :** శిలలా అక్కడే కూర్చుండిపోయింది. పాపం!
ఎందుకో, ఏమిటో ఎలా తెలుస్తుందా చిన్నారికి!
మనసు నచ్చిన నగల్ని ఎలా మరచిపోగలదు?
తనను మెచ్చిన వరుడెవరని తలపోస్తూ ఉన్నది!

**ఫౌస్ట్** : నా ప్రియురాలి దుఃఖం నే చూడలేను
ఇంకా మంచి బహుమతిని ఇద్దాం మనం
ఇంతకు ముందున్నవి ఏమంత గొప్పవి కావులే!

**మెఫిస్టాఫిలిస్ :** అవునా! దొరగారికి ఇదంతా ఓ చిన్నపిల్లలాట!
మధ్యలో వచ్చింది నాకు మండే పీకులాట!

**ఫాస్ట్** : నేను చెప్పినట్లు చేయి! ఇంకో విషయం!
ఆమె పొరుగింటి యువతికి వేయాలి గాలం!
ఏదో ఒకటి చేసేయి, ఓ డెవిల్, వేగిరం!
మరిన్ని నగలు నా మనోహారిణికి సత్వరం!

**మెఫిస్టొఫిలిస్ :** ప్రభువు ఆజ్ఞ సేవకునికి శిరోధార్యం!
(ఫాస్ట్ నిష్క్రమిస్తాడు)
అందరి ప్రేమికుల్లానే ఇతగాడు పిచ్చోడే!
ప్రియురాలిని ప్రసన్నం చేసుకునేందుకు
సూర్యుడు, చంద్రుడూ, తారల్ని ఒకేసారి పేల్చేద్దామనుకుంటారు!
(నిష్క్రమణం)

# 13. పొరుగిల్లు (The Neighbour's House)

**మార్తా** : (ఒంటరిగా)– నా భర్త (దేవుడతడిని క్షమించును గాక!)
నన్ను ఏనాడూ సరిగా చూడలేదు.
ఇల్లు వదిలి పోయాడు ఎక్కడికో తెలీదు.
విధవనో, వెధవనో నేనిప్పుడు నాకే తెలీదు.
అతడికి నేనేం తక్కువ చేయలేదు.
నిజంగానే ప్రేమగా చూసుకున్నానతగాడిని! (ఏడ్చును)
చనిపోయాడేమో! నా హృదయం పగిలిపోతున్నది.
ఓ ధృవపత్రం (డెత్ సర్టిఫికెట్) ఉంటే బాగుండునంటున్నది.

**(మార్గరెటా ప్రవేశం)**

**మార్గరెటా** : మార్తా! నాకు వచ్చేట్టుంది మూర్ఛ!
ఇదుగో మళ్లీ కన్పించింది అదే చోట.
బీరువాలో దంతపు నగల పెట్టె ఇంకోటి.
ఈ నగల్ని చూడు, మార్తా; ఇదివరకటివేవీ
వీటి నాణ్యతకు, నగిషీకి ఏమాత్రం సరిపోలవు!

**మార్తా** : ఈసారి చెప్పొద్దు అమ్మకు నీవీ విషయం.
చెప్పావా నగలపెట్టె అవుతుంది పూజారి కైవసం!

**మార్గరెటా** : చూడవే! చూడు ఈ నగను!

**మార్తా** : **(తనపై అలంకరించుకుని)** ఎంత అదృష్టవంతురాలివే నీవు!

**మార్గరెటా** : ఈ నగలుండి ఏం లాభం, అలంకరించుకుని,
వీధిలోకి వెళ్లలేను, చర్చికీ పోలేను!

**మార్తా** : నీకెప్పుడు కావాలంటే అప్పుడు రా నా యింటికి,
అలంకరించుకో, సింగారించుకో, ఆనందించు హాయిగా!
అద్దం ముందు నిలబడు, హొయలొలికించి సిగ్గుపడు.
నన్నూ నిన్ననుకరించి సంతోషపడనీ అద్దము!
ఇద్దరం హాయిగా ఆనందపడదాము!

పండుగ పబ్బాలకు ఓ చిన్ని నగను, నీవొకటి, నేనొకటి
వేసుకు వెళ్దాం! చూసిన వాళ్లకు పెద్ద చింతేమీ లేకుండా
ఒకరోజు హారం, ఒకరోజు దుద్దులు
అమ్మ గమనించిందా కథలల్లి చెబుదాం!

**మార్గరెటా** : అదిసరే గాని నేస్తం? ఎవరు తెచ్చారంటావీ బహుమానం!
ఏ మాయో మర్మమో ఏదో అనుమానం!
**(తలుపు తట్టిన శబ్దం)**
దేవుడా! మా అమ్మ కాదు కదా!

**మార్తా** : **(తలుపు రంధ్రం నుంచి చూస్తూ)**
కాదు! ఎవరో పెద్దమనిషి! అపరిచితుడు! రావచ్చు!
**(మెఫిస్టొఫిలిస్ ప్రవేశం)**

**మెఫిస్టొఫిలిస్** : మీరు నన్ను క్షమిస్తే నేను వచ్చిన పని చెబుతాను.
మార్తా ష్వెర్‌టలీన్ ఇల్లు ఇదేనని వాళ్లన్నారు.
**(మార్గరెటాను చూసి వినయంగా ఒక అడుగు వెనక్కి వేస్తాడు)**

**మార్తా** : అది నేనే! మీకు నేనేం చేయగలను!

**మెఫిస్టొఫిలిస్** : **(ఆమెతో రహస్యంగా)**
మార్తా! మీరేనని నాకు రూఢి అయ్యింది.
ఇప్పుడు మీ వద్ద ఓ అతిథి ఉన్నారు–
అంత ఉన్నతమైన యువతి ఉన్నపుడు
తమర్ని నేను తరువాత కలుస్తాను.

**మార్తా** : **(బిగ్గరగా)** విన్నావా చిన్నారీ! నిన్నితడు యువతిగా
తలుస్తున్నాడు ఈ గౌరవనీయుడు!

**మార్గరెటా** : దయతో తమరిలా సెలవిస్తున్నారు.
నేనొక పేదరాలిని; నేను అలంకరించుకుంటున్న
నగలు నావి కావు సుమండీ!

**మెఫిస్టొఫిలిస్** : నగలలో ఏముంటుంది గొప్పతనం
నీ నమ్రతలో ఉన్నది అసలైన లావణ్యం.

నీ చూపులలో ఒక నిండైన ఠీవిదనం
మీరేమనుకోకపోతే నేనిక్కడ ఉండవచ్చునా మరోక్షణం?

**మార్తా** : ఆర్యా! తమరు వచ్చిన పని...

**మెఫిస్టొఫిలిస్ :** చెడు వార్తను చెప్పాలంటే నాలో ఏదో భయం.
కాని చెప్పక తప్పదు కదా అది నా ఉద్యోగ ధర్మం.
నీ భర్త చనిపోయాడు, అదే నేను చెప్పాల్సిన విషయం.

**మార్తా** : చనిపోయాడా! నా ప్రాణం! పోయిందా నా జీవనం!
అంతా అయిపోయిందా? పోతున్నది నా జీవం!

**మార్గరెటా** : దుఃఖించకు మార్తా! శోకించకు!

**మెఫిస్టొఫిలిస్ :** అదొక విషాద గాథ!

**మార్గరెటా** : బహుశా నేనెవర్నీ ప్రేమించలేనేమో
పోగొట్టుకుంటే వచ్చే దుఃఖం నన్ను చంపేస్తుంది!

**మెఫిస్టొఫిలిస్ :** సంతోష దుఃఖాలు కావడి కుండలు, విడదీయలేనివి.

**మార్తా** : ఆర్యా! అతడెలా చనిపోయాడో వివరించగలరా?

**మెఫిస్టొఫిలిస్ :** ఇటలీ పదువాలో ఇతగాడిని చేసారు ఖననం,
సెయింట్ ఏంథోనీ చర్చి దగ్గరే ఆఖరి ప్రస్థానం!

**మార్తా** : అంతేనా! నాకు కడపడి వార్తలూ, వగైరా ఏమీలేవా?

**మెఫిస్టొఫిలిస్ :** లేకేం! బోలెడున్నాయి. మూడు వందల ప్రార్థనలూ
పూజలూ తన ఆత్మశాంతికై చేయమన్నాడు నిన్ను
ఇహలోక విషయాలేవీ తనను బాధించవద్దన్నాడు.

**మార్తా** : ఓ విలువైన పతకమో, ఓ ఖరీదైన చిహ్నమో
ఏదైనా చిన్ని బహుమానమో, రత్నమో
తన అంగీలో దాచుకుని ఉన్నాడేమో
కష్టకాలంలో ఆదుకుంటాయని అనుకోలేదా, ఏమో!

**మెఫిస్టొఫిలిస్ :** క్షమించాలి మీరు, నేనేదన్నా మాట్లాడితే ఎక్కువ!
నీ భర్త దేనినీ వృధాగా దాచే రకం కాదు,

తన తప్పులు తనకు తెలుసు కాని, అదృష్టంపై మక్కువ!
తప్పులు దిద్దుకోవడం కన్నా రెండోదాన్ని నమ్ముతాడు ఎక్కువ!

**మార్గరెటా** : అటువంటి దురదృష్టవంతులంటే నాకెంతో దుఃఖం
వారి నిమిత్తం చేస్తాను ప్రార్థనలెన్నో నిత్యం.

**మెఫిస్టోఫిలిస్** : ఎంత మంచి బాలికవు నీవు!
శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు!

**మార్గరెటా** : నేనింకా చిన్నదానినే! అప్పుడే పెళ్లిమాట వద్దు!

**మెఫిస్టోఫిలిస్** : భర్త వద్దనుకుంటే ప్రియుడు దొరుకుతాడులే,
ఏ వయసులో ఆ ముచ్చట, ప్రేమ ఎంతో హాయిలే!

**మార్గరెటా** : అది మా సంప్రదాయం కాదు ఆర్యా!

**మెఫిస్టోఫిలిస్** : అయినా కాకున్నా, నీవు ప్రేమలో పడడం తథ్యం.

**మార్తా** : మిగతాది చెప్పండి!

**మెఫిస్టోఫిలిస్** : అతడి మరణశయ్య దగ్గర నిలబడ్డా నేను!
కుక్కచావు చచ్చాడనుకో, అంతా దుర్గంధం అక్కడ;
సగం కుళ్లిన గడ్డిపైన, చనిపోయినా క్రైస్తవుడేగా!
అతని పాపాలు క్షమించబడినాయి, అయినా ఇంకా ఉన్నాయేమో
'నేను చేసిన దుష్కార్యాలకు నన్ను నేనే క్షమించుకోలేను.
నా వృత్తిని వదిలేసాను, నన్ను ప్రేమించే భార్యను వదిలేసాను,
ఆ జ్ఞాపకాలు నన్ను చిత్రవధ చేస్తున్నాయి.
ఆమె నన్ను ఈ జన్మలో క్షమిస్తుందో, లేదో'–

**మార్తా** : (ఏడుస్తూ) అతడిని నేనెప్పుడో క్షమించాను.

**మెఫిస్టోఫిలిస్** : 'దేవుడికి తెలుసు– ఆమెదే అసలు తప్పు' అన్నాడతడు ఆఖరిమాటగా.

**మార్తా** : అబద్ధం! పచ్చి అబద్ధం! చచ్చేప్పుడు కూడా సత్యం పలకడా!

**మెఫిస్టోఫిలిస్** : జ్వరం, పలవరింతల్లో నిజమెంతో ఎవరు చెప్పగలరు?
'నా బతుకంతా గొడ్డుచాకిరీ, ఆమెకూ, పిల్లలకూ!
నాకంటూ మిగిలేది కాదు ఒక్క మెతుకూ చివరికీ!'

**మార్తా** : నా ప్రేమ, ఆప్యాయతా, శుశ్రూషా, బానిస బతుకూ,
అంతా మరిచిపోయి అంత మాటన్నాడా చివరకు?

**మెఫిస్టోఫిలిస్ :** అది గుర్తుందిలే! కాని ఇంకో రహస్యం చెప్పాడు!–
'మేం 'మాల్టా'కు వెళ్లినప్పుడు మా అదృష్టం మారింది.
టర్కిష్ ఓడలో దొరికింది నీడ
సుల్తాను ధనాగారమున్న సురక్షిత ఓడ
ప్రాణాలకు తెగించి పోరాడాము మేము!
ప్రతిఫలంగా మాకు గిట్టింది ధనము!'–

**మార్తా** : ఏమిటది? ఏమిటది? ఎక్కడ దాచాడుట ఆ సొమ్ము?

**మెఫిస్టోఫిలిస్ :** ఎవరికి తెలుసు? ఎవరికి తెలుసు?
గాలికి కొట్టుకుపోయి 'నేపుల్స్'లో తేలాడు.
అక్కడ అందింది అందాల కౌగిలి.
సుఖాల వేటలో సొమ్మంతా ఖర్చై
రోగాల పుట్టగా మిగిలాడు చివరికి!

**ఫాస్ట్** : దుర్మార్గుడు! పిల్లలనోటికూడు విసిరేసాడు!
దరిద్రం తెలిసీ వ్యభిచారం మానని రాక్షసుడు!

**మెఫిస్టోఫిలిస్ :** అతగాడు మరణించాడు! అదీ అసలు కథ!
నేనే నీవైతే, ఓ ఏడాది ఏడ్చి, నా బతుకు నే బతుకుతా!

**మార్తా** : రెండోసారి అటువంటివాడు దొరకడం కష్టం.
సరదా పురుషుడు అతగాడు, అందరికీ ఇష్టం.
విదేశాలు తిరగడం, విలాసినుల్తో కులకడం, బాగా
తాగడం, జూదమాడడం, అతడి నాశనానికి కారణం!

**మెఫిస్టోఫిలిస్ :** అతడు తన స్వేచ్ఛ తాను చూసుకున్నాడు.
నీకు నీక్కావాల్సిన స్వేచ్ఛనిచ్చినాడు.
మంచి ఒప్పందం! అటువంటిదే నీవు ఇస్తానంటే
నీకు రెండో భర్తగా ఉండడానికి లేదేమీ అభ్యంతరం!

**మార్తా** : ఆర్యా! పరిహాసమాడ్తున్నారు!

**మెఫిస్టొఫిలిస్ :** (తనలో) 'ఇక్కడ నుంచి నిష్క్రమించడం మంచిది;
లేకపోతే 'డెవిల్'నే మాటమీద నిలబడమంటుంది.
(గ్రెఛెన్‌తో)
చిన్నారీ– నీ పరిస్థితేమిటి?

**మార్గరెటా :** నాకర్థం కాలేదు, ఆర్యా!

**మెఫిస్టొఫిలిస్ :** (తనలో) అమాయకత్వమంటే ఇది
(పైకి) అమ్మాయిలూ! శెలవు!

**మార్గరెటా :** సెలవు!

**మార్తా :** అయ్యా! మరో మాట! నాకు ఋజువు కావాలి!
నా భర్తను ఖననం చేసారన్న మరణధృవ పత్రం.
నాకన్నీ పద్ధతి ప్రకారం చేయడం ఇష్టం.
నేనా పత్రాన్ని, ప్రకటనను చూడాలనేది నిశ్చయం!

**మెఫిస్టొఫిలిస్ :** అలాగే! ఇద్దరు సాక్షుల అంగీకారం;
తిరుగు లేని సాక్ష్యం, నిదర్శనం;
న్యాయాధిపతి ముందు, నేనూ నా మిత్రుడూ
ఇస్తాము సాక్ష్యం, తొలగిస్తాం నీ అనుమానం!

**మార్తా :** చాలా సంతోషం!

**మెఫిస్టొఫిలిస్ :** ఈ యువతీలలామ ఇక్కడే ఉంటుందా!
నా మిత్రుడు అందగాడు, ప్రపంచం తిరిగినవాడు,
మానినీ మానస చోరుడు, వినయవంతుడు.

**మార్గరెటా :** అతడిని చూసి సిగ్గుతో మొగ్గనౌతానేమో!

**మెఫిస్టొఫిలిస్ :** ఏ రాజు ముందూ నీవు సిగ్గులమొగ్గవు కావులే!

**మార్తా :** మా యింటి వెనుక తోటలో మిత్రులిద్దరికీ
ఈ సాయంకాలం మా సాదర ఆహ్వానం.

# 14. వీధి (A Street)

**(ఫాస్ట్, మెఫిస్టోఫిలిస్)**

**ఫాస్ట్** : ఏమిటి కథ? బండేమన్నా వెళ్తోందా ముందుకు కాస్త!

**మెఫిస్టోఫిలిస్ :** అదృష్టవంతుడివి! తంతే బూరెలబుట్టలో పడ్డావు ఈ క్షణం.
గ్రెఛెన్ నీ పడక మంచాన్ని చేరుతుంది, తగ్గించు ఆవేశం!
ఈ రాత్రికి ఆమె పొరుగింటిలో మన సమావేశం
అయితే, ఆ మార్తాతోనే వచ్చింది ఇరకాటం.
అది మంత్రగత్తెలకన్నా వికారం, పట్టువదలని అవతారం, జంఝాటం.

**ఫాస్ట్** : చాలా సంతోషం!

**మెఫిస్టోఫిలిస్ :** మనం ఆమెకి చెయ్యాలి ఓ ఉపకారం!

**ఫాస్ట్** : న్యాయమే! ఏమిటిట ఆ వ్యవహారం?

**మెఫిస్టోఫిలిస్ :** మనిద్దరం చెయ్యాలి న్యాయాధిపతి ముందు ప్రమాణం,
ఆమె భర్త పడువా చర్చిలో ఖననం చెయ్యబడ్డాడన్న విధి విధానం!

**ఫాస్ట్** : అద్భుతం! సరే పద! ఇటలీకి చేద్దాం మన ప్రయాణం!

**మెఫిస్టోఫిలిస్ :** మనకెందుకంత అనవసరపు అశ్వయానం!
చేద్దాం ప్రమాణం! మానేద్దాం ప్రయాణం!

**ఫాస్ట్** : అదే నీ ఆలోచనైతే, నేను పాల్గొననది నిశ్చయం.

**మెఫిస్టోఫిలిస్ :** ఈమాత్రం దానికి ఎందుకో అంత తటపటాయించడం.
జీవితంలో మొదటిసారా ఏమిటి తప్పుడు సాక్ష్యం చెప్పడం?
దేవుడు, ప్రపంచం మీద చేస్తావే కొత్తకొత్త ప్రతిపాదన!
ఆచార్యుడిగా శిష్యులకు చెప్పినవన్నీ సత్యాలుగా నిరూపించడం!
మనిషి మనసు, హృదయం; అతడి ఆలోచనలు, పరిస్థితులు
గొప్ప నమ్మకంతో, గర్వంతో చెప్పినపుడు లేదా ఈ వివేచన?
ఆలోచించు– ఒక్కక్షణం ఊపిరి తీసుకుని– నిజం ఒప్పుకో!
అంత నిగూఢ విషయాల్లో నీకు తెలిసిందెంత?
మార్తా ష్వెర్‌టలీన్ భర్త మరణించాడనే వార్తతో ఇసుమంత!

**ఫాస్ట్** : నీవు ఇప్పుడూ, ఎప్పుడూ గొప్ప వేదాంతివి, పైగా అబద్ధాలకోరువీ!

**మెఫిస్టాఫిలిస్** : నీ సత్యసంధతా పరిమాణాలు కాస్త ఎగువలో ఉన్నాయి.
అవునా! రేపు చూస్తాంగా! ఎటువంటి నిజాలు చెబుతావో
నీ ప్రియమైన గ్రెఛెన్‌కూ, ప్రేమా, దోమా లాంటివి
ప్రేమ ప్రమాణాలూ, జీవన ప్రయాణాలు- ఆ చెత్తా, చెదారం.

**ఫాస్ట్** : ఆ ప్రేమ నా హృదయం నుంచి వెలువడ్తుంది!

**మెఫిస్టాఫిలిస్** : అద్భుతం! శాశ్వతప్రేమ! అంతిమం వరకు విశ్వాసం!
నమ్మకం! అతిశక్తివంతమైన ఉద్వేగం! మిత్రమా!
ఇవన్నీ నీ గుండె నుంచే వెలువడబోతున్నాయా?

**ఫాస్ట్** : అవును! నాలోని అంతర్గత ప్రేమ, ఈ గజిబిజి,
ఈ గందరగోళాన్ని ప్రతిబింబించే పదాల్ని కనుక్కుంటాను.
నా ఆత్మ, ఇంద్రియాలు ఈ ప్రపంచమంతా సంచరించి
ఈ ఉద్వేగాలను సరిగా వ్యక్తపరిచే మాటల్ని పలుకుతాయి.
ఈ ప్రేమ జ్వాల నన్ను దహిస్తున్నది. దానిపేరు
శాశ్వతమై, అనంతానంతమై- నీవు డెవిల్- చెప్పు
ఈ శాశ్వత అనంత ప్రేమను అసత్యమంటావా, నీవు?

**మెఫిస్టాఫిలిస్** : ఏది ఏమైనా నేనన్నదే నిజం కదా!

**ఫాస్ట్** : నేను చెప్పేది విను! అర్థం చేసుకో!
నా ఊపిరితిత్తులు పగిలేముందే!
నీవు నా నాలుక చెప్పిందే సరైనదని అనుకుంటే అనుకో!
పద వెళ్దాం! ఈ వృథా భాషణాలంటే నాకు చిరాకు!
నీమాటే సరైనది; నాకు వేరే అవకాశం లేదు- అది నాకు తెలుసు.

# 15. తోట (A Garden)

**(మార్గరెటా, ఫాస్ట్‌లు అటూయిటూ నడుస్తుంటారు;**
**మార్తా మెఫిస్టాఫిలిస్‌తో)**

**మార్గరెటా :** పేదరాలి మాటలు వినేందుకు పెద్దలు మీరిలా వచ్చినారు,
బాటసారి తన దారిలో లభ్యమైనదే గ్రహించగలుగుతాడు,
అల్పవిద్యావంతురాలిని నేను తమవంటి ఆచార్యులతో ఏమని సంభాషించను!

**ఫాస్ట్ :** ఒక్కచూపు, ఒక్క మాట చాలు నీ నుంచి నాకు
ఈ ప్రపంచం మొత్తం పలికినా దానితో సమానం కాబోదు.
**(ఆమె చేతిని ముద్దాడుతాడు)**

**మార్గరెటా :** ఆర్యా! ఎందుకు తమరీ కరకు చేతిని ముద్దాడుతారు?
దైనందిన కాయకష్టాన గరకుగా, గట్టిగా ఉన్నదీ హస్తం,
మా అమ్మ ఎంత పనిచేయిస్తుందో తెలుస్తున్నది కదా నేస్తం!
**(వాళ్లు ముందుకు వెళతారు)**

*****

**మార్తా :** అయితే, మీరెల్లప్పుడూ ప్రయాణిస్తూనే ఉంటారన్నమాట!

**మెఫిస్టాఫిలిస్ :** అది నా ఉద్యోగ ధర్మం, విధి లిఖితం!
కొన్ని ప్రదేశాలను వదలి వెళ్లబుద్ధి కాదు కానీ
అవి కావు కదా, అంతిమ గమ్యం!

**మార్తా :** వయసులో ఉన్నపుడు, శక్తి పరవళ్లు తొక్కుతున్నపుడు
స్వేచ్ఛగా ప్రపంచమంతా తిరగడంలో తప్పేమీ లేదు
కష్టకాలం దాపురించినప్పుడే వస్తుంది అసలు తర్కం
ఒంటరిగా తన సమాధిలోకి తొంగిచూసేప్పుడు అనిపిస్తుంది
ఎందుకిన్నాళ్లు బతికాను దేవుడా 'తోడు లేకుండా!'

**మెఫిస్టాఫిలిస్ :** అటువంటి తుదిఘడియలంటే నాకయిష్టం!

**మార్తా :** అందుకే ఆలస్యం కాకమునుపే ఆలోచించమంటున్నాను
**(వాళ్లూ వెళ్లిపోతారు)**

*****

**మార్గరెటా :** నా మాటా నడకా మీకెంతో దూరం అనుకుంటా!
నమ్రతతో మీరు మాట్లాడ్తారు కానీ, అదే వింత!

మీకెందరో నేస్తులు ఉండి ఉంటారు కదా!
జ్ఞానంలో వారి దరిదాపులకైనా నేను రాగలనా!

**ఫాస్ట్** : ప్రియతమా! నన్ను నమ్ము! జ్ఞానం అనేది
ఒక్కోసారి బోలుగా, ఆడంబరంగా కనిపిస్తుంది.

**మార్గరెటా** : అవునా!

**ఫాస్ట్** : అమాయకతకు తన గురించి తనకు తెలీదు,
వినయ సంపద తన విలువ తాను గ్రహించదు.
ప్రకృతికి ప్రియమైనది, గొప్పవరం దాన్ని స్పృశించు-

**మార్గరెటా** : తమరు నన్ను తలుస్తారు, మరచిపోతారు కావచ్చు
కాని నా ఆలోచనల్నిండా మీరూ, మీ రూపమే!

**ఫాస్ట్** : ఒంటరితనమే ఎక్కువా?

**మార్గరెటా** : మా ఇల్లు అంత పెద్దదేమీ కాదు.
కాని, మాకు పనిమనిషిని పెట్టుకునే స్తోమత లేదు.
వంటా వార్పూ, కుట్టడం, నేయడం, ఇల్లు శుభ్రం చేయడం,
క్షణం తీరిక దొరకదు. చిన్న మరకున్నా అమ్మ ఒప్పుకోదు.
అట్లా అని మేం మరీ పేదవాళ్లం కాదు.
ఇక్కడున్న చాలామందికన్నా ఉన్నవాళ్లమే.
నా తండ్రి చనిపోయాక మాకు కొంత డబ్బు వచ్చింది.
ఇల్లూ, ఊరిబయట ఒక తోట మా స్వంతం.
నిజమే, నాది ప్రశాంత జీవనం!
నా సోదరుడు సైనికుడు; ఎక్కడో సుదూరంగా ఉన్నాడు.
నాకుండేది ఓ చిన్నారి చెల్లి! చనిపోయింది.
నన్నెంతో కష్టపెట్టేది, కాని దానిని ఎంతగా ప్రేమించానంటే
మరలమరల సేవచేయడానికేమాత్రం వెనకాడను.

**ఫాస్ట్** : అదే నీ తీరు! మంచితనానికి మరో పేరు!

**మార్గరెటా** : ఈ చేతుల్తో పెంచానామెను. దానికీ నేనంటే ఎంతో ప్రాణం.
మా నాయన చనిపోయాక పుట్టిందా చిన్నది.

అమ్మ ఆరోగ్యం అసలే అంతంతమాత్రం
క్రమక్రమంగా కోలుకున్నది కాని, పసిబిడ్డ పాలులేక ఏడ్చేది!
పాలూ నీళ్లూ కలిపే పట్టేదాన్ని, నా స్వంత బిడ్డలా పెంచాను దాన్ని
నా చేతుల్లో, గుండెల మీద పెరిగిందా పిల్లది
నవ్వుతూ మెలికలు తిరుగుతూ క్రమేపీ పెరిగింది.

**ఫౌస్ట్** : నీకెంతో సంతోషంగా ఉండేదన్నమాట!

**మార్గరెటా** : చాలా కష్టంగా కూడా ఉండేది!
ఎన్నో రాత్రుళ్లు నిద్రపోయేదాన్ని కాదు!
నా మంచం పక్కనే దాని ఊయల
అది కదిల్తే చాలు నాకు మెలకువ వచ్చేసేది.
పాలు తాగిచ్చి, జోకొట్టి, నా పక్కలో పడుకోబెట్టుకునేదాన్ని.
ఆగకుండా ఏడుస్తుంటే, లేచి భుజాలకెత్తుకుని పచార్లు చేసేదాన్ని,
మళ్లా, తెల్లారే కోడికూసే సరికే లేచేదానిని.
కడగడం, ఊడ్వడం, పచారీ సామాన్లు తేవడం, వంట వండడం!
ప్రతిరోజూ ఇదే నా దినచర్య.
ఆర్యా! మీరే విన్నారుగా! ఇదేం చిన్నపిల్లల ఆట కాదు కదా!
కాని, అంతకష్టపడినందుకు హాయిగా తిని, నిద్రపోయే దానిని!
**(వెళ్లిపోతారు)**

*****

**మార్తా** : స్త్రీలను వెన్నాడుతుందనుకుంటా ఏదో దురదృష్టం
బ్రహ్మచారికి గృహస్థ ధర్మాలు నేర్పడం చాలాకష్టం!

**మెఫిస్టొఫిలిస్** : అందరూ చెప్పుకుంటుంటే విన్నాను నేనీ నిజం,
మంచి భార్య తనెత్తు బంగారం, వెండితో సమానం!

**మార్తా** : నేనడిగేది నీకెప్పుడన్నా అటువంటి ఊహ–

**మెఫిస్టొఫిలిస్** : అటువంటి విషయాల్ని నేను చాలా శ్రద్ధగా...

**మార్తా** : ఎప్పుడూ తీవ్రంగా పరిగణించలేదా?

**మెఫిస్టొఫిలిస్** : స్త్రీలతో తిరగడం తీవ్రమైన నేరం!

**మార్తా** : నీకర్థం కావడం లేదు. నేనేమంటున్నానంటే...

**మెఫిస్టోఫిలిస్ :** నన్ను బాధిస్తున్నా చెప్పక తప్పదు.
నీ అంగీకారాన్ని, నేనర్థం చేసుకున్నానని! **(వెళ్లిపోతారు)**

*****

**ఫాస్ట్ :** ప్రియతమా! నన్నర్థం చేసుకున్నావా!
ఈ తోటలో, ఇక్కడే, ఇది సత్యమేనా?

**మార్గరెటా :** నేను కనులు వాల్చడం మీరు గమనించే ఉంటారు, అవునా!

**ఫాస్ట్ :** చర్చి బయట నేను తీసుకున్న చొరవను క్షమించావా?
ఆరోజున నీతో అవమానకరంగా మాట్లాడడాన్ని మన్నించావా?

**మార్గరెటా :** నాకు మనస్తాపం కలిగింది తీవ్రంగా!
ఇంతకు ముందెన్నడూ నన్నెవ్వరూ అలా అనలేదు.
నాలో ఏదో లోపముంది, అందుకే అతడట్లా భావించాడు-
అనుకుని బాధపడ్డాను, మనసంతా అల్లకల్లోలమయ్యింది.
'ఈ పిల్ల నాకు పడ్తుంది'- అని అతడనుకున్నాడా?
కాని, తరువాత నా మనసులో నీరూపమే నిండిపోయింది.
నామీద నాకే కోపం వచ్చింది, ఎందుకంటే
మీమీద తగినంత కోపం చూపించనందుకు!

**ఫాస్ట్ :** ప్రియా!

**మార్గరెటా :** ఆగండి!
**(పక్కనే ఉన్న గడ్డిపూవును తీసుకుని ఒక్కో రేకను తెంపసాగింది)**

**ఫాస్ట్ :** ఏం చేస్తున్నావు? పుష్పగుచ్ఛాన్ని తయారు చేస్తావా?

**మార్గరెటా :** కాదు.

**ఫాస్ట్ :** మరేమిటి?

**మార్గరెటా :** చెబితే మీరు నవ్వుతారు. ఇది ప్రేమలో పడ్డవాళ్ల ఆట.
**(రేకలను తెంపుతూ ఆమె గొణుగుతుంటుంది)**

**ఫాస్ట్ :** ఏమిటా మాటలు, కాస్త వినపడేలా పలకరాదూ!

**మార్గరెటా :** **(కొంచెం బిగ్గరగా)** ప్రేమిస్తున్నాడు-ప్రేమించడంలేదు.
ప్రేమిస్తున్నాడు-ప్రేమించడంలేదు-

**ఫాస్ట్** : ప్రియురాలా! ఎంత చిలిపిదానివి!

**మార్గరెటా** : **(లెక్కిస్తూనే)**– ప్రేమిస్తున్నాడు–ప్రేమించడంలేదు–ప్రేమిస్తున్నాడు–ప్రేమించడంలేదు–
**(ఆకరి రేఖను తెంపి ఆనందంగా అరుస్తుంది)**
అతడు నన్ను ప్రేమిస్తున్నాడు! He loves me!

**ఫాస్ట్** : అవును ప్రియతమా! పలికింది పుష్పం
అదే కావాలి నీకు దివాస్వప్నం
అతడు నిన్ను ప్రేమిస్తున్నాడు– అంటే తెలుసునా అర్థం?
**(తన చేతుల్తో ఆమె రెండు చేతుల్ని పట్టుకుంటాడు)**

**మార్గరెటా** : నా ఆపాదమస్తకం కంపించిపోతున్నది.

**ఫాస్ట్** : భయపడకు! ప్రియతమా! వలదు ఆందోళన!
మాటలు వ్యక్తపరచలేని భావాల్ని మన కలిసిన చేతులు పలకనీ!
తనను పూర్తిగా ఇతరులకిచ్చి, అనంతకాలం పొందే
అమందానందం కన్నా అధికమేమున్నది!
శాశ్వతానందం కన్నా శరణ్యమేమున్నది!
అంతిమం నిరాశగా ముగుస్తుందా?
లేదు. అంతిమం రాబోదు, రాబోదు!

**(మార్గరెటా అతని చేతుల్ని మృదువుగా నొక్కుతుంది. వెంటనే విడిపించుకుని పారిపోతుంది. ఒక్క నిముషం ఆలోచనలో మునిగి అతడు ఆమెననుసరిస్తాడు. మార్తా, మెపిస్టాఫిలిస్ ప్రవేశిస్తారు)**

**మార్తా** : చీకటి పడనున్నది.

**మెఫిస్టాఫిలిస్** : అవును. మనం వెళ్లాల్సిన సమయమిదే!

**మార్తా** : నిన్ను ఇక్కడనే ఉండమని ఆహ్వానించ మనసౌతున్నది.
కాని పొరుగిళ్ల కళ్లూ, నాలుకా పదునైనవి.
పనీ పాటా వేరేమీ లేనట్లు, ప్రతిక్షణం పుకార్లు పుట్టిస్తారు.
పక్కింటివాళ్ల పనుల్ని చెడగొడతారు. తప్పు కాదా!
దానిని తప్పుకోడం అసాధ్యం. సరేగాని ఏది మన యువజంట?

**మెఫిస్టాఫిలిస్** : సీతాకోక చిలుకల జంట, ఎగుర్తూ పోయెను పూలదారుల వెంట.

**మార్తా** : నీ మిత్రుడికి దొరికినట్లుంది సరైన జోడి!

**మెఫిస్టాఫిలిస్** : ఆమెకు కూడా! ఈ లోకం ఇలాగే భ్రమిస్తుంది.

# 16. విశ్రాంతి గృహం (A Summer House)

**(మార్గరెటా పరుగెత్తుకుంటూ తలుపు వెనక్కి వెళ్లి దాక్కుంటూ, పెదాలపై చూపుడు వేలు పెట్టుకుని, తలుపు సందులోంచి చూస్తుంది)**

**మార్గరెటా :** వస్తున్నాడు. అతడు వస్తున్నాడు!

**ఫాస్ట్ :** **(లోపలికి వస్తూ)** అల్లరి పిల్లా! దొరికావులే! **(ముద్దుపెట్టుకుంటాడు)**

**మార్గరెటా :** **(అతని మెడచుట్టూ చేతులు వేసి తానూ ముద్దాడుతుంది)**
నిన్నెంత ప్రేమిస్తున్నానో మాటలలో చెప్పలేను.
**(మెఫిస్టాఫిలిస్ బయట తలుపు తడతాడు)**

**ఫాస్ట్ :** **(తలుపుకడ్డంగా కాలుంచి)** ఎవరది?

**మెఫిస్టాఫిలిస్ :** స్నేహితుడు!

**ఫాస్ట్ :** రాక్షసుడు!

**మెఫిస్టాఫిలిస్ :** మనం నిష్క్రమించాల్సిన సమయం మిత్రమా!

**మార్తా :** (వస్తూ) ఇప్పటికే పొద్దుపోయింది చానా!

**ఫాస్ట్ :** నేను నీకు తోడు రానా!

**మార్గరెటా :** మా అమ్మ చూస్తే ప్రమాదం. గుడ్‌బై!

**ఫాస్ట్ :** నేను వెళ్తాను ప్రియతమా! గుడ్‌బై!

**మార్తా :** అడియూ! బైబై!

**మార్గరెటా :** మళ్లీ కలిసేంత వరకూ! బై!
**(ఫాస్ట్, మెఫిస్టాఫిలిస్ వెళ్లిపోతారు)**
అతడి తలలో ఎన్నెన్ని ఆలోచనలు,
అతడేమన్నా నేను ఒప్పుకుంటున్నానెందుకు?
నేనేమీ తెలియని చిన్నపిల్లను కదా,
నాలో అతడికి నచ్చినదేమున్నదో, అంతగా!

# 17. అడవిలో చిన్న గుహ (A Forest Cavern)

ఫాస్ట్ : (ఒంటరిగా) ఓ పవిత్రాత్మా! నేను కోరినవన్నీ ఇచ్చావు.
అగ్నిజ్వాలల్లోంచీ నీ వదనాన్ని చూపించావు.
నా సామ్రాజ్యంలో ప్రకృతి సొబగులు కురిపించావు.
నా హృదయం వాటిని ఆస్వాదించేట్లు చేసావు.

మామూలు పైపై మెరుగుల్ని కాదు
స్నేహితురాలి హృదయంలో తొంగిచూసే నిగూఢశక్తినిచ్చావు.
నీవె తెరచిన నా నయనాల ముందు
సమస్త జీవజాలమూ ఒక వరసలో తిరుగాడేట్లు చేసావు.

ప్రశాంత వనాల్లో, గాలిలో, నీటిలో
నేనిప్పుడు నా సోదరులను గుర్తించగలుగుతున్నాను.
తుపాను తాకిడికి అరణ్యం అల్లకల్లోలమై అరుస్తూ
మహా శంకువృక్షాలు నేలకూలుతున్నపుడు
వాటి తాకిడికి మిగతా వృక్షాల కొమ్మలు విరుగుతున్నపుడు
ఆ చెట్ల కాండాలూ, మొదళ్లూ కదుల్తూ చేస్తున్న శబ్దాలు
ఈ కొండల్లో గుట్టలో ప్రతిధ్వనిస్తుండగా
నన్ను ఈ గుహలోకి నడిపించినావు.
నిన్ను నాకెరుక పరచి, నా హృదయపు అద్భుత రహస్యాలను తెలిపినావు.
వెన్నెల కాంతిలో నేను నింగిని చూసినపుడు
కొండ శిఖరాల్నుంచి, వెండి పొదల్నుంచి
జాలువార్తున్న అమూర్త్యరూపాలు, గతించిన ప్రపంచపు ఆనవాళ్లు
నా కనుల ముందు కదలాడుతూ, నా ధ్యానాన్ని సంపూర్ణం చేస్తున్నాయి.

నాకు సత్యం గోచరిస్తున్నది.
మానవునికిచ్చిన ఏ వరమూ సంపూర్ణం కాదు.
నన్ను దేవతల సరసన చేర్చే అమందానందం
ప్రసాదించడానికి నీవు నాకో ప్రియురాలిని ఇచ్చావు.
ఆమె నాకిప్పుడు అత్యంత ప్రియమైనది.
ఒక్క శీతల దృక్కుతో అతడు నన్ను పతితుడిని చేసి,
నీ బహుమతులను నిశ్శేషం చేయగలడు.
కాని ఆమె రూపంతో అతడు నా హృదయాన్ని

జ్వలించే అగ్నిగుండంలా మార్చినాడు.
కామం నుంచి ప్రేమ వేపు సాగుతున్న ఈ నా ప్రస్థానంలో
నేను కోరుకున్నదానికన్నా అధికమైన ఆత్మసంతృప్తి ఉన్నది.
**(మెఫిస్టాఫిలిస్ ప్రవేశం)**

**మెఫిస్టాఫిలిస్ :** ఈ దైనందిన వ్యవహారం విసుగు పుట్టించడం లేదా?
ఇంకా నీకది ఇష్టంగా ఉండడం వింతగానే ఉన్నది.
ఏదో ఒక్కసారి అలా చేస్తే ఫరవాలేదు.
కొత్త రుచులకు ప్రయత్నించడమే అది మేలు.

**ఫాస్ట్ :** నన్ను విసిగిస్తూ పగటి కాలాన్ని వృధా చేసేకన్నా
నీవింకో వ్యాపకం చూసుకుంటే అదే పదివేలు!

**మెఫిస్టాఫిలిస్ :** తప్పకుండా! తమ మనోగతం నాకర్ధమయ్యింది.
నీలాంటి వినియోగదారుడు దొరకడమే నా అదృష్టం.
ప్రభువును సంతోషపెట్టడానికి ప్రతిక్షణం పనిచేసినా
చివర్లో ఛీత్కారాలూ, చివాట్లు తప్పవన్నదే నిజం!

**ఫాస్ట్ :** రూపానికి తగ్గ గొంతు, గొంతుకు తగ్గరూపం
ఒక పక్క పీడిస్తూనే, కృతజ్ఞతలు కోరడం తమ నైజం.

**మెఫిస్టాఫిలిస్ :** ఓరి మర్త్యుడా! నా సాయం లేకుండా
నీవు బతికిన బతుకు ఎటువంటిది?
నీ చిల్లరమల్లర వ్యాపకాల్ని నయం చేసానే, లేకుంటే,
ఏనాడో నీ ఉనికి ఈ లోకాన అదృశ్యమయ్యేది కాదా?
ఇప్పుడు కొండల్లో, గుహల్లో కూర్చుని
అనాది కాలపు గుడ్లగూబలా గునుస్తున్నావు!
ఈ కటిక చీకటిలో, నీళ్లు కారే రాళ్లమధ్య
గోదురు కప్పలా గోప్యంగా బతుకుతున్నావు!
ఈ సంవత్సరమంతా ఇలాగే గడుపుతావా?
బాగా చదువుకున్న డాక్టరువి నీవేనా ఇంతకీ!

**ఫాస్ట్ :** ఇటువంటి ప్రకృతి సీమల్లో విహరిస్తున్నపుడు,
నా జీవశక్తి ఎంత ఉత్తేజితమవుతుందో గమనించావా?
నీకు చేతనైతే దానిని అడ్డుకోవడానికి ప్రయత్నించు,
నా ఆత్మ సంతృప్తిని నిరోధించు, నీవూ నీ డెవిల్ చేష్టలూ!

మెఫిస్టొఫిలిస్ : ఓ! ఎంతటి అలౌకిక ఆనందం!
మంచు కురిసినరాత్రిలో ఈ పర్వతాలూ
భూమి, స్వర్గం ఆనందంతో పొంగి దైవత్వంతో నిండి
భూమి పేవులు నీ ఆశయాల పోట్లకు లొంగి
నీ హృదయంలో ఆరురోజుల సృష్టి ఆశ్రయించగా
ఎంత గర్వం, ఎంత శక్తి, ఎంత ఆనందం, ఆ దేవుడికే తెలియాలి!
ప్రేమ– పొంగి పొరలి వాటినన్నిటిని ముంచేస్తున్నది.
ఇప్పుడు మామూలు మర్త్యుడవెలా అవుతావు,
మిత్రుడా! ఎలా ఉంది నా ఊహాగానం, దాని ప్రభావం!
నేనూ చెప్పగలను కాని, చెప్పకపోతేనే మంచిది.

ఫాస్ట్ : సిగ్గుపడాలి! Shame on you!

మెఫిస్టొఫిలిస్ : అవునా! నా వ్యాఖ్యానాలు నీ వీనులను నొప్పించాయా!
అందుకని సిగ్గుపడాలంటున్నావా!
అవునులే మనసులోని మాటను బిగ్గరగా చెప్పకూడదు కదా!
సంక్షిప్తంగా, ఆర్యా! తమరు ఆ క్షణికానందం నుంచి విడివడాలి!
లేకుంటే చాలాదూరం వెళ్లినట్లు తమకే అవగతమవుతుంది.
ఇప్పటికే మూడు వంతులు చచ్చినవారు తమరు!
ప్రేమ పిచ్చి ముదిరితే అది నిన్ను నమిలి మింగుతుంది.
కళ్లెదుట భీకర దృశ్యాలు సాక్షాత్కరించి పిచ్చివాడవవుతావు.
అయ్యిందేదో అయ్యింది. అక్కడ నీ ప్రియురాలు వేచి వున్నది.
ప్రేమ వలలో పడి, విరహంలో చిక్కుకుని దుఃఖిస్తున్నది.
ఆమె ఏకైక ప్రేమ చిహ్నానివి నీవు.
నీ ఉద్వేగపు తొలి అల వరదలా ప్రవహించి
మంచు కరిగి, ఉప్పొంగిన ఏరులా ఒడ్డును ఒరుసుకున్నట్లు
నీవు ఆమె హృదయంలోకి ప్రేమను నింపినావు.
ఇప్పుడు నీ ఏరు ఎండిపోయింది.
నా సలహా విని, ఈ అరణ్య సింహాసనాన్ని విడిచి
ఆమె సన్నిధికి చేరి ఆమె చిరునవ్వులు చిందేలా చేయి.
ఆమె దేహపు పొంగులను చల్లార్చే బహుమతులనివ్వు.
కాలం ఆమె చేతుల్లో బరువుగా వేలాడుతున్నది.
కదిలే మేఘాల్ని చూస్తూ, కిటికీ వద్ద నిలబడి వున్నది.
మబ్బులు నెమ్మదిగా నగరమందిరం వేపు వస్తుండగా

ఆమె ఒంటరితనంతో బిక్కుబిక్కుమంటున్నది.
పగలంతా, రాత్రి సగం ఆమె పాడుతున్నది.
నాకే రెక్కలుంటే బాగుండునని పలవరిస్తున్నది.
పావురంలా కువకువలాడుతూ, మరుక్షణాన
కన్నీరు ఏరులయ్యేలా దుఃఖిస్తున్నది.
మనసు ప్రశాంతపడగా మౌనం దాల్చినా
మరింత ప్రేమతో పలవరిస్తున్నది!

**ఫాస్ట్** : సర్పమా! విష సర్పమా!

**మెఫిస్టొఫిలిస్ :** (తనలో) నా విషం పని చేస్తున్నది.

**ఫాస్ట్** : రాక్షసుడా! నన్ను ఒంటరిగా వదిలేయ్!
నీ నాలుక ఆ బాలిక పేరును ఉచ్ఛరించకుండును గాక!
ఆమె దేహాన్ని నేను కోరుకుంటున్నాను, అలా సగం
ఉన్మత్తుడనైన నన్ను, మరింత జ్వలింపజేస్తావేల?

**మెఫిస్టొఫిలిస్ :** ఇదంతా ఎందుకు? నీవు పారిపోయావనుకుంటున్నదామె!
ఆమె ఊహ సగం నిజం, అది నీకూ తెలిసిన విషయం.

**ఫాస్ట్** : నేనెక్కడ ఉన్నా ఆమె నా మనసులోనే ఉన్నది.
నేనామెకు, ఆమె నాకు ఒకరికొకరం దగ్గరే!
నేను లేనప్పుడు, ఆమె పెదవులు క్రీస్తు దేహాన్ని స్పృశించినా
నాలో అసూయ అనంతంగా పెరుగుతుంది సుమా!

**మెఫిస్టొఫిలిస్ :** నిజమా, మిత్రమా! మరి ఆ లిల్లీపూల మధ్య
తిరిగే లేళ్ల మాట ఏమిటి? నీలానే అవీనూ!

**ఫాస్ట్** : తొలిగిపో, ఇక్కడ నుంచి, తార్పుడు వెధవా!

**మెఫిస్టొఫిలిస్ :** మంచిది! నీ తిట్లే నాకు దీవెనలు! చాలా సరదాగా ఉన్నాయి.
ఆడ, మగను సృష్టించిన దేవుడే ప్రేమనూ సృష్టించాడు.
ముందు ఈ చీకటి గుయ్యారం నుంచి బయటపడదాం పద!
ఇంతకీ, నీవు నీ ప్రియురాలి ఇంటికి వెళ్తున్నావా,
లేక ఇక్కడే ఆఖరి నిద్ర పోదలుచుకున్నావా?

**ఫాస్ట్** : ఆమె కౌగిలిలోని స్వర్గ సౌఖ్యాలనెలా వర్ణించగలను!
ఆ ప్రేమ మాధుర్యంలో ఆమెకంత దగ్గరగా ఉన్నా

ఆమె దుఃఖాన్ని నేను స్పృశిస్తూనే ఉన్నానే!
నేనెవరిని? ఇల్లూవాకిలీ లేని దేశదిమ్మరిని!
దిక్కూ దివాణం లేని తిరుగుబోతును.
ప్రశాంత చిత్తం లేని కరుడుగట్టిన పాపిని.
ఒక కొండ శిఖరం నుండి మరో కొండ శిఖరంపై
పడుతూ లేస్తూ పడుతూండే జలపాతాన్ని.
శిఖరాల నుండి లోయల్లోకి దురాశతో దూకుతూ
అగాధాల్లోకి పతనమౌతున్న జలధారను!
ఆమె– పసిపాపలా, అమాయకంగా
చిన్ని గుడిసెలో, కొండ వాలులోని మైదానంలో
తన చిన్ని ప్రపంచంలో హాయిగా, సంతృప్తిగా
తనకున్న దానితో సంతోషంగా జీవిస్తున్నది.
నేను దైవ శాపోపహతుడిని,
నా ఆగ్రహ ఉద్వేగాలను ఏ రాతిగుట్టలూ నిలువరించలేవు!
నా ఉధృత ప్రవాహ గమనంలో అడ్డువచ్చిన ప్రతిదీ ముక్కలు కావల్సిందే!
ఆమెను నాశనం చేసి, ఆమె శాంతిని
ధ్వంసం చేసి నేనెలా నిలువగలను.
ఆమె ఇప్పుడు నరకానికి నాకూ బలిపశువు!
డెవిల్! ఈ నిరీక్షణను తగ్గించేలా నాకు సాయం చేయి!
ఈ భయాన్ని తొలగించు. త్వరగా!
ఆమె వినాశం నన్ను ధ్వంసం చేయనీ!
ఆమెతోపాటు నేనూ, నాతోపాటు ఆమె సర్వనాశనం కానీ!

**మెఫిస్టాఫిలిస్ :** అదీ సంగతి! నీళ్లు మళ్లీ ఉడుకుతున్నాయి!
పిచ్చివాడా! వెళ్లు ఆమెవద్దకు! సముదాయించు!
నీ మెదడు భవిష్యత్తులోకి చూడలేదు కనుక
అంతిమదినం అప్పుడే వచ్చేసిందని భ్రమపడ్తున్నావు.
పోట్లాడాలనుకున్నప్పుడు మంచి పోట్లాటనే ఎన్నుకోవాలి!
నీవిప్పటికే మాలో ఒకడివి, 'డెవిల్'వి.
'డెవిల్'కు నిరాశ ఉండరాదు, ఒక్కోసారి అనిపించినా
అది దెయ్యం పట్టి పీడించినంత విసుగు కలిగించాలి!

# 18. గ్రెఛెన్ గది (Gretchen's Room)

గ్రెఛెన్ : నా హృదయం బరువెక్కినది,
నా హృదయం గాయపడినది,
ఎందుకు నా హృదయమింక
ప్రశాంతంగా ఉండనంటున్నది?

ఈ ప్రపంచమే నశించినట్లు
పగలే చీకటి కమ్మినట్లు
అతడు రాని నాడు
నా జీవితమే చేదు విషమౌతున్నది.

నా తల బరువెక్కుతున్నది.
ఏం చేయాలో తోచకున్నది,
నా మనసు ముక్కలై
రెండుగా చీలి ఉన్నది.

నా హృదయం బరువెక్కినది,
నా హృదయం గాయపడినది,
ఎందుకు నా హృదయమింక
ప్రశాంతంగా ఉండనంటున్నది?

ఈ కిటికీలోంచి చూస్తే
కనిపించేది అతని రూపమే జగమంతా!
అతడెక్కడున్నాడా అని ఆలోచిస్తూ
నేనలా నడుస్తూనే ఉంటున్నా, ఏమిటీ వింత?

గర్వంగా పడే ప్రతి అడుగూ
ఉన్నతంగా ఉండే అతడి శిరసూ
పెదాలపై విరిసే చిరునవ్వూ
అతని చూపు మాయలు రువ్వు

సెలయేటి గలగలలా స్వరం
ఏదో మంత్రాన్ని పఠించు భాస్వరం!
నన్ను స్పృశించే ఆతని హస్తాలు
నను మైమరిపించే ఆతని చుంబనాలు.

నా హృదయం బరువెక్కినది
నా హృదయం గాయపడినది
ఎందుకు నా హృదయమింక
ప్రశాంతంగా ఉండనంటున్నది.

జ్వాలలపై ఉన్న నా దేహం
ఆతని చెలిమిని కోరుతున్నది;
తనివితీరా కౌగిలించుకుని
ఎన్నటికీ విడవ వద్దంటున్నది.

ఎంతసేపు వీలైతే అంతసేపు
దీర్ఘకాలం అతడిని ముద్దాడాలని,
అతని చుంబనాలలో కరగిపోతూ
అక్కడే చనిపోవాలని మనసు తపిస్తున్నది.

## 19. మార్తా తోట (Martha's Garden)

**మార్గరెటా** : హీన్రిచ్! నాకు వాగ్దానం చేయి!

**ఫాస్ట్** : నేను చేయగలిగినదంతా!

**మార్గరెటా** : మతంపై ఏమిటి నీ అభిప్రాయం?
నాకు తెలుసు నీవు మంచివాడివని,
కాని మతమంటే నీకు లెక్కలేదనీ!

**ఫాస్ట్** : ప్రియతమా! ఆ సంగతి వదిలేయ్!
నీకోసం నా ప్రాణాన్నిస్తానని నీకు తెలుసు,
నిన్నెంత ప్రేమిస్తున్నాననంటే, నా కోసం నీ అభిప్రాయాన్ని మార్చుకోమనను!

**మార్గరెటా** : విశ్వాసం తప్పనిసరికదా! మీరనేది సరైనది కాదేమో!

**ఫాస్ట్** : ఉండాలా!

**మార్గరెటా** : ఋజువు చూపించగలిగితే బాగుండును, కాని
మీరు పవిత్ర కర్మలను, ఆచారాలను గౌరవిస్తారా?

**ఫాస్ట్** : నమ్ముతాను.

**మార్గరెటా** : కాని మీరు వాటిని ఆచరించరు.
ఆరాధనా విందులకు రారు, విశ్వాస ప్రకటన చేయరు!
అసలు, దేవుడిని నమ్ముతారా మీరు?

**ఫాస్ట్** : ప్రియురాలా! ఎలాంటి మాటలివి?
అయినా దేవుని నమ్ముతున్నానని ఎవరు నిశ్చయంగా చెప్పగలరు?
ప్రీస్టు, జ్ఞాని వీళ్ల జవాబులు ప్రశ్నించినవాడినే వెక్కిరిస్తాయి.

**మార్గరెటా** : అయితే, నీవు నమ్మవన్నమాట!

**ఫాస్ట్** : నా చిన్నారి ప్రియురాలా! అపార్థం చేసుకోకు!
దేవుని పేరు ఉచ్చరించగలిగిన వారెవ్వరు?
దేవుని నమ్ముతున్నానని ఖచ్చితంగా చెప్పగలిగినదెందరు?
అన్నిటిని ఆవరించుకుని
అన్నిటిని ఏకసూత్రాన బంధించి

నిన్నూ, నన్నూ, తననూ
ఇలా కట్టి పడేసి ఉంచలేదా!
అదిగో స్వర్గలోకపు పైకప్పు,
మనకు ఆధారభూతమైన నేల ఈ క్రింద,
ప్రేమతో మిలమిలా మెరుస్తున్న తారలు నింగిలో,
ఇక్కడ మనం కనులలో కనులుంచి చూసుకోడం లేదా!
ఇవన్నీ నీ మనస్సును, హృదయాన్ని బంధించి
తన శాశ్వత మార్మికతా దృశ్యంలో కనిపించకుండా అల్లడం లేదా!
ఓహ్! నీ హృదయాన్ని వీటన్నిటితో పూర్తిగా నింపు!
ఆనందం అంచులు దాటి ప్రవహిస్తున్న భావాన్ననుభవించు!
దాన్ని ఆనందమను, హృదయమను, ప్రేమ అను, దైవం అను;
నా దృష్టిలో దానికి పేరు లేదు. అది నామరహితం.
ఉన్నదల్లా ఒక భావన మాత్రమే!
పేరు, నామం ఇవన్నీ ఒక ధ్వని, ఒక పొగ
అవి స్వర్గపు కాంతుల్ని మబ్బుల్లా కమ్మివేస్తాయి.

**మార్గరెటా** : అవును! వీటిలో ఏదో గూడార్థమున్నది.
ప్రీస్టు కూడా ఇటువంటిదే చెబుతాడు.
మాటల్లోనే ఎంతో తేడా ఉన్నది, సారాంశమదే!

**ఫాస్ట్** : అందరు మనుషులు చెప్పేదదే!
అన్ని మానవ హృదయాలు పవిత్రదినాన
అదే భావాన్ని, సందేశాన్ని తెలుపుతాయి.
భాష వేరు కావచ్చు! నేను నా భాషలో చెప్పకూడదా?

**మార్గరెటా** : వినడానికింపుగానే ఉన్నాయీ మాటలు
కాని, ఎక్కడో, ఏదో సందేహపు నీడలు
నీవు క్రైస్తవుడివేనా? నాకు నమ్మకం కుదరడం లేదు!

**ఫాస్ట్** : నెచ్చెలీ!

**మార్గరెటా** : నీ స్నేహితుడిని చూస్తే నాకలా అనిపిస్తున్నది.

**ఫాస్ట్** : ఏమిటి?

**మార్గరెటా** : నీతో వస్తాడే నీ చెలికాడు
నేనూ, నా ఆత్మా అతడినెందుకో ద్వేషిస్తాము.
నా జీవితంలో నేనెప్పుడూ అలా భావించలేదు.
నా హృదయంలో కత్తి దూసుకుపోయినట్లుంటుంది.
అతడి మొహం, వాలకం, అసహ్యమైన వెకిలి నవ్వూ!

**ఫాస్ట్** : చెలీ! అంత భయపడవలసిందేమీ లేదు!

**మార్గరెటా** : అతడీ చుట్టుపక్కల ఉంటేనే నాకేదో బుగులు,
నిజానికి నేనెవర్నీ అసహ్యించుకోను అసలు!
నీకనులలోకి చూస్తూ యుగాలైనా ఉండగలను.
అతడిని చూడగానే నా రక్తం గడ్డకడ్తుంది!
నా దృష్టిలో అతడొక దగాకోరు, వంచకుడు,
నేను తప్పుగా అని ఉంటే క్షమించును గాక నన్ను దేవుడు.

**ఫాస్ట్** : నీకు తెలుసు, కొందరు విభిన్నంగా కనిపిస్తారు.

**మార్గరెటా** : అటువంటి వాడితో నేను కలిసి ఉండలేను.
గుమ్మంలోంచి అతడు లోనికడుగిడగానే
మనకు తెలుస్తుంది అతడు అదోరకంగా చూస్తున్నాడని
నిశితంగా, తీవ్రంగా, తీక్షణంగా, గమనిస్తున్నాడనీ-
అతడు మానవుణ్ణే కాదు దేవుడినీ లెక్కచేయడనీ,
అతడి కనుబొమలపైని మచ్చ, మదత చెబుతుంది
అతడెవ్వరినీ ప్రేమించలేదని, అతడి హృదయం మరణించిందనీ.
నీవు నీ చేతులతో నన్ను చుట్టినప్పుడల్లా
నేను పూర్తిగా నీదాన్నవుతాను, వెచ్చగా, స్వేచ్ఛగా!
అతడిని చూడగానే ఎందుకు అలా ముడుచుకుపోతాను?

**ఫాస్ట్** : చెలియా! ఎటువంటి ఊహ!

**మార్గరెటా** : అతడు రావడం చూడగానే నాలో ఏదో భీతి
నామీద నాకే సందేహం, నిన్ను నేను ప్రేమిస్తున్నానా అని;
అతడు ఇక్కడ ఉన్నపుడు నేను దేవుని ప్రార్థించలేను.
అదే నా హృదయాన్ని కొరుక్కుతింటున్న బాధ.
ప్రియతమా హీన్రిచ్! నీకేమనిపిస్తుందో చెప్పవా!

ఫాస్ట్ : అతడంటే నీకేదో తెలీని వ్యతిరేకత, అంతే!

మార్గరెటా : నేనిక వెళ్తాను.

ఫాస్ట్ : మనిద్దరం ఒకటయ్యేది ఎప్పుడు చెప్పవా!
హృదయంలో హృదయంగా, ఆత్మలో ఆత్మగా!

మార్గరెటా : నేను ఒంటరిగా ఉంటే అది సాధ్యమే,
నా తలపు తలుపు నీకోసం తెరచి ఉంచేదాన్ని!
అక్కడే పడుకునే మా అమ్మ లేచి మనిద్దరినీ చూసిందా!
నేనాచోటే పడి మరణించడం ఖాయం సుమా!

ఫాస్ట్ : అంత గొడవేం జరగదులే చెలీ!
ఈ చిన్ని సీసాలో ద్రవముంది చూడు,
మూడు చుక్కలు ఆమె తాగే నీటిలో కలుపు.
తియ్యని గాఢనిద్రలో ఆమె, తెల్లారే మేలుకొలుపు!

మార్గరెటా : నీకోసం నేనేమి చేయకుండా ఉండగలను?
ఆమెకేమీ అపకారం జరగదు కదా, ఖచ్చితంగా!

ఫాస్ట్ : ఇంకే పద్ధతైనా ఆలోచించనా?

మార్గరెటా : నీ కనులలోకి చూస్తున్నాను, ప్రియ హీన్రిచ్!
నా హృదయం నీది, నా ఇచ్ఛ నీది, నాదంటూ ఏమీలేదు!
ఇప్పటికే నీకోసం నేనెన్నెన్నో చేసాను.
ఇంక చేయడానికి మిగిలిందేమీ లేదు.
(వెళ్లిపోతుంది. మెఫిస్టొఫిలిస్ ప్రవేశం)

మెఫిస్టొఫిలిస్ : మనసు దుడుకు కోతి! వెళ్లిపోయిందా ఆమె!

ఫాస్ట్ : ఇంకా గూఢచారితనం చేస్తూనే ఉన్నావా?

మెఫిస్టొఫిలిస్ : ఆమె చెప్పిన ప్రతిముక్కా జాగ్రత్తగా విన్నాను.
చదువుకున్న డాక్టరు గారికే చదువు చెప్పిందామె!
డాక్టరు గారు విజ్ఞానవంతుడయ్యాడనుకుంటాను.
బాగా శిక్షణ ఇవ్వబడిన బాలికల తీరు అంతే!
కరుణాంతరంగమైన నిరాడంబర ప్రపంచమే వారిది
వాళ్ల సిద్ధాంతమేమిటంటే మగవాడికి మనసు మందు పోద్దాం
మొత్తం మింగాడా, మన చీరకొంగు వదలడు ఆ తర్వాత!

**ఫాస్ట్** : నీ వంచనా పూరిత మనస్సుకు ఇది వింతగానే తోస్తుంది.
విశ్వాసంతో నిండిన ఆమె ఆత్మకు స్వర్గపు దారి ఒక్కటే తెలుసు.
తన ప్రియుడు శాశ్వత మృత్యువుకు తరలించబడినాడని తెలిస్తే
ఆమె ఆత్మ ఇంకెంత దుఃఖంతో కొట్టుమిట్టాడ్తుందో, పాపం!

**మెఫిస్టొఫిలిస్ :** నీ సున్నితమైన మనసును గమనించిందా నెరజాణ,
నిన్ను ముక్కు పట్టుకుని ఆడిస్తోంది నయాన, భయాన!

**ఫాస్ట్** : అపభ్రంశపు రాక్షసుడా! అశుద్ధం, అగ్ని మిశ్రమమైనవాడా!

**మెఫిస్టొఫిలిస్ :** మనిషిని చూసి లోనున్నది చెప్పగలిగిన ప్రజ్ఞ ఉన్నది ఆమెకు
నేను చుట్టుపక్కలుంటే, ఆమెకేమనిపిస్తుందో చెప్పలేదు
కాని నా మొహాన్ని చూడగానే ఏదో ఉపద్రవం నీడ
ఆమె ఊహ ప్రకారం నేనో గొప్ప మేధావిని, I am a genius certainly
'డెవిల్'ననే అనుకుంటున్నదిలే!
అదిసరే గాని, ఈ రాత్రేనా శుభకార్యం?

**ఫాస్ట్** : దానితో నీకేమి నిమిత్తం?

**మెఫిస్టొఫిలిస్ :** దానిలో కూడ నాకు లభిస్తుంది అదోరకపు ఆనందం!

# 20. బావి దగ్గర (At the Well)

లైషెన్ : నీవు బార్బరా గురించి విన్నావూ?

గ్రెఛెన్ : లేదే! ఈమధ్య ఎవరినీ కలవలేదు!

లైషెన్ : ఇది పచ్చినిజం! మొత్తానికి కాలు జారింది!
సైబిల్ చెప్పింది కథ యావత్తూ ఈ దినం!
ఆ పొగరు, టెక్కులకు అదే గదా పర్యవసానం.

గ్రెఛెన్ : ఏమయ్యిందసలు?

లైషెన్ : కంపుగొట్టింది. కథ పట్టు తప్పింది.
ఒకరి తిండికి బదులు ఇద్దరికి తింటున్నదిప్పుడు!

గ్రెఛెన్ : ఓహ్!....

లైషెన్ : మొత్తానికి తిక్క కుదిరింది.
ఆ కుర్రాడెమ్మటే కులుకుతూ తిరిగింది గదా!
చేతిలో చెయ్యేసి, అడుగులో అడుగేసి
పొలంగట్లు, నర్తనశాలలు!
అందగత్తెకదా అందలాలెక్కుదామనుకుంది.
కాలుజారి అడుసులో కూలబడింది.
రోజూ మధుభక్ష్యాలు, మధుపానీయాలు
అతగాడి నుంచి అనేకం బహుమానాలు,
కౌగిలింతలు, ముద్దు ముచ్చట్లు గంటలకు గంటలు
చివరికి ఏముంది, పూవు వాడిపోయింది.

గ్రెఛెన్ : దురదృష్టం.

లైషెన్ : జాలిపడుతున్నావా ఏం?
మనమిక్కడ చరఖాల దగ్గర మగ్గాల దగ్గర నానా చావు చస్తుంటే
మన అమ్మలు మనల్ని సాయంకాలాలు కూడా బయటకు పోనీకుంటే
ఆమె ఎంచక్కా తన మనోహరుడితో షికార్లు,
తలుపు చాటుల్లో, సందుగొందుల్లో సరసాలు!

తిక్క కుదిరింది. ఇప్పుడు చర్చిలో ప్రాయశ్చిత్తం,
పాపుల వరసలో కూర్చుని ప్రార్థనలు చేయడం.

**గ్రెఛెన్** : అతడు పెళ్లి చేసుకుంటాడు కదా!

**లైషెన్** : వాడా! అటువంటి సోగ్గాడికి సముద్రం నిండా చేపలే!
వాడేమన్నా పిచ్చాడా పనైనాక కూడా పడి ఉండడానికి, ఎప్పుడో సర్దుకున్నాడు.

**గ్రెఛెన్** : మోసం చేసాడు కదూ!

**లైషెన్** : వాడు దొరికితే ఈమె బాగుపడ్తుందిలే.
లేకుంటే కుర్రాళ్లు ఆమె తలలో పూలని లాగేస్తారు,
మనం ఆమె ఇంటిముందు గడ్డికట్ట విసిరేస్తాం!
(వెళ్లిపోతుంది)

**గ్రెఛెన్** : (ఇంటికి నడుస్తూ) ఇదివరకు ఎటువంటి మాటల్ని అనేదాన్ని,
ఎవరైనా ఆడపిల్ల దారి తప్పిందని వినగానే!
నా బుర్ర గోక్కుని మరీ శాపనార్థాలను వెదికేదాన్ని
పాపాలప్పుడు నాకు అతి నల్లగా కనిపించేవి.
నేను చేతులు మడిచి సంజ్ఞలతో దేవుని స్మరించే దానిని.
ఇప్పుడు వాళ్లు చేసిన పాపమే నేనూ చేసాను.
ఓ దేవుడా! నన్నింత తెగువ చూపేట్లు చేసింది
ఆ ప్రేమ అనే ఓ పెద్ద శక్తి కాదా! నేను చేసింది తప్పా, కాదా!

# 21. నగర మందిరంలోని చిన్న గుడి దగ్గర
## (By a Shrine inside the Town Hall)

**(కన్య మేరీ విగ్రహం ముందున్న కలశంలో పుష్పాల్ని ఉంచుతూ గ్రెఛెన్ ప్రార్థిస్తుంది.)**

గ్రెఛెన్ : ఓ కన్యామాతా! అంతులేని దుఃఖాలతో నిండిన నీ వదనం
ఆనాడు వేదనతో నిండి కరుణను కోరుకున్నదా?

ఓ మాతృమూర్తీ! శిలువ వేయబడిన సుతుడు మరణించడం,
చూస్తున్న నీ ఎదలోకి అతని బాధాపూరిత స్వరం దూసుకుపోలేదా!

తండ్రికై వెదుకుతూ తల్లడిల్లిన అతడి మరణవేదన
నీ నిరాశా నిట్టూర్పులతో కలిసి నింగి కెగయలేదా!

నరకాగ్నిలా నా ఎముకలలో జ్వలిస్తున్న బాధ
నీకన్నా బాగా ఇంకెవరికి తెలుసు? ఎలా నా హృదయం నుంచి
రక్తం స్రవిస్తున్నదో, ఎలా తల్లడిల్లుతున్నదో, ఏ స్వాంతన
కోరుకుంటున్నదో, తల్లీ! నీకన్నా బాగా ఇంకెవరికి తెలుసు!

నేనెక్కడికి వెళ్లినా ఆ బాధ ఆగనే ఆగదు,
ఎంత బాధ పెడ్తుందో ఎవరికీ తెలియదు!
ఒంటరిగా విలపిస్తున్నపుడు నాకు చనిపోవాలనిపిస్తుంది,
నా హృదయం బద్దలయ్యేలా దుఃఖం ప్రవహిస్తుంది!

నా కిటికీ పక్కన పూలకుండీని నా కన్నీళ్లతో తడిపాను.
ఉదయపు వేకువనే ఆ పూలను నీ పూజకై తీసుకువచ్చాను.

తొలికిరణాలు సోకగానే శయ్యపై లేచి కూర్చున్నాను.
సంధ్యాకాంతులు ఎరుపెక్కగానే నా కనులు జలధారలైనాయి.

అమ్మా! రక్షించు నన్ను అవమానం, మృత్యువుల నుంచి!
కన్యామాతా! నీ వనుభవించిన స్థితే నాది తల్లీ! నన్ను కనికరించు!

# 22. రాత్రి గ్రెఛెన్ ఇంటి తలుపు పక్క వీధి
## (Night, The Street outside Gretchen's Door)

**వాలెంటైన్ : (సైనికుడు – గ్రెఛెన్ సోదరుడు).**
నేనూ నా తోటి సైనికులు మధువును సేవించేప్పుడు
అదే మంచి సమయం కదా గప్పాలు కొట్టేందుకు!
అందరూ తమ ప్రియురాళ్ల అందాన్ని పొగిడేవారు
ఒకరి తరువాత ఒకరు, అందరూ గులాబీలంత అందమైనవాళ్లే
నేను మాత్రం మౌనంగా బల్లపై చేతులాన్చి కూర్చునేవాడిని!
అందరూ పాడటం అయిపోగానే నా గ్లాసు నిండా మధువు నింపి
చిరునవ్వుతో సవాలు విసిరేవాడిని– గౌరవమిచ్చే దగ్గర గౌరవమివ్వాలి!
ఈ దేశం మొత్తం మీద అమ్మాయిని వెదికి చూపండి
నా చిన్నారి సోదరి 'మెగ్' లాంటి గుణవంతురాలు, శీలవతిని!
క్లింక్! గ్లాసులు మ్రోగేవి! కొందరనేవారు!
నిజం! అతడు చెప్పింది అక్షరాలా నిజం! అతడి చెల్లెలు నిప్పుకణిక!
ఆడపిల్లల్లో వజ్రపు తునక. లావణ్యంలో మెరుపు మొలక!
మిగతా హెచ్చులు పలికినవాళ్లు మౌనం వహించేవాళ్లు.

మరి ఇప్పుడు? ఇప్పుడు? అంతా తలకిందులయ్యింది!
నా జుట్టు పీక్కోనా? గోడకు తల పగలగొట్టుకోనా?
అందరూ నన్నుజూసి నవ్వుతున్నారిప్పుడు!
అప్పు తీర్చలేని వాడిలా మొహం దించుకున్నాన్నేను.
ఎన్నో ఎత్తిపొడుపులు, హేళనలు, ఛీత్కారాలు, చీదరింపులు.
ఒక్కవేటున వాళ్ల తలలు తెగ్గొట్టగలను, కాని
వాళ్లు అబద్ధం చెబుతున్నారన్నది ఋజువు చేయగలనా?

ఎవరక్కడ? ఎవరా తలుపువేపు వెళ్తున్నది?
ఇద్దరున్నారా దరిదాపుల, వాళ్లలో ఒకడు అతడైతే
ప్రాణాలతో పోవడం జరగని విషయం!
**(ఫాస్ట్, మెఫిస్టొఫిలిస్ ప్రవేశం)**

**ఫాస్ట్ :** పవిత్రావరణ గవాక్షం గుండా రక్షణ దీపపు వెలుగు,
మసక మసకగా కనిపిస్తున్నది రెండు పక్కలా, చూడు?

దాని చుట్టూరా గాడాంధకారం కమ్ముకున్నది,
నాలో రాత్రి ప్రవేశించి హృదయాన్ని కఠినపరుస్తున్నది.

**మెఫిస్టొఫిలిస్ :** ఇప్పుడు పిల్లిలా నేను ఇళ్లపైకప్పుల పైకెక్కి ఆడతాను.
ఏదో దొంగతనం చేయాలనే ఆకలి నాలో ప్రతిక్షణం పెరుగుతున్నది,
మంత్రగత్తెల రాత్రి 'వాల్‌పర్గిస్' త్వర త్వరగా రానున్నది.
నా ఒళ్లు జలదరిస్తున్నది ఏదో వస్తున్నదన్న ఆశతో,
అందుకే మిత్రమా కాస్తాగు! మంచి రాత్రిని నిద్రతో వంచన చేయకు.

**ఫాస్ట్ :** అలా పైకెగుస్తున్నది భూగర్భాన దాచివుంచిన స్వర్ణమా?
మెరుస్తూ మెరుస్తూ మనవేపే వస్తున్నది మన కోసమా!

**మెఫిస్టొఫిలిస్ :** అదిగో పైకుబుకుతున్నది స్వర్ణ నిధి,
గైకొనిపో, అదే నీ ప్రియురాలి సన్నిధి.
నేనీసరికే తొంగిచూసానందులోన,
వెండి నాణేలనేక మున్నాయి ఆ పెట్టెలోన!

**ఫాస్ట్ :** నాణ్యమైన నగలేమీ లేవా! ఎందుకా నాణెం?
నా ప్రియురాలికిష్టం బంగారు ఆభరణం!

**మెఫిస్టొఫిలిస్ :** ఉందిలే లోనొక ముత్యాలహారం
ఆమె కనులనే మరిపించు ధనాగారం.

**ఫాస్ట్ :** సంతోషం! బహుమతి లేకుండా ప్రియురాలిని చేరుట నాకసమ్మతం.

**మెఫిస్టొఫిలిస్ :** ఈ సరికే నీవు ఆడవాళ్ల తీరు అర్థం చేసుకుని ఉండాలి.
వారిచ్చే వాటిని హాయిగా ఆనందించు. అంతే!
చూడు! ఆకాశాన తారలు వెలుగులు రువ్వుతున్నాయి.
నామట్టుకు నేనిప్పుడు పాడుతానొక నీతి పాట!
మంచీ చెడుల మధ్య ఆమె మనసును కంగారుపెట్టే మాట!
(పాట పాడతాడు, తంబూరా లాంటిది మీటుతూ)
– తన ప్రియుడి తలుపు ముందు
ఎవరు నిలబడి నిరీక్షిస్తారో
ఇంకోసారి, మరోసారి
ఉదయం నుంచి ప్రతిసారీ!–

అయ్యో, కేట్! జాగ్రత్త!
లోపలికి వెళ్లేంత వరకూ
నీవు చక్కని కన్యవే!
వచ్చేప్పుడు మాత్రం చిక్కిన యువతివి!
మగవాళ్లకంతా మజాగా ఉంటుంది.
ఒకసారి పనైపోయిందా
కొట్టు మూసేసి జారిపోతారు.
దొంగలు వీళ్లు అందుకే అలా వెంటబడతారు!
అమాయకపు కన్నెపిల్లల్లారా,
వాళ్ల వలలో పడకండి!
వాళ్లకేం ఇవ్వకండి మీరు,
మీ వేలికి వాళ్లు ఉంగరం తొడిగేంత వరకూ?

**వాలెంటైన్ :** ఎవరయ్యా మీరు, అర్ధరాత్రి గాయకులు?
ఎలుకలు పట్టేవాళ్లలా ఏమిటా కేకలు!
డెవిల్ నీ తంబూరాను తగలేస్తుంది!
ఆనక నేను ఈ వెధవ గాయకుడి తోలు వలుస్తాను!

**మెఫిస్టోఫిలిస్ :** తంబూరా మూగవోయింది, తగ్గవోయి గడుగ్గాయి!

**వాలెంటైన్ :** చేతనైతే కాచుకోండి! శవాలుగా తేలేముందు!

**మెఫిస్టోఫిలిస్ :** డాక్టర్! వెనక్కి తగ్గకు! త్వరగా,
నా వేపు రా, నేను చేసినట్లు చేయి!
నీ చేతిలో కర్ర చాలు, ఎదుర్కో,
నేనాతడి దెబ్బకు కాచుకుంటానిటువేపు!

**వాలెంటైన్ :** కాచుకో నా దెబ్బ!

**మెఫిస్టోఫిలిస్ :** ఆనందంగా!

**వాలెంటైన్ :** ఇది!

**మెఫిస్టోఫిలిస్ :** ఏది?

**వాలెంటైన్ :** వీడెవడో ఖచ్చితంగా డెవిలే! ఏమిటీ మాయ!
దెబ్బకు దెబ్బ తీస్తున్నాడు, చచ్చుబడింది నా చేయి!

**మెఫిస్టాఫిలిస్ :** (ఫాస్ట్‌తో) కొట్టు చావుదెబ్బ!

**వాలెంటైన్ :** (కూలబడుతూ) అయ్యో దేవుడా!

**మెఫిస్టాఫిలిస్ :** వీడి పని అయిపోయింది.
పద, ఇక్కడ్నుంచి త్వరగా! పోదాం అటు దిక్కు!
మొదలౌతుందిప్పుడు పెద్ద గొడవ, అలజడి!
పోలీసుల్తో మనకిబ్బంది ఉండదు గాని
ప్రధాన న్యాయాధిపతితోనే వస్తుంది చిక్కు!
(ఫాస్ట్‌తో కలిసి నిష్క్రమిస్తాడు)

**మార్తా :** (తన కిటికీ వద్ద) బయటకు రా! బయటకు రా!

**గ్రెఛెన్ :** (తన కిటికీ వద్ద) దీపం తీసుకురా, దయచేసి!

**మార్తా :** ఏవో కేకలు వినబడ్డాయి, ఏదో పోట్లాట జరిగినట్లుంది!

**గుంపు :** ఎవరో చచ్చి పడినట్లున్నాడు. అదుగో అక్కడ!

**మార్తా :** (బయటకు వస్తూ) హంతకులెటు పారిపోయారు?

**గ్రెఛెన్ :** (బయటకి వస్తూ) ఎవరిక్కడ పడి ఉన్నది?

**గుంపు :** నీ తల్లి కుమారుడు– నీ సోదరుడు!

**గ్రెఛెన్ :** దేవుడా! ఎంత ఘోరం జరిగింది!

**వాలెంటైన్ :** నేనెలాగూ చనిపోతున్నాను! అది తథ్యం!
చనిపోయే ముందు చెప్పక తప్పదు ఒక విషయం.
ఆడవాళ్లారా! ఎందుకా ఏడ్పులు, పెడబొబ్బలు?
నా చివరి మాటలను సరిగా ఆలకించండి మీరు!
(అందరూ అతని చుట్టూ మూగుతారు)
'మెగ్' విను! నీవింకా చిన్నదానివే!
ఈ ప్రపంచం సంగతి తెలీని దానివే!
కాని, నీవేం తప్పులు చేస్తున్నావో తెలుసా?
ఒక్క విషయం చెప్పనీయ్ నన్ను,
ఇప్పుడెలాగూ వళ్లమ్ముకున్నావు, అదన్నా సరిగా చెయ్!

**గ్రెఛెన్ :** సోదరుడా! దేవుడా! ఇవేం మాటలు?

**వాలెంటైన్** : దేవుణ్ణెందుకు లాగుతావు దీంట్లోకి?
అయ్యిందేదో అయ్యింది. అది నాకు దుఃఖం కలిగిస్తున్నది.
ఏదెలా జరగాలో అలానే జరగనీ!
ఒక వ్యక్తితో రహస్య ప్రణయం నెరపావు
అతడు మొదలెట్టింది పదిమందితో సాగుతుంది
డజను మంది వరకు కట్టాక, ఊరు ఊరంతా నీపైకెక్కుతుంది.

అప్రతిష్ఠ గురించి చెప్పనీ నన్ను!
రహస్యపు అవమానం ప్రపంచంలోకి అడుగుపెడ్తుంది
పేరు లేకుండా చీకటిలో పుడ్తుంది
రాత్రి ముసుగును ముఖానికి తగిలించుకుంటుంది.
దానిని నీవు చంపేయాలని చాలా ప్రయత్నిస్తావు.
కాని అది పెరిగి, పెరిగి రాత్రిని దాటి
పగటి వెలుగులోకి ప్రవేశిస్తుంది.
పెద్దదే కాని చూడ్డానికి అసహ్యంగా ఉంటుంది.
మొహం చండాలంగా ఉన్న కొద్దీ
చూడాలని, చూపించాలనీ అనిపిస్తుంది.

నాకు తెలుసు ఏదోరోజు వస్తుంది,
నీతిమంతులయిన వాళ్లు నిన్ను అసహ్యించుకుంటారు.
లంజా! అని అంటూ ప్లేగు రోగం తగిలిన శవాన్ని
చూసినట్లు నిన్ను చూసి తిరస్కరిస్తారు.
వాళ్ల చూపులకు నీ హృదయం ఈకలా విలవిలలాడ్తుంది.
అందరి కళ్లూ అదే కథను చెబుతాయి.
అప్పుడు నీ దగ్గర ఈ నగలూ, స్వర్ణహారాలూ ఉండవు.
చర్చిలో పూజామందిరం దగ్గర నిలబడలేవు.
నృత్యం చేయలేవు, నర్తనశాలలో అడుగిడలేవు.
ఏదో ఒక చీకటిమూల, బిచ్చగాళ్లూ,
రోగిష్ఠి వాళ్ల మధ్య ముక్కుతూ, మూలుగుతూ ఏడుస్తుంటావు.
దేవుడు నిన్ను క్షమిస్తే క్షమించును గాక!
కానీ ఈ భూమి మీద బతికున్నన్ని నాళ్లూ నీకీ శాపం తప్పదు.

**మార్తా** : నీ ఆత్మను దేవుని కరుణపై మళ్లించుకో!
దైవ నిందతో మరణిస్తావా ఏమిటి?

**వాలెంటైన్** : వంచకురాలా, దుష్టపీనుగా, మంత్రగత్తెవి నీవు
నీ గొంతు పిసికి ప్రాణం తీయగలను
ఈ ఒక్కపనీ నా పాపాల్ని కడిగివేయగలదు.

**గ్రెఛెన్** : సోదరా- నేనెలా భరించగలను ఈ మాటల్ని- ఈ...

**వాలెంటైన్** : నేను చెబుతున్నాను, కన్నీళ్లిప్పుడు గతాన్ని సరిదిద్దలేవు.
ఏనాడైతే నీవూ, నీ గౌరవం విడిపోయారో
ఆనాడే నా హృదయంలో కత్తితో పొడిచావు.
ఇప్పుడు నేను నా సృష్టికర్తలో లీనమౌతాను.
ఒక సైనికుడిగా అందుకు నేను గర్విస్తున్నాను.
**(చనిపోతాడు)**

# 23. ప్రార్థనామందిరం
## (A Cathedral)

**(చనిపోయినవారికి సంప్రదాయ విధి నిర్వహిస్తున్నారు. గ్రెఛెన్ ఆ సమూహంలో ఉంటుంది. ఆమె వెనుక ఓ దుష్టశక్తి)**

**దుష్టాత్మ** : గ్రెఛెన్! పరిస్థితులు చూడు ఎలా తారుమారైనాయో!
అమాయక బాలికగా ఉన్న ఆ రోజుల్లో
పూజామందిరాన్ని సమీపిస్తూ
ప్రార్థనా పుస్తకపు నలిగిన పేజీలు తిప్పుతూ
ఎంత మంద్రంగా ప్రార్థించేదానివి!
దానిలో నీ హృదయం లేకపోయినా
దేవుడూ, చిన్నపిల్లల ఆటలా సాగేది కదా!
గ్రెఛెన్!
ఏమిటాలోచిస్తున్నావు?
ఏ తప్పు నీ హృదయంపై ఇంత భారాన్ని మోపుతున్నది?
నీవిప్పుడు నీ తల్లి ఆత్మశాంతికై ప్రార్థిస్తున్నావా!
నీ తప్పిదం వలన దీర్ఘ నిద్రలో మునిగిన ఆమెకై విలపిస్తున్నావా?
నీ గది తలుపు వద్ద ఉన్న రక్తపు మరకలెవరివి?
నీ హృదయం అడుగున ఏదో నిషిద్ధ విషయం
ఉబుకుతూ ఉరకలెత్తుతున్నది కాదా!
నీవు భయపడేది, భయపెడ్తున్నదీ అదేకదా!

**గ్రెఛెన్** : దేవా! దేవా!
నా అంతరాత్మకు వ్యతిరేకంగా
నన్ను కుదిపి వేస్తున్న ఈ ఆలోచనలు నన్ను వీడితే
ఎంత బాగుండునో కదా!

**బృందం** : Dies irae, Dies illa
Sovent sacclum in favilla. (సంగీతం)

**దుష్టాత్మ** : దేవుని ఆగ్రహం నీపై ఉన్నది
ఆఖరి బాకాధ్వని పెట్రేగుతున్నది.

సమాధుల తలుపులు తెరుచుకుంటున్నాయి
బూడిదలో కలిసిన నీ హృదయం భయంలో పునరుజ్జీవనమైనది.
అంతులేని వేదనా జ్వాలలకు బాధల గాలులు తోడైనవి.

**గ్రెఛెన్** : నన్నిక్కడ నుంచి వెళ్లిపోనీ!
ఆ సంగీతం నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది.
నాకూపిరాడడం లేదు.
ఆ గానం నా హృదయాన్ని లోతుల్లో కరిగించి వేస్తున్నది!

**బృందం** : Judexc ergo cum sedebit
Quidquid latet adparesait
Nil inultum remanebit.

**గ్రెఛెన్** : నాకూపిరి అందడం లేదు.
ఈ మహాస్తంభాలు నన్ను నలిపి వేస్తున్నవి.
గాలి, వెలుతురు, పైకప్పు నన్ను అణచివేస్తున్నవి.
నాకు గాలి ఆడడం లేదు; అయ్యో!

**దుష్టాత్మ** : దాక్కో! నీవు దాక్కున్నా నీ తప్పు, నేరం దాగవులే
గాలి, వెలుతురు కావాలా! అనుభవించక తప్పదులే!

**బృందం** : quid sum riser tune dicturus?
quem patronum rogaturus,
cum vix Justus sit securus.

**దుష్టాత్మ** : పవిత్రాత్మలు తమ వదనాలను నీవైపు నుండి మరల్చుకున్నవి,
నిన్ను స్పృశించ వెనకాడుచున్నవి; అవి నిన్నంటుకోవు; నీకు తప్పదు శిక్ష!

**బృందం** : Quid sum miser tune dicturus?

**గ్రెఛెన్** : స్నేహితులారా! నాకు మూర్ఛ వస్తున్నది.
**(మూర్ఛపోతుంది)**

# 24. వాల్‌పర్గిస్ రాత్రి
## (Walpurgis Night)

**(హార్జ్ పర్వత ప్రాంతం. షియర్కె, ఎలెండ్‌ల దగ్గర)**
**(ఫాస్ట్, మెఫిస్టాఫిలిస్ ప్రవేశం)**

**మెఫిస్టాఫిలిస్ :** చీపురుకట్ట అక్కర్లేదా నీకు, శిఖరానికి చేరడానికి,
నాకైతే ఈ మేకపోతు స్వారీ చేయడానికున్నది.
ఈ కుంటి నడకతో మనం శిఖరాగ్ర సభ చేరడం ఎన్నడవుతున్నది?

**ఫాస్ట్ :** నాకు రెండు కాళ్లున్నవి, దొడ్డు కర్రున్నది తోడు,
అవి చాలు నాకు ఆకాశాన్నందుకునేందుకు;
ఇదేం పెద్ద దూరం కాదు, తగ్గించ పనిలేదు.
లోయల గజిబిజి గదుల్ని చూసి ఆనక
అధిరోహిద్దాం శిఖరాలను ఆయాసం లేకుండా!
జలపాతం చూడెలా నిట్టనిలువుగా పడుతోందో,
ఇటువంటి దృశ్యాలను చూడ్డానికే ఈ నడక కావాలి మనకు.
'బిర్చ్' వృక్షాలనిప్పటికే వసంత ఋతువు ఆవహించింది.
'పైన్' వృక్షాలు సైతం చిగుర్లు తొడుగుతున్నాయి.
మన కాళ్లకు సత్తువ రావడంలో ఆశ్చర్యమేముంది!

**మెఫిస్టాఫిలిస్ :** నిజం చెప్పాలంటే, నాకెటువంటి భావనా కలగడం లేదు.
నా కాళ్లు శీతలంగా ఘనిభవించినాయి;
ఈ దారినిండా మంచు నిండితే సంతోషం నాకు.
చూడు, ఆ గూని వంపు చంద్రోదయం!
లేత ఎరుపు వెలవెలాపోతున్న దృశ్యం.
వేసే ప్రతి అడుగూ ఏ చెట్టుకో రాతికో తగులుతున్నది.
లాభం లేదు! నేను విల్-ఒ-ద-విస్ప్‌ను పిలుస్తాను.
'అదుగో చూడు అక్కడ నరకపు నిప్పురవ్వ మెరుస్తున్నది.
మిత్రుడా! ఇటురా! నీశక్తినిక్కడ వృథా చేయక, మాకు దారి చూపు ఇక్కడ!

**విల్-ఒ-ద-విస్ప్:** నా ప్రభూ! నీ మీది గౌరవంతో నా పని నేను చేస్తాను.
కాని మా దేశదిమ్మరితనం పుట్టుకతో వచ్చింది.
అడ్డదిడ్డంగా నడవడం మా నైజమయ్యింది.

**మెఫిస్టోఫిలిస్ :** నాకర్థమయ్యింది నీవు మనిషిని అనుకరిస్తున్నావని.
కాని, ఇప్పుడు సూటిగా నడువు, లేకుంటే
ఒక్క ఊదు ఊదుతాను, నీ ఊపిరి జ్వాల నార్పేస్తాను.

**విల్-ఒ-ద-విస్ప్:** ఇక్కడ నీవే యజమానివి, అది నాకు తెలుసు.
నీవు చెప్పినట్లు చేయాలంటున్నది నాలోని మనసు
అయ్యా- ఈ కొండంతా ఈరోజు మంత్రతంత్రాలమయం.
విల్-ఒ-ద-విస్ప్ చూపే దారి గురించి మీకెందుకీ తాపత్రయం?
(ఫాస్ట్, మెఫిస్టోఫిలిస్, విల్-ఒ-ద-విస్ప్ గానం చేస్తారు)

మాయాలోకమా, స్వప్నదేశమా!
మేము అడుగిడినాము నీ నగరంలోకి,
'విస్ప్', మమ్మల్ని సరైన దారిలో నడుపుము
ఈ విశాల ప్రదేశాల నుంచి అక్కడికి తీసుకొని పొమ్ము.

చెట్లు తరవాత చెట్లు ఒకదాని వెనుక ఒకటి
మనల్ని దాటి పోతున్నాయి, మనం దాటి పోతున్నాం
ఆ కొండ శిఖరాల ఆధిక్యతను స్పృశించు
వాయు గర్జనలలో శిలల సంగీతాన్ని వినవచ్చు
వాటి పొడుగాటి నాసికల గురకను గమనించు.

కొండల గుండా, పచ్చిక మైదానాల గుండా
ఏర్లూ, కాలువలూ ఎగసి ప్రవహిస్తున్నాయి.
గుసగుసల నీటిలో సరిగమల సప్తస్వరాలను వినిపిస్తున్నాయి.
గతించిన రోజుల అనంత ప్రేమలోని
అపాత మాధుర్యపు ఫిర్యాదును గానం చేస్తున్నాయా?
ఆ అద్భుతమైన ఆశ, అపురూపమైన నిట్టూర్పు
పాత కథలా ఎక్కడో ప్రతిధ్వని పలికే జవాబు.

గుడ్లగూబా! నిశాచరీ! నీకు వినబడ్తున్నాయా అవి?
పక్షులు, పికిలిపిట్టలుండే ప్రదేశమది
మనం అటు వెళ్లగానే మేలుకుంటాయి.
పొడుగు కాళ్ల సాలమాండర్‌లు ఈ పొదల్లో తిరుగుతుంటాయి.
మెలికలు తిరిగిన వేర్లు మన కాళ్లకు సంకెళ్లు వేస్తాయి.
ఇసుక నుంచి, కొండల్లో బొరియల నుంచి

మెలికల పాములు బుసకొడ్తూ మనల్ని భయపెడ్తాయి.
చెట్ల ముడులు, మొలకలు, పొదల్లో పొడుగ్గా, బలంగా
కండపట్టి అరచేతి మందాన పెరుగుతాయి.
వాటి చిక్కుముడులలో మనల్ని బంధిస్తాయి.
నాచుపై, ఇసుకపై రంగురంగుల ఎలుకలు
గంతులేస్తూ కంపరం కలిగిస్తాయి.
లక్షలాది మిణుగురు పురుగులు మనల్ని ఆకర్షించి
మెరిసే దయ్యాల్లా మనల్ని గమ్యం తెలీని గోతుల్లోకి నెట్టేస్తాయి.

మనం వస్తున్నామా? పోతున్నామా?
మనం నిలబడి ఉన్నామా లేదా? తెలుసుకునే వీలే లేదు.
అన్నీ సుడులు తిరుగుతున్నాయి, ప్రవహిస్తున్నాయి!
వృక్షాలూ, కొండలు రూపులు స్థానాలూ మార్చుకుంటున్నాయి.
కార్చిచ్చులు చెలరేగి, విలయాన్ని సృష్టిస్తున్నాయి.

**మెఫిస్టొఫిలిస్ :** నన్ను గట్టిగా పట్టుకో! ఈ గట్టునుంచి చూడవచ్చు అద్భుత దృశ్యాలు.
చూడు! ఇది నా ప్రభువు మామ్మన్ రాత్రి;
పర్వతాల్లోని స్వర్ణం ప్రకాశిస్తుంది సర్వవైభవంగా ఈ రాత్రి!

**ఫాస్ట్ :** ఆ బోలుకొండల్లో వింతగా ప్రకాశిస్తున్నది స్వర్ణమా,
సంధ్యా సమయపు కాంతులు మసకగా వెలుగుతున్నవి!
కొండ చరియల్లోకి ప్రవహిస్తూ అగాధాలను నింపుతున్నవి
మబ్బులు కదిలి, నీటి తుంపరలు పొగగా పైకెగసి
ఆ ముసురు పొరలగుండా కాంతి విరజిమ్ముతున్నది
నది, పాయలా ప్రవహిస్తూ చటుక్కున వరద నదిలా పొంగుతున్నది.
అదుగో అటు ఆ లోయలో అనేక కాలువలుగా చీలి
అవన్నీ కలిసి ఏకధాటిగా ప్రవహిస్తున్నవి.
అన్ని వంపుల సొంపులతో తన లావణ్యాన్ని ప్రకటిస్తున్నది ఆ నది.
కాని, ఇక్కడ, చెల్లాచెదురు చేయబడిన బంగారు ఇసుక రేణువుల్లా
అగ్నికీలలు, నిప్పురవ్వలు నింగిపైకి ఎగబాకుతున్నాయి.
చూడు, చూడు, ఈ కొండ వదనం అన్ని పరిమితుల్లోనూ
జ్వలిస్తూ ప్రబలమైన మంటల్ని వెదజల్లుతున్నది.

**మెఫిస్టొఫిలిస్ :** మామ్మన్ తన భవనాన్ని దీపాలతో అలంకరించినాడు.
అద్భుత దృశ్యమిది, ఒప్పుకోక తప్పనిది.

అదృష్టవంతుడివి నీవు, కనులారా వీక్షించావు.
హే! అరుగో వస్తున్నారు మనకు కొందరతిథులు.

**ఫాస్ట్** : ఈ ఝంఝా మారుతమెంత తీవ్రంగా ఉన్నది?
నా శిరస్సును అతివేగంగా ఢీ కొడ్తున్నది!

**మెఫిస్టోఫిలిస్ :** అది తీవ్రంగానే ఉంటుంది. అజాగ్రత్తగా ఉంటే కొండమీంచి ఈడ్చికొడ్తుంది.
జాగ్రత్త నాయనా! రాళ్ల అంచుల్ని పట్టుకో, లేకుంటే రాలిపోతావు క్షణంలో!
రాత్రి చీకటి దట్టమవుతున్నది మంచుతో!
అడవుల్లో చెలరేగుతున్న తుపాను ధ్వని విను!
గుడ్లగూబలు భయంతో కకావికలై పోతున్నవి.
నిత్యహరిత ప్రదేశాలు స్తంభాలు పగులుతున్నవి
చీలుతున్న శాఖలు మూలుగుతూ శబ్దిస్తున్నవి.
ప్రతి దిక్కునా వృక్షకాండాలు ప్రతిధ్వనిస్తున్నవి.
వేళ్లు కదిలి మొదళ్లు వెడల్పవుతున్నవి!
ఆ భయంకర గజిబిజిలో సర్వతరూలతలు క్షోభిస్తున్నవి.
అవి అలా విరుచుకుపడి లోయల్ని ఊపిరాడకుండా కమ్మేస్తున్నవి.
కూలిన వృక్షశాఖల మధ్యగా గాలులు వీస్తు వింత శబ్దాలనిస్తున్నవి.
నింగిలోని స్వరాలను వింటున్నావా? దూరంగా, దగ్గరగా!
అవిగో, యావత్ పర్వతం మంత్రగత్తెల గానంతో
దద్దరిల్లి కంపించి అన్ని దిక్కులనూ కమ్ముతున్నది!

**మంత్రగత్తెలు:** బ్రాకెన్ మంత్రగత్తె లెక్కడున్నారో చెప్పండి!
దుబ్బురంగు పసుపు, ఆకుపచ్చ జొన్నకంకి!
మళ్లీ కలుసుకున్నాం, మంచిగా పైకి దూసుకుపోదాం
కేపర్‌కైల్ జీ ప్రభువు అధ్యక్షుడని విన్నాం!
వెళదాం రండి! ప్రతి అడుగు నింపు ప్రయాణపు సొంపు
మేకల కంపు, మంత్రగత్తెల కింపు.

**ఒక స్వరం :** చూడు చూడు, అదిగో బాబొ అమ్మతల్లి!
పంది నెక్కి వస్తోంది అనాది దా తల్లి!

**బృందం** : ఎక్కడ గౌరవమివ్వాలో అక్కడ గౌరవమివ్వాలి!
అమ్మతల్లీ! నువ్వు నడువు ముందు, నీ వెనక మేము!
అపురూప తల్లీ, అతిరూప సూకరం!
మంత్రగత్తెల గుంపంతా వారివెనక జాగరం!

**ఒక గొంతు :** ఎటునుంచి మీరాక?

**మరో గొంతు:** వస్తూవస్తూ దారిలో ఉబుసుపోక చూసాను ఉల్లూకం గూట్లోకి
ఆ తల్లి గుడ్లగూబకి, అంతులేని ఆశ్చర్యం ఈ పూటకి.

**ఇంకో గొంతు:** నీవు నరకంలో తగలడ! ఎందుకు పోతావలా దడదడా!

**ఎవరిదో గొంతు :** ఎట్టా గీరిందో చూడు, దీని కసి,
ఎముక కనిపిస్తోందే రాక్షసీ!

**మంత్రగత్తెలు: (బృందగానం)** దారి పొడుగైంది, దారి విశాలమైంది
డెవిల్ వెనకాల దయ్యాల గుంపు నడుస్తోంది.
చీపురుకట్టలు గీకుతున్నాయి, పంగల కొయ్యలు గీరుతున్నాయి.
తల్లి తల పగిలిపోతోంది, బిడ్డ ఊపిరాడక ఏడుస్తోంది.

**మంత్రగాళ్లు: (బృందగానం)** ఆడవాళ్ల తోకల్లా వెనక మేం వస్తున్నాం
వాళ్ల వెనక నత్తల్లా నెమ్మదిగా నడుస్తున్నాం
సాతాను శయ్యకెళ్లే సాహసపు దారిలో
మగాడికి మైలు ముందుంటుంది మహిళ ఏనాడూ!

**మిగతా సగం మంత్రగాళ్లు:**
అయినా మేమే గెలుస్తాం పరుగుపందెం
మహిళ ప్రతి మైలులో వేయి అడుగులుంటాయి
ఆమె ఎంత వేగంగా పరుగెత్తి పరుగెత్తినా
మగవాడు ఒక్క గంతుతో వెళ్తాడు ముందు ముందుకు!

**ఒక స్వరం : (పైనుంచి)** ఆ సరస్సునుంచి రా! మమ్మల్ని అనుసరించు, సరా!

**మరో స్వరం: (క్రిందనుంచి)** రావాలనే ఉంది మాకు! కాని, ఎలా రావాలో తెలీడంలేదు!
ఈ నీళ్లు మమ్మల్ని శుభ్రంగా కడిగినా,
ఇక్కడే ఇలా అంటుకుపోయి ఉన్నాం శాశ్వతంగా!

**ఇద్దరూ : (బృందగానం)** గాలి నిశ్శబ్దంగా ఉన్నది, తారలు దాక్కుంటున్నాయి.
మేం వస్తుంటే చంద్రుడు మొహాన్ని దాచుకుంటున్నాడు.
నరకాగ్ని నుంచి వేలాది నిప్పురవ్వలు ఎగిసిపడ్తున్నాయి.
మంత్రశబ్దాలు పెద్ద ధ్వనితో అటుపక్కగా పోతుంటే!

**ఒకస్వరం : (క్రింది నుంచి)** నాకోసం ఆగు! లేకుంటే వెనకబడిపోతాను!

**ఇంకోస్వరం: (పైనుంచి)** ఈ రాళ్లసందుల్లోంచి పిలుస్తున్నదెవరు?

**స్వరం :** **(క్రిందినుంచి)** నన్ను నీవెంట తీసుకువెళ్లు, నన్ను నీవెంట తీసుకువెళ్లు
ఆగండిరోయ్! మూడు వందలేళ్లనుంచీ ఇలాగే ఎక్కుతున్నాను
ఇంతవరకు శిఖరాగ్రాన్ని చేరుకోలేకపోయాను,
నాలాంటి వాళ్లతో కలిసి అక్కడ గడపాలనే వస్తున్నాను!

**ఇద్దరూ :** **(బృందగానం)** చీపురుకట్టపై ఎగురు, పంగలకొయ్యపై ఎగురు!
మేకపై ఎగిరినా ఫర్లేదు, నేలవిడిచి ఎగురు!
లేకుంటే నీ జన్మలో ఎప్పటికీ ఎగరలేవు!

**సగం మంత్రగత్తె :** **(క్రిందినుంచి)** వేగంగా నడవలేను, ముందుకూ వెళ్లలేను
అందరికంటే నేనే ఆఖరిలో ఉన్నాను
ఇంటి దగ్గర ఉండలేను, ఇక్కడా ఎగరలేను.
అయినా 'వాల్‌పర్గిస్' రాత్రిపండగ నందుకోలేను.

**మంత్రగత్తెల బృందగానం :**
దయ్యాల పండగ మనకు దివ్యతేజాన్నిస్తుంది,
నీళ్లతొట్టి చాలు నింగికెగరడానికి,
ముతక గుడ్డచాలు తెరచాప కట్టడానికి,
ఈ రాత్రికెగరకపోతే, ఇక ఎప్పుడూ ఎగరలేవు.

**అందరూ :** **(బృందగానం)** శిఖరం చుట్టూరా వలయాలుగా ఎగిరింది చాలు!
ఇక నేలమీద చతికిలబడదాం అదే మనకు మేలు!
ఈ బంజరు నేలంతా క్రిక్కిరిసిపోయేంత జనాలు!
మంత్రగాళ్ల, మంత్రగత్తెల మాయామంత్ర ప్రభంజనాలు
**(అందరూ నేలపై కూర్చుంటారు)**

**మెఫిస్టొఫిలిస్ :** తోసుకుంటారు, తొక్కుకుంటారు, పరుగెడ్తారు, పడిపోతారు,
దడికడ్తారు, సుడి తిరుగుతారు, బుసకొడ్తారు, నసపెడ్తారు.
మండుతారు, పొగజిమ్ముతారు, కాలతారు, కంపుకొడ్తారు!
ఇదే నిజమైన మాయల ప్రపంచం, కాదంటావా నేస్తం!
కలిసి నడిస్తే మంచిది, లేకుంటే తొడ తొక్కిడిలో విడిపోతాం!
ఎక్కడున్నావు నీవింతకీ మిత్రమా!

**ఫాస్ట్ :** **(కాస్త దూరంగా)** ఇక్కడే!

**మెఫిస్టొఫిలిస్ :** అంతదూరంలో ఉండి ఇక్కడే అంటున్నావా?
యజమాని హక్కుల్ని వినియోగించుకుంటాను! ఏయ్! తొలగండి దారి!
వొలాండ్ ప్రభువు వస్తున్నాడు, అడ్డు తొలగండి!
డాక్టర్! ఇప్పుడు నాతో కలిసి నడువు, త్వరగా త్వరగా!
ఒక్క గంతులో మనమీ గుంపును దాటి పోదాం
నాక్కూడా ఈ సంరంభమంతా పిచ్చిగా అనిపిస్తున్నది.
అదుగా ఆ కాంతిదీపం ఏదో ప్రత్యేక వెలుగునిస్తున్నది.
ఆ పొదలు ఎందుకో నా దృష్టినాకర్షించాయి.
వీళ్లను తప్పించుకొని పోదాం అటువేపు త్వరగా!

**ఫాస్ట్ :** భలే గమ్మత్తైన విరోధభాసాత్మవు నీవు!
వాల్ పర్గిస్– దయ్యాలరాత్రి ఏవో ఒంటరి గుహలెదుకుతావు?

**మెఫిస్టొఫిలిస్ :** అక్కడ మండుతున్న నెగడును చూడు!
దానిచుట్టూరా గంతులేస్తున్న గుంపును చేరు!
మంచి జనం మధ్యలో మనసు ఒంటరి కాలేదు!

**ఫాస్ట్ :** శిఖరాగ్రాన ఉండటమే నా లక్ష్యం
అదుగో, సుడులు తిరిగే పొగ, పాతాళం నుంచి పైకి లేస్తున్న విధం!
సాతాను సింహాసనం చుట్టూరా గుమికూడినారు జనం.
నాకు తెలియని విషయాన్ని తెలుసుకుంటా నీక్షణం!

**మెఫిస్టొఫిలిస్ :** కొత్త మార్మిక విషయాలు తెలుసుకో నేస్తం!
ఉన్మత్తలోకాన్ని దాని దారిన దాన్ని పోనివ్వు!
ఇక్కడ హాయిగా ఉందిగా, ఉండిపోవచ్చుగా!
ఈ విశాల ప్రపంచం విభజిస్తే చిన్ని ప్రపంచాలనడం వాస్తవం!
చూడు చూడు ఆ చిన్ని మంత్రగత్తెలు, నగ్నంగా తిరుగుతున్నారు;
ముసలి మంత్రగత్తెలేమో వస్త్రాలు ధరించినారు.
నన్ను నిరాశపరచకు, మన శక్తికొద్దీ ప్రయత్నిద్దాం!
పెద్ద గొడవలేం కావు; గొప్ప దృశ్యాలకు కొరతలేదు.
విను, విను, ఏదో గమ్మత్తైన సంగీతం!
ఏవో మూల్గులా వున్నా వినదగ్గ విషాదగీతం.
రా, రా! నాతోరా! ఏం చేయాలో చూద్దాం!
మనం లోపలికి వెళ్దాం! చేస్తాను నిన్ను పరిచయం!

నాకు నీవు చూపించాల్సిన కృతజ్ఞతను ఇమ్మడి ముమ్మడి చేస్తాను.
మిత్రుడా! ఎలా ఉంది ఈ ప్రదేశం! ఇదేమంత చిన్నది కాదు!
ఇది ఎక్కడ అంతమవుతుందో తెలిసే వీలులేదు.
వరుసలో జ్వలిస్తున్న అగ్నుల్ని పరికించు!
ఇక్కడ నృత్యం చేయవచ్చు, మాట్లాడు, తాగు, వాగు,
ప్రేమించు, విందులు వండు, వడ్డించు,
చెప్పుమరి, ఇంతకంటే గొప్ప అవకాశం ఇంకెక్కడుంది?

**ఫాస్ట్** : దీంట్లో ప్రవేశించేందుకు నీ పాత్ర ఏమిటి?
ఓ డెవిల్! ఓ ఇంద్రజాలికుడా! మంత్రగాడా!

**మెఫిస్టొఫిలిస్ :** మామూలుగా సంచరిస్తాను మారువేషంలో
కాని ఇటువంటి పండుగల్లో వేస్తాను విలాసవంతమైన దుస్తులు.
మేజోళ్లకు కట్టే గార్టర్ గురించి ఇబ్బందేమీలేదు.
నా విడిపాదం చాలు నన్ను ప్రత్యేకంగా చూపించడానికి,
అదుగో ఆ లావుపాటి నత్తను చూడు మన దారిలో,
దాని మూతిమీద ఉన్నాయి సున్నితమైన నాడులు.
నేనెవరో దానికి ఈసరికే తెలిసిపోయింది,
ఇటువంటప్పుడు మారువేషం వృథా అనిపిస్తున్నది!
నెగడు నుంచి నెగడుకు గెంతుతూ పోదాం!
(ఆరిపోతున్న అంగారాల మధ్య ఉన్న గుంపులోకి వెళ్తారు)
ఓ అనాది పెద్దలారా! ఇక్కడేం చేస్తున్నారు?
ఈ చివర కూర్చున్నారు, నింపాదిగా, నిమ్మళంగా
గడబిడ చేసే యువకుల మధ్యకు వెళ్లదలుచుకోలేదా
అంతేలే, దుడుకు యవ్వనం ముందు ముసలితనం దిగదుడుపే!
ఒంటరిగా ఉంటే ఇంటిదగ్గర ఉన్నట్లే!

**ఒక సేనాని :** దేశాన్నెవడు నమ్ముతున్నాడిప్పుడు?
ఎన్ని గొప్ప పనులు చేసినా ఏం ప్రయోజనం?
స్త్రీలైనా, ప్రజల పొగడ్తలైనా
యువకుల్ని చేర్తాయి, ముసలివాళ్లను వదిలేస్తాయి.

**ఒక బోధకుడు:** పాత రోజులెటుపోయాయో! ఏమో!
కొత్త ప్రపంచంలో ఏదీ సరిగా లేదు!

నీకు తెలుసు, అది స్వర్ణయుగం!
నిన్ను, నన్ను గౌరవించిన పరిశుద్ధ కాలం!

**ఒక నడమంత్రపు సిరివాడు–**
అప్పుడూ మనకేం పెద్దలోటు రాలేదు.
నీతిగలవాళ్లు ఏమన్నా, మనం సంపాదించుకున్నాం!
దానితో కాస్త స్థిరపడదామనుకునే లోపల
అంతా తల్లకిందులయ్యింది, ఎందుకో తెలీదు?

**ఒక రచయిత:** పాఠకులేరీ! వచనమైనా, కవిత్వమైనా
కాస్త మంచి పుస్తకాన్నైనా చదివేవారేరి?
ఈ కుర్రవాళ్లు దుడుకుతనం వల్ల
ఆత్మవంచన వల్ల, అధఃపాతాళానికి పోతున్నారు.

**మెఫిస్టోఫిలిస్ : (అకస్మాత్తుగా వృద్ధుడిలా కనిపిస్తూ)–**
ఈ దేశం ఆఖరి ఘడియలలో ఉన్నట్లున్నది.
ఇదే నా చివరి ప్రయాణం కావచ్చును.
నాలోని జీవరసం ఇంకిపోయినది,
దానర్థం ఈ ప్రపంచం అంతిమ క్షణాల్లో ఉన్నది.

**సంచార మంత్రగత్తె :**
పెద్దల్లారా! ఒక్కక్షణం ఆగండి!
ఈ అవకాశాన్ని వదులుకోకండి!
నా దగ్గర అనేక వస్తువులున్నాయి.
ఇంతకు ముందు మీరెన్నడూ చూడనివి.
నా దగ్గరున్నవన్నీ ప్రత్యేకమైనవి
ప్రతిదీ ఏదో ఒకప్పుడు
ఈ ప్రపంచంలో దేన్నో ఒకదానికీ
మానవుడికీ కీడు చేసినవే!
వీటిలో రక్తం చిందించని బాకు లేదు,
విషాన్ని జిమ్మని వింత కలశమూ లేదు,
ఇవి కలిగించని కలవరాలూ లేవు.
ఈ నగలూ, ఆభరణాలూ చూడండి,
ఏ అందమైన కన్యా, వీటికి లొంగకుండా ఉండింది లేదు.
ఏ కత్తీ వెనకపోటు పొడవనిది కాదు.

**మెఫిస్టోఫిలిస్ :** సోదరీ! కాలం నిన్ను దాటి ముందుకు పోయింది.
అయ్యిందేదో అయ్యింది, చెప్పిందేదో చెప్పావు!
కొత్త వస్తువుల్ని అమ్మితే కొంత ఉపయోగం,
పాత మందుల్తో తగ్గదు ఏ కొత్త రోగం!

**ఫాస్ట్ :** ఈరోజు నన్ను నేనే మరచిపోయాను.
ఇదేదో వింతైన సంతలాగున్నది.

**మెఫిస్టోఫిలిస్ :** గుంపు గుంపంతా కొండపై కెక్కుతున్నది.
ఎవరో తోస్తున్నట్లు, ఇష్టం లేకుండా తోయబడ్తున్నట్లు.

**ఫాస్ట్ :** ఎవరా స్త్రీ?

**మెఫిస్టోఫిలిస్ :** ఎవరు? ఆమె... ఆమె లిలిత్!

**ఫాస్ట్ :** ఎవరు?

**మెఫిస్టోఫిలిస్ :** ఏడమ్ మొదటి భార్య ఆమె! నీమీదొట్టు!
ఆమె శిరోజాలలోనే ఉన్నది గొప్ప కనికట్టు!
నగలు, నవ్వులతో కాదు శిరోజాల వలతో పట్టు,
ఎటువంటి యువకుల్నైనా, తన అదుపాజ్ఞలలో పెట్టు!

**ఫాస్ట్ :** అక్కడ చూడు, ఇద్దరు మంత్రగత్తెలు
ఒకరు వయసుది, మరొకరు ముసలిది, మనముందే ఉన్నారు వాళ్లు.

**మెఫిస్టోఫిలిస్ :** ఈరోజు ఆగే ప్రశ్నేలేదు, పద! సరిగా పద!
మనం కూడా వాళ్లతో గంతులేద్దాం! సరిగమపద!

**ఫాస్ట్ :** **(వయసు మంత్రగత్తెతో నృత్యం చేస్తూ-)**
ఒకప్పుడు తీయని కలను కన్నాను.
నేను చూసానో అద్భుత ఏపిల్ వృక్షాన్ని
రెండు ఏపిల్ పళ్లు వేలాడుతున్నాయి దానికి
నేను చెట్టెక్కి కోసాను ఆ రెంటినీ,

**వయసు మంత్రగత్తె:**
మీ మగాళ్లంతా ఇంతే- ఏపిల్ పిచ్చి మీకు
ఈడెన్‌లో ఏడమ్ కూడా అంతే పిచ్చిగాడు
నా తోటలోనూ ఏపిల్స్ ఉన్నాయి.
నీకు ఆనందాన్నిచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి.

**మెఫిస్టోఫిలిస్ :** **(ముదుసలి స్త్రీతో)**
నాకూ కలవచ్చింది ఒకప్పుడు
రెండుగా చీలిన పంగలా చెట్టొకటి
అతి పెద్ద విశాల రంధ్రం
అటువంటిదయితేనే నాకిష్టం.

**ముదుసలి స్త్రీ:** స్వాగతం! గిట్ట పాదాల ప్రభువా!
నీలాంటి వీరులకే తగిన చోటిది అవునా కాదా!
పెద్ద పెద్ద రంధ్రాల గురించి లేదు చింతా దిగులు,
వాటిని మూసే మూతలతో మాకున్నది బుగులు.

**ఆర్సే-ఫాంటార్సే:** చెత్తాత్మల్లారా! ఆపండి మీ సణుగుడు!
మీకింకా అర్థం కావడం లేదా,
మనుషుల్లాగా మీరు బతికి లేరని!
నిలబడ్డం చేతకాదు నృత్యం చేస్తారా మీరు ?

**వయసు మంత్రగత్తె : (నాట్యం చేస్తూ)** మన నృత్యంతో ఇతడికేం పని?

**ఫాస్ట్ : (నృత్యం చేస్తూ)** అన్ని విందుల్లో ఉండే కంకాళమితడు
మిగతావాళ్లు నాట్యం చేస్తుంటే ఇతడు సమీక్షిస్తాడు;
మనం వేసే ప్రతి అడుగూ, లెక్కవేస్తాడు.
లయకు సరిగా ఉంటే సరే, ముందు పడిందా ద్వేషిస్తాడు,
వలయంలో సరిగా తిరుగు, కావాలంటే సలహా అడుగు.
వినయంగా అడిగావా అతడిని, విశేషించి పొగుడుతాడు.

**ఆర్సే-ఫాంటార్సే:** ఇది అరాజకం! ఇంకా ఉన్నావేమిటి నీవు?
ఈ ప్రపంచం దీప్తివంతమైంది! నీవు అదృశ్యమైపో!
పద్ధతీ పాడులేని ఆత్మలు, ఏం పట్టించుకోకుండా ఆటలు!
నా జీవితమంతా మూఢ నమ్మకాలను విసిరికొట్టాను అయినా,
టెగెల్ భవనం నిండా దయ్యాలు తిరుగుతూనే ఉన్నాయి.
నేను విధి విధానాలను ప్రకటిస్తూనే ఉన్నాను.

**వయసు మంత్రగత్తె:** అయితే తప్పుకో ఇక్కడ్నుంచి, విసిగించకు మరి ఎవ్వర్నీ!

**ఆర్సే-ఫాంటార్సే :** నేను మీ ఆత్మలకు ఆఖరిసారి చెబుతున్నా
ఈ తిక్క వ్యవహారం నేను సహించను

ఇది ఆత్మల రౌడీ వ్యవహారం, గూండాయిజం.

**(నాట్యం సాగుతూనే ఉంటుంది)**

ఈరోజు నా మాట చెల్లేట్లు లేదు.
అయినా ఇందులో బోల్డెంత రచనా వ్యవహారముంది.
దీన్నంతా ఓ ప్రయాణ వ్యాసంలా రాసి
దయ్యాల్ని రచయితల్ని నా అధీనుల్ని చేసుకుంటాను.

**మెఫిస్టొఫిలిస్ :** వెళ్లి ఏ చిత్తడి నేలలోనూ కూర్చుంటాడు.
ఆ రకంగా స్వస్థత చిక్కుతుంది. బలిసిన జలగలు
అతడి వీపు మీద రక్తాన్ని తాగుతాయి, ఆత్మ శాంతిస్తుంది.
అతడి దర్శనాలు, మెదడు దాదాపు అదృశ్యమైపోతాయి.

**(నాట్యాన్ని ఆపిన ఫాస్ట్‌తో)**

ఎందుకు ఆ అందాలరాశిని వెళ్లనిచ్చావు,
నీతో మనోహరంగా ఆడిపాడింది కదా!

**ఫాస్ట్ :** అహ్! ఆమె పాడినప్పుడు నీవు చూడలేదా?
ఓ ఎర్ర ఎలుక దూకిందామె నోటిలోంచీ!

**మెఫిస్టొఫిలిస్ :** అవునా! అయినా సంతోషించు!
అది మామూలు చుంచెలుక కానందుకు!
ఇది సరసాలాడే సమయం, అవునా!

**ఫాస్ట్ :** నేనప్పుడు చూసాను–

**మెఫిస్టొఫిలిస్ :** ఏమిటి?

**ఫాస్ట్ :** మెఫిస్టో! చూడు! దూరంగా ఆ బాలిక!
పాలిపోయి, విషాదంగా, అదుగో, నడుస్తోంది మెల్లగా!
ఏదో ఆమె కాళ్లను బంధించినట్లు
'గ్రెఛెన్' ఏమో అని అనిపిస్తున్నది చూడగా చూడగా!

**మెఫిస్టొఫిలిస్ :** దాన్నంతటితో వదిలేయ్! అది నిజం కాదు!
మృతాత్మలు కనిపించే ఈ చోట, అది మాయాతంత్రం!
దాన్ని వదిలించుకుని ఇటురా! దూరంగా ఉండు!
లేకుంటే దాని తీక్షణదృష్టి నిన్ను శిలగా మారుస్తుంది.
గార్గన్ మెడుసా చూపుల గురించి వినే వున్నావుగా నీవు.

**ఫాస్ట్** : అది నిజం! నిజం! ఆ కనులు తెరచి ఉన్నాయి!
ఏ ప్రేమ హస్తమూ వాటిని మూయలేదు.
గ్రెఛెన్ పరిమళదేహాన్ని నేననుభవించాను.
ఆమె స్తనద్వయం నన్నంటిపెట్టుకుని ఎంతో కాలం కాలేదు!

**మెఫిస్టొఫిలిస్ :** మూర్ఖుడా! అది ఇంద్రజాలికుని అద్భుతం,
ధరిస్తుంది ప్రతి ప్రేమికుడి ప్రియురాలి రూపం!

**ఫాస్ట్** : అయ్యో! ఎంతటి బాధ! ఎటువంటి ఉద్వేగం!
నా కళ్లను ఈ దృశ్యం నుంచి తొలగించలేకున్నానే
ఎంత వింతగా ఉన్నది? ఆమె అందమైన మెడ చుట్టూరా
ఎర్రని రక్తసిక్త సూత్రం, కత్తి అంచుకన్నా సన్నని దారం.

**మెఫిస్టొఫిలిస్ :** అవునవును. ఇప్పుడామె తన తలను తీసి
చంకలో పెట్టుకుని నడుస్తుంది, నీ కిష్టమైతే!
పెర్సియస్ తెలుసుగా, అతడే నరికింది ఆమె తలను.
ఈ భ్రాంతులతో నీవు సతమతమవుతున్నావు.
పద, ఈ చిన్ని గుట్టనెక్కి చూద్దాం!
వియన్నా పట్టణ పరిసర ప్రాంతంలా ఉందీ వనం!
ఎంత సరదా! నేనే మోసపోయానే!
వనం కాదిది ఓ పెద్ద కళామందిరం!
ఏమిటి? ఏం జరుగుతోందిక్కడ?

**సదా మీ సేవలో:**

నాటకం ప్రారంభం కానున్నది!
సప్తాంకాలలో ఆఖరిది.
మా నాటకాలన్నీ అలాగే ఉంటాయి.
ఒక ఔత్సాహికుడు వ్రాసిన కళారూపం!
కళాకారులు కూడా ఔత్సాహికులే!
నేనూ అంతే! క్షమించండి! తెరలాగాలి!

**మెఫిస్టొఫిలిస్ :** మంచి చోటనే కలిసారు ఔత్సాహికులంతా!
బ్లాక్‌బర్గ్ సరైన చోటు ఆత్మానందంగాళ్లకింకా!

# 25. వాల్‌పర్గిస్ రాత్రికల

## (A Walpurgis Night Dream)

### (ఒబెరాన్–టైటానియాల వివాహ స్వర్ణోత్సవం)
### The Golden Wedding of Oberon and Titania)

**వడ్రంగి పనివాడు** : ఈ రంగస్థల నిర్మాణానికే మయశిల్పి అక్కర్లేదు,
ఇక్కడ మేం చెయ్యాల్సిన పనేం లేదు!
ఒక పాతపడిన గుట్ట, నాలుగు లోయలు,
అదే కనిపించే దృశ్యమూ, అంతకుమించేం లేదు.

**ప్రతీహారి** : యాభై ఏళ్ల వివాహ వేడుక
స్వర్ణోత్సవ మనేది ప్రజల వాడుక.
వాళ్లు పోట్లాడుకోవడం మానేసారుట.
అదే చాలు సంబరాలకు బంగారపు మూట!

**ఒబెరాన్** : ఆత్మలారా! నేనిక్కడున్నాను, మీరెక్కడున్నారు?
దయ్యాల్లారా! కనిపించండి తక్షణం నాకు!
మీ రాజు, రాణి కొత్తగా వివాహం చేసుకుంటున్నారు ఈ క్షణం,
కావున, నాట్యగానాలు, విందూ వినోదాలు మొదలెట్టండి మరుక్షణం.

**ప్ప్యక్** : ప్ప్యక్ ఇక్కడే ఉన్నాడు, ప్రభూ! ఆడతాడు! పాడతాడు.
కాలి బోటనవేలు మీద నాట్యం చేస్తాడు.
వందమంది మధ్యలోనైనా నన్ను
జనం గుడ్లప్పగించి చూస్తారు.

**ఏరియల్** : ఏరియల్ పాట స్వచ్ఛమైనది, తీయనైనది
అనాగరిక స్త్రీలు నా పాట ఆనందిస్తారు.
అంతేకాదు అందమైన ఆడపిల్లలు కూడా
నా పాటలకు ఆకర్షింపబడి ఆనందిస్తారు.

**ఒబెరాన్** : దంపతులారా! పెళ్లయ్యాక కూడా మీరు
ప్రశాంతమైన తృప్తి కోసం అన్వేషిస్తున్నారా!
మేం చేసినట్లు చేయండి, విడిగా ఉండండి.
దూరం పెంచుతుంది సుమా, ప్రేమా, విరహం!

**టైటానియా** : భార్యాభర్తలు ఒకరితో ఒకరు సరిపడకపోతే
వెంటనే ఈ సలహా ఇవ్వండి.
అయ్యా! ఉత్తరానికిపో! అమ్మా దక్షిణానికి పో!
ఆ మాట వాళ్లని మళ్లా దగ్గరకు తెస్తుంది.

**వాద్యబృందం** : **(బిగ్గరగా)** ఈగ నోరూ, దోమ ముక్కు, మేమిక్కడే ఉన్నాం
మా పిల్లాజెల్లా పనిలో ఉన్నారు
ఆకుల్లో కప్ప, గడ్డిలో మిడత
సంగీతం చక్కగా పాడుతున్నారు.

**ఒంటరి పాట** : చూడండి, వస్తున్నాడు కొమ్ముబూరల వాడు,
అతడి మరోపేరు సబ్బు బుడగలవాడు.
అతగాడు ఊదుతాడు, ఉమ్ముతాడు, తుమ్ముతాడు
వాడి చప్పిడిముక్కు తెస్తుంది కష్టాల తాడు.

**ఇంకా పదునెక్కని ఆత్మ:**
కప్ప కడుపు, సాలీడు కాళ్లు
ఒక జత రెక్కలు, ఓ పసిపాప
అదొక జంతువే కాదు
చిన్న పద్యమయితే కావచ్చు!

**ఒక యువజంట** : ఉప్పొంగిన ఎదలతో, చిన్నగా అడుగులేస్తూ నడుస్తున్నాం!
మధువు మంచులో, పూలగుత్తుల మధ్య మురిసిపోతున్నాం!
అవును, నీవూ మా మధ్య వేగంగా పరిగెత్తవచ్చు
కాని, మాకిప్పుడే ఎక్కడికీ పారిపోవాలని లేదు.

**ఆసక్తిగల ప్రయాణీకుడు :**
ఇదేదో రంగస్థల విశేషయుక్తి కాదు గదా!
లేక నా కళ్లు నన్ను మోసం చేస్తున్నవా?
నేను దేవుడి లాంటి ఒబెరాన్‌ను చూస్తున్నాను.
నన్నెవ్వరు నమ్మినా, నమ్మకపోయినా!

**ఛాందసవాది** : కోరదంతాలు లేవు, తోకా లేదు
అయినా వాళ్ల గురించి అపోహ లేదు
గ్రీసుదేవుళ్లలా ఈ వింత గోబ్లిన్లు, అయ్యారే,
దయ్యాలున్నా లేకపోయినా ఇవి దెయ్యాలే!

**ఉత్తరదేశపు కళాకారుడు:**
ఇప్పటి వరకూ నాకర్థమయ్యిందంతా చిత్రమే!
నేనిక ఇటాలియన్ విహారయాత్రకు పోవడం సత్యమే!

**ఫ్యూరిస్టు** : నేనిక్కడికెలా వచ్చాను? ఎంత దారుణ మోసం! ఏమి హంగు?
అంతా అర్ధనగ్న మంత్రగత్తెల మయం, అందులో ఇద్దరే వేసుకున్నారు రంగు!

**యువ మంత్రగత్తె** : పౌడర్, రంగు పై వస్త్రం లాంటివి,
అవి ముసలి, ముడతలు పడ్డవాళ్లకే!
నేను నా మేకపోతు మీద కూర్చున్నాను!
నాకు తెలుసు నా నగ్నదేహంలో ఏమి చూపించాలో!

**సంరక్షకురాలు** : మీ మీద మాటలు వృథా చేయడం అనవసరం!
మాకు తెలుసు మా వేషభాషలు, మా విధులు!
మీరు యవ్వనంలో ఉన్న నెరజాణలు
కాలం గడిస్తే మీరూ రంగు తేలతారు!

**సంగీత దర్శకుడు** : ఈగ నోరూ, దోమ ముక్కూ!
ఈ వస్త్రాపహరణ దృశ్యమేమీ బాలేదు
ఆకుల్లో కప్పా, గడ్డిలో మిడతా!
నేను సంగీతం ప్రారంభిస్తా, మీరు సమయపాలన చేయండి.

**వాతావరణ సూచకుడు: (ఒక పక్కకు తిరుగుతూ)**
ఇంతకంటే మంచి సందడి ఇంకెక్కడ దొరుకుతుంది?
ఈ ప్రదేశమంతా యవ్వన విలాసినులు
అందమైన యువకులతో అలరారుతున్నది

**వాతావరణ సూచకుడు : (మరోవైపు తిరుగుతూ)**
ఈ భూమి బద్దలై వీళ్లందరిని మింగితే బాగుండును.
నేనూ నరకంలోకి పోయి తిరిగి వస్తాను.
అక్కడ వీళ్ల కథ చూసి రాగలను.

**క్జెనియా** : జోరీగలం, నల్లులం, కీటకాలం మేము,
చిన్నచిన్న అల్లరి చిల్లరి పురుగులం!
మా తండ్రి శనిని గౌరవిస్తాం,
చిన్నచిన్ని గంతులు వేస్తూ అలరిస్తాం!

**ఆగస్ట్‌వాన్ హెన్నింగ్స్ :**

ఆ 'బజ్' శబ్దం వినండి, ఆ కీటకాల దండును కనండి!
చిన్నపిల్లలు ఆటలాడుతున్న సవ్వడి వినరండి!
వాళ్ల వలన ఆపద లేదని నీవనుకుంటావ్;
అదే వాళ్లు కూడా చెబుతున్నారని తెలుసుకుంటావు.

**సంగీతపు గురువు :** ఈ బ్లాక్స్‌బర్గ్ సంతలో ఉండడం నాకు సంతోషం
మ్యూజ్‌లకన్నా మంత్రగత్తెల్ని పడేయడం సులభం.

**ఒకప్పటి తెలివిగలవాడు:**

అందరితో సంబంధాలు బాగుండాలి!
నేను నిన్ను రంగప్రవేశం చేయిస్తా ఎట్టాగొట్టా!
ఎందరో ఎక్కారు బ్లాక్స్‌బర్గ్ గుట్ట,
జర్మనీ పర్నాసస్‌లో ఉందిలే ఖాళీ మిట్ట.

**ఒక కొంగ :** మనిషి ఆత్మకోసం గాలం వేసేవాడు,
స్వచ్ఛమైన, కళవళమైన నీటిలోనూ వెదుకుతాడు!
డెవిల్ స్వంత కార్యాలయం నుంచే, వాడు
సరాసరి ఆదేశాల్ని సంపాదిస్తాడు!

**ప్రాపంచికుడు :** నీతిమంతులకు విశ్వాసం అన్నిదారుల్ని చూపిస్తుంది.
బ్లాక్స్‌బర్గ్ గుట్టపై కూడా మత సంబంధ సభలు జరుగుతాయి.

**నాట్యగత్తె :** అది కూడా బృందగానమేనా?
ఏమిటా దూరాన డప్పు చప్పుడు!
బహుశా పెద్ద కొంగల ప్రేమ పిలుపుల్తో
చిత్తడి నేలలు చిందులేస్తున్నాయి.

**నాట్యగురువు :** వంగినవాడు పరుగెత్తుతాడు, సోమరి గెంతుతాడు,
ఇవన్నీ నృత్యాలంటే ఎవడు నమ్ముతాడు?
వాళ్లను వాళ్లు చూసుకుంటే చాలు,
ఆపుతారు ఈ అపభ్రంశపు కుప్పిగంతులు!

**ఏకతార వాయించేవాడు:**

వీళ్లకు ఒకళ్లంటే ఒకడికి పడదు,
ఎదుటి వాడిని చంపడానికి ఎప్పుడైనా సిద్ధమే!

ఆర్ఫియస్ వీణ అడవి జంతువుల్ని కదిలించింది.
వీళ్లకు మాత్రం తిత్తుల బూరల్తోనే తృప్తి కలుగుతుంది.

**మొండివాడు** : సందేహకులు రానీ, విమర్శకులు చావనీ,
నా మాట మీద నేను నిలబడతాను.
'డెవిల్' అనే వాడే లేనప్పుడు
ఈ దయ్యాలన్నీ అభూత కల్పనలే!

**ఆదర్శవాది** : నా ఊహలోకపు కల్పనా చాతుర్యం,
ఈరోజు మరింత ఎక్కువైనట్లుంది;
ఇదంతా నేనే అయ్యేట్లయితే నేనంటాను,
నాకు తాత్కాలికంగా పిచ్చెక్కింది.

**యధార్ధవాది** : పదార్థం శబ్దరహితమైతే లోపం ద్రవ్యానిదా?
నేనొకప్పుడు నలుచదరంలా నిలబడ్డాను, ఇప్పుడు నిలకడ లేదేమిటి?

**అతీంద్రియవాది:** ఈ విచిత్ర జంతువుల్ని కలిసినందుకు నాకు ఎంతో సంతోషం,
దయ్యాలు నాకు చెబుతాయి, ఇంకా ఉన్నతాత్మలున్నాయని!

**అనుమానస్థుడు** : పాతిపెట్టిన సత్యానికి పాదు వెదుకుతారు వీళ్లు
అగ్నికీలలు వీళ్లనిక్కడికి అనవసరంగా తెచ్చాయి.
డెవిల్, డౌట్ 'డి'తో మొదలవుతాయి,
సాతాను, సందేహం 'స'తో మొదలైనట్లు.

**సంగీత దర్శకుడు** : గడ్డిలో మిడత! ఆకుల్లో కప్ప!
ఈ అరుపులు కూతలు నేను భరించలేను.
ఈగ నోరూ, దోమ ముక్కు!
మీ వృత్తి గౌరవం గురించి ఆలోచించండి!

**తెలివిగలవాళ్ళు** : మేం కొత్త కళాకారులం!
బహు గొప్ప విదూషక వేషగాళ్లం!
మేం కాళ్లతో ఏ పనీ తలపెట్టలేం!
అందుకే తలకిందులుగా నడుస్తున్నాం!

**చేతకానివాళ్లు** : చెప్పులేసుకున్నందుకు ఒకప్పుడు
న్యాయస్థానంలో చేసాం నృత్యం

ఇప్పుడు స్వేచ్ఛగా ఉన్నాం కాని, దేవుడా!
మా కాళ్లకు కనీసం లేవే పాదరక్షలూ!

**విల్–ఒ–ద–విస్ప్** : చిత్తడి నేలల్లోంచి, ఊబి గోతుల్లోంచి
ఊడిపడి మేమీ ఉత్సవాల్లో ఉన్నాము
మా పుటకలు సామాన్యం కావచ్చు కాని
మేమిప్పుడు చురుకైన తెలివిగల దయ్యాలం!

**రాలిపడే నక్షత్రం** : అంతెత్తు నుంచి రాలిపడ్తున్నాను నేను,
తోకచుక్కలా వెలిగి ఆరిపోతున్నాను.
నేలమీద అడ్డంగా పడిపోయానిప్పుడు,
నన్నెవరు లేవదీసి నడిపిస్తారో చెప్పరూ?

**సాయుధ దళం** : దారి తొలగండి! దారి తొలగండి!
మేం నాట్యం చేస్తుంటే గడ్డి అంతా నలిగిపోతుంది.
మేమూ ఆత్మలమే కాని, మాకూ ఉన్నాయి
పెద్దపెద్ద బరువైన పాద రక్షలూ, చెప్పులూ!

**ప్యుక్** : ఓ పనికిమాలిన గున్న ఏనుగుల్లారా
ఎంత విచ్చలవిడిగా తొక్కేస్తున్నారు మీరు,
అందరికంటే నాట్యంలో అసహ్యంగా చేసేది 'ప్యుక్',
నన్ను ఆదర్శంగా పెట్టుకుని నర్తిస్తేనే లాభం మీకు!

**ఏరియల్** : ప్రకృతి కొందరికి రెక్కలనిస్తుంది.
కొందరిని ఆత్మ పైకి లేవనెత్తుతుంది.
నన్ను అనుసరించండి, నేను భారరహితాన్ని,
గులాబి గుట్టు మనకోసం వేచి వున్నది.

**వాయిద్యబృందం** : **(పియానిస్సిమో)**
కదిలే మంచుతెర, మబ్బుల ముసుగు పొర,
ఉదయసంధ్యను స్పృశించే తరుణమిదే!
ఆకుల గలగల, రెల్లు పరక జరజర,
అన్నీ కొట్టుకుపోయే అసలు సమయమిదే!

# 26. మైదానంలో విచారదినం

## (A Gloomy day - Open Country)

**(ఫాస్ట్, మెఫిస్టాఫిలిస్)**

**ఫాస్ట్** : అంతులేని దురదృష్టం! అనంతమైన నిరాశ! దేశమంతా పిచ్చెత్తినట్లు తిరుగుతూ చివరకు జైలుపాలు! ఖైదీలా నానా బాధలు పడుతూ నేరస్థురాలిగా చిత్రహింసలపాలైనదా చిన్నారి! ఇంతదారుణమా పర్యవసానం? దీనికంతటికీ ఈ దుష్టజంతువే కారణం! దుర్మార్గుడా! నీవు నాకేం చెప్పలేదెందుకని?

నిలబడు! అక్కడే ఆగిపో! నీ దయ్యపు కళ్లను ఆగ్రహంతో ప్రజ్వరిల్లచేయి! నీ దరిద్రపు మలిన దుర్భర భీభత్స మొహంతో నా ఎదుటే నిలబడి సమాధానమివ్వు! ఖైదీగా, సమస్తం కోల్పోయిన అనాధగా, దుష్టాత్మలకు అప్పగించబడి, మానవజాతి శీతల కర్కశ న్యాయానికి బలైపోతున్న ఆ అభాగినిని చూడు! ఈ లోపుల నీవు నీ వెధవ ఉపాయాలతో దారిమళ్లించి, ఆమె పడ్తున్న బాధలను నన్ను కననీకుండా చేసావు. ఆమెను నిస్సహాయురాలిగా విధికి బలిచేశావు.

**మెఫిస్టాఫిలిస్** : ఆమే మొదటిది కాదు!

**ఫాస్ట్** : కుక్కా! వళ్లు కంపరమెత్తుతున్నది నిన్ను చూస్తేనే! ఓ అనంతాత్మా! ఈతడిని మరలా కుక్కలా మార్చివేయి! రాత్రిళ్లు నా పాదాల వెంబడి పరిగెడ్తూ, నా ముందు నడుస్తూ, చటుక్కున అమాయకపు బాటసారుల కాళ్లకడ్డంబడి వాళ్లు నేలం బడగానే వారి వీపులను కరిచే ఈ ముదనష్టపు కుక్కను దానికిష్టమైన రూపులోకి మార్చివేయి! అది తన పొట్టపై పాకుతూంటే, నేను నా కర్కశ పాదాలతో తొక్కి దానిని నలిపివేయనీ!

ఆమె మొదటిది కాదట! ఓ విచారమా! ఏ మానవ ఆత్మా భరించలేని విచారమిది! ఈ దురదృష్టకర బతుకుకు ఇంకెన్నో జీవాలు బలైనవని, అందరి పాపాలూ మొదటి జీవికి విధించబడిన శిక్షతో పరిహరించబడలేదని ఆమె అంతులేని బాధతో కరుణామయుడైన భగవానుని కనుల ముందు మరణిస్తున్నపుడు కూడా ఆ పాపం అంతం కాలేదనీ అవగతమవుతున్నదే! ఈ ఒక్క బాలిక దురదృష్టానికి

నా జీవపు లోతులే దహించుకుపోతుండగా– నీవు వేలాది దురదృష్టవంతుల దుఃఖాన్ని చూసి పరిహసిస్తున్నావా! సిగ్గులేనివాడా!

**మెఫిస్టొఫిలిస్ :** సరే సరే! ఇప్పుడు మనం మన సంభాషణల దారం
తెగేంత స్థితి దగ్గరకు వచ్చాం!
ఇక్కడే మీ మానవ మెదడు నరాలు పుటుక్కున తెగుతాయి.
మాతో ఎందుకు సరితూగాలని చూస్తారు మీరు,
మా వేగాన్ని తట్టుకోలేనప్పుడు?
ఎగిరేంత శక్తి లేనప్పుడు ఎగిరే ప్రయత్నమెందుకు?
మిమ్మల్ని మేము బలవంతం పెట్టామా? లేక మీరు మమ్మల్ని?

**ఫాస్ట్ :** నీ దురాశా కోరల్ని నాకు చూపించకు,
అవి నన్ను రోగభూయిష్టుడిని చేస్తాయి.
ఓ ప్రకాశవంతమైన ఆత్మా!
నా మనసూ, హృదయం, తెలిసినవాడివే;
నన్నెందుకు దుష్టాత్మకు కట్టిపడేశావు?
ఇతడు శిథిలాలపై ఆకలి తీర్చుకుని,
విధ్వంసంతో దాహం చల్లార్చుకుంటున్నాడు!

**మెఫిస్టొఫిలిస్ :** నీ మాట్లాడడం అయిపోయిందా?

**ఫాస్ట్ :** ఆమెను రక్షించు! లేదా నీకు దుఃఖం తప్పదు!
అన్నిటికన్నా భయంకర శాపం నిన్ను వేలాది ఏళ్లు పీడించునుగాక!

**మెఫిస్టొఫిలిస్ :** నేను ప్రతీకారుడి బంధాలను సడలించలేను.
ఆమెను రక్షించు, ఆమెను రక్షించు అని అరుస్తున్నావే,
ఎవరు ఆమెను నాశనం చేసింది, నీవా, నేనా?

**(ఫాస్ట్ నోట మాటరాక నిశ్చేష్టుడౌతాడు)**

ఏం మాట పెగలడం లేదా!
లేక ఏదన్నా పిడుగు పడుతుందని వేచి చూస్తున్నావా?
మీ మర్త్యులకు ఇంకా ఆ వరమివ్వలేదు,
విరోధి అమాయకంగా సమాధానమిస్తే తల బద్దలు చేయడం?
నియంతల లక్షణం అది, వాళ్లకు ఇబ్బందికరమైన
సమాధానం వస్తే ఆగ్రహంతో రెచ్చిపోవడం!

**ఫాస్ట్ :** ఆమె దగ్గరకు నన్ను తీసుకువెళ్లు! ఆమెను విడిపించాలి!

**మెఫిస్టొఫిలిస్ :** దానివల్ల నీకు వచ్చే ఇబ్బంది తెలియదా?
నీ చేతులు రక్తంతో తడిచి ఉన్నాయి!
ఆ నగరంలో నీవిప్పుడు హంతకుడివి.
నీవు చంపినవాడి సమాధి మీద ప్రతీకార ఆత్మలు ఎగురుతున్నాయి.
హంతకుడెప్పుడు తిరిగి వస్తాడా అని!

**ఫాస్ట్ :** అది కూడా నీనుంచే వినాలా నేను?
హత్య, ప్రపంచనాశనం ఒక్కసారే రానీ నీపైన!
రాక్షసుడా! ఆమె వద్దకు నన్ను తీసుకునివెళ్లు
నేను చెబుతున్నాను, ఆమెను విడుదల చేసి తీసుకునిరా!

**మెఫిస్టొఫిలిస్ :** నేను నిన్ను తీసుకువెళ్తాను, నేనేం చేయగలనో చెబ్తాను!
స్వర్గ, భూలోకాల మీద నాకధికారమున్నదనుకుంటున్నావా?
నేను జైలు అధికారి ఇంద్రియాలను నిద్రపుచ్చగలను.
అతడి దగ్గర తాళం చెవులు సంగ్రహించు నీ మానవ హస్తాలతో!
నేను కాపలా ఉంటాను, మంత్రాశ్వాలు సిద్ధంగా ఉంటాయి.
అదే నేను చేయగలిగింది.

**ఫాస్ట్ :** పద! వెంటనే వెళ్దాం!

# 27. రాత్రి - మైదానంలో

## (Night - In open Country)

**(ఫాస్ట్, మెఫిస్టొఫిలిస్ నల్లని గుర్రాలపై వేగంగా పోతుంటారు)**

**ఫాస్ట్** : ఆ ఉరికొయ్య దిబ్బ దగ్గర కదుల్తున్నదేమిటి?

**మెఫిస్టొఫిలిస్ :** నాకు తెలియదు వాళ్లేం చేస్తున్నారో, ఏం వండుతున్నారో!

**ఫాస్ట్** : పైకి కిందకు ఎగుర్తున్నారు, నేలబడ్తున్నారు, దూసుకుపోతున్నారు!

**మెఫిస్టొఫిలిస్ :** బహుశా మంత్రగత్తెలు కావచ్చు.

**ఫాస్ట్** : వాళ్లేదో వెదజల్లుతున్నారు, ఏదో వింత ఆచారంలా ఉంది.

**మెఫిస్టొఫిలిస్ :** పోనీయ్, త్వరగా పోనీయ్!

# 28. ఖైదు
## (A Prison)

**ఫాస్ట్ : (తాళపుచెవుల గుత్తి, దీపంతో ఇనుప తలుపు దగ్గర)**
వళ్లంతా వణుకు మరల వస్తున్నది.
ఎన్నాళ్లయ్యింది ఇటువంటి విచారాన్ని అనుభవించి?
ఆమె ఈ శీతల, తడి గోడ పక్కన పడుకుని ఉంటుంది,
ఆమె నేరమల్లా తన హృదయపు భ్రాంతిని నమ్మడమే!
లోపలికి వెళ్లేముందు ఒక్కక్షణం ఆగనా?
ఆమె ముఖాన్ని చూసేందుకు భయపడుతున్నానా?
త్వరగా ఆలస్యం చేస్తే ఆమె ప్రాణానికే ప్రమాదం!

**(తాళాన్ని పట్టుకుంటాడు– లోపలి నుంచి మార్గరెటా పాట)**

ఎవరు నన్ను చంపింది?
నా తల్లి, ఓ వేశ్య– వళ్లమ్ముకునేది.
ఎవరు నా మాంసం తిన్నది?
నా తండ్రి, అతడే అన్నది.
చిన్ని చెల్లి నా ఎముకల్ని,
ఏరింది అతడు విరజిమ్మినవి.
ఎక్కడో శీతల ప్రదేశంలో అవి ఉన్నవి.
అప్పుడు నేనొక పక్షిగా మారాను.
దూరంగా ఎగిరిపోయాను, సుదూరంగా ఎగిరిపోయాను.

**ఫాస్ట్ : (తాళం తీసి తలుపు తెరుస్తాడు)**
ఆమెకు తెలియదు ఆమె ప్రియుడు వింటున్నాడని,
సంకెళ్ల ధ్వనులు, ఎండుగడ్డి శబ్దాలు పలకరిస్తున్నాయని!
**(జైలు గదిలోకి ప్రవేశిస్తాడు)**

**మార్గరెటా : (గడ్డి పరుపులో మొహం దాచుకుంటుంది)**
ఓహ్! ఓహ్! వాళ్లు వస్తున్నారు! దారుణమైన చావు.

**ఫాస్ట్ : (నెమ్మదిగా)** నిశ్శబ్దం! నిశ్శబ్దం! నిన్ను విడుదల చేయడానికి వచ్చాను!

**మార్గరెటా : (అతని పాదాల వేపు పాకుతూ)**
నీవు మనిషివైతే నాపై దయజూపు!

ఫాస్ట్ : నీవు కావలివాళ్లను నిదురలేపేట్లున్నావు, నెమ్మదిగా మాట్లాడు!

**(ఆమె సంకెళ్లను విడదీస్తాడు)**

మార్గరెటా : **(మోకాళ్లపై కూలబడి)**

ఉరితీసే వాడా! నీకెవరిచ్చారు ఈ అధికారం?
ఎవరు నన్ను అర్ధరాత్రి తీసుకురమ్మని ఆజ్ఞాపించారు?
దయ ఉంచు! రేపు ఉదయం నేనెలాగూ చచ్చిపోతాను.
ఆ సమయం చాలదా నీకు? అంత కఠినాత్ముడవా?

**(లేచి నిలబడ్తుంది)**

నేనింకా చిన్నపిల్లనే! పాలబుగ్గలే ఇవి ఇంకా!
అప్పుడే చనిపోవాలా?
నేను అందగత్తెనే, అందుకే నా ప్రియుడు నాతో ఉన్నాడు.
ఇప్పుడెక్కడున్నాడో తెలీదు.

వాళ్లు నా పూలదండను తెంపారు, పూలను విసిరేసారు.
ఎందుకు నీవు నన్నలా పట్టుకుంటున్నావు?
నన్ను వదిలేయ్! నేనేం తప్పు చేయలేదే మరి!
నన్ను బతకనివ్వు! నిన్ను ప్రార్థించనా! పాదాలు కన్నీళ్లతో కడగనా!
నీవెవరివో! ఇంతకు ముందెన్నడూ నిన్ను చూడలేదు!

ఫాస్ట్ : నేనింకా ఎలా భరించగలను? అయ్యో! ఈ బాధను!

మార్గరెటా : నేనిప్పుడు నీ అధీనంలో ఉన్నాను.
నీతో రావడానికి సిద్ధమే!
ముందు నా పాపకు పాలివ్వనివ్వు!
రాత్రంతా ఒడిలో పెట్టుకుని లాలిస్తున్నాను. నీకు తెలుసా!
వాళ్లు నా దగ్గర్నుంచి లాక్కుపోయారు, నన్ను బాధపెట్టడానికే!
వాళ్లంటారు నా పాపను నేను చంపానట!
ఇప్పుడేవీ అప్పటిలా ఉండబోవు!
వాళ్లు క్రూరులు, నాకు వ్యతిరేకంగా పాటలు పాడ్తున్నారు!
పాతకథ ఒకటి అలానే ముగుస్తుంది,
అది నా గురించేనేమో నాకెలా తెలుస్తుంది?

ఫాస్ట్ : **(ఆమె కాళ్ల వద్ద కూలబడతాడు)**

నేను నీ ప్రియుడిని, నీ పాదాల వద్ద పడివున్నాను.
నిన్ను ఈ నరకం నుంచి విడిపించ వచ్చి వున్నాను.

**మార్గరెటా** : **(అతడి పక్కనే తానూ కూలబడి)**
ఇద్దరం ఇలానే కూర్చుని సాధువుల కరుణకై ప్రార్థిద్దాం!
మెట్ల కింద, తలుపు కింద, అదుగో నరకం ప్రజ్వలిస్తోంది!
కోపాగ్ని కేకల్ని నీవు కూడా వినవచ్చు కావాలనుకుంటే!

**ఫాస్ట్** : **(బిగ్గరగా)** గ్రెఛెన్! గ్రెఛెన్!

**మార్గరెటా** : **(తనపేరు వినగానే)** అది నా ప్రియుడి గొంతు!
**(ఎగిరి గంతులేస్తుంది, సంకెళ్లు ఊడిపోతాయి)**
ఎక్కడ అతడు? నా పేరు పెట్టి పిలిచాడే!
నేనిప్పుడు స్వేచ్ఛగా ఉన్నాను, నన్నెవరూ ఆపలేరు!
అతని కౌగిలిలోకి ఎగిరిపోతాను,
అతని హృదయంపై నిదురిస్తాను,
అతడు నన్ను 'గ్రెఛెన్' అని పిలిచాడు.
నేనతడిని గుర్తుపట్టాను.
నరకపు అరుపుల్లో, ఏడ్పులు పెడబొబ్బల్లో
డెవిల్ ఆగ్రహంలో, పరిహాసంలో, తిరస్కారంలో
నా ప్రియుడి గొంతును గుర్తించగలను! ప్రియతమా!

**ఫాస్ట్** : చెలీ! నేనిక్కడ ఉన్నాను.

**మార్గరెటా** : నీవేనా? మరొక్కసారి పిలవవా!
**(కౌగిలించుకుని)** అతడే! అతడే! ఇప్పుడు నాకింకెక్కడివి బాధలు?
ఏవి నా సంకెళ్లు? ఏది ఖైదు? ఏది భయం?
నీవేనా? నన్ను రక్షించి కొనిపోవ వచ్చావా?
రక్షింపబడినాను నేను!
అదిగో నా కనుల ముందు, ఆ వీధి,
నేను తొలిసారి నిన్ను చూసినది, మరల మరల కలిసినది.
నేనూ, మార్తా, నీ కోసం ఎదురుచూస్తూ,
ఆ చక్కని తోటలో మనం పదేపదే కలుస్తూ!

**ఫాస్ట్** : **(ఆమెను తీసుకుని వెళ్లడానికి ప్రయత్నిస్తూ)**
రా! వెళదాం పద!

**మార్గరెటా** : ఆగు! నీవు లేనప్పుడు నాకెక్కడైనా ఒకటే!
**(అతడిని ముద్దాడుతుంది)**

**ఫాస్ట్** : వద్దు! ఆలస్యం చేయవద్దు! చేసామా
మనం ఎంతో శుల్కం చెల్లించాల్సి ఉంటుందిప్పుడు.

**మార్గరెటా** : ఏమిటి? నన్నెలా ముద్దాడాలో కూడా మర్చిపోయావా?
ప్రియమిత్రుడా! మనిద్దరం కలిసే ఉన్నామిప్పుడు!
ముద్దాడుకోవడం అప్పుడే వచ్చిందా అంతిమానికి?
ఎందుకు నీ కౌగిలిలో వణికిపోతున్నానెందుకు?
స్వర్గమే నా ముందున్నట్లుండేదే ఇదివరకు!
ఎంత అందంగా, మనోహరంగా కనిపించేవాడివి
నీ ముద్దులతో ఉక్కిరిబిక్కిరయినా నన్ను వదిలేవాడివి కావు!
**(అతడిని కౌగలించుకుంటుంది)**
ఎందుకు నీ పెదాలు మూగవైనాయి?
వాటికేం చెప్పాలనిలేదా!
ఎందుకు నీ ప్రేమ శీతలమై ఘనీభవించింది?
మనిద్దరి మధ్య ఎవరు చొరబడి దానిని లాక్కుపోయినారు?
**(అతడి నుంచి విడివడుతుంది)**

**ఫాస్ట్** : రా! నాతోరా! ప్రియతమా! ధైర్యంగా వచ్చేయి!
తరువాత నిన్ను వేయిసార్లు హత్తుకుంటాను గట్టిగా!
ఇప్పుడు నాతో వచ్చేయి, అదే నేను నిన్ను కోరుకునేది!

**మార్గరెటా** : **(అతనివేపు తిరిగి)** నీవు నీవేనా? నమ్మవచ్చునా?

**ఫాస్ట్** : నేనే! త్వరగా రా!

**మార్గరెటా** : నీవు నా సంకెళ్లు తొలగించావు. అవి పడిపోయాయి.
నన్ను నీ హృదయానికి హత్తుకుంటున్నావు.
మది నన్నెందుకు విషపు పురుగులా భావించడం లేదు?
నీకు తెలుసా, నీవెవరిని రక్షిస్తున్నావో?

**ఫాస్ట్** : రా! రా! చీకటి రాత్రి తెలవారనున్నది!

**మార్గరెటా** : నా తల్లి మరణించింది. నేనామెకు విషమిచ్చాను.
మనిద్దరం కలిసేందుకు ఆమెకు నిద్రనిచ్చాను.
నా బిడ్డ పుట్టగానే నీళ్లలో ముంచి చంపాను.
ఆ పసిపాప మనిద్దరికి దేవుడిచ్చిన బహుమానం కాదా?

ఇదంతా ఒక స్వప్నమని భావించనా? వద్దా?
నీ చేయి, నీ చేయెందుకు తడిగా ఉన్నది?
ఆ రక్తాన్ని తుడిచివేయి! అవి రక్తపు మరకలే కదా!
దేవుడా! ఏం చేసావు నీవు?
నిన్ను ప్రార్థిస్తాను, ఆ కత్తినలా పారవేయి!

**ఫాస్ట్** : జరిగింది మర్చిపో! నన్ను చంపేస్తున్నావు!

**మార్గరెటా** : వద్దు వద్దు! నీవు బ్రతికే ఉండాలి!
నేనిప్పుడు సమాధుల గురించి చెబుతాను.
ఆ గోతుల్ని, సమాధుల్ని ఇలా సిద్ధం చేయి– రేపు–;
ముందుగా మా అమ్మను ఇక్కడ,
ఆమెకు కుడిపక్కన నా సోదరుడిది,
కొంచెం దూరంగా, మరీ అంత దూరం కాదు...
ఇక్కడ... ఇక్కడ... నాది!
నా చిన్నిపాప నా కుడి రొమ్ము పక్కన...
నాతోపాటు పడుకునే వాళ్లెవరూ లేరులే!–

నేను నీ పక్కన పడుకున్నపుడు
ఎంత హాయిగా, ఎంత ఆనందంగా ఉండేదో తెలుసా?
ఇప్పుడెందుకో అలా అనిపించడం లేదు.
వస్తుంటే, నా కాళ్లు ఈడ్చుకు వస్తున్నట్లున్నాయి.
నన్ను నీవు ముందుకు నెడ్తున్నట్లనిపిస్తున్నది.
అయినా అది నీవే! నీ మృదుహస్తం, మెత్తనిది.

**ఫాస్ట్** : అది నా హస్తమే కదా! మరి రా నాతో!

**మార్గరెటా** : బయటకా?

**ఫాస్ట్** : స్వేచ్ఛలోకి!

**మార్గరెటా** : బయట ఉన్నది నా గోయి, నా సమాధి
మృత్యువు ఎదురుచూస్తున్నది, రమ్మంటున్నది.
ఇక్కడి నుంచి నా సమాధి వరకే రాగలను నేను.
అంతకు మించి ఒక్క అడుగూ వేయను ముందుకు.
నీవు వెళ్తున్నావా? – హీన్‌రిచ్– నేను కూడా వస్తే బాగుండును!

**ఫౌస్ట్** : రా! రావాలని అనుకో! తలుపు తెరచి ఉంచాను.

**మార్గరెటా** : నేను రాలేను! నాకా ఆశ లేదు! తప్పించుకుని ప్రయోజనమేమి?
వాళ్లు గమనిస్తున్నారు! జీవితంలో దారి అడుక్కోవడం తప్పు!
చెడు అంతరాత్మతో ప్రపంచ పర్యటన మరింత ముప్పు.
అలా చేసినా చివరకు వాళ్లు నన్ను పట్టుకుంటారు.

**ఫౌస్ట్** : నేను నీతోనే ఉంటానుగా ఎల్లప్పుడు!

**మార్గరెటా** : అవునా! అయితే,
త్వరగా, త్వరగా!
నీ పసిపాపను కాపాడు!
అదిగో ఆ దారినే వెళ్లు,
ఏటికి ఎగువగా, కొండపైకి,
వంతెన మీదకు,
అడివి అదుగో, దూరంగా!
అక్కడే, ఎడమ పక్క, కంచె పక్కనే-
ఆ పసిపాపడు చెరువులో!
అతడ్ని పట్టుకో, కాపాడు!
అతడు కదుల్తూనే ఉన్నాడు,
ఈదడానికి ప్రయత్నిస్తున్నాడు,
రక్షించు! అతడిని రక్షించు!

**ఫౌస్ట్** : ఆపు, ఆపు! ఏమంటున్నావో ఆలోచించు కొంచెం!
ఒక్కడుగు ముందుకు వేయి, మనం మన దారిలో ఉంటాం!

**మార్గరెటా** : త్వరగా! కొండకు అటుపక్కకు వెళ్లు,
నా తల్లి రాతిపై శిలలా కూర్చున్నది.
చలిలో గడ్డకట్టి, నాకు భయమేస్తున్నది.
ఒంటరిగా ఉన్నది, తల కదిలిస్తున్నది.
పిలవడం లేదు, తలూపడం లేదు.
ఎంతకాలం నిదరపోయిందో ఎంత పిలిచినా లేవడం లేదు.
ఆమె నిదురపోయింది, మనం శయ్యపై కలిసి నిద్రించడానికి,
మనం హాయిగా ఉన్న రోజులవి, సందేహం లేని కాలమది.

**ఫౌస్ట్** : ఎంత చెప్పినా వినవే! నిన్ను నా కూడా మోసుకుపోతాను.

**మార్గరెటా** : నన్నంటుకోకు! వదిలేయ్! కిందకు దించు!
నన్ను బలవంతం చేయకు, గట్టిగా పట్టుకోకు!
నీకు తెలుసు, నేనెప్పుడూ నిన్ను అంగీకరించిన దానినే!

**ఫాస్ట్** : అయ్యో! తెలవార వస్తున్నదే! ప్రియతమా! ప్రియతమా!

**మార్గరెటా** : పగలు! రేపు పగలు! ఆఖరి రోజు ఉదయసంధ్య!
అది నా పెళ్లిరోజు ఉదయమనుకున్నాను.
నీవిప్పుడు గ్రెఛెన్‌తో ఉన్న సంగతి ఎవరితోనో చెప్పవద్దు సుమా!
అయ్యో! నా పూలదండ పాడైపోయిందే!
అయ్యిందేదో అయ్యింది!
మనం తరువాత కలుసుకుందాం!
కాని నేనప్పుడు నాట్యం చేయలేను,
నేను వాళ్లను వినలేను.
గుంపు నావేపే వస్తున్నారు
ఎందరో లెక్కలేదు–
వీధులు, కూడలులు నిండిపోయాయి,
శ్వేత శలాక విరిగింది.
నన్ను కట్టి బంధించారు, దేవుడా!
వధ్య శిలపై నన్నుంచారు.
గుమికూడిన గుంపులోని ప్రతి ఒక్కరి మెడపై
పైకి లేచిన కరవాలపు అంచు తగిలినట్లు
ప్రపంచమంతా నిశ్శబ్దం! స్మశాన నిశ్శబ్దం.

**ఫాస్ట్** : ఇందుకేనా నేను జన్మించింది? ఇదా నా జన్మ విలువ?

**మెఫిస్టొఫిలిస్** : **(తలుపు పక్కన నిలబడి)**
రా! ఇంకొక్క క్షణం ఆగావా, నీకు మిగిలేది నాశనమే!
ఏమిటీ సరసాలూ, మొత్తుకోళ్లూ, బతిమాలడాలూ!
నా రాత్రి గుర్రాలు సకిలిస్తున్నవి
సూర్యుడు ఉదయించనున్నాడు!

**మార్గరెటా** : ఏమిటది? నా ఖైదు నేల నుండి పైకుబికినది!
అది అతడే, అతడే! అతడిని పంపేయ్!
అతడిక్కడకు రాకూడదు! ఇది పవిత్రీకరించిన ప్రదేశం!
అతడు నన్ను కోరుకుంటున్నాడు!

**ఫాస్ట్** : నీవు బ్రతికి ఉండాలి!

**మార్గరెటా** : దేవుడా! నీ అంతిమ తీర్పును నేను శిరసావహిస్తాను.

**మెఫిస్టొఫిలిస్ :** **(ఫాస్ట్‌తో)** రా! రా! త్వరగా! లేకుంటే నేను వెళ్లిపోతాను,
మీ ఖర్మానికి మిమ్మల్నిక్కడే విడిచి!

**మార్గరెటా** : తండ్రీ! నన్ను కాపాడు! నన్ను తిరస్కరించకు!
నేను నీ దానిని! ఓ పవిత్ర దేవదూతలారా!
నన్ను మీ రెక్కల కిందకు తీసుకోండి! నను పరివేష్ఠించండి!
నన్ను రక్షించండి!–
హీన్‌రిచ్! నీవు నన్ను భయపెడ్తున్నావు!

**మెఫిస్టొఫిలిస్ :** ఈమె తిరస్కరించబడినది.

**ఒకస్వరం** : **(పై నుంచి)** ఈమె క్షమించబడినది.

**మెఫిస్టొఫిలిస్ :** **(ఫాస్ట్‌తో)** నాతోరా!
**(ఫాస్ట్‌తో కలిసి అదృశ్యమవుతాడు)**

**మార్గరెటా గొంతు : (జైలు గది నుంచి స్వరం తగ్గుతూ)**
హీన్‌రిచ్! హీన్‌రిచ్!..... హీన్‌రిచ్!






Bloks-Bergs
Verrichtung.

ప్రపంచ సాహిత్యం-8

గేథే రచన

# ఆత్మను అమ్మిన మానవుడు - ఫాస్ట్

## (రెండవ భాగం)

## FAUST (Part-2)

**by**

**Johann Wolfgang Goethe**

డాక్టర్ లంకా శివరామప్రసాద్

# ప్రస్తావన

ఒక కల్పిత గాథ జానపద గాథగా అనేక సంవత్సరాలు గేథే మనసులో దాగి వుండి అంచెలంచెలుగా, శకలాలుగా బయటకు వచ్చి గ్రంథస్థమై కవి మరణానంతరం ప్రచురణకు నోచుకున్నది.

ఫాస్ట్, మెఫిస్టాఫిలిస్‌లు తమ అన్వేషణను, సంచారాన్ని Eternal feminine - శాశ్వత స్త్రీత్వశోదనలో కొనసాగిస్తారు. ఆ అన్వేషణకు అంతిమ ఘట్టం ఫాస్ట్ మరణం. రక్త ఒప్పందం అమలు కాకుండానే, మెఫిస్టాఫిలిస్ కోరిక నెరవేరకుండానే దేవదూతలు వచ్చి ఫాస్ట్ ఆత్మను స్వర్గానికి, కన్యామాత వద్దకు తీసుకుపోతారు. గ్రెఛెన్ ప్రేమ ఆతడిని సాతాను ఒప్పందపు సంకెళ్ల నుంచి విముక్తం చేసి ప్రేమ స్వరూపిణి కరుణామయి మాత సన్నిధికి దేవదూతగా తీసుకువెళ్తుంది.

ఫాస్ట్‌మొదటి భాగానికి అనుబంధంగా వెలువడి, గ్రీకు సాహిత్యానికి అంజలి ఘటిస్తూ అనేక రకాల కథాకధన విశేషాలతో, అరేబియన్ నైట్స్ కథల్లోని విచిత్ర సంఘటనల స్ఫూర్తితో రచించబడిన అద్భుత దృశ్యాలతో చదువరులను విస్మయపరుస్తుంది ఫాస్ట్–రెండవభాగం.

గేథే జర్మన్ కావ్య నాటకానికి, డేవిడ్ ల్యూక్ ఇంగ్లీషు అనువాదంలా, ఈ తెలుగు అనువాదం సాహితీ ప్రియుల మనస్సులను రంజింపజేస్తుందని సృజనలోకం భావిస్తున్నది.

**– డాక్టర్ లంకా శివరామప్రసాద్**

# విషయ సూచిక

# ఫాస్ట్-2 (Faust-II)

## Faust - The Second Part of the Tragedy

## Index of Scenes


**Act-I :** **Prologue (Scene-I)** ముందుమాట. A beautiful land scape

**An Imperial Palace**

**Scene 2** - The throne room - సింహాసనపు గది.

**Scene 3** - A spacious hall - విశాలమైన ఆవరణ

**Scene 4** - A pleasure garden - విహార వనం

**Scene 5** - A dark gallery - చీకటి ప్రదర్శనశాల

**Scene 6** - Brightly lit halls - వెలుగున్న ఆవరణలు

**Scene 7** - The great hall - పెద్ద ఆవరణ

**Act - II :** **Scene 8** - A high vaulted gothic room - ఎత్తైన గది

**Scene 9** - A laboratory - ప్రయోగశాల

**Scene 10** - Classical Walpurgis Night - దయ్యాల రాత్రి

a. The pharsalian plain

b. the Peneus

c. by the upper peneus

d. Rocky intels of the Aegean Sea

**Act-III :** **Scene 11** - Infront of the Palace of Menelaus in Sparta

**Scene 12** - The Inner Court yard of a Castle

**Scene 13** - Arcadia - ఆర్కాడియా

**Act - IV :** **Scene 14** - High Mountains - ఎత్తైన పర్వతాలు

**Scene 15** - On the Foot hills - పర్వత పాదాలు

**Scene 16** - The rival Emperor's tent - శత్రు శిబిరం

**Act - V :** **Scene 17** - Open country - మైదానం

**Scene 18** - A Palace - రాజభవనం

**Scene 19** - Deep Night - రాత్రి

**Scene 20** - Mid Night - అర్ధరాత్రి

**Scene 21** - The great forecourt of the Palace - రాజభవనం

**Scene 22** - Burial rites - సమాధి హక్కులు

**Scene 23** - Mountain gorges - పర్వతపు గొంతులు

# ఫాస్ట్ - రెండవభాగం - మొదటి అంకం

### 1) (ప్రస్తావన) – అందమైన దృశ్యం. ( A Beautiful Landscape)

(**ఫాస్ట్–** ఆకుపచ్చని మెత్తని గడ్డిపై పూలమధ్య అలిసిపోయిన వదనంతో, చిరాకుగా ఉండి నిద్రపోవడానికి ప్రయత్నిస్తూ ఫాస్ట్; మసక చీకటి. చిన్నిచిన్ని రూపాలు– నాజూకైన అందాల రూపాలు, అల్ప పరిమాణం కలవి వలయాలుగా ఎగుర్తూ ఉంటాయి)

**ఏరియల్** : (ఏవొలియన్ వీణా విశేషాలు మ్రోగుతుండగా పాట)
ఎక్కడ చూసినా పూలగుత్తులే,
ఆకుపచ్చని మైదానాలపై అలరారే సుమవర్షాలే!
ఎల్లెడలా మంచు తెరల మహత్తులే,
వసంత శోభను స్పృశించిరి వసుధ లోకపు పుత్రులే!

స్వాగతం మీకు! చిన్ని దివ్యాత్మలారా!
మాకు సాయం చేసి మమ్మల్ని ఆశీర్వదించండి!
పాప పుణ్యాలను ఎంచడం మా పని కాదు కదా!
దుఃఖితుడైన మానవునిపై దయజూపి కనికరించండి!

ఈ మానవుడి శిరస్సు చుట్టూ భ్రమిస్తున్న దివ్యాత్మలారా!
దేవదూతల మాదిరి అతని హృదయ స్పందనను వినండి!
దాని తీవ్ర ఉద్వేగాన్ని, భయంకర ఘర్షణను ఉపశమింపచేయండి.
ఆత్మధిక్కారపు అమ్ముల జ్వాలలను అతి సున్నితంగా తొలగించి
అన్ని రకాల భయంకర స్థితులను స్పృశించిన అతని ఆత్మను
ప్రక్షాళన గావించండి.

**రాత్రి మెలకువలు నాలుగు :** ప్రతి భాగాన్ని 'తృప్తి'తో నింపండి! మొదట అతడి శిరస్సును చల్లని, మృదువైన ప్రదేశంలో ఉంచి, అతడిని 'లెథె' నదీ తుషార జలాల్లో స్నానం చేయించండి. బిగుసుకుపోయిన అతడి శరీరం వదులై విముక్తుడవుతాడు. శక్తి పుంజుకుని, నూతనోత్తేజంతో ముందున్న పగటి వెలుగును మీ శక్తులతో అతడిని పవిత్రకాంతిలోకి పరివేష్ఠితం చేయండి.

బృందం : **(అనేక గొంతులు, విడిగా, జంటగా, బృందంగా)**
ఆకుపచ్చని మైదానాల నుండి వీస్తున్న
అత్యంత మనోహర పరిమళం!
పొగమంచు, వాయువీచికల సొబగులు నిండిన
ఆహ్లాదకరమైన సాయం సమయం!

పసిపాపలను జోకొట్టి పరవశంగా నిద్రపుచ్చును.
గుసగుసల సొగసులతో గుండె ఊయలలూగును.
అది అలసి సొలసిన బాటసారుల నయనాలను,
అతి సున్నితంగా తలపుల తలుపులు మూయును.

రాత్రి రాణికి ప్రపంచం దాసోహమగుచున్నది.
తారలను తారలతో పవిత్ర ప్రేమ కలుపుతున్నది;
మిణుకు మిణుకుమనేవి, మిలమిలా మెరిసేవి
దగ్గరలో కనిపించి, దూరాన వెలుగు జిమ్మేవి;

సరోవరపు నీటిలో సమూహమై మెరుస్తూ
స్వచ్ఛమైన నింగిని సగర్వంగా ప్రతిబింబించేవి;
రాకాచంద్రుని రాకను ప్రకటిస్తూ
విశ్రాంతి చిహ్నాలను వినమ్రంగా ప్రతిఫలిస్తున్నాయి.

దూరపు ఘంటికల్లా గంటలు గడచిపోయాయి.
బాధ సుఖాలన్నీ భూతకాలంలో కలిసిపోయి
నూతన దినపు కాంతిని నమ్ముకున్న మేను
తనలోని రుగ్మత తగ్గునని తలపోయును.

ఆకుపచ్చని లోయలు, కొండాకోనలు
దట్టమైన పొదల్తో కమ్ముకున్న నీడలు–
పొలాలన్నీ బంగారపు కంకుల్ని పొదుముకుని
వెండి బంగారపు గనులు, సంపదల వెలుగులు!

లెక్కలేని కోరికలను కోరుకోదలిచావా?
సాయం సంధ్య వాగ్దానాన్ని చక్కగా చవిచూడు!

మృదువైన నిద్రలో ముడుచుకు పరుండి
పై ఊక పొరను వదిలి పునర్జన్మ పొందుము.

ధైర్యంగా ముందుకుపో! తటపటాయించడం
భీరుల లక్షణం! గొప్పగొప్ప కార్యాలు చేయడం,
విజయాన్ని సాధించడం, ప్రమాదాల నెదుర్కోవడం,
ఉన్నతమైన మనోసృజనకే అన్నీ సుసాధ్యం.
**(సూర్యుడు వస్తున్న సూచనగా పెద్దపెద్ద శబ్దాలు వస్తాయి)**

**ఏరియల్** (Ariel)–

ఆ గంటల తుఫాను సవ్వడి గమనించు!
ఆత్మల వీనులున్న మన బోంట్లకు
పగలు జన్మించేప్పటి సంగీతం వినిపిస్తుంది.
విను! శిలా తోరణాలు కంపిస్తున్నవి.
సూర్య రథచక్రాలు భీకరంగా ఉరుముతున్నవి.
చూడు! నిశ్శబ్ద ధ్వనితో వెలుగు నేలను వణికిస్తున్నది!
ఆ ప్రచండ శబ్దాలను ఆ బాకాల కేకలను విను!

అదిరిన కళ్లు, చెదిరిన చెవుల్ని చక్కబెట్టుకో
మాట రాని శబ్దాల్ని భయంతో మూటగట్టుకో!
త్వరగా! చొచ్చుకుపో పూల లోతుల్లోకి,
రాళ్ల సందుల్లోకి, ఆకులలముల మధ్యలోకి!
వనదేవతలు నిశ్శబ్దంగా నిద్రించే చోటుల్లో దాక్కో
లేకుంటే ఆ శబ్దాలకు చెవులు బద్దలై చచ్చిపోగలవు.

**ఫాస్ట్** : జీవన నాడి ఎంత స్వచ్ఛంగా తీవ్రంగా కొట్టుకుంటున్నది!
నేలతల్లీ! గతించిన రాత్రి నిన్నేమీ వణికించలేదు,
నా పాదాల దగ్గర నీ ఊపిరి నిర్మలంగా ఉన్నది.
ఉదయసంధ్యా, నా అభివాదములు నీకు!

నీ పిలుపుతో నా చుట్టూరా నూతన సౌందర్యం
కొత్త ఉత్సాహం, కొత్త నిశ్చయం
అత్యున్నతమైన స్థితిని అందుకోవాలనే తాపత్రయం–
పునర్జన్మించిన ప్రపంచాన్ని ఈ కాంతి చూపిస్తున్నది.

అసంఖ్యాకపు గొంతుల్తో అడవి ఘోషిస్తున్నది.
కొండల్లో లోయల్లో పొగమంచు హాయిలాలికిస్తున్నది.
అయినా స్వర్గలోకపు కాంతి దానిని చొచ్చుకుని పోతున్నది.
తరూశాఖలు, చిగుర్లు విప్పారి వికసిస్తున్నవి.
ఆవిరి అగాధాల్లో దీర్ఘ నిద్ర కరుగుతున్నది.
రంగులు చిక్కనై ప్రస్ఫుటంగా కానవస్తున్నవి.
పూలూ, ఆకులూ తమపై మెరిసే ముత్యాల్ని వణికిస్తున్నవి.
ఓహ్! ఇదే కదా స్వర్గం! వలయీభూత శక్తిస్వరూపం!

వీటిని అవలోకించనీ! ఈ ఆకాశ చుంబిత
శిఖరాలు పవిత్ర ఉదయాన్ని సూచిస్తున్నాయి.
శాశ్వతకాంతిని ప్రప్రథమంగా చవిచూసే భాగ్యం వాటిది.
ఆ తరువాత మనకు కలుగుతుంది ఆ అదృష్టం.
అదిగో ఇప్పుడు ఆ ఆకుపచ్చని కొండవాలులు
అత్యంత సుందరంగా స్పష్టంగా ప్రకాశిస్తున్నాయి.
పగటి కాంతి మెట్లుమెట్లుగా చీకటిని పారద్రోలుతున్నది
చూడు, అడుగో సూర్యుడు ఉదయిస్తున్నాడు- కాని నా నేత్రాలు
ఎందుకో వెలవెలబోతున్నాయి, ఈ అద్భుత దృశ్యాన్ని చూడలేనంటున్నాయి.

ఎప్పుడైతే హృదయపు ఆశ మనం చేరుకోవాల్సిన లక్ష్యం వేపు
ఆలోచనా రహితంగా పయనించాలని ప్రయత్నిస్తున్నపుడు
సంతృప్తిదారులు విశాలంగా తెరచుకున్నపుడు
లోతు తెలియని అగాధాల్నుంచి ఒక అద్భుత జ్వాలాపదార్థం
చటుక్కున పైకుబుకుతుంది;
మనం ఆశ్చర్యంతో నిశ్చేష్టులమౌతాం;
జీవన దీపాన్ని కాంతివంతంగా ఉంచేందుకు తంటాలు పడతాం!
అయ్యో! ఓ అగ్ని సముద్రం మనల్ని స్వాహా చేస్తుంది.
ఏదో ప్రేమ జ్వాల, ఏదో ద్వేషాగ్ని
భగభగ మండుతూ మనల్ని కాల్చివేస్తుంది.
అప్పుడు బాధలూ, సుఖాలు ఒకేరకంగా అనిపిస్తాయి.
ఆ జ్వాల నుంచి దాక్కుంటూ మనం భూమివేపు చూస్తాము.

లజ్జా పూరితమైన యవ్వనపు ముసుగుని కప్పుకుంటాము.
అదే కాని! నేను ఈ సూర్యకిరణాల్నుంచి మొహం తిప్పుకుంటాను.
ఆ రాళ్లను కోస్తున్న విశృంఖల నీటి ప్రవాహం వేపు విభ్రాంతితో చూస్తాను.
శిఖరం నుంచి శిఖరం మీదకు ఆగకుండా నురగల పొగల్తో
వేల వేలరెట్లుగా ప్రవహిస్తున్నదీ నీరు, కాల్వలుగా, ఏర్లుగా!
నీటి తుంపరల అలలు గాలితో కలిసి అలజడి చేస్తున్నవి.
ఈ కల్లోలంలోనే చూడు, అదిగో ఇంద్రధనుస్సు!
క్షణక్షణం మారుతూ, మారనట్లే కనిపిస్తూ మనసు దోచుకుంటున్నది.
అప్పుడే అదృశ్యమై మరల మరల ప్రత్యక్షమవుతున్నది.
ఈ నీటి బిందువుల తెరలెంత శీతలంగా స్పృశిస్తున్నాయి?
ఇక్కడ నేను మానవుని కథను అద్దంలో చూసినట్లు చూస్తాను.
నా మనస్సుకిష్టం వచ్చిన రీతిగా దానిని మలుస్తాను.
అద్దెకు తెచ్చుకున్న కీర్తికాంతి గల మానవ జీవన వెలుగును పరిశీలిస్తాను.

# 2. మహారాజ భవనం - సింహాసనపు గది

**(చక్రవర్తి కోసం ఎదురుచూస్తున్న మంత్రిమండలి బాకాలు మోగుతున్నాయి. రకరకాల దుస్తులలో ఉన్న సకల హోదాల వారు వస్తున్నారు. చక్రవర్తి విచ్చేసి సింహాసనంపై కూర్చున్నాడు. అతడి కుడివేపు జ్యోతిష్కుడు నిలబడి ఉన్నాడు)**

**చక్రవర్తి** : అందరికీ మా మంగళాశాసనాలు!
నా మిత్రులు, విశ్వాసపాత్రులు మీరందరూ!
జ్ఞాని మా కుడిపక్కనే ఉన్నాడు,
కాని, ఏడీ మా విదూషకుడు?

**ఒక సభికుడు** : మీతో పాటు వస్తూ కాలు మెలిక పడిందట
మెట్ల మీంచి మెడ విరిగి పడ్డాడు
ఆ బానపొట్ట వాడిని ఆ మూలగదికి నెట్టారు.
చచ్చేదాక తాగాడో, తాగి తాగి చచ్చాడో ఎవరికి తెలుసు.

**ఇంకో సభికుడు:** అప్పుడే, ఆ క్షణంలోనే, ఆశ్చర్యంగా!
విచ్చేసాడింకో విదూషకుడు వింతగా,
దుస్తులవీ వున్నాయి హుందాగే కానీ,
గుండె జారిపోతుంది చూస్తేనే వాడిని.
తమరి అంగరక్షకులాతడిని అడ్డుకున్నారేమో
అయినా, అదుగో ఆ మూర్ఖుడు వస్తున్నాడిటువేపు!

**మెఫిస్టాఫిలిస్** : **(మోకాళ్లపై వంగి నమస్కరిస్తూ)**
ఆగ్రహించేది, ఆహ్వానించేదీ ఎవరిని?
పారద్రోలేది, కోరుకునేదీ దేనిని?
ప్రతిరోజూ తిడుతూ, పొగిడేది ఎందుకని?
పిలవకుండానే వచ్చి పిలిచిందెవరు?
మీరందరూ ఇష్టపడే అతగాడిదేం పేరు?
మీ సింహాసనాన్ని చేరే ధైర్యమెవరికుంది చెప్పరూ?
ఇక్కడి నుంచి దూరంగా ఎవరు దేన్ని ఆపగలరు?

**చక్రవర్తి** : ఆపు నీ ఉపన్యాసం. అదిప్పుడు అప్రస్తుతం
నా సభాసదుల ప్రశ్నలకే సరిపోదు సమయం

చేతనైతే ఇవ్వాలి సరైన సమాధానం!
నా విదూషకుడి స్థానాన్ని నీవు తీసుకుంటే సంతోషం!
**(మెఫిస్టొఫిలిస్ మెట్లెక్కి చక్రవర్తి ఎడంవేపు నిలబడతాడు)**

**జనంలో గుసగుసలు–**
కొత్త విదూషకుడు – కొత్త సమస్యల పొంగు
ఎక్కడివాడు వీడు? ఎక్కడి నుంచి వచ్చాడు?
పాతవాడు పడ్డాడు – రోగంతో మూలపడ్డాడు.
వాడేమో బాన కడుపు – వీడేమో వెదురుబొంగు.

**చక్రవర్తి** : విశ్వసనీయులైన మిత్రులారా!
దూరతీరాల్నుంచి విచ్చేసారు మీరు
గ్రహాలు, నక్షత్రాలు ఆగ్రహంగా లేవు.
ఈరోజు శుభప్రదమని జోస్యులు చెబ్తున్నారు.
ఇటువంటి సంతోషపు రోజుల్లో
మనం అన్నీ మరిచిపోయి విందూ వినోదాల్లో
మునగాల్సిన ఈ సమయంలో ప్రజల కష్టాలు మనల్ని
పీడించాల్సిందేనా? అయినా మీరు వాటిని
చెప్పడానికి అనుమతిస్తున్నాను, విన్నవించండి!

**మహామంత్రి** : ఆర్యా! తమ శిరస్సు చుట్టూరా ఉండే దివ్యవలయం
దానిలో ఉంటుంది ఓ అద్భుత శక్తీ, సుగుణం!
చక్రవర్తి ఒక్కడే వినియోగించగల వరం.
అదే న్యాయం! It is Known as Justice.
మానవులందరూ ఆశిస్తారు, కోరుకుంటారు దానిని
కాని కోల్పోతారు, దుఃఖిస్తారు, వాపోతారు.
న్యాయాన్ని అందరికి పంచే సమవర్తి మీరు.
జ్ఞానం, హృదయపు మంచితనం, సాయం చేసే ఉద్దేశం
ఇవన్నీ విషజ్వరాలు ప్రవహించే రాజ్యంలో వికసిస్తాయా?
హింస, చెడులు అసంఖ్యాకంగా విస్తరిస్తున్న చోట నివసిస్తాయా?
తమరు ఆ ఉన్నతాసనంపై నుండి తమ సామ్రాజ్యాన్నంతా
పరికించండి! వీక్షించండి! పరిశీలించండి!
ఒక దుస్వప్నం; ఒక భయంకరమైన పీడకల!

భూతప్రేత పిశాచ రాక్షసులు సంచరించే నేల!
అన్యాయమే న్యాయమైన శక్తులు విజృంభించి,
తప్పుడు ధర్మాల్ని న్యాయాల్ని ప్రపంచమంతా ప్రకటిస్తున్న వేళ!

ఒకడు గొర్రెల మందను దొంగిలిస్తాడు,
ఒకడు పక్కింటివాడి భార్యను లేవదీసుకుపోతాడు.
మూడవవాడు దేవాలయపు నిధుల్ని కొల్లగొడతాడు.
అయినా వాడు స్వేచ్ఛగా తిరుగుతూ ఉంటాడు.
వాడిని చట్టమేమీ చేయదు. ప్రాణానికి ఢోకాలేదు.
ముద్దాయిలు, సాక్షులు ఆవరణలో తిరుగుతుంటారు.
తన కుర్చీలోంచి న్యాయాధిపతి చూస్తూనే ఉంటాడు.
తిరుగుబాట్లు, విప్లవాలు పడిలేస్తుంటాయి.
న్యాయం ఈ అలజడిలో సమసిపోవాల్సిందేనా?
నేరస్తుడు రక్షింపబడుతున్నాడు,
నిరపరాధి శిక్షలనుభవిస్తున్నాడు;
సమాజం ముక్కలు చెక్కలై, న్యాయం నశించిపోయింది.
క్రమశిక్షణ లోపించి, గౌరవం అభాసుపాలవుతున్నది.
మనుషులు విశృంఖలంగా ప్రవర్తిస్తుంటే వాళ్లని
సరైన మార్గంలో పెట్టాల్సిన అంతరాత్మలు అణగదొక్కబడ్తున్నాయి.
అంతిమంగా సత్యకాముకులు, సజ్జనులు
పొగడ్తలకు, లంచాలకు లొంగి పతనమౌతున్నారు.
న్యాయాధిపతులు నేరస్తులకు శిక్షవేసే పరిస్థితి లేదు,
చివరకు వాళ్లే నేరస్తులై నిలబడుతున్నారు.

నేను మీకో నల్లని చిత్రాన్ని, భయంకర పరిస్థితులను
విన్నవించానని మీరనుకోవచ్చు, కాని మంచిమాటలు
పదాలు దొరికుంటే, దానికన్నా ఘోరమైన స్థితి బయట!

**(ఆగి)**

మహారాజా! నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం ఇది!
చక్రవర్తి సింహాసనమే కంపించే కాలం వస్తున్నది.
అటువంటి పరిస్థితి రాకుండా జాగ్రత్త పడాల్సిన బాధ్యత మనది.

**సేనాపతి** : ప్రభూ ఇవి బహు గందరగోళపు రోజులు!
ఎవడి ఆయుధాన్ని వాడు నమ్ముకుంటూ, ఆజ్ఞలను లెక్కచేయని భటులు!

చంపడమో, చావడమో మాత్రమే వాళ్లకు తెలిసిన విద్యలు,
ధనవంతుడు నాలుగు గోడల మధ్య దాక్కుంటున్నాడు!
సామంతులు తమ కోట వాకిళ్లలో సాయుధులుగా నిలబడి
సామ్రాజ్యం పతనమైనా తాము బతకగలమంటున్నారు.
వాళ్ల శక్తిసామర్థ్యాలు తిరుగుబాట్లు మనల్ని సందిగ్ధంలో పడవేస్తున్నాయి.
మన సైనికులు సహనం చచ్చి జీతాలు కావాలంటున్నారు.
బాకీలే లేకుంటే వాళ్లెప్పుడో పలాయనం చిత్తగించేవాళ్లు!
వాళ్లేం చేస్తున్నా ఆపే ధైర్యం లేదు;
ఆపితే ఏ కల్లోలం వస్తుందో చెప్పగల వీలూలేదు.
కంచే చేను మేసినట్లు మన సైనికులే ప్రజల్ని దోచుకుంటున్నారు.
చూసీ చూడనట్లు ఊరుకుంటూ మనం చేతులు కట్టుకున్నాము.
సగం ప్రపంచం మన చేతుల్లోంచి జారిపోయింది, మహారాజా!
కొందరు పొరుగు రాజులు మనకింకా స్నేహితులే,
కాని, ఎవ్వరూ మన కష్టాల్లో పాలు పంచుకునేలా లేరు!

**కోశాధికారి** : అటువంటి స్నేహితులుండీ ఏం ప్రయోజనం!
వాళ్లిస్తానన్న సహాయ, సదుపాయాలెక్కడ?
ఎండిపోయిన నీటిగొట్టాల్ని పగలగొడ్తున్నారు వాళ్లు.
అంతేకాదు, ప్రభూ, తమ పాలనలో ఆస్థులేమైనాయో తెలుసా!
అన్యాయ, అక్రమార్జనాపరులు నూతన ధనవంతులై
ఇళ్లూ పొలాలు కొనుక్కుని ఇష్టం వచ్చినట్లు నడుస్తున్నారు.
స్వతంత్రం కావాలని చిందులు తొక్కుతున్నారు.
మేం చేతగానివాళ్లలా చూస్తూ నిలబడి ఉన్నాం!
అన్ని అధికారాలూ, హక్కులూ పోగొట్టుకున్నాం.
ఒకరినొకరు నమ్మే రోజులు కావు
ముందు పొగడుతారు, వాళ్లే తర్వాత తెగడుతారు.
చివరకు ప్రేమైనా, ద్వేషమైనా శీతలమై భరించరానిదే
ఘిబెల్లెన్లు తలవంచారు. గ్వెల్ఫ్‌లు నిష్క్రమించారు,
ఎక్కడో దాక్కుని మొహాలు చాటేసుకున్నారు.
ఎవడి స్వార్థం కొరకు వాడు పనిచేస్తున్నాడిప్పుడు.
స్వర్ణ ద్వారాలు మూసివేయబడినాయి.
ప్రతి ఒక్కరూ బంగారం కోసం నానాపాట్లూ పడ్తున్నారు.
కాని, మన కోశాగారం ఎప్పటిలానే ఖాళీగా ఉన్నది.

**స్టివార్డ్ (Steward):** ప్రభూ! నేను విన్నవించవలసిన విషయాలున్నవి–
ప్రతిరోజూ పాడుతున్నాం పొదుపుమంత్రం
అయినా ఖర్చులు పెరుగుతున్నాయే కాని, తగ్గవేమాత్రం.
సమస్యలధికం, జవాబులల్పం
వంటవారికి కోళ్లూ మేకలకు కరువు లేదు.
అడవిపందులు, లేళ్లు, కుందేళ్లు, జింకలు
బాతులు, పిట్టలూ, జీవాలకు కొరత లేదు.
డబ్బుకు బదులు ప్రజలివి చెల్లిస్తున్నారు.
అందుకని అంతఃపురంలో ఆకలిబాధల్లేవు.
కాని ప్రభూ, మనకు మధువు కొరత మిక్కుటమైంది.
భూగర్భ గదుల్లోని సారాయి పీపాలు ఖాళీ అయినాయి.
ప్రభువులు సేవించే అత్యంత మధురమైన మధువులు లేక
మధు మందిరాలు చిన్నబోనున్నాయి.
నగరపు మధుశాలలు కూడ మూతబడబోతున్నాయి.
డబ్బున్నవాడికి ఏదైనా ఎలాగో దొరుకుతుంది.
విందూ వినోదాల ఖర్చు బల్లలడుగున చేతులు మారుతుంది.
నేను పనివాళ్లకు ఇవ్వాల్సిన పైకానికి
అప్పు ఇచ్చిన యూదుడు పీకపై కత్తిపెట్టి ఉన్నాడు.
రాబోయే కాలానికి కూడా ఇప్పుడే అప్పు చేసాను.
ఇవ్వాళ తింటున్న దానికి రేపును అమ్మేసాను.
జీవాలు చిన్నగా ఉండగానే చంపి తింటున్నాము.
మనం పడుకున్న మంచాల్ని కూడా తాకట్టు పెట్టినాము.
నిజానికి, ఆర్యా, మనం బదలాయింపు చేసిన రొట్టెను తింటున్నాము.

**చక్రవర్తి :** **(కాసేపు ఆలోచించి, మెఫిస్టోఫిలిస్ వంక చూస్తాడు)**
విదూషకా! నీవు చూసిన చీకటి కోణాల గురించి
కూడా చెబుతావా? ఇక నీదే మిగిలింది.

**మెఫిస్టొఫిలిస్ :** లేదు ప్రభూ! ఇంత అద్భుతమైన వెలుగు
ఘనత వహించిన తమనూ, తమ సభాసదుల్ని పరివేష్ఠించి
ఉండగా చీకూ చింతకు, చీకటికి చోటెక్కడిది?
చక్రవర్తి చల్లని పాలనపై సందేహం కూడానా!?

ఎంతటి శత్రువునైనా నిమేషమాత్రాన నిర్వీర్యం
చేయగల మా ప్రభువు శక్తిపై మాకనుమానమా?
సమాజ హితేచ్ఛను బలపరచే తమ అపూర్వజ్ఞానం
వేలాది చేతులు తమ ఆజ్ఞను చేతలుగా చేసే సామర్థ్యం
తారలతో ప్రకాశిస్తున్న ఆకాశం లాంటి
తమపైన దురదృష్టపు నీడలా! అసంభవం!

**జనంలో గుసగుసలు–**

నయవంచకుడు వీడు – పట్టు పరిశ్రమ తెలిసిన వాడు–
లోపలికి చొచ్చుకుపోతున్నాడు – లోగుట్టు తెలుసుకున్నాడు.
ఏదో పెద్ద పనే చేయబోతున్నాడు – ఏమిటో ఊహించగలమా?
నీ ఆలోచన చెప్పు – పెద్ద పథకమే కాబోలు సుమా!

**మెఫిస్టొఫిలిస్** : మనందరి దగ్గర ఏదో ఒకటి లుప్తమైన సంగతి గమనించారా?
అదే! అందరికీ కావాల్సింది! మన దగ్గర లేనిది– మనీ!
డబ్బు చెట్ల మీద కాయదు, నిజమే. కానీ,
జ్ఞానం, నైపుణ్యం, డబ్బును అగాధాల్లోంచి లాక్కొస్తాయి.
భూగర్భంలో బోల్డెంత స్వర్ణముంది, నాణేలూ, కణికలూ
గోడల కింద దాచబడి లేదా గనుల్లో నిక్షిప్తమై–
తెలివిగలవాడు తెలుసుకునిపోయి తెచ్చుకోవాలి.
ప్రకృతి శక్తి, మానవుడి ప్రజ్ఞ కలిస్తే అంతా బంగారమే!

**మహామంత్రి** : ప్రకృతి, ప్రజ్ఞ! ఏమిటా అసందర్భ ప్రలాపాలు!
క్రిస్టియన్ల చెవులకు చేరకూడని ప్రమాదాలు!
ఇంతకంటే తక్కువ మాటలకే హేతువాదుల్ని తగలబెట్టాం!
ప్రకృతి పాపభూయిష్టమైనది, తెలివితేటలు సాతాను మాటలు!
ఆ రెండిటికి మధ్య పెరిగేవి సందేహ ప్రవృత్తులు.
ప్రకృతి, ప్రజ్ఞల రాక్షస శయ్యలో ప్రభవించినవాటిని పారద్రోలాలి!
చక్రవర్తికి సంక్రమించిన ఈ నేల ఎంతో ప్రాచీనమైనది.
ప్రభు కిరీటాన్ని సంరక్షించే బాధ్యత ఇరువురిపై ఉన్నది.
–దేవుని సేవకులు, శౌర్య ప్రతాపవంతులైన సామంతులు,
ఎటువంటి ఉత్పాతాన్నైనా తట్టుకోగలిగిన ధీమంతులు.
వారికి దొరికే ప్రతిఫలం ఒకరికి చర్చి, మరొకరికి రాజ్యం.

ఇవి అర్థం కాని చిల్లర మనసుల్లో
ప్రవేశించి పలుకుతుంది తిరుగుబాటు తత్త్వం.
అటువంటివాళ్లు దైవద్రోహులు, మంత్రగాళ్లు
వాళ్లవల్లే కలుగుతుంది సామ్రాజ్య సంక్షోభం.
ఓయీ మూర్ఖుడా! నీ పనికిరాని విద్యలు, మాయల్ని
వాటిని ప్రభువు ముందు ప్రవేశపెట్ట సాహసించకు!
పాపంతో కలతబడ్డ నీలాంటి వాళ్ల మనసుల్లోకి
అవి అతి తేలికగా ప్రవేశించి ప్రభావితం చేస్తాయి.
అటువంటి కల్మష హృదయాలను మేము విశ్వసించబోము.

**మెఫిస్టాఫిలిస్** : ఒక అద్భుత ప్రజ్ఞాశాలి సంభాషణ నేను గమనించాను.
మన చేతులకందనివి మనకెంతో దూరంగా ఉన్నట్లు అనిపిస్తాయి.
మనస్సు గుర్తించనిది, గుణించలేనిది మీ దృష్టిలో
లేనిదానితో సమానమే! బరువు తూచని
వస్తువు బరువు ఎలా పేర్కొనగలుగుతాం?
నాణెం నీకు దొరికితేనే గదా, నాణ్యత చెప్పగలిగేది!

**చక్రవర్తి** : మన చిక్కుల్ని ఈ వృధా లెక్కలు తీర్చలేవు.
ఊకదంపుడు కబుర్లతో రూకలు పుట్టబోవు;
ఈ అంతులేని వాగ్వాదాలతో పుడ్తోంది నాకు విసుగు.
మనకు డబ్బు కావాలి, అంతే, అదే కదా లొసుగు!

**మెఫిస్టాఫిలిస్** : మీకు కావాల్సింత తెస్తాను, కావాలంటే ఎక్కువే!
దారి సులభమైందే కాని, పని కాస్త కష్టమైనదే!
బంగారమున్న మాట వాస్తవం, ఎక్కడుందో ఎలా కనుక్కోవడం?
జ్ఞాపకం తెచ్చుకోండి! ఆ భీభత్సపు రోజుల్లో
మానవ వరద ఈ రాజ్యాన్ని దట్టంగా కమ్మినపుడు
ఎందరో, అక్కడా, ఇక్కడా, ప్రాణభయంతో,
తాము ప్రాణప్రదంగా చూసుకున్న సంపదల్ని దాచారు కదా!
అది ఆనాటి పద్ధతి, ఎన్నాళ్లయిందో మీకు తెలవదు!
రోమన్ల కాలంలో ఏమయ్యిందో గుర్తులేదా?
ఆ సంపదలన్నీ మన ప్రభువు రాజ్యంలోనే వున్నాయి.
గుప్త నిధులన్నీ దొరికినప్పుడు చక్రవర్తికే చెందుతాయి.

**కోశాధికారి** : ఎన్నాళ్లకెన్నాళ్లకు, విదూషకుడి నోట విలువైన మాట!
భూగర్భ సంపదలన్నీ చక్రవర్తి స్వంతమే, లేదెవ్వరి వాటా!

**మహామంత్రి** : మీ అందరినీ బంగారు ఉచ్చులతో పట్టుకుంటాడు సాతాను,
ఈ ఆలోచన అసహజం, అనైతికం అంటాను నేను!

**స్టివార్డ్** : ప్రభువుకు సభికులకు ఇవ్వగలిగితే సరైన విందు,
ఆమాత్రం పాపిని కావడానికి సంకోచించను నేను ముందు!

**సేనాధిపతి** : మూర్ఖుడైనా, ఈ విదూషకుడికి తెలుసు మన అవసరం,
అతడి పద్ధతుల గురించి సైనికులకు లేదే అభ్యంతరం!

**మెఫిస్టొఫిలిస్** : బహుశా మీరు నన్ను నమ్మలేకున్నారనుకుంటా!
అన్నీ తెలిసిన జ్ఞాని, ఈ జ్యోతిష్కుడిని అడుగుదామంటా!
దిక్చక్రపు గదుల్నితడు దీక్షతో వీక్షించి
దివ్య వార్తలతో, శుభ ఘడియల్లో దిశానిర్దేశం చేయగలడు

**జనంలో గుసగుసలు–**

ఇద్దరు మోసగాళ్లు – సింహాసనానికి ఇరుపక్కలా;
కలలుగానే వాడొకడు, మూర్ఖుడు మరొహడు.
ఇద్దరూ కలిసి పలుకుతున్నారొకే మాట ఈరోజు,
తెలివిగా ఒహడు మాట్లాడ్తుంటే మూర్ఖుడు అందిస్తుంటాడు.

**జ్యోతిష్కుడు** : **(మెఫిస్టొఫిలిస్ అందిస్తుంటాడు)**
స్వచ్ఛమైన స్వర్ణరూపం, ఆ మెరిసే సూర్యబింబం
దేవదూత మెర్క్యురీ మనందరికీ అనుకూలం
అందరినీ సమ్మోహపరిచే వీనస్ ఉభయ సంధ్యల్లో ఉద్దీపం!
నీతిమంతుడైన చంద్రుడికి నిలకడలేని రూపం,
మార్స్ ఎర్రగ మండుతూ కావిస్తాడు యుద్ధభీభత్సం.
జూపిటర్ మాత్రం స్థిరమైన కాంతిదీపం,
శాటరన్ గొప్పవాడే గాని, బహుదూరం, అల్ప పరిమాణం.
అతడివల్ల లోహంగా మనకేమంత లేదు ఉపయోగం.
కాని అతడు బహుభారం, బేస్‌గా ఉండాల్సిన యోగం
సూర్య చంద్రులు కలిస్తే స్వర్ణరజత సంయోగం

ఈ ప్రపంచమంతా మంచి వాతావరణ భాగ్యం
అవి రెండూ ఉంటే మిగతావి కొనడమేమి కష్టం?
భవనాలు, తోటలు, అంగీలు, సుందరాంగులు
అవన్నీ మన ఈ మేధావి సమకూర్చగల హంగులు
ఎవరూ ప్రయత్నించని చోట ఇతడిదే విజయపు పొంగులు!

**చక్రవర్తి** : ఈ తరహా ప్రసంగం ఇప్పటికే విన్నాం రెండుసార్లు,
పనికిరాని చెత్త, మీరేమంటారు సభాసదులు!

**జనంలో గుసగుసలు –**

ఏవిటీ కోతలు – పాతకాలపు రోతలు;
అంతా ఒక రొచ్చు – రసవాదపు చిచ్చు
జ్యోతిష్కుల మాటలు – దురాశకు బాటలు
వాళ్లకిది మామూలే – మోసగాళ్ల తీరేలే!

**మెఫిస్టాఫిలిస్** : పిచ్చి వెధవలు – నోరెళ్లబెట్టుకు చూస్తున్నారు!
నా పరిశోధనలనే తప్పుబడ్తున్నారు.
మాండ్రేక్ వేళ్లకు, నల్లకుక్క కాళ్లకు భయపడతారు.
మంత్ర తంత్రాలంటే కష్టం, మాయలంటే అయిష్టం.
గట్టిగా అడుగేసామనుకుని గబుక్కున జారి పడ్తారు.
టక్కుటమారాలతో డబ్బు సంపాదించవచ్చు ఇలా
అనుకోగానే వాళ్ల పాదాల్లో పుడ్తుంది ఓ రకమైన జిల.

కాలరహితమైన ప్రకృతి అనంతశక్తిని
మార్మికమైన ప్రభావాన్ని, నిగూఢ సంపదలను
నీవెప్పుడైనా స్పృశించి స్పందించినావా!
ఆమె గాఢ కౌగిలిని, దీర్ఘ చుంబనాన్ని అనుభవించావా?
నీ కాళ్లూ చేతులూ దానికై తహతహ లాడ్తున్నపుడు
ఆ వింత పరిమళాల్ని నీవు ఆఘ్రాణిస్తావు–
పదండి! తవ్వండి! భూమిలోలోతుల్లోకి పయనించండి!
స్వర్ణ నిధులన్నీ వేచి చూస్తున్నాయి మీకోసం! కదలండి!

**జనంలో గుసగుసలు–**

నా పాదం చచ్చుబడింది – కదిలేట్లు లేదు–

నా హస్తం సీసంలా బరువెక్కింది - కీళ్లవాతం కాబోలు-
నా బొటనవేలు దురదపెడ్తోంది - గౌట్ కావచ్చు-
నడుమంతా ఒహటే నెప్పి - ఇవే కనక భూగర్భ నిధుల
జాడల్ని తెలిపితే, ఈ నేలనిండా వెండి బంగారం కొండలే!

**చక్రవర్తి** : మరెందుకాలస్యం! తప్పించుకోవీల్లేదీసారి!
నీ మాటల్లో జారిన ఆ నిధులుండే చోటేది?
నా ఖడ్గం, రాజదండం నేలపై ఉంచి
ఈ రాచహస్తాలతో తవ్వుతా భూమిని.
నీ మాట అబద్ధమని తేలిందా తిన్నగా నరకానికి నడిపిస్తా!

**మెఫిస్టొఫిలిస్** : **(నరకానికి దారి నీకన్నా నాకు బాగా తెలుసులే)**
ఎక్కడబడితే అక్కడ ఉన్నాయిా నిధులూ నిక్షేపాలూ!
యజమాని కోసమవి ఎదురుచూస్తున్నాయి.
నాగేటి చాల్లో దొరుకుతుంది రైతుకు
లంకెల బిందెల్లోన లక్ష్మీకటాక్షం.
సున్నపు గోడలు గోకిన సుతారి మేస్త్రీకి
ఇటుకల మధ్యన బొరియలో ఇంతలేసి బంగారం!
తవ్వుకున్నవాడికి తవ్వినంత స్వర్ణం.
గోతుల్లో, మాళిగల్లో, రాజ్యపు శిథిలాల్లో
కూలిన కట్టడాల్లో, సమాధుల దిబ్బల్లో
స్వర్ణపాత్రలు, ఆభరణాలు, వెలకట్టలేని వస్తువులు
వరుసలుగా పేర్చబడి పలుకుతాయి ఆహ్వానం
కెంపులు పొదిగిన మధుపాత్రలు కంటికింపుగా ఉండి
ఆనాటి మధువింకా వాటిలో దాగి ఉంది.
సారాయి పీపాల కొయ్యంతా మాయమైనా
గడ్డకట్టిన మధువు గట్టిగా పొరకాగా
దానిలో నిలవవున్నదా మధురమైన ద్రాక్షసారా!
బంగారం, మణులంత విలువైనదా మధువు
చీకటి పరదా వెనుక చిక్కుకున్న అద్భుతాలు
జ్ఞాని చెప్పిన మాటలు చిరకాలపు సత్యాలు.
ఎక్కువ వెలుగెపుడూ పరిశోధనకడ్డం,
పగలు కన్న రాత్రెపుడూ చోద్యాలకు సిద్ధం!

**చక్రవర్తి** : చీకటి వద్దు, చోద్యాలూ వద్దు,
పగటి వెలుగులో ప్రత్యక్షమైతే ముద్దు!
అర్ధరాత్రి చీకటి అనుకూలం దొంగలకు,
ఆవులూ, పిల్లులూ అంధకారంలో నలుపే
లంకెల బిందెలు దొరికేదే వాగులో వంకలో,
నీవే నాగలి పట్టి వెలికిదీస్తే అందరికీ మెరుగే!

**మెఫిస్టాఫిలిస్** : తమరే పలుగూ పారా బట్టి తవ్వాలి మహరాజా!
అటువంటి శ్రమ వల్ల తమకందుతుంది గౌరవం!
నడుస్తాయి నాగేటి చాల్లో బంగారు నందులు
తమరు తమ ప్రియురాళ్లు తమకంతో పులకించగ!
రత్నమణిమయ ఆభరణాలు రంగులై నర్తించ
మహరాజ ఠీవికి మహా సౌందర్యం తోడగును గొప్పగా!

**చక్రవర్తి** : ఇంకేమిటి ఆలస్యం! ఎంతసేపిలా వేచి ఉండడం!

**జోతిష్కుడు** : **(మెఫిస్టాఫిలిస్ మాటలు అందిస్తుంటాడు)**
నా విన్నపాన్ని ఆలకించండి, మహాప్రభూ!
బ్రహ్మాండమైన విందు అయ్యేంత వరకు ఓపిక పట్టండి
పద్ధతిలో చేస్తేనే పసిడి రహస్యం తెలుస్తుంది.
ఓపికతో ఉంటేనే ఓషధులు దక్కేది.
నేల మనల్ని మోహపుచ్చేముందే స్వర్గాన్ని సంతోషపెడ్దాం!
మంచి పనులు చేసేవాళ్లని మంచిగా ఆనందింపచేద్దాం!
సుఖాభిలాషులు కళ్లేలు వేస్తారు తమ గుర్రాలకు
మంచి మధువు కావాలంటే పండు ద్రాక్షలపై నడవాలి,
అద్భుతాలను ఆరగించే ముందు నమ్మకాన్ని పాదుకోవాలి!

**చక్రవర్తి** : కానివ్వండి, విందులూ వినోదాలు, అట్టహాసంగా,
రేపు బుధవారం, అందరం కలుద్దాం ఆనందంగా!
**(మంగళవాయిద్యాల మధ్య చక్రవర్తి నిష్క్రమణం)**

**మెఫిస్టాఫిలిస్** : తెలివి, అదృష్టం ఒకటవడం తెలవదీ మూర్ఖులకు,
పరశువేది దొరికినా, రాయిని పట్టుకుని, జ్ఞానిని వదిలేస్తారు.

# 3. కార్నివాల్
## (The Carnival Masque)

**(విశాలమైన ఆవరణ, ఆడంబరంగా అలంకరించబడిన గదులు)**

**ప్రతీహారి** : మనం జర్మన్ నేలపై ఉన్న విషయాన్ని మరచిపొండి!
(హెరాల్డ్) మరచిపొండి దెయ్యాల, మూర్ఖుల మృత్యు నృత్యాన్ని;
మన ఆనందాన్ని ఇవేమీ అడ్డుపరచలేవిప్పుడు!
ఘనతవహించిన మన చక్రవర్తి
ఆల్ఫైన్ శిఖరాలను దాటి రోమ్ సామ్రాజ్యాన్నాక్రమించుకుని
తనకు మనకూ పేరు ప్రతిష్ఠలు తెచ్చిన సంగతి గుర్తుతెచ్చుకోండి!

పవిత్ర ప్రభు పాదపీఠం వద్ద వినమ్రుడై
మన చక్రవర్తి పరిపాలించే అధికారాన్ని పొందినాడు.
కిరీటం కావాలని అడగడానికి వెళ్లిన మహరాజు
కిరీటంతోపాటు ఈ ముసుగు మాస్కులనూ తెచ్చాడు.
మనందరం ఈ మనోల్లాస ప్రదర్శనలో పునర్జన్మలెత్తుదాం!

ప్రపంచాన్ని చూసిన మనందరం మన ముఖాలపై
ఈ ముసుగుల్ని చెవులు మునిగేలా తొడుగుదాం!
పైకి హాస్యగాడిలా వింత చేష్టలు చేసినా
లోన మనందరం ఒకలాంటి వాళ్లమే కదా!

అదుగో! వాళ్లు గుంపులు గుంపులుగా కలుస్తున్నారు.
గుంభనగా గుసగుసలాడుతూ విడిపోతున్నారు.
బృందాలుగా కలుస్తున్నారు, ముచ్చటలాడుతున్నారు.
లోనికి బయటకూ, బయటకు లోనికీ కదిలిపోతున్నారు.
ఇక్కడ మనకు తెలిసిందే మరలా తెలుసుకుంటాం
వేలాది మాయలూ, విడ్డూరాలూ ఉన్నా ఈ ప్రపంచం,
అప్పుడూ ఇప్పుడూ వదల్లేదు తన మూర్ఖత్వం!

**పుష్పలావికలు–** (గానం చేస్తూంటారు, మాండోలిన్‌లు, వాయిస్తూ)
Siamo belle Florentine
అందమైన వస్త్రాభరణాలు అలంకరించుకున్నాం

జర్మన్ రాజసభా సంప్రదాయాల కనుగుణంగా
రాణివాసపు స్త్రీలుగా రమణీయంగా విచ్చేసాం.

మా నల్లని వంకీల శిరోజాలపై
ధరించాము ఎన్నో రంగుల పూలను;
సిల్కు దారాలు, మెరిసే పొరలతో
చేశాము వాటిని మరింత ప్రకాశవంతంగా!

వాటి తయారీలో ప్రత్యేక నైపుణ్యమున్నది,
అందరూ మెచ్చుకున్నదే ఆ విశేషం!
కృత్రిమంగా అందాలు విరజిమ్మినా,
ఏడాది పొడుగూన తరగని లావణ్యం!

ఎన్నెన్నో రంగులు, చిన్నిచిన్ని హంగులు
చక్కని పొందిక గల పూలదండ పొంగులు
దేనికదే ప్రత్యేకం అని అనిపించినా,
అన్నీ కలిసివున్నప్పటి అందమే అపురూపం అవునా!

Siamo belle giardiniere:
మగవాళ్లకు మేం వ్యతిరేకం కాదు
ప్రతి స్త్రీ హృదయంలోనూ
ప్రకృతి పొదిగిన కళలకు కొదవలేదు.

**ప్రతీహారి** : తలలపై, చేతుల్లో తళుకులీనే బుట్టలు,
మీ హొయలకు దీటైన రంగురంగు బట్టలు;
మీ సరుకుల్ని చూపించండి వీలైనంత త్వరగా,
ఎవరికి నచ్చినది వాళ్లు ఎంచుకోనివ్వండి హాయిగా;
చక్కని పొదరిళ్లు చిక్కని దారులున్న
అందమైన పూలవనం అందరికీ అందనీ,
పూలకన్నెలు తమ సొబగులు, సరుకులతో
స్వర్గలోక వనాన్ని సాక్షాత్కరింపజేయనీ!

**పుష్పలావికలు** : అమ్ముదాం సరుకుల్ని ఈ అందమైన ప్రదేశంలో,
బేరసారాలకు చోటే ఇవ్వొద్దు ఇలాంటి సమయంలో!
కొనేవాళ్లకు చెబుదాం ఖచ్చితంగా ఈ విషయం,
వాళ్లకమ్మేదాని విలువ, అంతేనని పలుకుదాం!

**పండ్లతో ఉన్న ఆలివ్ శాఖ–**

పండ్లకు పూలకు మధ్య శత్రుత్వంలేదు;
ఎటువంటి అసూయ నాలో చోటు చేసుకోదు,
అది నా జీవన పద్ధతి కానేకాదు.
దేశాల, రాజ్యాల శక్తిని నేను.
శాంతికి చిహ్నాన్ని, ఈ సంవత్సర ఫలితాల్లో
నేను బహుమతిని ఆకాంక్షిస్తున్నాను.

**పసిడి మొక్కజొన్న కంకుల దండ–**

నేలతల్లి పంపిన బహుమతులం మేము.
మీ నగల్లో కలుపుకోండి తక్షణం.
ప్రతిరోజూ తపించేది,
మురిపించే ఆభరణం.

**అద్భుతమైన పూలహారం–**

నాచు పట్టిన నేలపై నుంచి,
విరుస్తున్నాయి ఎన్నో వర్ణాల మొక్కలు.
మేం అలంకరణ రూపాల స్వంత శైలులం,
ప్రకృతిలో అరుదుగా కనిపించే మార్మిక హొయలులం!

**ఊహాతీతమైన పూలగుత్తి–**

నాకు పేరులేదు; నేను థియోఫ్రాస్టస్ జాబితాలో లేను,
అయినా నేను మిమ్మల్ని, లేదా మీలో కొందరిని మెప్పించగలను.
ఎవరు నన్ను మీ తలలో ప్రేమగా ముడుచుకోగలరు,
తమ ఎదపై ఉంచుకుని నాకింత విశ్రాంతి నివ్వగలరు?

**గులాబి మొగ్గల సవాల్–**

వింత వింత పోకడలు, తటిల్లతల కాంతులు
ప్రకృతి కోరుకోని, విడ్డూరపు భ్రాంతులు
ఆకుపచ్చని కాడలు, బంగారు పాత్రలు
ఆ శిరోజాల విరిసే చూడదగిన వింతలు

మేం స్వచ్ఛమైన నాణ్యమైన గులాబి మొగ్గలం
ఎదకూ, మనసుకూ, నేత్రాలకు సంతృప్తినివ్వడం మా వాగ్దానం!

**(ఆకుల అరల్లో, పుష్పలావికలు, తమ సరుకుల్ని అందంగా అమరుస్తారు.)**

**తోటమాలులు :** **(వేణుగానం చేస్తూ)**

మిలమిలా మెరుస్తున్న మీ తలలపై పుష్పాలు
క్షణక్షణానికి కురుస్తున్నవి అతిలోక అందాలు
తళతళా మెరుస్తూన్న ఆ మధుర ఫలాలు
అతి మనోహరమైన రుచుల సమ్మిళితాలు.
ఎండలో మాగిన శ్రామికులం మేము
ఛెర్రీలు, ప్లమ్స్, పీచ్‌లు అమ్ముతున్నాము.
కొనండి, తినండి, ఆస్వాదించండి,
కనులు కనలేని రుచుల్ని జిహ్వ కనుగొననీయండి!
ఇదిగో ఇది మధుర ఫలం,
రుచి చూసి చెప్పండి, ఎంత తీయని పండని!
గులాబి గురించి చెప్పవచ్చు కవిత్వం.
ప్రశస్తమైన ఏపిల్ రుచి, పళ్లకు, నాలుకకే తెలుసు మరి!
మీ ముచ్చటైన కష్టాలలో మేము తోడుంటాము,
పంచుకునే యవ్వనమే ప్రపంచపు ధనము.
మా మంచి సరుకుల్ని మేమూ ప్రదర్శిస్తాము,
చక్కటి పొరుగువాళ్లలా చనువుగా ఉంటాము.
పొదరిళ్లు నెలవులై, పూలదండలు వలలై,
గూడులన్ని గుంపుగా గుసగుసల బాసలై,
అన్నీ ఒక్కచోట కూడుకున్న రీతులు,
మొగ్గలు, రేకలు, పూలూ ఫలాల గీతులు!

**(ఒకరి తరువాత ఒకరు పాడుతూ గిటారు, వేణువులపై సంగీతం వినిపిస్తూ తమతమ వస్తువుల్ని ఒకదానిపై అమరుస్తుంటారు. ఒక తల్లీబిడ్డా ప్రవేశం)**

**తల్లి :** నీవింకా పసికూనగా ఉన్నప్పుడే
అమ్మాయీ! నీకు పరికిణీ తొడిగా!
ముద్దులొలికే మోము, నీ సౌష్ఠవం
ఆనాడే అందరూ మెచ్చిన లావణ్యం–
నేనప్పుడనుకున్నా రాగానే నీకు తగిన ఈడు
ఏ ధనవంతుని కుమారుడో రాజకుమారుడో నీకు జోడు–
అదే ఆశతో ఇంకా బతుకుతున్నా–
గడచిపోయాయట్లాగే ఎన్నో ఏళ్లు
అన్నీ వృధా ప్రయత్నాలు, అనవసరపు ప్రయాసలు

వరులు వచ్చారు, తరలిపోయారు.
ఒక్కరూ నీకోసం వేచి ఉండలేదు–
ఆడావు, పాడావు, కలిసి మెలిసి కదిలావు.
నీ ప్రయత్నాలు నీవు చేసావు
గీకావు, గోకావు నీ మనసులో మాట చెప్పావు–
ఇన్ని ప్రయత్నాలు ఎందుకు ఫలించలేదో
మనకెప్పటికీ అర్థమయ్యేలా లేదు–
చేసిన ప్రయత్నాలన్నీ చెరిగిపోయాయి.
అడవి గాచిన వెన్నెలలా కరిగిపోయాయి.
కాని, ఇటువంటి ఉన్మత్త రాత్రిలో
కాస్త నీ కాళ్లు వదులు చేసుకో–
ఖచ్చితంగా, ఒక ప్రేమికుడు నీ కాళ్లపై పడతాడు.

**(ఎందరో అందమైన ఆడపిల్లలు వాళ్లతో కలిసి నర్తిస్తారు. గుసగుసలాడుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు.**

**జాలరులు, పిట్టల వేటగాళ్లు వలలు, గాలపు కర్రలు, ఒడిసెలలు, నిమ్మ ఆకులు లాంటివి పట్టుకుని ఆడపిల్లలతో కలిసి మాట్లాడ్తున్నారు. ఒకరితో ఒకరు మాట్లాడుకుంటుంటే పసందైన సంభాషణలతో ఘట్టం రసవత్తరంగా సాగుతుంది. ఒకరినొకరు కవ్వించుకుంటూ వాళ్లు దొరికీ దొరకకుండా తిరుగుతున్నారు.)**

**కట్టెలు నరికేవాళ్లు : (మొరటుగా ప్రవేశించి)–**
దారి తొలగండి! తప్పుకోండి!
మాకింత జాగా కావాలి, ఒప్పుకోండి!
కలప నేలకూలుతుంది కఠినంగా!
మేం మోసే బరువులకు,
నేల కూడ అదురుతుంది.
మీరర్థం చేసుకోవాలి
మాకు పేరు ప్రతిష్ఠ కావాలని.
ఈ కష్టించే చేతులే లేకపోతే
ఉన్నతులలో ఉన్నతులుండేదెక్కడ?
ఈ చెమటోడ్చే దేహాలే లేకుంటే
వాళ్ల వదనాల్లో వెలుగులే లేవంటా!

**పంచినెల్లాస్ (Punchinellos - హావభావాలు ప్రదర్శిస్తూ)–**

తెలివితక్కువ వాజమ్మలు
వంగిన నడుముతో పుట్టారు!
అధిక తెలివిగలవాళ్లం మేం,
అందుకే పని అంటే తప్పుకుంటాం!
నెత్తిమీద టోపీలు
ముతక ముష్టి వస్త్రాలు
మాకిష్టమైన రీతిలో
తిరుగుతాము జులాయిగా,
వీధుల్లో కూడళ్లలో, గుంపులో, మందిలో
హుషారుగా ఉంటాం, హాయిగా ఆడతాం!
నిక్కినిక్కి చూస్తూ నిలబడి ఉంటాం!
కేకలు అరుపుల్తో చెలరేగి పోతాం!
ఈల్ చేపల్లా జారిపోతుంటాం
గుంపు మధ్య చేరి గోల చేస్తుంటాం!
ఇటువంటి రాత్రిళ్లలో జాగారం చేస్తాం
మీరు పొగిడినా తిట్టినా మా నృత్యాలను ఆపబోం!

**పారసైట్లు (పరాన్న జీవులు –త్వరత్వరగా వస్తూ)**

కట్టెలు కొట్టేవాళ్లు
కోతలు కోసేవాళ్లు
బొగ్గును కాల్చేవాళ్లు
మీరే మా నాయకులు!
మా పాదాభివందనాలు,
ఇవి మా స్తోత్ర గీతాలు
మిమ్మల్ని పొగిడే కావ్యాలు.
మీ మనసులో ఊహల్ని
పదాలలో పలికే వాక్యాలు!
(మాకివి స్వర్గం నుంచి అందిన అంతులేని సంపదలు)
దుంగలే లేకుంటే బొగ్గెక్కడిది?
బొగ్గే లేకుంటే వేడుండే చోటేది?
అదుగో నెగళ్లు ప్రజ్వలిస్తున్నాయి,

వేడి నెమ్మదిగా విస్తరిస్తున్నది.
ఆహారం అన్ని రుచులతో
వేల్చబడి సిద్ధమవుతున్నది.
వివిధ మాంసాలు, చేపలు
బల్లపైకి వస్తున్నాయి.
తిన్నవాడికి తిన్నంత, పొట్టలు పగిలేంత,
పళ్లేలకు పళ్లేలు ఖాళీలవుతున్నాయి.

**తాగుబోతు** : **(ఆనందంగా)**
మళ్లీ వచ్చాయి మంచిరోజులు,
మాకు అడ్డుపడరే మహరాజులూ!
నేనేం తీసుకువచ్చానో చూడండి,
అంతుచిక్కని ఆనందాన్ని, అందమైన గీతాన్ని.

అందుకే తాగుతున్నాను, తాగుతూ వాగుతున్నాను;
రండి! తాగండి! రంజుగా పాడండి!
ఇదుగో వెనక నిలబడ్డాయనా! ముందుకురా నాయనా!
మోచేతులు పైకెత్తు! ఛీర్స్ చెప్పి జైకొట్టు!

మా ఆవిడ నన్ను చీదరించుకుంటుంది.
ఈ గుడ్డల్ని చూసి మిడిగుడ్లు పెడ్తుంది.
నా చేష్టలామెకు నవ్వు తెప్పించవు
నన్నొక పనికిరాని వెధవగా పరిగణిస్తుంది.
అందుకే తాగుతున్నాను! తాగుతూ వాగుతున్నాను.
రండి! తాగండి! రంజుగా పాడండి!
ఆనందమంటే ఇదేనండి! హాయిగా తూగండి!
గ్లాసుల్ని నింపుకోండి! డాన్సుల్ని చేయరండి!

దారితప్పి వచ్చాననుకుంటా! అదే నిజమైతే
భలే చోటుకు వచ్చానురా దేవుడా!
ఇవన్నీ ఉచితంగా ఇస్తున్న అతడికి కృతజ్ఞతలు
అతడు కాకుంటే వాళ్లావిడకు, అతడి ప్రియురాలికి!
అంచేత, నేను తాగుతున్నాను, తాగుతూ వాగుతున్నాను.
రండి! మజాగా తాగండి! రంజుగా పాడండి!

నీ ఆరోగ్యానికిది! నీ ఆనందానికిది!
ఇప్పుడు మనందరం తాగుబోతులమే! అదే నే చెప్పేది!

ఎక్కడైనా  ఇటువంటి విందులు,
ఇలాగే సందడిగా కనువిందులు,
నేను పడుకున్న చోటే పడుకోనివ్వండి!
నిలబడలేను నేనింక, సోలిపోనివ్వండి!

**బృందగానం** : సోదరులారా! తాగండి! తాగండి!
తాగుతూ అందరికీ సంతోషం కోరుకోండి!
అప్పుడే ఒకడు నేలపైకి దొర్లినాడు
మరింతమంది పడేలోపు మీ సీట్లలో కూర్చోండి!

**(ప్రతీహారి రకరకాల కవుల గురించి వ్యాఖ్యానం చేసినాడు– సహజ కవులు, ఆస్థాన కవులు, గాయక కవులు, కవిగాయకులు, వాళ్లంతా తమ కవిత్వం వినిపించబోయినా ఆ గందరగోళంలో ఎవరి గొంతూ వినబడదు. ఒక్కతడు మాత్రం తన వంతు ప్రయత్నం గట్టిగా చేసాడు)**

**హాస్యకవి** : నా కవి హృదయానికి స్వాంతన,
లభిస్తుంది ప్రకటిస్తే సంవేదన!
ఎవరూ వినాలని కోరుకోని భావనను
నేను రాస్తాను, పలుకుతాను, పాడతాను!

**(రాత్రి కవులు, సమాధి కవులు తమ క్షమాపణలు కోరుతున్నారు. తామిక్కడ ఇప్పుడే బతికిన వాంపైర్‌తో మంచి రసకందాయమైన సంభాషణలో ఉండటం వల్ల రాలేకపోతున్నామని తెలుపుతున్నారు. దాని వలన కొత్త కవిత్వ ధోరణి వెల్లివిరుస్తుందని వారి అభిప్రాయం**

**ప్రతీహారి వారిని క్షమించమని కోరినాడు. ఇప్పుడు గ్రీకు ఇతిహాసం మన కళ్లెదుట సాక్షాత్కరించనున్నది వాళ్లు నవీన దుస్తులలో ఉన్నా మనల్ని మరింత సమ్మోహన పరచనున్నారు).**

## The Graces (గ్రేసెస్)

**అగ్లాయియా (Aglaia)-**

హుందాగా జీవితం గడపాలనుకుంటే
మీరిచ్చే ప్రతిదాంట్లో హుందాతనముండాలి ఎల్లప్పుడూ!

**హెజెమొని (Hegemone)-**

తీయని కోరిక తీరినప్పుడు
హుందాగా స్వీకరించడం ఒక నేర్పుగల చప్పుడు!

**యుఫ్రొసిని (Euphrosyne)-**

ప్రశాంత సుఖ జీవనాల్నుంచి
హుందాగా కృతజ్ఞతలు చెప్పడం నేర్చుకోవాలెప్పుడూ!

## The Fates (ఫేట్స్)

**ఎట్రొపాస్ (Atropos)-**

అందరికంటె పెద్దదాన్ని,
అందంగా నేస్తాను జీవన దారాన్ని!
ఎన్నో అర్థాలున్న ఈ పనిని
ఆలోచించే తీరిక లేని వ్యవహారాన్ని!

అతి సున్నితమైన ముడిపింజ పత్తిని,
మృదువుగా, ప్రశస్తంగా ఉన్న దానిని,
మరింత సన్నగా సమంగా చేయగలనని,
అప్పగించారు నాకు ఈ గొప్ప పని!

కాని, గుర్తుంచుకో! ఎంత గొప్పగా నర్తించినా,
ఎన్ని సౌఖ్యాలు, ఆనందాలు అనుభవించినా,
ఈ దారం తెగేంత వరకే ప్రయాణం,
అక్కడతో ముగుస్తుంది ఆయుః ప్రమాణం!

**క్లొతో (Clotho)-**

ఈ మధ్యకాలంలో మారింది కాలం
కత్తెరను పట్టుకున్నవి నా హస్తద్వయం
అనాదిగా ఉన్నదదే కత్తెర!
అసంతృప్తిగా ఉన్నపుడు పడుతుంది తత్తర!

పనికిరాని జీవితాలు కథను లాగుతుంటాయి,
వెలుగు ఊపిరితో ఊగిసలాడ్తుంటాయి,
యవ్వనపు వేడి, కీర్తికాంక్షలు
మృత్యుదంష్ట్రలలో ముగిసిపోతుంటాయి.

నేను కూడా; చెబుతున్నాను విను,
నా రోజుల్లో చేసాను ఎన్నో తప్పులను,
అందుకని ఉంచాను ఒరలో కత్తెరను.
భద్రత కోసం తీసుకున్నా జాగ్రత్తను.

ఇటువంటి విందుల్లో,
పాటిస్తాను సంయమనం!
గమనిస్తున్నా మిమ్మల్ని,
జరుపుకోండి పండుగ దినం!

**లాఖెసిస్ (Lachesis)-**

మా ముగ్గురిలోకి తెలివైన దానిని నేనే!
విధి నిర్ణయం నా చేతుల్లో ఉన్నది,
అన్ని కాలాల్లో అందరికీ న్యాయం,
నా చక్రపు అనంత భ్రమణం.

దారాలు కనిపిస్తాయి, దారాలు చుట్టబడతాయి,
కాని నా దారి నుంచి తప్పుకోలేవవి,
నేను చెప్పినంత దూరమే సాగుతాయవి,
ఆ వలయంలోనే తిరుగుతాయవి.

నా దృష్టి ఎప్పుడూ మరలేది లేదు.
లేకుంటే, లోకమే తలకిందులవుతుంది.
వత్సరాల కొలతలు, గంటల లెక్కలు
చుట్టిన దారమే నేతగాడిని చేరుతుంది.

**ప్రతీహారి** : చూపుల్తో చూడలేని స్త్రీలిటే వస్తున్నారు!
పాత గ్రంథాల్లో పరిచయమే వాళ్లు మీకు,
అపాయం కలిగించే అందమైన యువతులు.
ఇంటికి పిలవాలనిపించే వింతైన ఇంతులు.

వాళ్లే ఆగ్రహోనల దేవతలు- ఫ్యూరీస్-
పైకి నదరుగా కనిపించే వయసుగత్తెలు
తెలుసుకున్నకొద్దీ వెలికి వచ్చే నిజాలు-
పావురాల్లా ఉండే బుసకొట్టే సర్పాలు.

దారుణమైన వాళ్లే, కాని ఈరోజుల్లో
ఒకరి లోపాలు ఒకరు పైకి చెప్పుకుంటారు;
అందుకే దేవదూతల్లా ప్రకటించుకోరు,
విధ్వంస నిర్మాతలుగా వివరణ ఇచ్చుకుంటారు!

## The Furies (ఆగ్రహోనల దేవతలు)

**ఎలెక్టొ (Alecto)-**

ఎంతైనా ప్రయత్నించు, చివరకు నమ్మక తప్పదు
అందమైన యువతులం, మంచిగా పొగుడుతాం
నీకెవరైనా మంచి స్నేహితుడుంటే
అతడి చెవిలో విషాన్ని నూరిపోస్తాం!

నమ్మినాక అతడికి నమ్రతతో చెబుతాం,
ఆమె మంచిదే కాని బుద్ధిలో అల్పమని,
కుంటిదని, గూనిదని, గుణమసలే లేదని,
పెళ్లి చేసుకుంటే పెండలో పడతావని.

అటువంటి కథలే ఆమెకూ చెబుతాం!
నీ స్నేహితుడా, నిన్నెవరితోనో తిరిగాడే!
అలా విషబీజాల్ని విస్తృతంగా నాటుతాం!
మళ్లీ కలిసినా వాళ్లు మామూలుగా మసలలేరు.

**మెగిరా (Megaera)-**

ఇది దండుగ! ముందుంది మొసళ్ల పండగ!
ఇద్దరికీ పెళ్లయ్యాక మొదలవుతుంది అసలు కథ!
వాళ్ల ఆనందాన్ని అరక్షణంలో ధ్వంసం చేస్తా!
మానవ జీవితం, మగవాడి కాపురం క్షణికమని చూపిస్తా!

కోరుకున్నపుడు ప్రియుడు కౌగిలి చేరతాడు
అంతకంటే మంచిది దొరికితే అటే దారిపడ్తాడు
మూర్ఖుడు! విసిగిపోయిన ఆనందాన్ని విడిచిపెడ్తాడు
సూర్యుడి వేడి నుంచి పారిపోయి మంచు వెచ్చదనాన్ని ఇష్టపడ్తాడు.

నా కుట్రలకివన్నీ సరైన పరికరాలే!
అస్మోడియస్ భూతం నా అనుంగు చెలికాడే!

అతడూ, నేనూ ఈ చిల్లర పనులు చేస్తుంటాము,
జంటల్ని విడదీసి, మానవజాతిని నిర్వీర్యం చేస్తాము.

**టిసిఫోని (Tisiphone)-**

మృత్యువంటే ఆషామాషీ వ్యవహారం కాదు,
ద్రోహిపై నా ప్రతీకారం ఎన్నడూ ఆగిపోదు,
ఖడ్గమో, విషమో, నేడో, రేపో,
వ్యభిచారికి తప్పదు చెల్లించక పరిహారం!

మధుర ప్రేమ క్షణాలు,
నురగగా, చేదుగా మారిన సమయాలు!
కాపాడలేదప్పుడు ఏ వేడికోలూ.
నేరస్థుడు కట్టాలి పరిహారపు వేతనాలు!

క్షమించు! క్షమించు! అనే పాటకు చోటులేదిక.
'న్యాయానిదే గెలుపు!' అనేదే నా కేక;
స్థిరంలేని గుండెకు విధించే శిక్షేమిటని?
మార్మోగును ప్రతిధ్వనులు –వాడు మరణించాలని!

**ప్రతీహారి** : దారి తొలగండి! దారి తొలగండి!
కొండజాతి మృగమేదో ఇటే వస్తున్నది!
రెండు దంతాలు, పాములాంటి తొండం!
పక్కల మెరుస్తున్న పనివాడి నైపుణ్యం!
విడ్డూరం, అయినా విప్పవచ్చు పొడుపు కథలు,
దాని వీపుపై కూర్చున్నదొక లావణ్యవతి,
ఆమె చేతిలోని అంకుశంతో అదిలిస్తున్నది.
దగ్గర్లో మరొహటి కాంతులతో వెలుగుతుంది.
కళ్లు మిరుమిట్లు గొలుపుతూ కానరాకున్నది.
సంకెళ్లలో ఉన్నారు ఉన్నత జాతి స్త్రీలిద్దరు
భయంకరంగా ఒకరు, ప్రశాంతంగా మరొహరు.
ఒకరు స్వేచ్ఛ కోరుకుంటున్నారు,
ఒకరు స్వేచ్ఛగా ఉన్నామనుకుంటున్నారు.
వారి గురించి వారే ప్రకటిస్తారు–

**భయం (Fear):** ప్రజ్వరిల్లే కాగడాలూ, నెగళ్లూ, దీపాలూ,
ఈ విందు గందరగోళంలో వెలుగుతున్నాయి.
ఈ భ్రాంతుల వదనాల మధ్య
అయ్యో! నేను మరింత గట్టిగా బంధించబడ్డాను-

హాస్యగాళ్లు నా చుట్టూ మూగుతారు,
అబద్ధపు చిరునవ్వులు మోహనంగా చిందిస్తారు.
నా శత్రువులంతా నన్ను చుట్టుముడ్తారు,
మాయా మోసాలు పెచ్చరిల్లే ఈ రాత్రంతా తిరుగుతారు.

ఇతగాడు నా స్నేహితుడు;
ఇతడి ముసుగు గుండా, ఇతడి గుండా చూడగలను.
అతడు నన్ను చంపబోయాడు,
నా నిశితమైన దృక్కుల నుంచి తప్పించుకుపోతున్నాడు.

ఎందుకీ ప్రపంచం నుంచి తప్పించుకు
పోలేకున్నాను? అయినా చెప్పక తప్పదు;
నా తలపై వేలాడే అంతిమ దినం,
నన్నీ మురికిలో, భీభత్సంలో ఉంచుతున్నది, నిజం.

**ఆశ (Hope) :** అక్కలారా! అభివాదం!
ఈ రెండు రోజులూ వినోదించినారు హాయిగా,
ముసుగుల్లో విసుగులేని విందుల్లో,
కాని, రేపు మీరు మీలానే ఉండటానికిష్టపడతారు.

నిజానికి, ఈ కాగడాల వెలుగు మనకు సరిపడదు.
హాయిగా నీరెండలో మనిష్టంగా విహరించడం కావాలి మనకు.
ఆకుపచ్చని మైదానాల్లో, ఒంటరిగానో,
ఎవరో తోడుగానో, హుషారుగా, విశ్రాంతిగా ఉండాలనుకుంటాం!

ఏ కొరతా రాక, ఏ బాధ్యతా లేక
మనం కోరుకున్నవన్నీ దొరికే చోట
ప్రతి ఒక్కరూ ఆహ్వానించబడిన అతిథులై
ఎక్కడికైనా, ఎప్పుడైనా వెళ్లగలిగి,
ఆనందాన్ని సులభంగా వెదుక్కుంటూ
మనకేది ఉత్తమమో దాన్నే అన్వేషిస్తాము.

**జ్ఞానం** : మిమ్మల్ని భయం, ఆశ ఆవరించుకోకుండు గాక!
చూడండి! వారికి సంకెళ్లు వేయబడి ఉన్నాయి.
వెనక్కి జరగండి, దారి ఇవ్వండి!
ఈ చీడపీడల్నుంచి మీకిస్తాను నేను విముక్తి!

ఈ పెద్ద శక్తి ముద్ద
ఇతడి వీపుపై ఓ గోపురం
మాయా సోపానాల మీద
పైకీ, కిందికీ అలుపులేని ప్రయాణం

అతడి బురుజు గోడపై
నిలబడి ఉన్నదో రెక్కల దేవత.
విప్పారిన రెక్కలతో తెస్తుంది ఆమె
అందరికీ లాభం, భోగం, సౌభాగ్యాల జాబితా.

ప్రకాశవంతమైన కాంతి ఆమెను చుట్టివున్నది.
అన్ని దిక్కులకూ వ్యాపించి మెరుస్తున్నది.
ఆమె పేరు 'విజయం'
అన్ని పనులకూ ఆదిరూపం.

**జాయిలో- థెర్సైటిస్ (Zoilo-Thersites) :**
హో! హో! సరైన సమయానికే వచ్చాను నేను!
మిమ్మల్నందరినీ వరసగా తిట్టిపోస్తాను.
అయితే నాకన్నిటికన్నా బాగా యిష్టం,
ఆ విజయ సుందరిని తిట్టిపోయడం!

తెల్లటి రెక్కల్తో ఎగుర్తూ వేటాడే పక్షిలా ఆ రూపం,
ఈ నేలకు రాణిలా గర్వాన్నొలకబోసే వీక్షణం.
ఎక్కడ గౌరవం, విజయం ఉంటే అక్కడ వాలుతుంది తక్షణం.
నేనొప్పుకుంటాను, నా అడ్డంకులను తొలగిస్తుందామె.

అయినా నేను అడుగును పైకెత్తి, అంబరాన్ని దించుతాను.
నిటారును వంపు చేసి, వంపును నిటారు చేస్తాను.
అదే నాకు సంతృప్తినిస్తుంది ప్రతిక్షణం.
ప్రపంచం నేననుకున్నట్లు ఉండడమే నాకిష్టం.

ప్రతీహారి : ఓ పవిత్ర దండమా! అంత్యజాతి శునకమా!
ఒక్క దెబ్బ వేస్తాను, మూలుగుతూ ముక్కుతూ పడిఉండు!
అహ్! ఆ మరుగుజ్జు ద్వయం మట్టిముద్దలా మారుతున్నారు.
మరల గుడ్డుగా, చూడు, చూడు! గుడ్డు పగిలింది!
ఒక పొడ పాము, గబ్బిలం - కవలల జననం!
ఒకటి దుమ్ము ధూళిలోకి దూరిపోతున్నది-
మరొకటి రాత్రి నలుపులా పైకప్పుకు వేలాడుతున్నది.
ఈ రెండూ ఎక్కడో ఒకచోట కలుస్తాయి.
అక్కడ మాత్రం ఎట్టి పరిస్థితుల్లో నేనుండేది లేదు.

**జనంలో గుసగుసలు-**

రా! నృత్య గాన వినోదం!
నాకిష్టం లేదు, నేనుండలేను-
ఒళ్లు జలదరిస్తున్నది, మాయా మంత్రాలు
మార్మోగుతున్నవి. ఇది వాస్తవం కాదు-
నా తల చుట్టూ ఏదో తిరుగుతున్నది.
నా పాదం చచ్చుబడినట్లున్నది-
కాని మనకేం దెబ్బలు తగల్లేదు కదా!
మనం భయంతో చచ్చిపోయాం, అంతే-
ఇదేదో ఖచ్చితంగా క్రూరమైన హాస్యం
అది ఆ పందులు, మోసగాళ్ల మాయా తంత్రం-

ప్రతీహారి : ఈ వినోద ప్రదర్శనల నిర్వాహకుడిగా
నా విధిని నేను నిర్వహిస్తున్నాను.
ఈ ఉత్సవం జరిగే చోటుకు
ఏ అపాయాన్నీ రానివ్వబోను.
నేనున్న చోటు నుంచి ఒక్క రవ్వ కదలను,
అయినా, ఒప్పుకుంటాను, కిటికీలోంచి
ఎగిరే మాయాజాలానికి నా బాధ్యత లేదు.
భూతాల్ని, దెయ్యాల్ని వదిలించే శక్తి నాకు లేదు.
అదిగో అదో మరుగుజ్జు దెయ్యం
కాదు కాదు, దాని వెనకల ఓ పెద్ద సైన్యం.

వీటి గురించి వివరించడం నా ఉద్యోగ ధర్మం
కాని, ఏం చెప్పాలో తెలీని అసహాయత, నా ఖర్మం.
చూడండి! అదుగో! ఆ గుంపులోంచి వస్తున్నదేమిటి?
తేలుతూ వస్తున్న అద్భుత రథం, నాలుగు అశ్వాలు,
జనాలు దారి ఇవ్వడం లేదు, అయినా వస్తున్నదేం విచిత్రం?
ఏ మంత్రగాడి మాయాజాలమో కదా!
దూరంగా రంగురంగుల తారలు
మిణుకు మిణుకుమంటూ, మంత్ర దీపపు వెలుగుల్లా
ఈ తుఫాను బుసబుసల చప్పుళ్లేమిటి?
నాకు భయం వేస్తున్నది, దారి తొలగండి!

**రథసారథి–బాలుడు–**

హోవా! నా అశ్వాల్లారా! రెక్కలను సర్దుకోండి!
కళ్లెల బిగింపును అర్ధం చేసుకోండి,
నేను మిమ్మల్ని పాలించినట్లు, మిమ్మల్ని మీరు నడుపుకోండి!
ఆజ్ఞాపించినపుడు అగ్నిలా ఉరకండి.
ప్రస్తుతం ఈ ప్రసిద్ధ స్థలాన్ని పరిశీలిద్దాం రండి!
ఇక్కడి గుంపంతా మనచుట్టూ మూగుతున్నారు.
ప్రతీహారీ! మా గురించి ప్రకటించు, వెంటనే!
ప్రతీకలమైన మా గురించి ప్రతిదీ వివరించు.

**ప్రతీహారి** : వర్ణించమంటే చెప్పగలను కబుర్లు
గుర్తించడమంటేనే గుండెల్లో గుబులు.

**రథసారథి–బాలుడు–**

ప్రయత్నించు! ఫరవాలేదు.

**ప్రతీహారి** : నేను చెప్పక తప్పదు నీవు అందానికి అందమున్న
నూనూగు మీసాల నూత్న యోవనుడవని;
నీవు యువకుడిగా పెరిగాక,
కన్యలందరూ నీ చుట్టూరా గుమికూడతారని;
రేపటి నారీమానస చోరుడివి,
జన్మతః మన్మధాంశ సంభూతుడవని;

**రథసారథి–బాలుడు–**

నీ వాక్యములను విన కుతూహలమగుచున్నది, కాని,
ఈ పొడుపు కథను విప్పే శక్తి ఉన్నదా నీకు?

**ప్రతీహారి** : నీ నల్లటి శిరోజాలను కట్టిపడేసిన
రత్నమణిమయ వస్త్రమెంతో బాగున్నది.
నీ భుజాలపై నుంచి పాదాల వరకు ప్రవహించిన
మేలి దుస్తులు ముత్యాలరీతి మెరయుచున్నవి.
ఊదారంగు అంచుతో ఆ దుస్తులు ఊహాతీతమై ఉండగా
తమరు బాలుడో బాలికో అరయుట కష్టమనిపిస్తున్నది.
మంచికో, చెడుకో ఆడపిల్లలపై తమ ముద్ర అమోఘం.
వాళ్లు తమకు నేర్పగలరు అక్షర మాల ఆసాంతం.

**రథసారథి–బాలుడు–**

ఎవరీ అద్భుత వ్యక్తి, ఎక్కడివాడితడు?
రథ సింహాసనంపై రాజఠీవితో కూర్చున్నవాడు?

**ప్రతీహారి** : భాగ్యశాలి, ధనసంపన్నుడైన రాజకుమారుడు
అతడి ప్రాపకాన్ని పొందిన వారెంతో అదృష్టవంతులు
వారేదడిగితే దాన్నివ్వగల వాడతడు
వారి కష్టసుఖాల్ని గమనించు నాయకుడు
ఇతరులకు ఇవ్వడం అతనికున్న ఆనందం
అన్ని సంపదలకన్నా అదే అతడి సుగుణం.

**రథసారథి–బాలుడు–**

సగం చెప్పి వదిలేయడం కాబోదు సంస్కారం
మొత్తం విడమరిస్తేనే ఒరుగుతుంది ఉపకారం.

**ప్రతీహారి** : ఏ మాటలూ వర్ణించలేని అత్యున్నత రాజసం
చంద్రకాంతి ప్రతిఫలించే సౌష్ఠవదేహం
నిండైన పెదవులు, గులాబి బుగ్గలు,
రత్న మణిమయ తలపాగా, సూర్యుని తేజస్సు
ప్రశస్తమైన పట్టు పీతాంబరాలు,
అతడి నడవడికను నేనేమని వర్ణించను?
ప్రపంచమంతా తెలవాలి అతడు మహారాజని!

**రథసారథి-బాలుడు-**

సంపదల కధిపతి ప్లూటస్ ఇతడు
చక్రవర్తి కోరుకున్న దేవతా ప్రముఖుడు.

**ప్రతీహారి** : నీ గురించి చెప్పవేం, నిజాలన్నీ బాలుడా!

**రథసారథి-బాలుడు-**

నేను కవిత్వాన్ని, నేను పటుతర సంపదను
ఎక్కువ రాసే కవి ఎక్కువ వినియోగించును
ప్లూటస్‌తో సమానమైన ధనవంతుడిని నేను
అతడి విందుల్లో పాల్గొంటాను, ఆనందిస్తాను.
అతడి ప్రాభవం తగ్గాక, నేను పైకి వస్తాను.

**ప్రతీహారి** : మాయ మాటలతో బురిడీ కట్టించడం నీ విద్య,
అయినా ఇప్పుడు చూద్దాం ఏమిటో నీ ప్రజ్ఞ!

**రథసారథి-బాలుడు-**

నేను చిటికెలు వేయగానే, చూడు, దీపాలెలా ఆడతాయో!
రథం చుట్టూరా ఎలా వెలిగి ఆరిపోతాయో!
ఇది ముత్యాల హారం- బయటకు దూకుతున్నది.
ఇవి బంగారు ఆభరణాలు- మెడవేపు పోతున్నవి.

**(చిటికెలు వేయును)**

ఇవి దువ్వెనలు, ఇవి శిఖిపింఛాలు
బంగారు ఉంగరాలు, రత్నాలు పొదిగినవి.
ఒక్కోసారి వెదజల్లుతాను అగ్ని జ్వాలల్ని,
అవి ఎక్కడ జ్వలిస్తాయో తెలియదు ఎవరికీ!

**ప్రతీహారి** : ఎలా ఎగబడ్తున్నారో చూడండి ఆ గుంపు!
ఇచ్చేవాడికి కూడా కష్టమౌతున్నది,
కుడి ఎడమల చిటికెలేసి కురిపిస్తున్నాడు రాశుల్ని,
ఇది ఒక స్వప్నం, తన్నుకు చస్తున్నారు మరెందుకని?
తగవులాడ్తున్నారు, తోసుకుంటూ ముందుకొచ్చి
ఆబగా పట్టుకుని దాచుకుంటున్నారు దర్జాగా,
కాని ఏం లాభం? ఏదీ మిగలడం లేదేమి విడ్డూరం?

పట్టుకున్నవాడి చేతిలో మిగిలింది బూడిద,
ముత్యాలహారం మురిపించి పోయింది.
నల్లని తుమ్మెదలు ఎగుర్తున్నాయి చేతిలో,
విసిర్తే తలచుట్టూ తిరిగేను వలయంగా!
అందరూ అలాగే మోసపోయారు చిత్రంగా.
దయ్యపు పురుగులు ఎగిరేను దట్టంగా.
మోసగాడు! ఎన్నో ఆశలు చూపాడు అరచేతి సరుకు,
బంగారానికి బదులు కాకిబంగారం చివరకు!

**రధసారధి-బాలుడు-**

ప్రతీహారి పని ముసుగు గురించి వ్యాఖ్యానం,
అంతేకాని వాస్తవాన్ని కాదు విడమరచి చెప్పడం!
అది నీ బుద్ధికి అందని దేవ రహస్యం.
అయినా ఇక్కడ తగవు పడడం కాదు ఉచితం!

**(ఫ్లూటస్ వేపు తిరుగుతాడు)**

నాకు నాలుగు అశ్వాల నిచ్చారు,
వాయువేగంతో పోయే రధాన్నిచ్చారు,
మీ ఆజ్ఞానుసారమే ఇక్కడకు తీసుకువచ్చాను క్షణంలో!
మీకు విజయ హస్తాన్ని గెలిచిపెట్టాను.

ఎన్నోసార్లు మీ తరపున యుద్ధాలు చేసాను,
ప్రతిసారి విజయాన్ని మీకు నేనందించాను.
మీ కనుబొమలపై ఉన్న లారెల్ కిరీటం
నా మనసు, చేతుల్తో నేనల్లిందే కదా!

**ఫ్లూటస్** : నిస్సందేహంగా! నేనామాట చెబ్తాను నిర్ద్వందంగా!
ఆత్మలో ఆత్మవు! నా మనసులో మాట నెరవేరుస్తావు.
నాకన్నా ధనవంతుడివి, అయినా నన్ను సేవిస్తావు.
నీవు అలంకరించిన ఈ కిరీటం, నాకన్నిటికన్నా మిన్న!
కుమారా! నీ వలన నేను అమితంగా సంతోషిస్తున్నా.

**రధసారధి-బాలుడు- (గుంపుతో)**

నేనివ్వాల్సిన బహుమతులు మీకిచ్చేసాను-
మీ తలలపై నేను వెలిగించిన రవ్వలు మండుతున్నాయి-

జ్వాలలు నాలుకలై నాట్యం చేస్తున్నవి,
అంటుకుని మండుతూ అంతర్ధానమౌతాయి,
కొందరికవి కనిపించకముందే అదృశ్యమైపోతాయి.

**గుసగుసలాడ్తున్న స్త్రీలు–**
ఆ పెట్టె పక్కనున్న బక్కవాడెవడు?
యదార్ధపు వ్యక్తిలా కనిపించడే వీడు!
విదూషకుడందామా ఒళ్లు బలిసి లేదు,
ఆకలి దప్పులతో అలమటించినట్లున్నాడు.
గిల్లినా గిచ్చినా పట్టించుకోడితగాడు.

**బక్కవాడు** : నన్నంటుకోవద్దు! నన్ను ముట్టుకోవద్దు!
మీ ఆడవాళ్లతో నాకేం పని లేదు.
ఒకప్పుడు ఇల్లూ ఇల్లాలూ ఒకటే అనేవారు,
నాపేరు అవరిషియా– లోభానికి మరో పేరు.
ఆరోజుల్లో ఇంట్లోకి రావడమే డబ్బు, పోవడం అరుదు.
నా పెట్టెల నిండా బంగారపు గుట్టలు.
పొదుపు చేయడం మరచినారు మహిళలు ఈనాడు
సంపాదన కన్నా ఖర్చుకెన్నో మార్గాలు కనిపెట్టినారు.
అప్పులో మునిగిన భర్త చేసే ఆర్తనాదాలు
దుస్తులు, నగలపై దృష్టంతా చూపడాలు
నృత్యాలు గానాలపై మితిమీరిన వ్యయాలు
అందుకనే నేను, దాచాను దండిగా సిరి
ప్రజలంటే అనినీ, వీడొక పిసినారి.

**మహిళా నాయకురాలు–**
పిసినిగొట్టు ముసలి వెధవ!
వాడి జుట్టుతో వాడినలానే చావనీండి!
మన మగాళ్లను మనకు వ్యతిరేకం చేసే కుట్ర
అయినా అది పనిచేయదులే పులిమీద పుట్ర.

**స్త్రీల గుంపు** : ఓరి బక్కపీనుగా! ఎముకల గూడూ!
మమ్మల్ని బెదిరించే ధైర్యమా, చూడూ!

చెంప పగిలిపోతుంది, ఏమిటా చూపూ!
కిందకు పడలాగండి, కాగితపు పులి వీడు!

**ప్రతీహారి** : ప్రశాంతం! ప్రశాంతం! ఆపండి గొడవ!
బహుశా నా ప్రమేయం అక్కర్లేదనుకుంటాను!
ఆ భయంకర పిశాచాలు చూడు
విప్పార్చిన రెక్కలు మెరుస్తున్న గోళ్లు
ఆ డ్రాగన్ మూతుల నుండి వెలువడే అగ్గిపొగలు
వాటి అరుపులకు పారిపోతున్నారు ప్రజలు
ఇప్పుడున్నాయి కావాల్సినంత ఖాళీ స్థలాలు.
(ప్లూటస్ రథాన్నుంచి దిగుతాడు)
రాజులా అతడు రథం దిగినాడు.
అతడి ఆజ్ఞతో డ్రాగన్లు కదిలాయి.
బరువైన పెట్టె దిగింది నేలకు
పెట్టెతో పాటు బక్క పిసినారి
ప్లూటస్ పాదాల వద్ద ఉంచబడినారు.
ఇదీ అద్భుతమంటే! వింతా విడ్డూరమే మరి!

**ప్లూటస్ (రథసారథితో)–**
నీ భారాన్ని ఇక్కడ దింపినావు,
ఇప్పుడు నీ ఇష్టమైన చోటుకు వెళ్లవచ్చు.
ఇక్కడ వింత వింత ఆకారాలున్నాయి.
నీకు స్పష్టంగా కనిపించే చోట ఆనందించవచ్చు.
ఒంటరిగా నీకు నచ్చినవి మనసారా ఎన్నుకోవచ్చు.

**రథసారథి–బాలుడు–**
నీ దూతనైనందుకు నాకు గర్వం
నీవున్న చోట అంతా సంపూర్ణం
జీవితంలో కంగారుపడి మనుషులు
నీకు సేవ చేయాలో, నాకు చేయాలో తేల్చుకోలేరు.
నీ అనుయాయులకు కష్టం తక్కువ
నన్ను అనుసరించిన వాళ్లకు శ్రమ ఎక్కువ.
నా పనుల్ని నేను దాచలేను.
నా ఊపిరి నన్ను బహిరంగపరుస్తుంది.

నాకు హాయి నొసంగిన నీకు కృతజ్ఞతలు
నన్ను తలిస్తే మరుక్షణంలో వస్తాను, వీడ్కోలు!

**(వచ్చినట్లే వెళ్లిపోతాడు)**

**ప్లూటస్** : నిధుల్ని వదిలే సమయమిది,
తాళాల్ని ప్రతీహారి దండంతో తెరుస్తాను.
లోపల చూడండి, రాగి పాత్రలలో స్వర్ణ ప్రకాశం,
నగలూ, బంగారం, ఉంగరాలు, కిరీటాలు,
ఇవన్నీ లోహద్రవంలో కరిగి ముద్దయ్యే సన్నివేశం.

**గుంపు** : **(అరుస్తున్నారు అలలు అలలుగా)–**
చూడండి! చూడండి! పొంగిపొరలుతున్నది.
స్వర్ణమున్న పెట్టె అంచులు నిండిపోతున్నవి
బంగారపు కలశాలు, నాణేలు కరిగిపోతున్నవి.
వరహాలు, డుకాట్లు వరసగా గంతులేయ
మన కళ్లముందు కనిపించెను మనోజ్ఞమైన దృశ్యం
నా స్వ.ప్నాలు నిజమైన రోజులరుదెంచెను.
అవిగో అవన్నీ దొర్లుతున్నాయి నేలపైన–
జారవిడవద్దీ అవకాశం! దొరికినంతా దోచుకుందాం!
బలమైన గుంపు మనది, ఆ పెట్టెనే మోసుకుపోదాం!

**ప్రతీహారి** : మూర్ఖులారా! ఇదంతా నాటకం! పచ్చి బూటకం!
ఏం చేస్తున్నారు మీరు? అత్యాశకు పోయి అల్లరి కావద్దు!
ఇదంతా కాదు స్వర్ణం! మీ శ్రమ వృథా, కాలహరణం!
ఎందుకూ కొరగాని వాజమ్మలు మీరు!
అబద్దాల వలలో పడి అల్లల్లాడుతున్నారు.
అయినా మీకు సత్యంతో పనేముంది?
భ్రాంతిలో పడి నాశనం తెచ్చుకుంటున్నారు.
ప్లూటస్! నాకోసం ఈ గుంపును చేయగలవా చెల్లాచెదరు!

**ప్లూటస్** : సందేహమెందుకు! ఈ మాత్రం దానికి నీ చేతిలోని దండం చాలు!
కాసేపు నాకప్పిస్తావా! ఈ బంగారు పులుసులో ముంచి చూస్తాను!
వెర్రి జనాల్లారా! వేగిరం తప్పుకోండి!
మంటలు వెలిగి, విరజిమ్మి, మెరుపులై ఉరుముతాయి.
నీ చేతికర్ర ఎర్రగా కాలి ఎంత మండుతున్నదో

దాని దగ్గరకు వచ్చినవాళ్లు దయలేకుండా కాలతారు.
ఇప్పుడు నేనిక్కడొక వలయాన్ని గీస్తాను.

**గుంపు** : **(అరుస్తూ, తోసుకుంటూ)**
ఓహ్! ఓహ్! మన పనైపోయింది! పరుగెత్తండి–
ఎవడి దారి వాడు చూసుకోండి! వేగిరం పారిపొండి!
ఎవడురా వెనక! రాకు ముందుకు, పో వెనక్కు!
అది నా మొహం మీదే మండుతోంది! వేడిపొగలు జిమ్ముతోంది!
ఆ మండే కర్ర నా ముహంపై అగ్నినృత్యం చేస్తున్నది–
వెనక్కి జరగండి! వెధవ జనాలు! వెనక్కి తగ్గండి!
బుద్ధిలేని మృగాలు, జాగా ఇవ్వండి, జాగా ఇవ్వండి!
అంతా ముగిసినట్లుంది, మన చావు మూడింది.
ఓ! రెక్కలుంటే బాగుండును, ఎగిరిపోయేటందుకు–

**ప్లూటస్** : చుట్టూ మూగిన గుంపు తప్పుకున్నారు ఈ క్షణం!
మంటల ధాటికి చిత్తగించారు పలాయనం,
భయం పుట్టిస్తే చాలు, కాళ్లకు బుద్ధి చెబుతారు.
అందుకే నేను కనపడని సరిహద్దు ఒకటి గీస్తాను,
మంటని అదుపులో ఉంచేందుకు ఉపయోగిస్తాను.

**ప్రతీహారి** : భేషైన పని చేస్తున్నారు ప్రభువులు
తమ నేర్పుకు, శక్తికి మా ప్రణామాలు.

**ప్లూటస్** : ఘనత వహించిన మిత్రుడా! కావాలి ఓపిక!
ఈ కల్లోలమిప్పుడే సమసిపోదు కనుక!

**పిసినారి** : మీరు అనుమతిస్తే ఈ వలయాన్ని పరీక్షిస్తాను,
యధావిధిగానే కొనడానికి పైచేయి మహిళలదే కదా!
నాలో ఇంకా జవసత్వాలున్నాయి,
చావ లేదింకా జవరాళ్లపై ఆశ
బయటకు పోయి నా పాట్లు నేను పడతాను
అదృష్టం బాగున్నది ఈ రోజు! ఏదో సంతృప్తి!
ఈ గుంపును చూస్తే నా కింపుగా ఉన్నది,
ప్రతి ఒక్కరికీ అన్ని మాటలు వినబడవు సుమా!
ఉపయోగిస్తా నా తెలివి, నా అర్థాన్ని వివరిస్తా,

విజయం నాదేనన్న విశ్వాసం పెరుగుతోంది,
కాళ్లూ, చేతులు, సైగలు అంత పని కొచ్చేట్లులేవు.
మొరటు హాస్యంలో నాదే పైచేయి
ఈ మెత్తటి బంగారాన్ని మెదిపి చూస్తాను.
ఎటువంటి రూపమైనా ఒదుగుతుంది దీనిలో!

**ప్రతీహారి** : ఓ నడిచే కంకాళమా! ఏమిటి నీ వ్యూహం?
ఆకలి నీలో పుట్టిస్తున్నదా హాస్యం?
పిండిని నలిపినట్లు నలుపుతున్నావు స్వర్ణాని,
వాళ్లకెందుకు చూపుతావు నిర్దిష్టరూపం లేనిదాన్ని?
ఆడవాళ్లు భయంతో పారిపోతున్నారు అరుస్తూ,
మూర్ఖుడు అసభ్యంగా వాళ్లను హడలగొడ్తున్నాడు.
ఎంత ఛండాలంగా ప్రవర్తిస్తే అంత ఆనందమా, వీడికి!
గట్టిగా మందలించి వెళ్లగొడతానిప్పటికి.

**ప్లూటస్** : ఇప్పుడు మరో ఉపద్రవం ముంచుకొచ్చింది!
వాడిని వదిలేయి, వాడేం చేస్తున్నాడో వాడికే తెలీదు,
పిచ్చి చేష్టలకిక్కడ స్థానం లేదు.
సాధారణ న్యాయాన్ని రాజాజ్ఞ అతిక్రమిస్తుంది.

**కల్లోలంలో పాట:** పెద్ద కొండల్లోంచి వస్తోంది పెనుభూతం
చిక్కటి అడవుల్నుంచి చిమ్ముతూ వస్తున్నది.
ఎదుర్కొనే వారెవరు? ఎదురేగే వారెవరు?
ఘనత వహించిన 'పాన్' దేవుడికి ఆహ్వానం పలుకుదాం!
మనకే తెలిసిన రహస్యమిది, ఖాళీ వలయంలోకి వదిలివెళ్దాం!

**ప్లూటస్** : మీరూ, మీ 'పాన్' దేవుడూ నాకు తెలిసినవాళ్లే!
చాలా తక్కువ మందికి తెలిసిన రహస్యం నాకూ తెలుసు!
ఈ వలయాన్ని కుదించి, అదృష్టానికి పీట వేస్తాను
వింత వింత విషయాలు వీళ్లను కమ్ముకోనీ,
వాళ్లెక్కడికి పోవాలో వాళ్లకు తెలియదు
ముందుచూపు లేనివాళ్లకు ముందరి దారి తెలవదు!

**వెర్రిపాటలు** : జబర్దస్తీ దుస్తులతో మీది వృథా కవాతు,
వచ్చాం మేం నగ్నంగా, ఏమిటి మీ జవాబు?

గెంతులు ఎగరడాల్లో ఎవరు మాకు సాటి,
మొద్దు, మొరటు తనాల్లో మా బలాలకు లేదు పోటీ!

**ఫాన్స్ (Fawns) (గ్రామదేవతలు)–**

ఇప్పుడు, వస్తున్నారు గ్రామదేవతలు
ఉన్మత్త నృత్యాలు
వంకీల శిరోజాలు
ఓక్ ఆకు కిరీటాలు
మా శిరోజాల్లో మొనదేలిన చెవులు,
గుచ్చుతాయి గురితప్పక ఇక్కడా అక్కడా!
వెడల్పాటి ముఖంలో బండబారిన నాసిక,
ఆడవాళ్లు వెంటబడే ఆకర్షణీయపు కూడిక!
ఫాన్ తన పాదంతో ఆహ్వానిస్తే
ఏ కన్య అయినా సంతోషంగా ఎగిరి గంతులేయదా!

**శాటిర్ (Satyr):** ప్రత్యక్షమవుతున్నాడు శాటిర్ ఇప్పుడు
సన్నని నడుము మేకకాళ్లతో
కొండ గొర్రెలా కానవస్తున్నాడు.
ఎత్తైన గుట్టలపై ఎక్కి కూర్చుని
క్రింది ప్రపంచాన్ని దీక్షగా చూస్తాడు,
స్వేచ్ఛావాయువుల్ని గుండెల్లో నింపుకుని
మానవజాతిని ఎగతాళి చేస్తాడు.
లోయల్లో లోతుల్లో గోప్యంగా బతుకుతూ
ఈ కొండా కోనలన్నీ తన రాజ్యంగా చాటుతాడు.

**నోమ్స్ (Gnomes)-**

వస్తున్నాం, వస్తున్నాం అతి చిన్న ప్రజలం,
ఆకుపచ్చని నాచు లాంటి అంగీలు తొడుగుతాం!
దీపాల కాంతిలో అటుయిటు తిరుగుతాం
ఎవడి పని వాడు చేస్తూ, మిణుగురుల్లా వెలుగుతాం!

మరుగుజ్జులు మాకు మరింత సన్నిహితులు
కొండల్ని కోయడం మాకు తెలిసిన విద్యలు
పర్వతాల నరాల్ని పగలగోసి చూస్తాం
నిధుల్ని సేకరించి మా కష్టాల్ని మరుస్తాం!

లోహాల్ని పోగుచేసి కుప్పలుగా దాస్తాం,
గని పనివాళ్లకు శుభాల్ని పలుకుతాం!
మంచివాళ్లకెప్పుడు మంచి జరగాలని దీవిస్తాం!

మా సంపదల్ని దొంగిలించి వ్యభిచరించేది వాళ్లు
మా ఆయుధాలతో కొట్టుకు చస్తారు వాళ్లు.
చేయవద్దన్న పనులు చేస్తారు మూడు.
వాటి తర్వాత నేరాలకు లెక్కేమీ లేదు.
మా తప్పేమీ లేదు దీంట్లో, ఓపిక ఉండాలి నీకు!

**మహాకాయులు (Giants)-**

అడవి మనుషులం మేము, అదే మా పేరు,
హార్జ్ పర్వతాలలో ఉంటాము హాయిగా,
పైన్ చెట్టు పొడుగంత దుడ్డుకర్ర చేబూని
ప్రకృతంత సహజంగా ప్రవర్తిస్తాము మేము.
చిన్నా పెద్దా మహాకాయులం
ఆకులు శాఖలు మాకు ఆభరణాలు
నడుముకు చుట్టుకుని నడుస్తాము మేము.
ఎవరికీ లేని అంగరక్షకుల్లా మా చుట్టూ ఉండేవి చెట్లే కదా!

**వనకన్యల బృందం (పాన్ దేవత చుట్టూరా ఉంది)–**

పాన్ దేవత ఆగమనం,
అతనిలో దృశ్యం,
అతడిలోనే,
ఈ భూగోళం.

వనకన్యలారా, అతడిని పరివేష్టించండి,
అతడి చుట్టూరా నృత్యాలు చేయండి,
గంభీరంగా ఉన్నా ప్రసన్నుడే,
ఆనంద లాహిరికి అనుకూలుడే,
స్వర్గపు నీలిగుడారం కింద
పగలంతా మెలకువగా ఉండేవాడే.

గాలులు ముద్దాడగా
సెలయేర్లు పాడగా

మధ్యాహ్నం శయనించాడా
ఏ ఆకూ, శాఖా కదలడానికిష్టపడదు.

ప్రాణమిచ్చే మొక్కలు పెరుగుతున్నాయక్కడ,
పరిమళాలతో నింపుతున్నాయి నిశ్శబ్ద వాయువులను.
ఏ వనకన్యా మెలకువగా ఉండలేదిప్పుడు
నిలబడే అందరం నిద్రపోతాం అప్పుడు

అతడి భీకర స్వరం సముద్రపు హోరు.
అది వినపడిందా ఎవరూ తప్పించుకోలేరు.
గొప్ప సైన్యాలు వణుకుతాయి, నాయకులు జడుస్తారు.
మనల్నిక్కడికి రప్పించిన మహారాజుకు పేరు.
అతడిని అభినందిద్దాం అందరం మరో మారు.

**నోమ్స్ ప్రతినిధిబృందం (A Deputation of Gnomes - to great Pan)–**

పర్వత హృదయాల గుండా
సూత్రంలా సాగే నిధులు
ఉపాసకుడికే సాధ్యం
మాళిగలోకి మార్గం.

గుహల్లో నివాసం
కనబడని చీకటి ప్రదేశం
సుఖంగా బతికేందుకు స్వర్ణం
పగటి గాలుల మధ్య ప్రత్యక్షం

ఇది మరో నీటి ఊట
చాల దగ్గర బాట
ఆశ్చర్యంగా సరఫరా
అనుకొని ఆసరా

దీనిని పూర్తిచేయండి
ప్రభూ, శ్రద్ధ వహించండి;
సంపద తమ స్వంతం
సమస్త ప్రపంచ సౌభాగ్యం.

**ఫ్లూటస్** : **(ప్రతీహారితో)–**

మనం అత్యంత ఉత్తేజంగా ఉన్నాం,
ఏం జరిగినా గమ్మున గమనిద్దాం!
నీవు ధైర్యవంతుడివే, నాకు తెలుసు.
అందరూ తిరస్కరిస్తారు, రాబోయే తరాలు
కూడా ఈ కల్లోలాన్ని నమ్మరు. అందుకే
నీ గ్రంథంలో లిఖించు ఋజువుగా!

**ప్రతీహారి** : **(ఫ్లూటస్ చేతిలోని తన దండాన్ని పట్టుకుని)–**

మహాదేవుడు 'పాన్' చుట్టూ ఉన్న మరుగుజ్జులు
పొగలు కక్కుతున్న ఊటవేపు వెళ్తున్నారు.
పైకి రివ్వున ఎగసిన కొంతసేపట్లోనే అది
లోతుల్లోకి మరలా ఇంకిపోతున్నది.
ఇప్పుడు శాంతించి మౌనంగా ఉన్నది.
మరుక్షణంలో పొగలు కక్కుతూ పైకెగస్తున్నది.
మహాదేవుడు 'పాన్' మందహాసంతో చూస్తున్నాడు.
ముత్యాల నురగ పక్కల మెరవగా ఆ నీటిఊట!
అతడు తన కళ్లను తానే నమ్మలేకున్నాడా?
ఏమిటో చూడాలని వంగినాడు కిందకు
అతడి గడ్డం మునిగిందా తొట్టెలోకి!
ఎవరిదాగడ్డం? ఎవరిదా గడ్డం లేని గడ్డం?
అతడి చేయి దాచింది దానిని.
అయ్యో! ఏదో దురదృష్టం చుట్టుముట్టి ఆగింది!

గడ్డానికి అంటుకుంది నిప్పు
వెనక్కి మండి వేగంగా కాలింది జుట్టూ
అందరి ఆనందం దుఃఖానికి మారింది
ఆపాలని ప్రయత్నిస్తే ఆరలేదు అగ్ని
ఏదీ ఆ జ్వాలలకు ఎదురు నిలవలేదు
ఆర్పిన కొద్దీ మంటలు మరింత ఎగసిపడ్డాయి.
ముసుగుల్లో ఉన్నవాళ్లు మంటల్లో చిక్కుకున్నారు.

నేను విన్నది నిజమేనా
నోటి నుంచి నోటికి, చెవి నుంచి చెవికి,

ఈ దురదృష్టకరమైన రాత్రి
మనకు తెచ్చినదీ పరిస్థితి

ఇది ఎవరూ అనలేని మాట
ఇది ఎవరూ వినలేని మాట
ఆ గొంతులేవో అరుస్తున్నాయి పెద్దగా,
మంటల్లో కాలుతున్నది మన మహారాజని!

చక్రవర్తి చిక్కుకున్నాడు జ్వాలల్లో
అతడూ, అతడి పరివారం
ఆ గందరగోళం అతడిని కట్టేసింది
ఆ పాటలు, అన్నీ నాశనం తెచ్చాయి.

ఓ యవ్వనమా! నీ ఆనందాన్ని
స్వచ్ఛమైన రీతుల్లో అనుభవించవెందుకు?
ఓ రాజ సత్తమా! నీ రాజ్యాన్ని
మితిమీరని లాలసతో పాలించవెందుకు?

ఇప్పుడు పొదరిళ్లు మండుతున్నాయి.
అగ్ని నాలుకలు జాచి పైకి పాకుతున్నది.
పైకప్పు పొగచూరి పడిపోనున్నది.
మనమందరం మంటల్లో మాడి మసికానున్నామా?

అయ్యో! ఇదేనా చివరకు మిగిలేది!
ఎవరు మనల్నిపుడు రక్షించగలరు?
ఒక్క రాత్రి! ఒక్క రాత్రిలో ఈ సర్వం సహా సామ్రాజ్యం
బూడిద కుప్పలుగా మారిందంటే ఎవరు నమ్మగలరు?

**ఫ్లూటస్** : చాలులే! చాలునీ హెచ్చరిక
మనకే అపాయమూ రాదిక
చేతిలోని దండాన్ని నేలకు తాకించు,
దాని పవిత్ర శక్తిని శ్రద్ధగా ఉపాసించు.
ఈ విశాల వాయువుల్ని ఆజ్ఞాపించు
చల్లని పరిమళాల్ని వ్యాపింపచేయించు

రా! ఓ తుషారబిందు సముదాయమా!
మంచునీటి తెరల్లా, వాన జల్లుల్లా, రా!
ఈ మంటల గందరగోళాన్ని ఆర్పివేయి!
మేఘమాలికలారా! సుడులు తిరిగి రండి!
మీ ఆవిరి బిందువులను కుండపోతగా వర్షించండి!
అగ్ని దాహాన్ని చల్లార్చి, ఉపశమనాన్నివ్వండి!
ఈ మాయాగ్ని జ్వాలలను మటుమాయం చేయండి.

మరలా అంతా సూర్యకాంతి వెలుగులా మెరిసిపోవాలి.
ఆత్మశక్తి ప్రాభవాన్ని మన ప్రాచీన మంత్రశక్తి గెలవాలి!

# 4. ఉద్యానవనం

## (A Pleasure Garden)

**(ఉదయకాంతి... చక్రవర్తి, సదస్యులు– ఫాస్ట్, మెఫిస్టోఫిలిస్ తగు దుస్తులతో ఉన్నారు. మోకాళ్లపై వంగి అభివాదం చేస్తున్నారు.)**

**ఫాస్ట్** : ఆర్యా! ఆ అగ్నిజ్వాలా విశేషాలకు మమ్మల్ని మన్నించండి!

**చక్రవర్తి** : **(వారిని లేవమని సంజ్ఞ చేస్తూ)–**
అసలు వినోదమంతా వాటితోనే వచ్చింది!
ఇటువంటి సరదాలే ఇకముందూ కావాలి!
ఆ క్షణంలో నేను ప్లూటోగా మారాను.
నా చుట్టూ గొప్ప గోళం పరిభ్రమిస్తూ మండుతోంది.
నల్లరాళ్ల గోతుల్లో అంగారాల వెలుగులు
ఆ లోతుల్లోంచి వేలాది నాలుకలు అగ్నిజ్వాలలు
అన్నీ కలిసి ఒక్క పెద్ద అగాధమై విలయమైన భ్రమ.
ఆ అగ్నిదేవాలయం అంతకంతకు పైకెగస్తుంటే
లోపల నడుస్తున్న ప్రజా సమూహం
అగ్నిజ్వాలా జిహ్వాలు నన్ను నలువేపులా ఆవరించాయి.
నావేపు వేగంగా వస్తూ నన్ను కమ్ముకున్నాయి.
అన్నీ నాకభివాదం చేస్తున్నట్లనిపించాయి.
ఈ అద్భుతాల మధ్య నా సభ నాకు కనిపించింది.
నేను వేయి సాలమాండర్ల రాజకుమారుడిని!

**మెఫిస్టోఫిలిస్** : అవును ప్రభూ! మూలకాలు తమను గుర్తించినాయి!
అగ్ని మీకు అణుకువగా ఉన్నానని తెలిపింది.
ఇప్పుడు తుఫాను సముద్రంలో దూకండి తమరు,
సముద్రపు అడుగు ముత్యాలను సందర్శించగలరు.
అంతలోనే మీకో కనిపిస్తుందో గోపురం,
లేత ఆకుపచ్చ ఊదారంగుల అలల సంచలితం.
మీ చుట్టూరా నిర్మితమైన జలసౌధగోళం
దానిలోనే వెళ్లవచ్చు ఎక్కడికైనా తమరు.
ఎన్నెన్నో జలచరాలు చుట్టూరా మూగుతాయి.

జలరాక్షసులు మీవేపు చొచ్చుకుని వస్తాయి.
గోళం గోడలలోన మీరుంటారు సురక్షితంగా,
బంగారు డ్రాగన్లు వలయాలుగా పరిభ్రమించ
సొరచేపలు నోరు తెరచి కోరలను చూపుతాయి.
కావాలంటే మీరు వాటిని రెచ్చగొట్టగలరు!
మీ సభాసదులు హర్షధ్వానాలు చేస్తారు.
జలకన్యలు మీ దగ్గర్లో జలకమాడుతుంటారు.
ఈదండి! మహరాజా! మీకోసమే వాళ్లందరు.
థెటిస్ వేచి చూస్తున్నది నూతన పెలియస్ కొరకు
ఆమెతో కలిసి ఆనందాన్ని జుర్రుకోవచ్చు–
ఆ తరువాత, పైన ఒలింపస్, ఊర్ధ్వలోకాలు–

**చక్రవర్తి** : కృతజ్ఞతలు! అప్పుడే ఊర్ధ్వలోకాల ఊసువద్దు మిత్రమా!
ఆ సింహాసనం అందే రోజు అతిత్వరలో ఉందని, తెలియుమా!

**మెఫిస్టాఫిలిస్** : ప్రభూ! ఈ యావత్ భూమి ఎప్పుడో మీ స్వంతం!

**చక్రవర్తి** : ఎంతటి అదృష్ట అవకాశం మిమ్మల్నిక్కడికి రప్పించింది!
సరాసరి అరేబియన్ రాత్రుల్లోంచి ఊడిపడ్డట్లనిపించింది.
కథ చెప్పడంలో నీకు షెహర్‌జాదెకున్న నైపుణ్యం ఉన్నదని
ఋజువయ్యిందా, అత్యున్నత పదవి నీకిస్తా, సంశయించవలదు.
విసుగు పుట్టిన రోజున నీ అవసరం నాకుంది
ఆ అవసరం ప్రతిరోజూ ఉంటుంది.

**ప్రతీహారి** : **(త్వరత్వరగా వస్తూ)–**
మహాప్రభూ! ఇటువంటి వార్త తెస్తానని నేను కలలో కూడా అనుకోలేదు.
ఎంతటి అదృష్టం లభించింది మీకు! ఆనందంతో మాటరావడం లేదు నాకు.
ఇది కలా! నిజమా! అప్పులు తీరిపోయాయి!
ఋణదాతల కోపం చల్లారిపోయింది.
వాళ్ల భయంకర దంష్ట్రల నుంచి నాకు లభించింది విముక్తి.
స్వర్గానికుందా ఇటువంటి సౌఖ్యాన్నిచ్చే శక్తి!

**సేనాధిపతి** : **(అతడి వెనకనే వస్తూ)–**
సైన్యాల అప్పు సగం తీరిపోయింది.

సైనికులలో క్రమశిక్షణ ఏర్పడుతున్నది.
వాళ్ల మానసిక ధైర్యం పుంజుకున్నది.
పై అధికారుల మాటకు విలువ పెరిగింది.

**చక్రవర్తి** : మీ హృదయాలు తేలికపడ్డాయే!
మీ భృకుటి ముడులు తొలిగాయే!
రండి! రండి! మీ ఆలోచనలు విన్నవించండి!

**కోశాధికారి** : **(వస్తూ వస్తూనే)**
ప్రభూ! ఈ ఇద్దరినీ అడగండి! ఈ పనంతా వీళ్లదే!

**ఫాస్ట్** : అది మహామంత్రిగారే చెప్పాలి!

**మహామంత్రి (Chancellor -నెమ్మదిగా వస్తూ)–**
ఇంతకాలం బతికున్నందుకు విలువ లభించింది,
ఈ కాగితాన్ని చదవండి, వినండి, అవలోకించండి,
మన దరిద్రాన్ని తీర్చి మనల్ని ధనవంతుల్ని చేసింది.
**(చదువుతాను)**
ఎవరికి సంబంధించితే వారికి; సలహా ఇవ్వబడుతున్నది–
ఈ కాగితం ముఖ విలువ వేయి వరహాలు (క్రౌన్లు)
దానికి సమానమైన బంగారం భద్రపరచబడి వున్నది.
సామ్రాజ్యపు మాళిగలో గుప్తనిధిగా దాగున్నది.
వెలికి దీసినాక వెలకు తూచబడనున్నది.
ఇది మా వాగ్దానం! ఇది మా ఆజ్ఞ! అందరికీ శిరోధార్యం!

**చక్రవర్తి** : సామంత ప్రభువులారా! పచ్చి దగా, మోసం! కుట్ర!
ఈ దొంగ కాగితాలపై నా సంతకమెవరిది?
ఈ నేరానికి విధించబడలేదా శిక్ష ఎవరికీ?

**కోశాధికారి** : తమదే ఆ సంతకం! ఉత్సవాల ఊపులో చేసారు తమరు!
గత రాత్రి తమరు మహాదేవుడు 'పాన్' కదా,
మహామంత్రి వచ్చి అడిగాడు వినయంగా!–
'తమ చేతివ్రాత మారుస్తుంది ప్రజల రాత,
నాలుగు గీతలు గిలికితే మారుతుంది గీత'–
మీరు సంతకం పెట్టారు. కనికట్టు విద్యలోలా

రాత్రి మిగిలిన సమయంలో ఎన్నో కాగితాలు పుట్టాయి.
పదులు, ముప్ఫైలు, యాభైలు, వందలూ- వేలు-
చూడండి! ప్రజలెంత సంతసంగా ఉన్నారో!
సగం చచ్చిన నగరమెంత సందడిగా ఉన్నదో!
మీ నామ జపమే ప్రపంచమంతా!
ఆనందంగా పఠిస్తున్నారు ఆర్తజనమంతా!
మిగతా అక్షరాలకు విలువలేదిప్పుడు
మీ పేరులోనే ఆనందపు మెరుపు.

**చక్రవర్తి** : ఈ కాగితాన్ని ప్రజలు బంగారమనుకుంటున్నారా?
న్యాయస్థానం, సైన్యం నమ్ముతున్నారా దీన్ని?
ఆశ్చర్యంగా ఉందే! మరి, నేనిప్పుడేం చేయగలను?

**స్టివార్డ్** : వ్యాపించే వాటిని పట్టుకోవడం ఎవరితరం?
మబ్బుల్లా ఎగుర్తున్నాయి, మెరుపుల్లా మెరుస్తున్నాయి.
రహదారికిరుపక్కలా ధనమార్పిడి కేంద్రాలున్నాయి.
బంగారం, వెండికి కాగితాలు, కాగితాలకు వెండి బంగారం
మార్చి పెట్టేందుకు వసూలు చేస్తున్నారు కొంత రుసుం.
మాంసం కొట్టువాళ్లు, రొట్టెలమ్మేవాళ్లు, భూస్వాములు
డబ్బులు కూడబెట్టుకుంటున్నారు.
సగం ప్రపంచానికి కావాలి రొట్టె, మధువూ,
మిగతా వాళ్లు కోరుకునేది మంచి దుస్తులూ, నగలూ-
దర్జీలు కుడ్తున్నారు, బట్టల వ్యాపారస్తులు అమ్ముతున్నారు,
విందుల్లో వంటకాల తీరే మారిపోయింది.
రకరకాల మాంసాలు, మధు పానీయాలు
అందరూ ఆనందంగా ఎలుగెత్తి అరుస్తున్నారు
-'చక్రవర్తి'కి జయమని ముక్తకంఠంతో పలుకుతున్నారు.

**మెఫిస్టొఫిలిస్** : ఒంటరిగా మేడపైన వస్తుంటే, మిత్రమా!
అందాల యువతులు నీకంట పడతారు,
నెమలీక విసనకర్ర ఒక నేత్రాన్ని కప్పుతుంది,
ఈ కాగితం చూస్తే చాలు కాంత నీకు అందుతుంది.
ఏకాంత సేవతో తరింపచేస్తుంది.

బరువైన సంచితో పని లేదు ఇప్పుడు.
ప్రేమికురాలి గుండెపై కాగితపు చప్పుడు!
మతబోధకుడు కూడ మురిసిపోగలడు
సైనికుడు చూస్తే సైసై అనగలడు.
కాగితం తేలిక, విలువ తెలుసుకో ఏలికా!
మహాప్రభూ మన్నించండి!
తమ ఉన్నత సామ్రాజ్యాన్ని తక్కువ చేస్తున్నానుకుంటే!

**ఫాస్ట్** : అంతులేని సంపదలు దాగున్నాయి భూగర్భాన
ప్రభు సామ్రాజ్యమంతా బంగారపు ఖజానా
నిద్రపోయే నిధులను మేల్కొల్పండి నయాన
అంచనాలకు పెద్దుంది, హద్దు, ఆలోచన

అధిక ఆశ ఎగిరెగిరి పడిపోవచ్చు!
అంతులేని కథలా ఆగిపోవచ్చు,
అంతర్దృష్టి కలవాళ్లకు అందుతుంది కనకం,
అంతం లేని సంపదలపై ఉంచు నీ నమ్మకం!

**మెఫిస్టాఫిలిస్** : బంగారం, ముత్యాలకు బదులు ఈ కాగితం,
తేలికగా మోసుకుపోగల ధన రూపం,
నీ దగ్గర ఉన్నదెంతో తెలుసును నీకు,
బేరసారాల కిదెంతో భేషని పలుకు!
ప్రేమైనా, మధువైనా దీని రెపరెపలకు దొరుకు.

బ్యాంకులు అమ్ముతాయి నాణ్యమైన నాణేలు
పైకం లేకుంటే సాగించు తవ్వకాలు
స్వర్ణ హారమో, కలశమో దొరికితే అమ్మేసి,
కాగితపు అప్పును ఖచ్చితంగా తీర్చేయి.

నిన్ను సందేహించిన వాళ్ల కవుతుంది కనువిప్పు
ఆ తరువాత పుడుతుంది అంతులేని అప్పు
అందరికి నచ్చినది అందుబాటులో ఉన్నదిది
వజ్రాలు, స్వర్ణములా దొరుకుతుంది కాగితం!

**చక్రవర్తి** : ఈ సామ్రాజ్యం ఋణపడి వుంది మీకు,
సరైన సత్కారం చేయాలని వుంది నాకు!
మీకు నా రాజ్యపు నేలనంతా రాసిస్తాను.
ఈ సంపదలను కాపాడ మీరే సమర్థులు.
మీ మాట మీదే మేమీ నిధులు వెలికి తీస్తాం.

మా కోశాగారంలో మీరూ భాగస్వాములు
సంతోషంగా పూర్తిచేయండి మీ బాసలు.
ఇక్కడ రెండు ప్రపంచాలు ఒక్కటి కానున్నాయి.
భూలోకం అధోలోకం ఏకమవుతున్నాయి.

**కోశాధికారి** : పంపకాల గొడవల్లేవు, విభేదాలసలే లేవు.
మంత్రగాళ్లు సహచరులైతే చెప్పేందుకు మాటలు లేవు.
**(ఫాస్ట్‌తో కలిసి నిష్క్రమిస్తాడు.)**

**చక్రవర్తి** : బహుమతుల గురించి మాట్లాడుకుందాం ఇప్పుడు,
నా దయాపూర్వక హస్తాల నుంచి మీరేం కోరుకుంటారు?

**ఒక సేవకుడు** : **(కొంత డబ్బు తీసుకుంటాడు)**
నాకు ఉన్నత జీవితం, ఆట పాట, ఆనందం కావాలి!

**ఇంకొకడు** : **(డబ్బు తీసుకుంటూ)**
నా ప్రియురాలికి కొంటాను ఏడువారాల నగలు.

**అంతఃపుర ప్రభువు: (బహుమతి తీసుకుంటూ)**
ఇవ్వాళ్టి నుంచి రెండురెట్ల వ్యయంతో మధువు తాగుతాను.

**మరొకడు** : **(బహుమతి తీసుకుంటూ)**
అప్పుడే నా చేతులు పేకాటకు తిమ్మిరెక్కుతున్నాయి.

**చిన్న ప్రభువు** : **(ఆలోచిస్తూ)–**
నా ఆస్థులపై ఉన్న అప్పులన్నీ తీర్చేస్తాను.

**ఇంకొకడు** : **(ఆలోచిస్తూ)–**
నేను నా సంపదల్ని బహుళం చేస్తాను.

**చక్రవర్తి** : ఇవి మిమ్మల్ని కొత్త పనులకు పురికొల్పుతాయనుకున్నాను.
మీ నిత్యావసరాల్ని ఊహించడం తేలికే

కాని, మీరెంత ధనాన్ని సంపాదించినా
మీ మౌలిక ప్రవర్తనలో మార్పు రాదు, నిజం.

**విదూషకుడు** : **(మరల ప్రత్యక్షమౌతూ)**
అంతులేని సంపదలు, నాకేమైనా దక్కేనా?

**చక్రవర్తి** : వచ్చావా! తీసుకో, పోయి తాగి తగలెయ్యి!

**విదూషకుడు** : అవి మంత్ర కాగితాలు, ఏమంటున్నవి అక్షరాలు?

**చక్రవర్తి** : తప్పు చదువుతావు, పప్పులో కాలేస్తావు!

**విదూషకుడు** : ఇక్కడో కట్ట కింద పడి ఉంది, తీసుకోనా!

**చక్రవర్తి** : నిస్సంకోచంగా! నీ కొరకే అవి నిక్కినిక్కి చూస్తున్నవి.

**విదూషకుడు** : అయిదువేల వరహాలు (క్రౌన్లు) ఇవన్నీ నాకే!

**మెఫిస్టాఫిలిస్** : మృతుల నుంచి వచ్చావు లేచి,
అవునా, రెండు కాళ్లున్న సారాసంచీ?

**విదూషకుడు** : అది నాకు మామూలే, కాని ఇది బహు విడ్డూరంలే!

**మెఫిస్టాఫిలిస్** : ఆనందమెక్కువై ఆయాసమొస్తున్నట్లుంది.

**విదూషకుడు** : ఇది నిజం డబ్బేనా, లేక...?

**మెఫిస్టాఫిలిస్** : దీనితో నిండుతుంది నీ బానకడుపు కలకాలం!

**విదూషకుడు** : ఒక ఇల్లూ, పశువులూ, వ్యవసాయ భూములూ–

**మెఫిస్టాఫిలిస్** : ఏవైనా సరే! డబ్బు చూపించు! కొని తరించు!

**విదూషకుడు** : ఒక కోట, వేటాడ్డానికి అడవులు, చేపల ప్రవాహాలు?

**మెఫిస్టాఫిలిస్** : నిన్ను త్వరలో 'ప్రభూ' అని పిలవాలేమో, నేను!

**విదూషకుడు** : ఏమినా సౌభాగ్యం! ఈ రాత్రికే నేను గొప్ప ప్రభువునౌతాను.

**మెఫిస్టాఫిలిస్** : వీడిని తెలివిగల మూర్ఖుడను ఇప్పుడు,
నీవు చెప్పేది అక్షరాల సత్యం ఎప్పుడూ!

# 5. చీకటి భవనం
## (A Dark Gallery)

**(ఫాస్ట్, మెఫిస్టోఫిలిస్)**

**మెఫిస్టోఫిలిస్ :** మళ్లీ చీకటిదారులు! నన్నిక్కడికెందుకు లాక్కొచ్చావు?
ఆ రాజరికపు సమాజం
సరదా ఇవ్వలేదా నీకు?
కావలసినంత వినోదం, తమాషాల ప్రమోదం!

**ఫాస్ట్ :** దాని గురించి మాట్లాడనవసరం లేదు,
పాత రోజుల్లో వంద రకాలుగా ఆడావదే ఆట!
ఈ జారుడు బల్లల్నాపి నేనడిగిందానికి జవాబు చెప్పు!
వాళ్లకిప్పుడు క్రియ కావాలి, చేతలు చూపించాలి!
స్టివార్డ్, ఛాంబర్లీను నా బుర్ర తింటున్నారు.
చక్రవర్తికేమో హెలెన్, పారిస్‌లను చూడాలనే కోరిక.
ఆ ఆదర్శ ప్రేమికుల్ని తన కళ్లెదుట నిలపమంటాడీ ఏలిక!
నీ పని కానియ్! నా మాట పొల్లుపోకూడదు!

**మెఫిస్టోఫిలిస్ :** నీవు అలా వాగ్దానం చేసావా! ఎంత అసంగతం!

**ఫాస్ట్ :** నీకర్థం కావాలి, నీ చిలిపి పనులు,
చివరకెంత రాద్ధాంతానికొడిగడ్తాయో!
వీళ్లని ధనవంతుల్ని చేసి పేరు తెచ్చుకున్నాం,
ఇప్పుడు వినోదం కావాలంటే ఏం చేయగలం?

**మెఫిస్టోఫిలిస్ :** ఇది కానే కాదు మామూలు విషయం.
ఈ నిలువు మెట్లెక్కడం చాలా కష్టం,
నీకింతవరకు తెలియని వింత లోకం,
ఏం జరుగుతుందో ఊహకందని విశేషం;
గాలిలోంచి కాగితం డబ్బు సృష్టించినట్లు కాదు
కాలం గాని కాలం నుంచి హెలెన్‌ను తీసుకురావడం!
మంత్రగత్తెల్ని కావాలంటే వందల్నివ్వగలను–
చిన్ని పిశాచాలు, బుల్లి భూతాలు, ఇంకుబి, సక్కుబి
ఇట్లాంటివంటే చిటికెలో పుట్టిస్తాను–

సాతాను కిష్టమైన వాళ్లంతా క్షణంలో వస్తారు,
కాని, హోమర్ నాయికలకు ఏమాత్రం సరిపోలరు!

**ఫాస్ట్** : మళ్లీ మొదలెట్టావా వ్యర్థ విలాపం!
నీతో దేనికీ పూచీ ఉండదు కద!
ఎక్కువ ముట్టచెప్పకుండా ఏపనీ కాదు,
నీవు కనిపెట్టిన ప్రతిదీ సమస్యతో మొదలా!
ఈ క్షణమే వస్తుందామె, నీ శక్తి నాకు తెలుసు,
రెండు మంత్రాలు చదువు, ప్రత్యక్షం కాకపోతే అడుగు!

**మెఫిస్టోఫిలిస్** : ప్రకృతి ఆరాధకులు నా కాలం వాళ్లు కాదు.
వాళ్లుండే నరకం వాళ్లకి ప్రత్యేకం.
అయినా ఒక మార్గముంది–

**ఫాస్ట్** : వెంటనే కానీయ్!

**మెఫిస్టోఫిలిస్** : ఇది అత్యంత రహస్యం
దేవతాస్త్రీలుండే అంతఃపురం
కాలస్థలాల్లేని చోట నివాసం
మాతృమూర్తులని అందుకే అంటాం.

**ఫాస్ట్** : **(ఉలిక్కిపడి)–** మాతృమూర్తులా!

**మెఫిస్టోఫిలిస్** : ఎందుకు ఆ మాటవినగానే అంత వణుకు?

**ఫాస్ట్** : మాతృమూర్తి? ఎందుకాపదం వింతగా ధ్వనిస్తున్నది?

**మెఫిస్టోఫిలిస్** : నిజం! వారి గురించి మాట్లాడడానికే జంకుతారు,
ఈ దేవతాస్త్రీల పేరు చెబితేనే మర్త్యులు జడుస్తారు.
అగాధాల లోతుల్లోకి పోయి శోధించాలి.
వాళ్లు మనకు కావాలంటావా, ఆ తప్పు నీదే, సుమా!

**ఫాస్ట్** : ఎటు ఆ దారి?

**మెఫిస్టోఫిలిస్** : లేనిదారి! ఎవరూ తిరగకూడని, ఎవరూ తిరగని దారి!
నిషేధించబడిన వారు, నిర్మోహమాటస్థులు పోయే దారి,
తాళాలు తీయాల్సిన తాళాలుండవు, గొణ్ణేలు లేవు
ఒంటరితనంలో సుదూరంగా నిష్క్రమించాలి!
నీకు తెలుసా ఒంటరితనంలో కుంగిపోవడమేమిటో!

**ఫాస్ట్** : ఇవే నీ కోతలైతే, ఆపడం మంచిది.
ఈ మాటల్లో మంత్రగత్తె వంటగది వాసన ఉంది.
చానా కాలం నాటి కథలు నాకు తెలుసు.
ఆ ప్రపంచంలో నేను నేర్చుకున్నదేమిటి?
గాలికబుర్లు నేర్చుకుని వాటినే చదువు చెప్పాను.
నాకు తెలిసింది నేను చెప్పినప్పుడు
నాకంటే గట్టిగా అరచి నా నోరు మూసేవారు వాళ్లు.
చివరికి, ఎడారి ఒంటరితనాన్ని కోరుకుని
సమాజపు చిల్లర ప్రలోభాలకు లొంగకుండా పారిపోలేదా!
అటువంటి తోడు వద్దనుకునే కదా,
'డెవిల్'ను మేల్కొల్పాను, ఆహ్వానించాను!

**మెఫిస్టొఫిలిస్ :** అంతులేని సముద్రాన్నీదినా,
అనంతమైన అలలు కదుల్తూనే ఉంటాయి;
చివరకు మునక వేసే చోట కూడా కనిపిస్తుంటాయి–
ఆకుపచ్చ సముద్రంలో ఆడుతున్న డాల్ఫిన్లు.
మబ్బులు, సూర్యుడు, చంద్రుడు, తారలున్న ఆకాశం–
కాని, ఈ శాశ్వత శూన్యంలోకి నీవు పోతున్నపుడు
నీకేమీ కనబడదు, అడుగుల చప్పుడు వినబడదు
ఎక్కడ నీవున్నావో ఏమిటో ఏమీ తెలియదు.

**ఫాస్ట్** : ప్రాచీన మార్మిక శాస్త్రాన్ని బాగా వల్లెవేస్తున్నావు,
పొగమంచు మాటల్ని కొత్త ముఖాలకు చెప్పినట్లు;
అది నాతో కూదరదు. నేను నీ శూన్యంలోకి
ప్రవేశించింది నా కుశలతను వృద్ధి చేయడానికి.
అగ్నిలోంచి జీడికాయల్ని వెలికిదీసే హస్తాన్ని నేను
పద! వీటి అర్థాల్ని కనుగొనాలి మనమిప్పుడు!
నీ శూన్యంలోంచి కనుగొనాలి నేను సమస్తం!

**మెఫిస్టొఫిలిస్ :** నా అభినందనలు, ఆర్యా! నీవు వెళ్లే ముందు–
నీకు 'డెవిల్' గురించి బాగా తెలుసు– అది నాకు తెలుసు.
ఇదిగో తాళంచెవి.

**ఫాస్ట్** : ఇంత చిన్నదా!

**మెఫిస్టొఫిలిస్ :** గట్టిగా పట్టుకో! గౌరవించు దాన్ని!

**ఫాస్ట్ :** ఇది నా చేతిలో పెరిగిపోతున్నది
వెలుగుతూ నిప్పురవ్వలు కక్కుతున్నది.

**మెఫిస్టొఫిలిస్ :** ఇప్పటికైనా దాన్ని అర్థం చేసుకున్నావా,
రహస్య పటాన్నది చదవగలదు,
మాతృమూర్తులనెలవుకు తీసుకు వెళ్లగలదు!

**ఫాస్ట్ :** **(వణుకుతూ)**
మాతృమూర్తులు! ఆ మాట వినగానే నాలో ఏదో భయం!
నా హృదయం కంపించి ఒళ్లంతా ఏదో జ్వరం!

**మెఫిస్టొఫిలిస్ :** ఇంత అల్పుడివా! ఒక కొత్తమాట నిన్ను కలచివేస్తున్నదా!
ఇంతకు ముందు వినలేదా ఇటువంటి పదాల్ని
ఇక నిన్నే శబ్దమూ, ఇంద్రియమూ చలింపచేయకుందునుగాక!
ఎన్నో వింత సంఘటనలు నీకనుభవమౌ గాక!

**ఫాస్ట్ :** శిలగా మారిపోనున్నానా? జీవించలేనా?
ఆశ్చర్యమే కదా మనల్ని ఉంచేది సజీవంగా!
మానవ భావాల్ని ప్రపంచం అణచివేస్తుంది.
కాని అంతర్గత భయం మనల్ని లోతుల్లోకి నెట్టేస్తుంది.

**మెఫిస్టొఫిలిస్ :** దిగిపో మరి! నేనయితే 'పైకిపో' అంటాను!
నాకు రెండిటి మధ్య తేడాలేదు పెద్దగా.
పుట్టినాక నీకున్న అన్ని బంధాలు తెంచుకో
శూన్యరూపాలున్న లోకానికి చేరుకో
ఏనాడో అదృశ్యమైన నాగరికతను రుచిచూడు
మేఘ శకలాల్లా అవి నిన్ను అందుకుంటాయి.
తాళం చెవిని చూపించు, తాకలేవు నిన్నేవీ!

**ఫాస్ట్ :** **(ఉత్సాహంగా)**
గట్టిగా పట్టుకున్నాను, ఉత్తేజితుడనైనాను.
ఈ అన్వేషణకు వలసిన శక్తివంతుడనైనాను.

**మెఫిస్టొఫిలిస్ :** ప్రకాశిస్తున్న త్రిపీటిక నీ పడిపోవడం తెలుపుతుంది.
అగాధాల్లోని అట్టడుగును చేరుకున్నావని చెబుతుంది.

ఆ కాంతిలో నీకు కనిపిస్తారా మాతృమూర్తులు.
కూర్చుని కొందరు, నిలుచుని కొందరు, నడుస్తూ కొందరు,
రూపులు దిద్దుకుంటూ, రూపాలు మార్చుకుంటూ
శాశ్వత మనస్సు యొక్క శాశ్వత ఇష్టాలుగా,
నీవు వారికి కనిపించవు; వారి చుట్టూరా
అనేక శూన్య రూపాలు దండులా ముసురుకుని ఉంటాయి.
అపాయం పొంచి ఉంటుంది, ధైర్యంగా ఉండు!
సరాసరి త్రిపీటిక వేపు వెళ్లి తాళం చెవితో తాకు!
**(ఫాస్ట్‌– తాళంచెవిని ఆజ్ఞాపిస్తున్నట్లు నిలబడతాడు)**

మెఫిస్టొఫిలిస్ : **(అతడిని చూస్తూ)–**
అంతే! నీవెటు పోతే అది నీకూడా వస్తుంది.
అదృష్టపు రెక్కలు నిన్ను మరింత లేవనెత్తుతాయి.
భయంలేదు! ఆ సమయం ముగిసే లోపునే వెనక్కి రావాలి!
ఆ ప్రసిద్ధి చెందిన జంటను ప్రత్యక్షం చేయాలి!
ఇంతకు ముందెవ్వరూ ఇటువంటి పని చేయలేదు.
నీకు సాధ్యపడుతుంది జాగ్రత్తగా ఉంటే!
ఈ సుగంధ ద్రవ్యపు పొగ, ఈ మంత్రాల సెగ– ఇస్తుంది
ఎటువంటి దేవతారూపాన్నైనా నీవు కోరుకున్న క్షణాన!

ఫాస్ట్ : మరి ఏం చేయాలి నేనిప్పుడు?

మెఫిస్టొఫిలిస్ : గట్టిగా అడుగేయ్! లోనికి దిగుతావు!
మళ్లీ గట్టిగా అడుగేయ్! పైకి వస్తావు!

**(ఫాస్ట్ గట్టిగా అడుగేసి భూమిలోకి అదృశ్యమవుతాడు)**
**అతడిని ఆ తాళంచెవి రక్షిస్తుంది సదా!**
**తిరిగి వస్తాడా, రాడా, ముందుంది అసలు కథ!**

# 6. ప్రకాశవంతంగా వెలుగుతున్న ఆవరణలు
## (Brightly lit Halls)

**(చక్రవర్తి, రాకుమారులు, సభాసదులు - వెనకకూ ముందుకూ నడుస్తున్నారు)**

**అంతరంగికుడు: (మెఫిస్టోఫిలిస్‌తో)–**
ఆత్మల దృశ్యం చూపించాల్సి ఉంది. ఏమిటి ఆలస్యం?
వేచి ఉండడం చక్రవర్తులకు ఇష్టంలేని విషయం!

**దండనాధికారి :** ప్రభువు అడుగుతున్నారు ఇంకా ఎప్పుడని,
ఆలస్యం వారి ఘనతకు అవమానమని.

**మెఫిస్టోఫిలిస్ :** నా సహచరుడు ఆ పనిమీదనే వెళ్లినాడు,
అతడికి తెలుసు అది ఎలా చేయాలో!
మౌన శ్రమతో, మంచి నేర్పులతోనే సాధ్యమవుతుందది.
మార్మిక విషయాలు అంత సులువగా దొరకవు,
అందమనేది దాచబడిన నిక్షేపం, అది కళాకారుడికి తెలిసిన తంత్రం.

**దండనాధికారి :** కళలు తంత్రాలు నీ యిష్టం! త్వరగా ప్రారంభించు నాటకం!
ప్రభువుల వారు పడుతున్నారు వేగిరం! అదేమా విచారం!

**బంగారుజుట్టు బాలిక (మెఫిస్టోఫిలిస్‌తో)–**
ఒక్కమాట మీతో, ఆర్యా! సరైన రంగు నాది!
కాని వేసవిలో వస్తాయి ఏవేవో మచ్చలు
ఎర్రగా, పచ్చగా వందలాది పీడగా,
నా శ్వేత వర్ణ చర్మంపై చాలా అసహ్యంగా!
తమరే దయ ఉంచి ఇవ్వగలరు సలహా!

**మెఫిస్టోఫిలిస్ :** అందాల చందమామపై అటువంటి మచ్చలా,
ప్రతి వసంతవేళ పులిచర్మపు జాడలా?
కప్పగుడ్లు, మండూకపు నాలుక కలిపి ఇగరబెట్టు,
పున్నమి రోజున సుమా పూర్తిచేయి ఆ పనిని,
అమావాస్య దాకా ఆగి ఆవిరిపట్టు ఆనక,
మే నెల వచ్చేసరికి మచ్చలేవీ మిగలవు.

**నల్లపిల్ల** : ఈ పొగిడేవాళ్లు మీ చుట్టూ ఎలా మూగుతున్నారో!
నాకూ మీ సలహా కావాలి, నా పాదం గడ్డకట్టినట్లుంటుంది.
నాట్యం చేయాలంటే కలిసి రానంటుంది.
నడక, పరుగు, నృత్యంలో నన్నడ్డుకుంటు ఉంటుంది.

**మెఫిస్టాఫిలిస్** : అనుమతిస్తే నీ పాదంపై వేస్తాను నా పాదముద్ర!

**నల్లపిల్ల** : నాట్యమాడే ప్రతి జంటా చేసే పని అదే కదా!

**మెఫిస్టాఫిలిస్** : నా పాదం, అమ్మాయీ, దాని ప్రత్యేకత దానిది,
అన్ని రోగాలను కుదిర్చే శక్తి దానికున్నది.
ఒకదాన్ని పోలినది ఇంకోదాన్ని నయం చేసినట్లు
పాదానికి వైద్యం పాదంతోనే, మిగతావి కూడా అలాగే!
రా! స్థిరంగా ఉండు! నేను చేసినట్లు నీవు చేయకు!

**నల్లపిల్ల** : **(అరుస్తూ)**
ఓహ్! ఓహ్! గట్టిగా తొక్కావు నాయనో!
గుర్రపు గిట్టలా ఎంత బాధపెట్టిందిరా దేవుడో!

**మెఫిస్టాఫిలిస్** : ఏదేమైనా నీ సమస్య తీరిందిగా,
ఇక నాట్యంలో నీకెదురెవరూ లేరుగా,
పో! నీ బల్ల దగ్గర కూర్చుని పని చెప్పు పాదాలకు!

**ఒక యువతి** : **(అతడి దగ్గరకు రావడానికి ప్రయత్నిస్తూ)–**
నన్ను రానివ్వండి! నన్ను రానివ్వండి!
నా గుండె రగుల్తున్నది, దుఃఖం పొంగుతున్నది!
నిన్నటి వరకు నేనతడి ప్రేమరాణిని,
ఇవ్వాళ నన్ను పొమ్మని, దానితో తిరుగుతున్నాడెందుకని?

**మెఫిస్టాఫిలిస్** : అదా సమస్య! ఇప్పుడు నేను చెప్పినట్లు చేయి!
ఈ బొగ్గుముక్క తీసుకో! అతగాడి మీద గీత గీయి!
భుజం మీదో, అంగి మీదో, చొక్కామీదో,
మరుక్షణం గుచ్చుకుంటుంది ప్రేమముల్లు గట్టిగా!
వెంటనే మింగేయి ఆ బొగ్గుముక్క
తాగవద్దు మధువూ, కనీసం నీటిచుక్క

అట్లా చేసావో ఓ రమణీ! ఖచ్చితంగా
ఈ రాత్రికల్లా ఆ మగాడు నీ తలుపు దగ్గర నిలుస్తాడు!

**యువతి** : దీంట్లో విషముండదు కదా!

**మెఫిస్టొఫిలిస్** : **(బాధపడినట్లు)**
ఎంతమాట! కాస్త మర్యాద ఇవ్వరాదా!
మంటల్లో కాలిన కొయ్యలోదే బొగ్గుముక్క!
ఆరోజుల్లో చలిమంటలు అందరికి తెలుసునంట!

**ఒక వార్తాహరుడు:** నేను ప్రేమలో పడ్డాను, కాని వాళ్లు నాకు వయసు రాలేదంటున్నారు.

**మెఫిస్టొఫిలిస్** : ఈ మూర్ఖపు ప్రశ్నలకు నాకు విసుగు పుడ్తున్నది.
**(వార్తాహరుడితో)**
కన్నెపిల్లల వెంటబడితే వచ్చే కష్టాలివి,
కాస్త వయసు మీరిన వాళ్లనడుగు, మెచ్చుతారు నీ తెలివి!
**(మిగతా గుంపు అతని చుట్టూ మూగుతుంది)**
ఎటు చూసినా జనం! ఎటు తిరగాలో తెలియదు సుమండి!
ఆఖరి అస్త్రం సత్యభాషణం! మాతృమూర్తులారా 'ఫాస్ట్'ను విడవండి!
**(ఫాస్ట్ కోసం చూస్తాడు)**
అప్పుడే దీపాలు కొడిగడ్తున్నాయి.
సభ అంతా ప్రదర్శనకు ఎదురుచూస్తున్నది.
భవనం నలుమూలల్నించి సభికులు విచ్చేసారు
ఆవరణ యావత్తూ జనసమూహంతో కిటకిటలాడుతున్నది.

గోడలు సర్వాంగ సుందరంగా అలంకరించబడి ఉన్నవి.
మూలల్లో, సందుల్లో ఆయుధాలు మెరుస్తున్నవి.
ఇప్పుడు మంత్రాక్షరాలతో పని పడేట్లు లేదు.
ఆత్మలు వాటంతటికవే ప్రత్యక్షం కానున్నవి!

# 7. విశాలమైన వసారా
## (The Great Hall)

**(తక్కువ వెలుగు. చక్రవర్తి సదస్యులతో ప్రవేశం)**

**ప్రతీహారి** : ప్రదర్శనను ప్రకటించడం నాపని. కాని
ఈ ఆత్మల వ్యవహారం అంతుపట్టని గని.
వాటి రహస్య తంత్రాలు వివరించలేకున్నా
అద్భుతాల గుట్టుల్ని విప్పలేకున్నా!
చక్రవర్తి ఆసీనుడైనాడు తన సింహాసనంపై,
గోడమీద చిత్రించబడిన యుద్ధ సన్నివేశాలను
చూస్తూ అలాగే కూర్చున్నాడు సభికులతో
ముందు వరసలో ఉన్నారు రాజవంశీకులు,
వెనక చతికిలబడ్డారు సాధారణ ప్రేక్షకులు.
ఈ దయ్యాల నాటకంలో కలుగుతుంది వీలు,
ప్రేయసీ ప్రేమికులు పెంచుకోవచ్చు పరిచయాలు!
అంతా ఒక పద్ధతిలో, సవ్యంగా ఉన్నది
ఆత్మలు రావడానికి అత్యంత అనువవుతున్నది.
**(వాయిద్యాలు మోగాయి)**

**జ్యోతిష్కుడు** : ప్రభువు ఆజ్ఞతో ప్రారంభించాలి ప్రదర్శన,
గొప్ప మాయాజాలంతో గోడలు తెరుచుకుంటాయి.
అలంకరణలన్నీ అగ్నిలో అదృశ్యమై,
గోడలు విడిపోయి లోనివి బయటపడ్తున్నాయి.
నేను వేదికపైకి లేవనెత్తబడ్తున్నాను,
మసక మసక వెలుగులో మనసు మాట చెబుతాను.

**మెఫిస్టోఫిలిస్** : (వేదిక వెనక నిలబడి Prompting Boxలో)
అందరికీ నచ్చే వినోదమిప్పుడు అందుతుంది.
డెవిల్‌కు సంభాషణలందించే అవకాశం దొరికింది.
**(జ్యోతిష్కుడితో)**
నీకు నక్షత్ర గ్రహగతులు తెలుసు,
నా గుసగుసల్ని సరిగా విడమరచి పలుకు!

**జ్యోతిష్కుడు** : ఇంద్రజాల మహేంద్రజాలమిపుడు మీ కళ్లముందు ఉన్నది.
అతి గొప్ప దేవాలయం అది వెలయనున్నది.
ఆకాశాన్ని మోసే అట్లాస్ వృద్ధుడిలా
అనేక స్తంభాలు వరుసలుగా ఉన్నవి.
అయినా ఈ రెండు స్తంభాలు చాలును
ఎంత పెద్ద కొండనైనా ఇట్టే మోయగలుగును.

**శిల్పి (ఆర్కిటెక్ట్) :** ఇది పురాతన శైలి, నా దృష్టిలో ఇది వికారం,
కొండలా, బండలా, ఏమాత్రం నునుపు చేయని ఆకారం!
దీని వాళ్లు మెచ్చుకుంటారు, మహా నిర్మాణాలంటారు.
ఆకాశ హర్మ్యాలు మేము నిర్మించేవి ఎంత నాజూకుగా ఉంటాయి.
ఇవి బృహత్ శిలా నిర్మాణాలు! శిథిలాలుగా బాగుండే కట్టడాలు.

**జ్యోతిష్కుడు** : పూజారి దుస్తులు, పుష్పాలతో ఓ మంత్రవేత్త
వస్తున్నాడు తన పని పూర్తిచేసేందుకు;
అతనితో పాటు పైకెగసి వస్తున్నదో త్రిపీటిక.
సుగంధ సౌరభాలు విరజిమ్ముతున్న ధూమాలతో పాటుగా
మహత్తర కార్యాన్నతడు మనకు చూపిస్తాడు.
అంతా శుభమే జరుగుతుంది, ఆనందమే మిగుల్తుంది.

**ఫాస్ట్** : **(ఆడంబరంగా అగుపిస్తూ)–**
మహామాతలు, అనంత సింహాసనాధినేతలు!
ఎల్లకాలం మీరు సంచరిస్తారు, వెల్లడిస్తారు మనోభీష్ట రీతులు–
మీ తలల చుట్టూరా పరిభ్రమిస్తాయి అనంతకోటి జీవ రూపాలు.
బతికి గతించిన రూపాలు, ఒకప్పటి కీర్తికాంతి దీపాలు.
పెంజీకటిని మీ మహాశక్తి విడదీస్తుంది,
పగటి కాంతి గుడారం దాన్ని గ్రహిస్తుంది కొంత,
చీకటి రాత్రి అంతరిక్షం అందుకుంటుంది మరికొంత.
కొన్ని రూపాలు కలుస్తాయి జీవ ప్రవాహాన
కొన్నిటిని ధైర్యస్తుడైన మంత్రవేత్త చేస్తాడు ఆవాహన!
దారితప్పిన నమ్మకంతో మన కోరిక తీరుస్తాడు
అద్భుతమైన వింత దృశ్యాల్ని ఆవిష్కరింపజేస్తాడు.

**జ్యోతిష్కుడు** : అతడి మెరిసే తాళపుచెవి తాకుతోంది పాత్రను,
మరుక్షణంలో పొగమంచు కమ్ముకుంది ఆవరణను,
మేఘాల్లా అది మారుస్తున్నది రూపాలను క్షణక్షణం
పెరుగుతూ తగ్గుతూ, కలుస్తూ, విడిపోతూ ముక్కలై తక్షణం
ఆత్మల నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నదిదేమి విడ్డూరం!
మబ్బుల నుంచి వస్తున్న సంగీతం, ఎదపై ఏదో తీయని భారం!
వాయునాదాలు, మధుర స్వరాలు, అలల ప్రవాహాలై
ఏదో అతిలోక గానపు మాధుర్యం అలుముకుంటున్నదే!
స్తంభాలు, గోడలు శబ్దాలను పలుకగా
ఆలయం యావత్తూ ఆలపిస్తోంది గానం.
ఆవరించిన పొగమంచు నర్తిస్తూ పలచబడుతున్నది.
అడుగో వస్తున్నాడు, అందాల 'పారిస్' రాకుమారుడు.
పరిచయం అక్కరలేని అతిలోక సుందరుడు.

**(పారిస్ ప్రత్యక్షమవుతాడు)**

**ఒక మహిళ** : ఉప్పొంగే యవ్వనమా! వికసించిన పుష్పమా!

**మరొకామె** : పీచ్ పండులా రసపుష్టి, కొరికి తినేయాలనిపిస్తుంది.

**మూడవ స్త్రీ** : సున్నితమైన పెదాలు, రక్త బింబాధరాలు.

**నాలుగవ స్త్రీ** : మధుపాత్ర సౌష్ఠవం, పట్టుకు తాగేయాలంటున్నది నాదేహం.

**అయిదవ స్త్రీ** : అందగాడే గాని కాస్త తేడా వుంది.

**ఆరవ స్త్రీ** : సరిపడినంత శక్తి ఉందో లేదో!

**ఓ ప్రభువు** : గొర్రెలు కాచేవాడితడు, నేను గుర్తుపట్టాను!
మనలా రాకుమారుడు కాదు, అది చెప్పగలను.

**మరొకడు** : అర్ధనగ్నంగా అందంగానే ఉన్నాడు అంటాను,
కత్తీ డాలూ కవచం ధరిస్తే గాని ఖచ్చితంగా చెప్పలేను!

**ఓ స్త్రీ** : కూర్చుంటున్నాడు, ఎంత సొగసుగా, ఎంత హుందాగా!

**ఓ ప్రభువు** : నీ కతని ఒడిలో ఒరిగి తీసుకోవాలనిపిస్తుందా విశ్రాంతి?

**మరో స్త్రీ** : ఎంత నాజూకుగా ఎంత సుకుమారంగా అతడు,
తన తలను అరచేతిలో పొదుముకుంటున్నాడు!

**అంతఃపురాధికారి:** కాముకుడు! అటువంటి పద్ధతులిక్కడ కుదరవు.

**ఇంకో స్త్రీ :** ఎందుకు మీ మగాళ్లు అస్తమానం తప్పులెన్నుతారు?

**అంతఃపురాధికారి:** చక్రవర్తి ముందే కూర్చుంటాడా! ఎంత పొగరు!

**అదే స్త్రీ :** అది నటన! అతనికెవరూ కనబడరు!

**అంతఃపురాధికారి:** ఇది సభ! సభా మర్యాదలు పాటించాల్సిందే!

**ఒక స్త్రీ :** సున్నితమైన నిద్రలోకి జారుకుంటున్నాడా సుందరుడు.

**అంతఃపురాధికారి:** ఇక గురక పెడ్తాడు! సహజమే!

**ఓ యువతి :** **(తన్మయత్వంతో)**
ఏ సుగంధ ద్రవ్యాల పరిమళం ఇది,
నా ఎదను కదిలించి కరిగించుతున్నది.

**ఓ వయసుమళ్లిన మహిళ–**
అది అతడిలో వృద్ధిచెందు వికాసం,
అతడి యవ్వన సౌరభాల ప్రకాశం.

**(హెలెన్ ప్రవేశం)**

**మెఫిస్టోఫిలిస్ :** జగదేకసుందరి! సందేహం లేదు.
కాని, నాకు పనికి వచ్చే రకం కాదు.

**జ్యోతిష్కుడు :** నిజాయితీగా ఒప్పుకుంటాను నేను.
నాకు జ్వాలా నాలుకలున్నా వెంటనే అంటాను.
కాస్త నోరుమూసుకో! అదిగో అందానికి ప్రతిరూపం
ప్రాచీన కవులు వర్ణించే ఉన్మత్త సౌందర్యం
అధికమైతే ప్రమాదమయ్యే అతిలోక అదృష్టం.

**ఫాస్ట్ :** నాకింకా నేత్రాలున్నాయా, లేక
సౌందర్యపు నీటిబుగ్గ నా మనోఫలకాన్ని ముంచేసిందా!
ఈ భయంకర ప్రయాణానికి లభించిన బహుమతా ఇది!
ఈ నవ యవ్వన జగన్మోహన రూపం సాక్షాత్కరించే వరకు
ఈ ప్రపంచమే నాకు శూన్యంగా, శుష్కంగా నిర్జీవంగా కనిపించలేదా?
చివరికి కనుగొన్నాను కాలంతో నిమిత్తం లేని ప్రేమసృష్టిని.

నా జీవన ఊపిరి నశించిపోనీ!
సజీవస్థితి నాకు రాకున్నా పోనీ, నిన్ను వీడలేను!–
ఏనాటి మాయా దర్పణమిది?
ఏ సౌందర్యరూపం నన్నిలా అతలాకుతలం చేస్తున్నది!
ఏ సుందరదృశ్యం, ఏ మాయాశక్తిరూపమో!
నీకు అర్పిస్తున్నాను నా శక్తిని, నా సమస్త కోరికలను
ఉద్వేగపు అనంతత్వాన్ని, సమస్త అగ్ని సత్వాన్ని;
నిన్ను పూజిస్తాను, నా హృదయపు ఉన్మాదాన్ని.

**మెఫిస్టాఫిలిస్** : **(తెరవెనక నుంచి)**
ఉద్రేకం వద్దు! శాంతం! నీ పాత్రను అభినయించు!

**ఓ వృద్ధ స్త్రీ** : ఆజానుబాహురాలే కాని శిరస్సు చిన్నదిగా లేదూ!

**ఓ యువతి** : పాదాలెంత మొరటుగా ఉన్నాయి, ఆమెకు సరిపడినట్లు లేవు.

**ఉన్నతోద్యోగి** : అందరి కుమార్తెల్లానే ఉన్నదీమే!
నఖశిఖ పర్యంతం లావణ్య రూపమే!

**సభాసదుడు** : నెమ్మదిగా ఆమె వెళ్తోంది నిద్రిస్తున్న యువకుడి వేపు.

**ఒక స్త్రీ** : అతడి శీలాన్ని చెడగొడ్తుంది, నాకు నచ్చడం లేదు.

**ఒక కవి** : ఆమె సౌందర్య కాంతిలో అతడు వెలుగుతున్నాడు.

**ఇంకో స్త్రీ** : ఎండెమియాన్–ల్యూనా–తారాచంద్రులు–

**కవి** : ఆమె సుతారంగా వంగి అతని పెదాలను స్పృశిస్తున్నది.
ఆహా! ఎంత అదృష్టం! ముద్దుతో అతడిని మురిపిస్తున్నది.

**ఒక విమర్శకురాలు:** పదిమందిలో ముద్దులా! సిగ్గులేని వ్యవహారం!

**ఫాస్ట్** : ఆ యువకుడికి అందింది అదృష్టహారం!

**మెఫిస్టాఫిలిస్** : దెయ్యాలు దెయ్యాలే! వాటి స్వేచ్ఛ వాటికి వదిలేయి!

**ఓ సభికుడు** : ఆమె వెనక్కు తిరుగుతున్నది, మేలుకున్నాడతగాడు!

**ఓ స్త్రీ** : ఆమె వెనక్కు తిరిగింది, ఓరకంట చూస్తున్నది.

**సభికుడు** : అతడు ఆశ్చర్యపడ్తున్నాడు! తన కళ్లను నమ్మలేకపోతున్నాడు!

| | | |
|---|---|---|
| ఓ స్త్రీ | : | ఆమె కది మామూలే! అందుకే ఏ మార్పులేదులే! |
| **సభికుడు** | : | ఎంత హొయలు చిందిస్తూ అతనివేపు తిరిగింది! |
| ఓ స్త్రీ | : | అవును! అతడినికెప్పుడు నేర్పుతుంది చదువు,<br>ఈ మగవాళ్లొట్టి మూర్ఖులు, ఆమె ఇస్తుంది చనువు,<br>అతడనుకుంటాడు ఆమె ప్రేమ దక్కింది తనకే ముందని. |
| ఓ ప్రభువు | : | సణుగుడు మానేద్దాం! సౌందర్యాన్ని ఆస్వాదిద్దాం! |
| ఓ స్త్రీ | : | మామూలు బజారు వేశ్య! చూడు! ఎంత బరితెగింపు! |
| **సహాయకుడు** | : | అతడి స్థానంలో నేనుంటే ఏమివ్వలేను! |
| **సభికుడు** | : | ఆమె వలలో పడనివాడు ఇంకా ఇలలో పుట్టలేదు. |
| ఓ స్త్రీ | : | అందమైన వజ్రాన్ని అనేకసార్లు వాడితే,<br>దానిలోని మెరుపుకూడ స్వర్ణంలా తగ్గును. |
| ఇంకొక స్త్రీ | : | పదేళ్లకే మొదలెట్టిందట ప్రేమ వ్యవహారం. |
| ఓ ప్రభువు | : | మేం అవకాశవాదులం! ఇతరులు పారేసినవి<br>మంచి వస్తువులైతే ఏ మాత్రం నిరాకరించం! |
| **మేధావి** | : | సాధారణంగా కనిపిస్తున్నదామె! వాస్తవమా కాదా తెలీకున్నది.<br>ఆమె ఇక్కడున్నదంటే నమ్మడం అసాధ్యం,<br>నేను చదివిన పుస్తకాల్లో ట్రాయ్ కథ అసామాన్యం,<br>గడ్డం ఉన్నవాళ్లంతా ఆమె ప్రేమలో పడింది నిజం.<br>నేను యువకుణ్ణి కాదు కాని, ఆమె ఆకర్షణ శక్తి అమోఘం! |
| **జ్యోతిష్కుడు** | : | ఇంకేం బాలుడతడు! అతడి చేతులామె చుట్టూరా!<br>అకస్మాత్తుగా పైకెత్తుకుని పోతున్నాడు చూసారా! |
| **ఫాస్ట్** | : | దుందుడుకు వెధవ! ఎంత ధైర్యం వాడికి?<br>ఆపండి వాడిని, లేదా, నేనే అడ్డుపడతా దారికి! |
| **మెఫిస్టాఫిలిస్** | : | అంతా నీ మనసు చేసే మాయాజాలం,<br>ఆత్మలు, దయ్యాల అలజడుల కాలం. |
| **జ్యోతిష్కుడు** | : | కథంతా అయ్యాక చెబుతాను పేరు,<br>'హెలెన్ మానభంగం' అంటే ఏమంటారు మీరు? |

**ఫాస్ట్** : మానభంగం! నా మాటెవ్వరూ లెక్కచెయ్యరా?
నా చేతిలో ఉందింకా తాళం చెవి!
ఒంటరి మార్గాల్లో మార్గదర్శనపు తావి;
సముద్రమంత కల్లోలంలో చూపించింది దారి
మరల నేలమీదకు చేర్చిందాసారి.
ఇక్కడ నేను అడుగు పెట్టాను, వాస్తవాల్ని చూస్తున్నాను.
ఆత్మలు కలహిస్తాయిక్కడ ఆత్మలతో,
కలుస్తాయి రెండు సామ్రాజ్యాలు!
ఎంతో దూరమేగినా దగ్గర్లోనే ఉందామె,
ఆమెను రక్షించి చేసుకుంటా స్వంతం!
రెండోసారి! మాతలారా! మాతృమూర్తులారా!
వరాన్నిచ్చి నన్ను కనికరించండి!
అన్నీ తెలిసినవారు పోనియకండి ఆమెను!

**జ్యోతిష్కుడు** : ఫాస్ట్! ఫాస్ట్! ఏమిటి నీవు చేస్తున్నది?–
పట్టుకున్నావా ఆమెను, క్షీణిస్తున్న కాంతిరూపును?
అతడు తాళంచెవితో ఆ యువకుడిని తాకుతున్నాడు
అయిపోయింది! మన కథ ముగిసింది! ఓహ్! ఓహ్!

**(భయంకర విస్ఫోటనం. ఫాస్ట్ నేలపై పడిపోయాడు. ఆత్మలు మంచులా కరిగిపోయాయి)**

**మెఫిస్టోఫిలిస్** : **(ఫాస్ట్‌ను భుజాన వేలాడేసుకున్నాడు)**
మీరంతా చూసారుగా!
మూర్ఖులతో కార్యం,
దుఃఖానికి మార్గం!
డెవిల్ కూడా నేర్చుకున్న గుణపాఠం!

**(చీకటి, గందరగోళం)**

# రెండవ అంకం (Act II)

## 8. ఎత్తైన పైకప్పున్న ఇరుకుగది

**ఇదివరకటి ఫాస్ట్ గది. ఏం మార్పు లేదు. తెరవెనక నుంచి మెఫిస్టొఫిలిస్ వస్తాడు. ఫాస్ట్ మంచం మీద బోర్లా పడుకుని కనిపిస్తాడు.**

**మెఫిస్టొఫిలిస్** : శయనించుము, అభాగ్యుడా! మరలా వలలో పడ్డావుగా!
దారితప్పిన ప్రేమికుడా, నిన్నిప్పుడెవరు విడిపించగలరు?
హెలెన్ పడగొట్టిన మగాళ్లు, తేరుకోవడమంత తేలికకాదు.
**(అటు చూస్తూ)**
నా నయనాలను పైకెత్తి, నలువేపులా చూస్తున్నాను;
అప్పుడెలా ఉండేదో, ఇప్పుడలానే ఉందీ గది.
అద్దాలు మరింత మసకబారినాయి.
మరిన్ని సాలెగూళ్లు రాజ్యమేలుతున్నాయి.
సిరా గడ్డకట్టింది, కాగితం రంగు మారింది.
కాకుంటే, అన్నీ తమ స్థానాల్లో అమరే ఉన్నాయి.
ఒప్పందం సంతకం చేసిన కలం అదిగో అలానే ఉన్నది.
ఎండిన రక్తం చుక్క పాళీకి అతుక్కున్నది.
దాచుకోవాల్సిన విలువైన వస్తువు, అరుదైనది.
అతని పాత అంగీ కొక్కేనికి వేలాడుతున్నది.
అతడి విద్యార్థితో నేను పేల్చిన మాటలు
ఇంకా నాకు గుర్తున్నవి.
వాటిని నమ్మి వాడిప్పుడు పెరిగే ఉంటాడు కాస్త.
ఓ ఉన్ని కోటు! నీలో ఇమిడి మరలా
చేయాలనుంది ఆ ప్రహసనం మరోమాటు!
తాను చెప్పిందే యదార్థమనేది మేధావి మాట.
చదువుకున్న వాళ్లందరూ నడిచేదదే బాట!
డెవిల్ ఎప్పుడో తప్పుకున్న సయ్యాట.

**(కోటు దులపగానే లోనుంచి పురుగులు, కీచురాళ్లు రెక్కల పురుగులు ఎగుర్తాయి)**

**కీటకాలపాట** : మన యజమాని వచ్చాడు ఈ దినం,
అతడి చుట్టూ మూగి పాడుదాం సంగీతం!

నీవు మాకు తెలుసు, నీకు మా ఆహ్వానం,
అక్కడ కొన్ని ఇక్కడ కొన్ని ఉంచిన నీకు వందనం!
మేమిప్పుడు పెద్ద దండులా గాలిలో ఎగురుతాం!
మనిషి చెడు ఆలోచనలు ఎదలో దాగుంటాయి.
కాని, అతడి అంగీలోని పురుగులు బయట పాకుతుంటాయి.

**మెఫిస్టొఫిలిస్ :** ఆనందాశ్చర్యం! యువ కీటకాల్లారా!
ఎప్పుడో విత్తిన పంట కోతకు వచ్చిందిప్పుడు,
ఇంకోసారి దులుపుతానీ దుమ్ముకున్న కోటును,
ఇంకాసిని నేస్తాలు ఎగురుకుంటూ రానీ!
ఎగరండి పైకి! ఎగరండి వలయంగా!
లక్షలాది స్థలాలు మీ దాగుడుమూతలకు నెలవులు
పచ్చబడిన కాగితాలు సరిపోకపోతే
దుమ్ముకొట్టుకున్న పుస్తకాలలో దూరిపోవచ్చు
పగిలిన పాత కుండల్లో పాకుతూ రావచ్చు.
పట్టుకాయల్లో నిదుర సగం సగం నిలుచును.
మెదడులో పురుగు కలకాలం తొలుచును.

**(అంగీ తొడుక్కుంటాడు)**

అంగీ! నా భుజాలను కప్పివుంచు!
ఈరోజు మరలా నేనే నాయకుడిని,
అటువంటి అధికారం నాకుంది కాని,
గుర్తింపు లేని దానిలో గుణమేముంది చెప్పు?

**(గంట బయటకు తీసి మోగించగానే ఆ చప్పుడుకు గోడలు కదిలి తలుపులు వాటంతటకవే తెరచుకుంటాయి)**

**ఫాములస్ : (నడవలో పరుగెత్తుకుంటూ వస్తాడు)**
**(ఇంద్రజాలికుడి సహాయకుడు)**

ఈ వెధవ గంట చేస్తోంది ఎంత పెద్ద గడబిడ!
మెట్లు దడదడలాడుతున్నాయి, గోడలు వణుకుతున్నాయి,
కంపిస్తున్న కిటికీలోంచి కనిపిస్తున్నాయి మెరుపులు,
పై కప్పులు పగుల్తున్నాయి, నేల నిండా నెర్రెలు
ఇసుకా, సున్నం, రాళ్లూరప్పా, దుమ్మూధూళి జిమ్ముతున్నాయి.

తాళం వేసిన తలుపులు వాటంతటకవే తెరుచుకున్నాయి.
ఎక్కడ నుంచీ మాయాశబ్దం? అదుగో నిలబడి ఉంది.
ఫాస్ట్ గది ద్వారం దగ్గర ఓ భయంకర భూతం.
దేవుడు కరుణించుగాక! అతడు నావంకే చూస్తున్నాడు!
ఒళ్లంతో వణుకుతోంది, నిలబడనా, పారిపోనా?
ఏమవుతుందో నాకు ఎరుక కాకున్నది!

**మెఫిస్టోఫిలిస్** : **(పిలుస్తూ)–**
దగ్గరకు రా మిత్రమా! నీపేరు నికొడెమస్

**ఫాములస్** : గౌరవనీయులైన ఆర్యా, అది– ఒరెమస్.

**మెఫిస్టోఫిలిస్** : దానిని వదిలేద్దాం!

**ఫాములస్** : నన్ను గుర్తించారు, సంతోషం!

**మెఫిస్టోఫిలిస్** : నీ బుర్ర నన్నింకా సరిగా అంచనా వేయలేదు,
ఇంకా విద్యార్థివేగా చదువుకొని పోతూ ఉండు,
అదే నీకు గౌరవనీయమైన వేతనంగా భావించు.
ఒకడు పేకమేడ కట్టి దాంట్లో ఉందామనుకుంటాడు.
కాని గొప్పగొప్ప మేధావులే ఆ పని పూర్తిచేయలేరు.
కాని నీ అధ్యాపకుడు అతడిప్పుడు అనేక భాగాలైనాడు,
మనకందరకు తెలుసు వాగనర్, డాక్టర్ ఆఫ్ ఆర్ట్స్.
సకల కళా ప్రవీణుడు, గొప్పవాడు, మేధావులలో రాకుమారుడు.
అతడి దగ్గర వుంది సర్వ విద్యా రహస్యం.
ప్రతిరోజూ పెరుగుతుంది ప్రజ్ఞాన సర్వస్వం.
దూరదేశాల్నుంచి వస్తారు వినడానికతడి ప్రసంగం
విద్యాలయపు గదులు క్రిక్కిరిసేంత అభిమానం.
అతడు ప్రకాశవవంతమైన దీపం, సెయింట్ పీటర్ బీగం,
దానితో అతడు ఊర్ధ్వ అధోలోకాల రహస్యగదులు తెరుస్తాడు
తన ప్రతిభను ప్రదర్శించి ప్రత్యర్థులను తరుముతాడు.
అతని కీర్తికాంతులు ఈ నేలపై గొప్పవి
ఫాస్ట్‌ను అధిగమించి వెళ్లాడు ముందుకు
కొత్త విషయాలు కనుగొనడంలో వాగనర్‌ది పైచేయి.

**ఫాములస్** : గౌరవనీయులైన ఆర్యా! తమరి వ్యాఖ్యల్ని ఖండించవచ్చా!
నా అధ్యాపకుడు అటువంటి వాడు కాదు,
వినయంతో కూడిన సౌజన్యశీలి అతడు.
పెద్ద డాక్టరు అదృశ్యమైనాక
ఇతడు దిగులుతో కృంగిపోతున్నాడు.
ఫాస్ట్ వస్తేనే గాని కోలుకోలేడు
ఈ గదిని కూడా ఎవరూ ముట్టుకోలేదు
లోనకు అడుగబెట్ట సాహసించలేదు.
ఇప్పుడు ఈ విస్ఫోటనానికి కారణమేమిటి?
గోడలు కూడా భయంతో వణుకుతున్నాయి.
ద్వార బంధాలు కదిలి, తాళాలు ఊడిపోయాయి.
లేకుంటే, తమరు లోనికెలా వెళ్లగలిగేవారు?

**మెఫిస్టోఫిలిస్** : ఇటురా! నీ అధ్యాపకుడుండే చోటుకు తీసుకువెళ్లు!
నన్నతడి దగ్గరకు తీసుకువెళ్లు! లేదా అతడిని ఇటు తీసుకురా!

**ఫాములస్** : తనను పిలవవద్దని గట్టిగా చెప్పినాడు.
నెలల తరబడి ఒంటరిగా పరిశోధన చేస్తున్నాడు.
ప్రశాంతంగా ఉండేవాడప్పుడు, బొగ్గుల కుంపటిలా మండుతున్నాడు.
ముక్కునుంచి చెవి దాకా మసిగొట్టిన వ్యవహారం
కళ్లేమో ఎర్రగా చింతనిప్పుల్లా మండగా
మంటలను ఊదడం నిత్య కార్యక్రమం
ప్రతిక్షణం దేనికోసమో ఒహటే ఎదురుచూడడం
పట్టకారు చప్పుడు ప్రఫుల్లిత సంగీతం.

**మెఫిస్టోఫిలిస్** : నా రాక కలిగించగలదు అతనికి ఆనందం
కొన్ని పరిశోధన సలహాలు నేనిస్తా తక్షణం.
**(ఫాములస్ వెళ్లిపోతాడు. మెఫిస్టోఫిలిస్ సగర్వంగా కూర్చుంటాడు)**
అలా కూర్చున్నానో లేదో అప్పుడే నాకో అతిథి
ఇతగాడి మొహం పరిచయమున్నట్లున్నది.
ఇప్పుడితగాడు మారినట్లున్నాడు
జ్ఞానాన్ని కాసింత పుక్కిట పట్టినాడు.

పట్టభద్రుడు : (దారివెంట వెడుతూ)

తెరచిన తలుపులు, ఉచిత ప్రవేశాలు!
కొత్త నియమావళికి ఆశాసోపానాలు.
ఆరోజుల్లో ఇటువంటి చోట,
జనాలు శవాల్లా కుళ్లుతుండేవాళ్లు.
జీవితం అంటే చిన్నాభిన్నం కావడం,
మృత్యువు అంటే, నెమ్మదిగా నిరీక్షించడం!

గోడలు, ఆవరణలు, మీ రోజులు మీవి!
ఇప్పుడు శిధిలమై కూలుతున్నారు.
ఇది ఆగాల్సిన ప్రదేశం కాదు,
పడితే మృత్యువు నోట్లో పడినట్లే కాదూ!
ఇత్తడిలా నాకు ధైర్యమున్నది, కాని,
వీళ్ల చదువుతో పుత్తడిని కాలేదు.
అయితే ఇది ఇదివరకు నేనడుగిడిన చోటే!
చానా ఏళ్లక్రితం విద్యార్థిగా వినమ్రంగా నిలబడ్డాను.
ఎంత అమాయకుడిని ఆనాడు!
నెరసిన గడ్డం ఆచార్యులను నమ్మి
వాళ్ల కళలను నాకు అమ్మగా మోసపోయాను.

పాత పుస్తకాల్నుంచి వాళ్లు చెప్పిన అసత్యాలు
ఆ నాలుగు ముక్కలే వాళ్లకు తెలిసిన విద్యలు
వాళ్లకూ తెలుసూ అదంతా పచ్చి అబద్ధమని
అయినా, వాళ్ల జీవితాలూ నాదీ వృధా చేసారు.
ఎవరది? ఆ వెనకటి గదిలోనే
విషాద వదనంతో కూర్చున్నదెవరు?

అతడక్కడే ఆ పాత కోటు తొడుక్కునే ఉన్నాడు.
ఎంత ఆశ్చర్యం! ఆనాడూ అదే అంగీ వంటిపై ఉన్నది.
అప్పుడు నాకతడు మేధావిలా అనిపించాడు,
అర్ధం కాని మాటలతో ఖంగుతినిపించాడు.
ఇప్పుడతని మాయలు నా దగ్గర పనిచేయవు.
అతడితో చెప్పేస్తా, నా మనసులోని మాటను!

ఆచార్యా! తమ ఖర్వాట శిరస్సు
లెథె 'బాధల' నదిలో ఇంకా మునగనట్లున్నది.
ఒకప్పుడు మిమ్మల్ని కలిసిన విద్యార్థి గుర్తున్నాడా?
అతడిప్పుడు పట్టభద్రుడై పలకరిస్తున్నాడు.
తమలో కనబడడం లేదెటువంటి మార్పూ
కాని నేను కొత్తమనిషిగా దిద్దుకున్నాను రూపు!

**మెఫిస్టాఫిలిస్** : నా గంట నిన్ను ఇక్కడికి రప్పించింది, సంతోషం!
నీమీద నాకెంతో గొప్ప అభిప్రాయం ఉండింది.
గొంగళి పురుగు, పట్టుకాయ చూసి చెప్పగలవు,
ఎటువంటి రంగుల సీతాకోకచిలుక అది కానున్నదో!
నగిషీ పట్టీలు, వంకీల జుట్టు చెబుతోంది
నీ శైలి, భవిష్యత్తుకు ఢోకాలేదని–
ఒక్కోసారి పిలక ఉంచుకుంటావా?
ఇప్పుడు మంచిగా కత్తిరించుకున్నావు శిరోజాల్ని–
అది ధీరోదాత్త లక్షణం,
నాయకుడిలా ఇంటికి పోతున్నావు, అనామకుడిగా కాదుగా!

**పట్టభద్రుడు** : పాతకాలపు ఆచార్యా! ఈచోటు మారలేదేమో కాని,
కాలం చాలా మారింది; మీరనుమతిస్తే ఆపుదాం
ఈ మాటలాటను! మీ పదాల ఇంద్రజాలంలో
పడేందుకు ఇప్పుడేం చిన్నపిల్లవాడిని కాను.
ఆరోజున హాస్యమాడి నన్ను శుంఠను చేసారు,
మళ్లీ అదే ఆట ఈనాడు ఇంకా ఆడలేరు.

**మెఫిస్టాఫిలిస్** : అనుభవం లేనివాళ్లకు అసలు సత్యం నచ్చదు;
అనుమానం లేని యువకులకు అలాగే చెప్పాలి,
కష్టాలమార్గం లోనే నిజాలు అన్వేషించాలి!
ఏళ్లు గడిచి వేళ్లు పాతుకున్నాక
మా స్వంత బుర్రలే మా పాఠశాలలనుకుంటారు
పాతకాలపు గురువును పెద్ద మూర్ఖుడంటారు.

**పట్టభద్రుడు** : వంచకుడనాలి! ఏ గురువు చెప్పాడు మాకు,
సత్యాన్ని సూటిగా మా ముఖాల మీదకు?

మెత్తని మనసున్న పిల్లగాళ్లను మాయమాటలు చెప్పి,
నవ్వుతూ, తెలివిగా, బురిడీ చేస్తారు!

**మెఫిస్టాఫిలిస్** : నేర్చుకోవడానికి ఓ సమయముంటుంది,
ఇప్పుడు నీకూ ఇతరులకు నేర్పే అర్హత లభించింది;
ఇన్నేళ్లు కష్టపడినందుకు అనుభవం పెరిగింది.

**పట్టభద్రుడు** : అనుభవం! పనికిరాని చెత్తా చెదారం!
మేధావికెందుకూ ఉపయోగపడని వ్యవహారం.
ఎన్నో ఏళ్ల నుంచి అందరికీ తెలిసిన దానిని
మళ్లీ తెలుసుకోవడమెందుకు, పనిలేక?

**మెఫిస్టాఫిలిస్** : **(కాసేపు తటపటాయించి)**
నాకర్థమయ్యింది నేను అజ్ఞానినని-
ఏమీ తెలియని సామాన్యుడినని-
ఎప్పటినుంచో నాకు తెలిసిన దేవ రహస్యం ఇదే!
అన్నీ తెలుసన్న వాడికేమీ తెలియదు- ఏమీ తెలవదన్నవాడికేదో తెలుసు.

**పట్టభద్రుడు** : ఇప్పుడు చూస్తున్నాను నేనొక తెలివైన జ్ఞానిని,
అర్థవంతంగా మాట్లాడిన తొలి వృద్ధుడ్ని.

**మెఫిస్టాఫిలిస్** : దాగి వున్న నిధుల కోసం నేలనంతా తవ్వాను,
స్వర్ణానికి బదులు గడ్డీగాదం కనుగొన్నాను.

**పట్టభద్రుడు** : ఒప్పుకోకతప్పదు, వెంట్రుకలు లేని మీ తల,
ఆ కపాలాల లానే బోలు అని లోపల!

**మెఫిస్టాఫిలిస్** : ప్రయత్నలోపం లేకుండా వినయాన్ని ప్రదర్శించగలవు.

**పట్టభద్రుడు** : జర్మనీలో, ఆర్యా, వినయమంటే పచ్చి అబద్ధం!

**మెఫిస్టాఫిలిస్** : **(చక్రాల కుర్చీని గొయ్యి దగ్గరకు జరుపుతూ)**
ఇక్కడ జనం ఎక్కువయ్యారు బాగా,
లోపల మీ దగ్గరేమన్నా దొరుకుతుందా జాగా!

**పట్టభద్రుడు** : ముదిమి మీద పడ్డప్పుడు ఇంకొకరిగా నటించడం అసంబద్ధం.
మనిషి జీవితానికి రక్తం ఆధారం, అస్తిత్వం!

యవ్వనంలో కాకపోతే ఉడుకు రక్తం పొంగేది మరెప్పుడు?
అనాది ఆచార్యా! తన నుంచి మరో నూతన ప్రాణిని
సృజిస్తుంది చూసావూ అదే అసలైన రక్తం.

చలనం కలిగిన దానితోనే సంచలనం కలుగుతుంది.
మీరు తలూపుతూ, కలలుగంటూ, ధ్యానం చేస్తున్న
సమయంలోనే మేం జయించాం సగం ప్రపంచం!
ఇంకా మీరు ప్రణాళికలు, కుట్రలు రచిస్తూ నెమరువేస్తూనే ఉన్నారు.

వృద్ధాప్యమనేది ఓ చలిజ్వరం! అదొక విషజ్వరం!
శీతలంగా గడ్డకట్టి, వణికిస్తూ బాధలు పెట్టి పీడిస్తుంది.
ముప్పై ఏళ్లు దాటినాక మృత్యువుతో సమానం.
నెత్తిమీద బాది మీ జీవితాన్నంతం చేయడమే సన్మార్గం.

**మెఫిస్టొఫిలిస్** : బాగా చెప్పావు; దీనికి డెవిల్ ఏమనగలడు?

**పట్టభద్రుడు** : డెవిల్ నిష్క్రమించడానికి కావాలి నా అనుమతి!

**మెఫిస్టొఫిలిస్** : **(తనలో)**
డెవిల్ తలుచుకుంటే నీ కుర్రతోకకు పెడ్తుంది ఇంకోముడి!

**పట్టభద్రుడు** : ఇది యువత చేసే ఘనకార్యం.
నేను తయారుచేసేంత వరకు నూతన ప్రపంచం ఆవిర్భవించదు.
సూర్యుడిని సముద్రం నుంచి వెలికిదీసేది నేనే!
చంద్ర భ్రమణాల్ని, గమనాన్ని నిర్దేశించేది నేనే!
నావి ఉదయపు వివిధ ఆభరణాలు.
నేను నడచిన ప్రతిచోటా ఆకుపచ్చ వనాలు.
రాత్రిపూట ప్రకాశిస్తాయి తారాతోరణాలు.
వాటి కాంతి హెచ్చుతగ్గులు నా చేతి వాటాలు.
నా వలన తొలగుతాయి పాతకాలపు ఆలోచనలు.
నేను తిరుగుతాను మరింత స్వేచ్ఛగా,
నా ఆత్మ ప్రబోధంతో, ఆత్మకాంతి వెలుగులో!
నా మనసు నింపిన ఆనంద పారవశ్యంలో
చీకటిని నా వెనక వదలి, వెలుగు పగటిలో వేగంగా నడుస్తాను.
**(వెళ్లిపోతాడు)**

**మెఫిస్టాఫిలిస్** : బ్రహ్మాండమైన బుర్ర– పో నీ గొప్పదారిలో
నీకేమనిపిస్తుంది ఇలా అనిపించాక
శతాబ్దాల నుంచి ఎవరూ ఆలోచించనిది, ఈ రోజుకూడా
తెలివైనదో, తెలివి తక్కువదో ఆలోచించలేదంటే!
అంతేకాక, మన యువకుడి వల్ల పెద్ద ముప్పేమీ లేదు–
కొన్నేళ్లు గడిచేసరికి ఉష్ణం శీతలమవుతుంది.
ద్రాక్షరసం సారాయి కావడానికి ఊరడం అవసరం
తయారీ వింతగా ఉన్నా, మధువు ఎంతో రుచికరం.

**(గోతిలో ఉన్న ప్రేక్షకులు చప్పట్లు కొట్టరు)**

నా మాటలు మీకు నచ్చలేదు కాబోలు;
ఫరవాలేదు, క్షమిస్తున్నా మిమ్మల్ని నేను;
గుర్తుంచుకోండి 'డెవిల్'కి వయసు మీరిందని,
మీరూ అతడి వయసులో, బాగా అర్థం చేసుకోగలరనీ!

# 9. ప్రయోగశాల (A Laboratory)

**(మధ్యయుగపు శైలిలో అనేక పరికరాలు అమర్చబడి ఉంటాయి)**

వాగనర్ : ఆ దరిద్రపు గంట గణగణ మోగింది భయంకరంగా,
మసిగోడల చెవులకు చిల్లులుబడి మార్మోగింది భీకరంగా!
చానాళ్ల నుంచి సందేహపడ్తున్న ఫలితం
ఇప్పుడు రూపం దాలుస్తుందన్న అనుమానం
చీకటి నుంచి వెలుగు, చిక్కటి నలుపు నుంచి తెలుపు
అలెంబిక్ గాజుకుప్పెలో అంగారాలు మెరుస్తున్నాయి.
వజ్రసమానమైన వెలుగుతో అగ్ని మండుతున్నది
చీకటిని ఆ కాంతి చిన్నాభిన్నం చేస్తున్నది.
స్వచ్ఛమైన తెలుపురంగు స్వేచ్ఛగా ప్రకాశిస్తున్నది.
ఓ దేవుడా! ఈసారి కూడా నాకు విజయాన్నివ్వు!
ఎవరక్కడ, తచ్చాడుతున్నది తలుపు దగ్గర?

మెఫిస్టాఫిలిస్ : అద్భుత పరిశోధకులకు అభివాదములు!

వాగనర్ : **(ఆతృతగా చూస్తూ)**
ఆశీస్సులు – ఈ ఘడియను పాలించే నక్షత్రం పేరుతో
**(తగ్గుస్వరంతో)**
ఊపిరి బిగబట్టు! మాటలు ఆగబట్టు!
దీర్ఘకాలపు యోగం ఓ కొలిక్కి వచ్చింది, నీ మీద ఒట్టు!

మెఫిస్టాఫిలిస్ : **(తగ్గు స్వరంతో)**
ఏమిటా అద్భుత పరిశోధన, ప్రయోగం!

వాగనర్ : **(గుసగుసగా)**
మనిషిని తయారు చేయడం.

మెఫిస్టాఫిలిస్ : మనిషా! ఏదైనా ఒక మాంఛి జంటను మంచమెక్కించావా!
ఈ ప్రయోగశాలలో ఇటువంటి సౌకర్యాలున్నాయా!

వాగనర్ : దేవుడు క్షమించుగాక! ఇప్పుడా పాత పద్ధతికి చెల్లు!
పునరుత్పత్తి అనేమాట పొల్లు!

జీవోత్పత్తి మొదలయ్యే తొలి క్షణాన్ని.
లోలోపల ఉప్పొంగే సునిశిత శక్తిని.
ఇచ్చి పుచ్చుకునే పద్ధతిని
తనను తాను తయారు చేసుకునే విధానాన్ని
దగ్గర దూరాల్నుంచి వచ్చేవాటిని ఆరగించుకుని–
–ఆ పాత పద్ధతంతా ఇక నుంచి రద్దు!
జంతువులంటావా, వాటి వ్యవహారం వాటికి ముద్దు.
అతి శక్తివంతుడైన మానవుడికిక శృంగారం వద్దు.
అందుకనే పాతరకం ప్రత్యుత్పత్తికి పెట్టాలి హద్దు.
ప్రయోగశాలలో పుట్టడమే ప్రతిమానవుడి హక్కు.
అదే గౌరవం! అందుకే నవీనశాస్త్ర జ్ఞానానికి మొక్కు!
**(కొలిమి వేపు దృష్టి తరలుస్తాడు)**
చూడు ఎలా ప్రకాశిస్తుందో! ఫలితం రాబోతోంది.
అన్ని దినుసులూ– మానవ సంభారాలు– అందులో ఉన్నాయి.
చాలా ఓపిక ఉండాలి వాటిని మిశ్రమం చేయడానికి,
జాగ్రత్తగా కలియబెడ్తూ, వడపోస్తూ, ఆవిరి చేస్తూ
మళ్లీమళ్లీ కలుపుతూ, వడపోస్తూ అలా చేస్తూ పోతే
ఎప్పుడో ఒకసారి అంతిమ పదార్థం అవుతుంది ప్రత్యక్షం.
**(మరల కొలిమి వేపు తిరుగుతాడు)**
పని చేస్తున్నది! కదిలే పదార్థం కదుల్తున్నది!
మన నమ్మకం దృఢమవుతున్నది!
ప్రకృతికి మాత్రమే తెలుసనుకున్నది,
ప్రయోగశాలలో ఋజువవుతున్నది.
జీవ పదార్థాల్ని పద్ధతిలో ఉంచేది ప్రకృతి.
దాన్ని కనుక్కుని వినియోగించడం మన పద్ధతి.

**మెఫిస్టాఫిలిస్** : ఎక్కువ కాలం బతికితే, ఒకటో రెండో విశేషాలు తెలుస్తాయి.
పెద్ద ఆశ్చర్యమేమీ ఉండదూ నాలాంటి పెద్దవాళ్లకు
ఇన్నేళ్ల తిరుగులాటల్లో చూసాను
ఇలాగే గడ్డకట్టిన మానవ సమూహాన్ని.

**వాగనార్** : **(గాజు కుప్పెవేపు నిశితంగా చూస్తూ)**
మెరుస్తోంది! ఉబ్బుతోంది! పైకి లేస్తోంది!

ఇంకో క్షణం చాలు! ఫలితం వచ్చేస్తోంది.
గొప్పగొప్ప ఆలోచనలు ఉన్మాద లక్షణాలు,
అని అందరు అనుకుంటారు తొలిసారి చెప్పినపుడు.
మనం నవ్వుతాం అడ్డదిడ్డంగా పెరిగిన వాటిని చూసి;
ఏదో ఒకరోజు మానవ మేధస్సు సృష్టిస్తుంది
ఆలోచించి సృష్టించే అద్భుతమైన మెదడును.

**(తన్మయత్వంతో గాజుకుప్పెవేపు చూస్తుంటాడు)**

గాజుకుప్పె సమతుల్యంగా స్పందిస్తోంది
ఇక తప్పు జరిగే ఆస్కారం లేదు!
పొగమబ్బులు కమ్మి తొలగిపోతున్నాయి.
జీవపదార్థం కదిలి సున్నితంగా సాగుతున్నది.
రకరకాల రూపులు మారి చిన్నమనిషిగా స్థిరపడుతున్నది.
ఇంతకన్నా నేనే మివ్వగలను,
ఈ ప్రపంచానికింకేమి కావలెను?
మానవ జన్మరహస్యం మన చేతుల్లోకి వచ్చింది!
విను, ఆ సంగీతపు ధ్వనులను–
శబ్దాలు, పదాలు, అర్థం గల మాటలు–సంభాషణలను–

**హోమంకులస్ (The Homunculus - గాజు కుప్పె నుంచి వాగనర్‌తో)–**

నా తండ్రీ! ప్రయోగం ఫలించిందిగా! ఎలా వున్నావు!
దగ్గరకురా! కౌగలించుకో మృదువుగా!
కాని జాగ్రత్తసుమా! ఈ గాజుకుప్పె పగలకూడదు!
అదే మరి ప్రయోగశాల ఫలితమంటే!
సహజ పెరుగుదలకు ఈ ప్రపంచం సరిపోదు,
కళాసృష్టికి కావాలి ఒక స్వంత చోటు.

**(మెఫిస్టాఫిలిస్‌తో)**

నీవు ఇక్కడే ఉన్నావా, చిలిపి నా పెదనాన్నా!
చాలా సంతోషం, సరైన సమయానికి నీవు రావడం,
అదృష్టం ఒక్కటే అలా చేయగలదు.
ఇప్పుడు నేనున్నాను కాబట్టి చేయాల్సిన పనులేవో చేయాలి.

ఈరోజు నుంచే పని ప్రారంభిస్తాను
ఏ పని నాకు అనువైనదో నీ సలహా అడుగుతాను.

**వాగనర్** : ఒక్కమాట! ఈ ప్రశ్నకు సమాధానం ఎలా ఇవ్వాలో
తెలీదు నాకు!
ఆత్మదేహంలోకి ప్రవేశిస్తుందెలా?
అంత సరిగా ఒదిగిపోవడం సాధ్యమవుతుందెలా?
ఒదిగిపోయాక రాత్రింబవళ్లు సలుపుతుంది ఎందుకలా?
ఇంకా–

**మెఫిస్టాఫిలిస్** : చాల్చాలు! ఆగు! దానికన్నా ఈ ప్రశ్న అడుగు!
ఎందుకు మగా, ఆడా భరించలేరు ఒకరినొకరు?
మిత్రుడా! అటువంటి ప్రశ్నలకు జవాబులుండవు
చేయాల్సిన పని చాలా ఉంది, వేచివుండే రకం కాదు మన అతిథి.

**హోమంకులస్** : ఏం చేయాలి?

**మెఫిస్టాఫిలిస్** : **(పక్క తలుపు చూపించి)**
నీవు నయం చెయ్యాల్సిన దొకటుంది–

**వాగనర్** : **(ఇంకా గాజుకుప్పెలోకి చూస్తూనే)**
ఎంత ముద్దులొలుకుతున్నాడో పసిబాలుడు
**(పక్క తలుపు తెరుచుకుంటుంది. ఫాస్ట్ కనిపిస్తాడు పడుకుని)**

**హోమంకులస్** : **(ఆశ్చర్యంగా)–**
ఎంత ఆశ్చర్యం–
**(వాగనర్ చేతిలోంచి గాజుకుప్పె ఎగిరి
ఫాస్ట్‌పై ఆగి కాంతి వెదజల్లుతుంది.)**

అతి సుందరమైన ప్రదేశం!
స్వచ్ఛమైన సెలయేటి ప్రవాహాలు చిక్కటి అడవుల్లో;
జలకాలాడడానికి రమణులన్నీ సిద్ధం చేస్తున్నారు.
మనోహర దృశ్యం! ఇంకా రమణీయమౌతున్నది.
ఆ యువతులందరిలోనూ అత్యంత లావణ్యవతి ఆమె–
మహావీరుల వంశంలోనో, దేవతల అంశలోనో జన్మించినట్లున్నది.

హంసలా ఒక్కొక్క అడుగు వేస్తూ నీటివేపు నడుస్తున్నది.
ఆమె సుందరదేహంలోని జీవన జ్వాల
ఆ నీలిజలకాల అలలలో ఉపశమిస్తున్నది.
కాని, అదేమిటి? రెక్కలను అల్లల్లాడిస్తూ,
నీటి తలాన రివ్వున జారుతూ ఆమెను సమీపిస్తున్నదేమిటి?
ఆమె సహచరులు చెల్లాచెదురై పారిపోతున్నారు,
కాని, ఆ యువరాణి లెడా (Leda) ప్రశాంత నేత్రాలతో పరికిస్తున్నది.
ఆమె హృదయం గర్వంతో ఉప్పొంగుతున్నది.
హంసల రాకుమారుడు తన మోకాళ్ల వద్ద వినమ్రుడు కావడం.
ఆమె స్త్రీ సహజ సంతృప్తికి తృప్తినిచ్చింది.
నెమ్మదిగా, ధైర్యంగా అతడు ఆమె కాళ్లమధ్య చేరాడు.
అంతే, వారి చుట్టూరా ఒక తెరల వలయం.
బయటకు ఏమి కనిపించదు లోనివారి ప్రణయం.

**మెఫిస్టొఫిలిస్ :** ఎంత వింత కథ! నీ ఊహలు పరిమాణంలో నీకన్నా పెద్దవే!
మరి నాకేమీ కనిపించడం లేదే!

**హోమంకులస్ :** ఎందుకు కనిపిస్తుంది? ఉత్తరపు కళ్లు నీవి!
మధ్యయుగపు మంచులో కూరుకున్నవి.
మునులు, సాయుధ ప్రభువులున్న ఆ యుగంలో
సహజంగా నీ దృష్టి మందగించి ఉన్నది.
చీకటి రోజులు కదా నీ చిత్ర ప్రపంచం!

**(చుట్టూరా చూసి)**

నల్లని నాచుపట్టిన శిలలు, గోథిక్ పైకప్పులు
అసంబద్ధ కట్టడాలు, ఎంతో పాత చెక్కడాలు
ఇప్పుడు నిద్రలేచాడా, ఈ క్షణమే చచ్చిపోతాడు
నగ్న స్త్రీలు, హంసలు, వనాల మధ్య సెలయేళ్లు
అతడి సందేశాత్మక స్వప్నాలలో అతడున్నాడు.
ఈ చీకటి కూపంలో భవిష్యత్తేం లేదు.
నాకూ లేదు, ఎంత శుభ్రంగా లేకపోయినా,
అందుకే ఉంటాను అతడి కతిదూరంగా!

**మెఫిస్టొఫిలిస్ :** మంచి పరిష్కారం!

**హోమంకులస్ :** యోధుడిని యుద్ధం చేయమను,
అందాల యువతిని రాత్రంతా నాట్యం చేయమను,
అటువంటి పనులు అర్థవంతంగా ముగుస్తాయి.
అవును కదూ– ఈరోజు మంత్రగత్తెల రాత్రి
– క్లాసికల్ వాల్‌పర్గిస్ నైట్–
మంచి అవకాశం నాకు! నేనంటాను!
ఇతగాడు తన మామూలు స్థితికి చేరుకుంటాడక్కడ!

**మెఫిస్టొఫిలిస్ :** నా కటువంటి రాత్రి ఉన్నట్లు గుర్తులేదే!

**హోమంకులస్ :** నిజమా! నీవు వినలేదా! నరకంలో
నీవూ నీ సంతానం కామపిశాచాలుగా ప్రసిద్ధం,
అసలైన దయ్యం ఇతిహాసకాలంగా ప్రఖ్యాతం!

**మెఫిస్టొఫిలిస్ :** ఎక్కడికి పోతాం? ఎక్కడ శోధిస్తాం?
మా చరిత్ర ఆచార్యులంటేనే చిరాకూ, భయం!

**హోమంకులస్ :** సాతాన్, వాయువ్యమూల నీ అడుగుజాడ!
కాని ఈసారి మనం ఆగ్నేయ మూలకు వెళ్తున్నాం.
పెనియస్ నదీ ప్రవాహం వేపు ప్రయాణిస్తున్నాం.
చెట్లూ, పొదల్తో ఆ ప్రదేశం తడిగా ఉంటుంది.
చిత్తడినేలల కావల చిత్రమైన కొండలుండే
కొత్త, పాత 'ఫార్సాలస్'ను కనుగొంటామిప్పుడు.

**మెఫిస్టొఫిలిస్ :** అహా! బానిసలు నియంతల మధ్య భయంకర యుద్ధాలు,
ఆ రక్తపాత దృశ్యాలను చూపిచడానికే ఈ పయనాలు?
పాత పుచ్చిపోయిన కథ. మొదలు కాగానే ముగుస్తాయవి.
ముగిసీ ముగియగానే మరలా మొదలవుతాయి.
వాళ్లకు తెలియదు వాళ్లు అస్మోడియస్ రూపాలని
స్వేచ్ఛకై చేస్తున్నామనుకుంటారు పోరాటం!
నిజానికది బానిసలతో ఇంకోరకం బానిసల యుద్ధం.

**హోమంకులస్ :** వాళ్ల చావు వాళ్లు చావనీ! మనుషులెప్పటికీ మారరు.
బాల్యం నుంచీ అట్లాగే అనుకుంటూ పెద్దవాళ్లౌతారు!

ఇక్కడ ప్రశ్నల్లా నీ స్నేహితుడినెలా బాగు చేయడం,
నీ దగ్గర మందుంటే ప్రయోగించు సత్వరం,
లేకుంటే, నేను చెప్పింది చేయడమే ఏకైక పరిష్కారం!

**మెఫిస్టాఫిలిస్ :** నా బ్లాక్సబర్గ్ మాయ పని చేయగలదు, కాని
విగ్రహారాధకుల నిబంధనలు అడ్డువస్తాయి నాకు,
ఈ గ్రీకులేనాడూ అంత సజ్జనులు కాదు
కాని వాళ్ల సంస్కార ప్రవర్తన నచ్చుతుంది నాకు.
మానవ జాతిని అనేక, పాపకార్యాల్లోకి ఆకర్షిస్తారు
కాని, ఇప్పటి పాపపు పనులు దిగులు పుట్టి ఏడిపిస్తాయి.
అది సరే, ఇప్పుడేం చేద్దామంటావు?

**హోమంకులస్ :** నీక్కావాలంటే కాలక్షేపం, సరదా,
థెస్సాలియన్ మంత్రగత్తెలను పిలిచేదా?

**మెఫిస్టాఫిలిస్ :** **(ఆశగా)**
థెస్సాలియన్ మంత్రగత్తెలా! నేను విన్నది నిజమైతే
ఖచ్చితంగా కలవాల్సిందే ఆ రకం గుంపును.
ప్రతి రాత్రి వాళ్లతో పడుకోటానికి కాదు
అది నా వ్యవహారం కానేరదు, ఒకసారి చూట్టానికైతే సరే.

**హోమంకులస్ :** నీ కోటును తీసి ఈ పెద్దమనిషికి కప్పు
మీ ఇద్దరినీ మోయగలదన్న సంగతి నీకు తెలుసు
నేను ముందు వెలుగుతూ దారి చూపిస్తాను.

**వాగనర్ :** **(ఆతృతగా)** మరి నేను?

**హోమంకులస్ :** నీ ఇంటి దగ్గరే ఉండి చెయ్యాలి గొప్ప పరిశోధనలు,
వ్రాత ప్రతుల్ని చదివి, మూలకాల్ని పోగుచేసే పద్ధతులు,
వాటన్నిటినీ రంగరించి జీవాన్ని వెలికి తీసే మార్గాలు.
అభివృద్ధి చేయాలి, వాటితో మరింత ముందుకు వెళ్లాలి!
ఏమిటి? ఎలా? ఇట్లాంటిదీ, ఎందుకూ, ఎప్పుడూ, అలా!
ఈలోగా నేను చుట్టివస్తా ప్రపంచాన్ని
ఏదో ఒక ముఖ్య విషయంపై ప్రసరిస్తా వెలుగును.

అప్పుడు మన ఈ గొప్ప పరిశోధన విజయవంతమౌతుంది.
నీ కష్టానికి తగిన ఫలితం దొరుకుతుంది.
సింగారం, గౌరవం, కీర్తి, ఆరోగ్యం, ఆయుస్సు
శాస్త్రానికి తోడ్పాటు, సుగుణాలు –ఇంకేం కావాలి?
మిత్రుడా! ఉంటాను! సెలవా, మరి!

**వాగనర్ : (విచారంగా)**
సెలవు! ఈ వీడ్కోలు కలిగిస్తున్నది విచారం!
మనమిక కలవమేమోనని మనసులో భారం!

**మెఫిస్టొఫిలిస్ :** పద వెళ్దాం గ్రీసుకు – చూస్తే నీ కళలని–
నాకనిపిస్తుంది, ఎన్నో విడిభాగాలున్న బొమ్మవని!
**(ప్రేక్షకుల వేపు తిరిగి)**
చూడండి తమాషా! ప్రతి ఒక్కరూ హమేషా!
తీసుకోవాలి తన జాతివాళ్ల సాయం అంతిమంగా!
ఈ గమ్మత్తు ప్రయాణాన, ఎంతో మత్తు నిషా!

# 10. వాల్‌పర్గిస్ నైట్
## (The Classical Walpurgis Night)
## 10ఎ. ఫార్సాలియన్ మైదానం- చీకటి పడింది

ఎరిక్తొ (Erichtho) :

ఈ భీకర ఉత్సవ కాళరాత్రి మొదలయ్యేముందు,
నేను, కాళ ఎరిక్తొను ఇక్కడ హాజరౌతున్నాను.
కవులు వర్ణించిన దానికన్నా అసహ్యంగా ప్రవర్తిద్దాం!
అతిశయోక్తుల కన్నా అధికమైన దుర్భాష
పొగడ్తలకు తెగడ్తలకు పొంగని ఆగని లొంగని వాక్ఘోష!
ఇప్పటికే మైదానాల నిండా బూడిదరంగు గుడారాల వరద
దుఃఖం భీభత్సం కలిసి ప్రవహించే రాత్రి నిషాల బురద.
ఎన్నిసార్లు పునః పునః ప్రత్యక్షాలు, పునశ్చరణాలు!
ఎవరూ ఎదుటివాళ్ల నిబంధనలు లెక్కచేయరు,
బలంతో ఆక్రమించుకున్న ప్రాంతాన్ని అప్పగించబోరు.
తన మనస్సును లొంగదీసుకోలేని వాడు,
ఇతరుల ఇష్టాన్ని లొంగదీయడానికి పోరాడతాడు.
తన గర్వాన్ని, అధికారాన్ని ఇతరులపై రుద్దుతాడు-

ఈ యుద్ధాల వల్ల మనకర్ధమయ్యేదొకటుంది-
ఎంత మహాశక్తి అయినా మరో శక్తిని ఢీకొన్నప్పుడు
తీయని స్వేచ్ఛా పూదండను తెంపివేసినప్పుడు
విజేత కనుబొమలపై నున్న ఇనుప కిరీటాన్ని మీటుతాడు.

ఇక్కడ 'పాంపే' తన గొప్పతనాన్ని కలగన్నాడు.
అక్కడ 'సీజర్' జయాపజయాల త్రాసును గమనించాడు.
వాళ్లిద్దరూ యుద్ధం చేస్తారు,
ప్రపంచానికి తెలుసు ఎవరు గెలుస్తారో!
పహారా నెగళ్లు వెలిగించబడ్డాయి- ఎర్రటి జ్వాలల్ని కక్కుతున్నాయి.
నేలమీద రక్తపు మడుగుల ప్రతిబింబాలు ఊపిరి తీస్తున్నాయి.
రాత్రి వింత కాంతి వారిపై మంత్రించబడినప్పుడు
హెలెన్ కాలం నాటి దళాలు ప్రత్యక్షమౌతాయి.
ఆ నెగళ్ల చుట్టూ ఎగుర్తూనో, కూర్చునో ఉంటాయి.

చంద్రుడు వెన్నెలలను కురిపిస్తున్నాడు.
అంబరాన సాగుతూ అనంతకాంతి ప్రసరిస్తున్నాడు.
గుడారాల భ్రాంతి తొలగి మంటలు నీలంగా మండుతున్నాయి.
కాని, ఏమిటది ఆకాశాన! తోకచుక్కా లేక ఉల్కా!
ఎక్కడి నుంచి ఊడిపడ్తున్నదీ అనుకోని అతిథి.
ప్రకాశిస్తున్న ఈ గోళంలో జీవం కదుల్తున్నది.
నేను పసిగట్టగలను జీవాన్ని, కాని,
దగ్గరకు వెళ్లానా కీడు తప్పదు జీవించి ఉన్నదానికి
నాకున్న అపకీర్తి అంత గొప్పది–
అదక్కడ నేలపై దిగుతున్నది– గౌరవంగా నేను నిష్క్రమిస్తాను.
**(ఆమె వెళ్లిపోతుంది. ఆకాశవాసులు కనిపిస్తారు)**

**హోమంకులస్ :** ఇంకోసారి చుట్టూ తిరిగి పూర్తిచేయి వలయం,
ఈ భీభత్స మంటల మైదానం రక్త నిలయం!
ఇంత దారుణ మారణ రణక్షేత్రం,
ఎప్పుడో ఒకసారి మాత్రమే దర్శించగలం

**మెఫిస్టోఫిలిస్ :** నా ఉత్తర ఊసరక్షేత్రాల్లో
నరకలోకపు వాసుల్ని చూస్తానుగా ఎప్పుడూ,
భయంకర భూతాలకు అలవాటు పడ్డానక్కడ,
ఇంట్లో ఉన్నట్టే ఉందిలే, నాకిక్కడ!

**హోమంకులస్ :** ఏదో పొడుగాటి రూపం అటే పోతున్నది.
మనల్ని చూసి కాబోలు, రాత్రిలోకి జారుకున్నది.

**మెఫిస్టోఫిలిస్ :** మనం గాలిలో ఎగరడం చూసినట్టుంది
భయంతో వెంటనే దూరంగా తొలగింది.

**హోమంకులస్ :** ఆమె దారిన ఆమెను పోనిద్దాం!
చచ్చినట్టున్న ఇతగాడిని నేలపైన ఉంచుదాం!
నా ఆలోచన నిజమైతే వెంటనే తేరుకుంటాడు,
తన స్వప్నాల లోకంలో తప్పకుండా తిరుగుతాడు.

**ఫౌస్ట్ :** **(నేలనంటుకోగానే)** ఆమె ఎక్కడ?–

**హోమంకులస్ :** అక్కడ మా కనుమానం ఉండెను, కాని
ఇక్కడ నీవు కనుక్కోగలవు లెమ్మని.

ఈ అగ్నుల్ని అన్వేషిస్తూ అలా అలా తిరిగిరా!
తెల్లవారక మునుపే రావాలి సుమా!
మహామాతలనే దర్శించగలిగినవాడివి నీవు.
అంత లోతుల్లోకి, అగాధాల్లోకి వెళ్లావు,
భయాలనేవి నీ కనుచూపు మేరకు రాలేవు.

**మెఫిస్టాఫిలిస్ :** నాకూ ఇక్కడ పని వుంది, నేనేమంటానంటే
ఇక్కడ ఎవరికి నచ్చిన దారి వాళ్లు వెతుక్కుందాం!
నెగడు నుంచి నెగడుకు, అగ్ని నుంచి అగ్నికి,
మళ్లీ కలవాలనుకున్నపుడు మిత్రుడా!
ఒక్కసారి వెలుగు! ఎలుగెత్తి పాడు, పలుకు!

**హోమంకులస్ :** మీకు కనిపిస్తుందొక మెరుపు, ఇలాంటిదే అరుపు!
**(గోళం శబ్దం చేస్తూ అత్యంత ప్రకాశవంతమౌతుంది)**
ఇక ఎవరిదారి వారిది, నే వెళ్తున్నానటు వేపు!
**(వెళ్లిపోవును)**

**ఫాస్ట్ :** **(ఒంటరిగా)**
ఆమె ఎక్కడ? - అయినా, అడగడమెందుకు?
ఆమె పాదాలు నడచిన నేల తెలియదా నాకు!
ఆమె కాళ్లను తడిపిన సముద్రపు అలలు చాలవా;
ఆమె మాటలను పొదుముకున్న వాయువీచికలు తెలపవా,
ఇదే! అద్భుతం! ఈ నేల, ఈ ప్రదేశమే గ్రీసుదేశం!
నేను గ్రహించాను, ఎవరో నిద్రలో నన్నిక్కడకు తెచ్చారు
ఏంటియస్‌లా నేనూ స్వస్థుడనై వెలుగుతున్నాను కాంతితో!
ఎన్ని అద్భుతాలు ఈ గుహల్లో దాగి ఉన్నాయో,
ఆ భయంకర మాళిగలో అన్వేషిస్తాను.
**(వెళ్లిపోతాడు)**

**మెఫిస్టాఫిలిస్ :** **(ముక్కు ఎగబీలుస్తూ)**
ఈ నెగళ్ల మధ్య ఉన్న రూప విశేషాల్ని చూస్తుంటే
నాపై నాకే అనుమానం వస్తున్నది.
దాదాపు నగ్నంగా, అర్ధనగ్నంగా వీళ్లు
లజ్జారహిత స్ఫింక్స్‌లు, మొరటు గ్రిఫిన్లు

పొడుగాటి రోమాలు, పెద్దపెద్ద రెక్కలు
ఎటు చూసినా  ఇవే ఇవే భయంకర రూపాలు
అట్లా అని నా లోకంలో ఇటువంటివి చూడలేదని కాదు-
ఈ పురాతన ప్రపంచ జీవనం నాకు సరిపడేట్లు లేదు.
మన నవీన ఆలోచనలతో వీటిని కట్టడి చేసి
రకరకాల నాగరిక పద్ధతులను అలవాటు చేయాలి!
అనాగరిక జంతు తెగలు! కాని వీళ్లను మర్యాదగా పిలుస్తాను.
అతిధిలా వీళ్లకు అత్యంత గౌరవాన్నిస్తాను.
అభివాదములు,  లావణ్యవతులారా!
వివేక వృద్ధులు గ్రెఫిన్‌లారా!

గ్రిఫిన్ : **(చీదరగా అరుస్తూ)**
గ్రిఫిన్స్ - గ్రేఫిన్స్ కాదు - ఎవరికీ ఇష్టం ఉండదు.
జుట్టు 'గ్రే' కలర్ ఉందని చెబితే!
మాటలు వాటి మూలాన్ని తెల్పుతాయి కాని
కొన్ని పదాలు గొంతులో గుచ్చుకుంటాయి.
గ్రే, గ్రీవస్, గ్రంపీ, గ్రూసమ్, గ్రేవ్‌యార్డ్, గ్రిమ్-
అక్షర సారూప్యంలో అక్షర సత్యాలు కావచ్చు
కాని అవి మాకు అక్షరాలా రుచించవు.

**మెఫిస్టొఫిలిస్** : అయినా, అవన్నీ ఒకటే తీరు,
గ్రిఫిన్, గ్రిప్పిన్ (Gripping)లా పలుకుతుంది అయినా మంచిపేరు!

గ్రిఫిన్ : **(కరకుగా, చీదరగా)**
కావచ్చు, పోలిక బానే వున్నది, కాని
మమ్మల్ని పొగడడం కన్నా మిక్కిలి నిందిస్తారు ఎందుకని?
గ్రిఫిన్ - గ్రిప్స్, గ్రాబ్స్, గరల్స్, క్రౌన్స్, గోల్డ్-
మంచి పట్టున్నవాళ్లకు అదృష్టం తోడు.

**చీమలు** : **(పెద్దసైజువి)**
ఎవరన్నది గోల్డు! మేం పోగుచేసాం బోలెడు!
కొండగుహల్లో భద్రపరచాం రహస్యంగా మేము
అరిమాస్పియన్లున్నారే ఆ దొంగజాతి జనం
అంటున్నారు గొప్పగా వాళ్లకు తెలుసా ప్రదేశం!

గ్రిఫిన్స్ : వాళ్లను మేము ఒప్పిస్తాం!

**అరిమాస్పియన్లు (Arimaspians)-**

ఈ రాత్రి వీల్లేదు! ఇది స్వేచ్ఛారాత్రి! జల్సా చేస్తాం!
తెల్లారేకల్లా అంతా ఖర్చుచేసి మా మాట నిరూపిస్తాం!

**మెఫిస్టాఫిలిస్** : **(స్ఫింక్స్ మధ్య చతికిలబడి)**
ఇక్కడ అలవాటు పడడం సులభమే!
నీ సంభాషణకు అర్థం ఉంటున్నది.

**స్ఫింక్స్** : మేము ఆత్మభాష విశ్వసిస్తాము,
మీరవి మాటలుగా విశ్వసిస్తారు,
ఇంతకీ చెప్పలేదు ఏమిటో నీ పేరు!

**మెఫిస్టాఫిలిస్** : నన్ను పిలుస్తారు చాలా పేర్లతో!
బహు ప్రమాణాలు చేసే బ్రిటిషువాళ్లు- లెజియన్-అంటారు.
యుద్ధరంగాలు, జలపాతాలంటే మక్కువ వాళ్లకు.
గబ్బుగొట్టే పురాతన కట్టడాలు, కూలిన గోడలపై మోజు!
ఇక్కడికెవరైనా వచ్చారా! మంచి విహారస్థలం!
వాళ్ల మార్మిక నాటకాల్లో నన్ను బాగా గుర్తిస్తారు.
నాపేరు- Old iniquity - ఆరోజుల్లో అనేవారు.

**స్ఫింక్స్** : ఎందుకలా పిలిచేవారు?

**మెఫిస్టాఫిలిస్** : నాకూ తెలియదు ఎందుకో!

**స్ఫింక్స్** : నీకు ఆకాశం, నక్షత్రాలు, అవన్నీ తెలుసునా,
గ్రహ పరిస్థితి గురించి చెప్పడం వచ్చునా?

**మెఫిస్టాఫిలిస్** : **(పైకి చూసి)**
తార తారను చూస్తున్నది, చంద్రుడు ప్రకాశిస్తున్నాడు;
ఇది ఆహ్లాదకరమైన ప్రదేశం
మీ సింహ చర్మాల మధ్య నేను చక్కగా ఒదిగి కూర్చున్నాను.
ఆకాశంలోకిప్పుడు ప్రయాణం అవసరమా!
అనవసరపు ఆయాసం! ఏదైనా పొడుపు కథో, పదమో!
అది ఇస్తుంది అపూర్వమైన ఆనందం!

**స్ఫింక్స్** : విచిత్రమైన పొడుపుకథకు వేరే వేరే వెదకాలా!
నీ గురించి తెలుసుకో అదే పెద్ద పని కాదా?
నిగూఢ చింతనతో నీలో విభజన గ్రహించు.
'సుగుణాలు, దురలవాట్లు రెంటికీ అతడు కావాలి,
సాధువు కొట్టే దెబ్బకు బొమ్మ ప్రతీకగా ఉండాలి.
పనికిరాని వాడు దూకేప్పుడు తోడుగా నిలవాలి.
ఇద్దరూ జ్యూస్ దేవుడికి ఇష్టంగా ఉండాలి!

**మొదటి గ్రిఫిన్ :** **(ముక్కుతూ)**
నాకిష్టం లేదు వాడు!

**రెండవ గ్రిఫిన్ :** **(మరింత గట్టిగా ముక్కుతూ)**
వాసన వేస్తున్నాడు వాడు!

ఇద్దరూ : ఇక్కడివాడు కాడు,
మనతో ఎందుకున్నాడు?

**మెఫిస్టోఫిలిస్** : **(రౌద్రంగా)**
బహుశా ఈ ఆగంతకుడి గోళ్లు,
మీ కాలిగోళ్లకన్నా తక్కువ పదుననుకున్నారా?
అడుగు ముందుకేసారా చీరేస్తా వళ్లు!

**స్ఫింక్స్** : **(అనునయిస్తూ)–**
నీవిక్కడ ఉండదలిస్తే అది నీ యిష్టం.
ఏమైనా త్వరలో వెళ్లిపోతావు, అది నీకు తెలుసు!
నీ ఇంట్లో నీవెప్పుడూ గొప్పవాడివే!
కాని ఇటువంటి చోట్లనే కాస్త ఇబ్బంది పడతావు.

**మెఫిస్టోఫిలిస్** : నడుముకు పైన నీవు నదరుగానే ఉంటావు,
అడుగు సగపు జంతురూపంతో హడలగొడతావు.

**స్ఫింక్స్** : మోసగాడా! ఈ అగౌరవానికి నిన్ను శిక్షిస్తాము!
మా పాదాలు అందంగా ఆరోగ్యంగా ఉన్నాయి.
ఎండి గట్టిపడిన నీ గిట్టలే అసహ్యంగా ఉంటాయి.
అందుకే నీకు మా దగ్గర ఉండబుద్ధి కాకున్నది.
**(సైరన్లు, చెట్లమీద కూర్చుని గొంతు సవరించుకుంటాయి)**

**మెఫిస్టోఫిలిస్** : ఈ దేవదారు చెట్లున్న ఏటి పక్కన
కొమ్మలపై కూర్చున్న ఆ పక్షులేమిటి?

**స్ఫింక్స్** : జాగ్రత్త! గొప్పగొప్ప వీరులు విన్నారు వాటి గానం!
నిద్రపోయి కలలుగని అదే ఆఖరి ప్రస్థానం!

**సైరన్లు** : ఈ చీకటి గుయ్యారాల దగ్గరెందుకు గుమికూడారు?
మాలాగా చెట్లపై సేదతీరండి హాయిగా,
మా మధుర గానాన్ని వినండి సైరన్ల శబ్దాలుగా!

**స్ఫింక్స్** : **(సైరన్లను అనుకరిస్తూ)**–
పాడకముందే ఆ పక్షుల్ని నేలపైకి ఈడ్వండి.
లేకుంటే కొమ్మల్లో దాక్కున్నా కాలిగోళ్లు పదునుగా,
నీ గుండెను చీల్చేసి తింటాయి హాయిగా!

**సైరన్లు** : అసూయాద్వేషాలను విడినాడండి.
ఆనందమిక్కడ విస్తరింపజేయండి,
నేలపై, నీటిపై మన అతిథిని సంతోషంగా ఆహ్వానించండి!

**మెఫిస్టోఫిలిస్** : ఇదన్నమాట సంగీతమంటే ఈ రోజుల్లో
తీగెలు కదిలినట్లు, గొంతు సవరించుకుని
నాదం తరువాత నాదం పెల్లుబుకుతున్నట్లు
అర్థం పర్థంలేని ట్రా–లా–లా
నా చెవిలో ఏదేదో టింకిల్–టింకిల్–లా
అంతేకాని అది నా హృదయాన్ని కదిలించడం లేదుగా!

**స్ఫింక్స్** : నీ హృదయం, మూర్ఖుడా! ఓ ఖాళీ సంచి కాదుగా
దానికన్నా ఎండుపోయిన తోలు సంచి కదుల్తుంది బాగుగా!

**ఫాస్ట్** : **(వస్తాడు)**
ఎంత అద్భుతం! అతిలోక సుందర దృశ్యం!
భయం గొలుపుతున్నా కట్టిపడేస్తున్నది, చిత్రం!
ఈ పవిత్ర దృశ్యం నాకే అదృష్ట ద్వారాలను తెరుస్తోందో!
**(స్ఫింక్స్‌ను ఉద్దేశించి)**
ఈ అద్భుత శక్తుల ముందే ఆనాడు ఇడిపస్ నిలబడింది!
**(చీమలనుద్దేశించి)**

వీళ్లే అనన్య సామాన్య స్వర్ణనిధులను పోగుచేసేది!
**(గ్రిఫిన్స్ నుద్దేశించి)**
వీళ్లే ఆ అనంత సంపదలను జాగ్రత్తగా కాపలా కాసేది!

నాలో ఒక పరిశుద్ధాత్మ తిరుగాడుచున్నది.
ఈ అలౌకిక రూపాలు అపురూప జ్ఞాపకాలను గుర్తు చేస్తున్నవి.

**మెఫిస్టొఫిలిస్** : ఒకప్పుడు వీటిని చూసి తిట్టేవాడివి, అవునా!
వాటవసరం పడినట్లుంది పొగుడ్తున్నావు చానా;
ప్రేమికులు తమ స్వప్న వస్తువులు పొందడానికి,
దారిలో ఎదురయ్యే రాక్షస రూపాలక్కూడా దండాలు పెడ్తారు.

**ఫాస్ట్** : **(స్ఫింక్స్‌తో)**
నీవు స్త్రీవి కదా, నిజం చెప్పు,
హెలెనాను మీలో ఎవరైనా చూస్తే ఆ గుట్టు విప్పు!

**స్ఫింక్స్‌లు** : మాది ఆమె కాలం కాదు. ఆమె పుట్టకముందే మేం ఉన్నాం!
ఈ భూమ్మీద ఆఖరి స్ఫింక్స్‌ను చంపాడు హెర్క్యులస్
నీకు నిజం కావాలంటే ఈ దయ్యాలరాత్రి– 'చిరాన్' కనిపిస్తే అడుగు,
ఈ చుట్టుపక్కలే పరుగులు తీస్తుంటాడు ఆగకుండా!
ఆగితే కాళ్లావేళ్లా పడు, నీక్కావాల్సిన సమాచారం దొరుకుతుంది.

**సైరన్లు** : నీకు విజయం సిద్ధించు గాక!
యులిసెస్ మా హరిత తీరానికి దగ్గరకు వచ్చినా
బతికి బట్టకట్టి కావాల్సిన కథలు తీసుకుపోయాడు.
మాతో రా! సముద్రపు అలలు ఆకాశాన్నంటే చోటుకు
నీవు వినదలుచుకున్న దాన్నేదీ అక్కడ మేం నీనుంచీ దాచం!

**స్ఫింక్స్** : తిరస్కరించు! ఓ అపరిచితుడా! అవి తప్పుడు ఆశలు!
తాళ్లతో కట్టివేసుకున్నాడు కాబట్టి యులిసెస్ బతికిపోయాడు,
మా సలహాకు కట్టుబడి ఉండు నీకు జరుగుతుంది మేలు!
'చిరాను' చెప్పే మాటలు అవుతాయి నీకు శ్రవణానందకరములు!
**(ఫాస్ట్ నిష్క్రమిస్తాడు)**

**మెఫిస్టొఫిలిస్** : **(విసుగ్గా)**
ఏమిటివి? రెక్కలతో వేగంగా ఎగుర్తూ సకిలిస్తున్నవి?

కంటికి కనిపించకుండా వాయువేగంగా పోతున్నవి.
ఒకదాని వెనక ఒకటి గుంపుగా, ముక్కూతోకా దగ్గర దగ్గరగా
వేటగాడి బాణం కూడా గురి తప్పుతుంది వేసాక!

**స్ఫింక్స్** : ఆకాశాన్ని కమ్ముకునే శీతాకాలపు తుఫానుల్లా
స్టింఫాలియాడ్ పక్షులు దూసుకువస్తాయి.
హెర్క్యులిస్ బాణాల కన్నా వేగంగా ఎగుర్తాయి.
డేగ ముక్కులు, బాతు కాళ్లు
బొంగురుగా అరుస్తూ ఆహ్వానం చెబుతాయి.
మమ్మల్ని సోదర భావంతో పలకరిస్తున్నాయవి.

**మెఫిస్టోఫిలిస్** : **(భయంగా)**
ఇంకేదో ఉంది, బుసలు కొడుతోంది.

**స్ఫింక్స్** : లెర్నియన్ సర్పపు తలలవి, భయంలేదు-
శరీరం లేదు కాని తయారీలో ఉన్నాయనుకుంటాయి.
కానీ వివరించు! ఎందుకు నీలో అసహనం?
ఎక్కడికి, ఆర్యా, తమ ప్రయాణం?
వెళ్లిపోవాలనుకుంటే పోవచ్చు తక్షణం.
మెడపైకెత్తి చూస్తున్నావు, వెళ్లి చేరు ఆ సమూహం!
ఆ చక్కటి బృందానికి పలుకు స్వాగతం
ఆ 'లామియే' పిశాచాల తళుకు బెళుకులు చూడు
నీబోటి మేకగిట్టల వాడికి ఆ 'సాటిర్'లు సరిజోడు!

**మెఫిస్టోఫిలిస్** : మీరిక్కడే ఉంటారా! మనం మళ్లీ కలుస్తామా!

**స్ఫింక్స్** : తప్పకుండా! గాలి గుంపులో కలుద్దాం.
ఈజిప్టు నుంచి వచ్చాం మేము,
వేలాది ఏళ్ల పరిపాలనకు అలవాటుపడ్డాం
మాకు ఇవ్వాలి నీవు గౌరవం.
సూర్యభ్రమణం, చంద్ర పయనం
దేశదేశాల భవిష్యత్తు నిర్ణయం
చేస్తూ పిరమిడ్ల ప్రక్కన కూర్చుంటాం
యుద్ధాలు, వరదలు, శాంతి పోతుంటే
కనురెప్ప వేయకుండా చూస్తూనే ఉంటాం.

# 10బి. పెనియస్
## (నదీ దేవుడు ఉపనదుల్తో, జలకన్యలతో)

**పెనియస్** : నెమ్మదిగా, ఓ గుసగుసలు పోయే పొదల్లారా!
నా సోదరీమణులు రెల్లు పరకల్లారా!
చక్కని పిల్ల తెమ్మెరలతో స్వాంతన నివ్వండి!
విల్లో శాఖలారా! మృదుమధురంగా ధ్వనించండి!
కంపిస్తున్న పోప్లర్ వృక్షాల్లారా! ఆగిన నా కలను అనుకరించండి!

ఏదో భయంగొలిపే వణుకు నన్ను మేల్కొల్పుతున్నది
ఏదో మార్మికమైన చలనం నన్ను వణికిస్తున్నది.
నా కదిలే గాఢ నిద్రా ప్రవాహాన్ని మరింత కదిలిస్తున్నది.

**ఫాస్ట్** : **(నది అంచు వద్దకు వచ్చి)**
ఆకులు శాఖలు కలిసి అల్లికలై
పొదరిళ్లుగా గుసగుసలు పోతున్నవి
ఏవో మానవ స్వరాల సంగీతం వీనులకు వినిపిస్తున్నది.
అలలు వాయువీచికలతో అలా భ్రమింపచేస్తున్నవి?

**నింఫ్స్ (జలకన్యలు) ఫాస్ట్‌తో :**
స్వాగతం! ఈ చల్లని ప్రదేశంలోనికీ!
అలసటను తీర్చుకుని హాయిననుభవించవోయీ!
సాంత్వన నీకు మేలు చేస్తుంది,
పోయిన మనశ్శాంతి లభిస్తుంది,
మా చల్లని, తీయని మాటలు హాయిని కలిగిస్తాయి!

**ఫాస్ట్** : నిదురలేస్తున్న స్వప్నమా! నిలిచిపో అలానే!
నిరీక్షిస్తున్న - నా నయనాలు నిర్మిస్తున్న మనోహర రూపాల్లారా!
ఏమిటీ ఈ ఆనందం నన్నింత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది?
చానాళ్ల క్రితం ఇటువంటిదే అనుభవించాను.
ఇవి స్వప్నాలా, లేక జ్ఞాపకాలా!
ఆ ఒత్తైన పొదలపై కదుల్తున్న ఆకులెంత స్వచ్ఛంగా ఉన్నాయి!
ఈ వనం గుండా సన్నటి సెలయేళ్లు తరంగాలు లేక ప్రవహిస్తున్నవి!
అది వందలాది జలధారాలు నింపిన అందమైన నీటిమడుగు,
జలకాలాడబోయే కన్యలకు స్వచ్ఛంగా కనిపిస్తుంది దాని అడుగు.

వారి ప్రతిబింబాలు ప్రస్ఫుటంగా కానరాగా రెండింతలౌను నా సంతోషం,
కొందరు ఈదుతూ, కొందరు నీళ్లను కదిలిస్తూ, గలగలమని నవ్వే దృశ్యం.
నా కనులు పారశ్యంతో గమనిస్తాయి ఈ విభ్రాంతికర చిత్రం
నా మనసు తృప్తినొందునుగాక; నేను చూడని వాటిని వీక్షించునుగాక!
నా దృష్టి ఆ ఆకుల దడిని ఛేదించుకునిపోతున్నది
తన హరిత వలయం వెనుక అందాలరాణిని దాస్తున్నది.

ఎంత విచిత్రం! హంసలు నదీజలాల్నుంచి వస్తున్నాయి.
వాటి హొయలు, నడకలు, ఠీవిని గమనించు
హంసలరాజు కాబోలు అందరికీ ముందు దర్పంగా నడుస్తున్నది.
తమ రెక్కలను పురివిప్పి తరంగపు అగ్రంలా ముందుకు పోతున్నవి.
మిగతా హంసలు తమ చెలులతో పరాచికాలాడుతున్నాయి.
పిరికి కన్యలు తమ వెంటబడే వారి నుంచి పరారౌతున్నవి.

**జలకన్యలు** : అక్కలారా! సావధానంగా వినండి!
డెక్కల చప్పుడు! ఏదో గుర్రం ఇటే పరిగెత్తుకు వస్తున్నది!
ఎవరింత వేగంగా, వార్తాహరుడిలా, రాత్రి సంచరిస్తున్నది?

**ఫౌస్ట్** : నేలపై చెవి ఆన్చి విన్నాను
అవి ఖచ్చితంగా అశ్వపు గిట్టల చప్పుడే
అదుగో దూరంగా
అదృష్టం వస్తున్నది నావేపు!
అది నాకు ఇస్తుంది ఆసరా
నా గమ్యం చేరుకునే లోపు!
అతడు అశ్వనరుడు; చూడగానే
బలశాలి, జ్ఞాని అని చెప్పగలను నేను
ఆ గుర్రం మెరుస్తున్నది తెల్లగా
గుర్తుపట్టాను.... గుర్తుపట్టాను...
'ఫిలిరా' తనయుడు, పేరుప్రఖ్యాతులు కలవాడు!
ఆగు, చిరాన్! ఆగు! మాట్లాడాలి నీతో నేను.

**చిరాన్** : ఏమిటిది? ఎవరు? ఎందుకు?

**ఫౌస్ట్** : కాస్త వేగం తగ్గించు.

**చిరాన్** : ఆగడం అలవాటు లేదు.

**ఫౌస్ట్** : అయితే నన్నూ నితో కొనిపో!

**చిరాన్** : ఎగిరి గంతేసి ఎక్కు! ఇప్పుడు మాట్లాడగలను
ఇబ్బంది లేకుండా! ఎక్కడికి పోతావు నీవు?
పెనియస్ నదీతీరాన ఏం చేస్తున్నావు?
కావాలంటే ఆ ఒడ్డుకు తీసుకెళ్తాను ఈ క్షణమే!

**ఫాస్ట్** : **(ఎగిరి ఎక్కుతూ)**
నీవెక్కడికంటే అక్కడికే వెళదాం పద,
అందుకో నా అంతులేని కృతజ్ఞతలు సదా!
ఘనుడా, ఉన్నతుడా, గొప్ప కీర్తిగలవాడా!
ఎందరో వీరులకు గురువై ఖ్యాతిగడించినవాడా!
ఆర్గోనాట్ల గురించి చెప్పనా, నీ శిష్యులు వాళ్ళు,
ప్రపంచ కవుల ఊహలకు ప్రాణం పోసినవాళ్ళు.

**చిరాన్** : అదలా ఉండనీ! తెలివైన ఎథేనా కూడ తెలుపబడ్తుంది.
విధి విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించి, విద్యను మెరుగు పరుస్తుంది.

**ఫాస్ట్** : మహా వైద్యుడా! అన్ని వృక్షాలను, వాటి వేళ్లను తెలిసినవాడా!
గాయాల్ని నయం చేసి రోగులకు స్వస్థత చేకూర్చేవాడా!
అటువంటి నిన్ను కౌగలించుకున్న నా అదృష్టమెంత గొప్పది!

**చిరాన్** : గాయపడిన నా స్నేహితులెందరినో స్వస్థపరచాను నేను.
మానేసానిప్పుడు; పూజారులు మంత్రగత్తెలు చేస్తున్నారాపని నేడు.

**ఫాస్ట్** : గొప్పవారిలానే నీవెప్పుడూ గొప్పలు చెప్పుకోవు,
ఎన్నో ప్రత్యేకతలుండీ వినయంగా భాషిస్తావు.

**చిరాన్** : బాగా పొగడగలవు నీవు
రాజులకు ఆనందం, ప్రజలలో ఆవేశం పుట్టించగలవు.

**ఫాస్ట్** : కనీసం ఈ సంగతైనా ఒప్పుకోగలవు–
ఎందరో ధీరోదాత్తులైన వీరుల్ని చూసావు,
ఎన్నో గొప్ప కార్యాల్ని చేసావు, నిష్కల్మషంగా నిలిచావు–
నీ జీవితం దేవతల్లా సుఖంగా గడిచిందా లేక కష్టాల్లోనా!
నీకు తెలిసిన శూరుల గురించి తెలుపు
ఎవరు అందరికన్నా అధికు వివరించు!

**చిరాన్** : ఆర్గోనాట్స్, అందరూ గొప్పవాళ్లే
ఎవరికివారు వాళ్ల విద్యలో కడు సమర్థులు.

ప్రత్యేక శక్తియుక్తులు ఎవరివి వాళ్లకున్నాయి.
జ్యూస్ దేవుడి కవల పిల్లలు– కాస్టర్, పొల్లాక్స్
అందంలో సాటి లేనివాళ్లు
ఉత్తరపు గాలి బొరియాస్ కుమారులు– బొరియాడ్స్
– సాయమందించడం, నిర్ణయం తీసుకోడంలో వేగవంతమైనవాళ్లు.
జేసన్ సాహసికుడు, తెలివిగలవాడు, మొండి, నాయకుడు
–అందరి ఆడవాళ్ల కళ్లూ అతడిపైనే ఉండేవి.
ఆర్ఫియస్ గానమంటే అందరికీ ఇష్టమే.
అతడి వీణానాదానికి స్వర ప్రపంచం సమ్మోహనమయ్యేది.
లైన్సియస్‌కు దూరదృష్టి ఎక్కువ
పవిత్రమైన నౌకను ప్రమాదాల నుంచి రక్షించడంపై మక్కువ.
అనుకోని ప్రమాదాల నుంచి బయటపడడమే అసలు పరీక్ష.
ఎవరు వెంటనే స్పందిస్తారో అతడికి అభినందనల రక్ష.

**ఫాస్ట్** : హెర్క్యులస్ సంగతేవిటి? అతడి పాత్ర లేదా!

**చిరాన్** : నా హృదయాన్ని కదిలించకు!
ఆ అపొలో, హెర్మెస్, ఏర్స్ నన్ను కలవకున్నా బాగుండేది!
నా ఈ కళ్లు ఆ దైవాంశ సంభూతుడిగా లోకం మెచ్చుకున్నవాడిని
చూసాయి, రాకుమారుడిగా జన్మించాడు, రాజసంగా పెరిగాడు.
తనకంటె పెద్దవాడైన సోదరుడికి, స్త్రీలకు బానిసలా పనిచేసాడు.
అటువంటి వాడు మరల పుట్టబోడు, హెబె దేవతతో స్వర్గానికి పోడు.
ఇతడిని వర్ణించడానికి కవులకు మాటలు చాలవు.
శిల్పుల ఉలిదెబ్బలు రాతిని అతని రూపంలోకి మార్చలేవు.

**ఫాస్ట్** : అయినా అతడు నీ మాటల్లో అపురూప రూపాన్ని పొందినాడు.
జగదేక వీరుణ్ణి వర్ణించావు, మరి, భూలోక సుందరి ఎవరు?

**చిరాన్** : ఏమిటి? స్త్రీ సౌందర్యమనేది ఓ ముసుగు
సర్వసాధారణమైనది, శీతలమై కరుణించేది
సజీవంగా స్పందించే జలధార
జీవితమంటే అంతులేని ఆకలి, పిపాస
ప్రశాంతమైన అందం, స్వయం చోదితమైనది.
మనోహరమైన లావణ్యం మరులు కొల్పేది
ఆమె 'హెలెనా' –ఒకసారి నాపై కూర్చుని ప్రయాణం చేసింది.

ఫాస్ట్ : నీవామెను... మోసుకు తిరిగావా?

చిరాన్ : అవును! ఏం నమ్మలేవా!

ఫాస్ట్ : సంతోషంతో మాట రాకున్నది,
ఆమె కూర్చున్న చోటే నేను ఇప్పుడున్నానన్నది!

చిరాన్ : నిజం! నీవు పట్టుకున్నావే అలానే ఆమె నా జూలు పట్టుకున్నది.

ఫాస్ట్ : తట్టుకోలేనంత సంతోషం!
ఆమె ఇప్పుడు నాకున్న ఏకైక ఉద్వేగం!
ఎప్పుడామెను మోస్తూ తిరిగావు, చెప్పు వేగిరం?

చిరాన్ : బందిపోటు దొంగలానాడామెను బంధించారు.
సోదరులు కాస్టర్, పొల్లక్స్ లామెను కాపాడినారు,
ఓటమి నొప్పుకోని ఆ శత్రువులు మరల వెంటబడినారు.
ఎలూషియన్ మడుగు సమీపంలో వాళ్లకు దొరికేదే హెలెన్
నేను వాళ్లను ఎక్కించుకుని ఈదుతుంటే కవలలు సాయపడ్డారు.
ఆవేపుకు సురక్షితంగా చేరాక ఆమె క్రిందకు దిగింది.
తడిసిన నా జూలును తట్టి, నన్ను ముద్దాడి కృతజ్ఞతలు తెలిపింది.
మొక్కవోని ఆమె చిరునవ్వు, ఆపదలోనూ చలించని ధైర్యం
మనోహర లావణ్య యవ్వనం నా ముసలికళ్లనే మురిపించాయి.

ఫాస్ట్ : అప్పుడు ఆమె పదేళ్ల పసిపిల్ల!....

చిరాన్ : నీవు కవుల కల్పనలకు కదిలిపోయావు బాగా
ఊహాసుందరి రూపం ఉంటుంది వేరుగా,
కవులు ఆమె వదనాన్ని కల్పిస్తారు తమ రీతిలో-
ఆమె అందం తరగనిది, పెరగనిది, మారనిది
'బాలికగా ఉన్నప్పుడు ఎత్తుకుపోయారు-
యువతిగా మారిన ఆమె యువకుల్ని ఆకర్షించింది'-
ఇవన్నీ కాలానికి కట్టుబడని కవుల కథనా చాతుర్యాలు!

ఫాస్ట్ : అదే సరైనది! కాలంతో కట్టిపడేయకపోవడమే కావాల్సినది.
ఫెరీ (Pherae) ద్వీపంలో ఎఖిల్లిస్ ఆమెను చూడలేదా!
అతడూ కాలపరిధి బయట ఉన్నవాడే కదా!
విధి శక్తిని త్రోసిరాజని ఆమె ప్రేమను పొందడమెంత అదృష్టం
ఆ అపూర్వ రూపాన్ని చూసాక నాలో ప్రాణశక్తి ఉప్పొంగలేదా!

శాశ్వతం, దేవతారూపం, సున్నితం, ఉన్నతం,
అచేతనావస్థలో అంతరంగంలోకి చొచ్చుకుపోయే మెరుపు కాంతిస్వరూపం
నీవెప్పుడో చూసావామెను– నేనామె నీరోజు చూసాను.
నా కనులను మైమరపించి, హృదయాన్ని దోచుకున్నది.
ఆమె నన్ను పాలిస్తూ నిశ్చలమై నడిపించే తారగా ఉన్నది.
హెలెనాను చూసేంతవరకూ నేను నిద్రపోను, జీవించలేను.

**చిరాన్** : మానవుడిగా, ఆర్యా, నీవు మత్తులో ఉన్నావు.
ఆత్మలుగా– మేము దీన్ని– మతిభ్రమణమంటాము!
నీ అదృష్టం – ఇప్పుడు నేను ప్రతి సంవత్సరం లానే
దర్శించబోతున్నాను వైద్యుడు ఎస్క్యులేపియస్ కుమార్తె 'మాంటో'ను
దైవస్వరూపుడైన దేవతా వైద్యుడిని స్మరిస్తుంది మౌనంగా,
ప్రార్థిస్తుంది ఈ కాలం వైద్యులు రోగులను చంపడం మానతారని
తమ పద్ధతులు మార్చుకుని, చీకటి మనస్తత్వం నుంచి బయటపడతారని
నాకు నచ్చే, నేను మెచ్చే జోస్యురాలు, సోదిగత్తె ఆమె!
మిగతావాళ్లలా తిక్కతిక్కగా ప్రవర్తించదు.
ప్రశాంతంగా ఉండే ఆమెతో కాసేపు మాట్లాడు.
ఆమె మందులు ఖచ్చితంగా నీ రుగ్మత నయం చేస్తాయి.

**ఫాస్ట్** : నాక్కావాల్సింది రుగ్మత నుంచి విముక్తి కాదు,
ఇతరులకు నచ్చేది నాకక్కరలేదు.

**చిరాన్** : ఆరోగ్యాన్నిచ్చే ఆ జలధార నీటిని రుచిచూడు
దిగు! మనం వచ్చేసాం! కాలం వృధా చేయకు!

**ఫాస్ట్** : రాతి వాగులగుండా ఈ రాత్రి నన్నిక్కడికి తెచ్చావు,
ఈ ప్రదేశమేదో కాస్త వివరించవూ!

**చిరాన్** : ఇది రోమ్, ఇది గ్రీస్, కుడిపక్క పెనియస్ నది.
ఎడమ ఒలింపస్; ఇక్కడే వాళ్లు పోట్లాడుకున్నది.
ఒక మహా సామ్రాజ్యం మట్టిలో కలిసినది.
రాజులు పరారుకాగా పౌరుడిది పైచేయి అయినది.
చూడు! అదే శాశ్వత దేవాలయం!
వెన్నెలలో మసక మసకగా కనిపిస్తున్నది.

**మాంటో** : **(దేవాలయంలో, నిద్రిస్తూ ఉన్నది)**
గిట్టల చప్పుడు ప్రకంపనలకు

నా పవిత్ర దేవాలయ ద్వారం కంపిస్తున్నది.
ఎవరివో దేవతా రూపాలు కనిపిస్తున్నవి.

**చిరాన్** : అవునా! కనులు తెరువు మాంటో!

**మాంటో** : **(కళ్లు తెరుస్తూ)–**
స్వాగతం! నీ మాట నిలుపుకుంటావు!

**చిరాన్** : నీ దేవాలయం ఎదురు చూస్తున్నది నాకోసం!

**మాంటో** : అలసిపోకుండా అలా తిరుగుతూనే ఉంటావు!

**చిరాన్** : నీది నిశ్చలత ఆవరణలోని శాంతి,
నాది ఇచ్ఛాపూర్వక భ్రమణ ప్రశాంతి.

**మాంటో** : నా చుట్టూ తిరిగే కాలం మధ్య నేను వేచి ఉంటాను,
అది సరే, ఎవరీ కొత్తవ్యక్తి?

**చిరాన్** : ఈ దుష్కీర్తి గడించిన రాత్రి, ఇతడిని
తన సుడిగుండంలోకి లాక్కుని మనవేపుకు తెచ్చింది!
ఈతడి మనస్సు ఉద్విగ్నమై, హెలెనా ఆకర్షణలో చిక్కుకున్నది.
ఎలా మొదలెట్టాలో తెలియక, నీ ఎస్క్యులేపియన్ చికిత్సకై వేచి ఉన్నది.

**మాంటో** : అసంభవ కార్యంపై లగ్నమైనదితడి మనసు,
అటువంటి వారంటేనే నాకిష్టం నీకు తెలుసు.
**(చిరాన్ దూరంగా వెళ్లిపోతాడు)**
ఆనందంతో లోపలికి రా!
హుషారైన ప్రేమికుడా!
ఈ చీకటి వసారాలు దాటి
ఒలింపస్ మధ్య భాగాన్ని చేరదాం!
పెర్సిఫోని ఎదురుచూస్తుంటుంది
రహస్యంగా, నిషేధపు పిలుపు కోసం;
నేనింతకు ముందు ఆర్ఫియస్‌ను
ఈ దారిగుండానే తీసుకువచ్చాను;
నీ అదృష్టాన్ని పరీక్షించుకో!
రా! వెళదాం నేల అడుగుకు!
**(దిగుతారు)**

# 10 సి. పెనియస్ నది - మునపటిలానే

**సైరన్లు** : పెనియస్ నదిలోకి దూకుదాం!
హాయిగా ఆడుదాం! స్వేచ్ఛగా ఈదుదాం!
గొంతెత్తి పాడుతూ ఈ గుంపుకు ఆనందాన్నిద్దాం!

ఎక్కడ జలముంటుందో ముక్తివుంటుందక్కడ!
మనమంతా ఎగియస్ సముద్రానికి పోయి మైమరచిపోదాం
**(భూకంపం)**

నది కంపించి నురగలు కక్కుతోంది,
అడుగును వదిలి పైకుబుకుతోంది.
భూమి వణికి నీళ్లు నిర్బంధించబడ్తున్నాయి.
కట్ట తెగి రాళ్లూ దుమ్ము పొగ పైకెగస్తున్నాయి.
ఈ విపత్తు నుంచి పారిపోదాం వేగంగా,
ఇటువంటప్పుడు ఇక్కడుండలేం క్షేమంగా!
అతిధులారా, మాతో రండి!
సముద్రం పక్కన విందు పసందుగా ఉంటుంది.
మెరుస్తూ ఎగసిపడే అలలు
ఉత్తుంగ తరంగాలుగా తాకుతాయి తీరాన్ని.
ఒక చంద్రుడు ఇద్దరిలా కనిపిస్తూ
మమ్మల్ని మంచువానతో తడుపుతాడు.
అక్కడ స్వేచ్ఛ వుంది, జీవితం, చలనం ఉన్నది–
ఇక్కడ నేల కంపిస్తూ భయపెడ్తున్నది.

భూగర్భం నుంచి వెలువడే భీకర దృశ్యాలు చూసిన మరుక్షణం
తెలివున్న వాళ్లెవరైనా నిష్క్రమిస్తారు తక్షణం.

**సీస్మాస్ (Seismos - భయంకర రణగొణ ధ్వనులు, శబ్దాలు చేస్తూ)**
ఇంకొక తోపు, మరొక ఊపు,
పైపైకి వస్తున్నాను ఉపరితలం వేపు!
పగటి కాంతిలో నేలపైకి వస్తున్నా,
నా దారికి అడ్డు రావద్దని మరీమరీ చెబుతున్నా!

స్ఫింక్స్ : ఈ భూకంపం సంతోషకరంగా లేదు
అదరడం, చెదరడం, కదలడం, మెదలడం
ఉలికిపాట్లు, తూగడాలు, రాళ్లూ రప్పలూ ఊగడాలు
ఈ తిక్క ప్రదర్శన మాకు నచ్చలేదు.
అయినా మేం కూర్చున్న చోటు నుంచి కదలం,
పాతాళపు పైకప్పు పగిలినా చలించం

ఎంత ఆశ్చర్యం! కదుల్తుందెలా ఆ శిలాతోరణం!
ఆ వృద్ధుడు మాకు పరిచితుడే!
'డెలాస్'ను సముద్రం నుంచి పైకి లేపినవాడు!
దాన్నే అంటారు 'లెటొ' ద్వీపమని.
అక్కడే ఆమె జ్యూస్ దేవుడి ప్రణయ ఫలాలు
అపొలో, ఆర్టెమిస్ లకు జన్మనిచ్చింది.
అతడి నడకలో గాంభీర్యం, అట్లాస్‌లా దేహ సౌష్ఠవం.
తన శక్తివంతమైన చేతుల్తో మట్టిని, లావాను,
నేలను గుట్టలు గుట్టలుగా పైకెత్తుతున్నాడు.
శిలలో, గులకరాళ్లు, ఇసుక, ఒండ్రుమట్టి
నీటిపైకి అలజడి చేస్తూ పేర్చబడ్తున్నవి.
ఈ ప్రశాంత నదీ అడ్డుకట్టలను తెగ్గొడ్తూ
లోయ మూతను పైకెత్తుతున్నాడు, నది దారి మళ్లుతున్నది,
స్త్రీ ఆకారపు రాతిస్తంభమేదో పైకి లేపబడ్తున్నది.
ఆ బృహత్ శిలా నిర్మాణాన్నతడు ఒంటి చేత్తో చేస్తున్నాడు.
పని ముగిసినట్లున్నది, అయినా స్ఫింక్స్ రాజ్యమే ఇది.

సీస్మాస్ : ఎవరి సహాయం లేకుండా చేసిన పని ఇది.
చివరిలో దక్కుతుంది నాకు రావాల్సిన ఖ్యాతి.
కదిలించకుండా, గర్జించకుండా, ఊపకుండా నేనుంటే
ఈ భూమికి ఇంత అందం, సొబగులెలా వచ్చేయి, చెప్పండి!

స్వచ్ఛమై నీలం రంగులో మెరిసే పర్వత శిఖరాలు నిలిచేవా?
మీ కళ్లకు అమందానందాన్ని కలిగిస్తున్న ఆ సొబగులుండేవా?
నా పూర్వీకులు రాత్రి (Night), అస్తవ్యస్త స్థితి (Chaos).

నేను పెరిగింది టైటాన్లు–మహాకాయుల మధ్య,
పెలియన్, ఒస్సాలను బంతుల్లా విసుర్తుంటే
అవి గాలిలో దూసుకుపోయి పర్నాసస్‌కు జంట టోపీలయ్యాయి.

ఆ కొండపైనే అపోలో దేవుడు
మ్యూజ్ సంగీత దేవతలతో ముచ్చాట్లాడతాడు.
ఉరుములు ఉరిమే మహాదేవుడు జ్యూస్‌కు
అత్యున్నత సింహాసనాన్ని అమర్చింది నేనే!
నీవు చూసావు నేను అగాధంలోంచి పైకి రావడాన్ని.
ఇప్పుడు నాపైకి కొత్త జీవనం రావడాన్ని కోరుకుంటాను
సంతోషంగా జనులు అవాసముండాలని అనుకుంటాను.

**స్ఫింక్స్** : అనాది చరిత్ర ఉన్న పర్వతం ఇది.
ఎలా నేలపై మథించబడిందో కనులారా చూసాము!
కొత్తకొత్త శిలలు ఆ కదలికలలో కనువిందు చేస్తున్నాయి.
అప్పుడే దట్టమైన అరణ్యం ఏర్పడ్తున్నది.
స్ఫింక్స్‌లు దేనికీ ఆశ్చర్యపడబోవు.
మా సింహాసనాలపై స్థిరంగా కూర్చుంటాము.

**గ్రిఫిన్లు** : ఆకుల్లో బంగారం, శాఖల్లో స్వర్ణం
చీలికలు, సందుల్లో మెరుపుల వర్ణం
చీమల్లారా రండి! నిధులను సేకరించండి!
వచ్చిన అవకాశాన్ని వదలక కదలండి!

**చీమల బృందం:** మహాకాయులు పర్వతాన్ని పైకి లేపారు.
కీటకాలం మనం పాక్కుంటూ పోదాం!
త్వరత్వరగా తమ తమ స్థానాల్లోకి తరలండి.
ఈ రాళ్లలో దాగుంది అంతులేని అదృష్టం.
అతి చిన్న రేణువునైనా అందిపుచ్చుకుని
చిన్నిచిన్ని సందుల్ని సైతం శోధించి తీరుదాం!
త్వరగా! త్వరత్వరగా నడవండి!
దండుగా వెడలి నిండుగా పోగేద్దాం!
రాళ్లని వదిలి సువర్ణాన్ని సాధిద్దాం!

గ్రిఫిన్లు : రండి! గుట్టలుగా పోగెయ్యమండి, బంగారు కొండలు.
దవడలతో గట్టిగా పట్టుకోవాలి స్వర్ణ రేణువులు
బందోబస్తు గావించి తలుపులకి వేయాలి తాళాలు.
మన పట్టునుంచి విడిపించుకోలేవు ఏ స్వర్ణ నిధులు.

పిగ్మీలు : ఆక్రమించుకోవచ్చు మనమీ స్థలాన్ని
మనమెక్కడి నుంచి వచ్చామో మనకే తెలీదు.
ఏమిటి, ఎందుకూ అని అడిగే పని లేదు.
మనం ఇక్కడ ఉన్నాం అదే పదివేలు.

జీవితం త్వరగా తన స్థానాన్ని వెదుక్కుంటుంది
కొత్త ప్రాంతాన్ని చూసి సంతోషిస్తుంది.
కొండ ముఖంపై పగుళ్లనిస్తుంది.
మరుగుజ్జులక్కడ ప్రభవిస్తారు, ఆడా, మగా, పిల్లలు.

ప్రతి బొరియనూ సంతోషంగా వెదకుతూ
ప్రకృతిలోని పసుపులోహాన్ని కనుగొంటారు.
మొత్తం మీద సంతృప్తి ప్రధానాంశమై
అందరం నేలతల్లి సౌభాగ్యానికి ప్రణమిల్లుతాం!

**అంగుష్ఠమాత్రులు (Finger Lings)–**
ఒక రాత్రి ప్రసవించి మరుగుజ్జుల నిచ్చింది.
ఇప్పుడు అంగుష్ఠమాత్రులం మాకు జన్మనిచ్చింది.

**పిగ్మీల పెద్దలు :** ఈ కొత్త దేశంలో స్థావరాలనెదకండి!
సిద్ధంగా ఉండి, వేగంగా కదలండి!
తిరుగుబాటు కొలిమిల్ని విరగబూయించి
యుద్ధం వచ్చేసరికి ఆయుధాల్ని సంసిద్ధం చేయండి!

చీమలారా! మీకో పని బెడ్తున్నాం, వినండి,
మాక్కావాల్సిన లోహాల్ని పోగుచేయండి.
అంగుష్ఠమాత్రులూ వేలెడంత వాళ్లు మీరు.
తేగలగినంత కొయ్య ముక్కలు తీసుకురండి తక్షణం!
మా లోహపు కంసాలులు రహస్య కొలిమి రగిలించేందుకు.

**సైనాధ్యక్షుడు** : క్రమపద్ధతిలో బాణాల్ని వదిలి
నీటి పక్కన ఉన్న నీటికోళ్లను కూల్చండి!
వేలాది గూళ్లున్నాయి, వేలకొద్దీ పిట్టలున్నాయి!
ఒక్క వేటుతో నేల రాలాలి గుంపు మొత్తం ఒకేసారి!
వాటి ఈకల్ని పీక్కురండి, శిఖలకు అమర్చుకోండి!

**చీమలు, అంగుష్ఠమాత్రులు –**

మనల్నెవరు కాపాడతారు?
ఇనుపలోహం మహాకాయులకు ఇస్తాం మనం.
వాళ్లు చేస్తారు సంకెళ్లు
మనల్ని బానిసలుగా చేసేందుకు.
ఇప్పుడు సమయం కాదు విరగగొట్టేందుకు,
కాస్త సంయమనం పాటించడం మంచిది మనకు.

**ఇబికస్ కొంగలు–**

చావు కేకలు, మృత్యుఘోష, అరుపులు
భయంతో రెక్కలు కొట్టుకుంటున్న చప్పుళ్లు
మూలుగులు, ఏడ్పులు పెడబొబ్బలు
గాలిలో పైకి చేరుకున్నాయి మమ్మల్ని.
చూడు! సరోవరమంతా రక్తసిక్తమైనది.
నీటికోళ్లు చచ్చి పడున్నవి.
వాటి శిఖపై ఈకలు పీకివేయబడినవి.
విపరీతపు పేరాశకు గురై, పక్షుల రెక్కలు తెగి,
వాటి ఈకలు ఈ దొడ్డికాళ్ల, బానపొట్టల
సైనికుల శిరస్సులపై అలంకరింపబడినవి.
–మమ్మల్నాదరించే గృహస్థుడి చెలికాండ్లు మీరు
తీరంలో తిరుగాడే అపురూప పక్షులై ఉన్నారు.
మీ చావుకు తీర్చుకుంటాం మేం ప్రతీకారం,
మూడురెట్ల పగతో వాళ్ల జాతిని చేస్తాం నాశనం!–
**(అరుస్తూ, ఎగిరి చెల్లాచెదరవుతాయి)**

**మెఫిస్టాఫిలిస్** : **(మైదానం మీద)**
ఉత్తరదేశాన, మంత్రగత్తెలు వాళ్ల హక్కుల్ని సంరక్షించుకుంటారు.

ఈ పరాయిదేశపు భూతాల్ని నేను నియంత్రించలేకపోతున్నాను.
మనకు అందుకే నచ్చుతుంది బ్లాక్స్‌బర్గ్ ప్రాంతం తీరు
ఎలా తిరిగినా, ఎక్కడ తిరిగినా అది అనిపిస్తుంది మన ఊరు.

కొండమీది ప్రాంతం ఎదురుచూస్తోంది మనకోసం!
హీన్‌రిచ్ ఎత్తులో, గురకలెట్టేవాళ్లు 'ఎలెండ్'లో ఉన్నారు.
వేయి సంవత్సరాల నుంచి అక్కడ అలానే ఉన్నది.

ఇక్కడ ఎవరెక్కడ ఉంటారో ఎవరికీ తెలీదు.
ఏ నేల ఎప్పుడు పగుల్తుందో,
ఏ నీటిబుగ్గ ఎవరి కాళ్ల కింద ఉబుకుతుందో అర్థం కాదు.

నేను ప్రశాంతంగా ఈ విశాలమైన లోయలో విహరిస్తాను.
చటుక్కున ఏదో పర్వతం నా వెనక పుట్టుకొస్తుంది.
పెద్ద ఎత్తుగా ఉన్నదా అంటే ఏమీ ఉండదు.
స్ఫింక్స్ ఇక్కడే ఉండాలి కదా; ఏవి అవి?
ఈ కొండ వెనుక ఉన్నాయి కాబోలు,
ఇక్కడ ఇంకా నెగళ్లు మండుతూనే ఉన్నాయి.
ఈ ఏటి దిగువ ఇంకేమి వింతలున్నాయో తెలీదు.

ఆ వినబడ్తున్న బృందగానం ఆహ్వానిస్తోంది నన్ను
ఉన్మత్త నృత్యం, గంతులూ గెంతులూ పిలుస్తున్నాయి.
నేను లొంగిపోతున్నాను, కొత్త వింతల్ని చూడాలనుకునేవాళ్లు
ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ రుచి చూడాలి విశేషాలు.

**లామియె (మెఫిస్టాఫిలిస్‌ను తమవేపుకు ఆకర్షిస్తూ)–**

త్వరగా! త్వరగా!
వేగంగా! ఇంకా వేగంగా!
ఒక్కక్షణం ఆగు!
మాట్లాడు, స్పందించు!
మోహించడం
చాలా గమ్మత్తు
ఈ వేశ్యా ప్రభువు

మనల్ని మోహింపజేయగలడా!
దుఃఖపడతాడు.
ఈ గుర్రపు గిట్టలవాడు,
వాడి చీలిన పాదం
గెంతులూ, ఆగడాలూ!
కుంటికుంటాట ఆడుతూ
మన వెంటబడడాలూ!

**మెఫిస్టోఫిలిస్** : **(ఆగిపోతూ)**
ఎంత విచిత్రం! మళ్లీ మోసపోయాను!
ఏడమ్ కాలం నుంచీ మగాళ్ల గతి ఇంతే!
వయసు పెరిగింది కాని తెలివి పెరగలేదు.
చివరికి నేను కూడా తప్పులో జారిపడ్డాను.

ఎందుకూ కొరగాని వాళ్లని చూసి భ్రమించాను.
రంగులేకుసుకున్న ముఖాలు, ముసలి మంత్రగత్తెలు
ముట్టుకుంటే ఊడిపోయే శరీర భాగాలు
మన కళ్లూ, చేతులూ చెబుతూనే ఉంటాయి, అయినా
ఆ పిశాచాలు గానం చేస్తే, మనం నృత్యం చేస్తాం!

**లామియె** : **(ఆగి)–**
ఆగండి! అతడేదో అనుమానపడ్తున్నాడు!
వాడిని దారి తప్పనీకండి! వదిలిపెట్టవద్దు!

**మెఫిస్టోఫిలిస్** : **(ముందుకు వస్తూ)**
మరీ అంత అనుమానపడరాదు, అది మూర్ఖత్వం కాదా!
వాళ్లు మంత్రగత్తెలు కాకపోతే, డెవిల్ కూడా డెవిల్ కాడుకదా!

**లామియె** : **(మరింత అందాల్ని విరజిమ్ముతూ)–**
నాయకుడి చుట్టూ వలయాలుగా
ప్రదక్షిద్దాం హాయిగా! మనలో ఎవరో ఒకరు
అతడి హృదయాన్ని దోచేద్దాం ప్రేమగా!

**మెఫిస్టోఫిలిస్** : వెలుతరంత బాగాలేదు కాని, నా కళ్లు వెదకుతున్నాయి,
అందమైన ఆడపిల్లల్ని చూసి మిలమిలా మెరుస్తున్నాయి.

| | | |
|---|---|---|
| **ఎంపూసా** | : | **(లామియేల మధ్యలో దూరి)**<br>దయ ఉంచి నన్ను కూడా బాగా పరిశీలించు<br>వీళ్లకు తీసిపోని అందగత్తెను నేను. |
| **లామియే** | : | మధ్యలో దూరిందా ఈ దొంగది,<br>ఎప్పుడూ మన వేటలో కాలుబెడ్తది! |
| **ఎంపుసా** | : | **(మెఫిస్టొఫిలిస్‌తో)–**<br>నీ చుట్టాన్నే ఆర్యా, చూడటానికి వచ్చాను.<br>పేరు 'ఎంపుసా గాడిద గిట్టల యువతి'<br>చాలా ఆనందంగా ఉన్నది దగ్గర బంధువును చూసి<br>నీవి గుర్రపు గిట్టలు కదా, నావేమో గాడిదవి. |
| **మెఫిస్టొఫిలిస్** | : | ఇక్కడంతా కొత్తవాళ్లని ఇప్పటిదాకా అనుకున్నా!<br>మనందరం బంధువులమని మహబాగా తెలిసింది.<br>నేను పేజీలు తిప్పుతున్న పుస్తకం ఏనాటిదో,<br>జర్మన్ లేదా గ్రీకు, ఆ రెండూ దగ్గర బంధువులే! |
| **ఎంపుసా** | : | నేను బహురూపిని! వేగంగా మారిపోగలను,<br>ఏ రూపంలో అంటే ఆ రూపంలోకి.<br>ఇప్పుడు నీ గౌరవార్థం మారిపోతున్నా,<br>గాడిద మొహంతో నిన్ను గెలుచుకోడానికి. |
| **మెఫిస్టొఫిలిస్** | : | ఇక్కడ చాలా ముఖాలూ, ప్రేమలూ ఉన్నాయి అవునా!<br>అయినా, గాడిద ముఖంపై నాకు ఇష్టంలేదు, సరేనా! |
| **లామియే** | : | ఆ ముసలి వగ్గునొదిలేయ్!<br>తరిమేస్తుందది రూపలావణ్యాలను!<br>దాని వికార రూపం చూసాక<br>ఇంకే అందాన్ని చూడాలనిపిస్తుందనుకోను! |
| **మెఫిస్టొఫిలిస్** | : | ఈ బంధువులున్నారు బాగా నాజూకుగా,<br>కాని, ఆ ఎర్రబుగ్గల వెనుక, ఏదో పెద్ద గొడవుంది, నిశ్చయంగా! |
| **లామియే** | : | ఇంతమందిమున్నాం, పరీక్షించుకో నీ అదృష్టం!<br>ఈ బండదాన్ని ఎంచుకో, కత్తితో నీకు తగ్గా కోసుకో! |

ఆహా! వస్తున్నాడు మగధీరుడు మనల్ని అందుకునేటందుకు,
అసలు రూపాల్ని చూపిద్దాం, ముసుగుల్ని తొలగించండి నెమ్మదిగా!

**మెఫిస్టొఫిలిస్ :** అందరికంటె అందమైన దీనిని అందుకుంటాను ముందుగా–

**(కౌగలించుకోబోవును)**

అహ్! ఇదొక ఎండుముక్క!

**(ఇంకొకతెను అంటుకొనును)**

ఛ! ఎంత దరిద్రపు మొహం! తుమ్మచెక్క!

**లామియె :** తెలుసుకో నీ గొప్ప! కుదిరిందా తిక్క!

**మెఫిస్టొఫిలిస్ :** ఈ బల్లిని పట్టుకోబోతే జారిపోతోంది సర్రున–
దాని జుట్టు పాములా జిగటగా సాగింది జివ్వున!
ఈ పొడుగాటిదేమో థైర్సస్ చేతి కర్రలా సన్నన,
దాని తలకాయ 'పైన్' శంకువులా నున్నన

ఎంత అవమానం! ఆ లావుపాటి దానిని కావలించుకోనా!
తూర్పుదేశపు రాజు దీనికి స్వర్ణ తులాభారం చేస్తాడు, అవునా,
ఉబ్బిఉబ్బి పగుల్తోంది దీని దుంపతెగ, ఎంత దుర్వాసనా!

**లామియె :** ఇతడి చుట్టూ మూగుదాం ఇటూ అటూ,
ఈ మంత్రగాడిని శిక్షిద్దాం గుండ్రంగా తిరుగుతూ!
గబ్బిలాలు కదిలినట్లు నిశ్శబ్దంగా ఎగురుదాం,
మన మధ్యకు వచ్చినందుకు మందలించి వదులుదాం!

**మెఫిస్టొఫిలిస్ :** **(దులుపుకుంటూ)**
దీన్నుంచీ నేనేమీ నేర్చుకున్నట్లు లేను
ఉత్తర దక్షిణాలు, కిందా పైనా, వెనకా ముందూనూ!
ఇక్కడ దెయ్యాలు పిచ్చివి. మామూలు జనం చెత్తకంపు!
కవులు వృథా! అదుగో వస్తోంది ఇంకో ముసుగు గుంపు!
అందమైన ముఖాల్ని కదిలిస్తే అందులో అంతా వికారమే
భ్రాంతుల్తో వళ్లు జలదరించినా మంచి కాలక్షేపమే!

**(రాతి స్తంభాల మధ్య వెళ్తాడు)**

ఇప్పుడెక్కడున్నాను? ఇంకేదో గొడవ ఇక్కడ!
ఇదివరకున్నది మంచిదారి, ఇప్పుడేమో గులకరాళ్లున్నాయి.

ఇందాక సమతలంగా ఉన్నచోట, ఇప్పుడు గండశిలలున్నాయి.
ఈ ఎక్కీ దిగడాలలో ఏమీ సంతోషం లేదు.
స్ఫింక్స్ లేరీ కనబడరే! ఏమిటీ విచిత్ర దృశ్యాలు!
ఒక్క రాత్రిలో పెద్ద పర్వతం ఉద్భవించిందిక్కడ.
చీపురుకట్టల జనానికి జోహార్లు, బ్లాక్స్‌బర్గ్‌ను తెచ్చారు.

**ఒరియాడ్ :** **(కొండ శిఖరంపై నుంచి)**
ఈ కొండ పురాతనమైనది! పైకి నిన్ను రమ్మంటున్నది!
నా నిటారైన కొండవాలుల్ని, పిండస్ అంచుల్ని గౌరవించు
పాంపే పారిపోయింది. నా జల విభాజక రేఖపై నుంచి
నీవు చూసే ఆ గుట్ట తెల్లారేసరికి మాయమవుతుంది.
ఇటువంటి మాయామంత్రాలు లెక్కలేనన్నిసార్లు చూసాను.
తలలో పెరుగుతాయి తక్షణం అదృశ్యమవుతాయి.

**మెఫిస్టాఫిలిస్ :** ఉన్నతమైన 'ఓక్' వృక్షాలతో నిండిన నీ శిఖరానికి వందనం!
వెన్నెల కాంతికి వ్యతిరిక్తంగా అవి చూపిస్తాయి చీకటి చిక్కదనం!
ఆ పొదల దగ్గర కదులుతున్నది కొద్దిపాటి కాంతి ప్రకాశం
బహుశా నేననుకుంటాను, అది, హోమంకులస్ చలనం!
అవునవును! అతడే! ఎక్కడికి పోతున్నావు చిన్నవాడా!

**హోమంకులస్ :** ఏదో గాలిలో ఎగుర్తున్నాను కానీ,
అందరిలా పుట్టాలనేది నా ఆలోచన.
ఈ గాజు కుప్పెను పగలగొట్టలేను.
నాక్కనిపించిన రూపాల్లోకి జొరబడలేను.
మనలో మాట– 'నేను ఇద్దరు వేదాంతుల కోసం వెదుకుతున్నాను.
వాళ్లనుకుంటున్నారు– ప్రకృతి, ప్రకృతి–
నా దృష్టిలో వాళ్లే నాకు సరైన దారి చూపించగలరు.
భూమి రహస్యాలు తెలిసినవాళ్లు,
వాళ్లనడిగి నా భవిష్యత్తును నిర్దేశించుకుంటాను.

**మెఫిస్టాఫిలిస్ :** నీ జన్మరహస్యం కనుక్కోడానికి నీదారి నీవే కనుక్కోవాలి!
మాయారూపాలుండే చోట వేదాంతికి స్వాగతమే!
అతడు ఇంకో డజను రూపాల్ని సృజిస్తాడు.
అది అతడి నైపుణ్యం, మంచితనం.

ఏదైనా పొరపాటు జరిగితేనే నీవు సరిగా చూడగలవు.
జీవిగా మారే దారిని స్వయంగా శోధించగలవు.

**హోమంకులస్ :** మంచి సలహా ఊరికే దొరకదు కదా!

**మెఫిస్టోఫిలిస్ :** మరింకెందుకు ఆలస్యం, వెంటనే పద!

**(విడిపోతారు)**

**అనాక్జగొరాస్ :** **(థేల్స్‌తో)**
ఇంకా నీ అభిప్రాయం మారలేదు.
నీ మొండి పట్టు వదిలించడానికి ఇంకేం ఋజువు కావాలి?

**థేల్స్ :** ప్రతి గాలి తరగకూ తరంగాలు తలవంచుతాయి.
చలించని శిలకు దూరంగా ఉంటాయి.

**అనాక్జగొరాస్ :** నేనంటాను ఈ శిల అగ్ని నిర్మాణమని-

**థేల్స్ :** తడిగాలిలో జీవులుద్భవించాయి.

**హోమంకులస్ :** **(వారిద్దరి మధ్యలో ప్రత్యక్షమై)**
మీవాదనలో నేనూ పాల్గొంటాను.
నేను జన్మించడానికి ఆరాటపడ్తున్నాను.

**అనాక్జగొరాస్ :** ఒక్క రాత్రిలో, థేల్స్! ఈ జిగట దిబ్బ నుంచి,
పర్వతం ఉద్భవించడం అసాధ్యమంటాను.

**థేల్స్ :** ప్రకృతి జీవశక్తుల ప్రశాంత ప్రవాహం
గంటలు, పగళ్లు, రాత్రులను పట్టించుకోదు.
అన్ని రూపాలను మలుస్తుంది, నియంత్రిస్తుంది.
హింసకు తావులేని మహా నిర్మాణాలను చేబడ్తుంది.

**అనాక్జగొరాస్ :** ఇక్కడే సంభవించింది! ప్లుటోనియన్ ఉష్ణం,
ఎవొలియన్ విస్ఫోటనావాయు భీభత్సం,
భూమి పొరలను బద్దలుగొట్టి బయటకు వచ్చాయి.
మహా పర్వతంగా మన కళ్లముందు ఆవిర్భవించాయి.

**థేల్స్ :** అది నీ అభిప్రాయం. అయితే ఏమిటి ఉపయోగం;
పర్వతం పుట్టడం వలన ఏం ప్రయోజనం?

అనవసరపు చర్చ ఈ వ్యవహారం,
అనూయాయుల్ని మనం తప్పుదారి పట్టిస్తున్నాం!

**అనాక్జగొరాస్ :** ఆ రాతి పొరల్లోని ఖాళీలు
పిగ్మీలు, చీమలు, అంగుష్టమాత్రులకు
మిర్మిడాన్లకు ఆవాసం!
**(హొమంకులస్‌తో)**
నీకు గొప్పవాడవవ్వాలన్న కోరికలేదు.
మునిలా బతకాలంటే లాభం లేదు.
ఇక్కడ రాజులా బతకాలని కోరుకో
నిన్ను ఈ క్షణం కిరీటధారుణ్ణి చేస్తాను.

**హొమంకులస్ :** నా థేల్స్ అదే సలహా ఇస్తాడా?

**థేల్స్ :** చిన్నవాళ్లతో చేసేవి చిల్లర పనులే
గొప్పవాళ్లతో కలువు చేయవచ్చు ఘనకార్యాలు.
ఆ నల్లని కొంగలు మేఘంలా కనిపిస్తున్నాయా?
అవి చూసేవాళ్లను బెదిరించి, రాజును కూడా హడలగొడ్తాయి.
పదునైన ముక్కు గోళ్లతో పిగ్మీలను చెల్లాచెదురు చేస్తాయి.
భయంకర తుఫాను రాబోతున్నది.
నిలబడ్డ నీటికోళ్లు వేటాడబడి రక్తం కాలువలై ప్రవహించింది.
బాణవర్షపు నీరు ప్రతీకారం తీర్చుకోనున్నది,
నీటికోళ్ల బంధుజనపు కోపం పిగ్మీలను నాశనం చేస్తుంది.
ఏ డాలూ, ఆయుధమూ, ఈకల కిరీటమూ దానిని ఆపగలుగుతుంది?
చీమలు, అంగుష్ఠమాత్రులూ దాక్కుంటున్నారు.
సైన్యం పారిపోతున్నది కాని సర్వనాశనం నుంచి తప్పించుకోలేదు.

**అనాక్జగొరాస్ :** **(ఒక్కక్షణం తటపటాయించి)–**
అనాది దేవతలు అనుకూలంగానే ఉన్నారు.
ఈ విషయంలో నేను మహాశక్తిని ప్రార్థిస్తాను.
మహాదేవతా! స్వర్గ సింహాసనాధీశ్వరీ!
త్రినామధారిణీ! త్రిశక్తి స్వరూపిణీ!
నా ప్రజల కడగండ్లు తీర్చడానికి నిన్ను ఆవాహన చేస్తున్నాను.
డయానా, ల్యూనా, హెకాటె!

హృదయాలనుప్పొంగించే మాతా! విజ్ఞానధునీ!
ప్రశాంత ప్రకాశరూపిణీ; గాఢ ఉద్వేగ జననీ!
నీ చీకటి నీడలను ప్రస్ఫుటం చేయి,
మాయామంత్రాలవసరం లేని నీ మహత్తర శక్తిని ప్రజ్వలింపజేయి!

**(ఆగుతాడు)**

నా ప్రార్థన ఆలకింపబడిందా!
స్వర్గం పైకెత్తబడుతున్నదా,
ప్రకృతి తల్లకిందులౌతున్నదా?

మరింత, మరింత పెరిగి పెరిగి
దేవీ సింహాసనం పరిభ్రమిస్తూ ఇటు వస్తున్నదా?
కళ్లకు మిరుమిట్లుకొలిపే రూపం, భీభత్స దృశ్యం
అగ్ని జ్వాలలు ఎరుపెక్కుతున్నాయి...
మహావిఘ్నం! పెద్ద గుండ్రటి పదార్థం!
నేల, నీరు, భూ సముద్రాలు సర్వనాశనం!

ఇది సత్యమే! థెస్సాలియన్ మంత్రగత్తెలు ఒకసారి,
తమ మంత్రతంత్రాలతో నిన్ను నేలపైకి,
లాక్కువచ్చిన మాట నిజమే!
దివ్య వలయం నుంచి తప్పించి,
నిన్ను విధ్వంసానికి వినియోగించింది వాస్తవమే!

ఇప్పుడా దివ్యచక్రం నల్లబడ్తున్నది.
పగిలి ముక్కలై కాంతి శకలాలను విరజిమ్ముతున్నది!
చిటపట శబ్దాలు, బుసబుసల ధ్వనులను వింటున్నాను.
ఉరుముల మెరుపులతో కూడిన పెనుగాలి వీస్తున్నది-
నేను సాగిలపడి మొక్కుతున్నాను.
నన్ను మన్నించండి! మహాశక్తులారా!
నేనే మిమ్మల్ని పిలిచింది! నా ప్రార్థన ఉపసంహరించుకుంటున్నాను.

**(సాగిలపడి మొక్కుతాడు)**

**థేల్స్** : ఎటువంటి వింత విషయాలను
ఈ వృద్ధుడు చూసాడు, విన్నాడు!

ఏం జరిగిందో నాకేం అర్థం కాలేదు.
నాకేం కనిపించలేదు. ఏమైనా
ఇవి ఉన్మత్త సమయాలు, ఇక
చంద్రుడి మాటకొస్తే ఆ గ్రహం
ఆకాశంలో అంతెత్తున ప్రకాశిస్తున్నది.

**హోమంకులస్ :** ఆ పిగ్మీల పర్వతం ఇదివరకు గుండ్రం
ఇప్పుడు దానిపై కొనదేలిన శిఖరం.
నాకూ ఏదో తగిలిన భ్రమ,
చంద్రుడి నుంచే ఏదో పడిందనేది సుమా!
అది శత్రువునూ, మిత్రులనూ చంపేసింది నలిపి,
ఒక్క రాత్రిలో అలా జరగడం మహా నైపుణ్యమే,
ఈ పర్వతాన్ని నేల నుంచి నింగి నుంచి నిర్మించడం!

**థేల్స్ :** అదంతా చిత్త భ్రమ, నీకు సంబంధించింది కాదు
ఆ చెత్త గుంపు పోయినందుకు చింత వలదు.
ఇంకా నయం, నీవు వాళ్ల రాజువు కాలేదు.
ఇక ఈ పండగలో కనుల విందు చేసుకోవాలి.
కొత్తకొత్తవాళ్లు, వింత అతిధుల్ని పరిచయం చేసుకోవచ్చు!
**(నిష్క్రమిస్తాడు)**

**మెఫిస్టాఫిలిస్ :** **(మరోపక్క నుంచి ఎక్కుతూ)**
ఇక్కడున్నాను నేను కాళ్లీడ్చుకుంటూ
మోకాళ్ల పర్వతాలు, ఓక్ చెట్ల వేళ్లు!
నా హార్జ్ దేశంలో అంతా కాలిన వాసన
తారు బంకలా, అదే నాకు ఇష్టమైన సుగంధం!
చెకుముకి రాళ్లు, నిప్పురవ్వలు– ఎంత ప్రసిద్ధం!

ఈ పురాతన గ్రీసుదేశంలో
అటువంటిది ఇసుమంతైనా కనిపించవు–
నరకాగ్నైనా ఉన్నదా లేదో
ఏ అగ్ని వినియోగిస్తారో, తెలుసుకోవాలని ఉన్నది.

**డ్రయాడ్ (Dryad)-**

మీ ఊళ్లో ఏమున్నాయో ఇక్కడ వెదకడం అనవసరం.
ఇంట్లో అభిప్రాయాల్ని ఇంట్లో వదిలేసి,
ఓక్ చెట్ల నీడల్లో విహరించడం ఉత్తమం!

**మెఫిస్టాఫిలిస్** : మన స్వంత ప్రదేశాలు మనల్ని చుట్టుముట్టే ఉంటాయి.
మనం వదిలి వచ్చింది స్వర్గమే అనిపిస్తుంది.
చెబుతావా ఈ గుహ ఏమిటో!
ఈ మసక చీకటిలో కనిపిస్తున్న ఆ రూపమేవిటో!

**డ్రయాడ్** : అవి ఫోర్సియాడ్లు, దమ్ముంటే వెళ్లు వాటి దగ్గరకు,
మాట్లాడి చూడు, నీ రక్తం గడ్డకట్టకపోతే అడుగు!

**మెఫిస్టాఫిలిస్** : ఎందుకు వెళ్లను?... ఎంత విచిత్రం!
నీవన్నది నిజం- ఇటువంటి రూపాల్ని నేనిదివరకు చూడలేదు.
ఇవి మాండ్రేక్ వేళ్లకన్నా అనాకారి రూపాలు
మానవుడి ఘోర పాపాలకన్నా దుర్భర దృశ్యాలు
ఎవరీ కురూపి త్రయం?
మా ఘోరాతి ఘోర నరకాల్లో కూడా
ఇటువంటి ముఖాల్ని చూడబోము!
ఇంత అందమైన ప్రదేశంలో ఇటువంటి
వికారపు రూపుల్ని 'ప్రత్యేకం'గా చూస్తారెందుకో?
అవి నన్ను గమనించినట్లున్నాయి, కీచుమంటూ,
రాక్షస గబ్బిలాల్లా కదుల్తున్నాయి అటూ ఇటూ!

**ఫోర్సియాడ్** : సోదరీ- ఆ కన్ను నాకివ్వు-
ఎవరు మన పవిత్ర ప్రాంగణంలోకి అడుగుపెడుతున్నారో చూడనివ్వు!

**మెఫిస్టాఫిలిస్** : గౌరవనీయులైన మహిళలారా!
మీ అనుమతితో నేనిక్కడున్నాను.
మూడురెట్ల ఆశీస్సులను అభిలషిస్తున్నాను.
కొత్తవాడినే కాని, మన మధ్య బంధుత్వాన్ని ఋజువు చేయగలను.
ఓప్స్, రియాలాంటి ప్రాచీన దేవతల్ని చూసాను.
ఫేట్స్ దేవతలు, కేయాస్ సోదరీమణుల్ని

ప్రాచీన కాలపు మహాదేవతల్ని, ఇంకెందర్నో చూసాను.
కాని, వారెవ్వరూ మీకు సరిపోలరు.
మాటలు వెలికిరాక ఆశ్చర్యంతో మూగబోతున్నాను.

**ఫోర్సియాడ్లు** : ఈ ఆత్మ తెలివైనది.

**మెఫిస్టొఫిలిస్** : అయినా, ఏ కవీ మిమ్మల్ని పొగడడు!
ఆశ్చర్యం! ఏ శిల్పీ మిమ్మల్ని శిల్పీకరించడు!
వాళ్లంతా జునొ, ఎథెనె, వీనస్ దేవతలు-
అటువంటి వాళ్లనే యుగాలుగా కుస్తీ పడ్తున్నారు.

**ఫోర్సియాడ్లు** : ఒంటరితనపు అగాధంలో, రాత్రి చీకట్లలో మునిగి
మేం ముగ్గురం అటువంటి ఆలోచనే చేయలేదు.

**మెఫిస్టొఫిలిస్** : నిజమా! అవును మరి! ప్రపంచానికి కానరారు మీరు!
ఎవరూ మిమ్మల్ని చూడరు, మీరెవర్నీ చూడబోరు!
రాజభవనాలు, సంపదల మధ్య తులతూగాల్సినవాళ్లు
కళలు, భోగభాగ్యాలు కాంతులు వెదజల్లే చోటులలో
చలువరాతి శిల్పాల్లా, ప్రతిదినం పరుగులెత్తే వీరుల్లా-

**ఫోర్సియాడ్లు** : మమ్మల్ని ఆశపెట్టకు! మాటలు ఇక చాలు!
ఏం కోల్పోయామో తెలుసుకుని ఏం ప్రయోజనం?
చీకటిలో పుట్టి చీకటిగా పెరుగుతూ
ఎవరూ తెలియక, ఎవరినీ తెలుసుకోక ఏం ఉపయోగం?

**మెఫిస్టొఫిలిస్** : అది పెద్ద పనేం కాదు! ఇంకొకరిగా మారడం
అసంభవమూ కాదు! మీకు తెలుసు!
ఒక కన్నూ, ఒక పన్నూ ముగ్గురికి చాలు
అట్లాంటి ముగ్గుర్ని ఇద్దరిగా చేర్చి
మూడో రూపాన్ని ఒకటిగా కుదించి
నాకివ్వకూడదూ, కొద్దిసేపు?

**ఒకామె** : ఇద్దామా!

**మిగతా ఇద్దరూ:** అలాగే, కాని పన్నూ కన్నూ మనమే ఉంచుకుందాం!

**మెఫిస్టొఫిలిస్** : ఆ రెండూ లేకపోతే మీరు నేనెలా అవుతాను?

**ఒకామె** : ఒక కన్ను మూసుకో! గొడవ తీరుతుంది.
ఒక పక్క దంతాన్ని కోరగా కదిలించు
అప్పుడు నీరూపం సాక్షాత్తూ
మా సోదరీమణుల్ని సరిపోలుతుంది.

**మెఫిస్టొఫిలిస్** : గొప్ప గౌరవం! అలానే కానీండి!

**ఫోర్సియాడ్లు** : తథాస్తు!

**మెఫిస్టొఫిలిస్** : **(ఫోర్సియాడ్ల రూపంలో)**
ఇలా ఉన్నాను, కేయాస్ ప్రియపుత్రుడను!

**ఫోర్సియాడ్లు** : మేం కేయాస్ పుత్రికలం. అది మా హక్కు!

**మెఫిస్టొఫిలిస్** : సిగ్గు పడకుండా చెబ్తున్నా- నేను ద్విలింగ జీవిని!

**ఫోర్సియాడ్లు** : ఎంత అందం! సోదరీమణులారా!
మనం కొత్త ముగ్గురం ఈ కాసేపు,
రెండు కళ్లు, రెండు పళ్లు, మీకూ నాకూ!

**మెఫిస్టొఫిలిస్** : ఏ కళ్లూ నన్ను చూడకూడదిప్పుడూ,
దాక్కుని గబుక్కున వెళతాను నరకానికి,
అక్కడివాళ్లని జడిపించి వస్తాను వెనక్కి!

## 10 డి. ఎగియన్ సముద్రంలో శిలల దారులు

**(చంద్రుడు ఆకాశంలో నడినెత్తిన)**

సైరన్లు : **(కొండచరియలపై పడుకుని వేణుగానం, గానం చేస్తుంటాయి)**
ఒకరోజు థెస్సాలేలో, అర్ధరాత్రి
మాయామంత్రాలతో మంత్రగత్తెలు
నిన్ను నేలమీదకు దించినారు-
ఇప్పుడు కాంతివలయంలో నీవు
కదుల్తున్న సముద్రంపై దృష్టి నిలిపి
వెన్నెలలు ప్రకాశింపజేస్తున్నావు-
చంద్రికా, నీ సేవకులను కరుణించు,
అలలపై కిరణాలను ప్రతిఫలిస్తూ
శ్వేతకాంతుల్ని ఎల్లెడలా ప్రసరించు.

**నెరీడ్లు, ట్రిటాన్లు: (సముద్రపు ప్రసిద్ధులుగా)**
మరింత శబ్దం సముద్రాన్ని దూసుకుపోనీ,
జలాంతర్గత జీవులారా! బయటకు రండి!
తుఫాను చీకటి కోరల్నుంచి బయటపడి
మేం మా సురక్షిత స్థావరాలకు వచ్చేసాము,
మీ మధురగానం మమ్మల్ని పిలుస్తున్నది.

ప్రకాశవంతమైన స్వర్ణహారాన్ని ధరిస్తాము,
కిరీటాలు, మణిమయ ఆభరణాలు, మా స్వంతము!
ముంజేతి కంకణాలు, కాళ్ల పట్టీలు, వడ్డాణాలు
ఇవన్నీ మీరు మాకిచ్చినవే! నౌకలు ధ్వంసమై
మున్నీట మునగగా, మీ గాన మాధుర్యానికి
నావికులు మృత్యునోట పడగా, దొరికినవే!
మీరు ఈ అగాధపు పిశాచపక్షి గాయకులు!

సైరన్లు : చల్లటి నీళ్లలో ఈదుతూ, సాగుతూ
చేపలెక్కడ తిరిగేదీ మాకు తెలుసు!
ఇప్పుడు మీ నడకల సొబగుల్ని చూస్తాము,
అగాధపు జీవుల్లారా, మీరు చేపలకంటే ఎలా అధికులో!

**నీరిడ్లు, ట్రిటాన్లు:** మేం ముందే ఊహించామిది,
అనుకునే ఈ తీరానికి చేరాము!
సోదర సోదరీమణులారా! కదలండి త్వరగా!
చేపలకంటే వేగంగా చేరుకుందాం సమొథ్రేస్!
**(వెళ్లిపోతారు)**

**సైరన్లు :** వాయు వీచికల్లా వాళ్లు అదృశ్యమైపోయారు.
'క్యాబిరి'లు తిరుగాడే ద్వీపానికి వెళ్లారు
వీళ్లు సాధించేదేమిటక్కడ? ఆ క్యాబిరీలు
తమను తాము తామరతంపరగా పుట్టిస్తాయి,
కాని తామేమిటో వాటికే తెలవదు ఎప్పటికీ!
అందాల చంద్రికా!
అలాగే ప్రకాశించు!
రాత్రి నిలిచిపోనీ ఇలానే!
పగలు వచ్చి మనల్ని తరిమవేయనీకు!

**థేల్స్ :** **(తీరాన, హోమంకులస్‌తో)**
నెరియస్‌ను చూడ్డానికి నీతో రావాలనుంది,
కాని, అతగాడు పెద్ద మూర్ఖుడు, పరమ మొండి.
వాడినెవ్వడూ సంతోషపెట్టలేడు.
సమస్త మానవజాతినీ తప్పు పడ్తాడతడు.
అతడికి రెండో చూపుంది, అదే ముందుచూపు.
అందుకే ప్రతి ఒక్కరూ గౌరవిస్తారతడిని.
కొన్ని మంచి పనులు చేసాడతడు.

**హోమంకులస్ :** ఒకసారి కదిలిద్దాం అతడిని, ఏమైనా కానీ,
ఈ గాజుకుప్పె, జ్వాల తట్టుకోగలవంటాను, అతడి కోపాన్ని.

**నెరియస్ :** నేను మానవ స్వరాల్ని వింటున్నానా!
ఎందుకు నాలో ఆగ్రహాన్ని రగిలిస్తున్నారు?
మానవుడు ఒక అసంబద్ధ జీవి
దైవత్వాన్ని చేరాలనుకునే మూర్ఖుడు
కాని, అనంతం వరకు అదే రూపులో ఉండిపోయేవాడు.

గొప్పగొప్ప మనుషులకు చేసాన్నేను సాయం
పనులైనాక అనిపించేది చేయడం వీళ్లకు అనవసరం!

**థేల్స్** : సముద్రపు వృద్ధుడా! అయినా నిన్ను మనుష్యులు నమ్ముతారు.
నీ సలహా, జ్ఞానం కావాలి మాకు, తిరస్కరించకు.
ఈ జ్వాల, మనిషిలా ఉన్నదే- ఇది సత్యం.
నీ సలహా కోసమే వెదుకుతున్నది ప్రతిక్షణం.

**నెరియస్** : సలహా! మనుష్యులు సలహాలు తీసుకుంటున్నారా?
రాతి చెవుల్లో మాటలు గడ్డకడ్తాయి.
చేతలు పనైపోయాక దుష్కీర్తి పాలౌతాయి.
తలబిరుసు వాడికి చెప్పడానికేముండదు!
పారిస్ కళ్లు కామంతో హెలెన్‌ను చూసినప్పుడు
నా తండ్రి హెచ్చరికను అతడు విన్నాడు,
నేను చూసింది అతడికి జోస్యం చెప్పాను-
అగ్నిజ్వాలలు, పొగలు ఆకాశాన్నంటుకోడం
గాలి రక్తవర్ణమై, పైకప్పు దూలాలు మండుతుండడం
ఊచకోత, విధ్వంసం నేలపై రుధిర కాసారం
కవి కల్పనలో ట్రాయ్ నగర పతనం-
మూడువేల ఏళ్ల భీభత్స ఆనందాలు-
ఒక వృద్ధుడి మాటలు ఆ మొండి పిల్లాడి నవ్వులు-

తన కోరికకు లొంగాడు, ఇలియం ధ్వంసమైంది.
ఒక మహా నగరం అర్ధాంతరంగా పతనమైంది.
ఒక మహాకాయుడి శవాన్ని రాబందులు పీక్కుతింటున్నాయి.

యులిసెస్ మాత్రం, నా మాటలు విన్నాడా?
'సిర్సె' మాయలో పడవద్దంటే లెక్కచేసాడా!
ఒంటికన్ను రాకాసి గురించి చెప్పలేదా నేను!
అతడి అనుచరుల తప్పిదం, ఏళ్ల తరబడి తిరగడం
ఆ మిగతా కథ అంతా! ఏం జరిగింది!
సముద్రపు అలలు అతడిని రక్షిత తీరానికి
విసిరికొట్టే వరకూ తిరుగుతున్నాడు కాదా!

**థేల్స్** : నీలాంటి జ్ఞానికి అది బాధాకరమే!
కాని నీ దయార్ద్రహృదయం మాకు అవసరం!
ఒక క్షణం కృతజ్ఞతలు, వందలాది రోజుల
కృతఘ్నుతా భారాన్ని తొలిగిస్తాయి.
మా పని అంత సులువైనది కాదు.
ఈ చిన్నవాడు ఒక సరైన రూపాన్ని పొందాలనుకుంటున్నాడు.

**నెరియస్** : ఆనందంగా ఉన్న నా మనస్సును పాడుచేయాలనుకుంటున్నారా?
నా ముందు కాస్త మంచి దృశ్యాన్ని ఊహించానీ రోజు.
నేను సముద్రపు గ్రెసెస్‌లను, నా కుమార్తెలు డోరిడ్లు
వీళ్లను నా ముందు హాజరు కమ్మన్నాను.
ఒలింపస్‌లోగాని, ఈ పొడి నేలపై గాని
అంత అందమైన వారిని చూసి ఉండరు.
సముద్రపు డ్రాగన్‌పై నుంచి దుముకుతూ,
సముద్రపు అశ్వాలపైకెగరడం, ఎంత అద్భుత దృశ్యం.
అలలపై, నురగపై తేలియాడుతూ ఉండే మనోజ్ఞ చిత్రం.
ఇంద్రధనుస్సు రంగుల రథంపై వీనస్ తిరిగిన
ముత్యపు చిప్పలో గలాటియా నేడు వస్తున్నది.
పాఫస్‌లో దేవతగా పూజింపబడ్తున్నది.
ఎఫ్రొడైట్‌కు వారసురాలిగా, రథ సింహాసనం
దేవాలయ నగరం – రెండూ నేడు ఆమె స్వంతం.
వెళ్లిపొండి! ఒక తండ్రి ఆనందాన్ని చెరపకండి.
నా గుండె కఠినం కారాదు, నా నాలుక పదునెక్కరాదు!
ప్రొటియస్‌ను సలహా అడగండి,
జన్మ, రూపాంతరాల గురించి ఏ సమస్య అయినా
అతడు తీర్చగలిగిందే! మాకు దారి వదలండి!
**(సముద్రం వేపు నిష్క్రమిస్తాడు)**

**థేల్స్** : పని కాలేదు, ఒకవేళ అతగాడ్ని పట్టుకున్నా
ప్రొటియస్ కనబడకుండా కరిగిపోయేవాడు.
ప్రశ్నలడిగేవాడిని గందరగోళపరుస్తాడు.
అయినా తప్పదు కనక, అతడినే వెదుకుదాం!

సైరన్లు : (కొండ శిఖరాలపైనుంచి)
ఏమిటిది మావేపు వస్తున్నది?
అలల రాజ్యం నుంచి అరుదెంచుతున్నది!
వాయు వీచికలలో తెల్లని తెరచాపలు
సముద్ర కన్యల సొబగులు
వింత కాంతితో వెలిగిపోతున్నారు.
క్రిందకు దిగుదాం! వారి మాటలను విందాం!

నీరిడ్లు, ట్రిటాన్లు: చూడండి! మా చేతుల్తో మేం తెస్తున్నాం!
ఒక పెద్ద తాబేలు డిప్పను! అందులో దేవతలను!
వారి దివ్య వర్చస్సులు కాంతిపుంజాలుగా,
వ్యాపిస్తున్నాయి నలుదెసలు!

సైరన్లు : చూడ్డానికి అల్పజీవులు
శక్తిలో అధికులు
నావికులకు ఆసరా
అనాది దేవతలు.

నీరిడ్లు, ట్రిటాన్లు: ఇప్పుడు ఈ శాంతి ఉత్సవానికి
క్యాబిరీలు అధిదేవతలు
పెను అలల్ని అడ్డుకుంటారు
నెప్ట్యూన్ కరుణిస్తాడు.

సైరన్లు : మీరు శక్తిమంతులు
సముద్రం చెలరేగి
నౌకలు ధ్వంసమైనప్పుడు
నావికుల్ని మీరే రక్షిస్తారు.

నీరిడ్లు, ట్రిటాన్లు: మేం ముగ్గుర్ని తెచ్చాం!
నాలుగవ వాడు రాదలుచుకోలేదు.
అతడు చాలా గొప్పవాడట,
అందరి గురించి ఆలోచించుతాడట!

సైరన్లు : ఒక దేవుడు ఇంకో దేవుడికి,
పని చేయగలడు వ్యతిరేకం!

అందుకే జాగ్రత్త ముఖ్యం,
అందరినీ పూజించుటే ఉత్తమం!

**నీరిడ్లు, ట్రిటాన్లు:** ఏడుగురుండాలి వాళ్లు!

**సైరన్లు :** మిగతా ముగ్గురేరి?

**నీరిడ్లు, ట్రిటాన్లు:** మాకింకా లెఖ్ఖ తేల్లేదు.
ఒలింపస్‌లో వాళ్లకు తెలుసు
ఎనిమిదో వాడెక్కడో ఉంటాడు.
అతడి గురించింకా ఆలోచించలేదు.
అంతా వాళ్లకి అనుకూలం,
ఎవరూ పూర్తిగా తయారు కాలేదు.
సాటిలేనివారే కాని
ఏదో ఒక ప్రజ్ఞ వారి స్వంతం.
విశ్రాంతి లేని ఆకలి
వారి కందుబాటులేని గమ్యం-

**సైరన్లు :** అందరం పూజిద్దాం.
సూర్యుడు, చంద్రిక
ఇంకెవరైనా ఉంటే వారిని!
అదే మనం చేయగలిగినది.

**నీరిడ్లు, ట్రిటాన్లు:** ఎంతెత్తు మన కీర్తి పుష్పిస్తుందో,
ఎవరీ ఉత్సవానందాన్ని తీసుకువచ్చారో!

**సైరన్లు :** పాత కథాకాలం నాటి నాయకులు
అంత కీర్తి నందుకోలేకపోయారు.
పేరు పెద్దదే గాని,
బంగారు ఉన్ని సంపాదించుకున్నారు,

క్యాబిరీలు మీ వాళ్లు-
**(బృందగానం)**
బంగారు ఉన్ని సంపాదించుకున్నారు-
క్యాబిరీలు మీవాళ్లు, మావాళ్లు
**(నీరిడ్లు-ట్రిటాన్లు వెళ్లిపోతారు)**

**హోమంకులస్** : గమ్మత్తైన రూపాలు! మట్టికుండల్లా కనిపిస్తాయి నాకు ఇవన్నీ,
మేధావులు ఇప్పటికీ తలలు పట్టుకుంటారు, ఏవిటీ జీవులని!

**థేల్స్** : వాళ్లకు పాతకుండపై మక్కువ,
తుప్పుపట్టిన పాత నాణేలకు విలువ ఎక్కువ!

**ప్రొటియస్** : **(కనిపించకుండా)**
భేషైన మాట! వృద్ధ ప్రేమికుడిని నాకు నచ్చింది.
అర్థం లేని పదంలోనే సరైన జవాబుంటుంది.

**థేల్స్** : ఎక్కడున్నావు ప్రొటియస్?

**ప్రొటియస్** : **(దగ్గర్లో, దూరంగా ఉన్నట్లు ధ్వన్యనుకరణ చేస్తాడు)**
ఇక్కడే! ఇక్కడే!

**థేల్స్** : నీ వేషాలు చాలుగానీ మిత్రుడా, నాకు తెలుసు,
నీవు లేని చోట నుంచి మాట్లాడగలవని!

**ప్రొటియస్** : **(ఎక్కడో దూరంగా ఉన్నట్లు)**
హల్లో! గుడ్ బై!

**థేల్స్** : దగ్గర్లోనే ఉన్నాడు! కాంతివంతంగా ప్రకాశించు!
చేపలాగా ఇతడికి శోధించడం ఇష్టం.
రూపం మార్చడంలో నిమగ్నమైనట్లున్నాడు, కాని,
దీపం మెరిస్తే చాలు నీవు కోరుకున్న చోటుకు వస్తాడు.

**హోమంకులస్**: నా గాజుకుప్పె శక్తివంతమైన వెలుగునిస్తుంది.
కాని, సున్నితంగా ఉంటుంది- విడిపోవడం ఆపుతుంది.

**ప్రొటియస్** : **(మహా కచ్ఛప రూపంలో)**
ఏమిటిది ఇంత ప్రకాశవంతంగా వెలుగుతున్నది?

**థేల్స్** : **(హోమంకులస్‌ను దాచేస్తూ)**
భేష్! దగ్గర్నుంచి చూడు!
నీ కష్టాలకు దొరుకుతుంది మంచి ప్రతిఫలం!
చూడదలుచుకుంటే రెండు కాళ్లతో రా!
మానవుడి కాళ్లతో! అలా అయితేనే చూడగలవు ఈ ధనాగారం!

**ప్రొటియస్** : **(మనిషి రూపంలో వస్తాడు)**
నీ ప్రాపంచిక జ్ఞానాన్ని విడవలేదు.

**థేల్స్** : నీవు ఎన్నో రూపాలుండే మనిషివి కాలేదూ!
**(హోమంకులస్‌ను కనబడేలా చేస్తాడు)**

**ప్రొటియస్** : **(ఆశ్చర్యంతో)**
మెరిసే మరుగుజ్జు! ఇదెప్పుడూ నే చూడలేదు!

**థేల్స్** : ఇతడికి కావాలి నీ సలహా!
సగమే పుట్టాడు, అదీ గమ్మత్తుగా,
పూర్తిగా పుట్టాలనేదే ఇతడి ఆలోచన!
తెలివితేటలు ఎన్నో ఉన్నా నేలపై జీవనం సున్నా!
గాజుకుప్పె ఇస్తుంది వీడికి కాస్త రూపం, భారం!
అందుకే కావాలనుకుంటున్నాడు ఏదో ఒక శరీరం!

**ప్రొటియస్** : శృంగారం లేకుండా పుట్టిన వ్యవహారం,
ఏదో కాకముందే, అయినందుకీ వికారం!

**థేల్స్** : **(నెమ్మదిగా)**
ఇంకొకటుంది వీడిలో,
ద్విలింగ జీవి అనుకుంటున్నాడు తనలో!

**ప్రొటియస్** : మరీ మంచిది! రకరకాల అవకాశాలుంటాయి వీడికి!
అయినా అంత విశ్లేషణ అక్కర్లేదు ఈ మాత్రం దానికి;
విశాల సముద్రంలో ప్రారంభించు నీ ప్రయాణం
మొదట్లో చిన్నగా ఉన్నా ఆనందం అత్యధికం.
చిన్నచిన్న జీవుల్ని తినుకుంటూ బతకవచ్చు,
నెమ్మదిగా పెరుగుతూ ఏదైనా సాధించవచ్చు.

**హోమంకులస్** : ఎంత మృదువుగా, స్వచ్ఛంగా ఉందీ గాలి!
ఈ తడి ఉత్పత్తి గాలి ఇస్తున్నది నాకు సంతృప్తి!

**ప్రొటియస్** : అది నిజం, చిన్నవాడా! ఇంకా చాలా వుంది సంబరం!
ఇసుక తీరాన వాతావరణం ఎంతో అనుకూలం!
అల్లంత దూరాన కనిపిస్తుంది మరింత చక్కని ఉత్సవం!
అటు పోదాం రండి, ఆనందిద్దాం అందరం!

**థేల్స్** : నేనూ వస్తాను, సత్వరం!

**హోమంకులస్:** పదండి ముందుకు! పదండి ముందుకు!
మూడురెట్ల ఆత్మాన్వేషణలో మరింత ముందుకు!
**(టెల్చైన్లు రొడ్స్ ద్వీపం నుంచి, హిప్పొకాంపైలు, సముద్ర డ్రాగన్లపై, నెఫ్ట్యూన్ త్రిశూలాన్ని ఝుళిపిస్తూ)**

**బృందగానం** : నెఫ్ట్యూన్ త్రిశూలం నియంత్రిస్తుంది కల్లోల సముద్రాన్ని,
దాన్ని కొలిమిలో తయారు చేసింది మేము!
ఉరుముల దేవుడి తుఫాను మబ్బుల జమ కాగానే
నెఫ్ట్యూన్ విరుచుకు పడతాడు ప్రచండ శక్తితో!

మెరుపులు తీగెలు తీగెలుగా నింగి నుంచి సాగుతాయి.
అలల్నుంచి నీటి తుంపర అంబరాన్ని అంటుతుంది.
నావికులు తరంగాల తాకిడికి భయంతో తల్లకిందులౌతారు.
చివరకు సముద్రం పైకుబికి వాళ్లను లాక్కుంటుంది తనలోకి.

ఈరోజు దేవుడు మాకు రాజదండాన్నిచ్చాడు.
అందుకే సముద్రం అంతా ప్రశాంతంగా ఉన్నది.

**సైరన్లు** : హిలియాస్ భక్తులకు మా ప్రణామాలు
ప్రశాంత సముద్రానికి, నింగికీ పవిత్ర సాక్ష్యాలు
చూడండి! చంద్రిక కూడా ఈ పండగ రాత్రి
ఉత్తేజంతో సాగరాన్ని ఉప్పొంగించగలదు.

**టెల్చైన్లు** : నింగిపైని చంద్రికా, ఆనందించు!
నీ సోదరుడు సూర్యుడు కీర్తింపబడుతున్నాడు.
రోడొస్ ద్వీపం నుంచి పొగడబడుతూ
స్తోత్ర పాఠాల చేత స్తుతించబడుతున్నాడు.
పగటి ప్రయాణం అతడు పూర్తి చేసేముందు
అతడి మండే వదనం మమ్మల్ని మాడ్చేస్తుంది.
మా పర్వతాలు, నగరాలు, సముద్రం, తీరాలలో
అతడి వెలుతురు ప్రకాశిస్తుంది, అతడి దయలా!
ఏ మబ్బూ అడ్డుపడదు, ఏ కిరణం ఆగిపోదు.
వందలాది ప్రతిబింబాలతో అతడు మరింత కాంతినిస్తాడు.
మేమే అటువంటి రూపాల్ని, మానవుడి రూపులో చేసి కీర్తి గడించాము.

ప్రొటియస్ : ఎన్ని గొప్పలు చెప్పుకున్నా వాళ్ళ ప్రయత్నం వృధా!
పవిత్ర సూర్యుడు ప్రతిఫలించే ప్రాణరక్షణా కిరణాలు
వాళ్ల డంబాల్ని డాంబికాల్ని ఎండగడ్తాయి.
నానా కష్టాలు పడి మహా అయితే చేసారు ఓ కంచు బొమ్మని
ఆమాత్రం దానికే పునః సృష్టి చేసినట్లు ఆనందపడ్తారు.
అంత మాత్రాన వీళ్లేమంత గొప్పవాళ్లూ కారు.
ఇప్పుడెక్కడున్నాయి వాళ్ల కంచు శిల్పాలు?
చిన్న భూకంపానికి నేలకూలి చదునైపోయాయి.
ఎవరేమన్నా, భూమి మీద జీవనం
జీవితకాలపు శ్రమ, దీర్ఘకాలపు కష్టం
జలజీవితమే మెరుగు జనజీవితం కన్నా!
నేనిప్పుడు ప్రొటియస్-డాల్ఫిన్‌ను
నాతోరా! శాశ్వత అగాధానికి సాగిపోదాము!
**(డాల్ఫిన్‌గా మారిపోతాడు)**
నా వీపుమీద కూర్చో, మోసుకుపోతాను.
అంతా నీ మంచికే! సముద్రాన్ని పెళ్లాడి సుఖంగా జీవించు!

థేల్స్ : నీ కోరికకు లొంగిపో,
సృష్టి రహస్యాన్ని తెలుసుకో!
ఆలోచించకు ఎక్కువ,
కార్యోన్ముఖుడివి కా వెంటనే!
ప్రకృతి ధర్మాలను పాటించు!
వేలాది రూపాలను దాటుకుంటూ,
పరిణామం చెందుతూ సాగిపో,
అంతిమంగా మానవుడివై ఆగిపో!
**(హోమంకులస్ వెళ్లి ప్రొటియస్-డాల్ఫిన్‌పై కూర్చుంటాడు)**

ప్రొటియస్ : ఆత్మవైరా! విశాల జలప్రపంచంలోకి!
కదుల్తూ బ్రతుకు! పెరుగుతూ పెరుగు
ఇంకెంతో ఎత్తుకు పోవాలని ఎత్తులు వేయకు.
మానవుడిగా మారాక దారి తప్పావా,
డెవిల్ దగ్గరకు పోతావు శాశ్వతంగా!

థేల్స్ : జీవితకాలంలో మంచి మనిషవ్వడం గొప్పదే!
అది వాడి నడతలో నడకలో ఉంటుంది.

**ప్రొటియస్** : నీలాంటి వాళ్లు నిలబడతారు మరిన్నాళ్లు ఇలలో
శతాబ్దాలుగా చూస్తున్నా నీ వదనాన్ని ఈ పాలిపోయిన ఆత్మల్లో

**సైరన్లు** : **(శిలల మీద నుంచి)**
మబ్బు తునకలు వలయంగా మారి
చంద్రికను మరింత కనువిందుగా చేస్తున్నాయి.
తెల్లని రెక్కల్తో ఎగుర్తున్న పావురాల్లా
ప్రేమతో అవి కాంతిలీనుతున్నాయి.
పాపియన్ ఎఫ్రొడైట్ దేవత
తన ప్రేమ పక్షుల్నిటు పంపుతున్నది.
మన విందుకు మంచి రుచినిస్తూ
మన సంతోషాన్ని సంపూర్తి చేస్తున్నది.

**నెరియస్** : **(థేల్స్ వైపు వస్తూ)–**
రాత్రిపూట చంద్ర వలయం
బాటసారి ఊహా దృశ్యం
ఆత్మలకు తెలుసు రహస్యం
చేస్తాయి సరైన వ్యాఖ్యానం.
ఆ పవిత్ర పావురాలు
నా కుమార్తె సింహాసనంపై
కాంతినిస్తూ వెలుగుతాయి
వింత విషయాలు చెబుతాయి.

**థేల్స్** : అదే నా దృక్కోణం. నిజాయితీపరుడి వాంగ్మూలం
ఏది పవిత్రమైనదో, ఏది మంచిదో చెప్పడం నా తత్త్వం.

**సిల్లి, మార్సి (Psylli and Marsi - సముద్రపు జంతువులపై విహరిస్తూ) :**
సైప్రస్ కొండగుహల్లో
సముద్ర తరంగాలలో మునగక
భూకంపాలకు బెదరక
ఇదివరకటి రోజుల్లానే
అమందానందం మాకు తెలుసు.

గాలులు వీస్తున్నాయి.
మా దేవత రథాన్ని

మేము రక్షిస్తున్నాము.
రాత్రులు గుసగుసలాడే వేళ
మధుర జలాల అల్లికల గుండా
సముద్రుడి అందాల కుమార్తెను
ఈనాటి కళ్లు చూడలేని లావణ్యవతిని
మేము తీసుకుని వస్తున్నాము.

అనంతంగా సాగే మా ప్రయాణాన్ని
ఏ గరుడపక్షీ ఆపలేదు.
ఏ రెక్కల సింహమూ, ఏ శిలువా
ఏ నెలవంకా అడ్డుపడబోదు.
వాటి యుద్ధాలతో మాకు
నిమిత్తం లేదు, వాటి విధ్వంసాలతో కూడా!
యధావిధిగా మేము తీసుకువచ్చాము మా దేవతను-

**సైరన్లు** : వేగంగా పరిభ్రమణం, సున్నితమైన చలనం
రథం చుట్టూరా సొగసుగా కదలడం
రేఖల వెంబడి వలయాల దారుల్లో
స్వాగతం! నీరిడ్లు, నెరజాణలు,
డొరిడ్లూ- మీ దేవతను తీసుకురండి!
దేవతలాంటి గలాటియాను ప్రవేశపెట్టండి.
మరణంలేని ఆకర్షణతో దేవతా సమానమైనది,
మానవస్త్రీ లావణ్యంతో మనుషుల్ని ఆకర్షిస్తుంది.

**డొరిడ్లు** : **(నెరియస్‌ను దాటుతూ డాల్ఫిన్లపై కూర్చుని బృందగానం చేస్తారు)**
చంద్రికా! నీ వెన్నెలలను ప్రసరించు
మా తండ్రి మమ్ములను చూసేందుకు
మేము ఆడిపాడిన యువతరంతో
మాకు తక్షణ వివాహాన్ని జరిపించు.
**(నెరియస్‌తో)**
భీకర జలాల్లో కాపాడి యువకుల్ని
వారికి వెచ్చదనాన్ని ఊపిరిని ఊదినాము.
నాచుపై, రెల్లుపై పరుండబెట్టి
వారి కృతజ్ఞతలను అందుకున్నాము.

మా ఉద్వేగాలు, ఉద్దేశాలు నీకు తెలుసు.
వారిపై దయ ఉంచి ఆశీర్వదించు.

**నెరియస్** : అద్భుతం! ఒక పని రెండు లాభాలు
దయాపూరిత కార్యం, వినోదభరితం.

**డొరిడ్లు** : నీవు మెచ్చుకున్నావు తండ్రీ, చాలా సంతోషం,
ఈ మరణం లేని యువకుల్ని, అంగీకరిస్తే ఆనందం.

**నెరియస్** : వారితో పొందు అది మీ యిష్టం.
కాని ఎందుకు వారికి అమరత్వం?
అది జ్యూస్ దేవుడికే సాధ్యం.
సముద్రపు అలలు ఊయలలై ఊగుతాయి.
ఏదీ ఇక్కడ కాదు శాశ్వతం.
ప్రేమైనా అంతే, మీ ఆనందాన్ని పొందండి,
ఆనక తీరానికి మృదువుగా నెట్టివేయండి.

**డొరిడ్లు** : ప్రియతములారా! మిమ్మల్ని ప్రేమిస్తున్నాం!
అయినా దుఃఖభరితమైన వీడ్కోలు ఇస్తున్నాం!
మన బంధాలు తెగిపోతున్నాయి,
మేము శాశ్వతానందాన్ని కోరినాము, విధి ఆలోచన వేరుగా ఉన్నది.

**యువకులు** : నావికులకు అది సాధారణమే!
తనివితీరా మమ్మల్ని ముద్దాడండి!
ఇటువంటి వేళల్లో ఇస్తాయవి సంతృప్తి
మాకు చెందని వాటిని మేం పొందబోము.
**(గలాటియా తన ఆల్చిప్ప రథంపై దగ్గరకు వస్తుంది)**

**నెరియస్** : నీవా, చిట్టితల్లీ!

**గలాటియా** : తండ్రీ! ఎంత ఆనందం నిన్ను చూస్తే,
కాని, ఈ రథం ఇక్కడ నిలబడదే!

**నెరియస్** : వెళ్లిపోయింది! నా నుంచి మరుక్షణం!
డాల్ఫిన్ల వేగవంతమైన ప్రయాణం!
నా హృదయ వేదనను ఎవరు లెక్కచేస్తారు?
నన్ను కూడా కొనిపొండి వీలైతే!

పోనీ, ఆ ఒక్క తియ్యని చూపు చాలు,
ఏడాది పాటు నిరీక్షణకు సరి జవాబు.

**థేల్స్** : అందరికీ అభివాదం!
ఎంత సత్యం, ఎంత సుందరం!
ఈ పూట నా ఎదను పులకింపచేస్తున్నాయి.
నీటిలో అన్నీ జీవిస్తాయి, అన్నీ వృద్ధి చెందుతాయి.
ఓ సముద్రుడా! నీ కరుణను మాపై కురిపించు.
మేఘాల్ని పంపించు, నీవు రాలేకపోతే,
ప్రవాహాల్ని పంపించు, నీవు రాలేకపోతే!
నదుల్ని వేగంగా నడిపించు, నీవు రాలేకపోతే,
పర్వతాలు, మైదానాలు, ఈ సమస్త ప్రపంచం
ఈ సజీవ సామ్రాజ్యం నీ వల్లనే కదా నిలదొక్కుకున్నది.

**ఎఖొ** (బృందంతో): ఈ సజీవ సామ్రాజ్యం నీ వల్లనే కదా నిలదొక్కుకున్నది.
కొత్త సృష్టి పుడుతుంది, మరల ప్రవహిస్తుంది.

**నెరియస్** : వాళ్లు దూరంగా వెళ్లిపోయారు.
మా నేత్రాలు ఒకరినొకరు చూసుకోలేవు.
పెద్దపెద్ద వలయాలలో అవి కదిలిపోయాయి.
నృత్యగానాలతో అవి నన్ను దాటిపోయాయి.
నేనింకా గలాటియా రథాన్ని చూస్తున్నాను.
అదుగో, అదుగో, మెరుస్తున్న తారలా, అదుగో!
అంత గుంపులో కూడా గుర్తించగలను.
ఆ మెరుపు, ఆ కాంతి, ఆమెదే; ఆమెదే!
సత్యంగా నా మదిలో నిలుచును నిత్యంగా!

**హోమంకులస్** : ఈ మధుర జల ప్రపంచంలో
ఎక్కడ నా కాంతి పడినా
ప్రకాశవంతం, అత్యంత సుందరం!

**ప్రొటియస్** : ఈ మధుర జలప్రపంచంలో
నీ కాంతి ప్రసరిస్తూ చేస్తున్నది.
సంగీతాన్ని ఎక్కువగా, మరింత మధురంగా!

**నెరియస్** : ఈ అద్భుత నృత్యాల మధ్య ఏ రహస్యం దాగున్నదో!
మన మైమరచిన వీక్షణాలలోకి ఏ వింత కనరానున్నదో?
ఆ దేవత పాదాల వద్ద వెలుగుతున్న కాంతి ఏమిటది!
ఒక్కసారి వెలిగి మరింత కాంతివంతమవుతున్నది.
ప్రేమ, కోరికలతో ప్రజ్వరిల్లి ప్రతిఫలిస్తున్నది ఏమిటది?

**థేల్స్** : హోమంకులస్!
ప్రొటియస్ ప్రణయంలో-
అతడి నిరీక్షణకు అదే జవాబు! అదే జ్వలించే అగ్ని
అది అతడి నిట్టూర్పు, అతడి బాధల ఓదార్పు.
ఆమె వెలిగే సింహాసనం వద్ద ఆ గాజు కుప్పె పగుల్తుంది.
అదిగో అతడి మెరుపు, ఆ వెలుగు వెలువడింది, అదృశ్యమైనది.

**సైరన్లు** : ఎన్ని అద్భుత దృశ్యాలు, ఎన్ని రూపాంతరాలు.
అలలు ముక్కలు కాగా కడలిలో తుఫాను
కాంతి కదుల్తుంటే ఊగుతున్నది వెలుగు
రాత్రిలో పయనిస్తూ మెరుస్తున్న జీవాలు
అగ్నిగుండం వడి తిరుగుతుందక్కడ,
ఇప్పుడు రాజ్యం చేస్తున్నది 'ఎరాస్' ప్రతిచోటా!

సముద్రానికి అభివాదం! పోటు మారుతున్నది.
పవిత్రాగ్ని సంస్కరించబడి సుందరమగుచున్నది.
అలలకు అభివాదం! అగ్నులకు అభివాదం!
పేరు లేని ఈ ఘటనకు ప్రేమతో అభివాదం!

**టుట్టిసిమి (Tuttissimi)-**

చల్లని, సన్నని వాయువీచికలకు అభివాదం!
భాగ్యవంతమై, మార్మికమైన గుహలకు అభివాదం!
అగ్ని, గాలి, నీరు, నేలకు అభివాదం!
నాలుగు మూలకాలకు సమిష్టిగా నమస్కారం!

# తృతీయాంకం (Act III)

## 11. స్పార్టాలో మెనెలాస్ భవనం ముందు

**(హెలెన్, బృందం - ట్రోజన్ స్త్రీలు - పాంథాలిస్ బృందపు నాయకురాలు)**

**హెలెన్** : ఎన్నో మెచ్చుకోళ్లు, ఎన్నో దూషణాలు, హెలెనా!
చానాళ్లు సముద్రంలో గడిపి, ఇప్పుడు తీరానికి చేరాము, అవునా!
ట్రాయ్ తీరాల నుండి బయల్దేరి నీలి అలలపై జాలువారి,
పొజిడాన్ కృపతో, తూర్పుగాలి ఊద్పుతో
పితృదేశానికి చేరి కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్నాం.
అదుగో అక్కడ నా భర్త మహరాజు మెనెలాస్
తన మిత్రులైన వీరులతో విందులు గుడుస్తున్నాడు.
నా తండ్రి టిండారియస్ నిర్మించిన గృహంలో నేనున్నాను.
పల్లాస్ ఎథెనె పవిత్ర కొండవాలుల పక్కన నా దేశం.
ఇక్కడే నేనాడుకున్నది నా సోదరి క్లైటిమ్నెస్ట్రాతో,
కవలలు కాస్టర్, పొల్లక్స్‌లతో, ఈ గృహావరణంలోనే
కంచు వాకిళ్లతో, దుర్భేద్యమైన కోట గోడలతో
అందరినీ విస్మయ పరిచే నా గృహమా! నీకు అభివాదము!

ఒకప్పుడు, నీవు స్వాగతించావు ఆ మెనెలాస్‌ను
అనేకమంది వధూకాంక్షాపరులైన వరుల నుండి,
విశ్వాసపాత్రురాలైన భార్యగా నేను, నా తరఫున,
అందజేయి స్వాగత సత్కారాలు అతడికి!

నన్ను లోనికి రానివ్వు! విధి తుఫానులను
విదిలించుకుని నేనిప్పుడు స్వేచ్ఛగా వచ్చాను.
ఈ గుమ్మాన్ని దాటాను, సైథిరా పూజా మందిరాన్ని దర్శిస్తాను.

ట్రాయ్ వీరగాధలు అనేకం ఉన్నాయి
దూర తీరాలకు వ్యాపించి గానం చేయబడ్తున్నాయి.
కాని ఏ కథా ఇంత అద్భుతంగా ఉండబోదు.
ఆ వీరుడిపై చెప్పబడుతున్నది సత్యం కాబోదు.

**బృందం** : అమ్మా! నిరాశ వలదు!
నీ గౌరవానికి కొరత రాబోదు!

అత్యున్నతమైన అదృష్టం నీ స్వంతం.
అపురూప సౌందర్యం నీకే పరిమితం!

వీరుని కన్నా ముందే అతని పేరు నడుస్తుంది.
గర్వంతో అతడు చరిస్తాడు.
ఎంత తలపొగరున్న మగధీరులైనా
అందాల రాశి ముందు తలవంచుతారు.

హెలెన్ : చాల్చాలు! నా భర్త నన్ను తన నౌకలో తీసుకువచ్చాడు.
తనకంటే ముందే నన్ను నగరంలోకి పంపినాడు.
అతడి ఉద్దేశమేమిటో నేనూహించలేను.
నేనతడి భార్యగా వచ్చానా, లేక రాణిగానా?
తనకు కలిగిన దుఃఖానికి ప్రతీకారం తీర్చుకోనున్నాడా?
గ్రీకులు పడ్డ కష్టాలకు మూల్యం చెల్లించమంటాడా?
నేనిప్పుడు యుద్ధఖైదీని, అందమైన బహుమతిని.
విధి విలాసం వలన నా కీర్తికి రెండంచులు-
ఒక పక్క నా అందాన్ని వెంటాడేవాళ్లు!
ఈ ఇంటిలో ఇంకా తచ్చాడుతున్నారు.
మనం నౌకలో వస్తున్నపుడు, నా భర్త
నా వంక చూడలేదు, నన్ను పలకరించలేదు.
ఎదురుగా కూర్చుని ఏవో దుష్ట తలంపులతో ఉన్నాడు.
ఎప్పుడైతే నౌకల్లో ముందున్నవి తీరాన్ని చేరగానే
ఏదో దివ్య శక్తి ఆవేశించినట్లు ఇలా అన్నాడు-

"నౌక తీరం చేరగానే నా సైనికులందరూ
నాకు గౌరవ వందనం చేయడానికి నిలబడతారు.
నీవు యురొటాస్ నది ఒడ్డుమీదుగా నడిచి,
పంట పొలాల్ని దాటి నగరాన్ని చేరుకో!
ఇక్కడే లేస్‌డిమన్ విశాల పంటపొలాల ప్రాంతం
పర్వతాల నీడలో ఇప్పుడు శుష్కించి ఉన్నది.
అక్కడి బురుజులున్న భవనంలోకి వెళ్లు! స్త్రీలందరిని సమావేశపరచు
గృహ ప్రధాన సేవిక, నా బానిసకు చెప్పి
నా ధనాగారానికి వెళ్లు, అది నీ తండ్రి నాకిచ్చినదే!
యుద్ధం, శాంతి సమయాల్లో దాన్ని మరింత అధికం చేసాను.

యజమాని ఇంటికి రాగానే తన సంపదల్ని సరిచూసుకోవాలి!
ఎందుకంటే సేవకులు ఆజ్ఞమీరి ప్రవర్తించలేరు."

**బృందం** : ఈ ధనాగారాన్ని, అంతులేని సంపదలను వీక్షించు!
నీ హృదయాన్ని ప్రశాంతపరచు!
ఇవి రత్నమణిమయ కిరీటాలు,
ఇవి వజ్రాల హారాలు, ఇవి సర్వాభరణాలు.
వాటితో పందెం కట్టి! నీ దేహంపై అలంకరించు!
అతి ఖరీదైన స్వర్ణ, రత్నమణి ముత్యాలతో
అందం చేసే యుద్ధం ఎలా ఉంటుందో చూస్తాం మేము!

**హెలెన్** : నా ప్రభువు అలా ఆజ్ఞాపించి ఇంకా అన్నాడు
"ఇంట్లోని సమస్త వస్తువులనూ పర్యవేక్షించాక,
ఎన్ని త్రిపీటకాలు, గంగాళాలు, అవసరమో చూడు.
పవిత్ర యాగాన్ని భక్తిశ్రద్ధలతో చేయాలీనాడు.
పెద్దపెద్ద కుండలు, గిన్నెలు, రక్తాన్ని పట్టే పాత్రలు
నైవేద్యాన్ని సమర్పించడానికి అవసరమైన వస్తువులు-
స్వచ్ఛమైన పవిత్ర నీటిబుగ్గల జలాలు
పొడుగాటి భారీ కలశాల్లో నింపి ఉంచాలి!
అంటుకుంటే మండేటంత ఎండు కట్టెల్ని
అధికంగా తెచ్చి నిల్వ చేయాలి.
మంచి పదునైన కత్తిని సిద్ధం చేసి ప్రక్కనే ఉంచాలి.
-మిగతావన్నీ నీకు తెలుసు, శాస్త్రోక్తంగా విధులు నిర్వహించాలి-
అని ఆజ్ఞాపించి అతడు నన్ను వెళ్లిపొమ్మని సంజ్ఞ చేసాడు.
అయితే, అతడు ఏ జీవాన్నీ పేర్కొనలేదు.
ఒలింపస్ దేవతలకు బలిపశువును నిర్ణయించలేదు.
ఆ విషయమే నన్ను కలవర పరుస్తున్నది-
అయినా ఇవన్నీ నేను ఆ దేవుడిపై భారం వేసాను.
వారనుకున్నదే కదా ఇలలో జరిగేది!
మర్త్యులం మనం వారి నిర్ణయాల్ని శిరసా వహించాలి!
చాలాసార్లు పూజారి కత్తిని బలిపశువు మెడపై ఉంచినా
ఏ దేవుడో, శత్రువో అతడి చేతిని నిలిపి వేస్తాడు.

**బృందం** : భవిష్యత్తును చెప్పడం మన చేతిలో లేదు.
మహారాణీ! ధైర్యం వహించు,
గృహంలో అడుగుపెట్టు!
మంచి చెడు వస్తాయి,
మానవుడికి తెలవకుండానే,
జోస్యాన్ని చాలాసార్లు నమ్మము!
ట్రాయ్ తగలబడ్తుంటే మనం
చావు దగ్గరబడిందని అనుకోలేదా!
అయినా, మనమిక్కడ ఉన్నాం!
నీ సహచరులం, నిన్ను సేవిస్తున్నాం!
అంబరాన సూర్యుణ్ణి చూస్తున్నాం
నేలపైన అపూర్వ నిధి మీరు,
మమ్మల్ని గౌరవిస్తుంటే ఆనందిస్తున్నాం!

**హెలెన్** : ఏదైమైనా కానీ, రాజగృహంలోకి నేనడుగిడతాను!
ఎప్పుడో కోల్పోయిన దానిని తిరిగి నేను పొందుతాను.
ఎదురుగా ఉన్న పరిచితమైన మెట్లపై కూడా
ఎందుకో సంశయిస్తూ నడుస్తున్నాను.

**(వెళ్లిపోతుంది)**

**బృందం** : సోదరీమణులారా!
యుద్ధఖైదీల్లారా!
మీ బాధలను మరచిపొండి.
ఆమె ఆనందాన్ని పంచుకోండి!
ఆమె మనరాణి
హెలెన్ ఆనందంగా వచ్చింది.
తన ఇంటికి తాను మరలి వచ్చింది.
నెమ్మదిగా అడుగులేస్తున్నా అవి స్థిరంగా ఉన్నాయి చూడండి.

పవిత్ర దేవతలను పూజించండి,
వారు జీవాన్నిస్తారు.
ఆశీర్వదిస్తారు.
స్వేచ్ఛ లభించిన ఖైదీ,
రెక్కలున్నట్లు ఎగుర్తాడు,

అతి కష్టమైన దారిలో!
మరింకో ఖైదీ
నాలుగు గోడల మధ్య మగ్గుతూ
చేతుల్లో తలవాల్చుకుని దుఃఖిస్తాడు.
ట్రాయ్ వీధుల్నుండి ఎవరో దేవుడు,
ఇటు లాక్కు రాగానే ఆమెను,
అంతమైంది ఆమె ప్రవాసం!
ఇది ఆమె పూర్వీకుల గృహం
అనేక కష్టాలు, సుఖాల తర్వాత
ఆమెకు మళ్లీ వస్తాయి యవ్వనపు రోజులు!

పాంథాలిస్ : **(బృందపు నాయకురాలు)**
పాటను కాస్త పక్కకు పెట్టి,
గృహద్వారం వేపు చూపు నిలపండి!
అక్కలారా, ఏమిటిది? మనరాణి అడుగులలో
కానవస్తున్న ఏదో వ్యాకులత, తొందర!
మహారాణీ, ఏమైనది? ఎందుకు తమలో ఆందోళన!
తమ సేవకులు కాక మరెవరైనా దారికడ్డు తగిలినారా?
ఏదో తమ ఆగ్రహాన్ని రేకెత్తించినది,
తమ భృకుటి ముడులు, ఆశ్చర్యాన్ని ప్రకటిస్తున్నవి.

హెలెన్ : **(వడిగా వచ్చి తలుపులు బార్లాగా తెరచును)**
జ్యూస్ దేవుని కుమార్తె దేనికీ భయపడదు.
ఏ హెచ్చరికా ఆమెను కలవరపరచలేదు.
కాని, అనాది రాత్రి గర్భం నుంచి భీభత్సం బయటపడితే
అగాధపు లోయల్నుంచి మండే మబ్బు కక్కబడితే
అగ్నిపర్వతపు నోటి నుంచి బహురూపి బయటపడితే
పేరు లేని భయం పెద్ద వీరుడినీ వణికిస్తుంది.

ఈరోజు నా గృహానికి నరకలోకపు దేవతలు
భీభత్సంగా అడుగుపెట్టి కల్లోలపరుస్తున్నారు.
చిరకాల పరిచయమున్న నా గుమ్మాన్ని మళ్లీ నేను దాటుతున్నాను.
గెంటివేయబడిన అతిధిలా పారిపోతున్నాను.

ఇంతకు మించి నన్ను నీవు తరమలేవు,
ఎంత దుష్టశక్తివైనా కావచ్చు నీవు!
నేను గృహాగ్నిని ప్రజ్వలింపజేస్తాను.
ఆ పవిత్ర కాంతిలో స్వాగతింపబడతాను.

**బృందం** : రాణీ! నీ సేవకులు విశ్వాసపాత్రులు,
ఏం జరిగిందో తెలుసుకోగోరుతున్నారు.

**హెలెన్** : మీ స్వంత నేత్రాలతో మీరూ వీక్షించగలరు,
అనాదిరాత్రి వికృతరూపాన్ని తన గర్భంలోకి మరలించుకోకపోతే!
రాజాజ్ఞను మననం చేసుకుంటూ నేను
వెళ్లాను రాజభవనపు గదుల్లోకి, ఆవరణలలోకి!
ఎక్కడ చూసినా నిశ్శబ్దమే, వెక్కిరిస్తున్న శూన్యమే!
అడుగు చప్పుళ్ళు లేవు, మాటా పలుకూ లేదు.
గృహ సేవికలు లేరు, సేవకులు కానరారు.
ఇవరకెప్పుడూ ఇలా జరిగి ఉండలేదు.
అయితే నేను గృహాగ్ని ఉండే చోటుకు వెళ్లగానే
ఇంకా అక్కడ మండుతున్న అంగారాలు కన్పించాయి కొన్ని.
అక్కడే చూసాను ఓ పొడుగాటి ముసుగు రూపాన్ని.
ధ్యానంలో కూర్చున్నట్లున్న ఓ వింత ఆకారాన్ని.
గృహసేవిక అనుకుని గదమాయిస్తూ
పనుల్ని అనేకం పురమాయించాను.
కదలదూ, మెదలదూ ఇదేమి చోద్యమనుకుని
గట్టిగా అరిచాను, తిట్లు కురిపించాను.

నెమ్మదిగా కదిలింది ఆమె కుడిచేయి
నన్ను అక్కడ నుంచి పొమ్మని సైగ చేసింది.
అంతఃపురానికుండే మెట్లవేపు పోబోగానే
ఆ వికృతరూపం నిలబడింది వేగంగా, అడ్డంగా!

సన్నగా, కంకాళంలా, నిప్పులు కురిసే కళ్లతో
దాన్ని చూస్తేనే మనసూ, ఒళ్లూ జలదరిస్తుంది.
దానిని ఊహించి మీకు చెప్పాలంటేనే
మాటలు, ఊపిరి ఆగిపోతున్నాయి, నాలో.

మీరే చూడండి! ఆమె వెలుగులోకి వస్తున్నది!
ఇక్కడ మనమింతమందిమున్నాము, రాజు వచ్చేదాకా ఆగుదాం!
అందానికి తోడు సూర్యదేవుని కిరణాలు.
అతడు తరిమివేస్తాడు చీకటి రూపాలు.
**(ఫోర్సియాస్ (Phorcyas) గుమ్మం దగ్గరకు వస్తుంది)**

**బృందం** : ఈ జీవితంలో చాలా చూసాను,
కనుబొమలింకా నల్లగానే ఉన్నాయి,
వాటిని కప్పుతున్న ముంగురులు కూడా!
ఎన్నో భీభత్స దృశాల్ని చూసి తట్టుకున్నాను–
యుద్ధ విలాపాల్ని, ట్రాయ్ విధ్వంసపు రాత్రిని–

పైకెగసిన దుమ్మూ ధూళి
సైనికుల అరుపులు, అశ్వ, రథాల ఖంగాళీ
చావు కేకలు, సకిలింపులు, ఆర్తనాదాలు
దేవతల పెడబొబ్బలు, కోటగోడల జలదరింపులు–
దుఃఖపు భీభత్సాన్ని చూసానప్పుడు–

అప్పటికింకా ట్రాయ్ గోడలు నేలమట్టం కాలేదు.
అగ్ని నాలుకలు చాచుకుంటూ,
ఒక ఇంటి నుంచి మరో ఇంటికి వ్యాపిస్తున్నది,
నల్లబడిన నగరం పొగల్తో నిండింది,
తన తుఫాను గాలుల్లో తానే కూలబడింది.

పారిపోతూ చూసాన్నేను,
ఆ వేడి పొగల మధ్య నుంచి,
జ్వలిస్తున్న అగ్గిరవ్వల గుండా–
దేవతలు స్వయంగా యుద్ధంలో దూకడం,
అద్భుత రూపాలు, మహాకాయులు,
పొగల్ని చీల్చుతూ, మంటల్లో మెరుస్తూ–

వాటిని నేను చూసానా, లేక అవి నా మనసు
సృష్టించిన భయ ప్రతీకలా! చెప్పలేను!
కాని ఈ భయంకర రూపాన్ని కళ్లారా చూస్తున్నాను.
దీనిని నేను ముట్టుకోగలను, భయంతో వెనక్కి తగ్గకుంటే!

మీలో ఎవరు ఫోరిసిస్ కుమార్తెలు!
వాళ్లను కాస్త పోలి ఉంటారు మీరు.
గ్రెయెలు ముగ్గురిలో నీవొక్కతివే వచ్చావా!
ఒక కన్ను ఒక పన్ను, పంచుకునేది మీరేగా!

రాక్షసీ! ఎంత ధైర్యం నీకు!
అందానికి సరసన నిలబడుతున్నావు!
అందరినీ చూసే సూర్యుడు
నిన్నూ చూస్తూనే ఉన్నాడు!
అడుగు ముందుకు వేసి
వెలుగులోకి రారాదు?
అతడిలోకి రారాదు,
అతడి పవిత్ర నేత్రం
నీడను చూడబోదు!

మేము మర్త్యులం! ఈ బాధను భరిస్తాం!
విధి మాకు నిర్ణయించింది అనుభవిస్తాం.
మాటలతో వర్ణించలేని నీ అనాకారి రూపం
సౌందర్యారాధకులు భరించలేని శాపం!

ఓ మొండి దయ్యమా! రగిలించకు కోపం,
మాకు అడ్డు తగిలావు, ఇది మా శాపం!
మా దూషణ ఛీత్కారాలు మా వికల్పం
మమ్మల్ని తయారు చేసిన దేవతల సంకల్పం

**ఫోర్సియాస్** : పాత నీతివాక్యమే గాని, కాదు సత్యదూరం
అందం, హుందాతనం చెట్టాపట్టాలేసుకోవు
రెంటిమధ్య గాఢంగా వేళ్లూనుకున్నది అనాది వైరం
తారసపడినప్పుడల్లా వీపులు చూపించుకుని
వేగంగా సాగిపోతాయి వ్యతిరేక దిశల్లో అవి.
హుందాతనం విచారంగా, అందం నిర్లక్ష్యంగా
అంతిమంగా నరకపు రాత్రిలో కలుస్తాయి రెండూ!
కాని వృద్ధాప్యం వాటిని ముందుగానే ఓడిస్తుంది.

ఓ పరాయి దేశపు పడుచుల్లారా!
సిగ్గు లజ్జాలేని మొండి ఘటాల్లారా!
మబ్బుల్లో కొంగల గుంపులా మూగి
నానా కేకలూ కూతలూ కూస్తున్నారు.
ప్రశాంతంగా పోయే బాటసారిని భయపెడ్తారు.
కొంగలు పోగానే బాటసారి తన దారిన పోతాడు.
మీరూ పోతే నేను నా పనిలో పడిపోతాను.

అయినా ఎవరు మీరు? ఈ రాజభవనం
చుట్టూ మూగి తాగి తందనాడ్తున్నట్లు అరుస్తున్నారు?
ఎవరు మీరు, ఈ ప్రాసాదపు ప్రధాన పరిచారికపై
కుక్కలు చంద్రికను చూసి మొరిగినట్లు మొరుగుతున్నారు!
నాకు మీ జాతి చరిత్ర తెలీదనుకుంటున్నారా,
యుద్ధం తిండి తిని వళ్లు బలిసిన కుక్కల గుంపూ మీరూ!

మగవాళ్ల కోసం వెదకుతున్నారా! మోహించి, మోహింపబడడానికి
యుద్ధోన్మాదం, కామ ప్రకృతి కలగలపడానికి!
సికాడా చిమ్మెటపు పురుగుల్లా ఒక పక్కకు  ఒరిగారే,
దూకడం, ఆగడం, పంటల్ని తినేసే మిడతల దండులా?
ఇతరుల తిండిని రాజేసే ఆడ గుంటనక్కలు
మొలకెత్తే సంపదను కొరుక్కుతినే ఎలుకలు–
పట్టుబడిన బానిసలు, వాడి, అమ్మబడిన వస్తువులు.

**హెలెన్** : యజమాని ఎదుట పనివాళ్లను తిట్టడమంటే
ఆమె హక్కుల్లో జోక్యం కలుగజేసుకోవడం!
పని బాగా చేస్తే ప్రశంసించడం,
తప్పు చేస్తే తెగనాడడం అది యజమానురాలి హక్కు!

నేను వారి సేవను మెచ్చాను, ట్రాయ్ పతనం చెందినా
వాళ్లు నన్ను కంటికి రెప్పలా కాపాడుకున్నారు,
సముద్ర ప్రయాణంలో నన్ను చక్కగా చూసుకున్నారు.
ఎవడి దారి వాడు చూసుకునే కష్టాల్లో కూడా
వీళ్లు నన్నంటిపెట్టుకునే ఇన్నాళ్లున్నారు.
సేవకులెవరన్నది ప్రశ్నకాదు, ఎలా పని చేస్తారనేదే!

వీళ్లని ఛీత్కరించడం మాను, నోరు మూసుకో ఇప్పుడు
నీ యజమానురాలికి బదులుగా ఇంటిని నడిపావు.
ఇప్పటి వరకూ బాగా, అయితే, నీ విధి నిర్వర్తించావు.
ఇప్పుడామె స్వయంగా వచ్చింది, నీ చోటులో నీవుండు!
లేదంటే బహుమానంకు బదులు, శిక్షకు సిద్ధంగా ఉండు.

**ఫొర్సియాస్** : ఇంటిలో సభ్యులని తిట్టే హక్కు
ఘనత వహించిన ప్రభువు పత్నికే ఉన్నది.
ఇప్పుడు నిన్ను నేను గుర్తించాను,
నీ స్థానాన్ని నీవు తీసుకోవచ్చును.
అంతఃపురాన్ని, ధనాగారాన్ని పొందవచ్చును.
కాని, ఇన్నేళ్ల నా సేవకు కావాలి రక్షణ
ఈ బాతుల గుంపు నుంచి, క్వాక్ క్వాక్ అరుపుల్నుంచి!
హంసలాంటి నీ అందం ముందు వీళ్లు
సగం రెక్కలు తెగిన పెద్ద బాతుల్లా ఉన్నారు.

**బృందపు నాయకురాలు:**
అందానికి పక్కన ఎంత అనాకారి రూపం!

**ఫొర్సియాస్** : చక్కని హాస్యం ముందు చప్పిడి మాటలు–
**(బృందంలో ఒక్కరొక్కరుగా ముందుకు వస్తారు)**

**మొదటి స్త్రీ** : నీ తండ్రి ఎరిబస్, నీ తల్లి చీకటిరాత్రి, అవునా?

**ఫొర్సియాస్** : స్కిల్లా రాక్షసి నీ తోడబుట్టువు కాదా!

**రెండవ స్త్రీ** : నీ వంశవృక్షం మీద ఎన్ని పిశాచాలు పాకుతున్నాయి?

**ఫొర్సియాస్** : హేడ్స్ నరకానికిపో, నీ చుట్టాలున్నారక్కడ!

**మూడవ స్త్రీ** : అక్కడ మీవాళ్లు లేరులే, చచ్చినవాళ్లు నీ అంత ముసలోళ్లు కాదు.

**ఫొర్సియాస్** : వృద్ధుడు టిరెసియాస్‌ను పట్టుకో, నీ పడుపు మాయలు పన్నుకో!

**నాల్గవ స్త్రీ** : నీ మనవరాలు ఓరియాన్ దాయమ్మట గదా!

**ఫొర్సియాస్** : కంపు హార్పీలు నిన్ను మేపాయా, వాటి కుళ్లు కక్కుళ్ల మధ్య!

**అయిదవ స్త్రీ** : ఏం తిండి తింటావేంటి ఇంత పుల్లలా వుండడానికి?

**ఫొర్సియాస్** : రక్తం కాదులే, మీరు ఆరాటపడేది!

**ఆరవ స్త్రీ** : శవాలు పీక్కుతింటావా, నీవే ఒక శవానివి!

**ఫోర్సియాస్** : నీ చెత్తనోట్లో రక్తపిశాచి కోరలు కనిపిస్తున్నాయిలే!

**బృందపు నాయకురాలు–**

నీ పేరు పలకగలిగితే ఆపేయగలను నిన్ను

**ఫోర్సియాస్** : నీపేరు చెప్పు ముందు, రహస్యం విప్పగలను.

**హెలెన్** : కోపంతో కాదు, దుఃఖంతో అడ్డు వస్తున్నాను.
ఈ మాటల యుద్ధాన్ని ఇంతటితో ఆపండి!
తన సేవకులు అంతర్గత వైషమ్యాలతో ఉండడం
కన్నా విషాదకరమైనది, ప్రభువుకు, మరొహటి ఉండబోదు.
అటువంటప్పుడు అతడి ఆజ్ఞలు చేతలుగా మారక
సమన్వయం కుదరని పనివాళ్ల వల్ల నిష్ఫలమవుతాయి.
అంతా గందరగోళమై అనవసరపు వాగ్యుద్ధాలతో
గాలి వేడెక్కి క్రమశిక్షణ లుప్తమై చిరాకు తెప్పిస్తుంది.
ఆగ్రహం హద్దులు మీరగా మీరు ఆవాహన చేసిన
భీకర రూపాలు నా చుట్టూరా మూగి నన్ను నరకం వేపు నడిపిస్తున్నాయి.
అంతకన్నా ఈ ఆకుపచ్చని నేలపై అందే అరిష్టమేమున్నది?
ఇది జ్ఞాపకమా! ఏదైనా భ్రాంతి నను కలవరపెడ్తున్నదా?
ఇంకా నేను నగరాలకు శాపమైన పీడకలలాంటి హెలెనాయేనా?
ఈ ఆడపిల్లలు భయంతో వణుకుతున్నారు. నీవొక్కదానివే, పెద్దదానివి,
ప్రశాంతంగా, నిబ్బరంగా నిలబడ్డావు, ఇక చాలు,
నీ జ్ఞానాన్ని మాటల్లో చూపించు.

**ఫోర్సియాస్** : ఎన్నో సంవత్సరాల అదృష్టం దైవ ప్రసాదమై కలగా కనిపిస్తుంది.
కాని నీ అతిలోక సౌందర్యం మగవాళ్లని అద్భుత కార్యాలకు పురికొల్పింది.
థెసియస్ ఉన్మాద కామంతో నిన్ను ఎత్తుకుపోయినపుడు నీవింకా చిన్నపిల్లవే!
హెర్క్యులస్‌లా బలిష్ఠుడు, అందగాడు, శౌర్యవంతుడూ ఇతడు.

**హెలెన్** : పదేళ్ల లేడికూనను నన్ను పట్టుకుని పోయినాడు,
ఎఫిడ్నస్ ఆవరణ – ఎట్టికాలో దాచినాడు.

**ఫోర్సియాస్** : నీ కవల సోదరులు నిన్ను రక్షించినారు,
అనేక మంది వీరులు నిన్ను కాంక్షించినారు.

**హెలెన్** : కాని నా మనసు రహస్యంగా ఒక వీరుడ్ని కోరుకున్నది.
అతడు పాట్రొక్లస్, ఎఖిల్లిస్‌ను అచ్చు గుద్దినట్లుండేవాడు.

**ఫోర్సియాస్** : నీ తండ్రి ఆలోచన వేరు, మెనెలాస్ గెల్చుకున్నాడు నిన్ను.
ఇతడు మంచి నావికుడు, గొప్ప గృహస్థుడు.

**హెలెన్** : రాజ్య సంపదలను, రాకుమార్తెనూ గెలుచుకున్నాడు.
మా వివాహ ఫలమే మా కుమార్తె హెర్మియోని.

**ఫోర్సియాస్** : క్రెటెను వశపరచుకోవాలని నిన్నక్కడే వదిలి వెళ్లాడు.
ఇంటికి వచ్చిన అతిథి నిన్ను వశపరచుకున్నాడు.

**హెలెన్** : ఎందుకు ఆ అర్ధ వైధవ్యాన్ని గుర్తు చేస్తావు?
అది తెచ్చిన వినాశనం నన్ను అతలాకుతలం చేసింది.

**ఫోర్సియాస్** : నేనూ దానివల్ల నష్టపోయాను.
క్రెటెలో నేను స్వేచ్ఛాజీవిని,
ఇక్కడ ఖైదీగా, సేవకురాలిగా బతుకుతున్నాను.

**హెలెన్** : నిన్ను బందీగా కొనివచ్చి గృహసేవికగా ఉంచాడు.
అతడి ఇల్లూ, ధనాగారం ఇప్పుడు నీ రక్షణలో ఉన్నాయి.

**ఫోర్సియాస్** : ఈ రెంటినీ వదిలి నీవు ట్రాయ్ కోటకు వెళ్లావు,
ప్రేమ సౌఖ్యాల్ని హాయిగా అనుభవించేందుకు పరుగులు తీసావు.

**హెలెన్** : ఆ ఆనందాల గురించి మాట్లాడకు! అంతులేని దుఃఖం
నా మనస్సును, హృదయాన్ని కమ్ముకుని కలవరపెడ్తుంది.

**ఫోర్సియాస్** : వాళ్లంటారు నీవు కనిపించావు రెండు రూపాల్లో అని
ఈజిప్టు, ట్రాయ్‌లో ఒకేసారి అగుపించావని.

**హెలెన్** : మొద్దుబారిన ఇంద్రియాల మూఢనమ్మకం అది.
ఆ రెండింటిలో నేనెవరిని? నాకే తెలియదు అదేమిటని?

**ఫోర్సియాస్** : ఆ తరువాత కథల్లో ఎఖిలిస్ ఆత్మ గురించి,
మృతుల్లోంచి లేచివచ్చి నీ రూపాన్ని చేరుకుందని,
అతడి ప్రేమ అన్ని విధి నిర్బంధాల్ని దాటి వచ్చిందనీ!

**హెలెన్** : ఒక అదృశ్య రూపానికి మరో అదృశ్యరూపం తోడు
అది కల; బహుశా నేనదృశ్యమైతే అలా అవుతాను కాబోలు!
**(ఆమె తన బృందం చేతుల్లోకి సోలిపోతుంది)**

**కోరస్** : నిశ్శబ్దం! నిశ్శబ్దం!
దిష్టికళ్లూ, పాపిష్టి నాలుక ఉన్న అనాకారి రూపమా!
ఏకదంతమున్న నోరు, ఎండిన పెదాలు
ఆ భయంకరమైన నోటినుంచి వచ్చే దుర్భాష తాపమా!

పైకి ప్రశాంతంగా కనిపిస్తున్నా లోన చెడు తుఫాను,
గొర్రె తోలు కప్పుకున్న తోడేలు
మూడు తలల సెర్‌బరెస్ నరకలోక జాగిలపు ఆనవాలు.

భయంతో వణుకుతూ ఇక్కడ నిలబడి ఉన్నాం
ఎప్పుడు, ఎలా, ఈ రూపం విస్ఫోటిస్తుందో ఊహించలేకున్నాం!
ఈ భయంకర దుష్టరూపం
ఏ చీకటి పొదల్లోంచి దూకి చిత్రవధ చేస్తుందో తెలీకున్నది!

చూడు! నీ నుంచి ఎటువంటి ఓదార్పు మాటలూ లేవు.
కాస్త ఉపశమనం కలిగించే ఉద్దేశమూ కానరాదు.
దానికి బదులు, గతాన్ని తవ్వి కంకాళాల్ని వెలికి తీస్తున్నావు.
మంచి జ్ఞాపకాల్ని మరిచి, దుష్ట సంఘటనల్ని గుర్తు చేస్తున్నావు.
ఈ ఘడియ కాలాన్నే కాదు భవిష్యత్తు జీవనపు ఆశని కూడా
నీ చీకటి చిటపటలతో చిదిమేస్తున్నావు.

నిశ్శబ్దం! నిశ్శబ్దం!
మన రాణి ఆత్మ ఇప్పటికే మరలిపోతున్నది.
లేదు, లేదు, అత్యంత సుందర రూపమైన
ఈ అద్భుత దేహాన్ని వదలి వెళ్లలేకున్నది.
**(హెలెన్ మరల మేల్కొని అందరి మధ్యన నిలబడుతుంది)**

**ఫోర్సియాస్** : రా! కదిలే మబ్బులలోంచి సూర్యుడు వస్తున్న మనోహర దృశ్యం.
ముసుగులో దాగున్న రూపమూ ఇప్పుడు కాంతిలో ఓలలాడుతున్నది.
నీ ప్రశస్త నయనాలతో తిలకించు, ఈ ప్రపంచం నీ ముందున్నది.
అనాకారినని నన్ను ఆడిపోస్తారందరూ, కానీ, నాకు తెలుసు
అందపు రహస్యం.

హెలెన్ : మూర్ఛలో ఒంటరితనం కావలించుకున్నది,
వణుకుతూ నేను దానిని వదిలించుకున్నాను.
అలిసిపోయిన నా అస్థిమాంసాలకు
కాసింత విశ్రాంతి కావాలి ఈ క్షణం.
ప్రభువులకు, వీరులకు అలవాటే కాబోలు
ప్రమాదం వచ్చినపుడే ధైర్యంగా నిలబడడం.

ఫోర్సియాస్ : నీ అందం, ఘనతతో నీవిక్కడ నిలుచున్నావు.
నీ కనుబొమలు కోరుతున్నాయి విధేయతను,
రాణీ, ఆజ్ఞాపించు! తమకేమి కావాలో!

హెలెన్ : మీరు మీ వైషమ్యాలకు పలకండి అంతం!
ప్రభువు ఆజ్ఞ ప్రకారం బలికి సిద్ధం చేద్దాం సమస్తం.

ఫోర్సియాస్ : రాజ ప్రాసాదంలో అన్నీ సిద్ధమే!
పాత్రలు, ముక్కాలి పీటలు, పరశువు,
సుగంధ అగ్నులు, శుద్ధ జలాలు
మరింతకూ బలిపశువు ఏది?

హెలెన్ : ప్రభువు చెప్పలేదు

ఫోర్సియాస్ : చెప్పలేదా! అయ్యో! దురదృష్టం.

హెలెన్ : ఏమిటా దురదృష్టం? ఎందుకా విచారం!

ఫోర్సియాస్ : నీవే ఆ బలిపశువు, అదుగో పరశువు.

హెలెన్ : నేనా?

ఫోర్సియాస్ : వీళ్లందరూ కూడా!

బృందం : ఓ దేవుడా!

ఫోర్సియాస్ : గొడ్డలి అంచు సాగిన మెడపై పడుతుంది,
పెద్ద నెప్పి లేకుండానే తల తెగుతుంది.

హెలెన్ : భయంకరమైన ముగింపు, నేనూహించినదే ఈ ముప్పు.

ఫోర్సియాస్ : తప్పించుకునే దారే లేదు.

బృందం : మా సంగతేమిటి? ఏం జరగనున్నది?

**ఫోర్సియాస్** : ఆమె మరణం పవిత్ర రీతుల్లో సంభవిస్తుంది.
మిమ్మల్ని మాత్రం, అదుగో, ఆ పైకప్పు దూలం!
ఉరితాడుకు ఊగుతారు ఉచ్చులో పిట్టల్లాగా!

**(హెలెన్, ఆమె బృందం భయంతో విహ్వల వదనాలతో దగ్గరగా మూగుతారు.)**

దయ్యాలు, భూతాలు! గడ్డకట్టిన శిలల్లా నిలబడ్డారు.
ఎక్కడ పగటి వెలుగు కోల్పోతామోనన్న భయంతో మీరు.
ఇప్పుడు ప్రార్థనలు ఫలించవు, విధికి ఎదురు నిలువలేరు.
ఈ విషయం అందరికి తెలుసు, ఎవరూ సంతోషపడరు.
చాలు! మీ కథ ముగిసింది! ఏర్పాట్లు ప్రారంభించండి!

**(ఆమె చప్పట్లు కొడ్తుంది. ముసుగు, పొట్టి మనుషులు తలుపు దగ్గర ప్రత్యక్షమై ఆమె చెప్పిన పనులు చేస్తుంటారు)**

బయటకు రండి! గుండ్రటి చీకటి పిశాచాల్లారా!
సిద్ధం కండి! మీ హృదయాల్ని ఆనందపరిచే పనులివి!
బంగారు కొమ్ములున్న బలిపీఠాన్ని సిద్ధం చేయండి,
వెండి అంచులా మెరుస్తున్న పరశువును పక్కనే ఉంచండి.
నీటి కలశాల్ని నింపండి, చిందిన నల్లరక్తపు మరకలు
నేలపై ఎండక ముందే కడిగితే మంచిది.

అత్యంత విలువైన తివాచీని అందంగా పరచండి!
రాణి మోకాళ్లకు ఎటువంటి నెప్పి రానీయకండి!
తల తెగగానే మొండేన్ని తివాచిలో చుట్టి
ఆమె గౌరవానికి తగ్గట్లు ఖననం చేయాలి, వినండి!

**బృందపు నాయకురాలు–**

నా యజమాని, రాణి, పక్కనే ధ్యాన నిమగ్నురాలై యున్నది.
ఈ ఆడపిల్లలు తెగిన గడ్డిపరకల్లా వడలిపోతున్నారు.
వీళ్లలో పెద్దదానిని గనుక నా విధిని నేను నిర్వహిస్తాను.
మా అందరికన్నా నీవు వయసులో పెద్దవు, జ్ఞానవృద్ధురాలివి.
అనుభవం, తెలివి, అన్నీ ఉన్నదానివి!
ఈ బుర్ర లేని పిల్లలు నిన్ను నిందించారు, క్షమించు!
మేం బయటపడే మార్గమేదన్నా ఉంటే చూపించు!

ఫోర్సియాస్ : పరిష్కారం తెలికే! రాణి నిర్ణయించుకోవాలి.
తనని కాపాడుకోవాలో, మిమ్మల్నీ కాపాడాలో
సత్వర నిర్ణయం శుభప్రదం, ఆలస్యం అధిక విషం.

బృందం : జ్ఞాన వృద్ధురాలివైన జోస్యురాలా!
విధి దేవతలలో విలక్షణమైన దేవతా!
నీ బంగరు కత్తెరను మూసి
మా ప్రాణాలను కాపాడే సూత్రం చెప్పు!
అప్పుడే మా కాళ్లూ చేతులూ
వణుకుతున్నాయి, వేలాడబడిపోతున్నాయి.
ప్రియుల కౌగిళ్లలో ఒదిగి
నృత్యానికి ఉవ్విళ్లూరే దేహాలు కలవరం చెందుతున్నాయి.

హెలెన్ : వీళ్లను భయపడనివ్వు! దుఃఖమే గాని నాకు లేదు భయం!
మమ్మల్ని రక్షించు నీవు, మా కృతజ్ఞతల్ని అందుకోగలవు.
తెలివిగలవాళ్లు ఏదో మార్గం తెలుపగలుగుతారు.
అందుకే నీవు, నీవు గ్రహించినది వివరించగలవు.

బృందం : మాకు తెలుపు త్వరగా, ఈ ఉచ్చుల నుంచి వేగంగా
బయటపడే మార్గమేదో, మర్మమేదో లాఘవంగా!
ఈ ముడుల తాడు మా మెడలకు బాధాపూరిత హారం
మా గొంతు పిసుకుతున్నదీ వినాశపు భారం.
రియా, దేవతల మాతా! మాపై జాలి చూపవా!

ఫోర్సియాస్ : సుదీర్ఘ ప్రసంగం వినే ఓపిక వుందా?
నిశ్శబ్దంగా ఉంటే ఎన్నో కథలు చెబుతాను, వీలవుతుందా?

బృందం : ఓపికా! వింటేనే గదా బతకడం ఆనక!

ఫోర్సియాస్ : ఇంటి దగ్గర ఉండి సంపదలను కావలి కాస్తూ,
గోడలనూ బురుజులనూ బాగు చేసుకున్నవాళ్లు
గాలి వానల నుండి పైకప్పును కాపాడుకున్నవాళ్లు,
సంపదలతో ఆయురారోగ్యాలతో తులతూగుతారు.

కాని, తుచ్ఛమైన కోరికలతో గడపదాటిన వారు,
తిరిగి వచ్చాక, లోపల సర్వనాశనాన్ని గమనిస్తారు.

హెలెన్ : ఈ నీతివాక్యాల వల్ల ఇప్పుడేమి ప్రయోజనం?
నీ కథ ఏమిటో చెప్పు, ఈ చిక్కు నుంచి బయటపడదాం!

ఫోర్సియాస్ : నేను చెబుతున్నది చరిత్ర, దానికెందుకు వ్యతిరిక్తత!
మెనెలాస్ ప్రభువు పక్క దేశాలపై చేసాడు దోపిడీలు,
తీరాల్ని, దేశాల్ని, ద్వీపాల్ని తనకిష్టం వచ్చిన రీతిలో,
అంతులేని సంపదల్ని దోచుకుని తెచ్చుకున్నాడు తనతో!

ట్రాయ్ ముట్టడి సాగింది పదేళ్లపాటు,
తిరిగి రావడానికి ఎన్నేళ్లు పట్టిందో తెలియదు నాకు,
ఇక్కడ నేను ఈ పెద్దగృహంలో ఉంటున్నాను.
టిండారియస్ ప్రభువు ఇంటిలో సేవికనైనాను.

హెలెన్ : నోరు తెరిస్తే చాలు ఎవరినో ఒకర్ని నిందించడమేనా!
హద్దూ పద్దూ లేకుండా అనంతంగా వాగడమేనా?

ఫోర్సియాస్ : ఎన్నో ఏళ్లు ఎవరూ చొరరాని పర్వత ప్రాంతం,
స్పార్టాకు ఉత్తరంగా, ఎత్తైన టేగెటస్‌కు ముందు
యురొటస్ నదీ జన్మస్థానం అది ఏరుగా మొదలై
రెల్లుపొదల మధ్యగా మా లోయల గుండా పారి
మీ హంసలకు ఇస్తుంది ఆహారం.
ఆ ఎత్తైన కొండల మధ్య స్థిరపడిన తెగ!
సిమ్మెరియన్ దక్షిణాన నిర్మించారు,
బురుజులతో కూడిన దుర్భేధ్యమైన కోటను!
మా ప్రజల్ని వాళ్లిష్టమొచ్చినట్లు పీడించసాగారు.

హెలెన్ : అటువంటి అసంభవ కార్యాన్ని
వాళ్లెలా సాధించగలిగారు?

ఫోర్సియాస్ : ఇరవై ఏళ్లు పట్టినా విజయం దక్కింది కాదా!

హెలెన్ : బందిపోటు దొంగలా? రాజు పంపిన బంటులా?

ఫోర్సియాస్ : బందిపోటు దొంగలు కాదు, వాళ్లకో ప్రభువున్నాడు.
అతి శక్తిమంతుడు, అన్నీ తీసుకువెళ్లగలిగినవాడు.
కప్పం కోరుకోడు, బహుమతులతో తృప్తి పడతాడు.

హెలెన్ : ఎలా ఉంటాడతడు?

ఫోర్సియాస్ : అందగాడే, బలిష్ఠుడు, గుండె దిటవు కలవాడు,
ఎవరినీ లెక్క చేయడు, నాకు కూడా నచ్చాడు.
చాలామంది గ్రీకులకన్నా సాహసికుడు, తెలివైనవాడు.
వాళ్లతని తెగను అనాగరికులనేవారు.
ఎందరో నరమేధకుల కన్నా మెరుగే వాళ్లు
ధర్మం తెలిసినవాడు, నమ్మకం ఉంచదగిన వీరుడు.
అతని కోట బహు సుందరమైనది.
ఈ మొద్దు శిలా స్తంభాలకన్నా ఎన్నో నగిషీలున్నది.
ఇది సైక్లాప్స్ విసిరిన రాళ్లగుట్టలా ఉన్నది.
అది సరళ రేఖలు క్రమపద్ధతిలో కలుపబడి
ఆకాశం నుంచీ కూడా అందంగా కనబడేది.
స్తంభాలు, తోరణాలు, ఆవరణలు, వసారాలు
ఆయుధ చిహ్నాల అంగీలు (Coats of arms)

హెలెన్ : ఆయుధ చిహ్నాల అంగీలా, ఏమిటవి?

ఫోర్సియాస్ : నీకు పెద్ద అజాక్స్ డాలు గుర్తుందా?
మెలిదిరిగిన సర్పాలు, థెబెస్‌పై తలపడిన సప్తవీరులు,
చంద్రిక, నీలాకాశంపై నక్షత్రాలు,
దేవతలు, నాయకులు, పెద్ద నిచ్చెన, కాగడాలు, ఖడ్గాలు,
విధ్వంసకర దృశ్యాలు, నగరాలకు శాపాలు,

అటువంటివే మా ఉత్తరదిక్కు ప్రభువు,
ఉపయోగించాడు, ప్రకాశవంతమైన వాటి మెరుపులు,
అనాది వంశస్థులను గుర్తు చేసేటందుకు,
సింహాలు, గరుడపక్షులు, పదునైన ముక్కులు, కాలిగోళ్లు
అడవి ఎద్దు కొమ్ములు, రెక్కలు, గులాబీలు, నెమలి పింఛాలు,
స్వర్ణ, రజత, కృష్ణ, నీలి, ఎరుపు చారలు.
గోడలపై, ఆవరణలలో, విశాలమైన గదుల్లో
ప్రపంచం పట్టేంత ప్రదేశాల్లో నృత్యశాలల్లో!

బృందం : అక్కడ నృత్యం చేసేవాళ్లుంటారా?

ఫోర్సియాస్ : బ్రహ్మాండమైనవాళ్లు, కొత్తగా నేర్చుకున్నవాళ్లు,
బంగారు రంగు జుట్టున్న బాలకులు,

నూనూగు మీసాల నూత్న యవ్వనులు,
పారిస్ రాకుమారుణ్ణి అందుకేగా ఇష్టపడింది రాణి!
ఆ యౌవన సౌరభానికే గదా అంత సాహసం చేసింది.

**హెలెన్** : ఈ విషయం నీవు మాట్లాడతగ్గది కాదు,
నీ కథనాన్ని సంక్షిప్తంగా ముగించు!

**ఫోర్సియాస్** : ఆఖరి మాట నీది! ఆలోచించు! అంగీకరించు!
ఆ దుర్గంతో నిన్ను చుట్టుముట్టి సంరక్షిస్తాను.

**బృందం** : ఆ చిన్న పదాన్ని అను, రక్షించు నిన్నూ, మమ్ములనూ!

**హెలెన్** : నేనెప్పుడూ అనుకోలేదు నా భర్త, నన్ను,
గాయపరచి హతమార్చగలడని ఏనాడూ!

**ఫోర్సియాస్** : మరిచిపోయావా పారిస్ సోదరుడు 'ధీఫోబస్'ను,
పారిస్ చనిపోయాక గెలుచుకున్నాడు నిన్ను,
అతడు నిన్ను అనుభవించాడు కాదూ ఆ కొద్దిరోజులు,
మెనెలాస్ అతడినేం చేసాడో గుర్తులేదూ,
ముక్కూచెవులూ కోసి ముక్కలుగా నరికాడే
ఎంత ఘోరమైన దృశ్యమో ఎరుకలేదా నీకు?

**హెలెన్** : అవును, నా కోసమే చేశాడతడు ఆ ఘోరకృత్యం!

**ఫోర్సియాస్** : అతడికోసం ఇప్పుడు నీకూ అదే చేస్తాడు,
అందాన్ని ఎవ్వరూ పంచుకోనివ్వరు, అందినాక
ధ్వంసం చేస్తారేమోగాని, పరాయి చూపు పడనివ్వరు!
**(దూరంగా యుద్ధ బాకాల ధ్వని; అందరూ భయంగా చూస్తారు)**
అవిగో యుద్ధభాకాల ధ్వనులు,
పడ్తున్నాయి చెవులకు చిల్లులు,
పేగుల్లోకి దూరి కలిగిస్తున్నాయి ప్రకంపనలు,
అసూయ మగాడి హృదయాన్ని పిసికినట్లు భావాలు;
తాను పొందింది పోగొట్టుకుంటే మరచిపోడు
ఇప్పుడు పొందకపోతే విశ్రాంతి తీసుకోడు.

**బృందం** : నీకు వినబడడం లేదా యుద్ధ బాకాల ధ్వనులు,
నీకు కనబడడం లేదా కరవాలాల తళతళలు.

**ఫోర్సియాస్** : రాజా! ప్రభూ! నీకిదే ఆహ్వానం!
ఈ సమస్తం తమ చరణాల కర్పితం!

బృందం : మా పరిస్థితి ఏమిటి?

ఫోర్సియాస్ : స్పష్టంగా చెప్పాను మీకు!
ఆమె మృత్యువు మీ ముఖంలోకి చూస్తున్నది.
ఆమెలోనే మీ అంతం దాగున్నది.
మీకు తప్పించుకునే దారి లేకున్నది.
**(కొద్ది విరామం)**

హెలెన్ : ఏ అడుగు వేయాలో నిర్ణయించుకున్నాను,
ఓ రాక్షసీ! నీ పథకం నాకు తెలుసు.
నీ చేతుల్లో మంచికూడా మార్తుంది చెడుగా!
అంగీకరిస్తున్నాను ఆ దుర్గంలోకి రావడానికి!
నీవెందుకు ఈ పనిచేస్తున్నావో అర్థమయ్యింది నాకు.
రాణి హృదయమిప్పుడు మౌనం వహిస్తున్నది.
ఎవర్నీ లెక్కచేయనంటున్నది, వృద్ధురాలా! పద వెళదాం!

బృందం : ఎంతో సంతోషంగా మేము ఆమె ననుసరిస్తున్నాము!
మా వెనకే పొంచివున్నది మృత్యువు.
ముందు దాటలేని గోడ, ఎత్తైన బురుజు.
ట్రాయ్ రక్షణ దుర్గాల్లా కాపాడాతాయేమో ఇవి;
అవి మోసం వల్లనే గదా ధ్వంసం చేయబడినవి!
(ముందూ వెనకలా మబ్బులు కమ్మి అనంతంగా వ్యాపిస్తుంటాయి)
ఏమిటిది?
అక్కలారా, చుట్టూ చూడండి!
ఇంతకు ముందున్నది పట్టపగలు.
ఇప్పుడిక్కడంతా పొగమంచు తెరలు.
యురొటాస్ పవిత్ర నదీ ప్రవాహాలు,
వాటి రెల్లుగడ్డి హారాల అడ్డుకట్టలు, అదృశ్యమైనాయి.
ఆనందంగా సాగుతున్న హంసలు,
రాజసంగా, ఠీవిగా, గర్వంగా, సమూహంగా ఉండేవి
అవి నా కంటికిప్పుడు కానరాకుండా పోయినాయి.
అదుగో, అదుగో
దూరంగా వాటి స్వరాలు
క్రమేపీ వినరాకుండా పోతున్నాయి.

మృత్యువును స్ఫురించే గీతమేదో
మార్మోగుతున్నది చెవులలో!
ఇదికూడ జోస్యం పలుకుతుందా,
మన నాశనాన్ని అంతిమంగా?
వాగ్దానం చేయబడిన రక్షణకు బదులు
అందరికీ మృత్యువే ఆశ్రయం కానున్నదా?
ఆ హంసలలాగా ఈ అందమైన పొడుగాటి మెడలు
మన అందాల రాణి, హంస కుమార్తెకూ
మనందరికీ సంప్రాప్తమయ్యేనా మృత్యువు చివరకు?

పొగమంచు తెరగా మారుతున్నది,
మన చుట్టూరా కమ్ముకుంటున్నది,
మనం ఇప్పుడు ఒకరినొకరు చూడలేకున్నాం.
ఏం జరుగుతోంది? మనం నడుస్తున్నామా!
లేక గాలిలో తేలుతున్నామా?
బుడిబుడి నడకలతో నేలకెగువ పోతున్నామా?
ఏమన్నా కనిపిస్తున్నదా మీకు?
హెర్మెస్ దేవదూత మనపైన ఎగుర్తున్నాడా?
అది అతని స్వర్ణదండపు కాంతి కాదా?
అటువేపు రమ్మని ఆజ్ఞాపించడం లేదా!
ఈ ప్రదేశం అనేక రకాల ఆకారాలతో నిండి ఉన్నది.
ఎప్పుడూ ఖాళీగా కనబడే హేడ్స్ నరకాన్నే నింపుతున్నది?

అవును, ఏదో విషాదం పొగమంచు కాంతిని పోగొట్టుతున్నది;
అంతా మసక చీకటి నలుపు, గోడలూ యావత్తూ
　　మన నేత్రాలను చెదరగొడ్తున్నవి;
మన నేత్రాలు అవేమిటో గుర్తించలేకున్నవి,
　　చీకటి కొట్టాలా లేక ఆవరణలా తెలీకున్నది.
ఏదైనా అది అంధకారబంధురమే! అక్కలారా!
　　మన బతుకిక చీకటికొట్టులో మగ్గడమే!
మనమిప్పుడు మరల ఖైదీలం!
　　మునుపటికన్నా తీవ్రంగా బందీలమైనాం!

# 12. కోట లోపల ఆవరణ

## (The Inner Courtyard of a Castle)

### (చుట్టూరా మధ్యయుగపు శైలిలో ఉన్న భవనాలు)

**బృందపు నాయకురాలు :**

అవివేకం, తొందర, ఆడవాళ్లకలవాటు,
గాలి తరగల్లా క్షణక్షణం మారతారు.
అదృష్టం, దురదృష్టం ఒకేరకంగా రావు.
సాధారణంగా మీ నాలుకలు ఒకదానికొకటి సరిపోలవు.
సంతోషమో, దుఃఖమో మిమ్ము సమీపించినపుడు
నవ్వుతారు, ఏడుస్తారు అదే స్వరాన్ని మీటుతారు.
నిశ్శబ్దంగా ఉండండి! రాణి నిర్ణయం వినండి!

**హెలెన్ :** ఎక్కడున్నావు, పిథియన్ పూజారిణీ, ఎవరివైనా నీవు,
ఈ చీకటి కోటలోంచి చటుక్కున రా, మా ముందుకు!
నీవు నీ ప్రభువు వద్దకు వెళ్లావా నా రాక తెలపడానికి?
అతడు నన్ను ఆహ్వానించనీ అతిథిమర్యాదలతో;
నీకు ఋణపడి వుంటాను, అతడి దగ్గరకు తీసుకువెళ్తే,
ఈ వృధా తిరుగుళ్లకు స్వస్తి చెప్పి, కాస్త విశ్రాంతి తీసుకుంటాను.

**బృందపు నాయకురాలు:**

రాణీ, ఎందుకీ అనవసరపు ప్రయాస!
ఆ అనాకారి రూపం అదృశ్యపు తమాషా!
దాగుంటే ఉందేమో మనముందో, వెనకో!
చుట్టూ పొగమంచు, మనమున్నాం మధ్యలో!
ఈ సందుగొందుల్లో తిరుగుతుందేమో,
యజమానిని పిలవడానికి పోయింది కావచ్చు!
అదుగో అటుచూడు సేవకుల సందడి
గదుల్లో, కిటికీల్లో, వరండాలో, వసారాలో
హడావుడిగా వస్తున్నారు, పోతున్నారు,
అతిథికి రాచమర్యాదలతో స్వాగతం పలుకుతున్నారు.

**బృందం :** మా మనసులు చల్లబడ్డాయి, అటుచూడు!
ఎంతో హుందాగా, రాజసంగా నడుస్తున్నారు,

ఊరేగింపుగా యువత వస్తున్నారు మనవేపు,
ఎవరి ఆదేశాలను పాటిస్తున్నారో, ఎవరి
సేవకులో ఈ అందమైన యువకులు?
వాళ్ల నడకలో హొయలు, నుదుటిపై వంకీలు
బుగ్గలు పీచ్ ఫలాల్లా గులాబి వర్ణాలు
కొరకాలనిపిస్తుంది కాని భయమేస్తున్నది.
నేనొక పండు గురించి విన్నాను–
'నోటితో కొరికితే నిండుతుందట బూడిద'
అత్యంత సుందరులు
మనవేపు వస్తున్నారు;
వాళ్లేం తెస్తున్నారు?
సింహాసనానికి మెట్లు,
తివాచి, ఓ కుర్చీ, పూల మాలలు
తెరలు, పల్లకి, కిరీటం, ఆభరణాలు
అందంగా అలంకరించారు;
మబ్బుల్లా అవి మనరాణి
తలచుట్టూరా
మేఘమాలలా అలుముకుంటున్నవి–
రాజసంగా ఆమె ఆసీనురాలైనది.
నెమ్మది నెమ్మదిగా మనం
ఆమె దగ్గరకు వెళదాం!
మూడురెట్ల అర్హత, స్వాగతం
ఆమెకు లభించిందని ఆనందిద్దాం!

**(బృందం అలా గానం చేస్తున్నపుడే ఇవన్నీ జరుగుతుంటాయి. ప్రతీహారులు, ప్రభువులు వస్తారు. అందరికంటె ఎత్తులో ఫాస్ట్ మధ్యయుగపు మహారాజులా వస్త్రధారణలో ఉండి నెమ్మదిగా, ఠీవిగా, రాజసం ఉట్టిపడుతుండగా క్రిందకు దిగివస్తాడు.)**

**బృందపు నాయకురాలు :**

దేవతలు ఒక్కోసారి చేసేది ఇక్కడ చేసారు,
అతనికి అద్భుత రూపాన్ని ప్రసాదించినారు.
రాజసం, హుందాతనం రాశిపోసినారు.

ఇతరులను సమ్మోహనపరిచే శక్తి ఇతనికిచ్చినారు.
యుద్ధంలో మగవాళ్లని, పడకటింటి యుద్ధాల్లో ఆడవాళ్లని
గెలిచే విద్యలతో ఆశీర్వదించినారు.
నేను మెచ్చుకునే వారందరిలోకల్లా మెరుగైన వాడితడు.
నెమ్మదిగా, చక్కగా, నియంత్రించుకున్న నడకతో
ప్రభువు దగ్గరకు వస్తున్నాడు! రాణీ! నీ కనులను అతనిపై మరల్చు!

**ఫాస్ట్** : **(సంకెళ్లలో ఉన్న వ్యక్తి తన పక్కనే నడుస్తుండగా)–**
బ్రహ్మాండమైన స్వాగతానికి బదులు మీ వద్దకు
సంకెళ్లలో ఉన్న ఈ సేవకుడిని తీసుకువచ్చాను.
తన విధి మరచి నా విధులకు భంగం కలిగించాడు.
మోకరిల్లు! ఈ గౌరవనీయురాలైన రాణి ముందు
నీ తప్పు ఒప్పుకో,
దూరదృష్టి కలవాడితడని అత్యున్నత శిఖరంపై ఉంచాను.
పై స్వర్గంలో, క్రింది నేలపైని విషయాలను గమనించమని
ప్రత్యేకంగా ఆదేశించాను.
ఈ కొండల్లో, లోయల్లో, కోట చుట్టుపక్కల,
మందల్ని, పశువుల్ని, దండెత్తివచ్చే సైన్యాల్ని–
మందల్ని రక్షించేందుకు, శత్రువుల్ని అణచివేసేందుకు;
కాని ఈ రోజు, ఎంత నిర్లక్ష్యం!
తమరు విచ్చేసారు, నాకు ఈ విషయం తెలియలేదు.
ఇంత గొప్ప అతిధికి ఇచ్చేది ఈ స్వాగతమా?
ఈ నేరస్తుడికి మరణదండనే సరైన శిక్ష!
ఈసరికే ఈ పాపి రక్తం నేలపై చింది వుండాల్సింది.
ఇతడిని క్షమించినా, రక్షించినా ఆ అధికారం తమకే ఉంది!

**హెలెన్** : నన్ను న్యాయాధిపతిగా, రాజ్యాధిపతిగా చేసి
అత్యంత గౌరవాన్నిచ్చి ఆదరించారు,
నన్ను రెచ్చగొట్టడానికే ఈ ప్రయత్నమైనా
న్యాయనిర్ణేతగా నా విధి నేను నిర్వహిస్తాను. నీవు మాట్లాడు!

**లెన్సెయస్ (కాపలావాడు) :**
నన్ను మోకరిల్లనివ్వండి! నన్ను చూడనివ్వండి!
నన్ను చావనివ్వండి! లేదా బతకనివ్వండి!

ఈ ఉన్నత వంశ సంజాతకు
నేను బతికినన్నాళ్లూ ఊడిగం చేసుకోనివ్వండి!

ఉదయ సంధ్యకై ఎదురుచూస్తూ
నేనొక అద్భుతాన్ని చూసాను.
తూర్పువేపు నేను చూస్తుంటే
దక్షిణాన సూర్యుడుద్భవించాడు.

నా కళ్లు నివ్వెరపోయి చూస్తున్నాయి.
అక్కడ కొండాలేదు, లోయాలేదు.
ఆకాశం లేదు, నేలా లేదు.
ఆమె, అతిలోక సుందరి!

చిటారుకొమ్మమీది చిరుతపులిలా
దూరం చూడగలిగిన నేను ధన్యుడనయ్యాను.
మెలకువ తెచ్చుకుందామని ప్రయత్నించినా
ఏదో దుస్వప్నం నన్ను తొక్కిపెట్టింది.

నేనెక్కడున్నాను? నన్ను మేల్కొల్పిందెవరు?
బురుజులు, కోటగోడలు ఏవీ కానరావే!
ఆ అందాల దేవత నా ముందు సాక్షాత్కరించే సరికి
అన్ని మంచుతెరలూ కరిగిపోయాయి!

కనులూ, హృదయం ఆమెవేపు తిరిగాయి
ఆమె దివ్యకాంతిని తనివితీరా తాగాను.
కళ్లు మిరుమిట్లుకొలిపి కాల్చే ఆమె సౌందర్యం
నా నిశిత చక్షువుల్ని మాడ్చి మసకగా చేసింది.

నా కాపలా విధిని ఆ కాసేపు విస్మరించాను,
హెచ్చరిక చేయడం మరచిపోయాను,
నన్ను మృత్యువుకు అప్పగించండి,
అందం మనలోని ఆగ్రహాన్ని చల్లారుస్తుంది.

హెలెన్ : నేను తెచ్చిన దురదృష్టానికి నేనెలా నిన్ను శిక్షించగలను?
ఎంత దయలేనిది ఈ విధి, మగవాళ్లను ప్రేరేపిస్తుంది!
ఉన్మత్తులైవాళ్లు ఇంకో పనినే తలపెట్టరు!

పెచ్చరేగిన కామంతో మోహిస్తారు, యుద్ధాలు చేస్తారు,
నన్ను అటూయిటూ తిప్పుతారు.
వీరులు, సగం దేవుళ్లు, దేవుళ్లు, దయ్యాలు
అందరూ అంతే! నా ఒక్కరూపమే ప్రపంచాన్ని
కలవర పరచిందనుకుంటే, రెండు రూపాలు,
రెండింతలై మూడు, నాలుగు ప్రతిరూపాలు,
అవే నాకు శాపాలు! ఇతడిని విడిపించు!
దేవుడు పురికొల్పిన ఇతడిపై ఏ అవమానమూ ప్రకటించకు!

ఫాస్ట్ : ఈ ద్విరూప దృశ్యం నన్ను ఆశ్చర్యచకితుడ్ని చేసింది.
మహారాణీ! వేగవంతమైన బాణం, దాని గమ్యం
బాణాన్ని వదిలిన ధనుస్సు, బాణం తగిలినవాడి మనస్సు
అవే బాణాలు నాకూ తగిలి నన్ను అచేతనుడ్ని చేస్తున్నాయి.
వాటి మృదు స్పర్శ నా కన్నివేపులా తగులుతున్నది.
నా కోటలో నన్నే ఎవరో తమ శరాలతో బందీని కావిస్తున్నారు.
నాకేమి కాబోతున్నది? నమ్మకస్తులైన నా సేవకులందరూ
నీ వలన తిరుగుబాటు చేస్తున్నారు. నా గోడలు బలహీనమై,
నా సైన్యము నా ఆజ్ఞలను లెక్కచేస్తుందా, లేక,
ఎవరూ గెలవలేని అందాలరాణిని గెలిచి నాకిస్తుందా?
నాకేది దారి? నన్నూ నా సర్వస్వాన్ని, ఆమె పాదాల మ్రోలసమర్పించి
ఆమెకు దాసానుదాసుడనై సేవచేయడంకన్నా ఉన్నదా ఏదైనా మార్గం?
యజమానురాలా! నన్నంగీకరించు! కరుణించి
ఈ సింహాసనాన్ని అలంకరించి నీ బాధ్యతలను నెరవేర్చు!

లిన్సెయస్ : **(నగల భోషాణంతో, మిగతావాళ్లు ధనంతో నిండిన పెట్టెలను తీసుకువస్తుండగా)**
రాణీ! మాది దూరాభారం, మేం దగ్గరివారం!
తమ కరుణా కటాక్షవీక్షణాలను అభిలషిస్తున్నాం!
మిమ్మల్ని చూసిన మనిషన్నవాడు
అవుతాడు ఒకే సమయంలో రాకుమారుడు, బిచ్చగాడు.

నేనిప్పుడెవరిని? ఇంతకుముందెవరిని?
ఏం చేయగలను? ఏం చేయాలనుకోగలను?

దూసుకుపోయే నా దృష్టి రాణీ, దేనిని చూడగలదు,
నీ కాంతివంతమైన సింహాసనం దానిని వెనక్కి తరమగలదు!

తూర్పుదేశం నుంచి వచ్చాము మేము
పశ్చిమాన్ని ఆక్రమించి లొంగదీసుకున్నాము.
శక్తివంతమైన మహాసైన్యం మాది
తల ఎక్కడో తోక ఎక్కడో తెలియనంత దీర్ఘమైనది.

ముందు వరస కూలితే తరువాత వరస నిలబడ్తుంది.
మూడో వరస చేతిలో బల్లెం సిద్ధంగా ఉంటుంది.
ప్రతి దళానికి వందరెట్ల రక్షణ
వేలమంది చచ్చినా వెనక్కిపోని శిక్షణ.

తుఫానులా, జ్వాలల్లా దూసుకుపోయాము
మా దారిలో ఉన్న రాజ్యాల్ని ఆక్రమించుకున్నాము.
ఒకరోజు నేను సైనికులకు ఆజ్ఞనిచ్చాను
దోపిడీ సంపదలన్నీ దక్కినాయి సైనికులకు!

అసూయ నిండిన కళ్లతో అందరూ చూస్తుండగానే
అందమైన యువతి ఓ సైనికుడికి బహుమతి
పది ఇరవై గుర్రాలు ఓ పదాతిదళ సభ్యుడికి,
పొగరుమోతు గిత్తలు ఇంకా మరికొందరికి.

నేను నా తీక్షణదృష్టితో చూస్తున్నాను,
అరుదైన అసామాన్య వస్తువుల కోసం.
ఎవరికీ అందని దాన్ని అందుకోవాలనుకున్నాను.
మిగతా వన్నీ నాకు గడ్డిపోచతో సమానం!

నిధుల కోసం గాలించాను అతి తీవ్రంగా
స్వచ్ఛమైన దృష్టి, నన్ను నడిపిందా చోటుకు
ఏ జేబూ తగు సంపదలను దాచుకోలేదు.
ధనపు మందసాలు గాజువి, బీగాలు నా నేత్రాలు.

నాకు దొరికిన ఖజానా స్వర్ణమయం
రత్నాలూ, విలువైన రాళ్లు ఆభరణ సంచయం

దానిలో ఉన్న అతిపెద్ద మరకతం
తమ హృదయంపై ఊగాల్సిన ప్రశస్త పతకం.

సముద్రపు లోతుల్నుండీ సంగ్రహించిన ఆణిముత్యం,
తమ కపోలాలపై సంభ్రమంగా విహరించనీ;
తన అద్భుతమైన ఎర్రని కాంతికి, కెంపులు, పగడాలు
తమ సొంపులను కోల్పోయి వెల తెలాపోనీ;

ఓ రాణీ! తమ సింహాసనం వద్దకు,
తెచ్చాను అమూల్య రత్నరాశుల్ని, సంపదలను;
తమ పాదాల వద్ద ఉన్న ఈ పంట కోతలో,
ఎంత రక్తం ఏరులైపారిందో ఎవరి ఊహకు అందేను?

ఈ పెట్టెలన్నీ నగలూ నాణ్యాలతో నిండినవే!
మరిన్ని ఇనుప పెట్టెలు మీ కోరికపై తెప్పించగలను.
నేను తమ బానిసను, తమరనుమతిస్తే,
వీటితో తమ ధనాగారాల్ని నింపగలను.

తమరు సింహాసనంపై ఆసీనులైన మరుక్షణం,
అందరం మనఃస్ఫూర్తిగా తమ సేవకులమైనాము.
మా మనసులు, తనువులు, ఆస్థులు, శక్తులు
అతిలోక సుందరివైన తమకు అర్పించుకున్నాము.

ఇదంతా నాది, ఇన్నాళ్లూ గట్టిగా పట్టుకున్నాను,
ఇప్పుడు వదిలేసాను, అది ఇప్పుడు మీది!
ఎంతో విలువైనదని అప్పుడు అనుకున్నాను,
తమ ముందు దాని విలువెంత తక్కువో తెలిసినది.

నేను నాదనుకున్నదంతా అదృశ్యమైనది.
కోసిన గడ్డిలా వడిలిపోయినది.
మహారాణీ! ఒక్క సంతోషకరమైన చూపుతో
పోయిన దాని విలువను పునరుద్ధరించుము!

ఫాస్ట్ : ధైర్యంగా గెలిచిన ఈ బరువును తొలగించు!
ఇది శిక్షింపబడనిది, బహుమతి పొందనిది;

నా కోటలోపల దాగున్న సమస్తమూ ఆమెదే!
ప్రత్యేకమైన బహుమతి- చక్కని విశ్రాంతి.

వెళ్లు నిధులను సక్రమంగా సర్దివుంచు!
ఈ అపార సంపదలను సరిగా పరచి ఉంచు!
ఎవరూ వీక్షించని ఈ ధనరాశుల మిలమిలలతో
భవనపు పైకప్పులు తారాకాశంలా తళతళలాడాలి!

జీవంలేని జీవాలతో మరో స్వర్గాన్నిక్కడ సృష్టించు!
ఆమె నడిచే చోట తివాచీలు పరచి పూలుజల్లు!
ఆమె నునులేత పాదాలు మెత్తని నేలపై నడవనీ,
ప్రకాశవంతమైన కాంతికిరణాలు ఆమె కళ్లను స్పృశించనీ!

**లిన్సెయస్** : చిన్నది, మహాప్రభూ! తమ కోరిక అతి స్వల్పమైనది.
ఈ అందాల చిన్నది తన అందంతో మన అందరి మనసులనూ దోచినది.
సమస్త వస్తువులూ, మనసూ, ఆత్మ ఆమెవే
సైన్యం ఆమె ముందు శక్తిహీనమైనది.
కరవాలాలు, ఖడ్గాలు మొండిబారినవి.
ఆమె అపూర్వ సౌందర్యం సూర్యుడిని
చల్లబరచి, గాలిని శీతలం చేస్తున్నది.
ఆమె వదన సౌందర్య సంపదలకు,
రాజూ పేదా సమానమై వెలుగుతున్నది.

**(నిష్క్రమిస్తాడు)**

**హెలెన్ (ఫాస్ట్‌తో)** :
నీతో మాట్లాడాలని ఉన్నది, అయితే
నీవు ఇక్కడ నా పక్కన కూర్చోవాలి!
ఈ ఖాళీ ప్రదేశం ప్రభువుకై ఎదురుచూస్తున్నది.
నా ప్రస్తుత స్థానాన్ని మరింత సురక్షితం చేస్తున్నది.

**ఫాస్ట్** : మొదట నేను నిలబడతాను నా మోకాలిపై,
నా గౌరవ వందనాన్ని, రాణీ, స్వీకరించు.
నన్ను పైకి లేవనెత్తే హస్తాన్ని ముద్దాడుతాను.
ఎల్లలులేని ఈ రాజ్యానికి నన్ను సహపాలకునిగా ప్రకటించు.
నీ ఆరాధకుడిగా, సేవకుడిగా, రక్షకుడిగా, అన్నీ నేను-

హెలెన్ : ఎన్నో అద్భుతాలు చూసాను, విన్నాను!
ఆశ్చర్యంలో నేను కొన్ని అడగాలనుకుంటున్నాను,
అతడి మాటలలో ఏదో అద్భుతం ఉన్నది,
వింతగా ఉన్నా స్నేహభావం నిండి యున్నది.
ప్రతిధ్వని తర్వాత వచ్చే దానికి చోటిస్తున్నది.
ఒక పదం చెవిలో స్థిరపడగానే
మరోపదం వచ్చి తనముందు దానిని మురిపిస్తున్నది.

ఫాస్ట్ : ఇక్కడి ప్రజల సంభాషణా చాతుర్యమిది,
ఇది నచ్చితే ఇష్టపడతారు మా సంగీతం కూడా మీరు.
మీ ఎదలోతుల్ని స్పృశిస్తూ మీకానందాన్ని కలిగిస్తుంది.
దానిని తక్షణం నేర్చుకోవడం ఎంతో ఉత్తమం
ఒకరి తరువాత ఒకరు మాట్లాడితే వస్తుంది శీఘ్రం.

హెలెన్ : అంత అందమైన సంభాషణ నేనెలా నేర్చుకోగలను?

ఫాస్ట్ : అదంత కష్టం కాదు; నీ ఎదలోని మాట పలుకు;
హృదయం నిండగానే, పంచుకునే వారికోసం వెదుకు.

హెలెన్ : మరి, పంచుకో ఇప్పుడే నీవు!

ఫాస్ట్ : గడచింది గుర్తుండదు,
భవిష్యత్తు ఊహించలేనిది,
ప్రస్తుతం మన ముందున్నదే!---

హెలెన్ : మన సంతోషం!

ఫాస్ట్ : ఇది నిధి, సంపద, స్వంతం, ఒప్పందం.
ఈ ఒప్పందాన్ని ఎలా ఖరారు చేయడం?

హెలెన్ : నా చేతితో!

బృందం : ఎవరు తప్పు పట్టగలరు,
ఈ దుర్గపు ప్రభువుకు,
రాణి అనుగ్రహం చూపడాన్ని?

ఇప్పుడు మనందరం
బందీలుగా ఉన్నాం,

ట్రాయ్ పతనానంతరం
పలుమార్లు చిక్కుకున్నాం
భయంకర ప్రయాణాల్లో!

మగవాళ్ల ప్రేమలకు
అలవాటైన స్త్రీలకు ఎన్నుకునే స్వేచ్ఛ ఉండదు.
కాని అనుభవం వాళ్లను చేస్తుంది నేర్పరులుగా,
స్వర్ణ శిరోజాల గొర్రెలు కాచేవాళ్లైనా
వేగంగా చలించే గిట్టల వాళ్లైనా
అవకాశమైనా, ఇటువంటిదైనా
హక్కులు సమానమే,
వాళ్ల శరీరాలను తేలిక పరుస్తుంది ప్రేమ!

పక్కపక్కనే కూర్చున్నారు, మరింత దగ్గరగా,
ఒకరిపై ఒకరు ఒరుగుతున్నారు.
భుజానికి భుజం, మోకాలికి మోకాలు
చేతిలో చేయి, ఊయల దిండ్లలోలా
ఒరిగి ఊగుతున్నారు ఆ సింహాసనంలో
తమ రహస్య సౌఖ్యాలను
దాచడానికి ఇష్టపడక
ప్రజల ముందే బహిరంగంగా
తమ ప్రేమను వెల్లడిస్తున్నారు.

**హెలెన్** : ఎంతో దూరంగా ఉన్నాననుకుంటున్నా, ఎంతో దగ్గరగా ఉన్నాను.
ఎంత ఇష్టంగా అంటున్నాను చూడు! నేనిక్కడే ఉన్నాను!

**ఫాస్ట్** : నాకు ఆనందంతో ఊపిరాడడం లేదు.
మాటలందడం లేదు, శక్తి సన్నగిల్లుతున్నది.
కాల ప్రదేశాలు లేని కలలా భాసిస్తున్నది.

**హెలెన్** : నేను ఏనాటి దానినో, కొత్తగా అగుపిస్తున్నాను.
ఏ పరిచయం లేనివాడితో, ఇలా బంధించబడినాను.

**ఫాస్ట్** : ఎందుకు కళవళపడడం, ఎందుకలా తలవడం?
మన కలయిక విధి నిర్ణయం, ఒక్కక్షణం అనంతకాలం?

**ఫోర్సియాన్** : **(దుందుడుకుగా లోనికివచ్చి)**
ఇప్పుడు చిన్నపిల్లలాటకు సమయం కాదు.
ప్రేమ అక్షరాలను వల్లెవేయడం,
కౌగిలింతలు, కలవరాలు, చింతలు, చిలిపి పనులూ!
అక్కడ చేయాల్సిన పని చాలా ఉన్నది.

యుద్ధ మృదంగాల చప్పుళ్ళు వినబడ్తున్నాయా?
ఉరుముల శబ్దాలు మీ చెవులకు చేరుతున్నాయా?
ఏదో విపత్తు మిమ్మల్ని వెంటాడుతున్నది.
మెనెలాస్ ప్రభువు యుద్ధదాహంతో
సమస్త సైన్యంతో ఇటు దండెత్తి వస్తున్నాడు!

ఆయుధాలు ధరించి పోరాటానికి సిద్ధపడండి!
వాళ్లు మిమ్మల్ని సంఖ్యలో మించుతారు.
డిఫొబస్‌ను వికృతం చేసినట్లు నిన్నూ చిత్రవధ చేస్తారు.
తన భార్యతో సల్లాపాలు సాగిస్తున్నందుకు నరికిపారేస్తారు.
ఈ బానిస గుంపును దూలాలకు ఉరిదీస్తారు.
రాణీ! నీకు మెడపై గొడ్డలి లేదా బలికి వాడే కత్తి.

**ఫాస్ట్** : ఏమిటీ దౌర్జన్యపూరిత ప్రవర్తన?
ఎవర్నీ లెక్కచేయని వెర్రితనపు ప్రదర్శన!
ప్రమాదపు అంచున ఉన్నా, సహించను నేనీ ప్రలాపాలను!
అతి లావణ్యవతి వచ్చి హెచ్చరించినా ఊరుకోను.
అటువంటిది, ఓ కురూపీ, చెడ్డవార్త చెప్పడంలో ఉత్తమురాలివా!
ఇప్పుడు నీ ఉద్దేశం నెరవేరదు.
గాలికబుర్లతో గాలిని ఊపలేవు?
ఇక్కడేం ప్రమాదం లేదు, ఉన్నా అది ఉత్తుత్తి బెదిరింపే!

**(భీకర శబ్దాలు, బురుజులు విరిగిపడ్తున్న చప్పుళ్ళు, యుద్ధభాకాలు, సమర సంగీతం, ఏదో మహాసైన్యం వస్తున్న సూచనలు)**

**ఫాస్ట్** : ధైర్యంగా నిలబడదాం! వెన్ను చూపబోము!
వీరుల్లా, శూరుల్లా విరోధి అంతుచూద్దాం!
శత్రువు నుంచి తనని రక్షించినవాడినే
స్త్రీ తనని తాను అర్పించుకుంటుంది.

**(సైనికాధిపతులు స్తంభాల పక్క నుంచి వస్తుండగా వారికి ఆజ్ఞలను జారీచేస్తాడు)**

తూర్పు దిశ నుంచీ నీవు, ఉత్తరాన్నుంచి నీవు,
యవ్వనపు పొంగులో, పుష్పించిన శక్తితో,
మీలో ఇన్నాళ్లు నిద్రాణమైన శక్తిని మేల్కొల్పండి,
పగతురపై విరుచుకుపడి విజయాన్ని గైకొనండి!

ఇనుప వలల్తో ఉన్న యుద్ధభూతం అగ్నితో మెరుస్తుంటే
దాని పాదాలు తాకిన చోట నేల వణుకుతుంది.
అది నడచినంతమేరా రాజ్యాలు నశించినాయి.
ఉరుముల శబ్దాలతో అది ఉగ్రంగా చలిస్తుంది.

పురాతన పైలాస్ నుంచి సముద్ర మార్గాన వచ్చాము.
ఒకప్పుడు ఆ దేశాన్ని పరిపాలించాడు నెస్టర్,
చిన్నచిన్న ప్రభువులు మా ఆదేశాన్ని పాటిస్తున్నారు.
మా పరాక్రమానికి లొంగి సామంతులైనారు.

ఇప్పుడు వస్తున్నాడు మెనెలాస్,
తరిమేయండి అతడిని తరంగాల మీదుగా!
అతడి దారిని అతడిని వెదుక్కోనివ్వండి,
బందిపోటు దొంగలాగా బతకనివ్వండి!

స్పార్టా రాణి ఆదేశానుసారం
మిమ్మల్ని ప్రభువులుగా ఆహ్వానిస్తున్నాను,
ఈ కొండాకోనల్ని ఆమె పాదాలకు సమర్పించి
యువరాజులుగా మీరు పొందండి మన్ననలను.

ట్యూటన్, తీరాన నిర్మించు అడ్డుగోడలు,
కోరింథ్ ప్రాంతాన్ని కోటగా సంరక్షించు!
అఖేయియా నీటిగొంతులు నీవవుతాయి.
జర్మన్ వీరుడా! ఆగంతకుల్ని పారద్రోలు!

ఎలిస్ యోధులు ఫ్రాంక్‌ను రక్షించనీ,
శాక్యన్లు మెస్సినీని సంరక్షించనీ,

నార్మన్ల ఖడ్గాలు సముద్ర దారుల్ని మూయనీ,
ఆర్గాలిస్ ఖ్యాతి నలుదెసలా వ్యాపించనీ.

ప్రతి ఒక్కరూ తమ ప్రాంతాల్ని సంరక్షించండి!
ప్రత్యర్థులకు తమ పరాక్రమంతో దడ పుట్టించండి!
స్పార్టా మహరాణి మిమ్మల్ని సదా మన్నిస్తుంది,
తన ప్రాచీన సింహాసనం నుండి ఆశీస్సులు కురిపిస్తుంది.

ఆమె పాలన స్వర్ణయుగమవుతుంది,
ఈ నేల సర్వసంపదలతో తులతూగుతుంది.
అందరిని సమదృక్కులతో పరిపాలిస్తూ
ఈ దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి చేస్తుంది.

**(ఫాస్ట్ దిగివస్తాడు. అందరు రాకుమారులూ అతని చుట్టూ మూగుతారు, అతని ఆజ్ఞలను స్వీకరిస్తారు)**

**బృందం** : జగదేక సుందరిని కాంక్షించేవాడు,
అతిశక్తివంతమైన ఆయుధాలను ధరిస్తాడు.
పొగడ్తలతో గొప్ప నిధిని పొందినా,
ప్రశాంతంగా దానిని అనుభవించలేడు.
శత్రువులా నిధిని వంచనతో పొంద చూస్తారు,
దోపిడి దొంగలు దోచుకుపోబోతారు,
తగు జాగ్రత్త తీసుకోవాలి తక్షణం అతడు.

అందుకనే, నేను మన రాజును అభినందిస్తున్నాను.
తెలివిగా చాకచక్యంగా అతడు ప్రణాళికలు రూపొందిస్తున్నాడు.
బలిష్ఠమైన బలగం అతడికిప్పుడున్నది,
అతడి చిరుసంజ్ఞకై ఎదురుచూస్తున్నది.
ప్రతి ఒక్కరు తమ శాయశక్తులా పరాక్రమించి
తమ ప్రభువు ఋణం తీర్చుకుంటారు.
కీర్తి ప్రతిష్ఠలను నిలుపుకుంటారు.

ఇప్పుడామెను అతడి నుంచి తీసుకువెళ్లగలిగినవారెవరు?
ఆమె అతడికి చెందినది, పూర్తి సంతోషాన్నిస్తున్నది.
వారిద్దరూ హాయిగా ఉండాలని ఆశిద్దాం!
చుట్టూ శత్రుసైన్యం ఉన్నా మనం సురక్షితంగా ఉన్నాం!

ఫాస్ట్ : ఈ సామంత రాజ్యాలు ఇవన్నీ వారికిస్తున్నాను,
ప్రతి ఒక్కరికి ఫలవంతమైన ప్రదేశాలు
సారవంతమైనవి, సమృద్ధిగా ఉన్నాయి పాడి పంటలు.
ఇక్కడ మనం స్థిరంగా ఉండి పరిశీలిద్దాము.

ఈ సమర్ధులైన సామంతులు త్వరలో,
మన సామ్రాజ్యాన్ని మరింత విస్తృతపరుస్తారు.
అలలు తాకే మన ద్వీపకల్పానికి
ఐరోపా పర్వత కనుమలతో ముడివేస్తారు.

సూర్యుని కిరణాలలో వెలిగే సమస్త దేశాలలో
మన దేశం మరింత పరిఢవిల్లును గాక!
మన రాణికొరకు మనం గెలుచుకున్నాము,
యురొటా యొక్క గుసగుసల తీరాన్ని!

ఆమెవేపు చూడండి, ఎంత అందంగా ఉన్నదో,
తన తల్లి 'లెడా'కన్నా తనూలతా లావణ్యం,
తన సోదరీ సోదరులకన్నా ప్రకాశవంతం,
తారలా, ఆమె పైపెంకును పగలగొట్టి మరింత వెలిగింది!

రాణీ! ఈ రాజ్యమంతా నీది!
అందంగా అలరారుతున్న ఈ భూమి అంతా నీది!
ముఖ్యంగా ఈ ప్రదేశం మరీ ప్రియమైనది.
నీకు జన్మనిచ్చిన ఈ నేల పవిత్రమైనది.

కొండశిఖరాల రంపపు అంచులు
సూర్యుని శీతల కిరణాలతో బాధపడ్తున్నవి
అక్కడక్కడా పచ్చదనంతో కొండవాలులు
కొండ మేకలకు ఆహారాన్నిస్తున్నవి.

నీటి బుగ్గలుబికి ప్రవాహాలుగా జారుతున్నవి.
చిన్నచిన్న నదులు, కొండవాలుల్లో సాగుతున్నవి.
వందలాది మైదానాలు, గుట్టలపై పచ్చిక పరచుకున్నది.
ఉన్నితో నిండిన గొర్రెల మందలు అటుయిటూ కదుల్తున్నవి.

కొములున్న పశువులు చెల్లాచెదురుగా మేస్తున్నవి,
కొండ అంచుల వేపు వచ్చి భయంగా చూస్తున్నవి.
ఆ పక్కనే చీకటిగా కానవస్తున్నవి.
వందలాది గుహలు వాటికి ఆశ్రయమిస్తున్నవి.

పాన్ దేవుడు వాటిని సంరక్షిస్తాడు.
అడవి చెట్ల నీడల్లో వనకన్యలు విహరిస్తున్నారు.
పైకి లేస్తున్న కొమ్మల్తో వృక్షాలు
ఆకాశాన్ని చుంబిస్తున్నాయి, గమనించు!

ఇవి ప్రాచీన వనాలు! మహా దేవదారువృక్షాలు
తమ బలిష్ఠమైన మొదళ్లు, కాండాలతో
మేపుల్ చెట్లు మధురమైన రస పదార్థాలతో
ఫలాలతో ఉన్నా పెరుగుతూనే ఉన్నవి పైపైకి.

ఇక్కడ క్రీనీడలో ఒక గొర్రెపిల్ల
తన లేత పెదాలతో తాగుతున్నది తల్లిపాలు!
ఈ మైదానాలలో కాస్తున్నాయి మధుర ఫలాలు
చెట్టు తొర్రలలోంచి పడ్తున్నాయి తేనె బిందువులు.

సంతృప్తి అనేది జన్మహక్కు ఇచట-
చిరునవ్వు రువ్వే ముఖం, వెలుగులు జిమ్మే కపోలం,
తన పరిధిలో ప్రతి ఒక్కటీ శాశ్వతమే!
వ్యాధులు రావు, ప్రశాంతతకు భంగం వాటిల్లదు.

పిల్లలిక్కడ యౌవనవంతులయ్యేప్పటికి,
ఆరోగ్యంగా పెరిగిన వారిని చూసి,
అందరూ వారిని భ్రమిస్తారు దేవతలుగా,
స్త్రీల హృదయాలు ఉప్పొంగుతాయి వారిని వీక్షించగా!

అపొలో దేవుడు గొర్రెల కాపరులతో ఆడుకుని
సొబగులను కొన్ని వారికిచ్చి సుందరులను చేసాడు.
ప్రకృతి ధర్మాలు ఎక్కడ పరిఢవిల్లుతాయో
అక్కడ అన్ని ప్రపంచాలూ కలుస్తాయి ఒక్కటిగా!

**(ఆమె పక్కనే కూర్చుంటాడు)**

చూడు! ఇప్పుడు ఈ ప్రపంచమంతా మనది!
మన శోధన ముగింపుకు రావాలి.
గతం గడిచిపోయింది, పిలుపు కందనంత దూరంగా,
నీవు దిగివచ్చిన ఆ దేవేంద్రుడి నుంచి స్వీకరించు సలహా
ఈ నూతన సామ్రాజ్యాన్ని తనివితీరా అనుభవించు.

ఎక్కడా గోడలు లేనిచోట నేను నిన్ను రక్షిస్తాను.
యవ్వనం విహరించే సామ్రాజ్యమిది
ఇక్కడ నుంచి మనకు మధురమైన విశ్రాంతి లభిస్తుంది.
స్పార్టాకు పొరుగుదేశం– ఆర్కాడియాలో,

ఈ ఆశీర్వదింపబడిన దేశానికి, విధి నిర్ణయంతో
నా ఆకర్షణతో, నీవు వస్తున్నావు,
ఈ సింహాసనాలు పొదరిల్లులా మార్తాయి.
మనం ఆర్కాడియాలో స్వేచ్ఛగా విహరిస్తాము.

# 13. ఆర్కాడియా
## (Arcadia)

**(కొండ గుహాద్వారాల వద్ద అందమైన పొదరిళ్ళు, నీడనిచ్చే వనం కొండ గుట్టల వేపు విస్తరించి ఉంటుంది. ఫాస్ట్, హెలెన్ కనిపించరు. బృందంలో సభ్యులు గాఢనిద్రలో అక్కడక్కడా పడివుంటారు)**

**ఫోర్సియస్** : ఎంతసేపటి నుంచి ఈ బాలికలు
నిద్రపోతున్నారో నాకు తెలియదు;
వాళ్లు ఏమి కలలు గంటున్నారో నాకు తెలుసు
అది నేను చెప్పను కాని వాళ్లను నిద్ర లేపుతాను.
వాళ్లూ, మీరూ ఆశ్చర్యపడి బిత్తరచూపులు చూస్తారు.
ఓ నెరసిన గడ్డం గలవాళ్లూ, ఈ అద్భుత దృశ్యం
దానంతటకదే కరిగిపోవడం మీరే చూస్తారు!
పిల్లల్లారా లేవండి! మీ ముంగురులను కదిలించండి!
కళ్ల నుండి నిద్రను పారద్రోలండి! మిణకడం మాని నే చెప్పేది వినండి!

**బృందం** : మేం వింటున్నాము, చెప్పేదేదో చెప్పేయి త్వరగా!
మేం నమ్మలేని దానిని నమ్మేట్లు చెప్పు!
గుట్టలవంక చూసీచూసీ విసుగుతో చచ్చేట్లున్నాం!

**ఫోర్సియస్** : కళ్లు తెరచి క్షణం కాలేదు, అప్పుడే విసుగా!
వినండి! మన రాజూ రాణీ ఈ గుహల్లో విశ్రమిస్తున్నారు.
ఈ పొదలలో, ఈ శిలావరణలలో, ఈ ప్రకృతిలో
ప్రేమజంటగా హాయిగా, ఆనందంగా విహరిస్తున్నారు.

**బృందం** : ఎక్కడ, లోనా?

**ఫోర్సియస్** : ఈ ప్రపంచానికి దూరంగా వాళ్లున్నారు!
నేను వారి ప్రత్యేక పరిచారికను!
నేనక్కడే నిలబడ్డాను గౌరవంగా,
కాని నా కళ్లు అటూ యిటూ తిరిగాయి.
మంత్రశక్తిగల వేళ్లూ, బెరడూ, నాచు,
వాటి ప్రభావం నాకు బాగా తెలుసు!
వాళ్లనక్కడ హాయిగా వదిలి నేనిటువచ్చాను.

బృందం : ఏమిటీ! ఈ కొండగుహల్లో
ఉందా ప్రపంచమంతా?
అడవులు, మైదానాలు, నదులూ, సరస్సులు
నమ్మదగిన కథేనా, కల్పనేనా అంతా!

ఫోర్సియస్ : అమాయకపు జీవుల్లారా! మీరర్థం చేసుకోరు!
మనిషింతవరకు కొలవని అగాధాలున్నాయక్కడ,
ఎన్నో ఆవరణలు, వరండాలు, రాజమందిరాలు
అక్కడ ఓ మహిళ ఒడిలోంచి దూకాడో బాలుడు
తండ్రి నుంచి తల్లికి, తల్లి నుంచి తండ్రికి
విరామం లేకుండా తిరుగుతూనే ఉన్నాడు.
ముద్దులు, ముచ్చట్లు, కౌగిలింతలు, కొత్త వింతలు
ప్రేమ ఆప్యాయతల పలవరింతలు, కవ్వింతలు,
నవ్వుల తోరణాలు, ఆనందపు కిరణాలు
నా చెవుల్ని బద్దలు గొట్టేసాయి.
నగ్నంగా, రెక్కలులేని దేవదూతలా,
లేడికూనలా ఉన్నా జంతువులా అనిపించడు.
గట్టినేలపై గెంతుతున్నా, ఆ నేల గమ్మత్తుగా
అతడిని ఆకాశంలోకి పల్టీలు కొట్టిస్తున్నది.
రెండుమూడు పల్టీలు, అదుగో, పైకప్పునంటుతున్నాడు!
అతడి తల్లి అరుస్తున్నది– గంతులేయి, గంతులేయి
కాని ఎగిరే ప్రయత్నం వద్దు– నీవు ఎగరడానికి అనుమతిలేదు.
అతడి తండ్రి హెచ్చరిస్తున్నాడు, భూమికి యధాస్థితికి వచ్చే గుణముంది.
నేలనంటుకో, మునివేళ్లమీద నిలబడు!
భూమి పుత్రుడు ఏంటియస్‌లా అపార శక్తిమంతుడవవుతావు.
అప్పుడా బాలుడు ఒక గుట్టపై నుండి మరొక గుట్టపైకి ఎగుర్తున్నాడు.
పడుతూ లేస్తున్న బంతిలా గుట్టల చుట్టూ తిరుగుతున్నాడు.
అయ్యో! అదేదో నోరు తెరుచుకున్న బిలం! ఆ పిల్లవాడిని మింగేసింది.
మనం భయపడ్డాం! తల్లి ఏడుస్తున్నది! తండ్రి ఓదారుస్తున్నాడు.
నేను ఉద్విగ్నతతో చూస్తున్నాను! ఆశ్చర్యం! ఆడుగో బాలుడు!
విజయుడై వచ్చాడు! అక్కడ నిధులున్నాయేమో అగాధంలో!
అతడికి పూలదుస్తులు; హుందాగా ధరించి ఉన్నాడు.

చేతుల్నించీ, కొమ్ముపైన రెపరెపలాడుతున్న వస్త్రాలు
చిన్ని సూర్యుడిలా చేతిలో బంగారు వీణ
కొండ శిఖరాన్నెక్కి అద్భుతంగా నిలబడినాడు.
అతడి తల్లిదండ్రుల ఆనందానికి పట్టపగ్గాలు లేవు.
ఆ బాలుడి తల చుట్టూరా ఏదో దివ్యవలయం, కాంతి!
అది స్వర్ణమా లేక ఏదో అపూర్వ తేజోవలయమో, ఎవరూ చెప్పలేరు.
అతడి కదలికలు అతడి భవిష్యత్తును చెబుతున్నాయి.
సమస్త సౌందర్యపు సృష్టికర్త, అతడి హస్తజనిత సంగీత ప్రవాహం,
ఆ బాలుడి ప్రశస్త రూపం, అంతకుమించిన అద్భుతాన్ని చూడలేం!

**బృందం** : క్రెటె ముద్దుల కూతురా!
నీవే తెలుపు! ఎంత అద్భుతంగా ఉందీ మలుపు!
నీవెప్పుడూ కవిత్వపు గొంతును విని ఉండకపోవచ్చు,
యవనదేశపు ప్రాచీన వంశ గాథలను ఆలకించకపోవచ్చు,
హెల్లాస్ దేవతల, నాయకుల చరిత్రలు నీకు తెలియకపోవచ్చు.

అవన్నీ ఇప్పుడు లేకపోవచ్చు,
ఉన్నా, అవి ప్రతిధ్వనులు మాత్రమే కావచ్చు!
మా పూర్వీకుల ప్రశస్త యుగపు నీడలే మిగిలి ఉండవచ్చు!
మెయియా కుమారుడు దేవదూత హెర్మెస్
గానం చేసిన మనోహర కల్పనతో
నీ కమనీయమైన కథను ఎలా పోల్చగలం?

పూవు పుట్టగానే పరిమళించినట్లు
ఇప్పుడే పుట్టిన బాలుడు ఇంత శక్తివంతుడైనాడు.
పొత్తిళ్లలో దాయమ్మలాతనిని పరుండబెట్టి
కాస్త పక్కకు చూడగానే,
క్షణంలో అన్నిటినీ విప్పి కిలకిలా నవ్వుతున్నాడు.
ఈ సీతాకోకచిలుక బంధనాల్లో ఉండదిక!
తన చుట్టూరా ఉన్న కోట నుంచి
తప్పించుకుని మరింత ఎత్తుకు ఎగిరి
సూర్యకాంతిలో స్నానం చేయాలని తపిస్తున్నది.
హెర్మెస్ అంతే, మహావేగంతో పోతాడు.

అందుకే అతడు దొంగలకు, ధనం వెదికే వాళ్లకు దేవుడైనాడు.
తన ఉద్దేశాన్ని అందరికి స్పష్టం చేసాడు
ఎలాగంటే, ఓరోజు సముద్ర దేవత త్రిశూలాన్ని,
యుద్ధదేవుడి కరవాలాన్ని కాజేసాడు.
అపోలో విల్లూ బాణాల్ని, అగ్నిదేవుడి పట్టకారుని,
**(తండ్రి జ్యూస్‌దేవుని పిడుగుల్ని**
**పట్టుకోబోయి మంటల్ని చూసి వదిలేశాడు)**
ముద్దాడుతున్న అఫ్రొడైట్ వడ్డాణాన్ని మూడోకంటికి
తెలియకుండా మృచ్ఛిలించాడు
ఎరాస్‌తో కుస్తీపట్టి మట్టికరిపించాడు.

**(ఎక్కడో గుహలోంచి ఏదో అద్భుత సంగీతం వినబడ్తుంది.**
**అందరూ తన్మయం చెందుతారు.)**

**ఫోర్సియస్** : ఈ మనోహరమైన స్వరాలను ఆలకించండి,
మూర్ఖత్వపు ఆలోచనల నుండి విడివడండి.
పాతదేవుళ్లను మరచిపొండి
ఎందుకంటే వాళ్లింకెంతమాత్రం దేవుళ్లు కారు.

కొత్తచెవులకు పాత కథలు వినబడవు,
మేం ఉన్నతమైన కళను కోరుకుంటున్నాం!
గుండెలోపలి పొరలను కదిలించేదే
సరైన పదమని నమ్ముతున్నాము.
**(ఆమె కొండవేపు నిష్క్రమిస్తుంది)**

**బృందం** : ఈ కొత్త స్వరాలే, నీ వీనులకు,
అనాది పిశాచమా, ఇంపుగా ఉంటే,
నీ మధురస్వరం, మా పసిబాలుడిని
కన్నీళ్లతో కరిగించకుండా ఉంటుందని అనుకోం!

అటు సూర్యుడు అస్తమిస్తున్నా,
మా ఆత్మలో వెలుగుతున్నాడు ప్రకాశవంతంగా!
మా గుండెల్లో గుడికట్టుకున్నాము.
ఈ ప్రపంచం తీసుకుపోయే దానికి సురక్షితంగా!
**(హెలెన్, ఫాస్ట్, యుఫోరియాన్లు ప్రత్యక్షమవుతారు)**

**యుఫోరియాన్ :** ఇవి పిల్లల పాటలు! వినండి!
అమ్మానాన్నలు ఆనందంగా!
వాటి లయకనుగుణంగా
నేను నృత్యం చేస్తున్నాను సంతోషంగా!
మీ ఎదలు నాతో కలిసి ఉప్పొంగగా!

**హెలెన్ :** స్త్రీ పురుషులను కలిపే ప్రేమ
ఇద్దరి ఆనందాన్ని ఒక్కటిగా చేస్తుంది.
ఆ ఇరువురి అతిలోక ఆనందం
ప్రేమ లోగిలిలో ముగ్గురిగా మారుతుంది.

**ఫాస్ట్ :** అన్నీ కనుగొనబడి, అది మనల్ని కనుగొన్నది
నేను నీవాడిని, నీవు నాదానివి.
పవిత్ర కలయిక మనల్ని బంధించి ఉన్నది.
ఇది కాదంటావా విధి విన్యాసం!

**బృందం :** ఈ పసిబాలుడూ ఇతడి ప్రకాశం
ఎన్నో ఏళ్ల తపః ఫలం
ఈ జంట సున్నిత బంధాలు
మృదువుగా పెనవేసుకున్న సుగంధాలు.

**యుఫోరియాన్ :** నేనిప్పుడు స్వేచ్ఛాజీవిని,
నింగికి నన్ను ఎగరనివ్వండి!
ఎగుర్తూ, గంతులేయడం నా కోరిక,
అదే నా ఆనంద సామ్రాజ్య పతాక!

**ఫాస్ట్ :** తొందర పనికిరాని భాగ్యం
అతిధైర్యం అనారోగ్యం!
ఎక్కువ ఎత్తుకు ఎగిరేవాళ్లు
నేలకూలి నిర్వీర్యమౌతారు!
నిన్ను పోగొట్టుకోలేము,
మా గారాల పుత్రుడా!

**యుఫోరియాన్ :** నేనేం నేలపై తిరిగే పసికందును కాను,
ఎక్కువ ఉద్వేగంతో ఆపుతున్నారు మీరు నన్ను!

నా జుట్టును విడవండి, నా దుస్తుల్ని తీసేయండి!
నా స్వంతమేదో నాకు వదిలేయండి.

**హెలెన్** : అయ్యో! కుమారా!
నీవు మా పుత్రుడివి!
ఓహ్! నీకైదేనా జరిగితే
అంతుండదు మా దుఃఖానికి!
మన బంధనాలు అతిసున్నితమైనవి,
మన ముగ్గురి బంధం మరింత సన్ననిది.

**బృందం** : త్వరలో అది తెగుతుంది
దుఃఖం, విచారం తరుముకొస్తుంది.

**హెలెన్, ఫాస్ట్** : మా కోసం, మన కోసం
కుమారా! నీ ఉత్సాహానికి వేయి కళ్లేలు!
నీ ఉరుకుల పరుగులకు సంకెళ్లు!
ఈ అందమైన ప్రకృతి సొబగులతో
నింపు నీ హృదయపు లోగిళ్లు!

**యుఫోరియాన్** : నా పవిత్ర ధర్మం
నేను నెరవేరుస్తాను.
**(బృందంతో కలిసి నాట్యం చేస్తాడు)**
నాతో నర్తిస్తున్న ఈ బాలికలు
సమ్మోహనంగా ఉన్నారు!
ఎలా ఉంది ఈ సంగీతం?
ఏమనిపిస్తోంది ఈ నాట్య విన్యాసం?

**హెలెన్** : నీ నాట్య కౌశలం అపూర్వం!
అందరూ కలిసి చేసిన అద్భుతం!

**ఫాస్ట్** : ఈ గమ్మత్తులు నన్నంత కదిలించవు!
ఎక్కడో చూసినట్లే ఉంటాయవి నాకు!
**(యుఫోరియాన్ తన బృందంతో మరింత క్లిష్టమైన అడుగులు వేస్తాడు.)**

**బృందం** : నీ కరచరణ విన్యాసం
నయన మనోహరం.

నీ ముంగురుల విలాసం
మనోహర దృశ్య విశేషం.
నీ లలిత పద నర్తనం
నృత్యరూప ఆవర్తనం!
చక్కని బాలుడా! ఇవి
నీ ఉద్దేశాన్ని తెలియజేస్తాయి.
అవి మా హృదయాలను
దొంగిలించేట్లయితే మావన్నీ నీవి!

**(విరామం)**

**యుఫొరియాన్ :** ఇది మరీ సులభంగా ఉందా,
ఎగిరి గంతులేసే జింకలారా!
కొత్త ఆట ఆడుదామా,
పరుగెత్తు! పరుగెత్తు! మీరంతా పరిగెత్తండి!
నేను వేటగాడిని,
నీవు వేటాడబడబోయే దానివి! మిమ్మల్ని వెంటాడుతున్నాను.

**బృందం :** త్వరపడనక్కరలేదు,
నిన్ను దాటి పరుగెత్తము.
నిన్ను కౌగిలించుకోకపోతే,
మా జన్మలు వ్యర్థము
అందాల బాలుడా!
నీ ప్రేమ మా నిశ్చయము.

**యుఫొరియాన్ :** రా! మైదానాల్లోకి.
కొండలు, వనాల్లోకి!
అవలీలగా దొరికితే
ఆనందం ఉండదు!
గెలుపు కష్టమయ్యేదే
నాకు తృప్తినిస్తుంది.

**హెలెన్, ఫౌస్ట్ :** ఎందుకా ఉన్మత్త ప్రదర్శన?
మామూలుగా ఉండలేరా వీళ్లు?
కొమ్మలు ఊగుతూ ఉండగా

కొండల్లో కోనల్లో పరిగెత్తడం
ఎందుకీ హడావుడీ, యాతన?

**బృందం :** **(ఒకరి తరువాత ఒకరు)**
అతడు వేగంగా పరిగెత్తాడు,
మనల్ని గమనించనట్లు నటిస్తున్నాడు.
ఎగతాళి చేస్తున్నాడు, వెక్కిరిస్తున్నాడు.
ఒకదాన్ని పట్టుకుని ఇటు లాక్కు వస్తున్నాడు.
మనందరిలోకీ ఆమే చురుకైనది నిజానికి!

**యుఫోరియాన్ :** **(ఓ బాలికను తీసుకువస్తూ)**
ఈ కన్యను గెలుచుకుని వచ్చాను,
ఈమెతో ఆడిపాడి ఆనందిస్తాను,
ఎంత సంతోషం, ఎంత వినోదం
ఆమెను లొంగదీసి, కావలించుకోవడం.
ఆమెను ముద్దాడుతాను,
ఒప్పుకోకుంటే నా శక్తిని చూపిస్తాను.

**బాలిక :** నన్ను వదులు! నా మారువేషంలో
శక్తి ఉంది, ఆత్మ ఉన్నది.
నీలాగే నాకు ఇష్టాయిష్టాలున్నవి.
అంత తేలికగా లొంగేదాన్ని కాను.

నేనేమీ బలహీనురాలిని కాదు.
నీ మగతనానికి నీవు గర్వపడు, అంతే!
నాజోలికి వచ్చావా అగ్నిశిఖనవుతాను.
తెలివితక్కువవాడా! నిప్పుతో చెలగాటం వద్దు!
**(జ్వాలగా మారి ఆకాశంలోకెగిరిపోతుంది)**

రా! నాతో ఈ వాయుగుండంలోకి!
చూడు! అప్పుడే నీ లక్ష్యం అదృశ్యమవుతున్నది!

**యుఫోరియాన్ :** **(తననంటుకున్న జ్వాలల్ని ఆర్పేస్తూ)**
అడవి చెట్లు ఎంత వేగంగా
నా చుట్టూ కదుల్తున్నవి!

ఈ కొండ శిఖరాలు కోనలు
నేను దూకినవేగా ఇవి!
ఈ హోరెత్తుతున్న గాలులు
సుదూర తీర తరంగ సంజనితాలే కదా!
ఎక్కడ నుంచో వస్తున్నట్లున్నవి,
నేను దగ్గరలోనే ఉన్నాననుకుంటున్నాను.
**(కొండల మధ్య పైపైకివెళ్తాడు)**

**హెలెన్, ఫాస్ట్, బృందం–**
అంత వేగంగా నీవు పైకి ఎగుర్తుంటే,
మా ప్రాణాలిక్కడ విలవిల కొట్టుకుంటున్నాయి.

**యుఫోరియాన్ :** ఎంత ఎక్కువ ఎగిరితే అంత ఎక్కువ చూస్తున్నాను!
ఇప్పుడు నేనెక్కడున్నాను? క్రింద ఉన్నది పెలాప్ దేశం
భూమ్యాకాశాలు కలిసిన నా జన్మస్థానం!

**బృందం :** ఈ పర్వతాలు, అరణ్యాలు
నీకు సంతృప్తి నివ్వవా!
కొండవాలుల్లో ద్రాక్షగుత్తులు
నిన్ను ఆకర్షించవా!
అత్తిపళ్లు, ఆపిల్‌పళ్లు
వరుసలుగా ఆహ్వానించవా!
అందమైన ప్రదేశంలో ఉండి
ఈ సంపదలలో జీవించు!

**యుఫోరియాన్ :** కలలు కనండి మీరు! కలలు కనండి!
చురుకుదనం కానరాని శాంతిజీవనం!
నేను కోరుకునేది యుద్ధం
ఆ తరువాత విజయం!

**బృందం :** మా యుద్ధాలు ముగిసాయి.
యుద్ధం కావాలా నీకు.
ఏ ఆశ నీకు ఇస్తుంది
సంతోషం, హాయిని?

**యుఫోరియాన్ :** జీవాన్నిచ్చిన నేల
కష్టాల్లోకి నెట్టగా,
మీకోసం వాళ్లు
రక్తతర్పణం చేసారు.

యోధులను ఆశీర్వదించు,
నీ పేరుతో
దప్పిక తీరని జ్వాలను
మోసుకుపోతున్నవారు.

**బృందం :** చూడు! ఎంత ఎత్తుకు ఎదిగాడో!
మహరాజ ఠీవితో మెరుస్తున్నాడు,
కంచు, లోహపు ఆయుధాలతో
మహాయోధులను మించి ప్రకాశిస్తున్నాడు.

**యుఫోరియాన్ :** గోడలు, కోటలు లేనప్పుడు
ప్రతి ఒక్కడూ తన శక్తితో నిలబడతాడు,
ఎవరికీ లొంగని దుర్గంలా
అతడి లోహ హృదయం దృఢంగా ఉంటుంది.
శాంతికోసం రా! స్వేచ్ఛకై పోరాడు!
స్త్రీలు యోధులై, ప్రతి పసిబిడ్డా వీరాధివీరుడౌతాడు.

**బృందం :** కవిత్వం, కళ దైవ ప్రేరితం,
అది స్వరం వరకు ఎదగనీ,
మనకు సుదూరంగా
అందమై తారలా ప్రకాశించనీ!
అయినా పవిత్ర పదం
మనల్ని కనుగొంటుంది,
దాని పాట ఎంత దూరానికైనా
మధురంగా వినబడ్తుంది.

**యుఫోరియాన్ :** నేను శిశువుగా ఇక్కడ జన్మించలేదు.
యుద్ధానికి సిద్ధమైన యువకుడిలా వస్తున్నాను.
బలవంతులు, స్వేచ్ఛాపిపాసులు,

శక్తిమంతులు, ఉరుకులురికేవాళ్లు,
నేను చేయాల్సిన పనులు నాకు నేర్పారు.
వీడ్కోలు!
వారు నా మార్గానికి కీర్తిప్రతిష్ఠలనిస్తారు.

**హెలెన్, ఫాస్ట్ :** నీవు పుట్టగానే
వెలుగులు విరజిమ్మావు.
అంతెత్తుల నుంచి
దుఃఖమార్గాన్ని వెదుక్కుంటున్నావు.
ఎంతో ప్రియమైన మన అనుబంధం
స్వప్నంలా కరిగిపోవాల్సిందేనా!

**యుఫోరియాన్ :** వినండి! సముద్రం నుంచి ఉరుముల పిలుపు!
ఉరుముతూ ప్రతిధ్వనిస్తున్న కొండల మలుపు!
దుమ్ములో, ధూళిలో, అలలలో
ఆ యోధులు గుంపుగా నినదిస్తున్న అరుపుల మెరుపు.
విధి స్పష్టంగా పలుకుతున్నది–
మరణించడానికి ఇంతకన్నా న్యాయమేమున్నది?

**హెలెన్, ఫాస్ట్, బృందం:**
నిరాశా భీభత్సపు పదమా,
నీ మరణమే విధి నిర్ణయమా!

**యుఫోరియాన్ :** నాదీ వారి ఉద్వేగం, అదే నా అభిలాష!
ప్రేక్షకుడిగా ఉండబోనిక హమేషా!

**హెలెన్, ఫాస్ట్, బృందం:**
ఓ హృదయమా! ధైర్యంగా ఉండుము!
ఓ గర్వమా! తెచ్చావా నాశనం!

**యుఫోరియాన్ :** రెక్కలారా విప్పారండి!
నన్నక్కడకు ఎగరనీండి!

**(గాలిలోకి ఎగుర్తాడు, అతడి వస్త్రాలు, శిరస్సు మెరుస్తాయి. కాంతిరేఖలా అతడు అదృశ్యమౌతాడు)**

బృందం : ఇకారస్! నింగి నుంచి చివరికి
పతనం చెందాడు నేలపైకి!

**(అందమైన యువకుడు తన తల్లిదండ్రుల పాదాల వద్ద పడి మరణించి వుంటాడు. తెలిసినవాడిలా ఉన్న అతడి దేహం అదృశ్యమై, కాంతి తోకచుక్కలా నింగిలోకి పోతుంది. అతడి వస్త్రాలు, తలపాగా, వీణ నేలపై పడి ఉంటాయి)**

**హెలెన్, ఫాస్ట్ :** మన ఆనందమిప్పుడు మారింది దుఃఖంగా!

**యుఫోరియాన్ గొంతు (లోతుల్నుంచి) :**
అమ్మా! ఈ చీకటి గుయ్యారంలో
ఒంటరిగా నేనుండవలెనా?
**(విరామం – బృందం ఆలపించే విషాద గానం)**

**బృందం :** ఒంటరిగా ఉన్నావా? సుపరిచితమే నీవు!
మృత్యువు నిన్నెక్కడికి తీసుకువెళ్లినా
నీ క్రింద ఉన్న నీడలను నీవు చేరినా
మా హృదయాలు నిన్ను మరచిపోవు.

నీ గురించి అరుదుగా దుఃఖిస్తాము.
మాయమైన నీ గురించి అసూయ పడ్తున్నాము.
చీకటి వెలుతురు దినాలు నిన్ను పంపించాయి.
పాటలు, ఆత్మలు అన్నీ అద్భుతాలైనాయి.

శుభ వంశ సంజాతుడవు
ప్రసిద్ధ నామంతో కళలతో విలసిల్లినావు.
చిరుప్రాయంలోనే నిన్ను నీవు కోల్పోయి
అంతులేని దుఃఖాన్ని మాకు మిగిల్చినావు.

ఈ విశాల ప్రపంచాన్ని తెలుసుకోవాలని
నీ హృదయం లోతుగా తలపోసింది.
స్త్రీలకు ప్రేమనిచ్చి ప్రేమను పొందావు.
స్వంత రాగాల్ని పలికించి సంగీతమైనావు.

స్వేచ్ఛామార్గం నీది, అసాధ్యం అందరికీ
కాని ఆ దారిలోని ఉచ్చులలో చిక్కుకున్నావు.

మానవుడి సాధారణ ధర్మాలను కాలదన్ని
నీకు నచ్చిన పద్ధతిలో నడచినావు.

అంతిమ లక్ష్యాన్ని ఎన్నుకుని
అపూర్వ ఆత్మవిశ్వాసంతో
ఉన్నత కార్యాచరణలో
ఉనికిని కోల్పోయినావు.

ఎవరు నీ లక్ష్యాన్ని పూర్తిచేస్తారు?
ఎవరు ఈ పొడుపు కథ విప్పగలరు?
ఈ దుఃఖంతో బాధపడ్తున్నవారికి
ఎవరు ఉపశమించే జవాబు చెప్పగలరు?

అయినా వారి మనసు ప్రశాంతబడ్తుంది.
నీవులేని బాధను మరపించి
కొత్త పాటలు పాడుతుంది.
ఎన్నో గొప్ప విషయాలకు పుట్టినిల్లు
ఈ నేల మరల పునర్జన్మలనిస్తుంది.
**(విరామం – సంగీతం ఆగిపోతుంది.)**

**హెలెన్** : (ఫాస్ట్‌తో)–
ఒక ప్రాచీన నీతివాక్యం నిరూపణ అవుతున్నది,
అందం ఆనందంతో కలిసి జీవించలేదు చిరకాలం.
ప్రేమానుబంధం తెగిపోయిందిప్పుడు,
జీవసూత్రం తెంపబడుతున్నది.
రెంటికీ దుఃఖిస్తూ, నీకు వీడ్కోలు చెబుతున్నాను.
ఆఖరిసారి నీ కౌగిలిలోకి తీసుకో నన్ను!
ఓ పెర్సిఫోని! ఆ పసిబాలుడిని, నన్నూ
స్వాగతించు నీ లోగిలిలోనికి!

**(ఫాస్ట్‌ను కౌగిలించుకుంటుంది. ఆమె దేహం అదృశ్యమై, ఆమె దుస్తులు, మేలిముసుగు ఫాస్ట్ చేతుల్లో ఉంటాయి)**

**ఫోర్సియాస్** : (ఫాస్ట్‌తో)–
ఏది మిగిలిందో దానినే గట్టిగా పట్టుకో!

ఆమె వస్త్రాన్ని పోనియకు, పోనీయకు!
పిశాచాలు అప్పుడే పట్టుకున్నారు మూలల్ని.
ఆమెను అధోలోకానికి తీసుకుపోదలుచుకున్నారు.

నీవు పోగొట్టుకున్న దేవత ఇకలేదు,
కాని ఆ వస్త్రం దివ్యమైనది. దానిని గట్టిగా పట్టుకో!
నిన్ను ఆకాశం గుండా తీసుకెళ్లగలుగుతుంది,
ఇక్కడ నుంచి సుదూర ప్రాంతాల్లో మళ్లీ కలుస్తాను నిన్ను!

**(హెలెన్ వస్త్రాలు ఫాస్ట్‌ను కమ్ముకొని అతడిని ఆకాశంలోకి తీసుకువెళ్తాయి. ఫోర్సియాస్ క్రిందపడి ఉన్న యుఫోరియాన్ దుస్తుల్ని, వీణను తీసుకుని ముందుకు వచ్చి మాట్లాడుతుంది)**

**ఫోర్సియాస్** : ఇక్కడ దొరికింది నాకొక అదృష్ట నిధి
పవిత్రాగ్ని జాడలు మిగల్లేదు కాని
నేను చాలా పనులు చేయగలిగాను.
వీటితో కవులు ఖంగారుపడి అసూయ చెందుతారు.
నైపుణ్యాన్ని సృష్టించలేకపోయినా
బయటి వస్త్రం శోభాయమానంగా ఉంటుంది.
**(స్తంభం పక్కనే కూర్చుంటుంది)**

**పాంథాలిస్** : బాలికలారా! త్వరపడండి! మాయామంత్రాలు ముగిసాయి!
థెస్సాలియన్ మంత్రగత్తె ఇంద్రజాలం కరిగిపోయింది.
మన చెవుల్ని దద్దరిల్లజేసిన తాగుబోతు స్వరాలు తగ్గిపోయాయి.
రండి! హేడ్స్ నరకానికి పోదాం! మన రాణిని అనుసరిద్దాం!
విశ్వాసపాత్రులైన సేవకురాళ్లుగా ఆమె అడుగుజాడలననుసరిద్దాం!
తిరుగులేని దేవత సింహాసనం వద్ద ఆమెను కలుద్దాం!

**బృందం** : రాణులకు ఏ చోటైనా నివాసయోగ్యమే
హేడ్స్ నరకంలో కూడా వారికి ఆతిథ్యం దొరుకుతుంది.
వారి సమస్కంధులతో విహరిస్తారు.
పెర్సిఫోనితో సమానంగా గౌరవించబడతారు.
మనలాంటి వాళ్లం మిగిలిపోతాం వెనక
అస్ఫోడెల్ పొలాల్లో ఆఖరున తిరుగుతుంటాం

వంధ్య పోప్లర్, విల్లో చెట్లతో ముచ్చట్లాడుతుంటాం!
మనకు సమయమెలా గడుస్తుందో తెలియదు?
గబ్బిలాల్లా కీచుమంటూ దయ్యాల్లా తిరుగుతుంటాం!

**పాంథాలిస్** : ఉన్నత లక్ష్యం లేక, పేరూ సంపాదించని జీవితాలు
ఓ గుంపులో జనం! కలిసిపోతాయి మూలకాల్లో
నాకున్న తీవ్రమైన కోరిక, మన రాణితో ఉండాలని
విధేయత మనల్ని వ్యక్తులుగా నిలుపుతుంది.
**(నిష్క్రమిస్తుంది)**

**అందరూ** : మనం పగటి కాంతిలోకి ప్రవేశించినాము.
ఇంకా మనం వ్యక్తులం కాబోము.
ఇది మనకు తెలుసు, మనం గ్రహిస్తున్నాము.
అయినా, మనం హేడ్స్‌కు వెళ్లబోము.
మనల్ని ప్రకృతి లీనం చేసుకుంటుంది.
తాను సదా జీవిస్తుంది, తనలో లీనమై మనమూ అంతే!

**బృందంలో కొందరు :**
ఈ వేలాది ఊసులాడే శాఖల ప్రకంపనాల్లో విహరిద్దాము.
వాటి వేళ్ల నుండి జీవరసాన్ని చిగుళ్లవేపు పయనింపచేద్దాం!
ఈ ఊగులాడే ముంగురులను ఆకులతో పూలతో అలంకరిద్దాం!
అనంత పత్రాలతో ఆకర్షణలతో గాలితరగలతో ఆడుకుందాం!
పండిన పండ్లు నేలరాలగానే ప్రజలు తమ మందలతో వస్తారు.
చేతులు ఏరతాయి, పెదాలు రసాన్ని రుచిచూస్తాయి.
ఆ పంటను చేజిక్కించుకోడానికి జనులు ప్రదక్షిస్తారు.
మనం తొలిదేవతలమై, వనదేవతలమై పూజలందుకుందాము.

**మరికొందరు** : అద్దంలా మెరుస్తున్న ఈ శిఖరాలపై తిరుగాడుదాం!
మృదువైన అలల్లా కొండకొమ్ముల్ని ముద్దాడుదాం,
పక్షుల గానాల్ని, రెల్లుగడ్డి పరకల సంగీతాన్ని ఆస్వాదిద్దాం.
పాన్ దేవుడి గొంతుతో ఉలికిపడినా, వెంటనే బదులిద్దాం,
గుసగుసలాడే గాలితో పలుకుతూ, ఉరుముతో రెండింతలు ఉరుముదాం!
మూడురెట్ల సవ్వడి, పదిరెట్ల పదునుతో గట్టి తిరుగు సమాధానం.

**మూడవ బృందం:** అక్కలారా! మాకిష్టం చలన శీలత!
కదిలే ఏటి ప్రవాహాలతో కదలడం మా కోరిక!
సుదూరపు పర్వత వనాలలో ప్రవహిస్తూ
లోతులనన్వేషిస్తూ, మైదానాలను, వనాలను, తోటలను
సైప్రస్ చెట్లను ఇళ్లను గుర్తుచేస్తూ
మా నదీ తటాలకు తగిలిన నీరు
అద్దంలా ఆవేశాన్ని ప్రతిబింబించడం మాకిష్టం!

**నాల్గవ బృందం:** మీ రెక్కడైనా తిరగండి, మేం మాత్రం
ఈ కొండవాలుల్లోనే తిరుగుతాం!
పాతిన ద్రాక్షతీగలు ఆకుపచ్చగా అలరారుతూ
సంరక్షకుడి పోషణలో సక్రమంగా పెరుగుతూ
అతడు ప్రతిగంటా ప్రతిరోజూ
దున్నుతూ, తవ్వుతూ, పాదులు చేస్తూ, నీరుపోస్తూ
కత్తిరిస్తూ, పైకెగబాకిస్తూ, దేవతలను ప్రార్థిస్తూ
ముఖ్యంగా సూర్యుడినీ, బాకస్ దేవుడినీ–

బాకస్ దేవుడు తిరుగుతుంటాడు గుహల్లో
పూలపొదరిళ్లలో వనకన్యలతో సరసాలాడుతూ
కలలు కంటూ, మధుపాన మత్తుడై విహరిస్తుంటే
సారాయి తిత్తులు, సీసాలు, బోలు పాత్రలు
కుడిఎడమల శీతల గుహలు,
అనాది కాలం నుంచి భద్రపరచిన ఆనవాళ్లు
అందరు దేవుళ్లూ, ముఖ్యంగా హిలియాస్
వేడి వాయువులు, తేమ, వెచ్చదనం, ఉష్ణాన్నిస్తున్నపుడు
ద్రాక్షలు విపరీతంగా కాసి తీగెలు వంగినపుడు
పనివాళ్లు ద్రాక్షతీగెల మధ్య తిరుగుతూ
ద్రాక్షగుత్తులతో బుట్టలను నిండా నింపగా
కావడులు వంగి చేస్తున్న కీచు శబ్దాలు
బుట్టలు, తట్టలు నిండగా అన్నిటినీ
ద్రాక్షసారాయి కర్మాగారానికి చేరుస్తున్న పనివాళ్లు
అక్కడ వాళ్ల మొరటు పాదాల కింద నలిగి
నురుగు విరజిమ్ముతున్న ద్రాక్షాఫలాలు–

ఇప్పుడు చెవులు పగిలేలా వినవస్తున్న తాళపు ధ్వనులు
డయొనిసస్ అటుగా వస్తున్న ప్రకంపనలు,
అతడికి తోడు గొర్రెకాళ్ల సాటిర్‌లు, ఆడ సాటిర్‌లు,
వారిమధ్య పొడుగు చెవుల సైలెనస్ మృగం!
ఇప్పుడు నిర్బంధాలు లేవు! పంగల గిట్టల జంతువులు
అన్ని ఆచారాల్నీ చేస్తాయి ధ్వంసం!
మన ఇంద్రియాలు మందగించి, చెవులు వినికిడిని కోల్పోయి
తాగుబోతులు మధువుతో తడుస్తూ
తమ తలల్ని పొట్టల్ని తడుపుతూ నింపుతున్నపుడు
కొందరు చాలు చాలు అంటున్నకొద్దీ
గందరగోళం మరింత ఉధృతమవుతుంది.
ఎందుకంటే పాత తిత్తులు ఖాళీ అయితేనే
కొత్త మధువు నింపబడుతుంది గనక!

**(తెర పడ్తుండగానే, ఫోర్సియాస్ నిలబడుతూ ఒక గొప్ప ఆకారంగా మారుతూ తన ముసుగును తీసివేస్తూ మెఫిస్టొఫిలిస్‌గా రూపు దాలుస్తుంది. మెఫిస్టొపిలిస్ తరువాతి అంకానికి ఉచితమైన మాటలు చెబుతాడు)**

# నాలుగవ అంకం (Act IV)

## 14. పర్వతాగ్రాలు (High Mountains)

**(గరుకుగా, ఎవరూ చొరలేని పర్వతాగ్రాలు. ఒక మబ్బుతునక కొండ కొమ్ముకు ఆనుకుని రెండుగా చీలుతుంది)**

ఫాస్ట్ : **(అక్కడి నుంచి వస్తూ)**

నా పాదాల దిగువ ఉన్న లోతైన ఒంటరితనాన్ని చూస్తూ
ఈ కొండ అంచుపై నుంచి నలువైపులా పరికిస్తున్నాను.
నన్నిక్కడకి తీసుకువచ్చిన మేఘ వాహనాన్ని పంపినాను.
అది నన్ను పగటికాంతిలో భూసముద్రాలపై పయనించి తీసుకువచ్చినది.
నన్నిక్కడ వదిలి ఇంకా వెళ్లకున్నది.
తూర్పుగా వ్యాపించి చిక్కటి ఆవిరి ముద్దలా ఉన్నది.
నా కన్నులు ఆశ్చర్యంగా చూస్తుండగానే
అది తన రూపాన్ని ఏదో రూపంలోకి మార్చుకుంటున్నది.
అవును! నా కనులు నన్ను మోసం చేయుటలేదు.
ఆ సూర్యకిరణ ప్రకాశ మేఘ తల్పంపై ఆమె శయనించి ఉన్నది.
దేవతా రూపంలో ప్రకాశిస్తున్న ఆమె
జునొ, లెడా, హెలెనాలా కనిపిస్తున్నది.
రాజ ఠీవితో మందహాసం చేస్తూ హెలెనా!
అయ్యో! ఇప్పుడు నా ఎదుటి నుంచి పోవుచున్నదే!
మరల రూపరహితమై తూర్పువేపు పయనిస్తున్నది.
కదిలిపోయే రోజుల గొప్పతనాన్ని ప్రతిఫలిస్తున్నది.

అయినా, నా కనుబొమల, ఛాతీ చుట్టూరా చల్లదనం
మనసును మైమరపించి, స్వాంతననిస్తున్న మేఘశకలం
క్రమేపీ నానుంచి విడివడి పైకెగస్తూ రూపు దాలుస్తున్నది.
అది ఏనాడో నేను కోల్పోయిన నా యవ్వన రూపం!
అవి నా హృదయపు లోతుల్లో దాగున్న పెన్నిధులు
ప్రేమ ప్రజ్వరిల్లిన తొలిరోజుల అనుభవాలు
వేగంగా అనుభవమైనవి, అర్థం చేసుకోబడనివి.
ఏ అమూల్య వజ్రమూ వీటిని మించి ప్రకాశించలేదు.
ఓ అద్భుత పరిణామమా! ఆత్మ ప్రకాశ రూపమా!

ఇంకా అది పైపైకి, నింగిలోకి ఎగుస్తున్నది.
నా అంతరాత్మను తనతో తీసుకొని పోతున్నది.

**(ఏడు దళాలు ముందు, ఏడు దళాలు వెనుక కవాతు చేస్తుంటాయి. మెఫిస్టాఫిలిస్ కనిపిస్తాడు. కవాతు కొనసాగుతుంటుంది.)**

**మెఫిస్టాఫిలిస్** : బ్రహ్మాండమైన కవాతు! అతివేగంగా!
అభివాదములు, ఆర్యా! తమ ఆలోచనలేమిటి?
చెప్పండి వివరంగా; ఎందుకీ దుర్గమ ప్రదేశంలో ఆగారు!
కొండచరియలు భయంకరమైన నోళ్లు తెరచుకుని వున్నాయిక్కడ!
వీటి గురించి నాకు తెలుసు, ఎక్కడి నుంచో ఇక్కడికి వచ్చాయివి.
ఈ ప్రదేశం ఒకప్పుడు నరకలోకపు అడుగుభాగం.

**ఫాస్ట్** : మరో కట్టుకథ, సందేహం లేదు,
అటువంటివి అల్లడంలో నీకు అలుపురాదు.

**మెఫిస్టాఫిలిస్** : **(తీవ్రంగా)–**
నిజం చెబుతున్నా విను! దేవతల ప్రభువు
నన్నూ నా అనుయాయుల్ని ఆకాశం నుండి
భయంకర అగాధంలోకి విసిరికొట్టినపుడు
మధ్యలో ఉండే మహోగ్ర అగ్నిజ్వాల
మమ్మల్ని మలమలా మాడ్చివేస్తున్నపుడు
అన్ని భూతాలూ దగ్గి దగ్గి, తుమ్మి, నానా అవస్థలు పడగా
నరకలోకం గంధకామ్ల ధూమాలతో నిండి
దుర్వాసనా ధూమాలతో ఉబ్బిన తిత్తిలా మారింది.
ఒక రాక్షస శక్తితో వేగంగా భూమి పొరలను
పగలగొట్టి పైకి ఉబికి వచ్చింది.
అంతా తల్లకిందులై, ఒకప్పటి అగాధం స్థానే
ఈ గరుకు కొండ శిఖరాలు ఒక పద్ధతిలో ఏర్పడ్డాయి.
క్రింది కొండ స్థానాన్ని పైనున్న కొండ ఆక్రమించింది.

మేము ఆ వేడి గుంటల్ని విడిచి పారిపోయినప్పుడు
ఊర్ధ్వ వాయుమండలంలో ఉండే దేవతల ప్రభువు
ఇప్పుడు అందరికీ తెలిసిన రహస్యాన్ని
ఆనాడు ఈ విధంగా గోప్యంగా ఉంచాడు.

**ఫాస్ట్** : పర్వతాలు మౌనంగా ఉంటాయి.
దానితో నాకు నిమిత్తం లేదు,
ప్రకృతి పాలన ప్రారంభమైనాక
ఈ భూగోళం రూపుదాల్చుకున్నది.
తన గుట్టలు, లోయల్ని చూసి మురిసి
పర్వతాలను, శిలల్ని అమర్చుకున్నది.
కొండల్ని, చక్కని వంపులున్న కనుమల్ని
లోతైన లోయల్ని ఆకుపచ్చగా అలంకరించుకున్నది.
ప్రకృతి తనను తాను సింగారించుకుంటుంది.
నీవు చెప్పే విస్ఫోటనాలు, చప్పుళ్లు లేకుండానే!

**మెఫిస్టాఫిలిస్** : నీ ఆలోచన, నీ ధోరణి నీ స్వంతం.
కాని అలా జరిగినప్పుడు నేనక్కడే ఉన్నాను.
నమ్ము నమ్మకపో! అది నీ యిష్టం!
అథోలోకాలు అగ్ని జ్వాలలతో బుసకొట్టాయి.
ఉబ్బినాయి, ఉబికినాయి, అగ్ని ప్రవాహాలు
లావాను వెళ్లగక్కినాయి! నా కళ్లతో చూసాను!
మొలాక్ సుత్తి ప్రతి కొండశిలను చెక్కింది.
ఒక పక్క అగ్ని ప్రవాహాల ఊపిరి,
మరోపక్క శిలలపై మొలాక్ ఉలి చప్పుడు,
ఎగిరిపడ్తున్న బ్రహ్మాండ శిలా సమూహాలు
నేలమీద తనవి కాని రాళ్ల ముద్దలు.
ఆ చలనం, మహోగ్ర చలనం ఎలా సాధ్యమైంది?
యోగులు, ద్రష్టలు వివరించ ప్రయత్నించారు.
యుగాలుగా ఈ శిలాస్తంభాలిలానే ఉన్నాయి.
ఆలోచనా జ్ఞానం మనకేమి చెబుతున్నది?
పాత కథల్లో నిజం లీలామాత్రంగా తెలుస్తున్నది.
తరతరాలుగా ఈ కథల సారాంశం మారకున్నది.
అద్భుతాలను వాళ్లు చూస్తున్నారు.
వాటిని సాతానుకు అన్వయిస్తున్నారు.
విశ్వాసపు ఆసరాతో ప్రయాణీకుడు పయనిస్తాడు
డెవిల్ కొండ, డెవిల్ వంతెన ఇవి అతడికి పరిచితమైనవి.

**ఫాస్ట్** : సముచితమైన దృక్పధమే నీది!
ప్రకృతి కార్యాలను డెవిల్ దృష్టితో చూడడమనేది!

**మెఫిస్టాఫిలిస్** : ప్రకృతి తన పనిని తాను చేసుకోనీ,
దానితో నాకేమి నిమిత్తం?
సాతాను ఆ సమయంలో అక్కడ ఉన్నాడు!
అదే నాకు ముఖ్యం!
మా పద్ధతులు- అలజడి, అస్తవ్యస్తం-
అవే ఇస్తాయి మంచి ఫలితం.
ఋజువు కావాలా! నీకు ఆనందం కలగడం లేదా!
ఇక్కడ నుంచి కనిపించడం లేదా,
ఈ ప్రపంచపు అనేక రాజ్యాల ప్రాభవం!
ఇంకా నీలో అసంతృప్తి పోలేదా!
ఈ భోగభాగ్యాలు, సంపదలు
సాతాను సృష్టిసంజనిత మహారాజ్యాలూ
నీకు సంతోషాన్ని కలిగించడం లేదా?

**ఫాస్ట్** : అవును! ఒక గొప్ప ఆలోచన నాకు వచ్చింది!
చేతనైతే ఊహించు అదేమిటని?

**మెఫిస్టాఫిలిస్** : త్వరలోనే ఊహిస్తాను!
నేనే నీ స్థానంలో ఉంటే
ఏదన్నా నగరంలో ఉండటం ఇష్టపడేవాడిని.
నాలుగు రోడ్ల కూడలిలోనో
జన సమ్మర్థం ఉన్న భోజనశాలల్లోనో
కూరగాయాల సంతల్లోనో
ఉల్లిపాయలు, కాబేజీలు, బీట్ దుంపలు
ఈగలు ముసుర్తున్న మాంసఖండాలున్న కబేళాల్లోనో
అటు యిటూ పచార్లు చేస్తుండేవాడిని.

ఎప్పుడైనా ఇటురా!
ఎడతెగని అల్లర్ల కంపు, పోరాటం
పైగా శుభ్రత కోసం అంతులేని ఆరాటం.
ఈ ప్రదేశాన్ని ఉన్నతీకరించడానికి త్వరలో

వెలుస్తాయి ఎత్తైన భవనాలు, విశాలమైన వీధులు
వీటి చుట్టూరా వెలుస్తాయి మురికివాడలు
అంతుపొంతు లేకుండా గజిబిజిగా పాకుతాయి.
వాటికి సరిహద్దు సమస్యలుండవు.

చుట్టూ జనసమ్మర్ధం, కేకలు, అరుపులు,
చూట్టానికి రెండు కళ్లూ చాలవు,
మంచి వినోదం!
చీమల గుంపుల్లా అటు యిటూ కదలడం,
నేను రథంలో ఉన్నా, అశ్వారూఢుడనై ఉన్నా,
వాళ్ల కనుల పంటను నేను,
లక్షలాది మంది కొలుస్తారు నన్ను!

**ఫాస్ట్** : ఆ హడావుడి నాకు కలిగించదు ఆనందం.
జనాభా పెరగడం మంచిదే. కాని, భోగభాగ్యాలు
సరైన ఆహారం, బాధలను ఉపశమించే మార్గాలు,
విద్య ఇవి ముఖ్యం - కాని వాళ్లు వీటికి వ్యతిరేకం!

**మెఫిస్టాఫిలిస్** : అయితే, నా స్థాయికి తగ్గట్టు నిర్మిస్తాను,
అద్భుత అలౌకిక ఆనంద విషయలోలత్వ భవనాన్ని.
కొండలు, గుట్టలు, విశాల మైదానాలు, ఖాళీస్థలం.
కళ్లు చెదిరే పూలతోట, ఫలవనం,
ఆకుపచ్చని గోడలు, పచ్చిక బయళ్లు,
తిన్నని రేఖల్లా ఉండే దారులు, రాజమార్గాలు,
నీడనిచ్చే చోటులు, రాతి బాటలు, మెట్లు;
అనేక రకాల జలధారలు అనంతంగా,
నీటిబుగ్గలు, పైకెగజిమ్ముతున్న నీటి ప్రవాహాలు
అవి కలిగించే రకరకాల వింత శబ్దాలు
అపురూప లావణ్యవతులుండే అంతఃపురాలు-
నా సమయాన్ని వెచ్చించి అటువంటి అద్భుత భవనాన్ని
నిర్మించుకుని సుఖ సౌఖ్యాలతో కాలం గడుపుతాను.
నేను స్త్రీలు లావణ్యవతులు అని ఎందుకంటున్నానంటే
ఒక్క స్త్రీ నీకెన్నడూ సంతృప్తి ఇవ్వదు గనుక!

ఫాస్ట్ : బాబిలోన్ వేశ్యవు, నవీన వికృత లాస్యవు!

మెఫిస్టొఫిలిస్ : తమ కొత్త వ్యాపకం ఏమిటో సెలవిస్తారూ!
కాస్త అధిక స్థాయి, స్థితి ఉంటే నాకిష్టమే సారూ!
గాలిలో తేలడం నేర్చుకున్నావు కదా,
చంద్రికకు ప్రయాణం కడదామని అనుకుంటున్నావా?

ఫాస్ట్ : అదేం కాదు! ఈ భూగోళం చాలు
చేయడానికి గొప్ప గొప్ప ఘనకార్యాలు!
ఇంకా అద్భుతాలు సాధించగలను.
ఇప్పుడు నాకున్న శక్తితో ఉత్సాహపడుతున్నాను.

మెఫిస్టొఫిలిస్ : కీర్తికాంతపై పడిందా చూపు!
కొత్త నాయికతోనా నేటి వలపు!

ఫాస్ట్ : నాక్కావాల్సిందాన్ని స్వంతం చేసుకోవడం!
కీర్తితో పనిలేదు; కార్యసాధన ముఖ్యం.

మెఫిస్టొఫిలిస్ : కవులు నీవు పోయాక కీర్తిస్తారు,
మూర్ఖులు మరింత మూర్ఖత్వాన్ని రగిలిస్తారు!

ఫాస్ట్ : దుష్ట పిశాచమా! మానవుని అన్వేషణలో
నీ పాత్ర ఏమిటి? నీ ఉనికి ఏమిటి?
నీ కాలిపోయిన మనస్సు ఎలా గుర్తిస్తుంది
మానవలోకపు అవసరాలు, ఆలోచనల వేడి?

మెఫిస్టొఫిలిస్ : సరే! నీవు చెప్పు! నీ ఇచ్ఛకు కట్టుబడతాను.
నీవు నెరవేర్చుకోవాలనుకుంటున్నావు ఏ కోరికను?

ఫాస్ట్ : నేను వస్తుండగా నా దృష్టి సముద్రంపై పడింది.
అది పెల్లుబికి మరింత మరింత పైకెగసింది.
ఆగి తన అలల్ని పెను తుపానుగా మార్చుకున్నది.
తన ఆగ్రహాన్ని దేశాల తీరంపై వెళ్లగక్కింది.
అది నన్ను వ్యాకుల పరచింది; గర్వం అతిశయించి
రక్తం ఉరకలెత్తి, కోపం పెరిగి, ఉద్రేకం ఆగక

ఉప్పొంగి ఉప్పొంగి ప్రశాంత మనస్సును
కల్లోలపరిస్తే అది ప్రమాదం కాదా?

అది ఏదో ఒంటరి సంఘటనలే అని సమాధానపడలేక
దగ్గరకు పోయి చూసాను. అల ఆగి మరల
మళ్లింది వెనకకు; అంతెత్తు, అంత దూరపు
లక్ష్యాన్ని చేరుకుని మరల స్వస్థానం చేరుకుంది.
ఇదే మరల మరల పునరావృతమవుతున్నది.

**మెఫిస్టాఫిలిస్ :** **(ఇటు తిరిగి)–**
ఈ ఆట తెలుసు నాకు; ఇదేం కొత్త వార్త కాదు.
లక్షలాది సంవత్సరాల నుంచి అదేం మారలేదు.

**ఫాస్ట్ :** **(ఉత్సాహంతో)**
అల తీరం వేపు ప్రవహిస్తున్నది,
ఏటి పాయలను నింపుతున్నది.
తనను తాను అడ్డుకుంటూ
తన విస్తరణను అడ్డుకుంటున్నది.
సుడులు తిరుగుతున్నది, ఉప్పొంగుతున్నది.
అలలతో విస్తృతమౌతూ
ఇసుక తిన్నెలను ముంచుతున్నది.
అల తరువాత అల విస్తారమౌతూ
ఏ పనీ చేయకనే తిరోగమిస్తున్నవి.

నాకు నిరాశ కలుగుతున్నది గమనిస్తుంటే,
ఎంత మూలకశక్తి వృథా అవుతున్నది!
నా ఆత్మ కొత్త రెక్కలను తొడుగుకున్నది.
నేను దీనిపై సమరం చేస్తాను, వీలైతే ఆక్రమిస్తాను.

నేను స్వాధీనం చేసుకోగలను ఈ తరంగాలను!
వరదలా ఉప్పొంగనీ! తరంగమై విస్తరించనీ!
అంతెత్తు ఉబికిందీ అణగిపోతున్నది.
దాని ప్రవాహాన్ని చిన్న గుట్ట అడ్డుకుంటున్నది,
దారి ఇవ్వక దాని పొగరు నణిచివేస్తున్నది.

చిన్న పల్లం దాని మార్గాన్ని మార్చుతున్నది.
నా పథకం నేను ఆలోచించాను!
నా ఆత్మ ఒక అపూర్వ విజయాన్ని కైవసం చేసుకుంటుంది.
నా తీరం నుంచి నేనే సముద్ర గర్వాన్ని అణగారుస్తాను.
దాని పొగరు తగ్గించి హద్దులనేర్పరుస్తాను.
దాని ఉద్ధృతిని దానిలోకే తరిమివేస్తాను.
ప్రతి చిన్న విషయాన్ని వివరంగా ఆలోచించాను.
నా ప్రణాళికను ఆచరణలో పెడ్తున్నాను.

**(దూరంగా మృదంగ ధ్వని. డప్పుల చప్పుళ్ళు. ప్రేక్షకుల వెనుక వేపు, కుడి నుండి కవాతు శబ్దం)**

**మెఫిస్టొఫిలిస్** : సమర మృదంగ ధ్వనులు, వింటున్నావా?

**ఫాస్ట్** : మరింత యుద్ధం కాబోలు
జ్ఞానులకవి దుఃఖపు శబ్దాలు.

**మెఫిస్టొఫిలిస్** : యుద్ధమైనా, శాంతైనా, తెలివిగలవాడు
వాటిని మార్చుకుంటాడు తనకనుకూలంగా
సరైన సమయం కోసం ఎదురుచూస్తాడు
ఫాస్ట్! మంచి తరుణం! కైవసం చేసుకో ధైర్యంగా!

**ఫాస్ట్** : ఈ డొంకతిరుగుడు మాటల్ని కట్టిపెట్టు,
ఏం చేయాలో, ఎలా చేయాలో కనిపెట్టు!

**మెఫిస్టొఫిలిస్** : నేను వచ్చే దారిలో చూసాను
మన మహరాజు మిత్రుడు చిక్కుల్లో ఉన్నాడు.
నీకు గుర్తుండే ఉంటుంది,
అతడికి మనం గొప్ప ఆనందం కలిగించాము.
కాకి బంగారంతో అతడికి కనికట్టు కట్టి
మొత్తం ప్రపంచాన్ని అమ్మగలడని నమ్మించాము.
పసిబాలుడిగానే అతడు సింహాసనమెక్కాడు,
దారుణంగా అతడిని దారిమళ్లించారు,
త్వరగానే గ్రహించాడతడు ఆనంద సూత్రాలను,
రాజ్యాధికారం, రాసలీలలు రెండింటినీ!

**ఫాస్ట్** : పెద్ద తప్పు! ఘోరాపరాధం!
రాజు తన బాధ్యతలు నెరవేర్చాలి!
ఆజ్ఞాపించడంలో ఆనందాన్ని పొందాలి!
తన ఎద లోపలి కాంక్షను వెలిబుచ్చరాదు బయటకు.
తన వాళ్ల చెవుల్లో చెప్పాలి!
పని దిగ్విజయమయ్యాక ప్రపంచం మెచ్చుకోవాలి!
ఆ విధంగా రాజుల హుందాతనం
మహా శక్తివంతమవుతుంది.
తుచ్ఛ సుఖాలు కేవలం శృంగార క్రీడలవుతాయి.

**మెఫిస్టోఫిలిస్** : అది అతడి దారి కాదు.
అంతులేని సుఖాలు అతడికి కావాలి,
అందువల్ల అరాచకం మొదలయ్యిందక్కడ!
చిన్నా చితకా యుద్ధాలు, ద్వేషాలు, ద్రోహాలు
సోదరుల మధ్య విద్వేషాలు, అంతఃకలహాలు
రాజ్యాలపై రాజ్యాలు, దుర్గాలపై దుర్గాలు
పట్టణాలు కత్తులు దూస్తున్నాయి.
శ్రేణుల తిరుగుబాటు, ప్రభువులపై పోరాటాలు
మతాధికారులు పీఠాధిపతులపై పోట్లాటలు
ప్రతి ఒక్కడూ తన పొరుగువాడితో కలహం
దేవాలయాల్లో గొంతులు కోసుకోడాలు
ప్రయాణీకులకు, వర్తకులకూ రక్షణ లేకపోవడం
రహదారులపై అడ్డగింపులు, దోపిడీలు, హత్యలు
ప్రతి ఒక్కడు ధైర్యవంతుడైనాడు.
ఆత్మ రక్షణ కొరకు ఆయుధాలు పడ్తున్నాడు.
అయినా, జీవితాలు గడుస్తున్నాయి, ఎలాగోలా!

**ఫాస్ట్** : కుంటడం, నేలపై పడడం, మళ్లీ లేవడం,
మళ్లీ పడడం, తలకిందులు కావడం!

**మెఫిస్టోఫిలిస్** : ఎవరూ పూర్తిగా నాశనం కాలేదు.
ప్రతి ఒక్కరూ ఎవరిగానో కావాలనుకున్నారు.
అది తేలికే! ఎందుకూ కొరగాని వాళ్లు

ఉన్నత స్థానాలకు ఎగబాకారు.
అయితే, శక్తిమంతులు, ముఖ్యులు
పరిస్థితి చేయిజారుతున్నదని గమనించారు.
అందరూ ఉమ్మడిగా ఒక మాట మీద నిలబడ్డారు.
ఎవరు శాంతిని స్థాపిస్తారో అతడే ప్రభువన్నారు.
ఈ మహరాజుకేమీ చేతకాదు దద్దమ్మా అన్నారు.
ఇంకొకర్ని ఎన్నుకుందాం, అతడు పరిస్థితులను పునరుద్ధరిస్తాడు.
అతగాడు మనల్ని యుద్ధం, కష్టాల నుంచి రక్షిస్తాడు.
కొత్త ప్రపంచాన్ని నిర్మించి శాంతిభద్రతలు నెలకొల్పుతాడు.

**ఫాస్ట్** : చక్కటి అభిమతం!

**మెఫిస్టొఫిలిస్** : పూజారులు! వారి దృష్టి అంతే!
ఈ వ్యవహారంలో ముఖ్యపాత్ర వారిదే!
వాళ్ల పొట్టలను కాపాడుకుంటారు.
గందరగోళం పెరిగింది. పవిత్ర సంస్కారాలు
పూజలు పునస్కారాలు మొదలయ్యాయి.
మన మిత్రుడు మహరాజు అదుగో యుద్ధరంగంలో,
అతడి కథ ఏమవుతుందో! ఎలా ముగుస్తుందో!

**ఫాస్ట్** : దురదృష్టం! అతడు మంచివాడు!

**మెఫిస్టొఫిలిస్** : పద! వెళ్దాం! అతడు బతికుండగానే
చేయాల్సిన సాయం చేద్దాం!
ఆ ఇరుకైన దారిలో ఇరుక్కున్నాడతడు.
ఈ ఒక్కసారి రక్షిస్తే మనం
వేయిసార్లు రక్షించిందానికి సమానమవుతుంది.
ఎవరికి తెలుసు అతడి అదృష్టం ఎలా ఉందో
అన్నీ బాగుంటే అతడికి వీరులు బాసటగా రావచ్చును క్షణంలో.

**(క్రింది పర్వతాలను దాటి లోయలోని సైనిక దళాల్ని చూస్తారు. యుద్ధ ఢంకాలు, సైనిక వాయిద్యాలు సంగీతం వినబడుతుంటుంది, క్రింది నుంచి)**

**మెఫిస్టొఫిలిస్** : మంచి వ్యూహం! సురక్షితంగా ఉన్నాడు,
మనం అతడితో కలిస్తే అతడే గెలుస్తాడు.

**ఫాస్ట్** : ఎటువంటి సహాయం మనది? ఏ తంత్రం?
మోసం, హస్త లాఘవం, మాయామంత్రం?

**మెఫిస్టోఫిలిస్** : యుద్ధం గెలవడానికి కావాలి వ్యూహాలు
లక్ష్యమెప్పుడూ ఉండాలి ఉన్నతంగా!
మహారాజుకు విజయాన్నందించి
అతడి రాజ్యాన్ని అతడి కైవసం చేసి
అతడి ముందు మోకరిల్లు!
ఆ విశాల సముద్ర తీరాన్ని బహుమతిగా తీసుకెళ్లు!

**ఫాస్ట్** : నీకున్న అనేక కళలలో ఇదీ ఒక న్యాయం!
యుద్ధాన్ని గెలువు, తక్షణం చేయి సహాయం!

**మెఫిస్టోఫిలిస్** : లేదు! మీరు గెలుస్తారు ఈ యుద్ధం!
ఎందుకంటే తమరే సర్వసైన్యాధిపతి ఈ క్షణం!

**ఫాస్ట్** : అవునవును! అది నాకు సరైన పదవి,
ఎందుకంటే నాకు లేదు యుద్ధజ్ఞానం, తెలివి!

**మెఫిస్టోఫిలిస్** : హెర్ ఫీల్డ్ మార్షల్!
నీ సిబ్బందిని నమ్ముకో! విజయాన్ని అందుకో!
యుద్ధం వస్తున్న సంగతి నేను ముందే గ్రహించాను.
అందుకే అన్ని ఏర్పాట్లూ చేసే ఉంచాను.
అనాది మానవ శక్తుల్ని ప్రాచీన పర్వతాల నుంచి,
అవును, వాళ్లంతా మనకు సన్నిహితులే!

**ఫాస్ట్** : వాళ్లెవరు? ఆయుధ పాణులైన సైనికులు,
కొండజాతివాళ్లను కొట్లాడడానికి రప్పించావా?

**మెఫిస్టోఫిలిస్** : లేదు లేదు, పీటర్ క్విన్స్‌లా
గుట్టల్లో కొంత భాగాన్నే రప్పించాను.
**(ముగ్గురు మహాకాయులు వస్తారు).**

**మెఫిస్టోఫిలిస్** : వీళ్లే మన సైన్యం.
వయసులో తేడాలున్నాయి,
దానిని బట్టే ఆయుధాలలో కూడా!

నీకు తగిన సహాయం చేస్తారు.
**(ప్రేక్షకుల వేపు తిరిగి)**
ఆయుధాలూ, కవచాలూ... అవన్నీ మీకు పరిచితం.
ఈ అనాగరికులకవేమీ లేవు.
అంతా ఊహా జనితం!

**బస్టర్ : (బాలుడు, తక్కువ ఆయుధాలు, రంగురంగుల దుస్తులు)**
ఎవడన్నా నా కళ్లలోకి చూస్తే,
వాడి మొహం బద్దలు గొడతా, కుట్లు పడేట్టు!
నా పిడికిలిని తప్పించుకోమను, చూస్తా!
వాడి జుట్టు పట్టుకుని చావగొడ్తా!

**బ్యాగర్ : (యువకుడు, ఆయుధపాణి, విలువైన దుస్తులు ధరించాడు)**
వృధా యుద్ధం నా శైలి కాదు,
మాటలతో నాకు పనిలేదు.
ధైర్యంగా పీక పట్టుకో,
తర్వాత అడుగు ఏ పుట్టుకో!

**హగ్గర్ : (మధ్య వయస్కుడు, ఎక్కువ ఆయుధాలు, అంగీలేదు)**
అదీ లాభం లేదు.
అటు సంపాదించింది ఇటు పోతుంది.
జీవన ప్రవాహం తుడిచిపెడ్తుంది.
సంపాదించింది దాచిపెట్టు;
నేను పెద్దవాడిని; జుట్టు నెరిసిన వాడిని.
ముసలితనం వచ్చేవరకు దాచుకోండి!

**(ముగ్గురూ దిగి లోయవైపు వెళ్తారు)**

# 15. పర్వత పాదాల వద్ద

## (On the Foot Hills)

**(డప్పులు, సైనిక సంగీతం; చక్రవర్తి గుడారం వద్ద**
**చక్రవర్తి, సైన్యాధ్యక్షుడు, రక్షకభటులు)**

**సైన్యాధ్యక్షుడు :** మన బలగాలు వెనక్కు తగ్గడానికిది అనువైన ప్రదేశం
అందరూ ఇక్కడ పోగవడమే ఇప్పుడు పరిష్కారమార్గం.
నేను నమ్ముతున్నాను ఖచ్చితంగా, అదే సరైన నిర్ణయం.

**చక్రవర్తి :** నాకు విచారంగా ఉంది మనం వెనక్కు తగ్గినందుకు!

**సైన్యాధ్యక్షుడు :** మన కుడివేపు, మహరాజా,
యుద్ధానికి అనువైన ప్రదేశం.
అటు కొండలు అంత ఎత్తు లేవు.
పోవడం అంత తేలిక కాదు.
మనకనుకూలం, శత్రువుకు బహుకష్టం.
ఈ పల్లపు ప్రదేశం మనల్ని దాస్తుంది సగం.
అశ్విక దళాల్నుంచి మనం సురక్షితం.

**చక్రవర్తి :** నేను చేయగలిగిందల్లా తల ఊపడమే,
మన గుండెలు, చేతులు ఎంత గట్టివో చూడడమే!

**సైన్యాధ్యక్షుడు :** మధ్యనున్న విశాల మైదానం, మహాప్రభూ!
అక్కడ సిద్ధంగా ఉంది మన పదాతిదళం.
మనవాళ్ల బల్లేల మొనలు చూడండెలా మెరుస్తున్నాయో
ఉదయపు సూర్యకాంతి, మంచుతెరల్లో తళుక్కుమంటున్నాయి.
నాలుగు పక్కలా వేయిమంది యోధులు
పోరాటానికి సిద్ధంగా ఉన్నారు.
మన శత్రువు వెన్ను విరగ్గొట్టేందుకు ఉవ్విళ్లూర్తున్నారు.

**చక్రవర్తి :** ఇటువంటి దృశ్యాన్ని నేనింతకు ముందెన్నడూ చూడలేదు.
ఈ సైన్యం నాకిప్పుడు రెండింతలుగా కనబడుతున్నది.

**సైన్యాధ్యక్షుడు :** మన ఎడమవేపు గురించి నేను చెప్పనక్కర్లేదు.
ఆ ఎత్తైన గుట్ట దగ్గర మన వీరులు కాపలా ఉన్నారు.

ఆ శిఖరం, ఆయుధాలు మెరుస్తున్న చోటు– అత్యంత కీలకం.
శత్రువులు ఆ సన్నటి దారిగుండా రాసాహసించారా
వాళ్ల దుఃఖం ప్రవహిస్తుంది రక్త కన్నీరై!

**చక్రవర్తి** : రానీ వాళ్లను, ఒకప్పుడు నా సోదర సమానులను,
నన్ను సోదరా, తండ్రీ, మామా అని పిలిచేవారు
వాళ్ల తిరస్కారం బంధుత్వాలను త్రోసిరాజన్నది.
నా రాజదండపు శక్తి వారికైవసమైనది.
నా సింహాసనపు గౌరవం క్షీణించినది.
నాకందరూ వ్యతిరేకులై తిరుగుబాటు చేస్తున్నారు.
వాళ్ల తగాదాలతో సామ్రాజ్యాన్ని పతనం చేసి
మొదట్లో బలహీనంగా ఉన్నవాళ్లు
ఇప్పుడు బలమైన ప్రవాహంగా మారినారు.

**సైన్యాధ్యక్షుడు** : ఆ రాళ్ల గుట్టల మధ్య నుండొస్తున్నాడు
వేగుగా వెళ్లిన మన సైనికుడు.

**మొదటి వేగు** : నేర్పుగా, ధైర్యంగా మేము
శత్రు శిబిరాల వేపు వెళ్లి శోధించినాము.
కొన్ని మంచివార్తలు చెప్పాలనేది మా ఆశయం.
ఇంకా చాలామంది తమకు విశ్వాసపాత్రులే!
వాళ్లనుకుంటున్నారు ఈ యుద్ధపు వేడిలోనే
ఉంది రాజ్యపు భవిష్యత్ నిర్దేశనం.

**చక్రవర్తి** : ఆత్మరక్షణా విధానం, ఆలోచనల భారం,
గౌరవం, బాధ్యత – ప్రేమ, కృతజ్ఞతలకు కడుదూరం!
అయినా వాళ్ల కర్థం కావడం లేదెందుకని,
పొరుగింటి నిప్పు మన ఇంటినీ దహించివేస్తుందని!

**సైన్యాధ్యక్షుడు** : రెండవ వ్యక్తి వస్తున్నాడు,
నెమ్మదిగా, అలసటగా కనిపిస్తున్నాడు.

**రెండవ వేగు** : మొదట మేము ఇది సాధారణ తిరుగుబాటు అనుకున్నాము.
కాని మాకు కనిపించాడు మరో చక్రవర్తి, అతని బృందం.
సమస్త రాజలాంఛనాలతో, గుంపు కదులుతున్నది.
గొర్రెల్లా ఆ సైన్యం బిక్కుబిక్కుమంటూ వస్తున్నది.

చక్రవర్తి : నాకు కావాల్సిందీ అదే! మరో చక్రవర్తి!
ఇప్పుడు నేను భావిస్తున్నాను నేనే అసలు వ్యక్తి!
సైనికుల్లాగే నేనూ యోధుల దుస్తులు తొడిగాను.
కాని నాకు కనిపించింది వేరే ఉన్నత గమ్యం.

నా అద్భుత సభా ప్రాంగణం.
ప్రమాద రహిత విందూ వినోదం.
అదే నేను కోల్పోయిన అత్యున్నత విషయం.
మీరు చెప్పినట్టు యుద్ధానికి సిద్ధపడ్డాను.
కాని, నా మనసు ద్వంద్వ యుద్ధానికి చూపింది మొగ్గు.

ఇప్పుడు నాకు తెలిసింది, యుద్ధానికి రావద్దన్న
మీ సలహా నేను వినకుండా ఉండివుంటే
యోధుడికి దక్కే గౌరవం నాకు దక్కేది.
ఆనాటి అగ్ని సామ్రాజ్యం నా నిజరూపాన్ని తెలిపింది.
నన్నా అగ్నిజ్వాలలు చుట్టుముట్టినప్పుడు ఋజువుకాలేదా,
అదంతా నిజమనిపించింది, ఎంతో గొప్పగా కనిపించింది.
నా పేరు ప్రఖ్యాతులు స్వప్నాలు, నిరుపయోగాలు
అప్పుడు వృధా చేసిన సమయాన్ని ఇప్పుడు వినియోగిస్తాను.

**(దూతలు రాజ సందేశాన్ని తీసుకుని శత్రురాజు వద్దకు వెళతారు. ఫాస్ట్ వీరోచితమైన దుస్తులతో శిరస్త్రాణంతో, తనతోపాటు ముగ్గురు మహా మనుషులతో చక్రవర్తి ముందు ప్రత్యక్షమౌతాడు)**

ఫాస్ట్ : మహరాజా! మంచి ఉద్దేశంతో మీముందుకు వచ్చాము.
ప్రమాదం కొద్దిగా ఉన్నా జాగ్రత్త అధికం తీసుకున్నాము.
కొండజాతి ప్రజలు, తమకు తెలుసు, ఎక్కువ ఆలోచనాపరులు.
రాళ్లూ రప్పలూ, ప్రకృతి చరియలూ, బొరియలూ వాళ్లకు తెలుసు.
ఒకప్పుడు మైదానాల్లో తిరిగే ఆత్మలు ప్రస్తుతం
తలదాచుకుంటున్నాయి కొండగుహల్లో, బిలాల్లో
అక్కడ నిరంతరాయంగా శ్రమిస్తూ వెలువరిస్తాయి
ఖనిజాలు, వాయువులూ, విడదీయడాలూ,
కలపడాలూ, కొత్త పదార్థాల్ని కనుగొనడాలూ!
అత్యంత నిపుణతతో అవి చేస్తాయి స్ఫటిక నిర్మాణాలు.

ప్రశాంత వాతావరణంలో అవి దృష్టిని సారిస్తాయి
ఊర్ధ్వలోకాల వేపు, దివ్య విషయాల వేపు.

**చక్రవర్తి** : ఇదంతా విన్నాను, నమ్ముతున్నాను, కాని
ఇప్పుడు ఈ విషయాలతో ఏమిటి పని?

**ఫాస్ట్** : నార్సియా నుంచి సబైన్ మంత్రగాడు
తమకు అభివాదములు తెలుపుతున్నాడు.
అతడిని విధి కాటేయబోతున్నపుడు,
ఎండు కట్టెల మధ్య, నిప్పు రవ్వల మీద
తారూ, గంధకపు సామాగ్రి మధ్య
ఒక్క క్షణం చాలు మాడిమసైపోయేందుకు
చక్రవర్తి హస్త సంజ్ఞ అతడిని కాపాడింది,
రోం నగరంలో జరిగిన అద్భుతమది.
అప్పటి నుంచి అతడు తన గురించి మానుకుని
తమ భవిష్యత్తును గమనిస్తున్నాడు.
గ్రహాల్ని, నక్షత్ర గమనాల్ని గణిస్తున్నాడు.
అతడు పంపగా వచ్చాము మేము, సాయం చేసేందుకు.
ఈ పర్వతాలలో ఉన్నాయి అలౌకిక శక్తులు
ప్రకృతి ఇక్కడ ప్రయోగిస్తుంది అనేక యుక్తులు
పూజారులు దానిని పిలుస్తారు మంత్రతంత్రాలని.
ఇంద్రజాలమని, మాయలని, టక్కుటమారాలని.

**చక్రవర్తి** : పండగరోజున అతిధులందరికీ ఆహ్వానమే!
కాలక్షేపానికి వచ్చేవాళ్లతో సదా సంతోషమే!
మా సభా ప్రాంగణం ఆ గుంపుతో నిండి ఉండేది.
వాళ్లకన్నా, కష్టాలో ఉన్నప్పుడు
సాయం చేయడానికి వచ్చేవాడే స్నేహితుడు
జయాపజయాలు త్రాసులో తూచబడ్తున్నపుడు
అండగా ఉండేవాడే అసలైన మిత్రుడు.
అయినా, ఇప్పుడు నేను నిన్నొకటి అడుగుతాను–
ఇప్పుడు నీ చేతుల్ని కాసేపు ఖడ్గం మీద నుంచి తీయగలవా!
నాకు వ్యతిరేకంగా, అనుకూలంగా వేలాదిమంది

అటు యిటూ కదిలే ఈ దినాన్ని గౌరవించగలవా?
ఈరోజు ప్రతి వ్యక్తీ తనకు తాను సాయం చేసుకోవాలి!
సింహాసనం మీద కూర్చునేవాడు తన అర్హత నిరూపించుకోవాలి!

ఈ మాయా చక్రవర్తి, తిరుగుబాటు నాయకుడు
నా ఆస్థులను రాజ్యాన్ని ఆక్రమించదలుచుకున్నవాడు
నా సామంతులకు రాజుగా, సర్వసైన్యాధక్షుడిగా
పిలవబడుతున్న వాడు, ఈ దొంగను నేను
నరకలోకపు నీడలలోకి పంపదలుచుకున్నాను.

**ఫాస్ట్** : ఇంత కష్టంలో కూడా
తమ ప్రాణాల్ని పణంగా పెట్టడం పెద్ద తప్పు.
తమ పవిత్ర శిరస్సు కిరీట ధారణకు అర్హం.
అది మాకు ఇస్తుంది అత్యంత ధైర్యం.
శిరస్సు లేని కాళ్లతో ఏమిటి ప్రయోజనం?
అది నిద్రపోతే అన్నీ నేలకూలవా!
దానికి దెబ్బ తగిలితే అన్నీ బాధపడతాయి.
తేరుకోగానే అన్నీ తేటపడతాయి.
చేయి బలాన్ని చూపిస్తూ స్థిరపడుతుంది.
శిరస్సును రక్షించడానికి డాలును పైకెత్తుతుంది.
కత్తి తన ధర్మాన్ని గుర్తించి
దెబ్బ తప్పుకుని తిరుగుదెబ్బ తీస్తుంది.
పాదం ధైర్యంగా ముందుకు అడుగువేసి
తెగిన శత్రువు మెడను మట్టిలోకి నెడ్తుంది.

**చక్రవర్తి** : నా ఆగ్రహం అంతే పని చేస్తుంది.
శత్రువు తలను నా పాద పీఠంగా అమరుస్తుంది.

**దూతలు** : **(తిరిగి వస్తూ)**
ఎటువంటి గౌరవ మర్యాదలు లభించకపోయినా
మేము వారికి వినిపించాము మా సందేశం
వాళ్లు ఎగతాళి చేసి అన్నారు– "అది మీ స్వప్నం–
– ఎక్కడున్నాడు మీ చక్రవర్తి? ఎక్కడ?
కొండల ప్రతిధ్వనిలోనా, గాలి సవ్వడిలోనా?

అతడొక జ్ఞాపకం, పాత కథ
ఏనాటిదో అతని కీర్తిసుధ!"

**ఫాస్ట్** : ఈ జవాబు తమ అనుయాయులకిస్తుంది సంతృప్తి.
శత్రువు దూసుకువస్తున్నాడు. తమ బలగాలు సిద్ధంగా ఉన్నాయి.
ఇది శుభక్షణం; ఆజ్ఞాపించండి తమ సైనికులను తక్షణం!

**చక్రవర్తి** : నేనిక్కడ యుద్ధ ప్రభువును కాను. ఆజ్ఞలు ఇవ్వబోను.
**(సైన్యాధ్యక్షుడితో)**
రాకుమారా! నీ విద్యుక్త ధర్మాన్ని నీ చేతుల్లో ఉంచుతున్నాను.

**సైన్యాధ్యక్షుడు** : మన కుడివేపు సైన్యం శత్రువు ఎడమవేపు ఎదుర్కొంటుంది.
వాళ్లు కొండవేపు వచ్చేసరికే మన సైన్యం ఎదురుదెబ్బతీస్తుంది.

**ఫాస్ట్** : ఈ చిన్నవాడిని వాళ్లతో తీసుకుపొమ్మనండి!
తన శక్తియుక్తులతో శత్రువులను చీకాకు పెట్టనివ్వండి!
**(కుడివేపు చూపిస్తాడు)**

**బస్టర్** : **(ముందుకు దూకి)**
ఎవడన్నావాడి ముఖం నాకు చూపిస్తే
దడవ పళ్లు రాలగొడ్తాను ఒక్క దెబ్బకే!
వెనక్కి తిరిగి వీపు జూపిస్తూ పోయాడా,
వాడి బుర్ర పగుల్తుంది ఒక్క వేటుకే.
నేను మీ సైన్యంతో నడుస్తా వేగంగా,
కత్తి, గదా చేబట్టి కదులుతా!
పదులకొద్దీ శత్రువులను హతమార్చి
వాళ్ల రక్తంతోనేవాళ్లను ముంచేస్తా!
**(నిష్క్రమిస్తాడు)**

**సైన్యాధ్యక్షుడు** : మన మధ్యపటాలం శత్రువులతో సరిసమానం
ఇప్పటికే కుడిపక్క మనవాళ్లు శత్రువులను చీకాకు పరిచారు.

**ఫాస్ట్** : **(మధ్యవాడిని చూపించి)**
ఇతడు నీ ఆజ్ఞను పాటిస్తాడు,
క్షణాల్లో అతడేం చేయగలడో చూపిస్తాడు.

**బ్యాగర్** : **(ముందుకు వచ్చి)**
శక్తి శౌర్యంతో పాటు సైన్యానికి ఉండాలి
యుద్ధ సంపదలపై ఆరాటమూ, ఉనికి.
మన చూపంతా ఇప్పుడే కేంద్రీకరించాలి.
కొత్త చక్రవర్తి గుడారంలోని నిధులకి,
ఆ ఆసనంపై అతడెక్కువ కాలం కూర్చోలేడు,
నేను ఈ దళాన్ని నడిపిస్తాను అతడి ఓటమి వేపు!

**స్నాచర్** : **(సైన్యంలో ఒక స్త్రీ, బ్యాగర్‌కు తోడవుతుంది)–**
మేం పెళ్లి చేసుకోలేదు కాని
ఇంతకు మించిన జతగాడు నాకు దొరకడు.
ఎంత సంపద వుందో అక్కడ
వింటేనే మనసు జల్లుమంటున్నది.
దొంగతనం చేసేప్పుడు స్త్రీలు
అత్యంత భీకరంగా ఉంటారు.
ఏ బాధా ఉద్వేగం లేకుండా
దోపిడీ దొంగతనం చేస్తారు.
జయం మనదే! విజయం మనదే!
యుద్ధంలో అంతా న్యాయసమ్మతమైనదే!
**(నిష్క్రమిస్తుంది)**

**సైన్యాధ్యక్షుడు** : శత్రువుల కుడి దళం మన ఎడమ సైన్యాన్ని ఎదుర్కొన్నది.
కొండ పక్కనున్న సన్నటి దారిని మన సైన్యం కాపాడుతున్నది.

**ఫాస్ట్** : **(ఎడమవేపు చూపిస్తూ)**
ఇతడిని కూడా చూడండి! బలవంతుడితగాడు!
బలమైన సైన్యానికి మంచి చేదోడు వాదోడు!

**హగ్గర్** : **(ముందుకు వచ్చి)**
ఎడమ పక్క సురక్షితం! వదిలేయండి నాకు సమస్తం!
నేనేదన్నా పట్టుకుంటే, పిడుగులు పడినా వదలను, ఇది సత్యం!

**మెఫిస్టోఫిలిస్** : **(కొండపై నుంచి దిగివస్తూ)**
ప్రతి కొండచరియ నుంచి, పర్వతపు గొంతుల్లోంచి
ఆయుధ పాణులైన సైనికులు అనంతంగా వస్తారు

వెనుక దారుల్ని మూసివేస్తూ మన సైన్యాన్ని అనుసరిస్తారు.
శిరస్త్రాణాలు, ఆయుధాలు, కత్తులూ, డాలులూ
దేనికీ చలించని గట్టి గోడలా నిలబడతారు.
మనం సూచన ఇవ్వగానే ముందుకు దూకుతారు,

**(మెల్లగా, ప్రేక్షకుల వేపు)**

వీళ్లెక్కడ నుంచి వచ్చారో మీరూహించగలరా!
నేను చెప్పనా! ఓ ఇరవై శిబిరాలను ఖాళీ చేసాను
పదాతిదళం, అశ్వికులు, రాజులు, చక్రవర్తులుగా
ఇప్పుడు ఖాళీ నత్తగుల్లలు, ఒకప్పుడు మహా ప్రభువులు
ఇవన్నీ ఆత్మలు, మధ్యయుగపు రూపాల్లోని సైనికులు.
ఇది పిశాచాల నృత్యరూపకం
సమరాంగణంలో నూతన ఘట్టానికి అంకురార్పణం.

**(బిగ్గరగా)**

శబ్దాలు, కేకలూ, ధ్వనులు, చప్పుళ్లు
రాబోతున్న యుద్ధానికి సూచనలు.
యుద్ధ లాంఛనాలు, పతాకలు పైకెత్తుతున్నారు.
అవన్నీ ఏనాటి కాలానివో! పాతవైన పీలికలు.
ఇప్పుడు జెండాల్లా ఎగుర్తూ పీలుస్తున్నవి కొత్తగాలి.
ఒక పురాతన సైన్యం నిలబడిందీనాడు.
కొత్త యుద్ధాలకై ఉవ్విళ్లూరుతూ

**(యుద్ధబాకాలు, భేరీభాంకారాలు భయం గొల్పుతుండగా శత్రుసైన్యం కకావికలవుతున్న సూచనలు)**

**ఫాస్ట్** : ఆకాశపు అంచు నల్లనవుతున్నది.
అక్కడక్కడ మెరుపులు కనిపిస్తున్నవి.
ఎర్రటి ప్రకాశవంతమైన వెలుగు ప్రజ్వరిల్లుతున్నది.
రక్తపు చారికలు ఆయుధాలపై మెరుస్తున్నవి
కొండలు, అరణ్యాలు, గాలి, ఆకాశం
ఈ దృశ్యానికి వేదికగా మారినవి.

**మెఫిస్టొఫిలిస్** : కుడిపక్క సైన్యం పోరాడుతున్నది.
జాక్ బస్టర్ చేస్తున్నాడు తనవంతు సాయం.
ఒడ్డు పొడుగున్న మొనగాడు
శత్రుసైనికులను చెల్లాచెదరు చేస్తున్నాడు.

చక్రవర్తి : ఒక్క ఆయుధమున్న చోట
ఇప్పుడు పన్నెండు పైకెగసినవి.
ఇదంతా కృతకంగా తోస్తున్నది.

ఫాస్ట్ : సిసిలీ తీరం వెంబడి సాగే
చిరు మబ్బుల గురించి విన్నావా?
నడి నెత్తిపైకెగసి అది
ప్రత్యేక వాయు పుంజాలతో
వివిధ వర్ణశోభితమై ప్రకాశిస్తాయి.
నగరాలు మిణుకు మిణుకుమంటుంటే
ఫలపుష్పవనాలు పైకీ కిందకు కదిలి
గాలిలో దృశ్యాలు ప్రత్యక్షమవుతాయి.

చక్రవర్తి : ఎంత విచిత్రం! ప్రతి బల్లెం చివరా
మెరుస్తోంది ఓ కాంతి పుంజం!
చిన్ని చిన్ని మంటలు నాట్యమాడుతున్నాయి.
ఈటె నుంచి ఈటెకు జాలువారుతున్నాయి.
నాకెందుకో నచ్చట్లేదు ఈ వింత దృశ్యావళి.

ఫాస్ట్ : ఇవన్నీ ఏనాడో అదృశ్యమైన తెగల ఆత్మలు
ఆకాశ మిధునరాశి పంపుతున్నది ఈ కాంతులు
ఒకప్పుడు నావికులు కోరుకునేవారీ రక్షణ
మీరిప్పుడు చూస్తున్నది వాటి ముగింపు సంరక్షణ!

చక్రవర్తి : అన్నీ ఆత్మలయితే నా అభినందనలనందుకునేదెవరు?
ఎవరు ప్రకృతిని సాయం చేసేట్లు చేసింది మనకు?

మెఫిస్టోఫిలిస్ : నీ గమ్యాన్ని నిర్దేశించే యజమాని కాక ఇంకెవరు?
నీ కష్టాలను చూసి అతడి హృదయం క్షోభిస్తుంది.
నీకు విజయాన్నిచ్చేందుకు తోడ్పడ్తుంది, లేదా నశిస్తుంది!

చక్రవర్తి : నేను వెళ్తుంటే నలుదిక్కులా ప్రజల జయజయధ్వానాలు!
నేననుకున్నాను, ఇప్పుడు నాకొక గుర్తింపు వున్నది.
ఒకసారి ప్రయత్నం చేసి చూస్తాను, అదీ అప్రయత్నంగా!
ఆ నెరసిన గడ్డపు వ్యక్తి ఏదో కష్టంలో ఉన్నాడు

అతడినెందుకు వదిలేయకూడదు? ఆ రకంగా నేను
మతాధిపతుల ఆనందాన్ని కాస్త చెడగొట్టాను.
అందుకని వాళ్లకు నాపై ఇసుమంత కోపం
ఎన్నో ఏళ్ల క్రితం చేసిన సాయానికి
ఇప్పుడు నాకు లభ్యమయ్యింది ఈ రకం ప్రతిఫలం!

**ఫాస్ట్** : మంచి బహుమతి ఇచ్చి తీర్చుకోవచ్చు అతడి ఋణం,
ఆకాశం వేపు చూడు! కనపడుతుంది ఓ శకునం!
యజమాని పంపుతాడు ఈ క్షణం ఓ అద్భుతం,
తమకు అర్థమవుతుంది స్పష్టంగా దాని భావం!

**చక్రవర్తి** : అదుగో గిరికీలు కొడ్తున్న గరుడపక్షి జాడ,
దానిని వేటాడుతూ వస్తున్న గ్రిఫిన్‌దా నీడ.

**ఫాస్ట్** : గుర్తుపెట్టుకో! అది శుభ శకునం!
గ్రిఫిన్ అనేది కల్పిత మృగం.
యుద్ధంలో కూడ ఎంత సాహసం?
పక్షిరాజును ఢీకొనే గుండెధైర్యం!

**చక్రవర్తి** : వలయాలుగా తిరుగుతూ అవి పైకెగిరినవి,
దూసుకు వస్తూ ఒండొరులను ఢీకొంటున్నవి,
కవ్వించడం, కలయబడడం
ముక్కుతో పొడవడం, గోళ్లతో చీరడం!

**ఫాస్ట్** : గ్రిఫిన్ సాహసం అంతమైంది.
ముక్కలు ముక్కలుగా రాలుతూ
అడవిలో పడి అదృశ్యమవుతున్నది.
సింహపు తోక చివరన పడ్తున్నది.

**చక్రవర్తి** : నీ వివరణ అది! నేనంగీకరిస్తున్నాను,
శకునం భావాన్ని, దృశ్యాన్ని ఆనందించాను.

**మెఫిస్టొఫిలిస్** : **(కుడివేపు చూస్తూ)**
మన శత్రువులు కుదేలవుతున్నారు,
పిడిగుద్దుల వర్షానికి పడిపోతున్నారు.
వెనక్కి వెనక్కి తగ్గుతూ

కుడి పక్కకు గుమికూడుతున్నారు.
ఎడమ పక్క శత్రుసైన్యం
గందరగోళంలో కకావికలౌతున్నది.
మన సైనికులు కుడి ఎడమల విజృంభించి
మెరుపుల్లా పగతురను తాకి పడగొడ్తున్నారు.
తుఫాను అలల్లా విజృంభించి తూర్పారబడ్తున్నారు.
ఎంత అద్భుత యుద్ధం! ఇక మనదే అంతిమ విజయం!

**చక్రవర్తి** : **(ఫాస్ట్‌కు ఎడమవేపు చూస్తూ)**
అటు పక్క మనవాళ్లు వెన్ను చూపిస్తున్నారు.
రాళ్లు విసిరి శత్రువుల్ని భయపెట్టడం లేదు.
ఎత్తైన ప్రదేశాన్ని ఎవరో అమ్ముకున్నట్టున్నారు.
చూడు! శత్రువులు సంఖ్యలో మనవాళ్లను మించినారు.
వాళ్లు కొండపైకి సులువుగా ఎక్కుతూ వస్తున్నారు,
మనకు పరాజయం, వాళ్లకు కిరీటం దక్కనున్నాయి.
మీ కళలూ నేర్పూ అన్నీ వృధా కాబోతున్నాయి.
**(విరామం)**

**మెఫిస్టోఫిలిస్** : అవిగో వస్తున్నవి లఘు పతనకాలు,
ఎప్పుడూ అవి చెబ్తాయి చెడు వార్తలు.
మన పరిస్థితి అంత బాగున్నట్లు లేదు.
అవేం చూపిస్తాయో నా కవగతం కాలేదు.

**చక్రవర్తి** : ఎందుకు వచ్చాయియీ కాకులు?
చాలవా ప్రస్తుతమున్న చికాకులు!
నల్ల తెరచాపల నౌకల్లా ఆ కాకులు,
సమరాంగణం నుంచి తెస్తున్న అవాకులు చవాకులు!

**మెఫిస్టోఫిలిస్** : **(కాకులతో)**
భుజంపై నిలవండి! చెవిలో చెప్పండి!
మిమ్మల్ని నమ్ముకున్నవాళ్లకు భయం లేదని పలకండి!
మంచి సలహాదారులుగా నమ్మబలకండి!

**ఫాస్ట్** : **(చక్రవర్తితో)**
పావురాలు ఎగరడం మీకు పరిచితమే

దూరదేశాల్నుంచి ఎగిరివచ్చి
సొంత గూటికి చేరి సేదదీరుతాయి.
కాకపోతే ఈ కాకులు కాస్త తేడా!
కపోతాల టపా శాంతిని తెస్తుంది.
యుద్ధంలో కాకుల టపా వేగంగా పోతుంది.

**మెఫిస్టొఫిలిస్** : ప్రమాదం మిమ్మల్ని చుట్టుముట్టింది.
అరుగో, మీ సైనికులు వేళ్లాడుతున్నారు.
కొండ చివర్న కొన ఊపిరితో,
శత్రువులు చేరుకున్నారు కొండపైకి,
దారిపై ఆధిపత్యం వాళ్లదయ్యిందా
మన పరిస్థితి వెళ్తుంది ప్రమాదంలోకి.

**చక్రవర్తి** : మొత్తానికి నన్ను మాయలో పడేశావు,
సిద్ధంగా ఉన్న వలలోకి శ్రీఘ్రంగా లాగేసావు!

**మెఫిస్టొఫిలిస్** : ధైర్యం! అప్పుడే అంతా అయిపోలేదు.
ఓపిక, సహనం ఉంటే దారి దొరుకుతుంది.
పగలు వచ్చేముందు రాత్రి ఉంటుంది.
నా వార్తాహరులు వేగంగా వెళ్తారు.
మీ తరఫున సైన్యానికి ఆజ్ఞయిస్తా, అనుమతించండి!

**సైన్యాధ్యక్షుడు** : **(వస్తూ)**
ప్రభూ! వీళ్ల సహాయం మీరు కోరుకున్నారు.
నాకెన్నడూ నచ్చలేదు! ఇప్పుడు మనం ఓడిపోతున్నాం
వీళ్ల ఇంద్రజాలంతో యుద్ధపద్ధతి మారింది.
నావల్ల కాదు బాగుచేయడం దానిని,
ఎవరు మొదలెట్టారో వాళ్లే పూర్తిచేయాలి.
ఇదుగో, నా అధికారాన్ని తిరిగి మీకిస్తున్నాను!

**చక్రవర్తి** : వద్దు! వద్దు! ఆ అధికార దండాన్ని ఉండనివ్వు!
మన అదృష్టం మారవచ్చు! ఓపిక పడదాం!
నాకితడి వ్యవహారం పద్ధతీ నచ్చలేదు,
ముఖ్యంగా నేను ఆ కాకుల కథను మెచ్చలేదు,
**(మెఫిస్టొఫిలిస్‌తో)**

నీకు అధికారాన్నివ్వలేను, నాకెందుకో
నీమీద నమ్మకం కుదరడం లేదు.
కాని, నాయకత్వం వహించు,
చేతనైతే ఈ ప్రమాదం నుంచి రక్షించు!
ఏది జరగాలనుంటే అదే జరుగుతుంది!
**(సైన్యాధ్యక్షుడితో శిబిరంలోకి వెళ్తాడు)**

**మెఫిస్టొఫిలిస్** : వీడికీ వీడి పాత కర్రకూ శలవు;
దానితో మనకి ఉపయోగమేమీ లేదు,
అంతేకాక, శిలువ గుర్తుంది దాని చివర!

**ఫాస్ట్** : ఏం చేద్దాం?

**మెఫిస్టొఫిలిస్** : చెయ్యాల్సిందేదో చేయబడింది.
నా సోదర సమాన వాయసాల్లారా!
పర్వత సరోవరంపైకి ఎగిరిపొండి!
సరోవర పుత్రికలకు మా అభివాదం తెలపండి!
వారి జలోధృతిని నేను చూడదలుచుకున్నాను.
ఆ అప్సరసలు తమ స్త్రీ సహజ చతురతతో
అసలు, నకిలీని ఒక్కటిగా భ్రమింపజేయగలరు.
భ్రాంతినే సత్యంగా ప్రవహింపచేయగలరు!
**(విరామం)**

**ఫాస్ట్** : మన కాకులు సరోవర స్త్రీల హృదయాలను చూరగొన్నారు.
అదుగో చూడు! వస్తున్నదో చిన్ని సెలయేరు!
రాళ్ల, చెట్ల మధ్య వేగంగా జాలువారుతున్నది.
పెరుగుతూ, పెరుగుతూ, విశాలమై, వడిగా
సుడులు తిరుగుతూ వేగంగా, వేగంగా ఉరకలెత్తుతున్నది.
మన శత్రువుల స్వప్నాలను నీటిపాల్జేస్తున్నది.

**మెఫిస్టొఫిలిస్** : కొండలెక్కుతున్న శత్రు సైనికులకు, పాపం,
దొరకబోతున్నది వింత స్వాగతం, వినాశనం!

**ఫాస్ట్** : ప్రవాహాలు పలురెట్లుగా విస్తరిస్తున్నవి,
రాళ్లు నోళ్లు తెరచి జలధారలు కక్కుతున్నవి,

ఏరు జాలువారుతూ జలపాతమవుతున్నది,
కొండ శిఖరం అడ్డు తగలగా పక్కలను ఢీకొడ్తున్నది.
నురగలు కక్కుతూ అంచులను ఒరుస్తున్నది.
లోయ పిలుపుకు స్పందిస్తూ నేలకు దూకుతున్నది.
శత్రువుల ధైర్యమంతా మున్నీటి పాలైనది.
అడ్డువచ్చినవాళ్లు అలల క్రింద జారినారు.
నాకే ఆ వరదను చూస్తే వళ్లు గగుర్పొడిచినది.

**మెఫిస్టొఫిలిస్** : నాకేం కానరావడం లేదీ జలహారం,
మనుష్యుల కళ్లకే కన్పించే నీళ్ల వ్యవహారం!
అయినా, ఈ పోట్లాట సరదాగా వున్నది.
వందలాది మనుషులు పిరికిపందల్లా
భయంతో, విస్మయంతో, విచిత్రంగా
లేని నీటిలో ఈదుతున్నారు, మునుగుతున్నారు.
గట్టి నేలమీద నానా భంగిమలతో నడుస్తున్నారు.
వాళ్లనుకుంటున్నారు నీళ్లలో మునిగామని.
భయం, తత్తరపాటు ముంచింది వాళ్లని.

**(కాకులు తిరిగివచ్చాయి)**

మన యజమానితో మీ గురించి మంచిగా చెబుతాను.
ఇప్పుడు మీకు మీరే యజమానులైతే
వేగిరం ఆ వెలిగే కొలుముల వద్దకు వెళ్లండి.
అలసట, తీరిక లేకుండా శ్రమిస్తున్న మరుగుజ్జులు
రాళ్లూ, లోహాన్ని కొట్టి రవ్వలు రాజేస్తున్నారు.
వారినీ బురిడీ కొట్టించండి మీ వాక్చాతుర్యంతో
కనువిందైన అగ్నిజ్వాలల దృశ్యాన్ని కనుపింపజేయండి.
మన ప్రభువు మనోదృశ్యాన్ని సాక్షాత్కరింపజేయండి;
మెరుపుతీగెల వలయాలు, ఉల్కాపాతాలు
ఆలోచన కన్నా అతివేగంగా కనిపించే వెలుగు ధారలు
రాత్రిని విభ్రాంతిలో ముంచే రసరమ్య దృశ్యాలు.

మెరుపులు, ఉరుములు, పిడుగులు
తడి నేలను తాకి సృష్టించే విధ్వంసకర ధూమాలు
చూపరులకు కలిగించాలి విస్మయ భయ సందోహాలు.
పెద్ద ఒత్తిడి తేవద్దు! మీరూ కష్టాలు పడవద్దు!

అడగండి! తర్వాత చెప్పండి నా ఆజ్ఞగా, మరుగుజ్జులకు!
**(కాకులు వెళ్లిపోతాయి, అద్భుత దృశ్యాలు కానవస్తాయి)**

**మెఫిస్టాఫిలిస్** : కారుచీకటి శత్రువును కమ్ముతున్నది.
తడుముకుంటూ పడుతూ లేస్తూ పోతున్నారు.
వాళ్లెటు వెళ్తే అటు మిధ్యాజ్వాలలు మిక్కుటమౌతున్నాయి.
చప్పున అగ్నిజ్వాలలెగసి చుర్రున కాల్చుతున్నాయి.
కళ్లు మిరుమిట్లు కమ్మి చీకటి మరింత చిక్కనౌతున్నది.
అద్భుతం! ఇప్పుడు కావాల్సిందల్లా ఓ బీభత్స శబ్దం!

**ఫౌస్ట్** : గతించిన సైన్యాల ఆత్మలీ మాయాసైనికులు,
మంచిగాలి వారికిస్తున్నట్లున్నది జవసత్వాలు.
టపటప, డబడబ, గణగణ చప్పుళ్లు
విచిత్రమైన, వింత శబ్దాలు, రణగొణ ధ్వనులు.

**మెఫిస్టాఫిలిస్** : ఇక వాళ్లనాపడం ఎవరితరమూ కాదు.
యుద్ధాలు, ద్వంద్వయుద్ధాలు, బాహాబాహీలు.
పాతరోజుల్ని మళ్లా జ్ఞప్తికి తెస్తున్నారు.
ఖాళీ కవచాలు, శిరస్త్రాణాలు తలపడ్తున్నాయి.
గ్యుల్ఫిలు, ఘిబెల్లైన్లు కొట్లాడుకున్నట్లు
వాళ్ల పాత పగల్ని తీర్చుకుంటున్నారు.
దాచుకున్న కోపం బయటకు ఉబికినట్లున్నది.
వాళ్లని శాంతింపజేయడం అసాధ్యంగా ఉన్నది.
ఈ గందరగోళం అన్నిదిక్కులా వ్యాపిస్తున్నది.
దెయ్యాల విందుగా చెప్పవచ్చు దీనిని.
అసూయా ద్వేషాలు ప్రబలుతున్నవీ రీతిని.
మంచి భయంకర కథలుగా పేర్కొనవచ్చు.
ఇప్పుడు వాటి భీకర గర్జనలను వినవచ్చు
కొండా కోనా సాతాను శబ్దంతో దద్దరిల్లుతున్నది.
ప్రతిధ్వనులు మిక్కుటమై భీకర ధ్వనులు వర్ధిల్లుతున్నవి.
భయం, వణుకూ, మృత్యువూ చుట్టుముట్టుతున్నవి.

**(మరణమృదంగ ధ్వనులు, యుద్ధ భేరీభాంకారాల సవ్వడులు, చివరగా విజయాన్ని సూచించే సైనిక కవాతు శబ్దాలు)**

# 16. శత్రు చక్రవర్తి శిబిరం

## (The Rival Emperor's Tent)

**(అందంగా అలంకరించబడిన సింహాసనం. బ్యాగర్, స్నాచర్ ప్రవేశం)**

**స్నాచర్** : అందరికన్నా మనం ముందే వచ్చేసాం!

**బ్యాగర్** : ఇంటికిపోయే కాకులకన్నా వేగిరం!

**స్నాచర్** : మహా మంచి ధనాగారం!
అంతులేని సంపద! ఎక్కడ నుంచి మొదలెడదాం?

**బ్యాగర్** : గది అంతా సంపదలతో నిండి ఉన్నది.
ఏది ముందు తీసుకోవాలో తెలీకున్నది.

**స్నాచర్** : ఈ కంబళి నాకు నచ్చింది,
నిద్రలేని నాకు వరంగా దొరికింది.

**బ్యాగర్** : ఇది లోహ నక్షత్రం,
నేను పట్టుకుని విసరాలనుకున్న విచిత్రం!

**స్నాచర్** : బంగారు అంచు ఎర్ర తలపాగా అది
నా కలలో కనిపించిన అదృష్టపు నిధి.

**బ్యాగర్** : నాకీ ఆయుధం నచ్చింది.
ఒక్క పోటుతో మెదడు బయటకు వస్తుంది.
ఎందుకదంతా కడ్తున్నావు మూట?
అదంత విలువైన సరుకు కాదు, నమ్ము నా మాట!
మనం వెదకాలి ధనముండే పెట్టెను.
సైన్యానికిచ్చే స్వర్ణముంటుంది దానిలో.

**స్నాచర్** : ఎవరు లేపుతారు? ఎవరు మోస్తారు?
అంత బరువున్న దానిని డెవిల్ కూడ ఎత్తలేడు!

**బ్యాగర్** : తొందరగా వంగు, మోకాళ్లపై ఉండు,
నీ నడుం గట్టిది, నేను పెడతా పెట్టెను.

**స్నాచర్** : నా పనైపోయింది, దేవుడా!
నడుం విరిగింది, నాయనా!
**(పెట్టె కింద పడుతుంది, ధనం చెల్లాచెదరవుతుంది)**

**బ్యాగర్** : అదుగో ఎర్ర బంగారం, ఏరుకో! ఏరుకో!
త్వరగా నీ దుస్తుల నిండా నింపుకో, నింపుకో!
ఇక చాలు, పద త్వరగా! త్వరగా
**(ఆమె నిలబడ్తుంది)**
ఛఛఛ! నీ అంగీలో ఉంది చిరుగు
జారిపోతున్న బంగారపు ముగురు
వృధా చేస్తున్నావు, పారబోస్తున్నావు అనవసరంగా,
నీ వెనకంతా నాణేల కాలువ ధారాపాతంగా.

**రక్షకభటులు** : **(చక్రవర్తికి విశ్వాస పాత్రులు).**
ఎవరు మీరు? ఏం చేస్తున్నారు?
ఇది మహరాజు సంపద! ఎంత ధైర్యం మీకు?

**బ్యాగర్** : మీకోసం మా కాళ్లూ చేతులూ విరగ్గొట్టుకున్నాము.
మావంతు మేం సంపాదించుకోవాలనుకున్నాము.
శత్రుశిబిరాన్ని దోచుకుంటే సంతోషించాలి నీవు.
యుద్ధన్యాయం ప్రకారం– మేం సైనికులమే, మూర్ఖులం కాము.

**రక్షకభటులు** : మా ఆలోచనా పద్ధతి అదికాదు.
మేం సైనికులం! దొంగతనం సహించం!
తెలుసుకోవాలి మీరు ఖచ్చితంగా
మా మహరాజు సేవకులు నిజాయితీపరులని.

**బ్యాగర్** : అవునా! నిజమే! మాకు తెలుసు మీ నిజాయితీ!
దేశం మీదపడి తినడమనే పరిస్థితి.
అందరి సైనికులదీ అదే పద్ధతి.
యుద్ధపు సుంకమనే పేరు అతి గొప్పది.
**(స్నాచర్‌తో)**
పదపద! దొంగకు దొరికిందే రొక్కం!
ఇక్కడ ఎవరికి స్వాగతం? మనకు కాదు నిశ్చయం!
**(నిష్క్రమిస్తారు)**

**మొదటి రక్షకభటుడు:**
నెత్తిమీద ఒక్కటివ్వాల్సింది నీవు,
వెధవ నోరు మూసుకునేవాడు, వదిలేసావు!

**రెండవవాడు** : ఎందుకో తెలీదు, నాకేదో భయం,
దయ్యాల్లా ఉన్నారు, ఆ దొంగల ద్వయం!

**మూడవవాడు** : మిణుకు మిణుకుమన్నాయి నా కళ్లు,
కనిపించలేదు ఎదుటివాళ్లు!

**నాల్గవవాడు** : ఏం జరిగిందో చెప్పలేను
రోజంతా ఎండగా, ఉక్కబోసింది వేడిగా,
అంతా భయభయంగా, దడదడగా
ఒకడు నించుంటే ఒకడు పడ్తున్నాడు,
మనం గతుక్కుమంటూనే పోట్లాడినాము.
కత్తి దూసినపుడల్లా శత్రువు నేలకూలుతున్నాడు.
చుట్టూ పొగమంచు, చూడటానికేం కనపడదు.
చెవుల్నిండా రొద, శబ్దాలు, సవ్వడులు,
ఏదో పగిలినట్లు, ఏదో తగిలినట్లు.
ఇలాగే రోజల్లా, ఇప్పుడిక్కడున్నాం మనం.
మనకే తెలియదు మనకేం జరిగిందో!
**(చక్రవర్తి నలుగురు యువరాజులతో విచ్చేస్తాడు.
రక్షక భటులు నిష్క్రమిస్తారు.)**

**చక్రవర్తి** : కథ సుఖాంతం! ఇది ఖాళీ సింహాసనం!
చుట్టూరా గుట్టలుగా వస్త్రాలు, ధనాగారం.
ఆ మాయగాడు పట్టుకుపోయాడు మూటగట్టుకు ధనం.
మన రక్షక భటులు శాయశక్తులా చేసారు పోరాటం.
దేశవిదేశాల రాయబారులు వస్తున్నారు.
మనల్ని, మన సామ్రాజ్యాన్ని అభినందిస్తున్నారు.
అన్నీ మంచివార్తలే! సామ్రాజ్యంలో శాంతి సూచనలే!
అందరూ నాకు విశ్వాసం ప్రకటిస్తున్నారు.
ఈ యుద్ధంలో మనం కొన్ని మాయోపాయాలు వాడాము.
చివరకు న్యాయపోరాటంలో విజయం సాధించాము.
మనందరకూ తెలుసు అవకాశం విజయాల్నిస్తుందని!
నింగి నుంచి రాలిన ఉల్క; శత్రువుపై కురిసిన నెత్తుటి వాన
కొండగుహల్లో పేట్రేగిన భీభత్స ధ్వనులు

మనకెలా ఉన్నా మన శత్రువుల్ని మట్టిపాలు చేసాయి.
పరాజితులను ప్రజలు పరిహసిస్తారు.
విజేత భగవంతుడిని స్తుతిస్తాడు తన పక్షాన ఉన్నందుకు.
ఎవరి ఆజ్ఞ అవసరం లేకుండానే అందరూ దేవుని కీర్తిస్తారు.
లక్షలాది గొంతులు దేవలోకానికి కృతజ్ఞతలు తెలుపుతాయి.
నామట్టుకు నాకు, నా హృదయాన్ని పొగడాలనుంది.
అందుకే దానివేపు చూస్తున్నాను కృతజ్ఞతతో పలుమార్లు.
యువక రక్తమున్న రాజు రోజుల్ని వృధా చేస్తాడు,
వయసు మీరిన ప్రభువు క్షణాల్ని ఆదా చేస్తాడు,
అంచేత నా గృహాన్ని, రాజ్యాన్ని, నా ప్రజలను, నా సభను
రక్షించేందుకు, నాకిష్టలైన ప్రభువుల్లారా!
మీకు అప్పగిస్తున్నా ఈ గురుతరమైన బాధ్యతలు.

**(మొదటి ప్రభువుకు)**

నీ పర్యవేక్షణలో మన సైన్యం బేషుగ్గా పనిచేసింది.
నీ సాహస నిర్ణయాలు సరైన సమయంలో ఉపయోగపడ్డాయి.
శాంతి సమయంలోనూ నీ అవసరం ఎంతో ఉంది.
ఈ రాజ్యఖడ్గాన్ని నీ చేతుల్లో ఉంచుతున్నాను.
లార్డ్ మార్షల్! గ్రహించు! నీ బాధ్యతలు నిర్వహించు.

**ఇంపీరియల్ లార్డ్ మార్షల్ :**

అంతర్యుద్ధంలో కలహించుకున్న తమ సైన్యం
ఇప్పుడు రాజ్య సరిహద్దులను కావలి కాస్తాయి.
తమ సింహాసనాన్ని, ప్రాణాన్ని కాపాడుకుంటాయి.
రాజమందిరం కళకళలాడుతుంది.
విశాలమైన ఆవరణలో విందూ వినోదాలు
రాజ ప్రముఖుల సమక్షంలో రాజిల్లుతాయి.
తమ ముందు, తమ పక్కన నడుస్తూ
ఈ ఖడ్గధారినై నేను, మహాచక్రవర్తీ! తమను సేవిస్తాను!

**చక్రవర్తి :** **(రెండవ ప్రభువుతో)**

వినయ విధేయతలతో కూడిన నీ వీరత్వం అసమానమైనది,
మీరు మా ఛాంబర్లేన్‌గా, రాజప్రాసాద రక్షకులుగా ఉండండి!

బాధ్యత గొప్పది, నా గృహాధికారిగా బాధ్యతలు స్వీకరించండి!
నన్నెలా సంతోషపెట్టాలో తెలియని సిబ్బందిని దారిలో పెట్టండి!
మీ చక్కని నడత మిగతా వారికి పాఠమయ్యేలా మెలగండి!

**ఛాంబర్లేన్** : తమ ఆలోచనల్ని కార్యరూపంలో పెట్టువాడు ధన్యుడు.
అందరికీ ఆనందం, చిన్నవాడికి కూడా జరగదు అపకారం.
మొక్కవోని ప్రశాంతత, వంచన లేని నడవడిక
మీరు నా హృదయాన్ని చదివితే నా జన్మ సార్ధకం!

నేను నా మనోనేత్రంతో చూస్తున్నాను, మహాప్రభూ!
ఆ ప్రశస్తమైన విందుకు తమరు విచ్చేసి
నేను పట్టుకున్న స్వర్ణకలశంలో తమ హస్త ద్వయాన్ని
శుభ్రం చేసుకుని, నావేపు సంతృప్తిగా చూస్తున్నట్లు!

**చక్రవర్తి** : ఇప్పుడు నా మనసు విందూ వినోదాలపై లేదు
అయినా ఆలోచిస్తాను, వాటిలో సరదా మరచేది కాదు.
**(మూడవ ప్రభువు వేపు)**
నీవిప్పుడు మా సెనెశ్చల్– మృగయా వినోదాధికారివి
మేము వేటాడే అడవులు, పొలాలు, పశుపక్ష్యాదుల గృహాలు
వీటన్నిటికి సంరక్షణాధికారిగా బాధ్యతలు స్వీకరించు
మాకిష్టమైన భక్ష్య పదార్ధాలను అందజేయగలవు.

**సెనెశ్చల్** : తమకు తొలి విందు భోజనం వడ్డించేంత వరకు
ఇప్పుడు, ఉపవాసముండటం నా మనసులో మాట
పాకశాస్త్ర నిపుణులు, మీరు కోరింది వడ్డిస్తారు.
అత్యంత రుచికరమైనవి, అరుదుగా లభ్యమయ్యేవి
తమ జిహ్వకు నచ్చేవి, మామూలువే అయినా మంచివి మీకందిస్తారు.

**చక్రవర్తి** : **(నాలుగవ ప్రభువుతో)**
యువకుడవైన ప్రభువువి! మాకు ఆత్మీయుడివి!
ఈ సామ్రాజ్యపు అధికార మధుశాలాధ్యక్షుడివై
'కప్ బేరర్'గా బాధ్యతలు నిర్వహించగలవు.
ఎల్లప్పుడూ మధువు లభ్యం కావాలి.
మన నేలమాళిగలు అత్యంత విలువైన మధుపానీయాలతో

పొంగి పొరలాలి!
అయినా పొదుపు అతిముఖ్యం!
అవకాశం దొరికిందని అతిసేవనం ప్రమాదకరం.

**మధుశాలాధ్యక్షుడు:** నేటిబాలుడే రేపటి యువకుడు.
కాలమెంత త్వరగా గడుస్తుందో తమకు తెలియంది కాదు.
రాబోయే ఆ గొప్ప విందును నేనూహిస్తున్నాను.
స్వర్ణ రజత పాత్రలలో తమకు మధువు అందిస్తాను.
తమ పెదాల్ని తాకేందుకు ప్రశస్తమైన పానీయాలు తెప్పిస్తాను.
వెనెషియన్ స్ఫటిక కలశాల్లో మధువు మిరుమిట్లు గొప్పగా
మరింత పదునెక్కుతుంది కాని మత్తులో ముంచెత్తదు.
కొందరు మధుకలశాల్ని మాయగా భావించనీ!
కాని, ప్రభువు ఆజ్ఞ మమ్మల్ని రక్షిస్తుంది అందరినీ!

**చక్రవర్తి** : మీకిచ్చిన బాధ్యతలను బహుమతులను స్వీకరించండి.
పత్రాలపై పొందుపరచి రాజముద్రను వేయించండి.
ఈ పనులు నిర్వహించే అధికారిని స్వాగతించండి!
**(ఛాన్సలర్ మరియు ఆర్చిబిషప్ ప్రవేశం)**

**చక్రవర్తి** : ఆఖరి రాయి పూర్తి చేస్తుంది శిలాతోరణపు వంపును,
పెన్నిధులున్న గదికి వేసే తాళం, చెవి దీర్ఘకాలం మన్నును.
వీరు నలుగురు నా ఆత్మీయులు, గృహం, సభ ఇత్యాదులు
పర్యవేక్షిస్తారు వీరు.
మీరు అయిదుగురూ ఈ సామ్రాజ్యాన్ని సుభిక్షంగా ఉంచగలరు.
మీకు వలసిన సంపదలను నేను ధారాదత్తం చేస్తున్నాను.
వాటిపై మీకుంటాయి సర్వహక్కులు!
మిత్రులారా! మీకిచ్చిన వాటిని మరింత వృద్ధి చేసుకోండి!
కొనండి! మార్పిడి చేసుకొనండి! హక్కులు పొందండి!
అన్ని హక్కులు ఏ ఇబ్బందులు లేకుండా మీవవుతాయి.
మీ మాటే ఆఖరిమాట! మీ నిర్ణయమే తుది నిర్ణయం!
ఏ న్యాయస్థానానికీ మీరు జవాబుదారీ కారు.
అద్దెలు, వసూళ్లు, సుంకాలు, రహదారి సుంకాలు,
రక్షణ శుల్కాలు, గనులపై అజమాయిషీలు అన్నీ మీవే!

టంకశాలలు, నాణేల ముద్రణ జరగాలి మీ కనుసన్నలలో!
మిమ్మల్ని తొలగించే అధికారం, ఈ సింహాసనం
పైన కూర్చున్న నాకొక్కరికే ఉంటుంది! అంతే!

**ఛాన్సలర్** : మా అందరి తరపున తమకు తెలియజేస్తున్నాను కృతజ్ఞతలు.
మా అందరి భోగభాగ్యాలు, మరింత వృద్ధి చేస్తాయి తమ సంపదలు.

**చక్రవర్తి** : మీ అయిదుగురికీ ఇస్తున్నాను ఇతర విశేషాధికారాలు.
నేను జీవించినంత కాలం నేను పాలిస్తాను.
రాబోయే కాలమెలా ఉంటుందో ఊహించలేను.
ఇప్పుడో రేపో, మిత్రులారా నేను మిమ్మల్ని విడిచివెళ్తే
మరొక చక్రవర్తిని ఎన్నుకోండి! కిరీట ధారణ చేయండి!
పవిత్ర పూజాపీఠం వద్ద అభిషిక్తుడిని చేయండి!
దేశాన్ని శాంతిభద్రతలతో చిరస్థాయిగా ఉంచి
కష్టాల తుఫాను పోయేంత వరకు కాపాడండి!

**ఛాన్సలర్** : ఎదల నిండా గర్వంతో మేము శిరసు వంచి ప్రణామం చేస్తున్నాము.
ఈ నేలపైనున్న శ్రేష్ఠమైన ప్రభువులం, తమ సేవకులం!
మా శరీరంలో తమపై విశ్వాసమున్న రక్తం ప్రవహిస్తున్నంత కాలం
తమ ఆజ్ఞ ప్రకారం నడుచుకుంటాం!

**చక్రవర్తి** : మనం ఇప్పుడు చర్చించినవన్ని లిఖిత పూర్వకంగా ఉండాలి
ఈ నాయకత్వ విధానాల్ని క్రమశిక్షణతో పాటించాలి.
సార్వభౌమత్వానికి సదా విధేయులై మెలగాలి!

**ఛాన్సలర్** : ఈ రాజ్యాంగాన్ని గ్రంథస్థం చేస్తాం!
తమ పవిత్ర సంతకానికి పంపిస్తాం!
నా కార్యాలయం ఆ పనిమీదే ఉంటుంది,
రాజముద్రతో అధికారం స్థిరపడుతుంది.

**చక్రవర్తి** : ప్రభువులారా! మీరు వెళ్లిరండి!
ఈ సుదినం గురించి తీరికగా తలపోయండి!
**(నలుగురు ప్రభువులు నిష్క్రమిస్తారు. ఆర్చిబిషప్ అక్కడే ఉంటాడు)**

**ఆర్చిబిషప్** : ఛాన్సలర్ వెళ్లిపోయాడు, ఆర్చిబిషప్ ఇక్కడే ఉన్నాడు.
తమ చెవిలో ఈ ముక్క వేయాలని తహతహలాడుతున్నాడు.
తండ్రిగా తన ఎదలోని బాధను తెలపాలనుకుంటున్నాడు.

**చక్రవర్తి** : ఈ సుదినాన తమను బాధపెడ్తున్న విషయమేమిటి?

**ఆర్చ్‌బిషప్** : దుఃఖంతో ఈమాట నేను చెబుతున్నాను,
తమరు సాతాను శక్తికి లొంగిపోయినారు.
సింహాసనం దక్కింది కాని, దానికి తమ యుక్తులు
మతాధిపతికి, దేవాధిదేవునికి నచ్చలేదు.
పోప్‌కు తెలిస్తే తమ సామ్రాజ్యాన్ని
పవిత్ర ఉరుములు పిడుగుల్తో నాశనం చేస్తాడు.

అతడు ఇప్పటికీ గుర్తు చేసుకుంటాడు–
తమరి పట్టాభిషేకం రోజున ఆ మంత్రగాడిని
మంటల్లో తగలబడిపోతున్నవాడిని
రక్షించిన వైనాన్ని, క్షమించిన విషయాన్ని!
ఆ విధంగా చర్చికి తమరు అపకారం చేసారు.
ఎందరో క్రైస్తవ అనుయాయులకు తప్పుదారి చూపించారు.
ఇప్పుడైనా మీ రొమ్మును తట్టి, తప్పును ప్రక్షాళన చేసుకోండి.

ఎక్కడైతే తమరు శిబిరాన్ని ఏర్పాటు చేసారో
ఆ యుద్ధరంగంలోనే, దుష్టాత్మలు తమతో
ఒప్పందం చేసుకున్న చోటులోనే,
డెవిల్‌కు మీరు చెవి ఒగ్గి విన్న ప్రదేశంలోనే,
ఒక పవిత్ర దేవాలయాన్ని నిర్మించండి.
మీ తప్పుకు మూల్యం చెల్లించండి.
ఆ దేవాలయాన్ని ఆకుపచ్చని మైదానాల్లో
ఎక్కడయితే పచ్చిక ఏపుగా పెరుగుతుందో
అక్కడ నిర్మించండి!
దగ్గర్లోని అడవులు, గుట్టలు దానికే చెందాలి!
చేపలతో నిండిన చెరువులు
అనేక సెలయేళ్లు, మైదానాలు, లోయలు
పొలాలు, సరస్సులు, ఇవన్నీ ఉన్న ప్రదేశంలో
పవిత్ర దేవాలయాన్ని నిర్మించి పాపవిముక్తులు కండి!

**చక్రవర్తి** : నా నేరం నన్ను కలవర పరుస్తున్నది.
తమరే సరిహద్దులను కొలిచి నిర్ణయించుకొనండి!

**ఆర్చ్‌బిషప్** : ముందుగా స్థలాన్ని శుద్ధి చేయాలి!
అత్యున్నత ప్రభువుకు అంకితం చేయాలి.
చుట్టూరా ఎత్తైన గోడలు, చూపుకందనివి
శిలువ ఆకారంలో మహా భవన సముదాయం
ప్రజలందరూ అత్యుత్సాహంతో లోనికి వస్తున్న దృశ్యం
కొండల్లో కోనల్లో ప్రతిధ్వనిస్తున్న చర్చి గంటల సవ్వడి
నింగికి ఎగబాకి మబ్బులతో మాట్లాడ్తున్న బురుజులు
కొత్త జీవితానికి స్వాగతం! కొత్త ప్రపంచానికి స్వాగతం!
త్వరలో- పవిత్రోత్సవం! తమరి రాక
ఆ దేవాలయ ప్రాంగణంలో తెలుపుతుంది
దేవాధిదేవునిపై తమ అత్యున్నత భావం, విశ్వాసం.

**చక్రవర్తి** : ఈ మహానిర్మాణం దేవుని ఘనతను కీర్తించనీ!
నా పాపాలను నిర్మూలించనీ! ఇది చాలు!
నా ఆత్మ పరిశుద్ధతనొందినది! నా హృదయం ఉప్పొంగుతున్నది.

**ఆర్చ్‌బిషప్** : ఛాన్సలర్‌గా నాకొక బహుమతి పత్రం అవసరం.

**చక్రవర్తి** : కాగితం వ్రాసుకురా! చర్చికి రాసిస్తాను.
కావాలంటే పత్రంపై సంతకం చేసిస్తాను.

**ఆర్చ్‌బిషప్** : **(వెళ్లబోతూ వెనక్కి తిరిగి)**
ఈ భూమిపై సర్వహక్కులూ చర్చికి చెందుతాయి.
అద్దెలు, వసూళ్లు, సుంకాలు, రహదారి సుంకాలు,
అన్నిరకాల పన్నులు, ఆదాయాలు కూడా-
నిర్వహణా ఖర్చుల నిమిత్తం కొంత బంగారం,
తమరు సంపాదించిన దానిలో కొంత భాగం
దానితో ఆలయ నిర్మాణం పూర్తవుతుంది.
తమకు విన్నవిస్తున్నాను- రవాణా ఖర్చులు,
దూలాలు, చెక్కలు, సున్నం, పలకరాయి,
ఇత్యాదులు తమరు కొంత, భక్తులు కొంత చెల్లిస్తారు.
మేము వారికి మత బోధ చేస్తాం ఉచితంగా!
గుర్రం, బండి ఉన్నవాళ్లు ధన్యులు,
చర్చికి సేవచేసే భాగ్యం వారికి కలిగింది.
**(నిష్క్రమిస్తాడు)**

**చక్రవర్తి** : ఈ పాపభారం చాలా ఎక్కువే!
ఆ మంత్రగాళ్లకు కొద్దిగా చెవి ఒగ్గాను,
మరీ ఇంత ఖరీదని జన్మలో ఊహించలేను.

**ఆర్చ్‌బిషప్** : **(తిరిగివచ్చి నమస్కరిస్తూ)**
తమరు క్షమించాలి! ఆ ధూర్తమానవుడికి
తీరపు నేలపై హక్కులు రాసిచ్చారని తెలిసింది!
ఆ నేల, అతడు శపించబడతారు,
అలా వద్దనుకుంటే ఆ తీరంపై సర్వహక్కులూ
రాసివ్వాలి తమరు చర్చికి.
అద్దెలు, పన్నులు, సుంకాలు వగైరా వగైరా...
తమ తప్పుకు ప్రాయశ్చిత్తంగా...

**చక్రవర్తి** : **(చిరాకుగా)–**
అటువంటి నేల లేదు కదా తీరాన,
ఇంకా అది నీటి అడుగున ఉన్నది దూరాన!

**ఆర్చ్‌బిషప్** : మాకు హక్కు రాసివ్వండి చాలు.
కాలం గడిస్తే, అదే బయటపడుతుంది,
మీ మాట, మాకు తెలుసు,
అది లిఖిత పూర్వక పత్రం కన్నా సత్యమని.
**(నిష్క్రమిస్తాడు)**

**చక్రవర్తి** : **(ఒంటరిగా)**
ఎందుకితడు పోస్తాడు అగ్నిలో ఆజ్యం!
ఒక్కసారే రాసిస్తే పోలా మొత్తం సామ్రాజ్యం!

# అయిదవ అంకం (Act V)

## 17. మైదానం (Open Country)

**బాటసారి** : అరుగో వాళ్లు– నల్లగా, దృఢంగా ఉన్నారు.
ఎన్ని దేశాలు తిరిగానో నేను,
ఆ లిండెన్లు మళ్లీ ఇక్కడ కనిపించారు.
అప్పుడు నేనున్న గుడిసె తుఫాను గాలికి ఊగులాడేది.
ఇసుక తిన్నెల మీద ఇప్పుడు నేనున్నాను.
ఆశ్చర్యం! ఆ ప్రదేశమే ఇది! ఇసుక ఎలా వచ్చింది?
అప్పుడు నన్ను ఆదరించిన వృద్ధ జంట
మృదుభాషణులు, దైవభీతి కలవారు
ఇంకా వారిక్కడే ఉన్నారంటావా?
అప్పటికే వారు వయసు పైబడినవారు.
తలుపు తట్టనా? ఎలుగెత్తి పిలవనా?
నా అభివాదములు! దేవుడు వారికి
చిర జీవనమిచ్చినందుకు!

**బాసిస్** : **(వృద్ధురాలు)–**
అపరిచితుడా! నెమ్మదిగా పిలవగలవా!
నా భర్త ఇంకా నిదురపోతున్నాడు.
దీర్ఘ రాత్రుల విశ్రాంతి అతడికి కావాలి.
హ్రస్వ దినాల్ని శక్తితో గడపడానికి.

**బాటసారి** : అవ్వా! మీకు గుర్తుందా!
మీరు సముద్రం నుంచి రక్షించిన
ఓ యువకుడు జ్ఞప్తికి వస్తున్నాడా!
బాసిస్! మృత్యువు తన శీతల చుంబనాలతో
నన్ను గడ్డకట్టిస్తున్నపుడు, నా ఘనీభవించిన
రక్తాన్ని తిరిగి ప్రవహింపజేసినారు మీరు.
**(భర్త వస్తాడు)**
నీవు, ఫిలెమాన్, ధైర్యంగా నా నిధిని
వరద నుంచి లాగి కాపాడినావు.

నీది అనుకూలమైన అగ్ని
వెండి శబ్దాల నిచ్చే చిరుగంట
నన్ను ఆపద నుంచి రక్షించిన మీరే
నా ఎదలోని ఆవేదన గ్రహించగలరు.
ఈ తీరం వద్ద నిలబడి ప్రార్థిస్థాను.
**(ఇసుక తిన్నెపై అడుగు ముందుకు వేస్తాడు)**

**ఫిలెమాన్** : **(బాసిస్‌తో)**
త్వరగా, మనం ఇక్కడ బల్లను ఉంచుదాం!
ఈ చెట్లు పూలు వీటన్నిటి మధ్య;
అతడిని వెళ్లనీ; నమ్మలేకపోతున్న
జగతిలోని మార్పును కనులారా చూడనీ!
**(బాటసారి పక్కనే నిలబడి)**
ఒకప్పటి నీ శత్రువులు,
నురగతో నిండిన భీకర తరంగాలు,
అవి ఇప్పుడు అందాల ఉద్యానవనాలు,
ఈ అమరలోకపు వనాన్ని ఆనందించు!
ఈ మహా కార్యానికి సాయం చేసేంత
శక్తి నాకిప్పుడు లేదు. ఆరోగ్యం మరింత క్షీణిస్తుంది.
సముద్రం మరింత వెనక్కి వెళ్తుంది.
తెలివిగల ప్రభువులు, నిపుణులైన సేవకులను పంపినారు.
ఆనటకట్టలు, గోడలు కట్టి చెలియలికట్ట నాపినారు.

ఒక్కరోజులో అలల జన్మహక్కును దొంగిలించి
సముద్రపు పొంగును సర్దినారు.
ఇప్పుడిక్కడ ఆకుపచ్చని పొలాలు; తోటలు
వనాలు, గ్రామాలు, అన్ని దిక్కులా పెరిగాయి.
మిత్రమా! రా! సూర్యాస్తమయం కానున్నది.
మనం కాస్త ఎంగిలి పడదాం!
ఆ సుదూరపు తెరచాపల నావలు
రాత్రి రక్షణను వెదుక్కుంటున్నాయి.
గూటికి చేరే పక్షుల్లా రేవుకు చేరనున్నాయి.

ఇప్పుడు నీవు నీలిసముద్ర తీరాన్ని
కడుదూరంలో చూడగలవు.
సముద్రానికి ఇక్కడకు మధ్య ఉన్న నేలపై
నూతన జనావాసాలు వచ్చేసాయి.
**(ముగ్గురూ బల్లవద్ద కూర్చుంటారు)**

**బాసిస్** : మౌనంగా ఉన్నావేం, మిత్రుడా!
ఆహారం నీకు ఆనందం కలిగించలేదా!

**ఫిలెమాన్** : అద్భుతాలను గురించి వివరించు, బాసిస్!
అతడు వినేది, నీవు చెప్పాలనుకున్నది వర్ణించు!

**బాసిస్** : అవును! ఆ అద్భుతాలు! ఈ వింత సంగతులను
చూసి మరింత అచ్చెరువు చెందుతున్నాను.
ఏమిటో ఈ అసహజమైన తొందర
ప్రకృతి విరుద్ధంగా ప్రవర్తించే ఈ చిందర వందర!

**ఫిలెమాన్** : చక్రవర్తి పాపం చేస్తాడా?
అతడిని సముద్ర తీరానికి ప్రభువుగా ప్రకటించాడు!
అతడి దూత బాకా ఊదుతూ
ఆ విషయం స్పష్టం చేస్తున్నాడు.

ఈ ఇసుక తిన్నె వద్ద ఇలా మొదలయ్యింది.
వరదపై ఆధిపత్యం ప్రారంభమయ్యింది.
ముందు గుడారాలు, కొన్ని గుడిసెలు
ఇప్పుడు ఆకుపచ్చని మైదానంలో రాజభవనాలు.

**బాసిస్** : బానిసలు శ్రమించారు; దెబ్బ మీద దెబ్బ
పలుగూ పారా పనిచేయలేదు.
అప్పుడు రాత్రిపూట చూసాం మేము.
ఏవో వెలుగులూ, నిప్పురవ్వలూ!
మరుసటి రోజుకల్లా కనిపించిందో ఆనకట్ట.
నరబలి ముగిసిందొక తంతు.
నిప్పులు కురిసాయి, అగ్ని ప్రవాహాల్లా

రాత్రంతా అరుపులూ ఏడ్పులూ విన్నాం మేము;
తెల్లవారే కల్లా అక్కడో కాలువ
దేవుడు లేని వాడతడు
మా గుడిసె కావాలంటాడు, ఈ చెట్లు కూడా!
పొరుగువాడిగా అతడు ప్రభువు
అతడిని సేవించాలా లేదా నీవే నుడువు!

**ఫిలెమాన్** : అయినా, అతడు మాకోసం,
చూపించాడు కొత్త నేలలో ఓ గృహం!

**బాసిస్** : ఆ నేలను నేను నమ్మలేను,
మనం ఉన్నచోటే మనకు రక్ష అంటాను.

**ఫిలెమాన్** : పద! చూద్దాం! సూర్యుని ఆఖరి కిరణం!
మన గుడిగంట మోగగానే
మోకరిల్లి ప్రార్థిద్దాం!
మన దేవుని నమ్ముకుందాం, వెనకటిలానే!

# 18. రాజభవనం (Palace)

**(అందాల ఉద్యానవనం. సన్నని పొడుగాటి కాలువ.**
**ఫాస్ట్ అత్యంత వృద్ధుడిగా మెల్లగా నడుస్తున్నాడు.**
**లిన్సెయస్ – కాపలావాడు మాట్లాడుతున్నాడు)**

**లిన్సెయస్** : సూర్యాస్తమయం, ఆఖరి నౌకల ఆగమనం!
నెమ్మదిగా అవి రేవులోకి పయనం.
త్వరలో ఒక ఎత్తైన నౌక రానున్నది.
ఈ కాలువలో హుందాగా పయనించనున్నది.

చూడండి! ఆ రెపరెపలాడే జెండాలు.
ఆ ఎత్తైన తెరచాప దూలం, తాళ్లు
నౌకాసిబ్బంది చేస్తున్నారు అభివాదం
తమకు అందిన మంచి అదృష్టం.
**(ఇసుక తిన్నెపై నుంచి గుడిగంటలు వినవస్తాయి.)**

**ఫాస్ట్** : **(ఆగ్రహంతో)–**
వెధవ గంటలు! వెనక నుంచి దూసుకువచ్చి
గాయం చేసే తుపాకి గుండులా బాధపెడ్తున్నాయి.
ఆ ముందున్నదంతా నా విశాల సామ్రాజ్యం,
నా వెనక ఈ తలనెప్పి వ్యవహారం.
ఈ చిరుగంటల సవ్వడి గుర్తు చేస్తున్నట్లుంటుంది
నా ఘనమైన రాజ్యసంపదలు అపవిత్రమని.

ఆ లిండెన్ వృక్షాలు, ఆ పూరిగుడిసె
ఆ ఒరిగిపోతున్న దైవమందిరం నావి కావు.
ఆ ఆకుపచ్చని ప్రదేశంలో నేను తిరగలేను.
అక్కడ ఎవరిదో నీడ నాపై పడుతుంది.
అది నా పాదాలను, కళ్లను, చెవులను చెదరగొడ్తుంది.
అక్కడ నుంచి ఎలా తప్పించుకోవడం?

**లిన్సెయస్** : ఇప్పుడు, సాయంకాలపు పిల్లతెమ్మెరలలో
ఈ నౌక విలాసంగా పయనిస్తున్నది.
ఎంత వేగంగా ఉన్నది దీని నడక!

సంచులు, పెట్టెలు నింగిని తాకుతున్నా చెదరక!
**(అద్భుతమైన నౌక, అనేక విదేశ వస్తువులతో–**
**మెఫిస్టోఫిలిస్ తను ముగ్గురు మహా మనుషులతో వస్తాడు)**

**బృందం** : తీరానికి స్వాగతం!
తిరిగి వచ్చేసాం!
మన ప్రభువుకి జయం!
సిబ్బంది అభివాదం!
**(నౌక దిగి సరకులను చేరవేస్తారు).**

**మెఫిస్టోఫిలిస్** : మన పని దిగ్విజయంగా పూర్తిచేసాం,
యజమానికి సంతోషాన్ని కలిగిస్తాం!
రెండు నౌకలతో ప్రయాణం ప్రారంభించాం,
ఇరవై నౌకలతో దిగ్విజయంగా తిరిగివచ్చాం!
మనం తెచ్చిన సరుకు తాను చెబుతుంది,
మన మహాకార్యాలను కళ్లకు కడుతుంది.
సముద్రం ఎవరి అభిప్రాయాలనువారికి ఉంచుతుంది,
ప్రయాణంలో కష్టాలను గుర్తుకు తెస్తుంది.
చేపను పట్టాలన్నా, నౌకను పట్టాలన్నా
ఒడుపు కావాలి, విడుపు లేకుండా పట్టుకోవాలి.
మూడు నౌకలు దొరికాయనుకో
నాలుగోది తనంతట తానే దొరికిపోతుంది.
అయిదో దానికి అవకాశమేముంటుంది?
నేలమీదైనా, నీటిపైనైనా బలానిదే రాజ్యం!
ఎలా అని కాదు, ఎంత అనేది ముఖ్యం!
నావికుడికి తెలవాల్సింది త్రివ్యవహార తత్త్వం.
యుద్ధం, వ్యాపారం, సముద్రపు దొంగతనం.

**ముగ్గురు మహామనుషులు (Three Giants):**
కృతజ్ఞతలు లేవు మమ్మల్ని కలిసినందుకు,
మాటలు రావు మమ్మల్ని అభినందించేందుకు,
మా యజమాని అనుకుంటాడు
మా సరుకు కంపుగొడ్తుందంటాడు.
అతని ముఖంలో కనిపిస్తుంది

అత్యంత నిరాశా, విచారం,
అతడికెందుకో నచ్చదు, గుప్త నిధుల వ్యవహారం.

**మెఫిస్టోఫిలిస్ :** ఇక మీకు ఇవ్వాల్సిందేమీలేదు.
మీ వాటా మీరు కొట్టేసారు.
ఇంకెందుకు ఈ సణుగుడు?

**ముగ్గురు :** మా కష్టాలు కొండంత,
మాకు దక్కింది గోరంత!
శ్రమకు తగ్గ ప్రతిఫలం
కోరుతున్నాం మేమంతా!

**మెఫిస్టోఫిలిస్ :** ముందు లోపలికి పొండి,
విలువైన వస్తువులతో గదులు నింపండి.
ఈ భువిలోకల్లా గొప్ప ధనరాశుల్నతడు చూస్తాడు.
ఆ తరువాత ఏది తగినదో తీర్మానిస్తాడు.
అతడు మీరడిగింది ఇస్తాడు.
సిబ్బంది సేవలను ప్రశంసిస్తాడు.

రేపు అరుదైన పక్షులు కానవస్తాయి.
అవి నా బాధ్యతలో భాగంగా అరుదెంచుతాయి.
**(సరుకు తీసివేయబడ్తుంది.)**

**మెఫిస్టోఫిలిస్ :** ఎందుకీ విషాదపు దృక్కులు, కనుబొమల ముడులు?
అనంతమైన అదృష్టం పలుకుతుండగా స్వాగతం!
నీ అపారమైన విజ్ఞానంతో కట్టడిచేయబడింది సాగరతీరం!
ఇప్పుడు నేలపై నుండి అతి తేలికగా
సముద్రంలోకి సాగుతున్నది నౌకా ప్రయాణం.
నీ కౌగిలిలో ఉన్నది ఈనాడు సమస్త ప్రపంచం!

నీ రాజ్యం మొదలైంది ఈ ప్రదేశాన,
మొదటి పాక వేసింది, ఇక్కడే అవునా!
ఇక్కడే తవ్వింది మొదటి కందకాన్ని
ఇప్పుడక్కడ కదుల్తున్నాయి నౌకల తెడ్లన్నీ,
నీ ప్రణాళిక, మా ఆచరణ, శ్రమ

నిన్ను నేలకు నీటికి చేసాయి ప్రభువును.
ఇక్కడ నుండి-

**ఫాస్ట్** : ఇక్కడ ఆ మాట వినదలుచుకోలేదు నేను
నా బాధకు అదే పల్లవి, అనుపల్లవీను.
నీవేం తెలివితక్కువ వాడివి కాదు.
ఇది నా ఎదను రెండుగా చీల్చివేస్తున్నది.
ఈ బాధను ఇంకొక్క రోజు కూడా భరించలేను.

అలా చెప్పడానికి కూడా సిగ్గుపడుతున్నాను.
ఆ వృద్ధులు లొంగిపోవాల్సిందే!
ఆ లిండెన్ వృక్షాల తోపును,
నా విహార స్థలంగా ఎంచుకున్నాను.
నాది కాని ఆ కాస్త చోటు
ఈ ప్రపంచమంతా నా సింహాసనమైనా, చూపిస్తున్నదేదో లోటు.

శాఖ నుంచి శాఖకు ఎత్తైన గడపలు కట్టి
సుదూర తీరాల్ని చూద్దామనుకున్నాను.
అంతెత్తు నుంచి నా సామ్రాజ్యాన్ని వీక్షిద్దామనుకున్నాను.
మానవ సృష్టిలో మహాద్భుతాన్ని
మానవ నిర్మిత ఎత్తుల నుంచి గమనిస్తాను.

కాని ఈ బాధ భరించరాకున్నది.
ధనవంతుడు తాననుకున్నది పొందలేదన్నది.
ఆ లిండెన్ వృక్షాల పరిమళం, ఆ గుడిగంటలు,
నన్ను అంత్యక్రియల దృశ్యంలోకి నెడ్తున్నాయి.
నా ఇచ్ఛ, నా అజ్ఞ ఆ ఇసుక దిబ్బ
వద్ద విరిగిపోతున్నాయి.
నేనెలా ఈ మానసిక ఘంటారావాన్ని
తొలగించుకోగలను, ఆ చిరుగంటలతో చెలరేగుతున్నదాన్ని?

**మెఫిస్టోఫిలిస్** : అటువంటి నిరాశాజనక విషయాలు
జీవితాన్ని నిస్పృహలోకి నెడతాయి.
ఈ శాపోహత చిరుగంటల నాదాలు
గొప్పవాళ్ల చెవుల్లో గబ్బుకొడతాయి.

డింగ్‌డాంగ్ శబ్దాలు, కింకిణీ రవాలు
సాయంకాలపు మబ్బుల్ని తరిమివేస్తాయి.
జీవితంలోని ప్రతిఘట్టాన్నీ చీకాకు పరచి
పుట్టుక నుంచి గిట్టేవరకూ మోగుతూ ఉంటాయి.
జీవితం అనేది ఒక స్వప్నం లాంటిది.
డాంగ్‌తో మొదలై డింగ్‌తో ముగుస్తున్నట్లు
అంతా ఒక కల! ఒక భ్రమ! కాని ఇది నిజమా!

**ఫాస్ట్** : వాళ్ల వ్యతిరేకత, మొండితనం,
నా సుఖశాంతులను చేస్తున్నాయి ధ్వంసం.
ఈ తీవ్రమైన బాధతో నేను
న్యాయంగా ఉండటాన్ని భరించలేకపోతున్నాను.

**మెఫిస్టొఫిలిస్** : ఇంత రాత్రిపూట, అవసరమా వ్యాకులత?
ఈ సామ్రాజ్యంలో నీవే కదా అధికార నిర్ణేత!

**ఫాస్ట్** : అవును! వారిని నా దారి నుంచి తొలగించు!
వారిని నేను నిర్మించిన కొత్త ఇంట్లోకి తరలించు!

**మెఫిస్టొఫిలిస్** : అవసరమైతే బలవంతాన ఎత్తిపడేస్తాం
ఒక్క క్షణం పని, వాళ్లకు కూడా తెలీదు.
బాధను వాళ్లు సంతోషంగా భరిస్తారు.
కొత్త చోటులో త్వరగానే సర్దుకుంటారు.
**(ఈల వేయగానే ముగ్గురు మహామనుషులు వస్తారు)**
ప్రభువు నుండి వచ్చింది ఆదేశం!
రేపు జరుపుకుందాం విందూ, వినోదం!

**ముగ్గురూ** : ఇక్కడ మాకు లభించలేదు స్వాగతం,
విందూ వినోదాలే మా మనోగతం.

**మెఫిస్టొఫిలిస్** : **(ప్రేక్షకుల వేపు తిరిగి)**–
మళ్లీ పాతకథే! మీరు వినలేదా
'నబోత్' ద్రాక్షతోట, ఆ కథా, వ్యథా!

# 19. రాత్రి (Deep Night)

**లిన్సెయస్ : (కాపలా భటుడు – కోట బురుజుపై పాడుతున్నాడు)**

కాపలా భటుడిని నేను
పుట్టుకతో దూరదృష్టి కలవాడను.
ఈ బురుజే నా నివాసం
ఇక్కడ నుంచే భూమివేపు చూస్తాను.

దగ్గరగా దూరంగా ఉన్న నేలను
దూరంగా దగ్గరగా ఉన్న ప్రపంచాన్ని
చంద్రికను, తారలను
అడవులను లేళ్లను అన్నిటినీ చూస్తాను.

అన్నిటిలోనూ నేను
శాశ్వత సౌందర్యాన్ని చూస్తాను.
నేనూ, ఈ ప్రపంచం
రెండూ నాకిస్తాయెంతో సంతోషం.

నేత్రాలు ఆశీర్వదింపబడినవి,
వర్ణిస్తాయి తాము చూసినవి.
వాటినలాగే ఉండనీ,
దానినలాగే ప్రేమించనీ!
(విరామం)

నేను జాగరూకతతో ఉంటాను.
ఆనందం కోసమే కాదు
రాత్రిపూట విస్తరించే భీభత్సం
ఆకాశంలో చూపించే హెచ్చరికలు గమనిస్తాను.

నిప్పురవ్వలు చెల్లాచెదురుగా వర్షిస్తున్నాయి.
ఆ రెండు లిండెన్ వృక్షాలగుండా మండుతున్నాయి.
పైన అగ్నిజ్వాలలు పేట్రేగుతున్నాయి.
వాటి వేడితో అవే ప్రజ్వరిల్లుతున్నాయి.

ఇప్పుడు ఆ గుడిసె అంటుకున్నది.
తడిగా నాచుతో కప్పబడినది.

రక్షించే విధానమే లేదిప్పుడు,
ఎవరు సాహసిస్తారు అటు వచ్చేందుకు?

ఆ వృద్ధులకు పొగలో ఊపిరాడదు.
తమ ఇంటి నెగడు వద్ద నిదురిస్తూ
తమ పని తాము చేసుకునే మంచివారికి
ఎటువంటి విషాదకరమైన అంతం, అయ్యో పాపం!

మంటలు నాలుకలు చాచి స్తంభాలనంటుకున్నాయి.
ఎర్రటి బొగ్గుల్లా అవి కణకణ కాలుతున్నాయి.
ఎంత భీభత్సంగా ఉందీ దృశ్యం.
వారు తప్పించుకోగలరా? బతికి బట్టకడతారా?

మెరుపు తీగెలు జిహ్వాలుగా
ఆకులు శాఖల గుండా దూసుకుపోతున్నాయి.
ఎండు పుల్లలు చిటపటలాడుతూ మండుతున్నాయి.
నల్లబడి ముక్కలై నేలరాలుతున్నవి.

శాపోహతమైన నేత్రాల్లారా!
ఎందుకీ దృశ్యాన్ని చూస్తున్నారు?
ఈ అవాంఛిత వరాన్ని నా నుంచి తీసివేయండి!
కూలిపోతున్న గోడల బరువుకు
గుడి నేలమట్టమవుతున్నది.
పాముల్లా పైకెగబాకుతూ మంటలు
వృక్షాల పైశాఖలను కాల్చుతున్నాయి.
చెట్టు తొర్రలు మంటల్లో ప్రజ్వరిల్లుతూ
వాటి వేళ్లను వెలుగులో చూపిస్తున్నవి.

**(బాగా విరామం, తర్వాత పాట)**

ఎంతో అందంగా ఉండే ఓ దృశ్యం
పాతకాలం కథలా అయ్యింది అదృశ్యం.

ఫాస్ట్ : **(వీధి వసారాలో నిలబడి ఇసుక తిన్నెలవేపు చూస్తుంటాడు)**
పైనుంచీ వినవస్తున్నదో విషాద గీతం,
మెల్లగా నను చేరుకున్నవా పదాలు, సంగీతం.

అది నా కాపలా భటుడి దుఃఖపు పాట
నా అసహనపు కార్యం నన్ను వెక్కిరిస్తున్నదీ పూట.

ఆ లిండెన్ చెట్లు కూలితేనేం,
కూలి సగం కాలిన కర్రలుగా మిగిలితేనేం,
అక్కడ నేనొక ఎత్తైన కాపలా బురుజును నిర్మిస్తాను.
చుట్టూరా, అన్నిదిక్కులా చూసేందుకు కట్టిస్తాను.

అదిగో దూరంగా ఆ కొత్త గృహం
ఆ వృద్ధజంటకు ఇస్తానందులో ఆశ్రయం
వాళ్లు నా దాతృత్వాన్ని పొగడుతారు.
తమ వృద్ధాప్యాన్ని హాయిగా గడుపుతారు.

**మెఫిస్టొఫిలిస్ ముగ్గురు మహామనుషులు (క్రింది నుండి)**
మేం వచ్చాం పని ముగించుకుని,
వాళ్లు మమ్మల్ని అర్థం చేసుకోలేదు.
అవసరం పడింది కొంత బలప్రయోగం
తలుపు తట్టాం, బాదాం; తప్పలేదు.
బెదిరించాం, బతిమలాడాం, వాళ్లు వినలేదు.
ఎంత మొత్తుకున్నా తలుపు తీయలేదు.
ఒక్క అంగుళం కూడా బెసకలేదు.
తలుపులు పగలగొట్టి లోనికెళ్లాం!
బిర్రబిగుసుకున్న ముఖాలతో వాళ్లు,
అది మామూలే అటువంటి పరిస్థితుల్లో!
మాకూ అది మామూలే ఆ పరిస్థితులు
మాలో తగ్గలేదు జవసత్వాలు.
గట్టిగా పట్టుకుని ఓ మూలకు విసిరికొట్టాం!
పాపం, ముసిలోళ్లు! భయంతో చచ్చారు.
వాళ్లతో ఉన్నాడు ఓ అపరిచితుడు
అతడు కత్తి దూసాడు, మేమూ దూసాము.
కొద్ది క్షణాల్లో ముగిసింది అంతా!
కాసిని బొగ్గులు, కొద్దిగా ఎండుగడ్డి
ఎగిసింది మంట, ఆకాశమంతెత్తు.
కాసింత మంట అయ్యింది ముగ్గురికి చితిమంట!

**ఫాస్ట్** : ఇదా నాకోసం మీరు చేసానన్న పని!
వాళ్లను స్థలం మార్చమన్నాను, కాని
చేయమని చెప్పలేదే దోపిడీ!
చెవిటి సన్నాసులు, శపిస్తున్నా మీ పనిని
నాతోపాటు మీరూ అనుభవించండి శిక్షని.

**అందరూ బృందంగా–**
ఇదీ సారాంశం! నీతి కథాంశం!
బలవంతుడిని ఎదుర్కోవద్దెన్నడూ
పోట్లాటకు దిగరాదెప్పుడూ
దిగితే పోతాయి, ఇల్లూ, ఇల్లాలు, ప్రాణం!
**(వెళ్లిపోతారు)**

**ఫాస్ట్** : **(బాల్కనీలో నుంచి)**
తారలు తమ కాంతిని దాచుకున్నాయి.
అగ్ని మందగించి చల్లారుతున్నది.
గాలి కొద్దిగా వీచి అంగారాలను మండిస్తున్నది.
ఆ పొగ నావేపు మంద్రంగా వీస్తున్నది.
తీవ్రమైన ఆజ్ఞ, త్వరితంగా పాలన
ఏమిరాన్నుదో, ఎగుర్తున్న నీడలా!

# 20. అర్ధరాత్రి (Mid Night)

**(నలుగురు వృద్ధ వనితలు)**

**మొదటి వనిత:** నాపేరు కోరిక (Want)

**రెండవ వనిత :** నా పేరు ఋణం (Debt)

**మూడవ వనిత:** నాపేరు రక్షణ (Care)

**నాలుగవ వనిత:** నాపేరు అవసరం (Need)

**వాళ్లలో ముగ్గురు:** తలుపు తెరుచుకోదు
మేము లోపలికి వెళ్లలేము.
ఇది ధనవంతుడి లోగిలి.
వేరే దారేదీ లేదు.

**కోరిక :** నేను అక్కడ నీడను.

**ఋణం :** నేను అక్కడ లేను.

**అవసరం :** నన్నెవరూ పట్టించుకోరు, నా అవసరం లేదు.

**రక్షణ :** మీరు బయటకు తరమబడినారు.
అక్కలారా! మీరిక్కడ ఉండతగరు.
కాని ఈ తాళం రంధ్రం గుండా
రక్షణ వెళ్తుంది లోనికి నిండా!
**(రక్షణ అదృశ్యమౌతుంది)**

**కోరిక :** అక్కలారా! పోదాం పదండి!

**ఋణం :** నేను నిన్ను అనుసరిస్తాను, ముందు నడువు నీవు.

**అవసరం :** నేనూ వస్తాను మీతో, ఊపిరంత దగ్గరగా.

**ముగ్గురూ :** నల్లమబ్బులు కమ్ముకుంటున్నాయి
నక్షత్రాలు అదృశ్యమవుతున్నాయి.
దూరం నుంచి, సుదూరం నుంచీ
ఎవరో, ఎవరో ఇటు వస్తున్నది!
అతడే, అతడే మన సోదరుడు– మరణం
వస్తున్నాడు, మృత్యురూపంగా వస్తున్నాడు.

ఫాస్ట్ : **(భవనంలో)**

నలుగురు రావడం చూసాను నేను.
ముగ్గురు వెళ్లిపోయారు, అదీ చూసాను.
వాళ్లేం మాట్లాడుకున్నారో అర్ధం కాలేదు.
ఎవరో అన్నారు 'ఋణం'
అలాంటి మాటే అనుకున్నారు.
నేను విన్న మాట కాదు కదా 'మరణం'?
చీకటి బోలు పదం అది. పిశాచ ధ్వని.
భూతాల నిట్టూర్పు.
నేనింకా స్వేచ్ఛకై విడివడలేదు.
నావారి నుంచి మాయను తొలగించలేదు.,
మరిచిపో మంత్రతంత్రాల్ని.
ప్రకృతితో పోరాడాలి ఇక ఒంటరిగానే!
స్వశక్తితో నిలబడిన మనిషే జీవించడానికి అర్హం!

నేను చీకటిని శోధించడానికి పూర్వం
నన్ను నేను వినాశకరమైన మాటలతో
శపించుకుని, ప్రపంచాన్ని శపించాను.
ఎలా వదిలించుకోవాలో తెలిసి ఉంటే
వదిలించుకునే భూతశక్తులతో
ఇప్పుడు గాలి నిండి వున్నది.
పగటి కాంతి స్వచ్ఛంగా, నిర్మలంగా కనిపించగా
రాత్రి మనల్ని తాను నేసిన స్వప్నాల వలలోకి లాక్కుంటుంది.
మంచు కురిసిన పొలాల్నుండి అశుభాలు అరుస్తాయి.
మన చుట్టూరా మూఢనమ్మకాల ఉచ్చులుంటాయి.
కనీ కన్పడని రూపాలు వెంటాడుతూ
జాగ్రత్త జాగ్రత్త అని హెచ్చరిస్తాయి.
మనం భయపడి వెనకడుగు వేస్తాం,
ఒంటరిగా ఉన్నామనుకుని వణికిపోతాం.
తలుపులు కీచుమంటాయి.
ఎవరూ లోనికి రారు.

**(ఉలిక్కిపడి)**

ఎవరక్కడ తలుపు దగ్గర?

**రక్షణ** : నీవు ప్రశ్నించావు, జవాబు చెప్పవలెనా?

**ఫాస్ట్** : ఎవరు నీవు?

**రక్షణ** : నేనిక్కడ ఉన్నాను. ఇక్కడ ఉన్నది నేను.

**ఫాస్ట్** : వెళ్లిపో!

**రక్షణ** : నేనెక్కడ ఉండాలో అక్కడే ఉన్నాను.

**ఫాస్ట్** : **(ముందు కోపంగా, తరువాత ప్రశాంతంగా తనలో)**
నేనిప్పుడు మంత్ర తంత్రాల సాయం తీసుకోను.

**రక్షణ** : నేను మానవ చెవులకు వినబడకపోయినా
ప్రతిధ్వనించే హృదయం నేనంటే భయపడ్తుంది.
ఎప్పుడూ మారే మారువేషంతో
నేను నరుల జీవితాల్ని నియంత్రిస్తాను.
రహదారులపై, నీటిపై మనుషులు
నాతోపాటు ఉద్విగ్నంగా పయనిస్తారు,
పక్కనే ఉన్నా పట్టించుకోరు
తిడతారు, పొగుడుతారు,
నాపేరు రక్షణ!
నీ దారిలోకి ఎప్పుడైనా వచ్చానా?

**ఫాస్ట్** : ఈ భూ ప్రపంచాన్నంతా కలయదిరిగాను.
దారిలో అందిన ప్రతి సంతోషపు జుట్టూ పట్టుకున్నాను.
నన్ను సంతృప్తి పరచని దానిని వదిలేసాను.
నా పట్టు జారిన వాటిని జారనిచ్చాను.
కోరుకున్నది సాధించాను.
మరలా కొత్తదానికై అర్రులు సాచాను.
అలా జీవితంలో తుపానుగా దూసుకుపోయాను.
మొదట్లో గర్వం, హింస అధికంగా ఉన్నా
తరువాత కాస్త నెమ్మదిగా, ఆలోచనతో నడుచుకున్నా!
ఈ భూగోళం పై చూసింది చాలు!
ఇక్కడ నుంచి పైకి చూసే వీలులేదు.
మూర్ఖుడు తన మర్త్య నేత్రాలతో
ఆకాశం పైనున్న మానవ జీవితాన్ని చూడాలని స్వప్నిస్తాడు.

అటువంటివాడు ఈ లోకంలోనే నిలబడాలి దృఢంగా,
తన చుట్టూరా గమనించాలి ధైర్యంగా,
పొందగలిగింది ఎంతో ఉందిక్కడ.
ఎందుకు కాలరహితమైన దానిలోకి పోడానికి వెంపర్లాట!
మనసు గ్రహించిన దానిని స్వంతం చేసుకోవచ్చు.
అలా ఈ నేలలోనే ప్రయాణించాలి,
ఆత్మలు, భూతాలు వెంటాడినా తన దారిలోనే నడవాలి!
సుఖమైనా, దుఃఖమైనా వేసే 'ముందడుగు'లో ఉండాలి.
ప్రతిక్షణం అసంతృప్తినే మిగిల్చాలి!
అలా మానవుడి అన్వేషణ అనంతంగా కొనసాగాలి.

**రక్షణ** : నా రక్షణలో ఉన్న మనిషికి
అతడి ప్రపంచం మరణిస్తుంది
లేదా నిద్రలోకి పోతుంది.
శాశ్వతమైన చీకటి కమ్ముకుంటుంది.
సూర్యుడు రాడు, చీకటి తొలగదు.
బాహ్య స్పర్శ పూర్తిగా ఉన్నా
ఆత్మలో రాత్రి తిష్ఠవేస్తుంది.
సంపదలు వాసన కొడ్తాయి,
లభ్యం కావు, స్వంతం కాబోవు.
సంతోషం, దుఃఖం కేవలం క్షణికాలు.
ఆహార పదార్థాలు రుచిగా ఉండవు
అనంత సంపదలు అందుబాటు కావు.
బాధల్ని, సుఖాల్ని వాయిదా వేస్తూ
రోజు గడిస్తే చాలు అనుకుంటూ
రాబోయే సమయాన్ని తలపోస్తూ
ఏ కార్యమూ సాధించలేడు.

**ఫాస్ట్** : ఆపు! ఈ చెత్తను నా బుర్రలోకి రానీకు!
నేను ఇటువంటివి వినబోను.
నన్ను వదిలేయి! నీ పనికిమాలిన నీతిబోధ
తెలివిగలవాళ్లకు క్షణాల్లో పిచ్చెక్కిస్తుంది.

**రక్షణ** : అతడు వస్తాడా లేక వెళతాడా?
ఎన్నుకోలేడు, తెలుసుకోలేడు.
దారి మధ్యలో ఉన్నాడు
వణికే కాళ్లతో తడబడుతున్నాడు.
చిక్కుదార్లలో తికమక పడ్డాడు
ప్రపంచపు అడ్డదారుల్ని చూసాడు.
తనకూ ఇతరులకూ భారాన్నిచ్చాడు.
ఊపిరున్నంత వరకూ
ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాడు.
పూర్తిగా ఆగలేదు ఊపిరి.
జీవమింకా దేహంలో ఉన్నది.
మొండిగా, ఆశతో నిలిచి ఉన్నది.
అటువంటి అథోప్రయాణం
చేదుగా ఉన్నా, బలవంతాన పోక తప్పదు.
విడిచిపెట్టబడింది, మరల చేరుకుంటున్నది.
విశ్రాంతి లేని నిద్ర, రుచీ పచీ లేని భోజనం
అతడిని స్థిరస్థితిలో ఉంచింది.
నరకానికి రంగప్రవేశం చేసింది.

**ఫాస్ట్** : భయంకర పిశాచాలు! మానవజాతికి శాపాలు!
మరలా మరలా ఏం చేస్తారు? ఏం సాధిస్తారు?
మాములు రోజుల్ని కూడా బాధతో నిండేట్లు చేస్తారు.
నాకు తెలుసు దయ్యాల్ని వదిలించడం కష్టమని,
భూతాలతో ఒప్పందం విడదీయలేమని;
రక్షణకుండే శక్తి గొప్పదైనా,
ఈ శక్తిని నేనెప్పుడూ గుర్తించబోను.

**రక్షణ** : అయితే అనుభవించు! వెళ్తూ వెళ్తూ నేను,
నేను వెళ్లిన చోటును శపిస్తాను.
అంధులై మనుషులు జీవితాన్ని వెళ్లదీస్తారు.
ఫాస్ట్ అయినా సరే చివరికి అంధుడు కాక తప్పదు!
**(అతడిపై ఊది అదృశ్యమవుతోంది).**

**ఫాస్ట్ : (అంధుడైనాడు)**

రాత్రి ఇంకా జటిలమవుతున్నది.
కాని నా హృదయంలో ఇంకా కాంతి ప్రజ్వరిల్లుతున్నది.
నా పథకాలను త్వరగా పూర్తి చేస్తాను.
నా మాటలు చాలు, ఆజ్ఞాపించడానికి,
నిద్ర లేవండి, సేవకులారా! ప్రతిఒక్కరూ!
నా పథకాన్ని కార్యాచరణలో పెట్టండి.
పలుగూ పారా చేబట్టండి! నిర్మాణాన్ని పూర్తి చేయండి!

చక్కని ఆలోచన, కఠిన శ్రమ
ఇస్తాయి ఫలితాన్ని ఎంతో వేగంగా!
ఈ కార్యక్రమం పూర్తయ్యేంత వరకూ
ఒక్క మనసు కదిలించాలి వేయి హస్తాల్ని!

# 21. రాజభవనపు ముందు భాగం

## (The Great fore Court of the Palace)

**(కాగడాలు. మెఫిస్టాఫిలిస్ పర్యవేక్షణలో లెముర్ల గుంపు)**

**మెఫిస్టాఫిలిస్** : రండి, రండి! నా లెముర్ గొబ్లిన్లూ,
అతుకులు పెట్టిన కంకాళాలు;
కండ ఇంకా అతుక్కున్న కీళ్లు;
కదిలించండి మీ ఎముకల గూళ్లు!

**లెముర్లు** : **(బృందంగా)**
మీరు పిలవంగానే మేము వచ్చేసాం;
మేం ఏదో ఏదో సగమే విన్నాం.
ఇక్కడేదన్నా అమ్మకానికి ఉందా స్థలం;
మాకు దొరుకుతుందా మా వాటా, ప్రతిఫలం?

ఇవిగో గొలుసులు, ఇవి కర్రలు,
మా స్థలాన్ని కొలుచుకునే పరికరాలు;
మా అల్పాత్మలనెందుకు పిలిచారు?
మాకు గుర్తుకు రావడం లేదు, చెప్పరూ!

**మెఫిస్టాఫిలిస్** : ఇక్కడేం లేవు వింతలూ విడ్డూరాలు.
మిమ్మల్ని మీరే వాడుకోండి కొలతలు
మీలో పొడుగాటి వాడు పడుకుంటే నిలువు.
మిగతా వాళ్లు చుట్టూ నిలబడి కొలవండి అడ్డం!
ఓ దీర్ఘ చతురస్రపు గొయ్యి తవ్వండి,
దీర్ఘనిద్రకు అనువైన స్థలం!
రాజభవనం నుంచి సమాధిలోకి దిగడం-
అన్ని కథలూ ముగుస్తాయి, ఇది జగద్విదితం.

**లెముర్లు** : **(తవ్వుతున్నట్లు)**
యవ్వనంలో నేను ప్రేమలో పడ్డాను
అది అతిమధురమని తలపోసాను.
రాత్రింబవళ్లు సంగీతానికి అనుగుణంగా,
నృత్యం చేసాను విరామం లేకుండా!

వయసు మీదపడింది, కర్ర సాయం వచ్చింది.
మాయ కర్ర ఇది నన్ను పడవేస్తున్నది.
సమాధి గోతి దగ్గర జారిపడ్డాను.
ఎందుకో వాళ్లు దాన్ని, ఉంచారు తెరచి.

**ఫాస్ట్** : **(భవనం నుంచి బయటకు వచ్చి తలుపు గుమ్మాన్ని తడుముతుంటాడు)**
ఎక్కడో పారా పలుగుల అలికిడి;
నా హృదయానికి హాయినిచ్చే సవ్వడి.
ఈ పనివాళ్లు బాగా శ్రమ పడతారు.
వేరుపడిన నేలను దగ్గరకు తీస్తారు.
నేలను సముద్రాన్ని విడదీస్తారు.
ఎదురులేని అలల్ని లొంగదీస్తారు.

**మెఫిస్టాఫిలిస్** : **(తనలో)–**
మేమందరం ఇంకా నీకోసం శ్రమపడ్తున్నాం!
నీ మూర్ఖపు ఆనకట్టలు, గోడలు కడ్తున్నాం.
నీటి పిశాచం – నెప్ట్యూన్, విందు ఇస్తాడు,
ఈ ఆనకట్టలు కట్ట తెగి నేలమట్టమైనపుడు–
నీవేదైనా చేసుకో, మిత్రుడా, అంతా అయిపోయింది.
మూల పదార్థాలిప్పుడు ఉన్నాయి నా సరసన.
అంతిమంగా నిన్ను అంతం చేస్తాయి నా తరపున!

**ఫాస్ట్** : ఓవర్ సీర్!

**మెఫిస్టాఫిలిస్** : ప్రభూ!

**ఫాస్ట్** : నాకింకా పనివాళ్లు కావాలి!
వందలుగా, వేలుగా, లెక్కకు మిక్కిలిగా!
ఒప్పించు, బతిమలాడు, తిట్టు, కొట్టు!
ఏదైనా, నీ చేతనైనది చేయి!
ఆశ చూపించు, బహుమతులివ్వు, బలవంతపెట్టు!
ఈ తవ్వడం పూర్తికావాలి!
ఇప్పుడు మొదలుబెట్టిన ఈ గొయ్యి
ప్రతిరోజూ ఎంత అయ్యిందో నాకు తెలవాలి!

మెఫిస్టోఫిలిస్ : (నెమ్మదిగా)
ఇవ్వాళ తవ్వకం బాగానే సాగింది;
గొయ్యి అయినా గోడ అయినా
మట్టిలో మట్టి, దుమ్ములో దుమ్ము, అంతే!

ఫాస్ట్ : పర్వతాల పాదాలను ఈ అగడ్త చుట్టుముడ్తుంది
నేను సాధించినవాటినన్నిటిని విషమయం చేస్తుంది.
దానిని నేను తీసివేస్తాను. ఆ విషాన్ని తొలగిస్తాను.
అదే నా ఆఖరి పథకం అవుతుంది.
ఈ మిలియన్ల ప్రజలకు ఉండటానికి చోటునిస్తాను.
రక్షణ లేకపోవచ్చు కాని హుషారుగా, స్వేచ్ఛగా ఉంటారు.
మనిషికి, జంతువుకు సరిపడా పచ్చని పొలాల్ని,
ఫలపుష్పవృక్షాల్ని, పచ్చిక బీళ్లని విస్తరిస్తాను.
ఆ నూతన ప్రపంచానికి చుట్టూరా అత్యంత
శ్రమతో ఎత్తైన గోడలను నిర్మిస్తాను.

లోపల భూలోక స్వర్గాన్ని సృజిస్తాను.
బయటి సముద్రం ఎంత ఎత్తుకెగసినా, కోపించినా
అందరి కోరిక ఒక్కటిగా నెర్రెలను పూడుస్తాను.
ఈ సంకల్పానికి నేను బద్ధుడనై ఉన్నాను.
జ్ఞానానికి ఆఖరిమాటగా దీనిని నేను బోధిస్తాను.
ఎవరైతే స్వేచ్ఛను సాధిస్తారో అతడిదే జీవితం.
స్వేచ్ఛను, జీవితాన్ని రెంటిని సాధించినవాడే మనిషి.
అటువంటి ప్రదేశాల్లో, ప్రమాదం పొంచివున్నా,
బాల్యం, యవ్వనం, వయసూ, కాలం
పలుకుతాయి నూతన ప్రపంచానికి స్వాగతం!

నేను ఆకాంక్షిస్తున్నాను,
జన సమూహం స్వేచ్ఛాజీవులై
స్వతంత్ర దేశంలో తిరుగాడే స్థితిని, క్షణాన్ని!
ఆ క్షణాన్ని నేనంటాను–
'ఓ అద్భుత క్షణమా! వెళ్లిపోకు!'
ఎన్ని యుగాలు గడిచినా

నా ఈ జీవిత గాథ చిరస్థాయిగా ఉంటుంది.
అటువంటి ఆనందానికై నిరీక్షిస్తున్నాను.
ఇంతకంటే ఎక్కువ ఆనందాన్ని
నాకే క్షణం ఇవ్వగలదు?

**(ఫాస్ట్ వెనక్కి తూలిపడతాడు. లెముర్లు ఆతనిని పట్టుకుని నేలపై ఉంచుతారు.)**

**మెఫిస్టాఫిలిస్** : మూర్ఖుడు! ఎప్పుడూ ఏదో కోరిక, ఏదో అసంతృప్తి!
ఇంకా అద్భుతాలకై ఆరాటపడుతుంటాడు!
ఈ ఆఖరి ఖాళీ క్షణం అతడు పట్టుకున్నాడు,
దేనికీ పొందని సంతృప్తి దీనితో పొందినాడు!
చివరకు కాలం గెలిచింది; వృద్ధస్నేహితుడా!
ఇక్కడ పడి ఉన్నావు.
గడియారం ఆగిపోయింది–

**బృందం** : ఆగిపోయింది; అర్ధరాత్రిలా
అలానే నిలిచిపోయింది.
గడియారపు ముళ్లు పడిపోయాయి.

**మెఫిస్టాఫిలిస్** : గడియారపు ముళ్లు పడిపోయాయి.
అంతా పరిపూర్ణమయ్యింది.

**బృందం** : అంతా అయిపోయింది.

**మెఫిస్టాఫిలిస్** : అయిపోయిందా! పిచ్చిమాట!
ఎందుకయిపోయింది?
ఏది అయిపోతుందో అది అక్కడ ఉండదు!
నాకు అదంతా ఒకటే! ఏం తేడాలేదు.
ఎందుకు సృష్టించడం? ఎందుకు పోషించడం?
ఆ తరువాత అనంతంగా నశింపచేయడం?
అయిపోయింది, గతం గతః – ఏం మాటలివి?
అంటే, ఎప్పుడూ లేని దానికంటే ఏమిటి తేడా?
ఏదో ఉన్నట్లు గొడవ గొడవగా తిరుగుతుంది.
నాకయితే 'శాశ్వత శూన్యం' అంటే ఇష్టం.
మిగతా అయిపోవడాలూ, గతమంటే అయిష్టం!

# 22. సమాధి హక్కులు

## (Burial Rites)

**లెముర్ :** **(ఒక్కడు)**
ఎందుకీ ఇల్లింత పేదగా ఉన్నది?
జనపనార వస్త్రం కప్పడానికున్నది!

**లెముర్ల బృందం:** పారా పలుగుతో కట్టినదీ గృహము.
అటువంటి అతిథికి అదే తగిన ధర్మము.

**లెముర్ (ఒక్కడు):** ఎవరు దీనినిలా అలంకరించినారు,
బల్ల, కుర్చీలు ఎవరు కొనిపోయినారు?

**లెముర్ల బృందం:** అది నీకు కాదు స్వంతము,
అప్పుగా తెచ్చింది అప్పులవాళ్ల గ్రామము.

**మెఫిస్టోఫిలిస్ :** దేహం పడి ఉన్నది నేలపై ఈ క్షణం
ఆత్మను చేసుకుంటాను కైవసం.
అతడికి చూపిస్తా రక్త ఒప్పందం.

ఆత్మలిప్పుడు దొరకడం అరుదైపోయింది.
వాళ్ల స్నేహితులు వెదుకుతున్నారు రంధ్రాలు
డెవిల్ మాయలన్నీ వాళ్లే చేస్తున్నారు.

మా పాత పద్ధతులు పనికిరావడం లేదు,
కొత్త వాటితో గొప్ప లాభమూ లేదు,
ఒకప్పుడు అన్నీ నేనే చేసేవాడిని.
ఇప్పుడు పంపుతున్నాను నా తరపు దూతల్ని.

ఇదివరకులా లేవు ఇప్పటి పరిస్థితులు,
పాత ఆచారాలు, సిద్ధాంతాలపై లేవు నమ్మకాలు.
ఎవరినీ నమ్మే పరిస్థితి లేదు.

వెనకటి రోజుల్లో మనిషి చనిపోగానే
కన్నంలోంచి ఎలకలా ఆత్మ బయటకు వచ్చేది.
మరుక్షణం నా గోళ్లు దాన్ని ఒడిసి పట్టుకునేవి.
ఈ రోజుల్లో ఆత్మకు బయటకు రావడానికి సందేహం.

ప్రాణం లేని దేహం వెలుగు లేని గృహం.
చివరికి మూలభూతాలు కలహించుకుంటాయి.
బలవంతాన ఆత్మను నెట్టివేస్తున్నాయి.

దీన్ని గురించి ఆలోచించి ఆలోచించి
బుర్ర బద్దలు కొట్టుకుంటున్నాను, కాని, ఏం లాభం?
ఎప్పుడు, ఎక్కడ, ఎలా అనేది ప్రశ్న!
ఎవరు చెబుతారు సమాధానం?
పాతకాలపు మరణం పోగొట్టుకున్నది శక్తి;
చివరకు 'ఏ విధంగా' అనేది కూడా సందేహం!
చాలాసార్లు కాళ్లు చచ్చుపడడం చూసేవాడిని ఆశగా,
అంతా మోసం! గిలగిలా కొట్టుకొని లేస్తున్నారు జనం!
(రకరకాల సంజ్ఞలు, సైన్యం వస్తున్నట్లు చేస్తాడు)
రండి మిత్రులారా! వేగంగా రండి!
నిలువు కొమ్ములు, వంకర కొమ్ములు!
పాతకాలపు నేస్తమ్ములు!
నరకలోకపు దవడలు తెండి!
మిత్రులారా! మీతోపాటు తీసుకురండి!
నరకంలో ఉన్నాయి అనేక రకాల నోళ్లు
హోదా, అంతస్థు ప్రకారం రకరకాల రూపాలు.
బహుశా భవిష్యత్తులో మారతాయి కాబోలు
ప్రస్తుతమున్న న్యాయాలు, సిద్ధాంతాలు.

**(భయంకరమైన నరకలోకపు నోళ్లు తెరుచుకుంటాయి ఎడంవేపు)**

కోరలు విడివడ్డాయి. మధ్య రంధ్రం గుండా
నరకలోకపు నోరు ఉమ్ముతుంది మండే సముద్రాన్ని;
అగాధంలో మండే మురికిని, ఉబికి వచ్చే ద్రవాన్ని.
నేను చూస్తున్నాను పాతాళ నగరంలో
ప్రజ్వరిల్లుతున్న జ్వాలా వాయువుల్ని
ఆ ఎర్రటి నురగ కోరల వేపు ప్రవహిస్తున్నది.
చివరకు,
అవిగో ఈదుతున్న ఆత్మలు
'అదుగో దారి' అని అనుకునే లోపునే

ఆ దుమ్ములగొండి నోరు వాటిని దురిమి మింగుతున్నది.
అవి ఈ నోటి మూలల్ని కూడా రంగరిస్తే బావుంటుంది.
అంత చిన్న ప్రదేశంలో ఎన్ని భీభత్స దృశ్యాలు!
అవి పాపుల్ని బెదరగొడ్తాయి.
అయినా, ఇప్పుడు, నరకాన్ని నమ్ముతున్నదెవరు?

**(లావాటి ఏకశృంగ భూతాలతో)**

బానకడుపు ఎర్రముహం భూతాల్లారా!
పేగుల్లో గంధకపు రాళ్లు మండుతుంటే
బాగా బలిసి కొట్టుకుంటున్నారు.
సందేహం లేదు! మీరు మెడ బిగిసిన గుట్టలు
మెడలేని ముద్దలు! బుర్రలేని మొద్దులు.
చూడండి! ఆ కాంతివంతమైన వెలుగు
అదే ఆత్మ! "మనసు విప్పిన రెక్కలు"
ఆ రెక్కలు లేకుంటే అవి కేవలం పురుగులు.
నా ముద్రికతో నొక్కి వాటిని
నెట్టేస్తా అగ్నిజ్వాలల్లోకి!

ఓ తోలు సంచుల్లాగా ఉన్న పిశాచాలు!
మీ కింది భాగాల్ని శిక్షించుకోండి చాలు!
మన 'ఎర' వాటిని పట్టుకోనివ్వకండి-
మనకు తెలవదు అది ఎటునుంచి బయటకు వస్తుందో
అది అపాన వాయువు వచ్చేదారైతే జాగ్రత్త!
బొడ్డు నుంచి వస్తుందంటారా, పెద్ద భయం లేదు దానితో!
అదే ఆత్మకు సరైన రహదారి. దానికి నచ్చే దారి!
చూస్తూ ఉండండి! లేకుంటే చెడ్డపేరు వస్తుంది.

**(సన్నగా ఉండి వంకర కొమ్ములున్నవాళ్లతో)**

ఓ వెదురుబొంగు దయ్యాలూ, పుల్లల్లా ఉన్నారు!
గాలిని పట్టుకోడం సాధన చేయండి,
చేతుల్ని తిన్నగా ఉంచుకోండి,
గోళ్లను వెడల్పు చేయండి, అవి మంచి పరికరాలు!
పిట్టలు ఎగిరిపోకుండా గట్టిగా పట్టుకోండి!

అది తన పాత ఇల్లు వదిలిపోతున్నది.
తెలివిగలది. బాగా పైకి పోదామనుకుంటున్నది.

**(పై నుంచి కాంతిపుంజం – కుడివేపు పడుతుంది.)**

**స్వర్గాధిపతి** : అనుసరించండి, దూతలారా!
స్వర్గలోకపు నివాసులారా!
నెమ్మదిగా ఎగిరి రండి!
పాపం క్షమించబడును.
భూ నివాసి పునరుద్ధరించబడును.
అన్ని మూలకాలు భాగస్వాములై
ప్రతి ఒక్కరూ స్పృశిస్తారు.
మీరక్కడ ఆగి కరుణను ప్రకటిస్తారు.

**మెఫిస్టాఫిలిస్** : ఇదేం కాకుల గొడవ? ఏమిటీ గందరగోళం ఈ తడవ?
వెలుగులా రాకూడనిది ఎందుకిలా వస్తున్నది?
ఆడా మగ పిల్లల అంతులేని గుసగుసల్లా
సౌశీల్యవతి అయిన ప్రభుసేవికకో, మునికో
చెబుతున్న ప్రవచనాల్లా ఏమిటీ గడబిడ?

మనం మానవ జనాభాను తగ్గించడానికి
ఎంతో క్లిష్టతరమైన పథకాన్ని రూపొందించాము.
అదంతా వృధాయేనా?
మన ఎత్తుగడ అంతా వాళ్ల మతానికి సరిపోలదా?
సందేహవాదులు వాళ్ల అనుయాయులు, అరుగో!
అలాగే వాళ్లు మనకు రావాల్సిన వాటిని లాక్కున్నారు.
మన ఆయుధాల్తోనే యుద్ధాన్ని గెలుచుకున్నారు.
వాళ్లు కూడా డెవిల్సే, మారువేషాల్లో ఉన్నారు.
ఏయ్! గట్టిగా నిలబడండి! లేకుంటే శాశ్వత అవమానం.
గోతి చుట్టూ నిలబడండి, నరకాగ్నిలా మండిపడండి!

**దేవదూతల బృందం–**

ప్రకాశవంతమైన గులాబీలు
బాధ తొలిగించే గులాబీలు
ఎగుర్తున్నాయి, కదుల్తున్నాయి.
కొమ్మరెక్కలు, పూలరేకలు

తెరచుకుంటున్న గులాబి మొగ్గలు
వికసిస్తున్న గులాబి సమూహాలు
రహస్యంగా ఆనందిస్తున్నాయి.

అతడి వద్దకు వెళ్లి తీసుకుని రండి!
వసంతకాలపు ఎరుపు ఆకుపచ్చలు
అతడికి స్వర్గాన్ని సృష్టించండి.
అతడు ఇక్కడే పడి వున్నాడు.

**మెఫిస్టొఫిలిస్ : (భూతాలతో)**
ఏమిటా వణుకుడు, బెదురుడు?
నరకంలో నేర్పుతున్నారా ఈ కొత్త చదువులు?
గట్టిగా నిలబడండి! పుష్పగుచ్ఛాలను విసరనివ్వండి!
అందరూ ఎవరి స్థానాల్లో వాళ్లు నిలబడండి!
అనాకారి మోహాలూ మీరూనూ!
వాళ్లనుకుంటారు పూల శక్తి ముందు
దుష్టశక్తుల ప్రభావం దిగదుడుపని!
వేడి గాలులు ఊదండి; పూలు వడిలిపోనివ్వండి!
వాడిపోయి, తెల్లబోయి, పాలిపోతాయవి.
చీముడు ముక్కు పిశాచాల్లారా! చిదిమేయండి పూలను!
చాలు! చాలు! మీ వాసనతో ఇదంతా కంపుగొడ్తున్నది!
మీ నోరూ, ముక్కూ మూసుకోండి!
తేలికగా తీసుకోండి! ఓ! ఆపండి మీ గట్టిగా ఊదడం!
ఎందుకంత అతి! చేతకాదా మామూలుగా ఉండడం!
ఆ గులాబీలను చూడండి! అవి వాడిపోలేదు!
మాడి మసిబొగ్గులవుతున్నవి! మీ వేడి నిశ్వాసాలతో!
అవి మండుతున్నవి, అవిగో వస్తున్నవి, విషాగ్ని జ్వాలలు.
నిలబడండి! ప్రతిఘటించండి!
ముగ్గురు డెవిల్స్ పేర్లతో ముందు నిలబడండి!-
వాళ్లు ధైర్యం కోల్పోతున్నారు. బహుశా వెళ్లిపోతారు.
నా డెవిల్స్ కొత్త అగ్నులకు తెర దీసారు!

**దేవదూతలు (బృందం)-**
ఆశీర్వదించబడిన పుష్పాలు
మీ నాట్యమాడే వెలుగు కిరణాలు;

సంతోషాన్ని వెదజల్లుతారు,
అనునయించే ప్రేమ శక్తులు;
హృదయానందాన్ని పంచుతారు.

ప్రకాశించే సత్య వాక్కులు
నింగిలో కోల్పోతాయి వెలుగులు
శాశ్వత రూపుడైన వానికి
రాత్రి లేని ప్రపంచపు మెరుగులు.

**మెఫిస్టాఫిలిస్ :** ఓరి సాతాను సేవకుల్లారా! నాకు కోపం తెప్పించారు!
సిగ్గులేదు! అందుకే తలకిందులుగా నిలబడుతున్నారు.
బండి చక్రంలా తిరుగుతూ అగ్నిలో దూకుతున్నారు.
మీకు సరిపడా అగ్ని స్నానం దొరుకుతుంది,
అయినా, నేను మాత్రం నా స్థానం నుంచి తప్పుకోను.
**(పైకెగుర్తున్న గులాబీలను కొడతాడు)**
పో! విల్-ఒ-ద-విస్ప్! మీరూ మీ వెలుగులూ
ఒకసారి నేను పట్టుకుంటే తడి జిగురు పులుగులు.
అహ్! దూరంగా పొండి! పనికిరాని పురుగులు
తారుబంకలా, గంధకంలా నా వీపుకంటుకుని పరుగులు.

**దేవదూతలు (బృందం)-**
నీలో భాగం లేని దానితో
నీకవసరం లేదు.
నీ హృదయాన్ని మండించేదానిని
నీవు పట్టించుకోకూడదు.

అన్ని రక్షణలూ కోల్పోతే
మా శక్తులు విజృంభిస్తాయి.
ప్రేమ! ఒక్క ప్రేమతోనే
స్వర్గం గెలవబడ్తుంది.

**మెఫిస్టాఫిలిస్ :** నా తలకు అగ్ని అంటుకున్నది.
నా హృదయం, పేవులకు కూడా!
ఇది నరకాగ్ని కన్నా తీవ్రతరం!
ఏదో అతీతశక్తి నాలో చొచ్చుకుపోతున్నది.

ఈ బాధను అనుభవించడం కోసమా
ఏమీ కోరుకోని ప్రేమికులు ఎందుకు ఏడుస్తారు?
వాళ్ల ప్రియురాలు వెళ్తుంటే మెడలు నిక్కబొడుచుకు చూస్తారు?

నేను కూడా ఎందుకు నా తలను పైకెత్తి వాళ్లవేపు చూస్తున్నాను?
ఇప్పటి వరకు వారి శాశ్వత శత్రువును కదా!
వారి ఉనికి కూడా నాకు భరించరానిదే!
మరి ఏమైంది నాకు? ఏ శక్తి నన్నిలా చేస్తున్నది?

ఈ చక్కని బాలురంటే ప్రేమ కలుగుతున్నది.
వారిని తిట్టబుద్ధి కాకున్నది,
నన్ను వాళ్లు మూర్ఖుడిగా చేస్తే
భవిష్యత్తులో, ఇంకెవరు మూర్ఖులవుతారో తెలుసుకోవాలనున్నది!
ఈ యువజనాన్ని నేను ద్వేషిస్తాను!
కాని నా లోలోపల, ఆకర్షణీయంగా ఉన్నారని అంగీకరిస్తాను.

మీరే రకంగానైనా ల్యూసిఫర్‌కు
సోదర సమానులు కారుగదా!
అందంగా ఉన్నారు; ముద్దుకు అర్హులు.
ఇటువంటి సమయంలో నాకు సరిపోతారు.

నాకిదెంతో సహజంగా, సురక్షితంగా ఉన్నది.
మిమ్మల్నిప్పటికెన్నిసార్లో చూసినట్టున్నది.
విచిత్రం! మిమ్మల్ని ఎంత గాఢంగా తిరస్కరిస్తుంటే
మీరంత అందంగా కనిపిస్తున్నారు.
దగ్గరకు రండి! మిమ్మల్ని తనివి తీరా చూడనివ్వండి!

**దేవదూతలు** : మేం వస్తున్నాం! కాని, ఎందుకు నీవలా ముడుచుకుపోతున్నావు?
మేం దగ్గరకు వస్తున్నాం! చేతనైతే నీవున్న చోటునే నిలబడు!

**(దేవదూతలు వలయంగా వేదిక మధ్యకు వస్తారు)**

**మెఫిస్టోఫిలిస్** : **(వేదిక ముందుకు వచ్చి)**
నరకలోకపు ఆత్మలుగా మీరు నాకు తెస్తారు చెడ్డపేరు.
అయినా ఈ మంత్రజాలం మీది. ఈ మాయలు మీవి.
ఇవి ఆడా, మగ వాళ్లను సమ్మోహితులను చేస్తాయి.

చాలు ఈ సాహసం! ఇదే ప్రేమా! ఇది నిజమా?
నా దేహం మండిపోతున్నది.
ఆ పూలు పడిన నా గూని నడుము నాకందకున్నది.
పైన ఏం ఎగుర్తారు? కిందకు రండి!
మీ కాళ్లూ చేతులూ ఇంకాస్త అందంగా కదిలించండి.
మీ ముఖాలపై సరిపోతుంది, తృణీకారం
చిరునవ్వును చూడడం ఆశ్చర్యకరమైన పరిణామం.
మరొక్కసారి నవ్వండి! చిరునవ్వులు చిందించండి!
నాకెంతో ఆనందాన్నిస్తున్న నవ్వులు కురిపించండి.
ప్రేమికులు ప్రయోగించే చిరునవ్వులు రువ్వండి.
నోటిని కాస్త మృదువుగా తిప్పండి! అదే! అది చాలు!

పొడుగాటి బాలుడా! నిన్ను కాదనలేను!
ఎందుకీ మతాధిపతుల గాలి ఇక్కడ?
దానికంటే ఒక మోహనకర చూపును సంధించు!
దయయుంచి, కాస్త నగ్నంగా కనిపించు!
ఈ ప్రవహించే వస్త్రాలు కాస్త ఎక్కువే!
వాళ్లు వెనక్కు తిరుగుతున్నారు.
ఈ దృశ్యం మరింత శోభాయమానంగా ఉంది!
నాకు ఆకలి మరింత ఎక్కువవుతున్నది.

**దేవదూతల బృందం–**

ప్రేమ జ్వాలల్లారా, తిరగండి!
స్పష్టంగా ఈవేపు, తిరగండి!
సత్యం స్వేచ్ఛను తెస్తుంది.
దుష్ట వీక్షణాలనుంచి
వాళ్లు స్వచ్ఛంగా బయటపడతారు.
ఆశీర్వదించబడిన గుంపులో హాయిగా తిరుగుతారు.

**మెఫిస్టోఫిలిస్ : (కదుల్తూ)**

ఏమయ్యింది నాకు? ఒంటనిండా పొక్కులు.
'జాబ్'కు జరిగిందిలాగే, ఆత్మపై రక్కులు.
అయినా విజయమే, తనలోని లోతుల్ని చూసి
తానుగా బయటపడేవాడు, బాధల్నుంచి బయటపడతాడు.
నా డెవిల్ భాగాలన్నీ క్షేమమే! అదే నాకు చాలు!

ఈ ప్రేమ తాయెత్తులు, పెడ్తున్నాయి కాస్త దురదలు.
ఈ చలి నెగళ్లన్నీ ఆరిపోయిన బురదలు.
మరొక్కసారి శపిస్తున్నాను,
యావత్ దేవదూతల జాతిని!

**దేవదూతల బృందం–**

పవిత్రాగ్నీ జ్వలించు!
నీ చుట్టూ ఉన్నవారికి
మధుర జీవనం లభించింది.
ఒక్క గొంతుతో అందరూ
ఆనందంగా గానం చేస్తున్నారు.
ఆత్మ సంతోషంగా
పరిశుద్ధ వాయువును పీలుస్తున్నది.

**(వాళ్లు ఫాస్ట్ ఆత్మతో పైకెగసినారు)**

**మెఫిస్టోఫిలిస్ : (చుట్టూ చూస్తూ)**

ఏమిటిది? వెళ్లిపోయారే వాళ్లు! ఎక్కడకు?
ఓరి భడవల్లారా! నన్ను బురిడీ కొట్టించారే!
నా సంపదను దోచుకుని స్వర్గానికి పోయారే!
అందుకా వీళ్లు గోతి చుట్టూరా తిరిగింది.
నా ప్రశస్తమైన బహుమతిని నేను పోగొట్టుకున్నాను.
ఓ ఉన్నతమైన ఆత్మ తనను నాకు తాకట్టు పెట్టిన దానిని,
నా కళ్లముందే వాళ్లు తస్కరించుకుని పోయారు.
నేనెవరికి ఫిర్యాదు చెయ్యాలి? ఎవరు న్యాయం చేస్తారు నాకు?
నా వస్తువును నా పరం ఎవరు చేస్తారు?
తెలివితక్కువ వాడా! ఈ వయసులో పడ్డావు బోల్తా!
తగిన శాస్తి జరిగింది! తప్పు చేసాను! ఎవ్వరినీ నిందించనక్కర్లేదు.
నాకవమానమే! పెట్టిన పెట్టుబడి అంతా వృధా!
అంత మంచిపని కొరగానిదయ్యింది. మామూలు కామం,
తృష్ణ, ఆకర్షణ మొండి డెవిల్‌నే మోసపుచ్చాయి.
ఆ ఎత్తుల ముందు నా జ్ఞానం చిత్తైపోయింది.
ఈ ప్రేమోన్మాదానికి నా అభినందనలు.
ప్రేమ అంతిమంగా నన్ను పట్టుకోగలిగింది.

# 23. పర్వతపు గొంతులు

## (Mountain Gorges)

**(అడవిలో శిలాప్రాంతం. పవిత్ర ప్రాణులు శిలలపై అక్కడక్కడా కూర్చుని వున్నారు.)**

**బృందం, ప్రతిధ్వని –**

వనాలు ఊగుతున్నాయి
రాళ్లూ, శిఖరాలు తూగుతున్నాయి.
వేళ్లు వేళ్లకు వేలాడుతున్నాయి.
మొదళ్లు మొదళ్లతో మెదులుతున్నాయి.

ప్రవహించే నీళ్లు ఉరుకుతున్నాయి.
నీడనిచ్చే గుహలు లోతుగా ఉన్నాయి.
సింహాలు మన చుట్టూ మూగుతున్నాయి.
మౌనంగా, నెమ్మదిగా
ఈ పవిత్ర స్థలంలోకి వస్తున్నాయి.
ఇది ప్రేమకు, కరుణకు పవిత్రమైనది.

**పాటర్ ఎక్స్‌స్టాటికస్– (పైకి కిందకు ఎగుర్తూ)**

శాశ్వతాగ్ని ఆనందం
ప్రేమబంధపు కోరిక
హృదయపు తీరని బాధ
ఆనందపు జలధార!

బాణాలు నన్ను దూసుకుపోతున్నాయి.
బల్లెపు మొనలు నన్ను లొంగదీసుకున్నాయి.
కర్రలు నన్ను విరగకొడ్తాయి.
పిడుగులు నన్ను పొడిపొడి చేస్తాయి.
ఏది శూన్యమో, ఆశారూపమో
అదంతా నశించాలి.

నక్షత్రమా! వెలుగు!
ప్రేమకు శాశ్వతపు ఆధారమా! ప్రకాశించు!

**పాటర్ ప్రొఫండస్– (క్రింది ప్రాంతంలో)**

దిగువ ఉన్న రాతి అంచు
మరింత అడుగున ఉన్న అగాధంపై
మోపుతుంది భారం.
వేయి సెలయేర్లు ప్రకాశిస్తూ ప్రవహిస్తాయి,
నురగలు కక్కుతున్న వరద నీటిలోకి;
తమ స్వంత శక్తితో వృక్షాలు
నిట్టనిలువుగా, సూటిగా ఆకాశంలోకి పెరుగుతాయి.
ఇవన్నీ చెబుతాయి అంతంలేని ప్రేమ
అన్నిటికీ రూపాన్నిస్తుందని, రక్షిస్తుందనీ!
ఎంత భయంకర గర్జన?
అడవి వణికింది. అగాధం కదిలింది.
అయినా కొండ కొమ్మునుంచి జలపాతం
ప్రేమ ప్రవాహంలా జాలువారుతున్నది.
లోయ దాహానికి దాని శబ్దం సగం వినబడ్తున్నది.
అప్పుడప్పుడు పడుతున్న పిడుగుల మంటలు
విషపు గాలుల్ని శభ్రం చేస్తున్నవి.
ఉరుముల మబ్బులతో నిండిన ఆకాశం ఉక్కబోస్తున్నది.

ఇవన్నీ ప్రేమదూతలే!
ఇవి సృష్టి నిర్మాణాన్ని వ్యాపకతను వివరిస్తాయి.
అది నాలోనూ ప్రజ్వరిల్లనీ!
ఇంద్రియానుబంధాలు, మనో వ్యాకులతలు
హింసలు, వణుకుల్లా, ఈ అగణిత బంధాలు
వీటి నుంచి నన్ను విముక్తుడిని చేయనీ!
దేవుడా! నా ఆలోచనలకు ప్రశాంతతనివ్వు!
నా హృదయానికి కాంతి నివ్వు!

**పాటర్ సెరాఫికస్– (మధ్య ప్రాంతంలో)**

పైన్ వృక్షాల ఆకులలో ఏదో కదులుతున్నది?
ఏమిటో ఎవరు చెప్పగలరు? బహుశా ఏదో
పిల్లమబ్బు, యువక మనస్సుతో తిరుగుతున్నది.

**ఆశీర్వదింపబడిన బాలుర బృందం–**

తండ్రీ! ఇదేమి ప్రదేశం?
స్నేహితుడా! నీవేనా పిలిచినది?
ఇక్కడ మాకెంతో ఆనందం.
జీవితం కడు సుఖప్రదం.

**పాటర్ సెరాఫికస్–**

మర్త్య శిశువులు, అర్ధరాత్రి జన్మించినారు.
సగం తెరచిన మనసులు, సగం చచ్చిన ఇంద్రియాలు.
తల్లిదండ్రుల చేతుల నుంచి దేవదూతలను చేరినారు.
మీ దగ్గర ఉన్న ప్రేమికుని వద్దకు రండి!
భూలోక ప్రయాణం మీపై మిగల్చలేదే గుర్తులూ.
నాలో ప్రవేశించండి,
నా భూలోకపు నేత్రాలతో వీక్షించండి!
వాటిని మీ కన్నులుగా వాడి కొత్త స్వర్గాన్ని చూడండి!

**(అతడు వాటినితనలోకి తీసుకుంటాడు)**

ఇవి వృక్షాలు, ఇవి రాళ్లు
అవి ప్రవహించే జలపాతాలు.
అంతెత్తు నుంచి క్రిందకు
నిలువుగా పడ్తుంది, వేగంగా ప్రవహిస్తుంది.

**ఆశీర్వదింపబడిన బాలురు (అతడిలో నుండి)–**

ఇక్కడ విషాదంగా చీకటిగా ఉన్నది.
చూడటానికి అద్భుతంగా ఉన్నా
భయం, వణుకూ పుడ్తున్నది.
తండ్రీ! మమ్మల్ని విడుదల చేయి!

**పాటర్ సెరాఫికస్–**

ఊర్ధ్వ గోళానికి ఎగిరి వృద్ధి చెందండి.
దేవుని కాంతి అక్కడ ప్రజ్వలిస్తున్నది.
స్వచ్ఛమైనది, శాశ్వతమైనది, వన్నె తగ్గనిది.
ఆత్మలు తిరుగాడే ఆ లోకంలో
ఆశలు ఆశీర్వదింపబడి వర్ధిల్లుతున్నవి.
అక్కడే శాశ్వత ప్రేమ తెలియపరచబడ్తుంది.

**ఆశీర్వదింపబడిన బాలుర బృందం (కొండ శిఖరాల చుట్టూ ఎగుర్తూ)–**

నృత్యం చేద్దాం వలయంగా,
చేతుల్ని కలిపి సంతోషంగా,
ఆనందంగా పాడుదాం!
సోదర బంధంతో ఆడదాం!

ఈ బోధనలను ఆలకించండి.
అతడిని మీరు పూజిస్తే
పవిత్ర హృదయాలు అక్కడకు చేరి,
ఆతడిని అక్కడ దర్శిస్తాయి.

**దేవదూతలు : (ఫాస్ట్ ఆత్మను తీసుకువస్తూ)**

ఈ ఉన్నతమైన ఆత్మ
సాతాను కుట్రను భంగపరచింది.
ఎవరైతే సాతానును ఎదిరిస్తారో
అతడికి క్షమాభిక్ష లభిస్తుంది.

ప్రేమ దిగువకు చూసి
అతడిని దయతో కరుణించింది.
స్వాగత గీతాలతో ఈ ఆత్మను
ప్రభువు ముందు ప్రవేశపెట్టండి.

**యువ దేవదూతలు–**

పవిత్ర భక్తులు
ప్రేమ గులాబీలు వెదజల్లి
ఈ ఆత్మను రక్షించడానికి తోడ్పడినారు.
ఈ బహుమతిని పొందగా సాయపడినారు.

దయ్యాలు పారిపోయాయి మా కళ్లముందు
నరకలోకపు నల్ల పిశాచాలు వణికిపోయాయి.
ప్రేమాగ్ని వర్షపు పవిత్రాగ్నితో
మేము వాటి పీచమణచి ఓడించినాము.
పాత సాతానును కూడా ఆ బాధ
ఆతడి మనసులో చేరి వేధించగా–

మనం గెలిచాము! దేవదూతలారా!
ఆనందపడండి! సంతోషపడండి!

**దేవదూతలు :** **(పెద్దవాళ్లు)**
భూలోక సంబంధం
అసంపూర్ణం, శకలరూపం.
అగ్ని అంటకపోయినా
అపరిశుభ్ర భారం.
భూతశక్తి మూలకాలను
బంధించినప్పుడు
ఏ దేవతాశక్తీ
ఆ బంధాలను విడగొట్టలేదు.
కాలరహితమైన ప్రేమ
మాత్రమే ఆ సంకెళ్లను ఛేదించగలదు.

**యువ దేవదూతలు–**
ఆత్మలు తిరుగుతున్నవి,
చలనం సాగుతున్నది,
కళ్లు తిరిగే ఈ శిఖరం చుట్టూ
నాట్యం చేస్తున్నవి;
ఇప్పుడు మబ్బులు ప్రకాశవంతమైనాయి.

సంతోషంగా ఓ బృందం
పరిభ్రమిస్తున్నది.
భూ బంధాలను విడగొట్టుకుని
కొత్త బృందమిటే వస్తున్నది.
ఆ ఆశీర్వదింపబడిన శిశువులు
ఇక్కడి వసంతకాలపు అందాలు.
ఈ ఊర్ధ్వ గోళంలో
ఆడుకుంటూ ఆనందిస్తారు.
అతడిని వీరితో ఆడుకోనివ్వండి.
ఆనందం, సత్యం
వీటి అన్వేషణే అతడి లక్ష్యం.
అదే అతడెన్నుకున్న మార్గం.

**ఆశీర్వదింపబడిన బాలురు–**

మేము స్వాగతిస్తున్నాము,
ఈతడి కోరికను–
ఈ నూతన రూపాంతరం
స్వర్గానికి అనుకూలం.
అతడిని వల్మీకం నుంచి
విడుదల చేసినాము.
దేవదూత రూపంలో
ఎంత అందంగా ఉన్నాడితడు!

**డాక్టర్ మారియానస్ (అత్యున్నతమైన, స్వచ్ఛమైన గదిలో)–**

ఎంత విశాల దృశ్యం,
ఆత్మ పైకెత్తబడడం!
స్త్రీలు పైకి వస్తున్నారు,
పైపైకి వెళ్తున్నారు.
వారి మధ్యలో తారలు
ఆమె ప్రకాశాన్ని ప్రజ్వలిస్తుండగా,
స్వర్గలోకపు రాణిని చూసాను.
ఆ కాంతులామెను సేవిస్తున్నాయి.

**(ఆనందంతో)**

ప్రపంచాధినేతా! రాణీ!
ఈ నీలాకాశంలో
తెరవబడని స్వర్గపు గుడారంలో
నీ అద్భుతాన్ని చూపించు!

ఒక మానవుడిగా నిన్ను ప్రేమిస్తాను.
నా హృదయపు ఉద్వేగం
పవిత్ర ప్రేమను ప్రసవిస్తుంది.
నా ప్రార్థనను తిరస్కరించవలదు.

మేము నీకోసం పోరాడుతాం!
నీ ఆజ్ఞను అక్షరాలా పాటిస్తాం!
మా ప్రేమను ఆలకించు
మేము సున్నితమైన ప్రేమికులం!

స్వచ్ఛమైన కన్యా! పవిత్ర మాతా!
మేము ఎన్నుకున్న రాణీ!
ఎవరికీ తలవంచని దేవతా!
నీ రక్షణను మాకు ప్రసాదించు!

మేఘమాలికలు, ఆమె చుట్టూరా;
కాంతి, మూలకాలుగా;
ఇవి ఆమె భక్తులు
దుఃఖం, మృదుత్వం
ఆకాశ పానీయం
కరుణ హస్తం
అర్థులు చుట్టుముట్టి ఉంటారు.

తమ కీర్తికాంతిలో
హద్దు దాటలేదు,
అనుమతి ఇవ్వబడింది.
వారి కథ వినండి.
తీయని పాపం వారిని పురికొల్పింది.
వారు బలహీనురు.
నిన్నే నమ్ముకున్నారు.
ఇంకెవరు వారిని రక్షించగలరు?
నీవు కాక మరెవరు సాయం చేయగలరు?
ఈ కామపు సంకెళ్లనెవరు విరగగొట్టగలరు?
నీవు కాక మరెవరు సాయం చేయగలరు?
తేలికగా కాలు జారుతుంది,
విధ్వంసం, వినాశనం మరుక్షణం.
పొగిడే నోరు, వేటాడే కళ్లు
సమ్మోహనాన్ని కలిగిస్తాయి.
**(మాటర్ గ్లోరియోసా దృశ్యంలోకి వస్తుంది)**

**విలపిస్తున్న స్త్రీల బృందం–**

అలౌకిక ఊర్ధ్వలోక గామినీ!
అపూర్వ కాంతి ప్రదాయినీ!

మేము నిన్ను పూజిస్తున్నాము,
మా కష్టాలను విన్నవిస్తున్నాము!

**మాగ్నా పెక్కాట్రిక్స్- (ల్యూక్ 7-36)**
తమ కీర్తిమంతుడైన పుత్రుడి పాదాలపై
వర్షించిన ప్రేమాశ్రువుల మందు సాక్షిగా,
ఫరసీయుల విరోధ ఆలోచనలు
భయం గొలిపే విధంగా ప్రతిఫలించగా,
అలబాస్టర్ కలశం నుండి పోసిన
సుగంధ ద్రవ్యాల పరిమళాలు వ్యాపించిన విధంగా,
నా శిరోజాలు మెత్తగా, విచారంగా
తమ పవిత్ర పాదాలను తుడిచిన విధానంగా
ఓ ప్రభూ-

**మ్యులీర్ సమరిటానా (జాన్-4)**
ఆ బావి దగ్గర మీరు ఆగినారు
అబ్రహాం గొర్రెలు అటురాగా
నేను చల్లటి నీటిని తెచ్చినాను.
తమ ఎండిన పెదాలను తడిపాను.

ఆ స్వచ్ఛమైన జలధార
ఇప్పుడు ప్రపంచమంతా ప్రవహిస్తున్నది.
ఇంకా ఇంకా వృద్ధి చెందుతున్నది,
మరింతగా ప్రకాశిస్తున్నది-

**మేరియా ఈజిప్టియాకా (ఏక్టా శాలక్టొరమ్)**
మన రక్షకుడి దేహాన్ని
సమాధిలో ఉంచిన చోట
నా దారిన ఆపిన చేయి
ఆ ద్వారం దగ్గర నిలిపింది.

ఓ ఎడారి దేశంలో క్షమాభిక్ష కోసం
నలభై ఏళ్లు పడిగాపులు గాసాను.
నా ఆఖరి అభివాదం
మండుతున్న ఇసుకపై వ్రాయబడింది.

**ముగ్గురూ** : అటువంటి పాపులకు నీ దగ్గర స్థానం ఇవ్వబడింది.
వారి పాపపు ఆలోచనలు శాశ్వత కరుణగా పెరిగాయి.
ఈ మంచి ఆత్మ ఒకే ఒక్కసారి దారి తప్పింది.
తమ దయను అర్థిస్తూన్నది, ఈ అమాయకమైన చిన్నది.

**యునా పొయిని టెంటియమ్ (ఒకప్పటి గ్రెఛెన్ – దగ్గరగా వస్తుంది)**
కన్యామాతా!
సాటిలేని దానివి.
కీర్తితో నిండిన దానివి!
అంతులేని సంతోషంతో
నీకు మొక్కుతున్నాను.
అమ్మా! చూడు!
ఇతడినే నేను ప్రేమించాను.
ఇతడి చీకటి తొలిగింది.
నా దగ్గరకు వస్తున్నాడు.

**ఆశీర్వదింపబడిన బాలురు (వలయంగా దగ్గరకు వస్తూ)–**
శక్తివంతమైన కాళ్లతో,
మనల్ని దాటిపోతున్నాడు.
అతడిని మనం ఆదరించాము.
మనల్ని గౌరవిస్తాడు అతడు.
జీవితపు సంగీత విభావరిలో
మృత్యువు మనల్ని ముందే పెకలించింది.
అతడు అన్నీ నేర్చుకున్నాడు,
మనకు అవన్నీ నేర్పగలడు.

**శోకతప్తురాలు : (ఒకప్పటి గ్రెఛెన్)**
ఉన్నతమైన ఆత్మల సంగీతంతో
ఈ నూతన ఆత్మ, ఇప్పుడే మేల్కొంటున్నది.
వింతగా మన కనుల ముందే
మన రూపం దాల్చుతున్నది.
భూలోకపు బంధాలను వదిలివేస్తూ
తన బాహ్య రూపాన్ని విడిచి పెడ్తున్నది.
అతడు తన పూర్వ రూపాన్ని వదిలి

యువకుడిగా మారుతున్నాడు.
మాతా! అనుజ్ఞనివ్వు! అతడికి నేను బోధిస్తాను.
అతడింకా కొత్త రోజును చూసి నిర్విణ్ణుడై ఉన్నాడు.

**మాటర్ గ్లోరియోసా–**

రా– ఊర్ధ్వ లోకాల్లోకి! అతడిని దాటిరా!
నిన్ను గ్రహించి అతడే దారి వెదుక్కోవాలి!

**డాక్టర్ మారియానస్– (మెచ్చుకోలుగా చతికిలపడుతూ)**

నేత్రాలతో వీక్షించండి! దీక్షగా చూడండి!
కన్యామాత కన్నులు కరుణ వర్షించే జలధారలు
ఆమెకు తెలుపుకుందాం అమితంగా మన కృతజ్ఞతలు.
ప్రతి ఉన్నత ఆత్మ ఆమెను సేవిస్తుంది.
కన్యా! మాతా! రాణీ! మమ్మల్ని అనుగ్రహించు!
దేవతా! ఎల్లప్పుడూ మాపై దయజూపు!

**కోరస్ మిస్టికస్ :** అంతా అదృశ్యమయ్యేది
ఓ చిత్ర కథగా ఉంటుంది.
మనకు సుదూరంగా ఉండేది
అతిస్పష్టంగా చూపబడింది.
ఇక్కడ పనులు అర్థం చేసుకోబడినాయి.
మాటలు నిగూఢంగా ఉంచబడినాయి.
శాశ్వత మాతృత్వం, ప్రేమ
మనల్ని ఊర్ధ్వలోకానికి తీసుకువెళ్తుంది.

# జోహన్ వోల్ఫ్‌గాంగ్ గేథే

## Johann Wolfgang Goethe (1749-1832)
## (The Chronology of Faust)

| | |
|---|---|
| C. 1480 | జార్జ్ (జోహాన్) ఫాస్ట్ జననం Knittlingen లో |
| 1506-36 | కొన్నికొన్ని పత్రాలలో ఫాస్ట్ పేరు కనిపిస్తుంది. |
| 1548-85 | ఫాస్ట్ గురించి అనేక కథలు, విడ్డూరాల ప్రచారం. |
| 1587 | మొదటి పుస్తకం Faust Chapbook విడుదల. |
| 1592 | మార్లో (Marlowe) రచన– The Tragical History of Doctor Faustus. |
| 1599 | రెండవ Faust buch (Faust chap book) ప్రచురణ. |
| 1608 | మార్లో 'ఫాస్టస్' నాటకం జర్మనీలో తొలి ప్రదర్శన. |
| 1674 | మూడవ Faustbuch (Faust chap book) ప్రచురణ. |
| 1725 | నాల్గవ Faustbuch (Christian intent) ప్రచురణ, గేథే చదివినది. |
| | |
| 1749 | 28 August 1749 ఫ్రాంక్‌ఫర్ట్–ఆమ్–మెయిన్‌లో గేథే జననం. |
| 1765-68 | యూనివర్సిటీ ఆఫ్ లీప్‌జిగ్ గేథే విద్యాభ్యాసం. |
| 1768-70 | ఫ్రాంక్‌ఫర్ట్‌లో కబాలిస్టిక్ సాహిత్యాన్ని చదివిన గేథే. |
| 1770 | సంచార నాటక కళాకారులచే Faust నాటక ప్రదర్శన–స్ట్రాస్‌బర్గ్‌లో |
| 1770-71 | స్ట్రాస్‌బర్గ్ యూనివర్సిటీలో గేథే; జానపద గేయాలు, పాటలపై ఆసక్తి. Gotz-Von Berlichingen రచన. |
| 1772 | 14 జనవరి 1772 తన అక్రమ సంతానాన్ని హత్యచేసిన Susanna Brandt శిరచ్ఛేదం. |
| 1772 | 'ఫాస్ట్' నాటకాన్ని మొదలుబెట్టిన గేథే. |
| 1774 | The Sorrows of Young Werther ప్రచురణ |

| | |
|---|---|
| 1775 | Weimer వచ్చిన గేథే - కారల్ ఆగష్ట్ ప్రభువు ఆహ్వానంతో. |
| 1775-86 | (Ministerial duties, growing interest in Natural Sciences, Amitie am aureuse with Charlottee Von stein, end of strom and stress phase, early version of Iphigenia in Touris, Wilhelm Meister and Torquate Tasso) |
| 1782 | Ennobled by the Emperor Joseph-II |
| 1786 | గేథే ఇటాలియన్ ప్రయాణం. |
| 1787 | ఇఫిజినియా ఇన్ టారస్ Final Version. |
| 1788 | 'ఫాస్ట్' (Second Phase) రచన ప్రారంభం. |
| 1788 | క్రిస్టియానె వల్పియస్‌తో పరిచయం - 1806లో వివాహం. |
| 1788-90 | Roman Elegies రచన. |
| 1790 | 'ఫాస్ట్' ప్రచురణ, A fragment and of 'Torquato Tosso' |
| 1794 | స్కిల్లర్ (Schiller)తో పరిచయం. పదకొండేళ్ల స్నేహంలో దాదాపు వేయి ఉత్తరాలు వ్రాసుకున్నారిద్దరూ. |
| 1797 | స్కిల్లర్ ప్రోత్సహించగా మూడోసారి 'ఫాస్ట్'ను మెరుగుపరచిన గేథే. |
| 1805 | స్కిల్లర్ మరణం |
| 1808 | Faust ప్రచురణ - The First Part of the Tragedy. |
| 1809 | The Elective Affinities ప్రచురణ. |
| 1825-31 | 'ఫాస్ట్' సంపూర్తి: The Second Part of Tragedy. |
| 1832 | 22 మార్చి 1832 గేథే మరణం. |

# Notes

**హెలెనా :** Helena is a fifty year old conception - అన్నాడు 1828లో గేథె. ఫాస్టస్ లెజెండ్స్‌లో ప్రసిద్ధికెక్కిన వాక్యం– మార్లో (Marlowe)ది.

- Was this the face that launched a thousand ships
And burnt the topless towers of Ilium ?"–

**డెవిల్‌తో ఒప్పందం :** గేథే దీనిని 1797–1801 మధ్యకాలంలో వ్రాసాడు. అంతకు ముందే 1771–1775లో గ్రెఛెన్ విషాదాంతాన్ని (Gretchen Tragedy) పూర్తి చేసాడు.

**ఫాస్ట్ ఆత్మ పరిశుద్ధ పరచబడడం :** Lessing, Goethe వీరిద్దరే ఫాస్ట్ పాపాలు క్షమింపబడగా, గ్రెఛెన్ ప్రేమ, సంకల్పంతో దేవుని సన్నిధికి చేరినట్లు వ్రాసారు. మిగతా కథలన్నీ ఫాస్ట్‌ను డెవిల్స్ నరకానికి తీసుకుపోయినట్లు వర్ణిస్తాయి.

**ఆనాటి రాజకీయ పరిస్థితులతో సంబంధం :** చక్రవర్తి సభలో మెఫిస్టాఫిలిస్ పాత్ర కాగ్లియోస్ట్రో ప్రభువు నుద్దేశించినది. అతగాడు మేరి ఏంటియోనెట్టి ప్రాపకాన్ని సంపాదించి 1785లోని వజ్రాలహారపు సంఘటనలో ప్రముఖ పాత్ర వహించాడు. గేథే దృష్టిలో అదే తిరుగుబాటుకు, విప్లవానికి సరైన సమయం.

అలాగే కాగితపు డబ్బు (Paper Money) సంఘటన 1790లోని వాస్తవిక సంఘటనలకు ప్రతిరూపం.

**విచిత్ర వేషాలు :** ప్లూటస్ పాత్రను ఫాస్ట్; ఎవారిస్ (పేరాశ) పాత్రను మెఫిస్టాఫిలిస్ పోషిస్తారు. బాలరధికుడు తర్వాత ఘట్టంలో వచ్చే యుఫోరియాన్‌లు ఒకరే అని ఆ పాత్రలు కవిత్వానికి ప్రతిరూపాలని (Personification of Poetry) గేథే వివరించాడు.

చక్రవర్తి దుస్తులు తగలబడడం కూడా వెనకటి కాలంలో జరిగిన సంఘటనే! 1394లో ఫ్రాన్సు చక్రవర్తి ఛార్లెస్-VI అటువంటి వినోద ప్రహసనంలో పాల్గొన్నపుడు ఓర్లియాన్ ప్రభువు చేతిలోని కాగడా మంట తగిలి రాజు దుస్తులు తగలబడగా ఆ క్రమంలో నలుగురు సభికులు మృతి చెందారు. రాజు మానసికంగా దెబ్బతిన్నాడు. దీనినే గేథే తన నాటకంలో వాడుకున్నాడు.

గేథే కు ఇష్టమైన 'అరేబియన్ నైట్స్' కథలలోని విచిత్ర సంఘటనలు 'ఫాస్ట్' నాటకంలో- దయ్యాల యుద్ధం, సముద్రపు అడుగున పట్టణం, వరదల సృష్టి, భూగర్భ నిధులు ఇటువంటివిగా కానవస్తాయి.

**మాతృమూర్తులు :** ప్లూటార్క్ రచనలలో కనిపించిన 'Goddesses who are called Mothers' అనే విషయాన్ని గేథే తన నాటకంలో ఉపయోగించినాడు.

**ఫార్సాలస్ :** మాసిడాన్ రాజు అలెగ్జాండర్ వంశీకుడు- పెర్సియస్ క్రీస్తుపూర్వం 168లో పెడ్నా వద్ద రోమన్ గణతంత్ర సైనికుల చేతిలో ఓడిపోవడంతో గ్రీకుల ప్రాభవం అంతమై రోమన్ వైభవం ఉద్దీపనమైంది. మరల 120 ఏళ్ల తరువాత సీజర్ అదే ఫార్సాలస్ వద్ద విజయం సాధించి గ్రీకుల రాజ్యాన్ని రోమన్ సామ్రాజ్యంలో భాగం చేసినాడు.

**హోమంకులస్ :** పారాసెల్సస్ (1490-1541) ప్రయోగం విచిత్రంగా ఉంటుంది. - "మనిషి వీర్యకణాన్ని గాజు కుప్పెలో ఉంచి దానిని గుర్రపు లద్దెల్లో నలభై రోజులు ఉంచాలి. బాగా మురిగినాక లోపల జీవపదార్థం జీవంతో తొణికిసలాడ్తుంది. మనిషిలా ఉన్న, పారదర్శకంగా ఉండి, శరీరం లేకుండా కనిపిస్తుంది. దానికి ప్రతిరోజూ మానవరక్తాన్ని (Arcanum of Man's blood) ఆహారంగా వేస్తూ నలభై వారాల పాటు గుర్రపు లద్దెల్లో వెచ్చగా ఉంచాలి. అలా పెరిగిన ఆ శిశువు తల్లిగర్భంలో పుట్టిన శిశువులానే ఉంటుంది కాని పూర్తిగా కాదు. అందుకే దానిని 'హోమంకులస్' లేదా ఆర్టిఫిషియల్ కృత్రిమ శిశువు అనవచ్చు. దానిని తరువాత దినాలలో చాలా జాగ్రత్తగా సంరక్షించుకోవాలి"

ప్రాచీన కాలంలో ఈ రకపు కథలు- కుండల్లో పుట్టినవాళ్లు, గాజు కుప్పెల్లో పుట్టినవాళ్లు (మన ఇతిహాసాల్లోని ద్రోణుడు, ఘటోత్కచుడు, ద్రుపదుడు, అగస్త్యుడు ఇటువంటివారే)

అరేబియన్ నైట్స్ కథల్లో, Schlutze రచన Anthropodemus Plutomicus, Sterne రచన Tristram Shandy లో ఉన్న 'హోమంకులస్' లాంటి విషయాలను ఎరిగిన గేథే ఆ పాత్రను తన నాటకంలో ప్రవేశపెట్టినాడు.

**లెడా (Leda)** ను జ్యూస్ దేవుడు హంస (Swan) రూపంలో కలవగా ఆమెకు జన్మించినది హెలెన్. లెడా మిగతా పిల్లలు క్లైటిమ్నెస్ట్రా (ఆగమెమ్నాన్ భార్య), కాస్టర్, పొల్లక్స్ (మిథునరాశి-Gemini) వీళ్లు మగపిల్లలు.

**యుఫోరియాన్ :** ఫాస్ట్, హెలెనాల పుత్రుడు.

**ఆర్కాడియా :** పెలొపొన్నిస్ పర్వత ప్రాంతం. థియొక్రిటస్, వర్జిల్‌లు కడు రమ్యంగా వర్ణించిన ప్రదేశం. గేథే తన ఫాస్ట్ నాటకంలో వర్జిల్ వర్ణనల్ని బహుగా ఉపయోగించినాడు. మానవుడు నివసించిన తొలి ప్రాంతంగా, చంద్రుడికన్నా పురాతనమైన ప్రదేశంగా భావించబడి– 'First land'గా Arcadia - పిలువబడింది.

**రెండుగా చీలిన మేఘం :** నాలుగవ అంకం (Act IV)లో మేఘం కొండ శిఖరాన రెండుగా చీలడం – ఆగ్నేయంగా వెళ్లింది హెలెన్‌కు, వాయువ్యంగా వెళ్లింది గ్రెఛెన్‌కు ప్రతీకలుగా గేథే పేర్కొన్నాడు.

**<u>గ్రీకు, రోమన్ పాత్రలు :</u>**

**ఎఖిల్లిస్ (Achilles):** పెలియస్, థెటిస్‌ల కుమారుడు. ట్రాయ్ యుద్ధంలో ప్రముఖ నాయకుడు. హెలెన్, ఎఖిల్లిస్‌లిద్దరూ చనిపోయాక ప్రేమికులయ్యారని ఓ కథ.

**ఏవొలస్ (Aeolus) :** గాలులకు అధిపతి. తుఫాను గాలుల్ని కొండగుహల్లో సంకెళ్లు వేసి భద్రపరచి అవసరమైనప్పుడు వదిలిపెడ్తాడు.

**ఎస్కులేపియస్ (Aesculapius) :** దేవతల వైద్యుడు. అపొలో దేవునికి మానవ స్త్రీకి పుట్టినవాడు. చిరాన్ అనే సెంటార్‌కు శిష్యుడు. ఇతని కుమార్తెలు ఐయాసొ, హైజియా, పనేసియా, మాంటొ.

**అజాక్స్ (Ajax) :** భారీకాయుడు. ట్రాయ్ యుద్ధంలో వీరుడు. పెద్దడాలు కలవాడు.

**అల్‌సెస్టెస్ (Alcestus) :** ఫెరీ రాజు అడ్మెటస్ భార్య. మృతుల లోకం నుంచి హెర్క్యులస్‌చే తీసుకు రాబడినది.

**అనాక్జగొరాస్ (Anaxagoras) :** యవన వేదాంతి. గ్రహశకలాలు భూమి నుంచి విడివడి వేగంతో పరిభ్రమిస్తున్నాయని, వేగం తగ్గితే మరల భూమిపై పడతాయని ప్రతిపాదించినవాడు. (క్రీస్తుపూర్వం 5వ శతాబ్దం)

**ఏంటియస్ (Anteus) :** సముద్ర దేవుడు పొజిడాన్, భూదేవి 'గెయా'ల కుమారుడు. నేలనంటినప్పుడల్లా అతడి శక్తి బహుళమవుతుంది. అందుకనే అతడిని హెర్క్యులస్ గాలిలోనే పీక పిసికి చంపినాడు.

**ఎఫ్రొడైట్ (Aphrodite) :** శృంగారాధి దేవత. రోమన్‌ల వీనస్, అస్సురో బాబిలోనియన్ల అస్తార్తె, ఇస్తార్, ఈజిప్షియన్ల ఐసిస్. సముద్రపు నురగ నుంచి పుట్టి సైథిరియా లేదా పాఫస్ ద్వీపాల వద్ద కనిపించిందంటారు.

**అపొలొ (Apollo) :** జ్యూస్, లెటొ దేవతల కుమారుడు. అందం, న్యాయం, ధర్మం, జోస్యం, వైద్యం, విలువిద్య, సంగీతాలకు అధిదేవత.

**అర్కాడియా (Arcadia) :** పెలొపొన్నిసిలో పర్వత ప్రాంతం. First land - తొలి దేశంగా ప్రసిద్ధికెక్కింది.

**ఏర్స్ (Ares) :** గ్రీకుల యుద్ధదేవత (రోమన్లకు Mars-మార్స్)

**అరిమాస్పియన్లు (Arimaspians) :** ఒక కన్ను గలవారు. తమ పొరుగువారు గ్రిఫిన్‌లతో బంగారం కోసం పోరాడుతుంటారు.

**ఏథెనె (Athene) :** జ్ఞానానికి, యుద్ధానికి ప్రతీక. జ్యూస్ తలనుంచి పుట్టిందని ప్రతీతి.

**అట్లాస్ (Atlas) :** దైత్యులలో ఒకడు. భూమిని తన భుజాలపై మోస్తాడు.

**బొరియాడ్లు (Boreads) :** ఉత్తరపు గాలి బొరియాస్ కుమారులు. రెక్కలున్నవాళ్లు.

**కాబిరి (Cabiri) :** పురాతన ఎగియన్ దేవతలు. బాలుర ముఖాలు, జాడీల దేహాలు కలిగినవారు. నావికులను తుఫానుల నుంచి రక్షిస్తారు.

**కాస్టర్, పొల్లక్స్ (Castor, Pollux) :** జ్యూస్ దేవుని కుమారులు; హెలెన్‌కు సోదరులు.

**కెయాస్ (Chaos) :** రూపరహిత ఆదిమ పదార్థం – భూమికి (Gaia) రాత్రికి (Nyx); చీకటి (Erebus)కి జన్మనిచ్చింది.

**చిరాన్ (Chiron) :** అశ్వదేహం, మానవ శిరస్సు ఉన్న సెంటార్. క్రొనస్, ఫిలిరాల కుమారుడు. అపొలొ శిష్యుడు. ఎస్క్యులేపియస్, జేసన్, ఎఖిల్లిస్, హెర్క్యులస్‌ల గురువు.

**సిర్సి (కిర్కె -Circe) :** సూర్యుని కుమార్తె, మంత్రగత్తె. ఒడెస్సీలో ప్రముఖ పాత్ర. ఒడిసిస్‌ను ఆకర్షించి కాపురం చేస్తుంది.

**క్లైటిమ్నెస్ట్రా (Clytemnestra) :** లెడా, టిండారియస్‌ల కుమార్తె. హెలెన్‌కు సోదరి. ఆగమెమ్నాన్ భార్య. ట్రాయ్ యుద్ధానంతరం ఇంటికి వచ్చిన భర్తను తన ప్రియుడి సాయంతో చంపేస్తుంది.

**క్రొనస్ (Cronus) :** జ్యూస్ తండ్రి. దైత్యులకు అధిపతి.

**సైక్లాప్స్ (Cyclops) :** ఏకాక్షులు. వీరిలో ఒకడైన పాలిఫెమస్‌ను ఒడెస్సిస్ అంధుడిని చేసి తప్పించుకుంటాడు. సైక్లాప్స్ పిడుగుల్ని తయారుచేసి జ్యూస్ దేవుడికిస్తారు.

**డిఫొబస్ (Deiphobus) :** పారిస్ సోదరుడు. పారిస్ చనిపోయాక హెలెన్‌ను పెండ్లాడి మెనెలాస్ చేతిలో చిత్రవధ చేయబడ్డాడు.

**డయానా (Diana) :** వేటకు అధిపతి. జ్యూస్, లెటొల కుమార్తె. చంద్రదేవత (Luna).

**డయొనిసియస్ (Dionysius) :** మధువుకు, ద్రాక్షపంటకు అధిదేవత. విందు వినోదాలకు విపరీత పోకడలకు ఇతడి అనుయాయులైన సాటిర్లు, ఫాన్స్, మీనిడ్లు ప్రసిద్ధికెక్కారు. బాకస్ (రోమన్); ఒసిరిస్ (ఈజిప్షియన్) దేవతలు ఇతని లాంటివారే.

**డొరిడ్లు (Dorids) :** సముద్ర కన్యలు. నీరిడ్లకు సోదరీమణులు (Nereids).

**డ్రయాడ్ (Dryad) :** వనకన్య.

**ఎలూసిస్ (Eleusis) :** ఏథెన్స్‌కు పశ్చిమాన ఉన్న తీర పట్టణం.

**ఎంపుసా (Empusa) :** గాడిద కాళ్లున్న రక్తపిశాచి, బహురూపి.

**ఎంసిలాడస్ (Enceladus) :** దైత్యుడు. అగ్ని పర్వతాల క్రింద ఆక్రందన చేస్తుంటాడు.

**ఎరిక్తొ (Erichtho) :** థెస్సాలియన్ మంత్రగత్తె, రక్తపిశాచి, జోస్యురాలు.

**ఎరాస్ (Eros) :** కామదేవుడు. క్యుపిడ్ (Cupid)గా రోమన్లకు తెలిసినవాడు.

**యుఫొరియాన్ (Euphorion) :** హెలెన్, ఎఖిల్లిస్‌ల పుత్రుడు. ఇతడిని కామించిన జ్యూస్ దేవుడు మెలాస్ ద్వీపానికి తరుముకు వెళ్లి పిడుగుతో కూల్చి చంపాడని కథనం. అతడి దేహాన్ని ఖననం చేసిన వనకన్యలు కప్పలుగా మారారట. ఇతడినే గేథే హెలెన్, ఫాస్ట్‌ల కుమారుడిగా వర్ణించాడు.

**యురొటస్ (Eurotas) :** నదీ దేవుడు. ఈ నది పక్కనే గుడ్డునుంచి 'హెలెన్' బయటకు వచ్చిందంటారు.

**ఫేట్స్ (Fates) :** అదృష్టదేవతలు–విధిదేవతలు (నార్న్స్, మొయిరాయి ఇతర పేర్లు)

**ఫ్యూరీస్ (Furies) :** ఆగ్రహ దేవతలు. తప్పు చేసినవారిని శిక్షిస్తారు.

**గలాటియా (Galatea) :** సముద్ర కన్య; నెరియస్ ప్రియ కుమార్తె.

**గార్గన్ (Gorgon) :** శిరోజాలు సర్పాలుగా ఉండే రాక్షసి. ముగ్గురు అక్కాచెల్లెళ్లు– స్థెనొ, యురియాలె, మెడుసా. పెర్సియస్ తన దివ్యశక్తులతో మెడుసా తల నరికి చంపుతాడు.

**గ్రేసెస్ (Graces) :** అందాల దేవతలు – ఎగ్లాయియా, థాలియా, యుఫ్రొసిని)

**గ్రిఫిన్ (Griffin) :** సింహ శరీరం, గ్రద్ద రెక్కలున్న మృగం. బంగారానికి కాపలా ఉంటుంది. వీటికి శత్రువుల అరిమాస్పియన్లు.

**హేడ్స్ (Hades) :** అథోలోకాధిపతి. పెర్సిఫోని భర్త.

**హార్పీస్ (Harpies) :** గాలిపక్షులు, పిశాచాలు. రెక్కల పక్షులు స్త్రీల ముఖాలుండి, తినే పదార్థాలపై వమనం చేస్తాయి.

**హెబె (Hebe) :** దేవతలకు మధువునందిస్తుంది. హెర్క్యులస్ భార్య.

**హెలెన్ (Helen) :** స్పార్టా రాణి 'లెడా'ను హంస రూపంలో జ్యూస్ దేవుడు కలవగా పుట్టిన గుడ్డులోంచి హెలెన్ జన్మిస్తుంది. అతిలోక సుందరి. మెనెలాస్‌ను పెళ్లాడినాక కొన్నాళ్లకు పారిస్ ఆమెను లేవదీసుకునిపోతాడు. అదే ట్రాయ్ యుద్ధానికి కారణమవుతుంది. కొన్ని కథల్లో అసలు హెలెన్ ఈజిప్టులోనే ఉండగా, ఆమె రూపం మాత్రమే ట్రాయ్ వెళ్లిందని తిరుగు ప్రయాణంలో మరల మెనెలాస్‌తో తిరిగివచ్చిందని చెబుతారు. (మన పురాణ కథల్లో మాయాసీత కథ ఇంచుమించు ఇలానే ఉంటుంది)

**హిలియాస్ (Helios) :** అపోలో, సూర్యదేవుడు.

**హెర్క్యులస్ (Hercules) :** హెరాక్లిస్ – జ్యూస్, ఆల్కమినాల కుమారుడు. ఆమె భర్త ఏంఫిట్రియాన్ రూపంలో వచ్చి కలుస్తాడు జ్యూస్‌దేవుడు (అహల్య, గౌతముడు, ఇంద్రుడి కథ). హెరాక్లిస్ పన్నెండు కార్యాలు ప్రసిద్ధికెక్కినవి. హెరాక్లిస్‌ను కొందరు కృష్ణుడిగా భావిస్తారు.

**హెర్మాఫ్రొడైట్ (Hermaphrodite) :** హెర్మెస్, ఎఫ్రొడైట్‌ల కుమారుడు. ద్విలింగ లక్షణాలున్నవాడు.

**హెర్మెస్ (Hermes) :** మెర్క్యురి – ఆర్కాడియాలో జ్యూస్, మెయియా దేవతలకు జన్మించినవాడు. దేవతల వార్తాహరుడు. వేగానికి ప్రసిద్ధి. వ్యాపారులకు, దొంగలకు అధిదేవుడు.

**హిప్పొకాంపస్ (Hippocampus) :** సముద్రపు గుర్రం.

**హవర్స్ (Hours - Horae) :** గంటలకు, ఋతువులకు దేవతలు. జ్యూస్ దేవుని కుమార్తెలు. ఆకాశ ద్వారానికి కాపలా ఉంటారు.

**ఇబికస్ (Ibycus) :** ఇబికస్ కవిని బందిపోటు దొంగలు చంపుతున్నపుడు ఆకాశంలో పోతున్న కొంగల గుంపు అరుస్తాయి. దొంగలు భయపడి తమ నేరాన్ని ఒప్పుకుని లొంగిపోతారు.

**ఇకారస్ (Icarus) :** మహాశిల్పి డిడాలస్ కుమారుడు. తండ్రితో పాటు రెక్కల్తో ఎగుర్తూ, తండ్రి వద్దన్నా వినక పైకెగిరి, రెక్కలకున్న మైనం ఎండవేడికి కరిగిపోగా, సముద్రంలో పడి మరణిస్తాడు.

**జేసన్ (Jason) :** ఆర్గొనాట్ల నాయకుడు. మెడియా మంత్రగత్తెను వివాహమాడతాడు. బంగారు ఉన్నిని సాధించిన వీరుడు.

**జునొ (Juno) :** జూపిటర్ భార్య (జ్యూస్ దేవుని పత్ని 'హెరా')

**జ్యూపిటర్ (Jupiter) :** ద్యుస్ పితరుడు. (జ్యూస్–Zeus). (ఇంద్రుడు)

**లామియె (Lamiae) :** స్త్రీరూపం ధరించి సమ్మోహనపరిచే రక్తపిశాచులు.

**లెడా (Leda) :** టిండారియస్ భార్య. హెలెన్ తల్లి. జ్యూస్ దేవుడు హంసరూపంలో కలవగా హెలెన్, క్లైటిమ్నెస్ట్రా, కాస్టర్, పొల్లక్స్‌లకు జన్మనిస్తుంది.

**లెముర్లు (Lemurs) :** మృతుల ఆత్మలు.

**లెర్నియన్ సర్పం (Lernaean Snake) :** అనేక తలలున్న నీటిసర్పం. హెర్క్యులస్ దాని తలలు నరకగా, అతడి స్నేహితుడు వాటిని మళ్లీ పెరగకుండా కాల్చేస్తాడు.

**లెథె (Lethe) :** మతిమరపు నది. అధోలోకపు నదుల్లో ఒకటి.

**లెటొ (Leto) :** అపొలో, ఆర్టెమిస్ (డయానా)ల తల్లి, జ్యూస్ ప్రేమికురాలు.

**ల్యూనా (Luna) :** చంద్రదేవత. ఎండెమియాన్ అనే యువకుడిని ప్రేమించి నేలపైకి దిగివచ్చిందని ప్రతీతి.

**లిన్సెయస్ (Lynceus) :** ఆర్గొనాట్లలో ఒకడు. దీర్ఘదృష్టి కలవాడు.

**మెయియా (Maia) :** అట్లాస్ కుమార్తె. జ్యూస్‌తో కలిసి హెర్మెస్‌కు జన్మనిచ్చింది.

**మాంటొ (Manto) :** థెస్సాలియన్ మంత్రగత్తె. మృతుల్ని లేవనెత్తగలదు. ఫాస్ట్ నాటకంలో ఆమె ఎస్క్యులేపియస్ కుమార్తెగా వర్ణించబడింది.

**మెనెలాస్ (Menelaus) :** ఆగమెమ్నాన్ సోదరుడు, హెలెన్ భర్త.

**మ్యూజెస్ (Muses) :** తొమ్మిదిమంది వివిధ కళలకు అధిదేవతలు.

**నెరియస్ (Nereus) :** పురాతన సముద్రదేవుడు.

**నెస్టర్ (Nestor) :** ట్రాయ్ యుద్ధంలో పాల్గొన్నవారిలో వృద్ధుడు; పైలాస్ రాజు.

**ఇడిపస్ (Oedipus) :** థెబెస్ రాజు లెయస్ కుమారుడు. పుట్టినపుడు ఇతడు తండ్రిని చంపి తల్లిని వివాహమాడ్తాడని జోస్యం చెప్పబడగా అతడిని

కాళ్లు చేతులు బంధించి పర్వతాల వద్ద పారేస్తారు. కాని జోస్యం నిజమవుతుంది.

**ఒలింపస్ (Olympus) :** గ్రీసుదేశపు తూర్పున ఉన్న ఎత్తైన పర్వతం. జ్యూస్ తదితర దేవతల నివాస స్థానం.

**ఒరియాడ్లు (Oreads) :** పురాతన వేటగాళ్లు.

**ఆర్ఫియస్ (Orpheus) :** కవి, సంగీతజ్ఞుడు. ఆర్గొనాట్లలో ఒకడు. తన వేణువుతో వృక్షాలు, పశుపక్ష్యాదులను సమ్మోహనపరచగలిగినవాడు. చనిపోయిన తన భార్య యురిడైస్ (Eurydice) కోసం పాతాళలోకం వెళ్లి తన వేణుగానంతో 'పెర్సిఫొని' మెప్పుపొంది భార్యను తీసుకువస్తూ, వెనక్కు తిరిగి చూడకూడదన్న నియమాన్ని చివర్లో ఉల్లంఘించి భార్య శాశ్వతంగా కోల్పోతాడు.

**పాన్ (Pan) :** అరణ్యాలకు, వనాలకు, మైదానాలకు, పశు సంపదకు అధిదేవత. మనిషి తల, శరీరం, చేతులు; మేక కాళ్లు, చెవులు, కలిగి ఉంటాడు. లింగారాధకులు అతని అనుయాయులు. అతని కామానికి బలైన ఎఖొ (Echo) వనకన్య ప్రతిధ్వనిగా మిగుల్తుంది. పాన్ దేవుడు అడవుల్లో తిరుగుతూ అకస్మాత్తుగా చేసే అల్లకల్లోలంతో, శబ్దాలతో ఆ చుట్టుపక్కల ప్రదేశం వణికిపోతుంది.

**పారిస్ (Paris) :** ట్రాయ్ రాజు ప్రియామ్ కుమారుడు. అందగాడు. చిన్నప్పుడే కొండలపై వదిలిపెట్టబడి, గొర్రెల కాపరిగా పెరిగి ముగ్గురు దేవతల (Judgement of Paris) తగవును తీర్చిన తరువాత హెలెన్‌ను అపహరించి ట్రాయ్ యుద్ధానికి కారణమైనవాడు.

**పర్నాసస్ (Parnassus) :** డెల్ఫి దగ్గరనున్న ఎత్తైన పర్వతం. డెల్ఫి జోస్యానికి ప్రసిద్ధి. అపొలో, మ్యూజ్ దేవతలకు తిరుగాడే ప్రదేశం. కాస్టాలియా అప్సరస అపొలోను తప్పించుకుని పారిపోతూ నీటిలో దూకిన ప్రదేశం.

**పాట్రొక్లస్ (Patrtoclus) :** ఎఖిల్లిస్ ప్రాణ స్నేహితుడు. హెక్టార్ చేతిలో మరణిస్తాడు. ఎఖిల్లిస్ హెక్టార్‌ను చంపడంతో ట్రాయ్ యుద్ధం దాదాపు ముగింపుకు వస్తుంది.

**పెలియస్ (Peleus) :** ఎఖిల్లిస్ తండ్రి. థెటిస్ భర్త.

**పెలాప్స్ (Pelops) :** గ్రీసు దక్షిణదేశానికి రాజు. పెలొపొన్నిసి అతడి పేరునుంచే వచ్చింది. (Peloponnese)

**పెనియస్ (Peneus) :** థెస్సాలేలో ముఖ్య నది. 'వాల్‌పర్గిస్ నైట్' జరిగేదిక్కడే.

**పెర్సిఫొని (Persephone) :** నేలతల్లి (Demeter) కుమార్తె. హేడ్స్ ఆమెను అపహరించి పాతాళానికి తీసుకుపోయి వివాహమాడతాడు. ప్రతి ఏడాది ఆమె భూలోకానికి వచ్చే కాలాన్ని పంటల కోతకాలంగా భావిస్తారు.

**పెర్సియస్ (Perseus) :** జ్యూస్, డానాల కుమారుడు. ఒంటిస్తంభంపై ఉన్న ఆమెపై బంగరు వర్షంలో కురిసి జ్యూస్‌దేవుడు ఆమెతో కలుస్తాడు. పెర్సియస్ సాహస కృత్యాలలో ముఖ్యమైనది మెడుసా గార్గన్‌ను వధించడం.

**ఫెరీ (Pherae) :** థెస్సాలేలో ఓ నగరం.

**ఫిలొమాన్, బాసిస్ (Philemon & Baucis) :** జ్యూస్, హెర్మెస్‌లు మారువేషాల్లో సంచరిస్తున్నపుడు ఫ్రిజియా దేశస్థులు వారికి ఆశ్రయం ఇవ్వలేదు. పేదవారైన ఈ వృద్ధజంట ఆతిథ్యమివ్వగా జ్యూస్ దేవుడు వారికి ఒకేసారి చనిపోయే వరాన్నిచ్చి, మిగతా వాళ్లను వరదల్లో ముంచేస్తాడు. చనిపోయాక ఫిలొమాన్ 'ఓక్' వృక్షంగా, బాసిస్ లిండెన్ వృక్షంగా జన్మిస్తారు.

**ఫిలైరా (Philyra) :** సముద్రకన్య. చిరాన్‌కు తల్లి. లిండెన్ వృక్షం.

**ఫీబస్ (Phoebus) :** అపొలో; సూర్యదేవుడు.

**ఫొర్సియాడ్లు (Phorcyads) :** గ్రెయియా – ముసలి మంత్రగత్తెలు. వాళ్ల ముగ్గురికి ఒకే కన్ను, ఒకే పన్ను.

**ఫ్లుటస్ (Plutus) :** ధన దేవత.

**పొజిడాన్ (Poseidon) :** సముద్ర దేవత, భూకంపాలకు అధిపతి. (నెప్ట్యూన్) ఒంటికన్ను సైక్లాప్స్‌కు తండ్రి.

**ప్రొటిసిలాస్ (Protesilaus) :** చనిపోయినాక మూడు గంటలసేపు భార్య వద్దకు యధారూపంలో వచ్చిన థెస్సాలియన్ వీరుడు.

**ప్రొటియస్ (Proteus) :** సముద్ర దేవుడు. పొజిడాన్ అనుచరుడు. బహురూపి, జోస్యం చెప్పగలవాడు. గట్టిగా చాలాసేపు వదలకుండా పట్టుకుంటే స్వస్వరూపానికి వచ్చి జవాబిస్తాడు.

**సైకె (Psyche) :** మానవ ఆత్మకు ప్రతిరూపం (ఊపిరి -breath) మానవ శరీరం, సీతాకోక చిలుక రెక్కలు;

**సిల్లి (Psylli) :** సిల్లి (లిబియా); మార్సి (ఇటలీ) – అనాది ప్రజలు. పాముల మంత్రగాళ్లు. గలాటియాకు అనుచరులు.

**పిథియన్ మంత్రగత్తె (Pythian Priestess) :** డెల్ఫి వద్ద అపోలో తరఫున జోస్యం చెప్పే మంత్రగత్తె. పైథాన్ సర్పాన్ని చంపి అపోలో ఆ బిరుదును సాధించాడు.

**రియా (Rhea) :** క్రోనస్ సోదరి మరియు భార్య, జ్యూస్‌కు తల్లి. రోమన్లు క్రోనస్‌ను Saturnగా, రియాను Ops గావ్యవహరిస్తారు.

**రొడిస్ (Rhodes) :** ఎగియన్ ద్వీపం; అపోలో దేవునికి ప్రీతిపాత్రం. Colossus of Rhodes విగ్రహం ఉంచిన ప్రాంతం.

**సమొథ్రేసి (Samothrace) :** కాబిరిలుండే ద్వీపం.

**సాటిర్ (Satyr) :** డయొనిసిస్ అనుచరులు, మానవ జంతు మిశ్రమ రూపాలు.

**స్కిల్లా (Scylla) :** కారిబ్డిస్ సుడిగుండం పక్కన ఉండే ఆరు తలల రాక్షసి ఫోర్సిస్ కుమార్తె. ఒడెసిస్ అనుచరులు ఆరుగుర్ని మింగేస్తుంది.

**సీస్మాస్ (Seismos) :** భూకంప దేవత.

**సిబెల్ (Sibyl) :** సోదికత్తెలు. జోస్యురాళ్లు

**సెలెనస్ (Silenus) :** అరణ్యదేవత. పాన్ లాంటి ఆకారం గలవాడు.

**సైరన్లు (Sirens) :** స్త్రీ ముఖం, పక్షి శరీరమున్న రాక్షస పక్షులు. తమ గానంతో నావికులను సమ్మోహనపరచి నౌకలు ధ్వంసమయ్యేలా చేసి, నావికులను చంపేస్తారు. ఒడెసిస్ తన అనుయాయులకు చెవిలో మైనం కూర్చి, తనను స్తంభానికి కట్టివేయించుకుని గండం గట్టెక్కుతాడు.

**స్పార్టా (Sparta) :** టిండారియస్ రాజధాని. తర్వాత మెనెలాస్ దానికి రాజవుతాడు. మరోపేరు Lacedaemon.

**స్ఫింక్స్ (Sphinxes) :** మానవ శిరస్సున్న రెక్కల సింహం. స్త్రీ రూపం. థెబెస్ దగ్గరుండి చిక్కుప్రశ్నలడిగేది. ఇడిపస్ దాని ప్రశ్నకు సమాధానం చెప్పగా సముద్రంలో పడి మరణిస్తుంది.

**స్టింఫాలిడ్లు (Stymphalids) :** స్టింఫాలియన్ పక్షులు– హెర్క్యులస్ చేతిలో మరణించిన పిశాచ పక్షులు.

**టెల్కైన్లు (Telchines) :** రొడ్స్ ద్వీపవాసులు. మహా శిల్ప నిర్మాతలు.

**థేల్స్ (Thales) :** క్రీస్తుపూర్వం 600 – మొదటి గ్రీకు వేదాంతి. నీరు అన్నిటికి మూలం అని ప్రతిపాదించినవాడు.

**థెబెస్ (Thebes) :** బొయొషియాలో ముఖ్య ప్రదేశం. అనేక వింత కథలకు స్థానం. డయొనిషియస్, హెర్క్యులస్‌ల జన్మస్థానం. ఏడుగురు వీరులు దండెత్తిన పట్టణం. (Seven against Thebes).

**థెసియస్ (Theseus) :** ఎగియస్ కుమారుడు. క్రెటెలోని మినొటార్ వృషభాసురుడిని చంపినవాడు. హెలెన్ బాలికగా ఉండగా అపహరించాడు.

**థెస్సాలె (Thessaly) :** సారవంతమైన ప్రదేశం. మంత్రగత్తెలకు నిలయం.

**Thyssus Staff :** ద్రాక్ష ఆకులు చుట్టి, పైన పైన్ శంకువు అమర్చిన కర్ర. డయొనెషియస్ అనుచరులు దాన్ని పట్టుకుని తాగి గంతులేసేవారు.

**టిరెసియాస్ (Tiresias) :** థెబన్ జ్యోతిష్కుడు. ఏడు లేక తొమ్మిదింతల ఆయుర్దాయ మున్నవాడు.

**టైటాన్లు (Titans) :** దైత్యులు. యురేనస్ (ఆకాశం), గెయియా (భూమి)కి పుట్టినవాళ్లు. అందరిలోకి చిన్నవాడు క్రొనాస్. క్రొనాస్ తన సోదరి రియాను వివాహమాడగా జ్యూస్ తదితర తరువాత తరం దేవతలు జన్మిస్తారు.

క్రోనస్ తన తండ్రి యురేనస్ వృషణాలను కోసి సముద్రంలోకి విసిరేసి రాజ్యాధిపత్యాన్ని చేజిక్కుంచుకుంటాడు. తరువాత అతడి పుత్రులు జ్యూస్ నాయకత్వాన 'క్రోనస్'ను తొలగదోసి రెండవతరం దేవతలవుతారు. ఆ యుద్ధం పదేళ్లపాటు సాగుతుంది. (Titanomachy).

**ట్రిటాన్లు (Tritons) :** మానవ రూపం చేప శరీరమున్న సముద్ర దేవతలు. పొజిడాన్ కుమారులు.

**ట్రాయ్ (Troy - Troia) :** ట్రాయ్, ఇలియం అని పేర్లున్న ఈ ప్రదేశం ఆసియా మైనర్‌లో వాయువ్య మూలన ఉన్నది. హోమర్ విరచిత ఇలియాడ్‌లో ముఖ్య కథావేదిక ఇది. పదేళ్ల యుద్ధంలో గ్రీకులు, ట్రోజన్లను ఓడించి, తమ రాణి హెలెన్‌ను ట్రాయ్ రాకుమారుడు పారిస్ ఎత్తుకు వచ్చినందుకు, ట్రాయ్ నగరాన్ని ధ్వంసం చేసి ప్రతీకారం తీర్చుకుంటారు.

**ట్విన్స్ (Twins) :** కవలలు. కాస్టర్, పొల్లక్స్‌లు. లెడా కుమారులు. జ్యూస్ దేవుని వలన జన్మించిన వారుగా Dioscuri గా పిలువబడుతున్నారు. ఆకాశంలోని జెమిని (Gemini) వీరికి ప్రతిరూపం. 'క్యాబిరి'లు కూడా వీరి రూపాలని కొందరంటారు.

**టిండారియస్ (Tyndareus) :** హెలెన్ తండ్రి. లెడా భర్త. స్పార్టా రాజు.

**యులిసెస్ (Ulysses) :** ఒడెసిస్‌కు మరో పేరు.

**జ్యూస్ (Zeus) :** దేవేంద్రుడు. రోమన్లకు జూపిటర్. ఇతడి తండ్రి క్రొనస్ తన ఆధిపత్యానికి ముప్పు వస్తుందని పుట్టిన శిశువులను మింగివేస్తాడు. ఆఖరివాడైన జ్యూస్‌ను తల్లి 'క్రెటె' ద్వీపంలో దాచి పెంచుతుంది. జ్యూస్ పెరిగి పెద్దవాడై తండ్రిని, ఇతర దైత్యులను ఓడించి తన పరిపాలనను సుస్థిరం చేసుకుంటాడు. తరువాత తన సోదరులు పాజిడాన్‌కు సముద్రాన్ని, హేడ్స్‌కు అథోలోకాన్నిఇచ్చి తాను ఊర్ధ్వలోక పరిపాలకుడిగా ప్రకటించు కుంటాడు. సైక్లాప్స్ చేసి ఇచ్చే పిడుగులు అతని ఆయుధాలు. Cloud gatherer అతడికి మరో పేరు. ఒలింపస్ పర్వతం అతడికి, మిగతా దేవతలకు నివాస స్థానం. తన సోదరి 'హెరా'ను వివాహం చేసుకున్నా, అనేకమంది దేవతలు, మానవ స్త్రీలతో కలిసి – Father of gods and men గా ప్రసిద్ధికెక్కినాడు.

# గేథే ప్రేమకథ
# (Goethe in Love)

1806లో గేథే తనతో పద్దెనిమిది సంవత్సరాలుగా కలిసివున్న క్రిస్టియానె వల్పియస్ (1765-1816)ను వివాహం చేసుకున్నాడు. వారి కుమారుడు ఆగస్టస్ (1789-1830).

1814 జులైలో గేథే ఫ్రాంక్‌ఫర్ట్ వెళ్లినప్పుడు మొదటిసారిగా మేరియాని వాన్ విలెమలర్‌ను చూసాడు. ఆమెతో పరిచయం అతడిలోని కవితాశక్తిని మరింత ఉప్పొంగింపజేసి అద్భుతమైన కవితలను వ్రాయించింది.

ఆమెకప్పుడు ముప్ఫై సంవత్సరాల వయసు. సంగీత సాహిత్యాలలో దిట్ట అయిన నటీమణి. మేరియాని జంగ్ గా 1800లో జోహాన్ జాకబ్ వాన్ విల్లమర్ ఆమెకు ఇరవై నాలుగు సంవత్సరాలు పెద్ద, భాగ్యవంతుడు, ఫ్రాంక్‌ఫర్ట్ బ్యాంకర్-అయిన అతనితో పరిచయం కాగా అది క్రమేపీ వివాహానికి దారితీసింది. (సెప్టెంబర్ 1814). పిల్లలు పుట్టకపోవడం, సంతోషం లేని జీవితం వారిలో కలతలు రేపగా ఆమె మనసు గేథేపై మొగ్గింది.

1815లో వారిద్దరికి అర్ధమయ్యిందేమిటంటే ఇద్దరూ ఒకరంటే ఒకర్ని అమితంగా ఇష్టపడుతున్నారని. ఆ సమయంలో గేథే West-Eastern Divan వ్రాస్తున్నాడు. వాటిలోని కొన్ని కవితలు మారియానె వ్రాయగా గేథె వాటిని సంస్కరించి తన పేరున ప్రచురించాడు.

జూన్ 1816లో క్రిస్టియానె మరణించింది. ఆ తరువాత ఫ్రాంక్‌ఫర్ట్‌వెళ్లి మారియానెను కలవాలా వద్దా అనే సందిగ్ధస్థితి. వీమర్ నుంచి బయల్దేరిన రెండు గంటలకు గుర్రపు బండి తలకిందులు కాగా దానిని అపశకునంగా భావించి గేథే ప్రయాణం మానుకుని ఇంటికి తిరిగి వచ్చేసాడు.

మారియానెతో మాట్లాడడం, ఉత్తర ప్రత్యుత్తరాలు నిలిపివేసాడు. ఏ కారణమూ చూపడు. సంవత్సరాల పాటు సాగిన ఆ మౌనానికి తట్టుకోలేక మారియానె మానసికంగా కృంగిపోయింది. ఆమె సందేశాలు, ఆమె భర్త విల్లెమర్ విజ్ఞప్తులు ఆతడిని కదిలించలేదు. చివరకు విల్లెమర్ ముగ్గురూ కలిసివుండే Menage de trios ను కూడ ప్రతిపాదించాడు. గేథేను తన గృహంలో ఉండవలసిందిగా బ్రతిమాలాడు.

1819లో గేథే మరల మారియానె ఉత్తరాలకు జవాబులివ్వసాగినాడు. కాని మరణించేంత వరకు ఆమెను కలవలేదు.

గేథే చనిపోవడానికి మూడు వారాల ముందు 1832లో మారియానెకు ఒక పాకెట్ అందింది. 'Donot open until the uncertain time comes' – దానిలో ఆమె తనకు వ్రాసిన ఉత్తరాలు, ఒక చిన్న కవిత ఉన్నాయి.

'A Legacy' -

To my darling now I send them,
Back into the hand that penned them-
How I waited for them, burning
with the love they were returning -
To her heart they poured from, may
these her letters find their way,
Ever ready to recall
There the loveliest time of all.

1860లో మారియానె చనిపోయేంతవరకు ఆమె మామూలు మనిషి కాలేదు. ఆమె గేథెను అంతగా ప్రేమించింది. ఇదే గేథె–మారియానె–ఒక ప్రేమకథ!

# Bibliography


| | | | |
|---|---|---|---|
| **1.** | **Goethe - Faust - Part One** | - | David Luke |
| **2.** | **Faust - Part-I** | - | Walter Kaufmenn |
| **3.** | **Faust** | - | Charles E-passage |
| **4.** | **Faust Part-I** | - | Randall Jarrell |
| **4.** | **Faust Part-I** | - | Stuart Atkins |
| **6.** | **Wikipedia** | | |

## Dr. LANKA SIVA RAMA PRASAD



M.B.B.S; M.S (General Surgery);
M.Ch (Cardio Thoracic & Vascular Surgery)
FIVS (Fellow in Vascular Surgery)
Post Graduate Diplomate in Human Rights
Post Graduate Diplomate in Television Production
Web Engineer- Web Designer
Member of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Cell Animation Artist (Heart Animation Acadamy - Hyderabad)
Computer Animation Specialist (Pentafour- Chennai)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

# డాక్టర్ లంకా శివరామప్రసాద్ రచనలు

1. **సత్యాన్వేషణలో (లజ్జ–2012) (నవల) :** ప్రేమ నుంచి పేదరికం వరకూ, చరిత్ర వక్రీకరణల నుంచి ఇప్పటి యుద్ధాలవరకూ అనేక అంశాలను రచయిత కథారూపాలతో పాఠకుల ముందు పెట్టిన తీరు విలక్షణంగా ఉంది. (ఇండియాటుడే).

2. **ఆల్కెమీ (కవిత్వం) :** 'కవిత్వం ఒక ఆల్కెమీ'.

3. **How to be Happy :** a highly popular book of Prasad's naration and Jayadev's Cartoons.

4. **వానమబ్బుల కాంతిఖడ్గం (కవిత్వం) :** స్త్రీ పుట్టిన నాటినుంచి గిట్టేవరకూ పడే కడగళ్లను కవిత్వీకరించిన కవితామాలిక.

5. **సంఖ్యాశాస్త్రం :** సంఖ్యలలోని అద్భుతాలను వివరించే మార్మికశాస్త్రం.

6. **డా. జయదేవ్ కార్టూన్లు :** ప్రసాదు ట్యూన్లు+డా. జయదేవ్ కార్టూన్లు – ఓ కొత్త ప్రయోగం (ఆంధ్రజ్యోతి)

7. **జీనోమ్ (సప్తమ అంతర్ధానం) :** తెలుగులో తొలి బయోటెక్నాలజీ నవల. అనేక దేశాల తత్త్వ, మత, సమాజ, విజ్ఞాన శాస్త్ర రంగాలలో మానవజాతి సాగించిన అద్భుత జిజ్ఞాసాయాత్రకు ఆధునికాక్షరభాష్యం (నడుస్తున్న చరిత్ర – ఇండియాటుడే).

8. **టీకప్పులో తుఫాను (కవిత్వం) :** పంచభూతాల ఉత్పత్తిపై ప్రాచీనుల ఊహలు, నవీన మానవుని కాలుష్యదురాక్రమణలను వివరించే దీర్ఘకావ్యం.

9. **Shades (Poetry - English) :** A rare piece of work; Shades is not a collection but a revelation. ( Dr. Jayadev)

10. **The Twilight Zone (Poetry - English)** is about the final scene of a life's drama.

11. **స్వప్నశాస్త్రం (తెలుగు) :** స్వప్నాలపై, స్వప్న విశ్లేషణలో తెలుగులో వచ్చిన ఏకైక సాధికారక గ్రంథం. (వార్త)

12. **In Search of Truth (English Novel) :** What is the ultimate Truth? a book about Death with subliminal Message.

13. **తంగేటి జున్ను (కవిత్వం) :** తీయగా, స్వచ్ఛంగా ప్రవహించిన కవితాజలధార.

14. **Soundarya Lahari (Poetry-English) :** Highly acclaimed book reached many places. (Sankaracharya's mystic poems explained and translated in Modern perspective)

15. **Bhagavatam (Poetry-English) :** An abridged Version of Potana's Bhagavatam into simple, lucid English. The second revised edition with commentery is released.

16. **మూడు స్వప్నాలు ఒక మెలకువ (కవిత్వం) :** ముగ్గురు కవులు (పొట్లపల్లి శ్రీనివాసరావు, రామా చంద్రమౌళి, లంకా శివరామప్రసాద్‌ల కవిత్వఝురి).

17. **సుప్రసన్నాచార్య 'సాంపరాయం'** – ఇంగ్లీషు అనువాదం.

18. **రామా చంద్రమౌళి 'Fire & Ice' –** ఇంగ్లీషు అనువాదం

**బహుళ ప్రజాదరణ పొందిన సప్త అనువాద కావ్యాలు:**

19. **ఇలియాడ్ (తెలుగు) :** హోమర్ ప్రఖ్యాత రచన తొలిసారిగా తెలుగులో అందరి మన్ననలను పొందిన మహాకావ్యం. (ఆంధ్రజ్యోతి)

20. **ఒడెస్సీ (తెలుగు):** హోమర్ రచించిన ఒడెస్సీ – మహాభారత కావ్యంలా సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తే కథల్తో సాగే మహాకావ్యం. (ఇండియాటుడే)

21. **ఎపిక్ సైకిల్ (ఇతిహాసచక్రం–తెలుగు) :** గ్రీకువాఙ్మయంలో మూడవ భాగంగా వెలువడి ఎన్నో విశేషాలను తెలియజెప్పే కావ్యం. (ది హిందూ)

22. **ఈనీడ్ (Aeneid) :** వర్జిల్ మహాద్భుత రచన – తెలుగు అనువాదం

23. **తీర్థయాత్రికుని ప్రగతి (The Pilgrim's Progress) :** జాన్ బన్యన్ ప్రసిద్ధ రచనకు తెలుగు అనువాదం.

24. **డాంటే రచన డివైన్ కామెడీ - Dante's Divine Comedy** – తెలుగు అనువాదం.

25. **జాన్ మిల్టన్ ప్రసిద్ధ రచన – Paradise Lost - Paradise Regained (పారడైజ్ లాస్ట్ – పారడైజ్ రిగైన్డ్)** – తెలుగు అనువాదం.

26. **కత్తి అంచుపై...** – తెలుగు సాహిత్య చరిత్రలో వెలువడిన తొలి Noir (Black-చీకటి) నిశీధి కథల సంపుటి.

27. **దీప నిర్వాణగంధం** – మృత్యువు గురించి వివరించే అనేక అసాధారణ సంఘటనలు, కవిత్వాలు, నవీన శాస్త్ర విశ్లేషణలతో కూడిన పరిశోధనా గ్రంథం.

28. **అక్షరార్చన** – ఆంధ్రజ్యోతి నివేదనలో ధారావాహికంగా ప్రచురించబడిన వేదాంత విషయాల కదంబం.

29. **క్రీస్తు అద్భుతగీతాలు** – కరుణ, అద్భుత రసాలతో నిండిన కమనీయ కవిత్వ సంపుటి. ప్రపంచ ప్రసిద్ధ కవుల రచనలు క్రీస్తు జీవిత చరిత్ర.

30. **తమిళ సరస్వతి అందెల రవళి** – సంగం కాలం నాటి అద్భుత కవితా సంపద – వీర, శృంగార రసవాహిని.

31. **నామదేవొ ధసాల్ కవిత్వం** – ఈనాటి నుంచి ఎవరూ కవిత్వాన్ని అస్పష్టంగా రాయవద్దు' అని శాసించిన మరాఠీ కవి ధసాల్ కవిత్వం.

32. **శాంతి యుద్ధం** – మొదటి ప్రపంచ యుద్ధపు ఘట్టాల్ని, ప్రజలపై దాని ప్రభావాన్ని కవుల మాటల్లో వివరించే కవితల సంకలనం.

33. **డబ్బు–మని–షి** – హాస్యరస ప్రధానంగా ప్రపంచ కవుల కవితలకు తెలుగు అనువాద సంపుటి.

34. **విలియం బ్లేక్ కవిత్వం** – తన మార్మిక కవిత్వం, చిత్ర రచనలతో ప్రపంచాన్ని అబ్బురపరచిన బ్లేక్ కవిత్వ నిధి.

35. **ఫాస్ట్–గేథే రచన** – జర్మన్ సాహిత్యంలో తలమానికమై అత్యధిక ప్రాచుర్యాన్ని పొందిన విషాదాంత నాటకం. 'ఆత్మను సైతానుకు అమ్మిన మానవుడిగా' తెలుగులో వెలువడ్తున్నది.

## త్వరలో...

36. **మూడు ప్రాచీన గ్రీకు నాటకాలు** – ఇడిపస్ రెక్స్, ఏంటిగొని, ట్రోజన్ వుమెన్ – ప్రపంచ ప్రసిద్ధికెక్కిన విషాదాంత నాటకాలు – తెలుగులో.

37. **ప్రపంచ ప్రసిద్ధ కథలు** – విశ్వవిఖ్యాత కథకుల ప్రసిద్ధ కథలు.

38. **కలలు–విశ్లేషణ – స్వప్నశాస్త్రం రెండవభాగం**

39. **శిలప్పదికారం** – కాలి అందియ కథ. తమిళ మహాకావ్యానికి దీటైన తెలుగు అనువాద కావ్యం.

40. **క్రీస్తు నడచిన దారి** – కరుణామయుడి పదముద్రలపై కవుల కవితాభినివేశం.

✤✤✤✤✤



ప్రపంచ సాహిత్యం-8

# Faust

by

**Johann Wolfgang Goethe**

(The Classic Tale of a Man, Who sold his soul to Devil)

# ఆత్మను అమ్మిన మానవుడు

జర్మన్ సాహిత్యంలో ఆణిముత్యంగా ప్రసిద్ధికెక్కిన గొప్ప నాటకం ఫాస్ట్.
కవిత్వపరంగా, నాటకరూపంగా అనితరసాధ్యంగా భావించబడి,
Storm and Stress Period గా ప్రసిద్ధికెక్కిన
పద్దెనిమిదవ శతాబ్దంలో యూరోపియన్ సాహిత్యంలో
సంచలనం సృష్టించిన 'Faust' జోహాన్ వొల్ఫ్‌గాంగ్ గేథే రచన.



## డాక్టర్ లంకా శివరామప్రసాద్